8

మహాకవి కాళిదాసకృత

రఘువంశము

రెండవ భాగము

తెలుఁగు లఘువ్యాఖ్యాసహితము

పదినుండి పందొమ్మిది సర్గలు

వ్యాఖ్యాత

కేశవపంతుల నరసింహశాస్త్రి

విద్వాన్, శిరోమణి. ఆకాశవాణీ సంస్కృత

పరిచయ కార్యకర్త

ప్రచురణ

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి

రవీంద్ర - సైఫాబాదు,

హైదరాబాదు.4

891.21
KAL

89.21
KAL
14-10058
Dr. B.R. AMBEDKAR
OPEN UNIVERSITY
CALL NO: ACC. NO:
AUTHOR: కాళిదాసు
TITLE: రఘువంశము

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033.

AOUA102B132

మహాకవి కాళిదాసకృత

రఘువంశము

రెండవ భాగము

తెలుగు లఘువ్యాఖ్యాసహితము

పదినుండి పందొమ్మిది సర్గలు

వ్యాఖ్యాత

శేషవపంతుల నరసింహశాస్త్రి

విద్వాన్, శిరోమణి. ఆకాశవాణి సంస్కృత

పరిచయ కార్యక్రమ్

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10,058

ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్ - సైఫాబాదు,

హైదరాబాదు-4

RAGHU VAMSHAM- Vol II (10th to 19 Sargas) A Sanskrit classic by Kalidasa with Telugu Commentary by Sri Keshvapanthula Narasimha Sastry, Retired Programme Executive, All India Radio, Hyderabad.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

హైదరాబాదు - 500 004

ప్రచురణ : 537

ప్రథమ ముద్రణ : 1982

ప్రతులు : 2,000

వెల : రూ. 8-00

ప్రతులకు :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి,
కళాభవన్, సైఫాబాద్,
హైదరాబాదు - 500 004

ముద్రణ :

లక్ష్మీశైలజ ప్రింటింగ్ ప్రెస్, సోమాజిగూడ, హైదరాబాద్-500 482

Paper used for the Printing of this book was made available by the Government of India at concessional rate.

తొలి పలుకు

ఆంధ్రభాషా సాహిత్యాల్లో సమగ్రమైన అభినివేశం సంపాదించుకోవలసినవారు సంస్కృత భాషతో కొంతైనా పరిచయం చేసుకోవలసిన అగత్యం ఉంటుంది. ఆంధ్రభాషలోని పదజాలం వ్యాకరణం సాహిత్యప్రక్రియా సంపద సంస్కృతంతో ముడివడి వున్నది. సాహిత్య అకాడమి ప్రచురణ కార్యక్రమంలో సంస్కృతానికి సముచితమైన స్థానాన్ని కల్పించి పండితులకూ, పరిశోధకులకూ, విద్యార్థులకూ ఉపయోగపడే విధంగా సంస్కృత గ్రంథప్రచురణ కొనసాగిస్తున్నది. కేవల సంస్కృతగ్రంథాలేగాక సరళమైన తెలుగు వ్యాఖ్యానాలతో కొన్ని గ్రంథాలను అందించగలిగింది.

సంస్కృతగ్రంథప్రచురణాప్రణాళికను అనుసరించి 1979లో కాళిదాసు రచించిన రఘువంశాన్ని తెలుగు వ్యాఖ్యతో ప్రచురించింది. అయితే అది మొదటి 9 సర్గలున్న సంపుటం. ఇప్పుడు మిగిలిన 10 సర్గలతో ఈ రెండవ సంపుటాన్ని రసజ్ఞులైన పాఠకులకు అందిస్తున్నాము.

సంస్కృతాంధ్ర సాహిత్యాలలో గరీయః ప్రతిభులైన శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి, ఈ రఘువంశ మహాకావ్యానికి చక్కని తెలుగు వ్యాఖ్య సమకూర్చినారు. ప్రత్యేకించి ఈ రెండవ సంపుటంలో కొన్ని విశేషాలను గూడచేర్చి వ్యాఖ్యానం చేసినారు. వ్యాఖ్యాన రచనలోనూ ప్రచురణలోనూ అకాడమితో సహకరించిన శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారికి కృతజ్ఞతాభివందనాలు సమర్పించుకుంటున్నాను.

హైదరాబాదు
7–8–1982

ఇరివెంటి కృష్ణమూర్తి
కార్యదర్శి

పీఠిక

మహాకవి కాళిదాసు కవికులగురువు, భారతదేశ సంస్కృతిని ప్రపంచమున కెత్తిచూపఁగలిగిన కీర్తిధ్వజము. అయన రచనలు మధురాతిమధురములై విశ్వవిఖ్యాతి నార్జించిన విషయము జగద్విదితము. వానిలో రఘువంశ మహాకావ్యము రసభరితమై మానవాళికి మహోపదేశమును జేయునట్టివగుటచేత సంస్కృతభాషాధ్యయనము చేయువారికి ప్రప్రథమ పాఠ్యముగా తరతరముల నుండి విలసిల్లుచున్నది. దీనిని తెలుగులోనికి పద్యకావ్యముగా ననువదించిన వారును, మొదటి అయిదు సర్గలకు మాత్రము పదవిభాగ, అన్వయక్రమ, అర్థ, తాత్పర్య, సమాసవిగ్రహ, ఆకాంక్షాది విశేషములతో వ్యాఖ్యాననుము రచించిన వారును, కొందఱు విద్యార్థుల కపసరమని తోచిన సర్గలకు మాత్రము ప్రతిపదార్థ తాత్పర్యాదులను రచించినవారును గలరు. కాని ఆ రచనలలో కొన్ని అలభ్యములును, కొన్ని అసమగ్రములునుగానున్నవి. రఘువంశకావ్యమహత్త్వమును, అందు కాళిదాసు నిక్షిప్తముగావించిన యుపదేశాదులను, అందలి రసవిశేషములను దెలిసికొనఁదలచిన రసజ్ఞులకును, ఆధునిక విద్యావంతులకును, పూర్వరచన లంతగా నుపయోగపడుట లేదనియు, సమగ్రమైన కావ్యార్థము తెలియుటలేదనియు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు గుర్తించి యీవిధమైన రచనతో రఘువంశమహాకావ్యమును ప్రకటించి లోకమునకందఁజేయఁ దలపెట్టుట హర్షింపఁదగిన సత్కార్యము.

ఆధునిక విద్యావంతులు రఘువంశకావ్యమునందలి భావసౌందర్యమును తమంతటతాము ఊహించి ఆనందింపగల్గుటకు శ్లోకములయందలి ప్రతిపదమున కును అర్థము తెలియవలయును. సముదాయవాక్యమునకుఁ దాత్పర్యము వోధ

పడవలయును. మహాకవి కావ్యముద్వారా లోకమున కుపదేశింపఁదలఁచిన సందేశ మర్థముకావలయును. అందులకై రఘువంశమునందలి పందొమ్మిది సర్గలకును ప్రతిపదార్థ తాత్పర్య విశేషార్థములతో లఘువ్యాఖ్యను తెనుగున రచించుటకు నన్ను అకాడమీ ఆదేశించినది. ఒక సంపుటముతో నీ గ్రంథము పూర్తికానందున రెండవ సంపుటముతో పూర్తిచేయఁబడినది. ఒకేయొక సంపుటమై యుండినచో చదువరులకు సులభముగానుండి యుండును గాని యది సాధ్యపడలేదు.

ఈ లఘువ్యాఖ్యారచనయందు సంస్కృతశబ్ద స్వరూపములు బోధపడుటకై శ్లోకములందును, అర్థములు వ్రాయునప్పుడును విసంధులు పాటింపఁబడినవి. అర్థములు వ్రాయుటలో తాత్పర్యము సుబోధముగా నుంటకై రెండు మూడు సంస్కృతపదముల కొకచోటనే తెలుఁగర్థములు వ్రాయుటయు, దీర్ఘ సమాసములందు ప్రతి పదమును విడదీసి కొన్నిచోట్లను, విడదీయకయే సముదాయమునకు కొన్ని చోట్లను అర్థములు వ్రాయుట జరిగినది. ప్రతిశ్లోకమునకును ప్రతిపదార్థము ముగిసినవెంటనే క్లుప్తముగా తాత్పర్యము వ్రాసి, విపులముగా కవితామర్మముల నెఱుఁగు బాధ్యత చదువరులగు రసజ్ఞులకే, గ్రంథవిస్తరభీతిచే, వదలిపెట్టఁబడినది. విశేషములు, శబ్దవ్యుత్పత్తులు, ధాతుస్వరూపములు, అచ్చటచ్చటఁ జేర్పబడినవి. ఇంతమాత్రముగానే యీ లఘువ్యాఖ్యను రచించుటకుఁ గారణము చదువరులకు శాస్త్రసంబంధముగా మిక్కిలి శ్రమ గలుగరాదను భావనయే.

గురుముఖమున సర్వవిశేషములతో సంస్కృతకావ్యపాఠమును జదువుకొనువారికిని, విశేషజ్ఞులయిన విద్వాంసులకును, ఆకాంక్షా శబ్దస్వరూపాది శాస్త్ర విషయముల నెఱుఁగదలచిన విద్యార్థులకును,ఇంకనువిపులముగా వ్రాసియుండినచో బాగుండునే! యనిపించవచ్చును. కాని యట్టిపని పూర్వులు కొందఱు చేయబూని కావ్యము నసమగ్రముగా లోకమున కందించిరి. కావున అకాడమీవారి యుద్దేశమునుసరించి రచించిన యీ లఘువ్యాఖ్యను దిలకించి నన్ను కృతకృత్యునిఁగా భావించుట కందఱినిఁ గోరుచున్నాను.

"లఘుమల్లినాథీయ" మని పేర్కొనఁదగిన ఈ తెలుఁగు లఘువ్యాఖ్యను కాళిదాసు రఘువంశమహాకావ్యమునకు రచించు భాగ్యమును నాకు గల్గించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారికి నేను సర్వదా కృతజ్ఞుఁడనై యున్నాను.

మొదటి తొమ్మిది సర్గలుగల ప్రథమసంపుటము 1979 జనవరి మాసమున రసజ్ఞులముందుంచుట జరిగినది. ఇప్పుడు పదినుండి పందొమ్మిదవ సర్గ వరకు గల ఈ ద్వితీయసంపుటమును మీకరకమలములం దుంచుచున్నాము. ఇంతటితో మహాకవి కాళిదాసు రచించిన రఘువంశకావ్యము పూర్తియైనది. ఒకొక్కక్క నాయకుని వర్ణించునప్పు డొకొక్కక్క రసమునకు ప్రాధాన్యము నిచ్చి, ఒకొక్కక్క మహోపదేశమును లోకమునకందించి, రఘువంశపురాజులకు ప్రజాపాలన వర్ణాశ్రమరక్షణ దేశసంక్షేమములే తమ జీవిత లక్ష్యములై యుండెనని యు, ప్రజాపాలకు లామార్గమున నడచుట యుక్తమని యు కాళిదాసు సందేశమై యున్నట్లు ఈ కావ్యముద్ఘోషించుచున్నది. సహృదయు లావిశేషములను గ్రహింపఁగలరని భావించుచున్నాను.

ఓం తత్సత్.

26/3RT, బర్కత్‌పుర,
హైదరాబాదు.

విద్వద్విధేయుఁడు
కేశవపంతుల నరసింహాశాస్త్రి.

విషయసూచిక

సర్గ - విషయము	పుటల సంఖ్య
1. దశమసర్గ (10) దశరథుఁడు పుత్రకామేష్టినారంభించుట, దేవతలు విష్ణువును రావణవధార్థమై వేడుట, రామావతారము.	1-43
2. ఏకాదశసర్గ (11) విశ్వామిత్రుని యాగరక్షణార్థమై రామలక్ష్మణులువెళ్ళుట, తాటకావధ, అహల్యాశాప విమోచన, సీతాకళ్యాణ, పరశురామ గర్వభంగములు.	44-98
3. ద్వాదశసర్గ (12) కైక వరములు, రాముని అరణ్యగమనము, రాక్షసనిర్మూలనము, రావణవధ.	99-144
4. త్రయోదశసర్గ (13) సీతాసమాగమము, సముద్రవర్ణనము, దండకనుండి తిరిగివచ్చి రాముఁడయోధ్యనుజేరుట.	145-190
5. చతుర్దశసర్గ (14) శ్రీరామపట్టాభిషేకము, లోకాపవాదభీతుఁడైన రాముడు సీతను పరిత్యజించుట, శోకించుసీతను ఓదార్చి వాల్మీకి తనయాశ్రమమునఁజేర్చుకొనుట.	191-240

సర్గ—విషయము	పుటల నెంబరు
6. పంచదశసర్గ (15) శత్రుఘ్న కృతలవణా సురవధ, కుశలవుల జన్మము, రామాశ్వమేధము, కుశలవకృత రామాయణగానము.	241-286
7. షోడశసర్గ (16) కుశుఁడు రాజ్యాధినేతయగుటకుఅయోధ్యా రాజ్యలక్ష్మి ఆహ్వానించుట, అతఁడు కులరాజధానికి వచ్చి దానిని సుందరముగాఁ దీర్చుట, సరయూవిహారము, కుముద్వతీ పరిణయము.	287-335
8. సప్తదశసర్గ (17) కుశకుముద్వతులకు 'అతిథి' యనుకుమారుఁడు పుట్టుట, అతనిపట్టాభిషేకము, అర్థధర్మశాస్త్రానుకూలముగా అతనిరాజ్యపాలనము.	336-372
9. అష్టాదశసర్గ (18) అతిథికి నిషధుఁడు, అతనికి నలుఁడు నలునికి పుండరీకుడు, ఆ వరుసలో అగ్నివర్ణుఁడుపుట్టువరకుఁ గల రఘువంశపురాజులవంశానుక్రమవర్ణనము.	373-404
10. ఏకోనవింశసర్గ (19) - అగ్నివర్ణుని శృంగార వర్ణనము, అతఁడు క్షయవ్యాధికి గురియై మరణించుట, గర్భవతిగానున్న అతని భార్యకుపట్టాభిషేకము.	405-440

శ్రీః

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

దశమసర్గము

శ్లో. పృథివీం శాసత స్తస్య పాకశాసన తేజసః
కి చి దూన మనూనర్ద్ధేః శరదా మయుతం యయౌ. 1

వ్యాఖ్య : పృథివీం-భూమిని, శాసతః-పాలించుచున్నవాఁడును, పాకశాసన తేజసః-ఇంద్రుని పరాక్రమమువంటి పరాక్రమము గలవాఁడును, అనూనర్ద్ధేః (అనూన + ఋద్ధేః)-అనల్పమైన సంపదగల, తస్య-ఆ దశరథునికి, కించిదూనం (కించిత్ + ఊనం)-కొంచెము తక్కువయైన, శరదాం-సంవత్సరములయొక్క, అయుతం-సహస్రము, యయౌ-గడచిపోయెను.

దేవేంద్రునికిఁగల వైభవములతో సమానమగు సకలవైభవములతోను, సర్వసంపదల సమృద్ధితోను, రాజ్యపాలనము చేయుచున్న దశరథ మహారాజునకు, మునిశాపానంతరము, తనకు తెలియకయే ఇంచుమించుగా వేయిసంవత్సరముల కాలము గడచిపోయె ననిభావము. "స్యాద్ఋతావత్సరేశరత్" అను అమరనిఘంటు వాక్యమువలన "శరత్" అనుపదమునకు ఋతువు,సంవత్సరము రెండును అర్థములే. "షష్టి ర్వర్షసహస్రాణి జాతస్య మమ కౌశిక!" అను రామాయణవచనమువలన దశరథుఁడు అరువదివేలయేండ్లకు పైన జీవించియుండెనని తెలియుచున్నది.

శ్లో. న చోపలేభే పూర్వేషాం ఋణ నిర్మోక్తు సాధనమ్.
సుతాభిధానం స జ్యోతిః సద్యః శోకతమోఽపహమ్. 2

వ్యాఖ్య : సః-ఆదశరథుఁడు, పూర్వేషాం-తనకు పూర్వులగు పితృదేవతలయొక్క, ఋణ నిర్మోక్ష సాధనం-ఋణవిముక్తికికారణమైనదియు, సద్యః-పుట్టినవెంటనే, శోకతమోఽపహం-దుఃఖమునెడు చీకటిని తొలగించునట్టిదియు, సుతాఖ్

ధానం-కుమారుఁడు అనుపేరుగల, జ్యోతిః-వెలుగును, నచోపలేభే (న+చ+ఉపలేభే)-పొందనుగూడలేదు. పుత్రసంతానము లేనివారికి పితృఋణము తీరక పోవుటయేకాక "పుత్" అనునరకము వచ్చును. "ఏషవా అనృణోయఃపుత్రీ" అని వేదము చెప్పుచున్నది. కనుక "పున్నామ్నో నరకాత్ త్రాయతఇతిపుత్రః" అని పుత్రశబ్దవ్యుత్పత్తి. దశరథుని కెన్నిసంపదలున్నను, ఎంత యింద్రవైభవ మున్నను, పితృఋణమోక్షమునొసగి, శోకాంధకారమును దొలగించు జ్యోతివంటి పుత్రుఁడంత వరకు కలుగలేదని భావము. "గృహరత్నంచబాలకః" అన్నసామ్యతగా పుత్రుఁడు లేని జీవితము ఆంధకారమనియు, పుట్టగానే ఆయంధకారమును తొలగింపగల జ్యోతి పుత్రుఁడేయనియు సారాంశము. అలంకారము: రూపకము.

శ్లో. అతిష్ఠత్ ప్రత్యయాపేక్ష సంతతిః స చిరం నృపః
ప్రాజ్మాంధా దనభివ్యక్త రత్నోత్పత్తి రివార్ణవః 3

వ్యాఖ్య : ప్రత్యయాపేక్షసంతతిః-ప్రత్యయ-ఒకానొకకారణమును, అపేక్ష-కోరునట్టి, సంతతిః-సంతానముగల, సఃనృపః-ఆదశరథమహారాజు, మంథాత్ ప్రాక్-మథించుటకుముందు, అనభివ్యక్త రత్నోత్పత్తిః-బయటపడని శ్రేష్ఠవస్తువులయొక్క పుట్టుకగల, అర్ణవఃఇవ-సముద్రమువలె, చిరం అతిష్ఠత్-బహుకాలము ఊరకుండెను. దశరథునికి, తనకువచ్చిన మునిశాపమువలన పుత్రుఁడు కలుగుననియు, ఆపు తుని వలన తనకు మరణము కలుగుననియు భయమున్నది. పుత్రులు లేకపోయిరే అను దుఃఖముకూడ నున్నది. కాని దేవదానవులు మథించినప్పుడే సముద్రమునందున్న కల్పవృక్ష కామధేనుప్రభృతులైన శ్రేష్ఠవస్తువులు బయల్పడినట్లు, తనలోనున్న సంతానోత్పాదకశక్తి తగినకారణ మున్నప్పుడే అభివ్యక్తము కాగలదని యూర కుండెనేకాని గొడ్డుబోతుతనముచేతకాదు. "ప్రత్యయాపేక్ష, రత్నోత్పత్తి" పదములు, కారణజన్ములైన శ్రీరామాది పుత్రరత్నములు పుట్టనుండి రను భావమును సూచించును. అప్రయత్నముగా దశరథుఁడు కాలముగడుపుచుండుట కాదైవికమగు హేతువే కారణము. అలంకారము: ఉపమ.

శ్లో ఋశ్యశృంగాదయ స్తస్య సంత స్సంతానకాంక్షిణః
ఆరేభిరే యతాత్మానః పుత్రీయా మిష్టి మృత్విజః 4

వ్యాఖ్య : ఋశ్యశృంగాదయఃఋశ్యశృంగుడు మొదలయిన, ఋత్విజఃయజ్ఞముచేయింపగల యాజకులగు, సంతఃమహాత్ములు, యతాత్మానఃనియమ

నిష్ఠలుగలవారై, సంతానకాంక్షిణః-సంతతిని గోరుచున్న, తస్య-ఆదశరథునికి (అతనికొరకై), పుత్రీయాం-పుత్రుడు కలుగుటకు కారణమైన, ఇష్టిం-యాగమును, ఆరేభిరే-ప్రారంభించిరి. ఋశ్యశృంగుడు, రోమపాదుని పుత్రికయు, దశరథుని పెంపుడు కూతురునగు శాంతకు భర్త, మహా మహిమోపేతుడైన తపస్వి. ఎంతకాలమునకును సంతతి కలుగక పోవుటచేత, దశరథుడు తన సంతాన వాంచను తెలుపగా, ఋశ్యశృంగుడు తన ఆధ్వర్యవమున దశరథునికై పుత్ర కామేష్టిని చేయుటకు నియమనిష్ఠలతో నారంభించె నని భావము.

శ్లో. తస్మిన్నవసరే దేవాః పౌలస్త్యోపప్లుతా హరిమ్
అభిజగ్ముర్నిదాఘార్తాః ఛాయావృక్షమివాధ్వగాః 5

వ్యాఖ్య : తస్మిన్, అవసరే-ఆ పుత్రకామేష్టి నారంభించిన సమయమున దేవాః-దేవతలు, పౌలస్త్యోపప్లుతాః (పౌలస్త్య+ఉపప్లుతాః)-రావణాసురునిచేత పీడింపబడిన వారగుచు, నిదాఘార్తాః-గ్రీష్మాతపముచేత బాధపడుచున్న, అధ్వగాః-బాటసారులు, ఛాయావృక్షం, ఇవ-మంచినీడగల చెట్టునువలె, హరిం-విష్ణువును, అభిజగ్ముః-చేరిరి. దశరథుని పుత్రకామేష్టి ఆరంభమైన సమయమునందే దేవతలు చిరకాలమునుండి రావణుడు చేయు దుండగములు సైరింపలేక, ఎండకాలపు మంటు పెండకు మాడుచున్న బాటసారులు చల్లని విశాలచ్ఛాయగల వృక్షమును జేరినట్లు శ్రీమహావిష్ణువును రక్షింపుమని వేడుటకై చేరిరి. "ఛాయాప్రధానోవృక్షః-ఛాయా వృక్షః" అని విగ్రహము. ఇది శాకపార్థివాదులవంటి సమాసము. పౌలస్త్యః పులస్తస్య గోత్రాపత్యం పుమాన్ పౌలస్త్యః రావణః (అనివ్యుత్పత్తి) అలంకారము: ఉపమ.

శ్లో. తే చ ప్రాపురుదన్వంతం బుబుధే చాదిపూరుషః
అవ్యాక్షేపో భవిష్యంత్యాః కార్యసిద్ధేర్హి లక్షణమ్ 6

వ్యాఖ్య : తేచ-ఆదేవతలు కూడా, ఉదన్వంతం-సముద్రమును, ప్రాపుః-చేరిరి, ఆదిపూరుషః చ-విష్ణుమూర్తియు, బుబుధే-యోగనిద్రనుండి మేల్కొనెను, అవ్యాక్షేపః-కాలవిలంబములేకపోవుట, భవిష్యంత్యాః-కాబోవునట్టి, కార్యసిద్ధేః-కార్యసిద్ధియొక్క, లక్షణం, హి-లక్షణముకదా! రావణభయార్దితులైన దేవతలు సముద్రమును జేరుటయు, దుష్టశిక్షణకు ముక్తుడైన విష్ణువు యోగనిద్రనుండి మేల్కొనుటయు, దశరథుడు పుత్రకామేష్టి నారంభించుటయు నేకకాలమున జరిగినవి

కాగలపనికి యెచ్చటను విలంబము జరుగకపోవుట లక్షణ మన్న అర్థాంతరన్యాస ముతో నీవిషయము సమర్థింపబడినది కనుక అలంకారము: అర్థాంతరన్యాసము.

శ్లో. భోగి భోగాసనాసీనం దదృశు స్తం దివౌకసః
తత్ఫణా మండలో దర్చిర్మణి ద్యోతిత విగ్రహమ్ 7

వ్యాఖ్య : దివౌకసః-దేవతలు, భోగిభోగాసనాసీనం-ఆదిశేషుని శరీరమను సింహాసనమున పై గూర్చున్నట్టివాడును, తత్ఫణామండలోదర్చిర్మణిద్యోతిత విగ్రహం-తత్-ఆయాదిశేషునియొక్క, ఫణామండల-పడగల సమూహమునందు, ఉదర్చిర్మణి-మెఱయుచున్న మణులచేత, ద్యోతిత-ప్రకాశింప జేయబడిన, విగ్రహం-దేహముగలవాడునునగు, తం- ఆవిష్ణుమూర్తిని, దదృశుః-చూచిరి (దర్శనము చేసికొనిరి). విష్ణువు యోగనిద్రనుండి మేల్కొనగానే ఆదిశేషుడు సింహాసముగా మారె ననియు, అతని వేయిపడగలయందున్న మణులు కాంతులు వెదజల్లుచు విష్ణుదేవుని శరీరమును ప్రకాశింప జేయుచున్న సమయమున దేవతలు దర్శనము చేసుకొని రనియు భావము. ఈ శ్లోకమునుండి 8 శ్లోకములలో విష్ణుమూర్తి వర్ణనము చేయుటకు కారణము, ఈ మహనీయ తేజస్సు, దశరథుని సంతానముగా బుట్టబోవుచున్నదని తెలుపుటకే యని మనము గ్రహింపవలెను.

శ్లో. శ్రియః పద్మనిషణ్ణాయాః క్షౌమాంతరిత మేఖలే
అంకే నిక్షిప్తచరణ మాస్తీర్ణ కరపల్లవే. 8

వ్యాఖ్య : పద్మనిషణ్ణాయాః-కమలమునందు కూర్చున్న, శ్రియః-లక్ష్మీదేవి యొక్క, క్షౌమాంతరితమేఖలే-క్షౌమ-పట్టుచీరచేత, ఆంతరిత-మరుగు పరుపబడిన, మేఖలే-మొలనూలు గలదియు, ఆస్తీర్ణకరపల్లవే-ఆస్తీర్ణ-పరువబడిన, కరపల్లవే-చిగురుటాకుల వంటి చేతులు గలదియునగు, అంకే-తొడమీద, నిక్షిప్తచరణం-ఉంచబడిన పాదములుగల (తం - ఆ విష్ణువును, దదృశుః- చూచిరి అని వెనుకటి శ్లోకముతో అన్వయము) సుకుమార శరీరముగల లక్ష్మి, మొలనూలి మణులు గ్రుచ్చుకొనకుండ తన పట్టు చీర చెరగును ఒరచి, దానిపై చిగురాకులవలె మెత్తగానున్న తన యరచేతులను బెట్టి, వానిపై స్వామిపాదములనుంచుకొన్నది. అట్లు లక్ష్మి తొడపై పాదములుంచుకొనియున్న విష్ణువు దేవతలు దర్శించుకొనిరని భావము.

శ్లో. ప్రబుద్ధ పుండరీకాక్షం బాలాతప నిభాంశుకమ్
దివసం శారద మివ ప్రారంభ సుఖదర్శనమ్. 9

వ్యాఖ్య : ప్రబుద్ధ పుండరీకాక్షం - ప్రబుద్ధ - తెరువబడిన, పుండరీక-తెల్ల తామర తేకులవంటి, అక్షం-కన్నులుగలవాడును, బాలతపనిభాంశుకం-బాలాతప-లేయెండతో, నిభ-సమానమగు, అంశుకం-పట్టుదోవతి కలవాడును (పీతాంబరధారి యనుట), ప్రారంభ సుఖదర్శనం-ప్రారంభ-మహాయోగములగల మునులకు, సుఖ దర్శనం-సులభముగా దర్శన మొసగువాడును నగు (విష్ణువును), ప్రబుద్ధ పుండరీ కాక్షం-వికసించిన తెల్ల దామరలే కన్నులుగా గలదియు, బాలాతపనిభాంశుకం-లేత యెండయను వస్త్రము గలదియు, ప్రారంభ సుఖదర్శనం-ఆదిలో సుఖముగా జూచుటకు వీలుపడునదియు నగు, శారదం-శరదృతువు నందలిదియగు, దివసం, ఇవ-దినమునువలె, స్థితం-ఉండిన, తం-ఆ విష్ణువును, దదృశుః-చూచిరి.

దివస శబ్దము పుంలింగ మగుటచేత శ్లేషాను ప్రాణితమైన యీ ఉపమాలం కారము చక్కగా అతికినది. శరదృతువు విష్ణువు యోగనిద్రనుండి మేల్కొను సమయము కావున "శారదం" అని చెప్పబడినది (ఆషాఢశుద్ధ యేకాదశి శయనైకా దశిగాను, కార్తీకశుద్ధ ఏకాదశి ఉత్థానైకాదశిగాను శాస్త్రములు చెప్పును). శరదృతువు వీరరసమునకు అనుకూలము గావున రావణ వధార్థము జన్మింపబోవు విష్ణు ప్రబోధమును దానితోబోల్చుట మిక్కిలి సుందరముగా నున్నది.

శ్లో. ప్రభా నులిప్త శ్రీవత్సం లక్ష్మీ విభ్రమ దర్పణం
కౌస్తుభాఖ్య మపాం సారం బిభ్రాణం బృహతోరసా. 10

వ్యాఖ్య : ప్రభానులిప్త శ్రీవత్సం-తన కాంతిచేత పూయబడిన విష్ణు వక్ష స్థలముపై నున్న శ్రీవత్సమను మచ్చగలదియును, లక్ష్మీ విభ్ర మదర్పణం-లక్ష్మీదేవి తన విలాసములు చూచుకొనుటకు బనికివచ్చు నద్దమువంటిదియు, కౌస్తు భాఖ్యం-కౌస్తుభము అను పేరుగల, అపాంసారం-సముద్రజలముల సారభూతమైన మణిని, బృహతా-విశాలమైన, ఉరసా-వక్షస్థలముచేత, బిభ్రాణం-ధరించియున్న (తం-ఆ విష్ణువును, దదృశుః-చూచిరి). కాంతిపుంజములతో శ్రీవత్సమును రంజింపజేయుచు, లక్ష్మికి విలాసదర్పణమైన కౌస్తుభమణిని ధరించిన విష్ణువును దేవతలు చూచిరి. "లక్ష్మీ విభ్రమదర్పణ"మనుటచేత శ్రీమహాలక్ష్మి తనసోయగ మును విష్ణువక్షస్థల స్థిత కౌస్తుభ మణియందు చూచుకొనుచున్న సమయమునందు దేవతలు వెళ్ళుట, వారి కార్యసిద్ధికి సూచకము.

శ్లో. బాహుభి ర్వికటపాకాకై ఃదివ్యాభరణ భూషితైఃఆవిర్భూత మపాం మధ్యే పారిజాత మివాపరమ్. 11

వాఖ్య : విటపాకాకై ఃశాఖారూపములుగలవియు, దివ్యాభరణ భూషితైఃకాంతిమంతములగు కటకాంగదాది భూషణములచేత అలంకృతములైన, బాహుభిఃచతుర్బాహువులచేత, అపాం-సముద్రజలములయొక్క, మధ్యే-నడుమ, ఆవిర్భూతం-సాక్షాత్కరించిన, అపరం-రెండవదియగు, పారిజాతం ఇవ-కల్పవృక్షమువలె, స్థితం-ఉండిన, (తం-ఆ విష్ణువును, దదృశుఃచూచిరి.) సముద్రజల మధ్యమున దివ్యాభరణ భూషితములైన చతుర్బాహువులతో సాక్షాత్కరించిన విష్ణువు, సముద్రమునందే వివిధ పుష్ప ఫలపల్లవములు గల శాఖలతో నావిర్భవించిన రెండవ పారిజాతవృక్షమా! యని ఉత్ప్రేక్షింపబడుట మిక్కిలి సమంజసము గా నున్నది. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. దైత్యస్త్రీ గండలేఖానాం మద రాగ విలోపిభిఃహేతిభి శ్చేతనావద్భి రుదీరిత జయ స్వనమ్. 12

వ్యాఖ్య : దైత్యస్త్రీగండలేఖానాం-దైత్యస్త్రీ-రాక్షసస్త్రీల, గండలేఖానాం-చెక్కిళ్ళపైనుండు మకరికాది పత్రరచనలయొక్క, మద రాగ విలోపిభిఃమదము వల్ల కలుగు నెర్రదనమును లోపింపజేయునవియు, చేతనావద్భిఃచైతన్యము గలవియు నగు, హేతిభిఃచక్రాద్యాయుధములచేత, ఉదీరిత జయస్వనం-ఉద్ఘోషింపబడిన జయజయ ధ్వానములుగల, (తం-ఆవిష్ణువును, దదృశుఃచూచిరి.) దైత్యస్త్రీల గండస్థలములమీది మదరాగమును లోపింపజేయుట యనగా వారి భర్తలను చంపి, వారిని విధవలనుగా జేయుట. అట్లు చేయగలిగి, చైతన్యవంతము లగుటచేత, దేవతలు వచ్చిన సమయమున, రాబోవు విజయమును ఊహించి, చక్రాద్యాయుధములు జయజయ ధ్వానములు చేయుచుండగా సంతోషము నందుచున్న విష్ణువును, దేవతలు దర్శించుకొనిరని భావము. విష్ణుమూర్తి పంచాయుధములు : పాంచజన్యము (శంఖము), సుదర్శనము (చక్రము), కౌమోదకి (గద), నందకము (ఖడ్గము), శార్ఙ్గము (ధనువు) అనునవి. ఇవి సచేతనములు.

శ్లో. ముక్త శేష విరోధేన కులిశ వ్రణ లఞ్ఛనాఉపస్థితం ప్రాంజలినా వినీతేన గరుత్మతా. 13

వ్యాఖ్య : ముక్త శేష విరోధేన-విడిచిపెట్టబడిన ఆదిశేషునితోడి విరోధము గలవాఁడును, కులిశ వ్రణ లక్ష్మణా-వజ్రాయుధముచేత కలిగిన గాయముల మచ్చలు గలవాఁడును, ప్రాంజలినా-దోయలించినవాఁడును, వినీతేన-వినయముతోఁ గూడినవాడును నగు, గరుత్మతా-గరుత్మంతునిచేత, ఉపస్థితం-సేవింపబడుచున్న (తం-ఆవిష్ణువును దదృశుః-చూచిరి). గరుత్మంతుఁడు, సహజముగా సర్పవైరియై యున్నను విష్ణుతల్పమైయున్న శేషునితో మాత్రము వైరమును విడిచి భగవత్సన్నిధిలో వాహనమై యుండె ననుభావమును "ముక్త శేషవిరోధేన" అను సమాస పదము తెలుపును. అమృతమును దెచ్చినప్పుడింద్రునితో జరిగిన యుద్ధమునందలి వజ్రాయుధపు దెబ్బలచే నేర్పడిన వ్రణముల మచ్చలీనాటికిని గనపడుచుండుటను "కులిశవ్రణలక్ష్మణా" అనునది తెలుపును. "వినీతేన" అనుపద మొక పూర్వ గాథను తెలియఁజేయును; ఇంద్రసారథియగు మాతలికి గరుడకేశి" అను పుత్రిక గలదు, ఆమె భర్త ఒక సర్పరాజు. గరుత్మంతుడా సర్పమును దినకుండునట్లు మాతలి శ్రీమహావిష్ణువును వరమువేడి అభయమును సంపాదించెను. తన శత్రువునకు వరము నిచ్చుటవలన కోపించి, విష్ణువుతో నేను నిన్ను మోయుచున్నాను గనుక నీకంటె నేనే బలవంతుఁడను, నీవెట్లా సర్పమును రక్షింపగలవో చూచెదవని గర్వోక్తులు పలికెను. ఆ మాటలువిన్న విష్ణువు నవ్వుచు తన యెడమచేతి చూపుడు వ్రేలితో గరుడుని వీపుపై నొక్కెను. గరుడు డాభారమును మోయలేక అణగి విలవిల లాడుచు గర్వభంగమును పొంది, శరణువేడి, నాటినుండి వినీతుఁడయ్యెను. అట్టివాఁడగు గరుడుని చేత ఉపాసింపబడుచున్న విష్ణువును దేవతలు చూచిరని భావము. 'వినీత' శబ్దమునకు వంచబడిన అనియు నర్థము.

శ్లో. యోగ నిద్రాంత విశదైః పావనైరవలోకనైః
భృగ్వాదీ ననుగృహ్ణంతం సౌఖశాయనికా నృషీన్. 14

వ్యాఖ్య : యోగ నిద్రాంత విశదైః—యోగ నిద్రాంత-చిత్తము యొక్క ఏకాగ్రతారూపమైన యోగమనెడు నిద్రయొక్క అవసానమునందు, విశదైః-ప్రసన్నములై నవియు, పావనైః-ఎదటివారిని పవిత్రము చేయునవియు నగు, అవలోకనైః-చూపులచేత, సౌఖశాయనికాన్-సుఖముగా నిద్రించితిరా? యని అడుగుచున్న, భృగ్వాదీన్-భృగువు మొదలగు, ఋషీన్-మునులను, అనుగృహ్ణంతం-అనుగ్రహించుచున్న, (తం-ఆ విష్ణువును, దదృశుః-చూచిరి). యోగ నిద్రా పరిసమాప్తి యందు ప్రసన్నములైన చూపులతో భృగ్వాదులైన దేవర్షులను అనుగ్రహించు విష్ణువును దేవతలు చూచిరని భావము. "సుఖ శయనం పృచ్ఛంతీతి

సౌఖశాయనికాఃʼʼ దీని ఏకవచనము ʻʻసౌఖ శాయినికఃʼʼ అగును. అనగా సుఖముగా శయనించితివా? అనియడుగువాడు. అట్లే ʻʻసౌస్నాతికఃʼʼ అనియు నగును. చక్కగా స్నానము చేసితివా? యని అడుగువాడు అని దీనియర్థము. ఈ రెండు శబ్దములును ʻʻపృచ్ఛతా సుస్నాతా దిభ్యఃʼʼ అను వార్తికము వలన సిద్ధించుచున్నవి.

శ్లో. ప్రణిపత్య సురా స్తస్మై శమయిత్రే సురద్విషామ్
అథైవం తుష్టువు స్తుత్య మవాఙ్మనస గోచరమ్. 15

వ్యాఖ్య : అథ-దర్శనానంతరము, సురాఃదేవతలు, సురద్విషాం-రాక్షసులకు, శమయిత్రే-వినాశకుడగు, తస్మై-శ్రీవిష్ణువునకు, ప్రణిపత్య-నమస్కరించి, స్తుత్యం-స్తోత్రమున కర్హుడును, అవాఙ్మనస గోచరం-వాక్కులకును మనస్సునకును గోచరుడుకాని, (తం-శ్రీవిష్ణువును) ఏవం-ఈ క్రింది విధముగా, తుష్టువుఃస్తోత్రము చేసిరి. దర్శనానంతరము దేవత లందరును సాష్టాంగ నమస్కారములుచేసి అనంత కళ్యాణ గుణములు గల విష్ణువు స్తుతించుట కారంభించిరని భావము ఇందలి ʻʻసురద్విషాం శమయిత్రేʼʼ అనువిశేషణము సాభిప్రాయము. దేవతలు వచ్చినది రావణాది సురద్వేషులను చంపుమని కోరుటకే కదా? ʻʻఅవాఙ్మనస గోచరంʼʼ అను విశేషణము లోని రహస్య మేమనగా, కాళిదాసు, తన వాక్కులతో సాకారుడైన విష్ణువు ఇంతవరకు వర్ణించినాడు. ఇప్పుడు వాక్కులకును మనస్సునకును అందని విష్ణు తత్త్వమును దేవతలచేత పలికించుటకు బూనుకొన్నాడు. ఇది ఆయన ప్రౌఢతనము.

శ్లో. నమో విశ్వసృజే పూర్వం విశ్వం తదను బిభ్రతే
అథ విశ్వస్య సంహర్త్రే తుభ్యం త్రేధా స్థితాత్మనే. 16.

వ్యాఖ్య : పూర్వం-మొదట, విశ్వసృజే-ప్రపంచమును సృజించువాడవును, తదను-దాని తరువాత, విశ్వం-విశ్వమును, బిభ్రతే-భరించువాడవును, అథ-ఆపిమ్మట, విశ్వస్య-విశ్వమునకు, సంహర్త్రే-సంహారకుడవును, (ఏవం-ఇట్లు) త్రేధా-మూడు విధములుగా, స్థితాత్మనే-ఉన్న స్వరూపముగల, తుభ్యం-నీ కొరకు (నీకు) నమఃనమస్కారము. సృష్టి స్థితి లయ కారకులయిన బ్రహ్మ విష్ణు శివాత్మకుడవగు నీకు నమస్కార మని భావము.

శ్లో. రసాంతరా ణ్యేకరసం యథా దివ్యం పయోఽశ్నతే
దేశేదేశే గుణేష్వేవ మవస్థా స్త్వ మవిక్రియః. 17

వ్యాఖ్య :- ఏకరసం–ఒకేమధుర రసముగల, దివ్యంపయః-ఆకాశమునుండి పుట్టినదగు జలము, దేశేదేశే-ఉప్పునుట్టిచోటు మొదలయిన ప్రదేశములందు, రసాంతరాణి--లవణరసము మొదలగు ఇతర రసములను, యథా-ఎవిధముగా, అశ్నతే-పొందునో, ఏవం-అట్లే, అవిక్రియః-నిర్వికారుడవైన, త్వం-నీవు, గుణేషు-సత్వాది గుణములందు, అవస్థాః-బ్రహ్మాది రూపభేదములను, అశ్నషే-పొందుదువు. ఒకే మధుర రస ము గల జలము తాను పట్టుచోటు విశేషము వలన లవణత్వాదులను పొందునట్లు ఏ రూపమును లేని నీవు, సత్త్వరజ స్తమో గుణముల సంబంధమువలన విష్ణువుగాను, బ్రహ్మగాను, శంకరుడుగాను మారి ఆయా కార్యములు చేయుచున్నావని భావము. కారణ జలమునకు "శీతస్పర్శవత్యఆపః" అను లక్షణము వలన చల్లదనము మాత్రమే కాని మాధుర్యముగూడ స్వతస్సిద్ధము కాదు. కనుక "దివ్యం" అను విశేషణము వేసి మాధుర్యగుణ యుక్తత్వమును జలమునకు లక్షణముగా జెప్పుట, నిర్వి కారుడయిన భగవంతుడు సదా మధురానుభూతినిచ్చు "రసోవైసః" అను శ్రుతి గోచరుడని తెలుపుటకే యని గ్రహింపవలెను.

శ్లో. అమేయో మితలోక స్త్వ మనర్థీ ప్రార్థనావహాః
అజితో జిష్ణు రత్యంత మవ్యక్తో వ్యక్త కారణమ్. 18

వ్యాఖ్య : త్వం-నీవు, అమేయః-కొలుచుటకు వీలులేని వాడవు, ఇంత వాడవని యితరులచే జెప్పబడుటకు సాధ్యము కానివాడవు, మితలోకః-లోక మింతది యని నీవు చెప్పగలవాడవు, అనర్థీ (న+అర్థీ)-కోరికలేనివాడవు, ప్రార్థ నావహాః-ఇతరుల కోరికలను దీర్చగలవాడవు, అజితః-ఇతరునిచేత జయింపబడని వాడవు, జిష్ణుః-ఎవని నైనను జయించు స్వభావము గలవాడవు, అత్యంతం, అవ్యక్తః-ఇంద్రియములకు గోచరింపని మిక్కిలి సూక్ష్మరూపుడవు, వ్యక్తకారణం-కనపడుచున్న యీ స్థూలప్రపంచమునకు కారణభూతుడవు, నీవు, అచింత్యావ్యక్త స్వరూపుడవైన మహానుభావుడవని యర్థము.

శ్లో. హృదయస్థ మనాసన్న మకామం త్వాం తపస్వినమ్
దయాలు మనఘస్పష్టం పురాణ మజరం విదుః 19

వ్యాఖ్య : హేదేవ!-ఓ మహనీయుడా! త్వాం-నిన్ను, హృదయస్థం-హృత్కమలము నందున్నవాడవైనను, అనాసన్నం-అగమ్యరూపుడ వగుటచేత దూరస్థుడవు గాను, అకామం-పరిపూర్ణకాముడ వగుటచేత కోరికలు లేనివాడవై యున్నను, తపస్వినం-ఒకానొక ఫలాపేక్షచేత ఉత్తమతపస్సు చేయువాడవుగను, దయాలుం-దయగలవాడవయ్యును, అనఘస్పృష్టం- దుఃఖముచే స్పృశింపబడని వాడవుగను, పురాణం-చిరంతనుడవైనను, అజరం-ముదుసలితనము లేనిహానిని గను, విదుః-తత్త్వజ్ఞులైనవా రెరుగుదురు. హృదయము నందుండియు దూరస్థుడుగా నుండుట ఇత్యాదులు పరస్పర విరుద్ధములు. కాని బ్రహ్మతత్త్వము నెఱిగినవారికి ఆవైరుధ్యము తొలగును కనుక మల్లినాథుడు తలచినట్లు ఇది విరోధాభాస అలం కారమే. ఇచ్చటి "అనఘ" శబ్దములోని "అఘ" శబ్దమునకు "అఘందురిత దుఃఖయోః" అను విశ్వనిఘంటువు వలన దుఃఖము అని యర్థము. దయాళువు దుఃఖముగలవాడగునని మహాభారతము చెప్పుచున్నది.

శ్లో. సర్వజ్ఞ స్త్వ మవిజ్ఞాతః సర్వయోని స్త్వ మాత్మభూః
సర్వప్రభు రనీశ స్త్వ మేక స్త్వం సర్వరూపభాక్ 20

వ్యాఖ్య : హేదేవ-ఓ భగవానుడా! త్వం-నీవు, సర్వజ్ఞః-అనంత విశ్వము నందలి ప్రత్యణువును ఎఱిగినవాడవు, అవిజ్ఞాతః-కాని యేయజ్ఞానిచేతను ఎరుగ బడినవాడవు కావు, త్వం-నీవు, సర్వయోనిః-సకలవిశ్వమును పుట్టుటకు కారణ మైనవాడవు, ఆత్మభూః-కాని నీవు నీయంతట నీవే పుట్టినవాడవు, త్వం-నీవు, సర్వప్రభుః-అందరికిని అధిపతివి, అనీశః-కాని, నీకెవ్వడును ప్రభువులేడు. త్వం-నీవు, ఏకః-ఒక్కడవే, సర్వరూపభాక్-కాని, సర్వచేతనాచేతన స్వరూపుడవై యున్నావు. అనాదినిధనమైన పరబ్రహ్మము, జ్ఞానస్వరూపమై, స్వయంభువై, ఏకమై, యున్నను మాయాప్రభావమువలన సోపాధికమై సర్వ ప్రపంచమున్ను తానే అయివున్నదని భావము.

శ్లో. సప్త సామోపగీతం త్వాం సప్తార్ణవ జలేశయమ్
సప్తార్చి ర్మ్లిఖ మాచఖ్యుః సప్తలోకైక సంశ్రయమ్ 21

వ్యాఖ్య : త్వాం-నిన్ను, సప్తసామోపగీతం—సప్తసామ-ఏడు విధములైన సామలచేత, ఉపగీతం-గానముచేయబడుచున్న వానిని గాను, సప్తార్ణవజలేశయం—సప్తార్ణవ-ఏడుసముద్రములయొక్క, జలేశయం-నీటిపైన శయనించు వానినిగాను,

సప్తార్చిర్ముఖం-ఏడువిధములగు జ్వాలలుగల అగ్నియే ముఖముగా గలవానిని గాను, సప్త లోకైక సంశ్రయం—సప్తలోక-ఏడులోకములకును, ఏకసంశ్రయం-ఒకే ఆశ్రయమైన వానినిగాను, ఆచఖ్యుః-తత్త్వవిదులు చెప్పిరి. సప్తసామము లనగా ఏడు సామవేద భాగములు. అవి, గాయత్ర, రథంతర, వామదేవ్య, బృహత్సామ, వైరూప వైరాజ, శక్వరీ సామలు. ఇవికాక పెక్కుసామలు గలవు. సప్తసాగరములు : లవణ, ఇక్షు, సురా, సర్పిస్, దధి, క్షీర, జలసాగరములు. సప్తార్చి యనగా ఏడు జ్వాలలు (జిహ్వాలు) గల అగ్ని. ఆ జిహ్వాలు, కరాళి, ధూమిని, శ్వేత, లోహిత, నీలలోహిత, సువర్ణ, పద్మరాగ అనునవి. సప్తలోకములు భూలోకము, భువర్లోకము, సువర్లోకము,మహరోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము. సామగానలోలుడవై, సప్తార్ణవ జలమున శయనించువాడవై, సప్త జిహ్వా యగు అగ్నిద్వారా యజ్ఞహవిస్సును స్వీకరించుచు, సప్తలోకాశ్రయుడవైయున్న నిన్ను ధ్యానించుచున్నా మని భావము.

శ్లో. చతుర్వర్గఫలం జ్ఞానం కాలావస్థా శ్చతుర్యుగాః
చతుర్వర్ణమయో లోక స్త్వత్తః సర్వం చతుర్ముఖాత్. 22

వ్యాఖ్య : చతుర్వర్గఫలం-నాలుగు పురుషార్థములు ఫలము గాగల, జ్ఞానం-జ్ఞానమున్న, చతుర్యుగాః-నాలుగు యుగములుగల, కాలావస్థాః-కాలపరిణామములును, చతుర్వర్ణమయః-నాలుగు వర్ణములుగానున్న, లోకః-జనము, సర్వం-ఈ ప్రపంచమంతయు, చతుర్ముఖాత్-నాలుగు ముఖములు గలవాడవైన, త్వత్తః-నీ వలననే (బ్రహ్మవల్లనే) పుట్టినది. రజోగుణ ప్రధానుడవై బ్రహ్మగా అవతరించిన నీవల్లనే యీ సృష్టి అంతయు జరిగినది అని భావము. చతుర్వర్గముఅనగా, ధర్మ, అర్థ, కామ, మోక్షములనబడు పురుషార్థములు. చతుర్యుగములు : కృత, త్రేతా, ద్వాపర, కలియుగములు. చతుర్వర్ణములు : బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు.

శ్లో. అభ్యాస నిగృహీతేన మనసా హృదయాశ్రయమ్
జ్యోతిర్మయం విచిన్వంతి యోగిన స్త్వాం విముక్తయే 23

వ్యాఖ్య : అభ్యాస నిగృహీతేన—అభ్యాస-యమ నియమాది యోగాంగముల అభ్యాసముచేత, నిగృహీతేన-నిలకడగా నుంచబడిన, మనసా-మనస్సుతో, యోగినః-యోగాభ్యాస సిద్ధులైన మునులు, హృదయాశ్రయం-హృదయము

నందున్న, జ్యోతిర్మయం-జ్యోతిస్స్వరూపుడవైన, త్వాం-నిన్ను, విముక్తయే-మోక్షముకొరకై, విచిన్వంతి-అన్వేషింతురు. హృదయ కమలమునందు జ్యోతిగా ప్రకాశించు నిన్ను యోగులు మోక్షసిద్ధికై వెదకుదు రని భావము. హృద్గతమై, పర బ్రహ్మ రూపమై యున్న వెలుగు యోగాభ్యాసముచేతనే దర్శింప వీలగునన్నది సారాంశము.

శ్లో. అజస్య గృహ్ణతో జన్మ నిరీహస్య హతద్విషః
స్వపతో జాగరూకస్య యాథార్థ్యం వేద క స్తవ. 24

వ్యాఖ్య : అజస్య-జన్మించని వాడవైనను, జన్మ-మత్స్యాద్యవతార రూప మైన జన్మను, గృహ్ణతః-స్వీకరించు చున్నట్టియును, నిరీహస్య-చేష్టా రహితుడ వైనను, హతద్విషః-చంపబడిన శత్రువులు గలవాడవును, జాగరూకస్య-సర్వ సాక్షివై నిత్యప్రబుద్ధుడ వైనను, స్వపతః-యోగనిద్రను అనుభవించు నట్టివాడ వగు, తవ-నీ యొక్క, యాథార్థ్యం-నిజస్వరూపమును, కః, వేద-ఎవడెరుగును? ఆయా సమయములందు లోకకళ్యాణార్థమై విరుద్ధ వర్తనములు ప్రదర్శింపగల నీ సత్య స్వరూపము నెరుగగలవాడు లేడని భావము.

శ్లో. శబ్దాదీన విషయాన భోక్తుం చరితుం దుశ్చరం తపః
పర్యాప్తోఽసి ప్రజాః పాతుం ఔదాసీన్యేన వర్తితుమ్. 25

వ్యాఖ్య : శబ్దాదీన, విషయాన-శబ్ద స్పర్శ రూప రస గంధాత్మకము లైన యింద్రియార్థములను, భోక్తుం-ఆయా యవతారము లందనుభవించుటకును, దుశ్చరం-ఇతరులు చేయుటకు సాధ్యపడని, తపః-తపస్సును, చరితుం-కొన్ని యవతారములందు చేయుటకును, ప్రజాః, పాతుం-దైత్యమర్దనముచేత ప్రజలను రక్షించుటకును, ఔదాసీన్యేన-తటస్థ భావముతో, వర్తితుం-ఉండుటకును, పర్యాప్తః-సమర్థుడవు, అసి-అగుచున్నావు. పరస్పర విరుద్ధములైన భోగ తపస్సులను, పాలనౌదాసీన్యములను, ఆచరింపగల సమర్థుడు నీవు తప్ప మరి యొకడు లేడని భావము.

శ్లో. బహుధా ప్యాగమై ర్భిన్నాః పంథానః సిద్ధి హేతవః
త్వయ్యేవ నిపతం తోయ్యమూ జాహ్నవీయా ఇవార్ణవే. 26

వ్యాఖ్య : ఆగమైః-శ్రుయీ సాంఖ్య యోగాది దర్శనములచేత, బహుధా-అనేక విధములుగా, భిన్నాః,అపి-వేరువేరుగా నున్నను, సిద్ధిహేతవః-పురుషార్థము ఫలించుటకు సాధనములైన, పంథానః-దర్శన మార్గములు, జాహ్నవీయాః-గంగా సంబంధములైన, ఓఘాః-ప్రవాహములు (భిన్నగమనములతో పుణ్యఫల ప్రాప్తికి కారణములైన గంగానది పాయలు) అర్ణవే, ఇవ-సముద్రమునందు వలె, త్వయి, ఏవ-నీయందే, నిపతంతి-చేరుచున్నవి. అన్ని విధములైన ఆస్తిక దర్శనములు చూపు మార్గములు నిన్నే చేరును, నీవే సర్వగమ్యుడవని భావము.

శ్లో. త్వ య్యావేశిత చిత్తానాం త్వత్సమర్పిత కర్మణామ్
గతి స్త్వం వీతరాగాణాం అభూయ స్సన్నివృత్త యే. 27

వ్యాఖ్య : త్వయి-నీ యందు, ఆవేశితచిత్తానాం-నిలుపబడిన మనస్సు గల వారును, త్వత్సమర్పిత కర్మణాం-త్వత్-నీ కొరకే, సమర్పిత-అర్పింపబడిన, కర్మణాం-కర్మఫలము గలవారు నగు, వీతరాగాణాం-సంసారవిరక్తులకు, అభూ యఃసన్నివృత్తయే-తిరిగి సంసారమునకు రాకుండుటకు (మోక్షము కొఱకు) త్వం-నీవే, గతిః-సాధనము. "తమేవ విదిత్వా ఽతిమృత్యుమేతి," నాన్యః పంథా విద్యతే ఽయనాయ" ఇత్యాది శ్రుతివాక్యముల వలనను, "మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు, మామేవైష్యసి కౌంతేయ! ప్రతిజానే ప్రియోఽసి మే" అను గీతా వాక్యము వలనను విష్ణువు నందర్పింపబడిన చిత్తము, కర్మఫలమును గల విరక్తులకు పునర్జన్మలేని మోక్షపదవి నిచ్చు మహనీయుడవు నీవే యని దేవతలు స్తుతించిరి.

శ్లో. ప్రత్యక్షో ఽప్యపరిచ్ఛేద్యో మహ్యాది ర్మహిమా తవ
ఆ ప్తవా గనుమానాభ్యాం సాధ్యం త్వాం ప్రతి కా కథా. 28

వ్యాఖ్య : ప్రత్యక్షః, అపి-ప్రత్యక్షప్రమాణము చేత తెలిసికొనుటకు వీలైనదయ్యును, మహ్యాదిః-భూమి, ఆకాశము మొదలయిన, తవ, మహిమా-నీ యొక్క గొప్పదనము, అపరిచ్ఛేద్యః-అపరిచ్ఛిన్న మైనది (ఇంతది అని నిరూపించుటకు వీలుపడనిదై యున్నది). ఆ ప్తవాగనుమానాభ్యాం—ఆ ప్తవాక్-వేదరూపమైన శబ్దప్రమాణముచేతను, అనుమానాభ్యాం-అనుమాన ప్రమాణముచేతను, సాధ్యం-తెలిసికోదగిన (ఉన్నాడని చెప్పదగిన) త్వాం, ప్రతి-నిన్ను గురించి, కా, కథా-ఏమి చెప్పవలసి యున్నది? త్వక్చక్షురాదులగు నింద్రియములకు ప్రత్యక్ష

ముఁగా నున్న భూ జల వాయ్వాది రూపమున నున్న నీ మహిమ, నీ విస్తృతి, ఇంత ఉన్నది అని కొలుచుటకు లేదా చెప్పుటకు వీలుగానిదిగా నున్నప్పుడు, "యతోవా ఇమాని భూతాని జాయంతే" (ఏ పరమాత్మవలన ఈ భూతములన్నియు పుట్టుచున్నవో) అనువేదరూప, ఆ ప్రుాక్యమైన, శబ్ద ప్రమాణము చేతను, "క్షితా ధికం సకర్తృకం కార్యత్వాత్ ఘటవత్" పృథివ్యాదులు సకర్తృకములు, ఘటమువలె కార్యములుగనుక (ఒకనిచే నిర్మింపబడినవి) అను అనుమాన ప్రమాణము చేతను, తెలిసికోదగిన పాడవగు నివు అపరిచ్ఛిన్నుఁడవు, ఇంతవాఁడవని చెప్పుటకు వీలుపడనివాడ వనుటలో నాశ్చర్య మేమున్నది? అని భావము. ఏస్తు జ్ఞానము కలుగుటకు అంగీకరింపఁబడిన ప్రమాణములు. ఆరు: "ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము, అర్థాపత్తి, అనుపలబ్ధి" అనునవి ఇచ్చట అర్థాపత్తి ప్రమాణముచేత నేర్పడిన అర్థాపత్తి అలంకారము. ఒక విషయమును చెప్పినప్పుడు దానికి సంబంధించిన రెండవ విషయము, దానియంతట అదే తెలియుటకు, అర్థాపత్తి అని పేరు. దీనికి "దంతా పూపికా న్యాయ" మనియు పేరు అనగా గారెలు ప్రుచ్చిన కర్రను ఎలుకలెత్తుకపోయినవి అని చెప్పినప్పుడు, ఎలుకలు గారెలు తిన్నవి అని చెప్ప నక్కర లేదుగదా; అట్లే ప్రకృతమున భగవంతునిచే సృజింపఁబడిన లేదా భగవంతుని యందు ఆరోపింపబడిన మహాభూతములు అపరిచ్ఛిన్నములై యున్నప్పుడు, తత్కారణమైన పరబ్రహ్మము అపరిచ్ఛిన్నము అని చెప్పనక్కరలేదు అని తాత్పర్యము. ఇట్టిచోట కర్రలు "కా కథా, కిముత" అను పదము లుపయోగించి అర్థాపత్తి అలంకారమును సాధింతురు.

శ్లో. కేవలం స్మరణే నైవ పునాసి పురుషం యతః
అనేన వృత్తయ శ్శేషా నివేదిత ఫలా స్త్వయి. 29

వ్యాఖ్య : స్మరణేన-నిన్ను స్మరించుచేతనే, కేవలం-సంపూర్ణముగా, పురుషం-మానవుని, పునాసి, యతః-పవిత్రునిగా జేయుచున్నా వంటి, అనేన, ఏవ-ఈ స్మరణముచేతనే, త్వయి-నీ విషయమున శేషాః-మిగిలిన (తక్కిన), వృత్తయః-దర్శన స్పర్శ నాదులైన వ్యాపారములు, నివేదిత ఫలాః-తెలుపబడిన ఫలములు గలవియై యున్నవి నీ స్మరణముచేతనే సంపూర్ణముగా మానవుఁడు పవిత్రుఁడగుచున్నప్పుడతఁడుచేయు దర్శనాదుల ఫలము ఇంతది అని నిశ్చయింపఁజాలము. ఇప్పుడు మాకు కలిగిన దర్శనఫలము అనంతమై యుండునని దేవతలు పలికిరి. "కేవలఃకృత్న ఏకశ్చ" అని శాశ్వత నిఘంటువు కాగా ఇక్కడ కేవల శబ్దమునకు కృత్నము-సంపూర్ణము అని యర్థము చెప్పఁబడినది.

శ్లో. ఉదధే రివ రత్నాని తేజాంసీవ వివస్వతః
స్తుతిభ్యో వ్యతిరిచ్యంతే దూరాణి చరితాని తే. 30

వ్యాఖ్య : ఉదధేః-సముద్రముయొక్క, రత్నాని, ఇవ-రత్నములు వలెను, వివస్వతః-సూర్యునియొక్క, తేజాంసి, ఇవ-కిరణములు వలెను, దూరాణి-దూరము లైన (అవాఙ్మనస గోచరములైన), తే, చరితాని - నీ ప్రవర్తనములు, స్తుతిభ్యః-స్తోత్రములకంటె, వ్యతిరిచ్యంతే-మిక్కిలి యెక్కువగా నున్నవి. నీ నడవడులను నిశ్శేషముగా స్తుతించుటకు (పేర్కొనుటకు) సాధ్యము కాదని భావము. సముద్రము నందలి రత్నములను, సూర్యుని కిరణములను లెక్కించుటకు వీలుగానట్లు నీయనంత కళ్యాణ గుణములు లెక్కకు మిక్కుటముగా నున్నవని తాత్పర్యము.

శ్లో. అనవాప్త మవాప్తవ్యం న తే కించన విద్యతే
లోకానుగ్రహ ఏవైకో హేతు స్తే జన్మకర్మణోః 31

వ్యాఖ్య : అనవాప్తం-పొందబడనిదియు, అవాప్తవ్యం-పొందవలసినదియు, తే-నీకు, కించన-ఏదియు, న, విద్యతే-లేదు లోకానుగ్రహః-ప్రజలయందలిదయ, ఏక ఏవ-ఒక్కటియే, తే-నీయొక్క, జన్మకర్మణోః-జన్మమెత్తుటకును, క్రియాకర్మ లను చేయుటకును, హేతుః-కారణము. ఇంతవరకు దేవతలు విష్ణువును స్తుతించి, ఇప్పుడు తమకు కావలసియున్న ఆయన అవతార ప్రసక్తిని దెచ్చి పలుకుచున్నారు. మహానుభావా! నీవు పొందని కోరిక లేదు, పొందపలసినదియు లేదు, నీవు నిత్య పరిపూర్ణకాముడవు. మరి యవతారము లెత్తి ఆయాపనుల నేల చేయుచున్నావనగా అది పరమకారుణికుడవైన నీకు గల లోకానుగ్రహమే. లోకానుగ్రహము తప్ప నీకు స్వార్థము లేదు అని భావము.

శ్లో. మహిమానం య దుత్కీర్త్య తవ సంహ్రియతే వచః
శ్రమేణ త దశక్త్యా వా న గుణానా మియ త్తయా. 32

వ్యాఖ్య : తవ-నీయొక్క, మహిమానం - అధిక్యమును, ఉత్కీర్త్య-ఉప వర్ణించి, వచః-మావాక్కు, సంహ్రియతే, ఇతి, యత్ - ఆపివేయబడుచున్నదనుట యేదికలదో, తత్-అది (అట్లుచేయుట), శ్రమేణ-ఇకమీద పలుకుశక్తి వాక్కునకు లేకపోవుట, అశక్త్యా, వా-మాకు నీ సర్వగుణములను తెలిసికొనదగు శక్తిలేక పోవుటగాని కారణము, గుణానాం-నీగుణములయొక్క, ఇయత్తయా-ఇన్నిఅని

చెప్పదగిన పరిమాణము చేత మాత్రము న - కాదు. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" (మనస్సును, దానిని వివరించు వాక్కును, అద్వితీయ పరబ్రహ్మను జేరుటకును, ఆయనను గురించి చెప్పుటకును, ప్రయత్నించి, అది చేతగాక, వెనుకకు మరలుచున్నవి) అను శ్రుతిప్రకారము, అనంతకళ్యాణ గుణ పేతుడవైన నిగుణములను వర్ణించుటకు మావాక్కులుగాని మాసామర్థ్యముగాని చాలవు. కనుక ఈ మాత్రపు స్తుతిచేత ప్రసన్నుడవై మావిన్నపము నాలకింపు మని దేవతలు విష్ణువును సుముఖుని జేసికొనుచు స్తోత్రమునా పిరని భావము.

శ్లో. ఇతి ప్రసాదయామాసు స్తే సురా స్తమధోక్షజం
భూతార్థవ్యాహృతి స్సా హి న స్తుతిః పరమేష్ఠినః. 33

వ్యాఖ్య: ఇతి-ఇట్లుపలికి, తేసురాః-ఆదేవతలు, తం, అధోక్షజం-ఆవిష్ణువును, ప్రసాదయామాసుః- ప్రసన్ననిగా జేసిరి. హి-ఎందువలన, పరమేష్ఠినః- సర్వోత్కృష్టపదమునందున్న భగవంతునికి, సా-ఆదేవతలవాక్కు, భూతార్థ వ్యాహృతిః- సత్యవిషయమును చెప్పుటయేకాని, స్తుతిః-లేనిది కల్పించి పొగడుట, న-కాదో, గొప్పవారు, తమయందు లేనిగుణముల నారోపించిచేయు పొగడ్తలకు సంతోషింపరు కనుక దేవతలు తనయందున్న గుణములచే పలికినందున విష్ణుదేవుడు ప్రసన్నుడయ్యెనని భావము అధోక్షజః-అక్షములనగా చక్షురాదీంద్రియములు, వాటివలన 'జ' పుట్టినది, అక్షజం-ఇంద్రియ గోచరమగు ప్రత్యక్షాది జ్ఞానము. "అధోభూతం అక్షజం యస్మా్ సః అధోక్షజః" ఎవ్వనిని కనుగొనుటకు ప్రత్యక్షాదికమగు ఇంద్రియజ్ఞానము చాలదో అతడు అధోక్షజుడు అనిపుత్పత్తి (ఇంద్రియజ్ఞాన మతనికంటె కిందనుండునని యర్థము) పరమేష్ఠి -పరమే స్థానే తిష్ఠతీతి పరమేష్ఠి అత్యుత్తమ స్థానమునందుండువాడు. ఇది అలుక్సమాసము. ఉణాదిసూత్రము చేత సిద్ధించిన ఇన్నంత శబ్దము.

శ్లో. తస్మై కుశలసంప్రశ్న వ్యంజిత ప్రీతయే సురాః
భయ మప్రళయోద్వేలా బాచఖ్యౌ ర్నబుతోదధేః34

వ్యాఖ్య : సురాః-దేవతలు, కుశలసం పశ్న వ్యంజితప్రీయే - కుశల సంప్రశ్న - కుశలమేకదా! అని ప్రశ్నించుటచేత, వ్యంజిత-సూచనచేయబడిన, ప్రీతయే-ప్రేమభావముగల, తస్మై-ఆవిష్ణువునకు, ఆప్రళయోద్వేలాత్- (ఆప్ర

ళయ + ఉద్వేలాత్) ప్రళయ కాలము కాకపోయినప్పటికిని పొంగులు వారుచున్న నై ఋతోదధేః-నైఋత-రాక్షసుడగుబడు, ఉదధేః-సముద్రమువలన(గలుగుచున్న) భయం-భయమును గురించి, ఆచఖ్యౌ-చెప్పిరి ఇచ్చట "సంప్రశ్న" అను పదము న.దలి 'సం' అను ఉపసర్గచేత శ్రీమహావిష్ణువు దయతో కుశలమా! అని యడుగుట చేత వ్యక్తమైన ప్రీతిని ఆధారముగాజేసికొని తమ ప్రార్థన సఫల మగునను ధైర్యము.తో మనవిచేసుకొనిరని భావము. సముద్రము ప్రళయకాలమున ఉప్పొంగును. రావణుడను సముద్రము ప్రళయములేకయే ఉప్పొంగుచుండుట వలన తమకు కలిగిన భయాతిరేకమును దేవతలు చెప్పుటకారంభించిరి. రావణుడు చేయు చున్నదుష్కార్యములన్నీ చెప్పిరి. నైఋతుని ఉదధిగా రూపణము చేయుటచే నిది రూపకాలంకారము.

శ్లో. అథ, వేలా సమాసన్న శైల రంధ్రానునాదినా
స్వరేణోవాచ భగవాన్ పరిభూతార్ణవధ్వనిః 35

వ్యాఖ్య : అథ-దేవతలు తమకష్టములను విన్నవించిన పిమ్మట. వేలాస మాసన్నశైలరంధ్రానునాదినా-వేలా-విష్ణువు శయనించియున్న సముద్రముయొక్క తీరమునందు, సమాసన్న-నెలకొనియున్న, శైల-పర్వతములయొక్క,రంధ్ర-గుహ లయందు, అనునాదినా-ప్రతిధ్వనించుచున్న. స్వరేణ-కంఠస్వరముతో, పరిభూతార్ణ వధ్వనిః-తిరస్కరింపబడిన సముద్రఘోష గల, భగవాన్-శ్రీమహావిష్ణువు, ఉవాచ పలికెను. తానుపరుండిన సముద్రతీరము నందున్న పర్వతగుహలలో గంభీరముగా ప్రతిధ్వనించు కంఠస్వరము, సముద్రఘోషకంటే హెచ్చు స్థాయిలో నుండునట్లు భగవంతుడు దేవతలతో భాషించెననిభావము. దేవతలు, రాక్షసుని సముద్రముతో పోల్చిచెప్పిరి గనుక, ప్రస్తుత సముద్రఘోషను అణచివినిపించుచున్న విష్ణువుకంఠ స్వరము, రావణాహంకార హూంకారముల నణచు ననుధైర్యము దేవతలకు కలిగించిన దని వ్యంగ్యార్థము ఇచ్చటి భగవచ్ఛబ్దము సాభిప్రాయము. అనగా,"ఉత్పత్తించ వినాశంచ భూతానామాగతిం గతిమ్ వేత్తి విద్యామ విద్యాంచ స వాచ్యో భగవాన్ ఇతి"సర్వ ప్రాణుల ఉత్పత్తి వినాశ కారణములను,అవి యెచ్చటినుండివచ్చి యెచ్చటికి వెళ్ళుచున్నవి అనువిషయమును విద్యఅనగానేది?అవిద్యఅనగానేమి?అనువాటిని యెరిగినవాడు "భగవాన్"అనబడును అట్టి భగవచ్ఛబ్దము నుపయోగించి విష్ణువును చెప్పుట యెంతయో సందర్భముచకనుకూలముగా నున్నది ఇట్లు సాభిప్రాయ విశేష్య

మున్నరచన "పరికరాంకురము" అనుఅలంకారముగా చెప్పఁబడును. "పరిభూతార్ణవధ్వనిః" అనగా శ్రీవిష్ణుకంఠస్వరము సముద్రధ్వనికంటే హెచ్చుగానుండి వినవచ్చుచుండె ననిభావము.

శ్లో. పురాణస్య కవే స్తస్య వర్ణ స్థాన సమీరితా
బభూవ కృతసంస్కారా చరితార్థైవ భారతీ. 36

వ్యాఖ్యః- పురాణస్య-మిక్కిలి పురాతనుఁడైన, కవేః-కవియగు (సర్వజ్ఞుఁడగు) తస్య-ఆవిష్ణువుయొక్క, వర్ణస్థానసమీరితా-వర్ణ-అకారాది క్షకారాంతములైన అక్షరముల యొక్క, స్థాన-ఉత్పత్తిస్థానములగు కంఠతాల్వాది స్థానముల యందు, సమీరితా-చక్కగా ఉచ్చరింపఁబడినదియు, కృతసంస్కారా-కృత-చేకూర్చబడిన, సంస్కారా-సాధుత్వ స్పష్టోచ్చారణాది ప్రయత్నములు గలదియునగు భారతీ-వాణి, చరితార్థా-కృతార్థురాలు, బభూవ, ఏవ-తప్పక అయియుండినది సుమా; ధ్వని, వర్ణ, పద, వాక్యములయందు చక్కని సంస్కారమును పొంది, విష్ణుమూర్తియొక్క ధీర గంభీర కంఠమునందు సరస్వతి ధన్యురాలైనదనిభావము. ఇందలి "ఏవ"కారము, విష్ణువచనముల యర్థము తెలియకపోవుట, విపరీతముగా నర్థమగుట యనుదోషములులేక సుబోధముగా నుండెనని తెలుపుచున్నది. "కవి" శబ్దమునకున్న మహత్త్వమును స్పష్టపరచుట కాళిదాసు హృదయము.

శ్లో. బభౌ సదశనజ్యోత్స్నా సా విభోః వదనోద్గతా
నిర్యాతశేషా చరణాత్ గంగేవోర్ధ్వప్రవర్తినీ. 37

వ్యాఖ్య : విభోః-విష్ణుమూర్తియొక్క, వదనోద్గతా-ముఖమునుండి బయటికివచ్చిన (నోటినుండి వెలువడిన), సదశనజ్యోత్స్నా-వెన్నెలవంటి దంతకాంతితో కూడిన, సా-ఆభారతి, చరణాత్-పాదమునుండి, నిర్యాతశేషా-బయటికి వెళ్ళుచు మిగిలినదియై, ఊర్ధ్వప్రవర్తినీ-విష్ణుశరీరోర్ధ్వభాగమునుండి ప్రవహించుచున్న, గంగేవ (గంగా + ఇవ)-గంగానదివలె, బభౌ-ప్రకాశించెను. విష్ణుముఖమునుండి, ఆయన దంతకాంతులతోసహా, బయటికి వచ్చిన భారతి ఒకప్పుడు పాదమునందు పుట్టి ప్రవహింపగామిగిలిన గంగ ఆయననోటినుండి ఊర్ధ్వదిశగా వెడలుచున్నట్లు కనపడెను. విష్ణువు దంతకాంతులను జ్యోత్స్నగా చెప్పుట శరదిందు వికాసయగు శారదధావళ్యము ఇనుమడించినదని తెలుపుటకే. అట్టి తెల్లని సరస్వతి

(వాక్కు) ఆయననోటినుండి వెడలుము, ఊర్ధ్వగామియైన గంగయా? అనుకొను నట్లు ప్రకాశించె ననిభావము. గంగ, విష్ణుపాదమున పుట్టి ముల్లోకములయందు త్రిపథగ అనుపేరున ప్రవహించుననుట పురాణ ప్రసిద్ధము. అదిపూర్వవృత్తము. ఆట్లు పాదమునుండి వెడలగా మిగిలయున్న గంగాజలము ఈనాడు విష్ణువునోటి నుండి ఊర్ధ్వముగా వెడలుచున్నదా యేమి! అనుభావము ఆయననోటినుండి వెడ లిన భారతి కలిగించుచున్నట్టు ఊహించుటచేత ఇది ఉత్ప్రేక్షాలంకారము. ఉత్ప్రేక్ష యందు చెప్పిన యుపమానవస్తువు కేవలమూహారూపమే. కనుక విష్ణువునోటినుండి కూడ గంగపుట్టినదని మనము భ్రమింపరాదు. వాక్ప్రవాహమును వర్ణించుటకై కవి భారతికి ఈయుపమానమును. దంతకాంతుల సాహచర్యమును కల్పించెను.

శ్లో. జానే వో రక్షసా క్రాంతా వనుభావపరాక్రమౌ
అంగినాం తమసేవోభౌ గుణౌ ప్రథమమధ్యమౌ. 38

వ్యాఖ్య :- హేదేవాః-ఓదేవతలారా! వః-మీయొక్క, అనుభావ పరా క్రమౌ-మహిమయు, పురుషకారమును, రక్షసా-రాక్షసుడగు రావణునిచేత, అంగినాం-దేహధారులగు మానవులయొక్క, ప్రథమమధ్యమౌ-మొదటిదియు నడి మిదియు నగు, ఉభౌగుణౌ-సత్త్వము రజస్సు నను రెండుగుణములును, తమ సేన (తము సా + ఇవ) తమోగుణముచేతవలె, ఆక్రాంతౌ-ఆక్రమింపబడియున్న వని, జానే-ఎరుగుదును. ఇది విష్ణువు దేవతలతో నన్నమాట. ఓదేవతలారా! ఒక్కడేయైన రావణునిచేత దిక్పాలకాదులగు మీయందరియొక్కయు ప్రభావము, పురుషప్రయత్నమును సన్నగిల్లిపోవుట, అజ్ఞాన అంధకారాది రూపమైన తమో గుణముచేత ప్రథమ మధ్యమ గుణములగు సత్త్వరజస్సుల ప్రభావము తగ్గినట్లు న్నది. ఇది నేనెరుగుదును. సత్త్వ రజ స్తమో గుణములను వరుసలో సత్త్వము ప్రథమము, రజస్సు మధ్యమము అగును. చివరియగు తమస్సు మొదటి రెంటిని పరాభవించుట అధమునకు ఉత్తమ మధ్యమాధికారులను తిరస్కరించినట్లున్నది. ఇదిమీకు అత్యంతబాధాకరమైన విషయ మని నేనెరుగుదునని విష్ణువు పలికెను.

అలంకారము : ఉపమ.

శ్లో. విదితం తప్యమానం చ తేన మే భువనత్రయమ్
అకామోపనతే నేవ సాధో ర్హృదయ మేనసా. 39

వ్యాఖ్య : కించ-మరియును, ఆకామోపనతేన-కోరకయే ప్రమాదము చేత వచ్చిపడిన, ఏనసా-పాపముచేత, సాధోః-సజ్జనునియొక్క, హృదయం, ఇవ-మనస్సువలె, తేన-ఆరావణునిచేత, తప్యమానం-సంతాపమును పొందింపబడుచున్న, భువనత్రయంచ-ముల్లోకము సైతము, మే, విదితం-నాకు తెలియుచునే యున్నది (నాచేత తెలియబడుచున్నది అని వాక్యమున కర్థము). సాధువు పాపము చేయఁడు, కోరడు.కాని నిష్కారణముగా పాపము అతనిపై వచ్చిపడినప్పు డతని హృదయము మిక్కిలి బాధపడును. అట్లే రావణుఁడు స్వార్థపరుఁడై చేయుచున్న తపస్సును ఏమరుపాటున ఉపేక్షించిన యిం దాదులును, లోకములును ఈనాడతనిచేత బాధింపఁబడుచున్న విషయమును నేను చూచుచునే యున్నానని విష్ణువనెను. అలంకారము : ఉపమ.

శ్లో. కార్యేషు చైకకార్యత్వా దభ్యర్థ్యోఽస్మి న వజ్రిణా
స్వయ మేవ హి వాతో ఽగ్నే స్సారథ్యం ప్రతిపద్యతే.40

వ్యాఖ్య : కించ-మరియు, ఏకకార్యత్వాత్-ఉభయులము ఒకేపని చేయ వలసినవార మగుటచేత, కార్యేషు-చేయదగిన పనులయందు, వజ్రిణా-ఇంద్రునిచేత, అభ్యర్థ్యః-"ఈపనిచేసి పెట్టుము" అని ప్రార్థింపఁదగినవాడను, న, అస్మి-కాను, హి-అదిఅంతేకదా! వాతః-వాయువు, స్వయమేవ-తనకుతానే, అగ్నేః-అగ్నికి, సారథ్యం-సాహాయ్యమును, ప్రతిపద్యతే-పొందుచున్నది (చేయును). కోరకయే వాయువు అగ్నికి సహాయముగా నుండునట్లు నేను ఇంద్రునికి సహాయుఁడనై యుండుటకై యతఁడు నన్ను ప్రార్థింప నక్కఱలేదు. ఇద్దరికిని రావణవధరూప మైన కార్యము సమానమే. అని విష్ణువనెను.

శ్లో. స్వాసిధారా పరిహృతః కామం చక్రస్య తేన మే
స్థాపితో దశమో మూర్ధా లభ్యాంశ ఇవ రక్షసా. 41

వ్యాఖ్య : స్వాసిధారాపరిహృతః- స్వ-తనయొక్క (రావణునియొక్క) అసిధారా-ఖడ్గముయొక్క అంచుచేత, పరిహృతః-వదలివేయబడిన, దశమః, మూర్ధా-పదియవతల, కామం-పూర్తిగా, లభ్యాంశః, ఇవ-పొందదగిన భాగమో యనునట్లు, తేనరక్షసా-ఆ రాక్షసునిచేత, స్థాపితః-నిలుపబడి యున్నది. పూర్వం రావణుఁడు పరమేశ్వరునిఁ దృప్తిపరచి వరములను పొందుటకై ఒక్కొక్కసారి

తనతలనొక్కొక్కదానిని ఖండించి హోమము చేయుచుండగా పదియవతలను నరుకుకొన బోవునప్పుడు బ్రహ్మ సాక్షాత్కరించి యతనికి కోరినవరములన్నిటిని యిచ్చెను. దానిని విష్ణువు, రావణుడు తొమ్మిదితలలను తన చంద్రహాసమను ఖడ్గ ముతోఛేదించుకొని, పదియవతలను విష్ణుచక్రమునకు భాగముగానుంచినట్లు ఊహించి పలికెను. ఆయూహ సత్యముకాదు కనుక ఇది ఉత్ప్రేక్షాలంకారము. అనగా శ్రీమహావిష్ణువు రావణాసురునిఁ దప్పక వధించెద ననుభావమును దేవతలకు సూచించెనని తాత్పర్యము.

శ్లో. ప్రసృష్టు ర్వరాతిసర్గాత్తు మయా తస్య దురాత్మనః
అత్యారూఢం రిపో స్సోఢం చందనేనేవ భోగినః 42

వ్యాఖ్య : తు (కింతు)-కాని, ప్రసృష్టుః-బ్రహ్మయొక్క,వరాతిసర్గాత్ (వర + అతిసర్గాత్)-వరదానము వలన, మయా-నాచేత, తస్య, దురాత్మనః-ఆదురాత్ముఁడైన, రిపోః-శత్రువుయొక్క, అత్యారూఢం (అతి + ఆరూఢం; భావార్థక "క్త" (పత్యయరూపం)-మిక్కిలిపైకెక్కుట, అతివృద్ధి, భోగినః-సర్పముయొక్క, అత్యారూఢం-అతివృద్ధి, చందనేన, ఇవ-శ్రీగంధపు చెట్టుచేత వలె, సోఢం-సహింపబడినది. బ్రహ్మ యిచ్చిన వరమువల్ల రావణుఁడు మితిమీరిన వృద్ధిని పొంది అందరిపైకి నెక్కుచున్నాడు. ఆ వృద్ధిని నేను, చందనవృక్షము తన తలపైకెక్కుచున్న సర్పవృద్ధిని వలె సహించుచున్నాను. విధి బ్రాలుగాని, విధివరముగాని అతిక్రమింపనీయము, కనుక రావణాత్యారూఢము సహింపబడుచున్నదని విష్ణువు చెప్పెను రావణుఁడు "విశ్రవస్సు" అను బ్రహ్మకు పుత్రుఁడు, పులస్త్యబ్రహ్మకు పౌత్రుఁడు; పులస్త్యుడు బ్రహ్మకు కుమారుఁడు.

శ్లో. ధాతారం తపసా ప్రీతం యయాచే స హి రాక్షసః
దైవా త్సర్గా దవధ్యత్వం మర్త్యే ష్వాస్థా పరాఙ్ముఖః 43

వ్యాఖ్య : సః, రాక్షసః-ఆరావణాసురుఁడు, తపసా-తన తపస్సుచేత, ప్రీతం-సంతోషించియున్న, ధాతారం-బ్రహ్మను, మర్త్యేషు-మానవుల విషయమున ఆస్థాపరాఙ్ముఖః (సన్) శ్రద్ధలేనివాడగుచు, దైవాత్-దేవతాసంబంధమైన, సర్గాత్-సృష్టివలన, అవధ్యత్వం-తాను చంపబడకుండుటను, యయాచే, హి-యాచించెను సుమా! రావణుఁడు తపస్సుచేత బ్రహ్మను తృప్తిపరచి, దైవజా తిలోని గరుడ,

గంధర్వ, కిన్నర, కింపురుష, సిద్ధ, సాధ్య, విద్యాధర యక్షులనబడు నెనిమిది తెగలలో నెవ్వాడును తనను చంప జాలకుండునట్లు వరమును కోరెను. మానవులు తనకు లెక్కలోనివారు కానందున వారినుండి అవధ్యత్వమును కోరలేదు కాగా దేవతలు, దేవేంద్రుడు, దేవాధిదేవుడైన విష్ణువు నైతము వానిని చంపుటకు వీలులెదని చెప్పెను.

శ్లో. సోఽహం దాశరథి ర్భూత్వా రణభూమే ర్బలిక్షమమ్
కరిష్యామి శరై స్తీక్ష్ణైః తచ్ఛిరః కమలోచ్చయమ్. 44

వ్యాఖ్య: సోఽహం (సః + అహం) ఆనేను, దాశరథిః-దశరథపుత్రుడుగా భూత్వా-ఆయి, తీక్ష్ణైః, శరైః-తీవ్రములగు బాణములచేత, తచ్ఛిరః-కమలోచ్చయం (తత్ + శిరః + కమల + ఉచ్చయం)-ఆరావణునియొక్క శిరస్సులనెడి కమలముల సమూహమును, రణభూమేః-యుద్ధభూమికి, బలిక్షమం-పూజకు తగిన దానినిగా, కరిష్యామి-చేయగలను (చేసెదను). ఇంత వరకు బ్రహ్మవరము కారణముగా నేను రావణుని గర్వాతిరేకమును సహించితిని. కాని ఇక గతియేమని మీరు చింతింపనక్కరలేదు. దశరథుడు మానవజాతిరాజు కనుక నేను అతనికి కుమారుడనై పుట్టి, రావణుని తలలను తీక్ష్ణశరములచేత త్రుంచి, కమలముల చేతవలె ఆ తలలచేత రణభూమికి పూజచేయుదును. అనగా రావణుని చంపివేయుదును చింతింపకుడని చెప్పెను. ఒక దేవతను పూజించు వస్తువులలో పుష్పములు ముఖ్యము. కనుక రణభూమి దేవతా పూజనమునకు రావణుని తలలు పుష్పములుగా (కమలములుగా) చెప్పబడినవి.

శ్లో. అచిరా దధ్వభి ర్భాగం కల్పితం విధివ త్తునః
మాయావిభి రనాలీఢ మాదాస్యధ్వే నిశాచరైః. 45

వ్యాఖ్య: హేదేవాః-ఓదేవతలారా! యజ్వభిః-యజ్ఞము చేయువారిచేత (యాజ్ఞికులచేత), విధివత్-శాస్త్రప్రకారముగ కల్పితం-కల్పింపబడిన (మీకొఱకు కల్పింపబడిన), భాగం-హవిర్భాగమును, మాయావిభిః - మాయలుచేయువారగు, నిశాచరైః-రాక్షసులచేత, అనాలీఢం - ఆస్వాదింపబడకుండునట్లుగా, అచిరాత్ - స్వల్పకాలములోనే, ఆదాస్యధ్వే - గ్రహింపగలరు. రావణుని సహాయము వలన రాక్షసులు దేవతలకొఱకై యాగకర్తలు కల్పించిన హవిర్భాగములను మాయలచేత

అపహరించుచుండిరి. దేవతలకు సోమపానము, హవిర్భాగములు కఱవై బహు కాలము గడచినది. ఇక త్వరలోనే మీకు రాక్షసబాధను తొలగించి, హవిర్భాగములు అందునట్లు చేయగలను అని విష్ణువు చెప్పెను. శ్రీరాముడు తన ముప్పది యెనిమిది సంవత్సరమున రావణవధ చేయును గనుక గతకాలము అనగా రావణుని ఆయుష్కాలము కంటే ఇది స్వల్పము కనుక "అచిరాత్" అని చెప్పెను. ఇక మీద రాక్షసులు హవిర్భాగములను రుచిమాడజాలరు, అనగా వారినెల్ల వధించెదనని భావము.

శ్లో. వైమానికాః పుణ్యకృత స్త్యజంతు మరుతాం పథి
పుష్పకాలోక సంక్షోభం మేఘావరణ తత్పరాః 46

వ్యాఖ్య : మరుతాం-దేవతలయొక్క, పథి-మార్గమునందు (ఆకాశమార్గమున) వైమానికాః-విమానములపై నెక్కి తిరుగువారై, మేఘావరణతత్పరాః-రావణుని భయము వలన మేఘములచాటున వెళ్ళదలచుకొన్న, పుణ్యకృతః - పుణ్యాత్ములగు వారు, పుష్పకాలోక సంక్షోభం—పుష్పకాలోక-యదృచ్ఛగా రావణుని పుష్పక విమానము కనబడుటచేత కలుగు సంక్షోభం-భయముతో వణకుటను, త్యజంతు-ఇకమీద విడుతురుగాక. ఆకాశమార్గమున విమానములపై నెక్కి తిరుగు దేవతలు, యజ్ఞయాగములు చేసి పుణ్యాత్ములైన మానవులును, తమ విమానములు మేఘముల చాటున నడచునట్లు చేయును, ఆకస్మికముగా రావణుని పుష్పక విమాన దర్శనము జరిగినప్పుడు భయచకితు లగుచున్నారు. ఇకమీద వారి కెట్టి భయముండబోదు, అనగా రావణుఁడు వధింపబడునని భావము. సంక్షోభ మనగా భయముతో వణకుట. "సంక్షోభోభయచకితమ్" అని శబ్దార్ణవ నిఘంటువు.

శ్లో. మోక్ష్యధ్వే స్వర్గబందీనాం వేణీబంధా నదూషితాన్
శాప యంత్రిత పౌలస్త్య బలాత్కార కచగ్రహైః 47

వ్యాఖ్య : శాపయంత్రితపౌలస్త్య బలాత్కార కచగ్రహైః-శాప-నలకూబరుని శాపముచేత, యంత్రిత-ఆపివేయబడిన, పౌలస్త్య-రావణునియొక్క, బలాత్కార-బలాత్కారముచేతనైన, కచగ్రహైః - కేశాకర్షణములచేత, అదూషితాన్-అనుపహతములుకాని (మలినములై తెగిపోని), స్వర్గబందీనాం - రావణునిచే నపహరింపబడిన స్వర్గస్త్రీల యొక్క, వేణీబంధాన్-కేశబంధములను (జుట్టుముడులను) మోక్ష్యధ్వే-విడువ గలుగుదురుగాక. స్వర్గవాసినులైన స్త్రీలలోని యందగత్తెల

నందరిని అపహరించుకొనిపోయి రావణుఁడు లంకలో బందీలుగా నుంచెను. కాని వారిని బలాత్కరించి చెరుపజాలక పోయెను. కారణ మేనఁగా నొకప్పుడు రంభ అలంకరించుకొని తనప్రియుఁడగు నలకూబరుని వద్దికి వెళ్ళుచుండగా దారిలో తారసిల్లిన రావణుఁడు ఆమెను బలాత్కరించి భోగించెను. ఆ సంగతి తెలిసిన నలకూబరుడు, "ఇకమీద నీవు ఏ స్త్రీనిగాని బలాత్కరించి భోగించినచో నీతల నూరువక్కలై చత్తువు" అని రావణునికి శాపము పెట్టెను అందువలన స్వర్గస్త్రీలను బందీలుగా నుంచెనే కాని, రావణుఁడు వారిలో నొకరినైనను భోగింపఁజాలక పోయెను. ఇదే కారణముచేత సీతాదేవి తన లంకలో నున్నను ఆమె అంగీకారము నకై యర్థించి, లోభపరచి, భయపెట్టినే కాని బలాత్కారమునకు సిద్ధపడలేదు. ఈ విషయము నెరుగని రామాయణ విమర్శకులు సీతా పాతివ్రత్యమును గూర్చి యనుమానమును వెల్లడించి లోకమును మోసపుచ్చఁజూచుట దుస్సాహసము. శ్రీమహావిష్ణువు దేవతలతో అట్టి మీ స్వర్గస్త్రీల కేశబంధములు, అదూషితములై చిక్కుమాత్రము పడియున్నవి. వాటి నింక మీరు విప్పగలుగుదురు. అనగా రావణవధా నంతరము పవిత్రలై యున్న మీ మీ భార్యలను మీరు పొందెదరని చెప్పెను.

శ్లో. రావణా వగ్రహ క్లాంత మితి వాగమృతేన సః
అభివర్ష్య మరుత్సస్యం కృష్ణమేఘ స్తిరోదధే 48

వ్యాఖ్య : సః,కృష్ణమేఘః-ఆ విష్ణువనెడి మేఘము (నీలమేఘము), రావణావగ్రహక్లాంతం-రావణ-రావణాసురుడను, అవగ్రహ-అనావృష్టిచేత, క్లాంతం-వాడిపోయియున్న, మరుత్, సస్యం-దేవతలనెడు పైరును, ఇతి-ఇట్లు (పూర్వము చెప్పిన రీతిగా), వాగమృతేన-వాక్కులను అమృతముచేత (నీటిచేత) అభివర్ష్య-తడిపి (అభిషేకించి), తిరోదధే-అంతర్ధానమును జెందెను. వెనుక చెప్పిన మాటలతో దేవతలను తృప్తిపరచి విష్ణుమూర్తి అంతర్ధానము చెందెనని భావము ఇచ్చట దేవతలను సస్యముగాను, రావణాసురుని అనావృష్టిగాను, విష్ణుమూర్తిని నీల మేఘముగాను రూపణము చేయుటచేత ఇది సావయవ రూపకాలంకారము ఈ యలంకారమువలన దేవతాసమూహము రావణ నిదాఘత్వ, అవగ్రహత్వముల చేత సస్యమువలె మాడిపోవుచుండగా నీలమేఘమైన విష్ణువు వర్షించి ఆపైరును పునరుజ్జీవింప జేసె ననుభావము స్పష్టపడుచున్నది. రావణశబ్ద వ్యుత్పత్తి : 'విశ్రవసః అపత్యంపుమాన్' అను విగ్రహముచేత రావణః' అను తద్ధి

తాంత శబ్దము ఏర్పడును. ఎట్లనగా, విశ్రవః శబ్దమునకు "శివాదిభ్యోఽణ్" అను సూత్రముచేత అపత్యార్థకమగు "అణ్" ప్రత్యయమును చేర్చగా, "విశ్రవసో విశ్రవణ రవణౌ" అను ఆంతర్గణ సూత్రముచేత విశ్రవః శబ్దమునకు వృత్తి విషయమున "రవణ" అను ఆదేశము వచ్చును. ఆ రవణ అనుదానికి ఆదివృద్ధి వచ్చి "రావణ" అను శబ్దము సిద్ధించు నని మల్లినాథుడు వ్యాఖ్యానించెను.

శ్లో. పురుహూత ప్రభృతయః సురకార్యోద్యతం సురాః
అంశై రనుయయు ర్విష్ణుం పుష్పై ర్వాయుమివ ద్రుమాః49

వ్యాఖ్య : పురుహూత ప్రభృతయః-ఇంద్రుడు మొదలయిన, సురాః-దేవతలు, సురకార్యోద్యతం-దేవకార్యమైన రావణవధ యందు ఉద్యుక్తుడైన, విష్ణుం-విష్ణుమూర్తిని, అంశైః-తమ తమ అంశలచేత, ద్రుమాః-వృక్షములు, పుష్పైః-తమ శరీర భాగములగు పువ్వులచేత, వాయుం, ఇవ-వాయువునువలె, అనుయయుః-అనుసరించి వెళ్ళిరి. దేవకార్యమగు రావణవధకై విష్ణువు దశరథుని కుమారుడుగా పుట్టుటకు వెళ్ళగా, దేవతలు స్వర్గమునకు తిరిగిపోయిరి. కాని వారి యంశములు సుగ్రీవాది వానరరూపముల నెత్తి విష్ణువునవతారమగు రామునికి తోడ్పడుటకై భూలోకమున కేగెనని భావము. తామున్న చోటనే యుండి తమ యంశములు వెళ్ళునట్లు చేయుటలో వృక్షములు పుష్పరూపమున వాయువువెంట వెళ్ళుట నుపమానముగా జెప్పుట చాల గొప్పగా నున్నది. అలంకారం : ఉపమ.

శ్లో. అథ తస్య విశాం పత్యు ర్యంతే కామ్యస్య కర్మణః
పురుషః ప్రబభూవా గ్నే ర్విస్మయేన సహర్త్విజామ్ 50

వ్యాఖ్య : అథ-అటు తరువాత, తస్య, విశాంపత్యుః-ఆ దశరథమహారాజు యొక్క, కామ్యస్య కర్మణః-పుత్రకామేష్టియొక్క, అంతే-ముగింపునందు, అగ్నేః-హోమాగ్నినుండి, ఒకానొక దివ్యపురుషుడు (ప్రాజాపత్య పురుషుడు), ఋత్విజాం-యజ్ఞమును చేయించుచున్న బ్రాహ్మణులయొక్క, విస్మయేన, సహ-ఆశ్చర్యముతోపాటు, ప్రబభూవ-పుట్టెను. దశరథుడు చేయుచున్న పుత్రకామేష్టి ముగియుట, క్షీరసాగరమున విష్ణువు అంతర్ధానము నొందుట యేకకాలమున జరిగినవి. విష్ణువు పాలలో ప్రవేశింపగా చరురూపమైన దానినితీసుకొని, ప్రాజాపత్య పురుషుడు హోమాగ్నినుండి ఆవిర్భవించెను. ఋత్విక్కులింతవింత నెప్పుడును జూచియుండకపోవుటచేత వారికాశ్చర్యము కలిగినది. పురుషావిర్భావము, ఋత్వి

జుల ఆశ్చర్యము, ఏకకాలమున సహభావముతో పుట్టుటచేత ఇది సహోక్తి" అను అలంకారము కార్యకారణములకు పౌర్వాపర్యము లేక సహభావము రంజకముగా నుండుటయే సహోక్తి."

శ్లో. హేమపాత్ర గతం దోర్భ్యా మాదధానః పయశ్చరుమ్,
అనుప్రవేశా దాద్యస్య పుంస స్తేనాపి దుర్వహమ్ 51

వ్యాఖ్య : ఆద్యస్య-సృష్టికి మొదటివాడైన, పుంసః-పురుషునియొక్క (విష్ణువుయొక్క), అనుప్రవేశాత్-అధిష్ఠానమువలన (చేరుటవలన), తేన, అపి-అగ్ననుండి వచ్చిన ఆ ప్రజాపత్యపురుషుని చేతకూడ, దుర్వహం-మోయశక్యము గాని, హేమపాత్రగతం-బంగారుగిన్నె యందున్న, పయశ్చరుం-పాలతోవండిన అన్నమును (పాయసాన్నమును), దోర్భ్యాం-రెండు చేతులతోను, ఆదధానః-ధరించుచున్నవాడగుచు (అగ్ననుండి పురుషుడావిర్భవించెనని వెనుకటి శ్లోకముతో అన్వయము) బహ్మాండమంతయు తనయుదరమునమున్న విష్ణువు ప్రవేశించుట చేత పాయసాన్నము మిక్కిలి బరువుగా నుండుటచేత ఆ పురుషుడు మోయలేక మోయలేక దానిని రెండుచేతులతో పట్టుకొని పైకివచ్చెనని భావము. చరువనగా వార్చకుండ యజ్ఞాగ్నిలో ఉడుకజేసిన యన్నము. అది నీళ్ళతోగాక పాలతోనే యుడికింపబడుటచేత "పయశ్చరువు"గా జెప్పబడినది.

శ్లో. ప్రాజాపత్యోపనీతం త దన్నం ప్రత్యగ్రహీ న్నృపః
వృషేవ పయసాం సార మావిష్కృత ముదన్వతా 52

వ్యాఖ్య : నృపః-దశరథమహారాజు, ప్రాజాపత్యోపనీతం-ప్రజాపత్య-ప్రజాపతి (బహ్మ)కి సంబంధించిన పురుషునిచేత, ఉపనీతం-తనవద్దికి తీసుక రాబడిన, తదన్నం (తత్ + అన్నం) ఆ పాయసాన్నమున, ఉదన్వతా-సముద్రుని చేత, ఆవిష్కృతం-వెలువరింపబడిన, పయసాం-పాలయొక్క, సారం-సారభూత మైన యమృతమును, వృషేవ (వృషా, ఇవ) ఇంద్రుడువలె, ప్రత్యగ్రహీత్-స్వీకరించెను. క్షీరసముద్రము బయల్వరచిన యమృతము నింద్రుడు సంతోషముతో తీసుకొన్నట్లు దశరథుడానందముతో ప్రాజాపత్య పురుషుడందిచ్చిన ఆ పాయసాన్నమును ప్రతిగ్రహించె నని భావము. అలంకారము : ఉపమ "వాసవో, వృత్రహా, వృషా" అని యిందుని పేర్లు. (అమరం)

శ్లో. అనేన కథితా రాజ్ఞో గుణా స్తస్యా న్యదుర్లభాః
ప్రసూతిం చక మే తస్మిన్ తై ్రలోక్యప్రభవోఽపి యత్ 53

వ్యాఖ్య : తస్య-ఆ దశరథునియొక్క (సంబంధించిన), అన్యదుర్లభాః-ఇతరులకు లభ్యములుకాని, గుణాః-గుణములు, అనేన-ఈ చెప్పబోవు కారణము చేత, కథితాః-చెప్పబడినవి (వెల్లడియైనవి), యత్-ఎందువల్లనైతే, తై ్రలోక్య ప్రభవః, అపి-తై ్రలోక్య-త్రిలోకసముదాయమునకు, ప్రభవః, అపి-జన్మ కారణమగు విష్ణువుకూడ, తస్మిన్-ఆ దశరథునియందు, ప్రసూతిం-ఉత్పత్తిని, చకమే-కోరెనో. త్రిభువన జన్మహేతువైన విష్ణువే అతనియందు జన్మింపఁగోరుట దశరథుని ఉత్కృష్టగుణములకు పరమావధియని "అనేనకథితాః" అని కవి ప్రయోగించెను. అలంకారము : కావ్యలింగము.

శ్లో. స తేజో వైష్ణవం పత్నీ ర్విభేజే చరుసంజ్ఞితమ్
ద్యావా పృథివ్యోః ప్రత్యగ్ర మహర్పతి రివాతపమ్. 54

వ్యాఖ్య : సః-ఆ దశరథుఁడు, చరుసంజ్ఞితం-చరువను పేరుగల, వైష్ణవం-విష్ణు సంబంధమగు, తేజః-తేజస్సును, పత్నీభ్యాం ఇద్దరు భార్యలకు (కౌసల్యకు, కైకేయికి) ద్యావాపృథివ్యోః-భూమికిని, ఆకాశమునకును, అహర్పతిః-సూర్యుఁడు ప్రత్యగ్రం-నూతనమైన, ఆతపం, ఇవ-ఎండవలె (లేత యెండవలె) విభేజే-పంచియిచ్చెను. చరుసంజ్ఞిత మైన పాయసాన్నము విష్ణు తేజోమయము కనుక దానికి బాలాతపము ఉపమానముగాఁ జెప్పబడినది. దాని ననుసరించి దశరథునికి సూర్యోపమానము; కౌసల్యా కైకేయీలకు ద్యావా పృథువులు పోలికలుగా జెప్పఁబడినవి. ఈపాయస విభాగమునందు వాల్మీకి రామాయణమునకు భిన్నముగా కాళిదాసు చెప్పటలోఁగల స్వారస్యము దశరథునికి కైకమీదఁగల అత్యంతాసురాగము, రామవనవాసాది భవిష్యద్రామాయణ కథలో కైకకు గల ప్రాధాన్యము నని యూహింపవలసి యుండును. రామాయణమున మొదట చరువు నందర్ధభాగము కౌసల్యకును, మిగిలినదానిలో సగభాగము సుమిత్రకును, ఆ తరువాత మిగిలిన దానిలో సగము కైకకును ఇచ్చి, శేషించిన భాగమును మరల సుమిత్రకును ఇచ్చినట్లున్నది. కాని ఆ విభాగదానము, భరత జన్మ సందర్భమున "సాక్షాద్విష్ణోశ్చతుర్భాగః" అని చెప్పిన వాక్యముతో విరోధించుచున్నది. కనుక కాళిదాసు సవరించి, రసదృష్టితో సమంజసముగాఁ జెప్పెను. అలంకారము : ఉపమ.

అవతారిక : ముగ్గురు భార్యలుండగా నిద్దరికే పంచియిచ్చుటకుగల కారణమును జెప్పుచున్నాడు.

శ్లో. అర్చితా తస్య కౌసల్యా ప్రియా కేకయవంశజా
అతః సంభావితాం తాభ్యాం సుమిత్రా మైచ్ఛ దీశ్వరః 55

వ్యాఖ్య : తస్య-ఆ దశరథునికి, కౌసల్యా-కౌసల్య, అర్చితా-పూజ్యురాలు. కేకయవంశజా-కైకేయి, ప్రియా-ఇష్టురాలు. అతః-ఇందువలన, ఈశ్వరః-ప్రభువగు దశరథుడు, సుమిత్రాం-సుమిత్రను, తాభ్యాం-ఆ సల్యా కైకేయీలచేత, సంభావితాం-గౌరవింపబడు దానినిగా, ఐచ్ఛత్-కోరెను. దశరథుడు దక్షిణ నాయకుడు, కనుక పూజ్యురాలైన కౌసల్యకును, ప్రియురాలైన కైకకును పాయసభాగము లిచ్చి వారిద్దరును తమ భాగములలో గొంత కొంత భాగమును సుమిత్ర కిచ్చునట్లు కోరెను. దీనివలన దశరథునికి సుమిత్రపై గౌరవము, ప్రేమయు నున్నట్లు స్పష్టపడుటయేకాక సవతులకు పరస్పర సామరస్య మున్నట్లును దెలియును. తానే ముగ్గురికిని పంచి యిచ్చినచో దశరథునియందుగల దక్షిణ నాయకత్వ కౌశలముగాని, కౌసల్యాదులకున్న పరస్పర ప్రేమానురాగములు గాని వ్యక్తము కావు. కనుక కాళిదాసు రామాయణమునుగాక నారసింహాది పురాణముల ననుసరించి ఈ మార్పు చేసెనని తెలియవలెను.

శ్లో. తే బహుజ్ఞస్య చిత్తజ్ఞే పత్న్యౌ పత్యుర్మహీక్షితః
చరోః కర్ధార్ధ భాగాభ్యాం తా మయోజయతా ముభే. 56

వ్యాఖ్య : బహుజ్ఞస్య-సర్వజ్ఞుడును, ఉచితజ్ఞుడునైనట్టియు, మహీక్షితః-రాజును నగు, పత్యుః-భర్తయొక్క, చిత్తజ్ఞే-అభిప్రాయము నెరిగిన, తే, ఉభే, పత్న్యౌ-ఆ యిద్దరు భార్యలును (కౌసల్యయు, కైకయు), చరోః-పాయసాన్నము యొక్కా, అర్ధార్ధ భాగాభ్యాం-తమ భాగములలోని సగములోని సగభాగములతో (అనగా మూడువంతులు తాముంచుకొని చతుర్థభాగమునని యర్థము), తాం-ఆసుమిత్రను, అయోజయతాం-సంబంధము కలదానినిగాజేసిరి (అనగా సుమిత్రకిచ్చిరి). దశరథుని యభిప్రాయము నెరిగియున్నవారు కనుక కౌసల్యయు, కైకయు, తమ భాగములలో గొంతకొంత భాగమును సుమిత్రకిచ్చి గౌరవించిరని భావము. "అర్ధార్ధ భాగాభ్యాం" అనువిభాగము వాల్మీకి సమ్మతము కాదు. అయినను శ్రీరామునికిని భరతునకును, లక్ష్మణ శత్రుఘ్నులకును గల సామ్య

మును స్ఫురింపఁజేయుటకై ఇట్టి విభాగమును కాళిదాసు చెప్పెను. ధార్మికత్వము నందు భరతుఁడు రామునికిఁ దీసిపోడన్నది ఆయన యభిప్రాయముగా నోపును. ఏమైనను ఈ పాయసాన్న విభజనమందు వాల్మీకి కాళిదాసులకు ఏకాభిప్రాయము లేనట్లు వారి రచనలవలనఁ దెలియుచున్నది.

శ్లో. సాపి ప్రణయ వత్యాసీత్ సపత్నోభ్య రుభయో రపి
భ్రమరీ వారణస్యేవ మదనిష్యంద లేఖయోః 57

వ్యాఖ్య : సా, అపి-ఆసుమిత్రయు, ఉభయోః-ఇరువురైన, సపత్నోభ్యః అపి-సవతులయందు కూడ, భ్రమరీ-ఆడుతుమ్మెద, వారణస్య-ఏనుగుయొక్క, మదనిష్యందలేఖయోరివ-మదనిష్యంద-మదస్రావముచేత నేర్పడిన, లేఖయోరివ-ఏనుగు గండస్థలములపైని చారలమీద వలె, ప్రణయవతీ-ప్రేమగలది, ఆసీత్-అయ్యెను. ఆవిధముగా పాయసాన్నమును పంచియుచ్చిన సవతులిద్దరియందును సుమిత్ర, ఒక ఆడుతుమ్మెద గజగండ స్థలములపై (చెక్కిళ్ళపై) స్రవించు మద ధారాలేఖలమీద వలె, మిక్కిలి ప్రేమగలదాయెను. ఇచ్చటి సపత్న శబ్దము యౌగికార్థమునందు సాభిప్రాయము. "సమానఃపతిః యయోః తే సపత్న్యౌతయోః సపత్నోభ్యః" అను విగ్రహము నందుఁగల సమాన శబ్దము వలన దశరథుఁడు తన యందును, కౌసల్యా కైకల యందును సమాన ప్రేమ గలవాడే యనునర్థము సిద్ధించుట చేతను, వారు పాయసమును బంచి యిచ్చుటచేతను. ఆ ఇద్దరియందును సుమిత్ర ప్రణయవతియైనది. అట్లు సుమిత్రకు పాయస భక్షణానంతరమే కలిగిన ప్రణయము, తన కుమారులుగాఁ బుట్టబోవు లక్ష్మణ శత్రుఘ్నులకు, రాముని యందును, భరతునియందును విశేష భ్రాతృప్రేమగా మారి రామలక్ష్మణులు, భరత శత్రుఘ్నులు అను జంటలుగా నేర్పడుటకు బీజప్రాయమని ధ్వనించుచున్నది. దశరథునికి కౌసల్యా కైకలపై కంటే సుమిత్రపై తక్కువ ప్రేమ యుండెనని భావింపకూడదు.

శ్లో. తాభి ర్గర్భః ప్రజాభూత్యై దధ్రే దేవాంశ సంభవః
సౌరీభి రివ నాడీభి రమృతాఖ్యాభి రమ్మయః 58

వ్యాఖ్య : తాభిః-ఆ ముగ్గురు దశరథ భార్యలచేత, ప్రజాభూత్యై- ప్రజల యభ్యుదయము కొరకు, దేవాంశ సంభవః-దేవ-విష్ణుదేవుని యొక్క, అంశసంభవః అంశలు కారణముగాగల, గర్భః-గర్భము (గర్భములని యర్థము, ఇది జాత్యేక

వచనము), సౌరీభిః-సూర్య సంబంధినులగు, అమృతాఖ్యాభిః, నాడీభిః-అమృతము లను పేరుగల నాళములచేత (కిరణములచేత), అమ్మయః (అప్+మయః) జల మయమైన, గర్భః ఇవ-గర్భమువలె, దధ్రే-ధరింపబడెను. కౌసల్యా కైకేయీ సుమిత్రలు గర్భవతులైరని భావము దేవాంశ సంభవము లైన వారి గర్భములండు జనింపబోవు రామాదులవలన రఘువంశ విభూతియేకాక ప్రజాభ్యుదయము కూడ గలుగనున్నదని సూచితమైనది. సూర్యకిరణములలో గొన్నింటికి "అమృతము" లనిపేరు, అవి జలమయగర్భమును ధరించి వర్షముగురియును. సూర్యుడు సహస్ర కిరణుడని ప్రసిద్ధి. అందులో "చతస్రో వృషివాహాస్తాస్సర్వా అమృతాః స్త్రియః" అని చెప్పన యాదవనిఘంటువు ననుసరించి నాలుగువందల కిరణము "లమృతము" లనుపేరుతో వర్షమును గురిపించును. ఇందలి "అమృతాఖ్యాభిః" అనుపదము, కాళిదాసుయొక్క భౌతిక, జ్యోతిష, శాస్త్రపాండిత్యమును వెల్లడించు చున్నది.

శ్లో. సమ మాపన్నసత్త్వా స్తా బభు రాపాండురత్విషః
అంతర్గతఫలారంభా సస్యానా మివ సంపదః 59

వ్యాఖ్య : సమం-ఏకకాలమునందు, ఆపన్నసత్త్వాః-గర్భవతులై యున్నారు కనుక, ఆ పాండురత్విషః-కొంచముతెల్లనికాంతిగల, తాః-ఆరాజ పత్నులు ముగ్గురును, అంతర్గత ఫలారంభాః-లోపలనున్న ఫలోత్పత్తి గల, సస్యానాం-పైరులయొక్క, సంపదః, ఇవ-సంపత్తులవలె, బభుః- ప్రకాశించిరి ఈనమోసిన పైరులు తెలుపురంగు తిరుగుట సహజము. అట్లే గర్భవతులైన రాజపత్నులు కొంచము తెల్లనికాంతి గలవారుగా మారిరని భావము. పూర్వశ్లోకమునందు జల గర్భమును వహించిన సూర్యనాడులతోను, ఈశ్లోకమున ఫనపదార్థముగా పూరు సస్యములతోను పోలిక చెప్పుటచేత వారిగర్భముల పరిణామము తెలుపబడినది. "ఆపన్నాః-గృహీతాః, సత్త్వాః-ప్రాణినః, యాభిస్తాః ఆపన్నసత్త్వాః-గర్భిణ్యాః" అని విగ్రహము. "ఆపన్నసత్త్వా స్యాద్గర్భిణ్యాం తర్వతీ చ గర్భిణీ" అని యమరము. అలంకారము: ఉపమ.

శ్లో. గుప్తం దదృశు రాత్మానం సర్వా స్వన్వేషు వామనైః
జలజాసి గదా శార్ఙ్గ చక్ర లాంఛిత మూర్తిభిః 60

వ్యాఖ్య : సర్వాః-ఆరాజపత్నులు ముగ్గురును, స్వప్నేషు-స్వప్నముల యందు, జలజ, అసి, గదా, శార్ఙ్గ, చక్ర, లాంఛిత, మూర్తిభిః-శంఖ, ఖడ్గ, గదా చాప, చక్రములచేత చిహ్నితములైన శరీరములుగల, వామనైః-చిన్న పురుషుల చేత, గుప్తం-రక్షింపబడిన, ఆత్మానం-తమతమ రూపములను, దదృశుః-చూచిరి. వారందరును విష్ణ్వంశతోఁగూడిన పాయసమును భుజించియుండిరి కనుక అందరి స్వప్నములందును శంఖచక్రాదులు ధరించిన బాలవిష్ణుమూర్తులు కనఁబడుచు తమను రక్షించుచున్నట్లు జూచుచుండిరని భావము.

శ్లో. హేమ పక్ష ప్రభా జాలం గగనే చ వితన్వతా
ఉహ్యాంతేస్మ సుపర్ణేన వేగాకృష్ట పయోముచా. 61

వ్యాఖ్య : చ(కించ)-మరియు, హేమపక్ష ప్రభాజాలం—హేమపక్ష-బంగారుకాంతిగల రెక్కలయొక్క, ప్రభాజాలం-కాంతిపుంజమును, వితన్వతా-విస్తరింపఁజేయుచున్నట్టియును, వేగాకృష్ట పయోముచా-వేగ-తనగమనవేగముచేత, ఆకృష్ట-లాగుకొనిపోబడుచున్న, పయోముచా-మేఘములు కలిగిన్నట్టి, సుపర్ణేన-గరుత్మంతుని చేత, గగనే-ఆకాశమునందు, ఉహ్యాంతేస్మ-మోసికొనిపోఁబడుచుండిరి. ఇది మరియొక స్వప్నము; ఆకౌసల్యాదులు, బంగరు రెక్కల కాంతులను విస్తరింపఁజేయుచు, మహావేగమున వెళ్ళుచున్న గరుత్మంతునిచేత గగన తలమున మోసికొనిపోఁబడుచున్నట్లు స్వప్నములను గనిరి. విష్ణువు గర్భమునందున్న ఆరాణులు గరుడునిచే మోయఁబడుచున్నట్లు కలలుగనుట సహజముగదా! ఆ విధముగా గరుత్మంతుఁడు వారిసేవలను జేయుచుండెను.

శ్లో. బిభ్రత్యా కౌస్తుభన్యాసం స్తనాంతర విలంబినమ్
పర్యుపాస్యంత లక్ష్మ్యా చ పద్మవ్యజన హస్తయా. 62

వ్యాఖ్య : చ-మరియును, స్తనాంతర విలంబినం-స్తనాంతర-స్తన మధ్య భాగమునందు, విలంబినం-ప్రవేలాడుచున్న, కౌస్తుభన్యాసం-భర్త తనవద్ద దాచియుంచిన కౌస్తుభమణిని, బిభ్రత్యా-ధరించుచున్నదియు, పద్మవ్యజన హస్తయా-పద్మమనెడు వింజామరము హస్తమునందు గలదియుగు, లక్ష్మ్యా-లక్ష్మీదేవిచేత, పర్యుపాస్యంత-సేవింపబడుచుండిరి. ఇది మరియొకకల, విష్ణువు భూలోకమునకు వచ్చినపుడు తనవద్ద దాచియుంచిన కౌస్తుభమణిని, ఆయనవలెనే తామును వక్షస్థలమున ధరించి, తన భర్తయగు విష్ణువు గర్భమునందుగల కౌసల్యాదులను ఆత్రల

నుగా భావించి, లక్ష్మీదేవి పద్మచామరముతో విసుచు, వారియలసటను దీర్చు చుండెనని భావము.

శ్లో. కృతాభిషేకై ర్దివ్యాయాం త్రిస్రోతసి చ సప్తభిః
బ్రహ్మర్షిభిః పరం బ్రహ్మ గృణద్భి రుపతస్థిరే. 63

వ్యాఖ్య : చ(కించ)-మరియును, దివ్యాయాం-స్వర్గమునందున్న, త్రిస్రోతసి-ఆకాశగంగయందు, కృతాభిషేకైకైః-చేయబడిన స్నానముగలవారును, పరం బ్రహ్మ-ఉత్కృష్ట వేదరహస్య వచనములను, గృణద్భిః-పఠించుచున్నవారగు, సప్తభిః, బ్రహ్మర్షిభిః-ఏడుగురగు కశ్యపాది బ్రహ్మర్షులచేత, ఉపతస్థిరే-ఉపాసింపబడుచుండిరి. ఇది చివరిస్వప్నము, దశరథపత్నుల గర్భమునందున్నది ఉపనిషత్ప్రతిపాద్యమగు బ్రహ్మపదార్థము. కనుక సప్తఋషులు ఆకాశగంగా స్నానము చేసివచ్చి బ్రహ్మ ప్రతిపాదకములగు ఉపనిషత్పాఠములను బలుకుచు ఆరాధనలను సేవించి రని భావము. మొదటి స్వప్నములందు సగుణ బ్రహ్మవైభవము చిత్రింపబడినది. ఈ స్వప్నమునందు గర్భస్థమైయున్న ది నిర్గుణ బ్రహ్మమగు పరమాత్మయని సూచింపబడినది. సప్తఋషులు: అత్రి, భృగువు, కుత్సుడు, కపిలుడు, గౌతముడు, కశ్యపుడు, అంగిరసుడు అనువారు కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వసిష్ఠుడును "సప్తఋషుల"ని మరియొక పరిగణననున్నది.

శ్లో. తాభ్య స్తథావిధాన్ స్వప్నాన్ శ్రుత్వా ప్రీతోఽథ పార్థివః
మేనే పరార్ధ్య మాత్మానం గురుత్వేన జగద్గురోః 64

వ్యాఖ్య : అథ-అనంతరము, పార్థివః-రాజు (దశరథుడు), తాభ్యః-ఆ పత్నుల వలన, తథావిధాన్-ఆ విధములైన (వెనుక వర్ణింపబడిన) స్వప్నాన్-స్వప్న వృత్తాంతములను, శ్రుత్వా-విని, ప్రీతః (సన్)-సంతోషించిన వాడగుచు, ఆత్మానం-తనను, జగద్గురోః-లోకజనకుడైన విష్ణువునకు, గురుత్వేన-పితృత్వముచేత, పరార్థ్యం-సర్వోత్కృష్టునిగా, మేనేహి-తలచెను సుమా! రాణులు చెప్పిన ఆస్వప్న వృత్తాంతముల వలన దశరథుడు సంతోషముతో నుప్పొంగుచు, లోక జనకుడైన విష్ణువునకు తాను జనకుడు కాబోవుచున్నందులకు తనను ధన్యాతి ధన్యునిగా భావించుకొనెను.

శ్లో. విభక్తాత్మా విభు స్తాసా మేకః కుక్షిష్వ నేకధా
ఉవాస ప్రతిమాచంద్రః ప్రసన్నానా మపా మివ 65

వ్యాఖ్య : ఏకః-ఒకడేయైన (అద్వితీయుఁడైన), విభుః- విష్ణువు, తాసాం-ఆ రాజపత్నులయొక్క, కుక్షిషు-ఉదరములందు, ప్రసన్నానాం-నిర్మలములైన, అపాం-ఉదకములయొక్క, కుక్షిషు-అంతర్భాగములయందు, ప్రతిమాచంద్రః, ఇవ-బింబిరూపమున నున్న చంద్రునివలె, అనేకధా-పెక్కురీతుల (ఏకభిన్నం అనేకం కనుక నాలుగు విధములుగా), విభక్తాత్మా-విభజింపఁబడిన యాత్మలు గలవాఁడై, ఉవాస-నివసించెను (గర్భస్థుఁడై యుండెను). 'విభుః' అనగా సర్వ వ్యాపకుఁడు అనగా పరబ్రహ్మము. అది ఏకము. అయినప్పటికిని ఉపాధిగతమై (శరీరాదులనుపొంది)అనేకధా కనపడును. ప్రకృతమున ఒక్కడేయైయున్న విష్ణువు ఉపాధి భూతములైన నాలుగు పాయసభాగములందు ప్రవేశించి రాణుల గర్భములలో నివసించెను. ఇది ఒకే చంద్రుఁడు భిన్న జలాశయములందు ప్రతిబింబ రూపమున పెక్కు చంద్రులుగా గనబడుటతోఁ బోల్చుట మిక్కిలి సమంజసముగా నున్నది. అద్వితీయ పరబ్రహ్మము ఉపాధిగతమై నానావిధముల గోచరించునన్న వేదాంత సిద్ధాంత మీశ్లోకమున సూచింపఁబడినది.

శ్లో. అథా గ్ర్యమహిషీ రాజ్ఞ ప్రసూతి సమయే సతీ
పుత్రం తమోఽపహం లేభే నక్తం జ్యోతి రివౌషధిః 66

వ్యాఖ్య : అథ-అనంతరము, రాజ్ఞః-దశరథునియొక్క, సతీ-పతివ్రత యగు భార్యయు, అగ్రమహిషీ-పెద్దరాణియు నగు కౌసల్య, ప్రసూతిసమయే-ప్రసవ కాలమునందు, ఓషధిః-ఒకానొకమొక్క, నక్తం-రాత్రివేళయందు, తమోఽపహం-చీకటిని తొలగించునట్టి, జ్యోతిః, ఇవ-జ్యోతిని వలె, తమోఽపహం-అజ్ఞానమను చీకటిని తొలగించునట్టి, పుత్రం-కుమారుని, లేభే-పొందెను (ప్రసవించెను). దశమ మాసమున కౌసల్య, తమకు అపుత్రత్వ రూపమున నున్న తమస్సును, లోకమునకు అజ్ఞానాంధకారరూపమగు తమస్సును, బోగొట్టునట్టి వైష్ణవ తేజోరూపుఁడగు కుమారునిఁగనెనని భావము. ఇది వాక్యార్థోపమ.

శ్లో. రామ ఇత్యభిరామేణ వపుషా తస్య చోదితః
నామధేయం గురు శ్చక్రే జగత్ప్రథమ మంగళమ్ 67

వ్యాఖ్య : అభిరామేణ-మనోహరమైన, వపుషా-బాలుని శరీరముచేత, చోదితః-ప్రేరేపింపబడిన, గురుః-తండ్రియగు దశరథుఁడు, తస్య-అశిశువునకు, జగత్ప్రథమమంగళం-లోకమునకు మొదటి శుభలక్షణమగు, రామ ఇతి-రాముఁడు అను, నామధేయం-పేరును (నామకరణమును), చక్రే-చేసెను. పుట్టిన శిశువు అభిరాముఁడై యుండుటచే తనే తండ్రి యతనికి రాముఁడు అని నామకరణము చేసెను. "రమంతే-యోగినః, ప్రజాః, పిత్రాద్యాః అస్మిన్ ఇతి రామః అనగా నితనినిచూచి యోగులు, ప్రజలు, తల్లిదండ్రులును ఆనందపడుచుందురు కనుక 'రామ' అనుపదము ఇతని యందు సార్థక మగునని భావము.

శ్లో. రఘువంశ ప్రదీపేన తేనా ప్రతిమ తేజసా
రక్షాగృహ గతా దీపాః ప్రత్యాదిష్టా ఇవా భవన్ 68

వ్యాఖ్య : రఘువంశ ప్రదీపేన-రఘువంశమునకు దీపము వంటి వాడును (వంశమున కపారమైన కీర్తిని దెచ్చునట్టివాఁడు), అప్రతిమతేజసా-సాటిలేని తేజస్సు గల, తేన-శిశురూపమున నున్న రామునిచేత, రక్షాగృహగతాః-సూతికాగృహము నందున్న, దీపాః-దీపములు, ప్రత్యాదిష్టాః, ఇవ-తిరస్కరింపబడినవా (కాంతి హీనములు చేయబడినవా) యనునట్లు అభవన్-ఉండెను. బహుకాలము సంతతిలేని దశరథుని వలన పేరుకెక్కని రఘు వంశము శ్రీరాముని జన్మము వలన మహా కీర్తిని బొందుటవలన రాముఁడు రఘువంశమునకు ప్రదీపము (గొప్పదీపము) వంటివాఁడు. అందు వలన పురిటింటిలోని దీపాలు వెలవెలబోయినవి, ఈ మహా తేజస్సు అవతరించుట వలన రావణాదులును వెలవెలబోయిరని ధ్వని ఇది ఉత్ప్రేక్ష అలంకారము, కాని శాస్త్రదృష్టియందు సత్యమే.

శ్లో. శయ్యాగతేన రామేణ మాతా శాతోదరీ బభౌ
సైకతాంభోజ బలినా జాహ్నవీవ శరత్కృశా. 69

వ్యాఖ్య : శాతోదరీ - గర్భమోచనమువల్ల పలుచబడిన యుదరముగల, మాతా-తల్లియగు కౌసల్య, శయ్యాగతేన-పడకపైనున్న, రామేణ-రామునిచేత, సైకతాంభోజబలినా-సైకత-ఇసుకతిన్నెమీద నున్న, అంభోజ-కమలమనెడి, బలినా-పూజాపుష్పముచేత, శరత్కృశా-శరద్ఋతువునందు సన్నగిల్లిన, జాహ్నవీ, ఇవ-గంగానదివలె, బభౌ - ప్రకాశించెను.

శరదృతువున ప్రవాహము తగ్గుట చేత గంగలో ఇసుకతిన్నె లేర్పడును. అప్పు డందలి కమలమును గోసి గంగకు పూజచేయుట శిష్టాచారము. అట్లు చేసిన ప్పుడు కృశించిన గంగ, దాని నానుకొని ఇసుకతిన్నె, దానిపై కమలము ఉండును. అట్లే కృశించిన కౌసల్య (గర్భభారము తగ్గినది కనుక), ఆమె ప్రక్కన స్వచ్ఛమైన పొత్తిలి గుడ్డల పడక, దానిపై శిశువగు రాముడు నున్నారు. కనుక ఇది కమల పుష్పోపహారము గల శరద్గంగోపమానము గలదై యున్నది. అంభోజమును పోలికగాఁజెప్పుటచేత రాముని సౌకుమార్యము, జాహ్నవితో పోలిక చెప్పుటచేత కౌసల్య పవిత్రత్వము వ్యక్తమగు చున్నవి.

శ్లో. కైకేయ్యా స్తనయో జజ్ఞే భరతో నామ శీలవాన్
జనయిత్రీ మలంచక్రే యః ప్రశ్రయ ఇవ శ్రియమ్ 70

వ్యాఖ్య : కైకేయ్యాః-కైకేయికి, భరతః, నామ-భరతుడు అను, శీలవాన్-మంచినడవడిగల, తనయః-పుత్రుడు, జజ్ఞే-జన్మించెను, యః-ఎవ్వఁడు, ప్రశ్రయః- వినయము, శ్రియం, ఇవ-సంపదవలె, జనయిత్రీం- తల్లిని, అలం చక్రే-అలంకరించెనో; కైకేయికి సద్వృత్తము నందు సాటిలేని భరతుఁడను కుమారుఁడు పుట్టెను. ఇది దశరథుఁడు పాయసాన్నమును పంచియిచ్చిన వరుస లనే జరిగినది. వాల్మీకియు శ్రీరాముని తరువాత భరతుఁడు పుట్టినట్లు చెప్పెను. "కేకయస్య అపత్యం స్త్రీ కైకేయీ" అని వ్యుత్పత్తి. "కేకయ" శబ్దములోని యకారాదిభాగమునకు 'ఇయ' అను ఆదేశమున్ను, ఆదివృద్ధియు, వచ్చి- 'కైకేయీ' శబ్దము నిష్పన్నమైనది. సంపదకు వినయమువలె భరతుఁడు తల్లికి అలంకారముగా నుండెనట అలంకారము: ఉపమ.

శ్లో. సుతౌ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రా సుషువే యమౌ
సమ్యగారాధితా విద్యా ప్రబోధ వినయౌ ఇవ 71

వ్యాఖ్య : సుమిత్రా-సుమిత్ర, లక్ష్మణ శత్రుఘ్నౌ-లక్ష్మణ శత్రుఘ్నులను పేర్లుగల, యమౌ-కవలలయిన, సుతౌ-కుమారులను, సమ్యగారాధితా-చక్కగా అభ్యసింపబడిన, విద్యా-విద్య, ప్రబోధ వినయౌ, ఇవ-తత్త్వజ్ఞానమును, ఇంద్రియ జయమువలె, సుషువే-ప్రసవించెను. రెండు భాగములుగా స్వీకరింపఁబడిన పాయసాన్నము వలన రెండు గర్భములు ధరించిన సుమిత్ర లక్ష్మణ, శత్రుఘ్న

లను కుమారులను గనెను. ఇది చక్కగా అభ్యసింపఁబడిన విద్య వలన బుట్టు తత్త్వజ్ఞాన, ఇంద్రియ జయము లతోఁ బోల్పఁబడినది. విద్యకు తత్త్వజ్ఞాన, ఇంద్రియ జయములు ఫలమని గ్రహింపవలయును.

శ్లో. నిర్దోష మభవ త్సర్వ మావిష్కృతగుణం జగత్
అన్వగా దివ హి స్వర్గో గాం గతం పురుషోత్తమమ్. 72

వ్యాఖ్య : సర్వం, జగత్-భూలోకమంతయు, నిర్దోషం-దుర్భిక్షాది దోషములు లేనిదియు, ఆవిష్కృత గుణం-ప్రకటింప బడిన ఆరోగ్యాది గుణములు గలదియు, అభవత్-ఆయె ను. (అదియంతము) గాం-భూలోకమును, గతం-చేరిన పురుషోత్తమం-శ్రీమహావిష్ణువును, స్వర్గః-స్వర్గముగూడ, అన్వగాత్, ఇవ-అనుగమించివచ్చెనా ఏమి? అన్నట్లుండెను. విష్ణ్వంశములతో శ్రీరామాదు లవతరింపగా జగత్తున దోషములు, అనగా దుర్భిక్షము, రోగములు, రాగద్వేషాదులు, నశించి, సుభిక్షము, ఆరోగ్యము, సంతోషము మొదలగు గుణములు నెలకొన్నవని భావము. స్వర్గమనగా నిర్దోషమై గుణములు గల ప్రదేశమని ఆగమము. అయోధ్యాప్రాంతమంతయు స్వర్గతుల్యముగా మారినది.

శ్లో. తస్యోదయే చతుర్మూర్తేః పౌలస్త్య చకితేశ్వరాః
విరజస్కై ర్నభస్వద్భి ర్దిశ ఉచ్ఛ్వసితా ఇవ. 73

వ్యాఖ్య : చతుర్మూర్తేః-నాలుగు మూర్తులుగల (రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల శరీరములతో) తస్య-ఆవిష్ణుమూర్తి యొక్క, ఉదయే (సతి)-జన్మము కలుగగా, పౌలస్త్య చకితేశ్వరాః-రావణుని వలన భయపడిన తమ తమ అధిపతులు గల, దిశః-నాలుగు దిక్కులును, విరజస్కైఃః-ధూళి తొలగిన, నభస్వద్భిఃవాయువులతో, ఉచ్ఛ్వసితాః, ఇవ-నిట్టూర్పును విడిచినవా యన్నట్లుండెను. ప్రాక్పశ్చిమ దక్షిణోత్తర దిశలు, రావణుని వలన భయపడుచున్న తమ అధిపతులకు (ఇంద్ర వరుణ యమ కుబేరులకు) రామాది చతుర్మూర్తులతో అవతరించిన విష్ణువు వలన నిర్భయము, రక్షణము నేర్పడుటచేత ధూళిచేత కలుషితములు గాని నిర్మల వాయురూపమున నిట్టూర్పులు విడిచినవి. చల్లని మెల్లని వాయువులు రామావతారము జరుగగానే వీచిన వని భావము. చతుర్మూర్తుల ప్రయోజనము చతుర్దిగీశ రక్షణము. "విరజస్క" పదము నిర్భయసూచకము. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. కృశానురపధూమత్వా ప్రసన్నత్వాత్ ప్రభాకరః
రక్షో విప్రకృతా వాస్తాం అపవిద్ధశుచా వివ. 74

వ్యాఖ్య : రక్షో విప్రకృతౌ-రాక్షసుఁడగు రావణునిచేత, పరాభవింపబడి తేజస్సును గోల్పోయి యుండిన, కృశానుః-అగ్నియు, ప్రభాకరః-సూర్యుఁడును, (వరుసగా) అపధూమత్వాత్-పొగ తొలఁగిపోవుట వలనను, ప్రసన్నత్వాత్, చ-నిర్మలత్వము కలుగుట వలనను, అపవిద్ధశుచౌ, ఇవ-తొలఁగిపోయిన శోకము గలవారో యన్నట్లు, ఆస్తాం-అయిరి. మహాతేజస్వి లయిన సూర్యుఁడును, అగ్నియు రావణుని వలన కలిగిన పరాభవము చేత దుఃఖించుచుండిరి. అట్టి సూర్యాగ్నులు నేడు విష్ణువు దుష్టశిక్షణార్థమై రామావతారము నెత్తుటచేత నిర్భీకులై ప్రసన్నులైరి. అగ్నిశోకము తొలగుటకు అపధూమత్వము, సూర్యదుఃఖము వాయుటకు ప్రసన్నత్వము సూచకములుగాఁ జెప్పబడినవి. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. దశానన కిరీటేభ్య స్తత్క్షణం రాక్షస శ్రియః
మణివ్యాజేన పర్యస్తాః పృథివ్యా మశ్రుబిందవః 75

వ్యాఖ్య : తత్క్షణం-శ్రీరాముఁ డవతరింపగానే, రాక్షస శ్రియః-రాక్షస రాజ్యలక్ష్మియొక్క, అశ్రుబిందవః-కన్నీటి చుక్కలు, దశానన కిరీటేభ్యః-రావణుని కిరీటములనుండి, మణివ్యాజేన-రత్నముల మిషచేత, పృథివ్యాం-భూమిమీద, పర్యస్తాః-జారిపడినవి. శ్రీరాముఁ డుదయింపఁగానే, ఇక రావణవధ తథ్యము అని తెలిసికొన్న రాక్షస రాజ్యలక్ష్మి తనకన్నీటి చుక్కలను, రావణ కిరీటములనుండి కారణాంతరమున జారి నేలపైబడిన మణులను నెపమున రాల్చినది. రాముఁడు పుట్టగానే రావణునికి కిరీట రత్నములు క్రిందరాలిపడుట యను నపశకునమైనదని భావము. అలంకారము: కైతవాపహ్నవము.

శ్లో. పుత్రజన్మ ప్రవేశ్యానాం తూర్యాణాం తస్య పుత్రిణః
ఆరంభం ప్రథమం చక్రుః దేవదుందుభయో దివి. 76

వ్యాఖ్య : పుత్రిణః-పుత్రవంతుఁడైన, తస్య-ఆ దశరథునియొక్క, పుత్ర జన్మ ప్రవేశ్యానాం-కుమార జన్మోత్సవమునందు ఏర్పాటు చేయదగిన, తూర్య

ణాం-నాగస్వరాది వాద్యములయొక్క, ఆరంభం-ఉపక్రమమును, ప్రథమం-మొదట, దివి-స్వర్గమున (ఆకాశమునందు) దేవదుందుభయః-దేవతల వాద్యములగు, దుందుభులు-చక్రుః-చేసినవి. దశరథుడు పుత్రజన్మోత్సవమును ప్రకటించుటకై యేర్పాటు చేసిన మంగళవాద్యములు ప్రోగకముందే లోకకళ్యాణార్థ ముదయించిన రాముని యెడలగల తమ భక్తిని, ఆనందమును వెల్లడించుటకై స్వర్గమునుండి దేవతలు దుందుభులు ప్రోగించిరనియు, ఆ తరువాత అయోధ్యానగరము మంగళవాద్యనాదములతో నిండిపోయెనని యు భావము. రామాదుల జన్మముచేత భూలోక స్వర్లోకము లానందపరవశము లయ్యే నన్నది సారాంశము.

శ్లో. సంతానకమయీ వృష్టి ర్భవనే తస్య పేతుషీ
సన్మంగళోపచారాణాం సై వాదిరచనా ఽభవత్. 77

వ్యాఖ్య : తస్య-ఆ దశరథుని యొక్క, భవనే-మందిరమున, సంతానకమయీ-కల్పవృక్ష కుసుమ మయమైన; వృష్టిః-వర్షము, పేతుషీ-పడినదై, సైవ (సా + ఏవ)-ఆదియే, సన్మంగళోపచారాణాం-పుత్రజన్మకాల మందవసరమైన మంగళ వస్తూపచారములకు, ఆదిరచనా-ప్రథమకార్యము, అభవత్-ఆయినది. పుత్రజన్మ సమయమున జాతకర్మ, నామకరణాది వైదికక్రియా కలాపమునకు పువ్వులు, ఫలములు, రంభాస్తంభములు, మామిడియాకులు మొదలయినవి కూర్చుకొనుట యాచారము. దశరథుని భవనమునం దామంగళోపచారములను సేవకులారంభించుటకంటే ముందే స్వర్గమునుండి కల్పవృక్ష కుసుమ మయమగు పుష్పవృష్టి కురిసి, అదియే మంగళోపచారములలో మొదటి యుపచారమైనది. శ్రీరాముని యవతార సమయమున మానవులకంటే ముందే దేవత లానందోత్సాహములను వెల్లడించుచుండి రని భావము. "సంతానాః ఎవ సంతానకాః (స్వార్థమున "క" ప్రత్యయము), సంతానకానాం పుష్పాణి సంతానకాని, సంతానకానాం వికారః సంతానకమయీ" అని విగ్రహము చెప్పుకొనవలెను. పేతుషీః ఇది పతుల్ధాతువునకు "క్వసు" ప్రత్యయము, జీప్‌ను చేర్చగా నేర్పడిన రూపము. "క్వసుశ్చ" అనుపాణిని సూత్రము భూతకాలమున దీని ప్రయోగమును సమ్మతించుట చేత, పేతుషీ-పడినది, ఆని యర్థము చెప్పబడినది. (పడినదై, అనుట సులభ బోధకొఱకు మాత్రమే)

శ్లో. కుమారాః కృతసంస్కారా స్తే ధాత్రీస్తన్య పాయినః
ఆనందే నాగ్నిజే నేవ సమం వవృధిరే పితుః 78

వ్యాఖ్య : కృతసంస్కారాః-చేయబడిన **జాతకర్మ**, నామకరణములను సంస్కారములు గలవారును, **ధాత్రీస్తన్యపాయినః-ధాత్రీ**-దాదులయొక్క, స్తన్య-పాలను, పాయినః-త్రాగుచున్న **వారును నగు, తే, కుమారాః-ఆరాజకుమారులు**, అగ్రజేన, **ఇవ-తమకంటే ముందే** పుట్టినట్లున్న, **పితుః-తండ్రియగు** దశరథునియొక్క, ఆనందేన, **సమం-ఆనంద**ముతోపాటుగా, వవృధిరే-వృద్ధినిపొందిరి (పెరిగిరి). ప్రాజాపత్య పురుషుడు పాయసము నిచ్చినప్పుడే తనకు పుత్రసంతానము కలుగు నన్నయానందము దశరథునికి కలిగెను. కనుక పుత్రులకంటే ఆనందము అగ్రజస్థానము నాక్రమించినది. **ఇప్పుడు** పుత్రులు పుట్టిపెరుగుచుండగా ఆనందముతో సైతము పెరుగుచున్నది అట్లు దశరథుని ఆనందముతోపాటు కృతసంస్కారులైన రామాదులు, దాదుల పాలుత్రాగుచు పెరుగుచుండిరనియు, దశరథుని యానందము ఇనుమడించుచుండె ననియు భావము. "అగ్రేజాతం అగ్రజం" మొదటపుట్టినది అని యుర్థము. అలంకారములు: ఉత్ప్రేక్ష, సహోక్తి.

శ్లో. స్వాభావికం వినీతత్వం తేషాం వినయకర్మణా
ముమూర్ఛ సహజం తెజో హవిషేవ హవిర్భుజామ్ 79

వ్యాఖ్య : తేషాం-ఆరాజకుమారులయొక్క, స్వాభావికం-సహజమైన (పుట్టుకతోనే వచ్చిన), వినీతత్వం-చక్కని ప్రవర్తనము, వినయకర్మణా-క్రమ శిక్షణాభ్యాసముచేత, హవిర్భుజాం-అగ్నులయొక్క, సహజం-స్వాభావికమైన, తేజః-తేజస్సు, హవిషాఇవ-ఆజ్యాది ద్రవ్యముల చేతవలె, ముమూర్ఛ-వృద్ధిని పొందెను. విష్ణ్వంశసంభూతులైన ఆ కుమారులకు సహజముగానే యున్న వినయ సంపద గురువుల శిక్షణముచేత, సహజతేజస్సుగల అగ్నికి హోమద్రవ్యములచేత తేజస్సు ఇనుమడించినట్లు వృద్ధిని పొందెను. హవిర్భుక్ శబ్దమును అగ్ని కుపయోగించుట యుక్తియుక్తముగా నున్నది. హవిస్సును తినువాడు ఆజ్యాది హవిస్సు భోజనముగా లభించినప్పుడు వృద్ధిని పొందుట సహజముగదా. "హవిర్భుజాం" అని బహువచనము నుపయోగించుట కుమారచతుష్టయమున కుపమానముగా నుండుటకే. ఉపమాలంకారము.

శ్లో. పరస్పరా విరుద్ధా స్తే తదృషో రనఘం కులమ్
అల ముద్యోతయామాసు ర్దేవారణ్య మివర్తవః 80

వ్యాఖ్య : పరస్పరావిరుద్ధాః-ఒకరితోనొకరు కలహించుకొనినవారగు (సౌభ్రాత్రముగలవారగు), తే-ఆకుమారులు, తత్-ప్రసిద్ధమైన, రఘోః-రఘు మహారాజుయొక్క, కులం-వంశమును, ఋతవః-వసంతాది రుతువులు, దేవారణ్యం, ఇవ-నందనవనమునువలె అలం-మిక్కిలిగా, ఉద్యోతయామాసుః-ప్రకాశింపఁజేసిరి. సవతితల్లుల కొడుకు లగుటచేతను, బాలు రగుటచేతను, పరస్పరము కలహించు కొనుట లోకాచారమై యున్నప్పటికిని, ఒకే విష్ణువు నలుగురుగా బుట్టుటచేత వారం దరును అన్నివిషయములందును ఏకాభిప్రాయము గలవారై సుప్రసిద్ధమైన రఘు వంశమునకు మిక్కిలి కీర్తిని దెచ్చిరి. ఆది ఋతువులు పరస్పర విరుద్ధ స్వభావ ములు గలవియైనను స్వర్గము నందలి నందనోద్యాన విషయమున నన్నియు నేక విధముగా నుండుటవలె నున్నదని చెప్పుట, బాలుర దివ్యత్వమునకును, రఘువంశ మునకుఁ గలిగిన దివ్యశోభకును సూచకము. అలంకారము : ఉపమ. ఈ శ్లోకమునందలి "తత్" శబ్దమునకు "అది" యని యర్థముకాదు. ప్రసిద్ధము అని యర్థము. కనుకనే "యత్తదోర్నిత్య సంబంధః" అనున్యాయము ననుసరించి "యత్" శబ్దము వాడబడలేదు. ప్రసిద్ధార్థకమగు "తత్" అనునది "యత్"ను కోరదని అలంకారిక సిద్ధాంతము. "ప్రసిద్ధ ప్రకాం తానుభూతార్థక స్తచ్ఛబ్దో యదుపాదానం నాపేక్షతే."

శ్లో. సమానే ఽపిచ సౌభ్రాత్రే యథోభౌ రామలక్ష్మణౌ
తథా భరతశత్రుఘ్నౌ పీత్యా ద్వంద్వం బభూవతుః 81

వ్యాఖ్య : చ (కించ)-మరియును, సౌభ్రాత్రే-సోదరభావము, సమానే, అపి-సమా నమే అయినప్పటికిని, యథా-ఎట్లు, రామలక్ష్మణౌ-రాములక్ష్మణులు, ఉభౌ-ఇద్దరును, ప్రీత్యా-ప్రేమచేత, ద్వంద్వం-జంటగా, బభూవతుః-ఏర్పడిరో, తథా-అట్లే, భరత శత్రుఘ్నౌ-భరతశత్రుఘ్నులు, ఉభౌ-ఇద్దరును, ప్రీత్యా-ప్రేమచేత, ద్వంద్వం-జంటగా, బభూవతుః-ఏర్పడిరి రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులకు భాత్రప్రేమ సమానమే అయియున్నప్పటికిని ప్రేమభావముయొక్క ఆధిక్యముచేత రామ లక్ష్మణు లొక్కజంటగాను, భరతశత్రుఘ్ను లొక్కజంటగాను ఏర్పడి యొకరి నొకరు విడిచియుండజాలని స్నేహముతో లోకము వారికి జంటలుగా నభివ్యక్త మైరి. కౌసల్య సుమిత్ర కిచ్చిన పాయస భాగమువలన లక్ష్మణుడును, కైకేయి సుమిత్ర కిచ్చిన పాయస భాగము వలన శత్రుఘ్నుడును పుట్టి యుండుటచేత వారికట్టి ద్వంద్వభావము సహజమై యుండెను. స్నేహమునకు

బాహ్యనిమిత్తముండదు, ఆంతరమైన నిమిత్తమే దానికి కారణము. అనగా అట్లు జంటలుగా నేర్పడవలె నని వారనుకొనకయే జంటలుగా నేర్పడిరనియు, నలు గురియందును భ్రాతృప్రేమకు మాత్రము కొదువ లేకుండె ననియు భావము. సౌభ్రాత్రం :- సు + భ్రాతరః యేషాం తే సుభ్రాతరః సుభ్రాతృణాం భావః సౌభ్రాత్రమ్, ఆని వ్యుత్పత్తి యువాది గణపఠిత మగుటచే "అణ్" ప్రత్యయము వచ్చినరూపము.

శ్లో. తేషాం ద్వయో ర్ద్వయో రైక్యం బిభిదే న కదాచన
యథా వాయువిభావస్వో ర్యథా చంద్రసముద్రయోః 82

వ్యాఖ్య : తేషాం-ఆ నలుగురిలో, ద్వయోః, ద్వయోః-ఇద్దరిద్దరికి (రామ లక్ష్మణులకు, భరత శత్రుఘ్నులకు నని యర్థము), వాయు విభావస్వోః, యథా-పవనాగ్నులకు వలెను, చంద్రసముద్రయోః, యథా-చంద్రసముద్రులకువలెను, ఐక్యం-ఐకమత్యము, కదాచన-ఎప్పుడును, నబిభిదే-భేదించలేదు (చెడలేదు). జంటలుగానున్న రామలక్ష్మణ, భరత శత్రుఘ్నులకు ఎప్పుడును, ఏవిషయమందును భేదభావములేక ఐకమత్యముతో నుండిరి. ఆది సహజము, స్వతస్సిద్ధమునై యుండెను. అగ్నివాయువులయొక్కయు, చంద్రసముద్రులయొక్కయు సంబంధము వలె సుఖదుఃఖములందు వీడని స్నేహమేర్పడి యుండెనని భావము. గాలి అగ్ని మండుటకు సహకరించుటయు, చంద్రోదయమున సముద్రుఁడుప్పొంగుటయు లోక ప్రసిద్ధములుగదా! అలంకారము: ఉపమ.

శ్లో. తే ప్రజానాం ప్రజానాథా స్తేజసా ప్రశ్రయేణచ
మనో జహ్రు ర్నిదాఘాంతే శ్యామాభా ర్దివసా ఇవ 83

వ్యాఖ్య : ప్రజానాథాః-ప్రభువులైన, తే-ఆ రామాదులు, తేజసా-ప్రభావము చేతను, ప్రశ్రయేణ, చ-వినయము చేతను, నిదాఘాంతే (నిదాఘ + అంతే)-గ్రీష్మర్తువు ముగియు కాలమునందు, శ్యామా భాః-నల్లని మేఘములు గల, దివసాః ఇవ-దినములువలె, ప్రజానాం-జనులయొక్క, మనః-మనస్సును, జహ్రుః-హరించిరి (ఆకర్షించిరి). ప్రజానాథులైన ఆరాజకుమారులు పెరిగి జనులలోఁదిరుగుచు, గ్రీష్మాతపమువంటి తమ తేజస్సుచేతను, శ్యామాభ్రదివసములవంటి వినయము చేతను, ప్రజలకు ఆనందమును జేకూర్చుచుండి రని భావము. శ్యామాభ్రదివస

ములు ఎక్కువ ఉష్ణముగాని, ఎక్కువ శైత్యముగాని లేక హాయిని గూర్చునుగదా! "నిదాఘాంత" పదము రావణుని యవసానదశను, "శ్యామా, భదివసములు" రామాదుల చల్లదనమును వ్యక్తముచేయును. ఆలంకారము: ఉపమ.

శ్లో. స చతుర్ధా బభౌ వ్యస్తః ప్రసవః పృథివీపతేః
ధర్మార్థ కామ మోక్షాణాం అవతార ఇవాంగభాక్ 84

వ్యాఖ్య : సః-ఆ, చతుర్ధా-నాలుగు విధములుగా, వ్యస్తః-వేరువేరుగా నున్న, పృథివీపతేః-దశరథమహారాజుయొక్క, ప్రసవః-సంతానము, అంగభాక్-ప్రత్యేక శరీరములు ధరించిన, ధర్మార్థకామమోక్షాణాం-ధర్మము, అర్థము, కామము, మోక్షము అనుపురుషార్థములయొక్క, అవతారః, ఇవ-అవతారములవలె, బభౌ-ప్రకాశించెను, పురుషార్థ చతుష్టయము వేరువేరు మూర్తులను ధరించినట్లున్న ఆ నలుగురు కుమారులవలన దశరథునికి గలిగిన యానందము పురుషార్థ చతుష్టయ ప్రాప్తి యేకకాలమునందు లభించినట్లుండె నని భావము. కుమారులు మూర్తీభవించిన పురుషార్థములా? అని యూహించుటచేత నిది యుత్ప్రేక్షాలంకారము.

శ్లో. గుణై రారాధయామాసు స్తే గురుం గురువత్సలాః
త మేవ చతురంతేశం రత్నై రివ మహార్ణవాః 85

వ్యాఖ్య : గురువత్సలాః-తండ్రిపై భక్తిగల, తే-ఆ రామాదులు, గుణైః-వినయాది గుణములచేత, గురుం-తండ్రియు, చతురంతేశం-నాలుగుదిక్కులకు ప్రభువైనవాడు నగు,తం, ఏవ-ఆదశరథునినే, మహార్ణవాః-నాలుగు మహాసముద్రములు, రత్నైః, ఇవ-తమయందున్న రత్నములచేత వలె, ఆరాధయామాసుః-ఆరాధించిరి (సంతోషపెట్టిరి). తండ్రిపై నత్యంత భక్తిగల ఆ నలుగురు కుమారులును తమ వినయాది గుణములచేత, నాలుగు మహాసముద్రములు తమయందున్న రత్నములచేత చతుర్దిగీశుడగు దశరథుని ఆరాధించుచున్నట్లు అతనినే సంతోషపెట్టిరి. అనగా దశరథుడు లాలన పోషణాదుల చేత కుమారులను సంతోషపెట్టుట కంటె యెక్కువగా కుమారులే తమ వినయాది గుణములచేత తండ్రి నానందపరచి రని భావము. గుణవంతులగు కుమారులవలన తండ్రి మిక్కిలి సంతసించు నన్నది పరమార్థము. సముద్రముల నుపమానములుగా జెప్పుటచేత రామాదుల ధీరత్వ గాంభీర్యములు వ్యక్తమగుచున్నవి. అలంకారము: ఉపమ.

శ్లో. సురగజ ఇవ దంతై ర్భగ్న దైత్యాసిధారైః
నయ ఇవ పణబంధ వ్యక్తయోగై రుపాయైః
హరి రివ యుగదీర్ఘై ర్దోర్భి రంశై స్తదీయైః
పతి రవనిపతీనాం తై శ్చకాశే చతుర్భిః 86

వ్యాఖ్య: భగ్నదైత్యాసిధారైః (భగ్న, దైత్య, అసిధారైః) మొక్కఁబోవు నట్లు చేయఁబడిన, రాక్షసులయొక్క, ఖడ్గముల యంచులుగల, దంతైః-దంతము లతో, సురగజఃఇవ-ఐరావతము వలెను, పణబంధ వ్యక్త యోగైః-ఫలసిద్ధిచేత వ్యక్తములైన ప్రయోగములు గల, ఉపాయైఃసామ, దాన, భేద దండము లనఁ బడు చతురుపాయములతో, నయఃఇవ-రాజనీతివలెను, యుగదీర్ఘైఃబండికాడివలె పొడవై యున్న, దోర్భిఃబాహువులతో, హరిఃఇవ-విష్ణువు వలెను, తదీయైఃఆవిష్ణువునకు సంబంధించిన, అంశైఃఅంశభూతులైన, చతుర్భిఃతైఃనలుగురగు నా రామాది కుమారులతో, అవనిపతీనాం-రాజులకు, పతిఃఅధిపతియైన దశరథుడు చకాశే-ప్రకాశించెను. ఐరావతము దంతములు దాని శరీరభాగములే. అట్లే చతురు పాయములు నీత్యంశములే, విష్ణువు బాహువులు విష్ణుశరీరభాగములని చెప్పనక్కర లేదు గదా! అట్లే ఆత్మావైపుత్రనామాసి అను శ్రుతివాక్యము వలన దశరథుని యాత్మభాగములే రామాదులు, వారు విష్ణ్వంశ సంభూతులగుట మరియొక విశే షము. అట్టి కుమారులతో ఐరావతము వలెను, నీతిశాస్త్రమువలెను, విష్ణువువలెను రాజాధిరాజగు దశరథుఁడు ప్రకాశించె నని తాత్పర్యము. మొదటి యుపమానము చేత రామాదుల శౌర్యపరాక్రమములు, రెండవ యుపమానము చేత వారి రాజనీతి చాతుర్యము, మూడవదియగు విష్ణుబాహూపమానముచేత వారి లోకరక్షణ ధర్మాను ష్ఠాన, మహామహిమోపేతత్వములును ధ్వనించుచున్నవి. ఉపమానోపమేయములు నాలుగు సంఖ్యలోనే, పుంలింగములుగానే యుండుట గమనింపవలెను. పెక్కు ఉపమ లుండుటచేత ఇది మాలోపమాలంకారము. సర్గాంతము కనుక వృత్తము మారినది. ఇది మాలినీవృత్తము.

ఇది మహాకవి కాళిదాస కృత రఘువంశ

కావ్యమున రామావతారమను దశమ సర్గమునకు కేశవ పంతుల

నరసింహశాస్త్రి రచిత

తెలుఁగు లఘువ్యాఖ్య

శ్రీః

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

ఏకాదశసర్గము

శ్లో. కాశికేన స కిల క్షితీశ్వరో
రామ మధ్వరవిఘాతశాంతయే
కాకపక్షధర మేత్య యాచితః
తేజసాం హి న వయః సమీక్ష్యతే. 1

వ్యాఖ్య: కౌశికేన-విశ్వామిత్రునిచేత, ఏత్య-వచ్చి (అయోధ్యకువచ్చి) సః, క్షితీశ్వరః-ఆదశరథ మహారాజు, అధ్వర విఘాతశాంతయే-యజ్ఞముయొక్క విఘ్నముల శాంతి కొఱకు, కాకపక్షధరం-బాలునికి తగినజుట్టుగల (బాలుడై యున్న), రామం-శ్రీరాముని, యాచితః, ఖలు-కోరబడెనుసుమా!, తేజసాం-తేజస్వులు, అనగా పరాక్రమ వంతులయొక్క-వయః-బాల్యాది వయస్సు, న, సమీక్ష్యతే, హి-చూడబడదు కదా! కుశికవంశజుడగు విశ్వామిత్రుడు అయోధ్యకు వచ్చి తాను చేయుచున్న యజ్ఞమునకు రాక్షసులు కలిగించుచున్న ఆటంకములను తొలగించుటకై తనవెంట శ్రీరాముని బంపుమని దశరథుని వేడెను బాలుడేయై యున్నను రాముడు మహాపరాక్రమవంతుడై యున్నందున అట్లుకోరెను. పరాక్రమవంతుల విషయమున ఇతడు బాలుడా? యుక్తవయస్కుడా? వృద్ధుడా అని లోకము ఆలోచింపదుగదా! అందువలన విశ్వామిత్రుని కోరిక సమంజసమైనదే యని భావము. బాలురజుట్టుకు "కాకపక్షము" అని పేరు. "బాలానాంతు శిఖా ప్రోక్తా కాకపక్షః శిఖండకః" అని హలాయుధ నిఘంటువు. ఈసర్గయందు రథోద్ధతావృత్తము అనుసరింపబడినది. "రాన్నరావిహ రథోద్ధతా లగౌ" అని లక్షణము. రగణ, నగణ, రగణములును, ఒకలఘువు, ఒక గురువు నుండును.

శ్లో. కృచ్ఛ్రలబ్ధ మపి లబ్ధవర్ణభాక్
తం దిదేశ మునయే సలక్ష్మణమ్
అప్యసుప్రణయినాం రఘోఃకులే
న వ్యహన్యత కదాచి దర్థితా. 2

వ్యాఖ్యః లబ్ధవర్ణభాక్-ప్రసిద్ధులగు విద్వాంసులను సేవించునట్టి యాదశర థుఁడు, కృచ్ఛలబ్ధం, ఆపి-అతికష్టముచేత తనకు లభించినవాడైనను, సలక్ష్మణం-లక్ష్మణసహితుఁడగు, తం-ఆ రాముని, మునయే-విశ్వామిత్రునికి దిదేశ-ఇచ్చెను. (అదియంతే) అసుప్రణయినాం, అపి-ప్రాణములను కోరువారియొక్కయు, అర్థితా-యాచన, రఘోఃరఘుమహారాజు యొక్క, కులే-వంశమునందు, కదాచిత్-ఎప్పుడును, న వ్యహన్యత-నిరాకరింపఁబడలేదు (నిష్ఫలముగాఁ జేయబడలేదు.) అర్థికి ప్రాణములనైనను ఇచ్చునట్టి యావంశము వారికి పుత్రత్యాగము ఆశ్చర్యకరముకాదు గనుక, అనేక వ్రతములు, యజ్ఞము చేసి కన్న పుత్రుడైనను రాముని విశ్వామిత్రుని కోరిక ప్రకారము దశరథుఁడిచ్చివేసెనని భావము. లబ్ధవర్ణుఁడగాన పండితుఁడు. "లబ్ధవరో విచక్షణః" అనియమరము.

శ్లో. యావ దాదిశతి పార్థివ స్తయోఃనిర్గమాయ పురమార్గ సంస్క్రియామ్
తావ దాశు విదధే మరుత్సఖైఃసా సపుష్పజలవర్షిభి ర్ఘనైఃఃః

ప్రయాణ సన్నాహమును దశరథుఁడాజ్ఞాపింపఁగానే, దేవతలగు వాయుసఖులు ధూళిసంమార్జనమును, మేఘములద్వారా ఇంద్రుఁడు జలసేచన పుష్పవికీర్ణనాదులను వెంటనే నిర్వర్తించి రని భావము.

శ్లో. తౌ నిదేశ కరణోద్యతౌ పితు
ర్ధన్వినౌ చరణయో ర్నిపేతతుః
భూపతే రపి తయోః ప్రవత్స్యతోః
నమ్రయో రుపరి బాష్పబిందవః 4

వ్యాఖ్య: నిదేశకరణోద్యతౌ-తండ్రియాజ్ఞను నిర్వర్తించుటకు సిద్ధపడిన వారును, ధన్వినౌ-ధనుస్సులను ధరించిన వారును నగు, తౌ-ఆ రామలక్ష్మణులిద్దఱును, పితుః-తండ్రియొక్క చరణయోః-పాదములపైన, నిపేతతుః-పడిరి (నమస్కరించిరి) భూపతేః అపి-రాజుయొక్కయు, బాష్పబిందవః-కన్నీటి చుక్కలు, ప్రవత్స్యతోః-ప్రవాసమును చేయఁబోవు వారును, నమ్రయోః-నమస్కరించుచున్నవారును నగు రామ లక్ష్మణులయొక్క, ఉపరి-పైన, నిపేతుః-పడెను. ఇచ్చటి క్రియ కర్తృపదమగు బాష్పబిందువుల ననుసరించి "నిపేతుః" అని బహువచనముగా మార్చఁబడినది. పితృవాక్యమును మారుపల్కక యాచరించు రామలక్ష్మణులు ప్రయాణ సన్నద్ధులై తండ్రి పాదములయందు శిరస్సులుంచి నమస్కరించుచుండగా నెంతదాతయైనను దశరథుఁడు పుత్రవాత్సల్యముచేత ప్రవాసము చేయబోవు వారిపై కన్నీళ్ళురాల్చె నని భావము.

శ్లో. తౌ పితు ర్నయనజేన వారిణా
కించి దుక్షిత శిఖండకా వుభౌ
ధన్వినౌ త మృషి మన్వగచ్ఛతాం
పౌరదృష్టి కృత మార్గతోరణౌ. 5

వ్యాఖ్య: పితుః-తండ్రియొక్క, నయనజేన-కన్నులనుండి రాలిన, వారిణా-బాష్పోదకముచేత, కించిదుక్షితశిఖండకౌ-కొంచము తడుపబడిన జుట్టులు కలవారును ధన్వినౌ-ధనుర్ధరులును నగు, తౌ, ఉభౌ-ఆయిదఱు రామలక్ష్మణు

లును, పౌరదృష్టి కృత మార్గతోరణౌ—పౌరదృష్టి-ప్రజాసమూహపు కన్నులచేత, కృత-కల్పింపఁబడిన, మార్గతోరణౌ-దారియందు కట్టబడిన కలువపూఁదోరణములు గలవారగుచు, తం, ఋషిం-ఆవిశ్వామిత్ర ఋషిని, అన్వగచ్ఛతాం-అనుసరించి వెళ్ళిరి. "శిఖా చూడా శిఖండఃస్యాత్" అనియమరము. శిఖండ శబ్దమునకు "శేషాద్విభాషా" అనుసూత్రమువలన "క" ప్రత్యయమువచ్చి "శిఖండక" అని యైనది. వాత్సల్య పూరిత మైన తండ్రి కన్నీళ్ళతో తడిసిన తలలుగల రామ లక్ష్మణులు ధనుర్ధరులై, ప్రజలకనులే కలువదండలై మార్గము నలంకరింపగా విశ్వా మిత్రుని వెనుక నడచిరని భావము. రాముఁడు మారువల్క వెళ్ళుట పితృాజ్ఞాపరి పాలన దీక్షయొక్క పరాకాష్ఠ.

శ్లో. లక్ష్మణానుచర మేవ రాఘవం
నేతు మైచ్ఛ దృషి రిత్యసౌ నృపః
ఆశిషం ప్రయుయుజే న వాహినీం
సా హి రక్షణవిధౌ తయోఃక్షమా. 6

వ్యాఖ్య : ఋషిః-విశ్వామిత్రుఁడు, లక్ష్మణానుచరం, ఏవ-లక్ష్మణ మాత్రానుచరుఁడుగానున్న, రాఘవం-రాముని, నేతుం-తీసికొనవెళ్ళుటకు, ఐచ్ఛత్, ఇతి-కోరియున్నాఁడను కారణమువలన, అసౌ, నృపః-ఈ దశరథుఁడు, ఆశిషం-ఆశీస్సును, ప్రయుయుజే-చేసెను, వాహినీం-సైన్యమును, న ప్రయుయుజే-పంప లేదు. హి-ఏకారణమువలననైతే, సా-ఆయాశీస్సే, తయోఃఆకుమారులయొక్క, రక్షణవిధౌ-కాపాటుటయందు, క్షమా-సమర్థమైయున్నదో; విశ్వామిత్రుని కోరిక ననుసరించి రామునివెంట ఒకలక్ష్మణుని మాత్రమే పంపుచు ఆశీర్వదించెను. వారికి సైన్యసహాయ మక్కరలేదనియు, తనయాశీర్బలమును, ముని యనుగ్రహమును వారిని గాపాటునని దశరథుఁ డెఱుగునని భావము.

శ్లో. మాతృవర్గ చరణస్పృశౌ మునేః
తౌ ప్రపద్య పదవీం మహౌజసః
రేజతు ర్గతివశాత్ ప్రవర్తినౌ
భాస్కరస్య మధుమాధవా వివ. 7

వ్యాఖ్య : మాతృవర్గ చరణస్పృశౌ–తల్లుల పాదములను స్పృశించిన వారై (కౌసల్య, సుమిత్ర, కైకలను నమస్కరించినవారై), తౌ-ఆరామలక్ష్మణులు, మహౌజసః-మహాతేజస్వియగు, మునేః-విశ్వామిత్రునియొక్క, పదవీం, ప్రపద్య-మార్గమును ఆనుసరించి, భాస్కరస్య-సూర్యునియొక్క, గతివశాత్-మేషాదిరాశి సంక్రాంత్యనుసారముగా, ప్రవర్తినౌ-నడచునట్టి, మధు మాధవౌ, ఇవ-చైత్రవైశాఖ మాసములవలె, తేజతుః-ప్రకాశించిరి. తల్లులకు నమస్కరించి మహాతేజస్వియగు విశ్వామిత్రునివెంట నడచుచున్న రామలక్ష్మణులు, మేషాదిరాసులను జేరు సూర్యగతిననుసరించు చైత్ర, వైశాఖ మాసములవలె ప్రకాశించిరని భావము. ఇచ్చట విశ్వామిత్రుడు సూర్యునివలెను, రామలక్ష్మణులు, మధు. మాధవ మాసములవలెను ఉండిరని చెప్పటచేత నిది యుపమాలంకారము, చైత్ర, వైశాఖ మాసములు ఎండవేడిమి కలవియైనను పుష్పఫలభరితమగు ప్రకృతిని గలిగి యున్నట్లు రామలక్ష్మణు లాహ్లాదకరమైన తేజస్సుగలిగియుండి రనియు, విశ్వామిత్రుడు చండభానుతేజస్కుడై యుండెననియు గ్రహింపవలెను. "స్యాచ్చైత్రే చైత్రికో మధుః", వైశాఖే మాధవో రాధః" అనియమరము.

శ్లో. వీచిలోల భుజయో స్తయో ర్గతం
శైశవా చ్చపల మప్యశోభత
తోయదాగమ ఇవోద్ధ్యభిద్యయో
ర్నామధేయ సదృశం విచేష్టితమ్. ౮

వ్యాఖ్య : వీచిలోల భుజయోః-తరంగములవలె చంచలములగు భుజములగల, తయోః-ఆరామలక్ష్మణుల యొక్క, చపలం, అపి-చాపల్యముగలదై యున్నను, గతం-నడక, తోయదాగమే-వర్షాకాలమునందు, ఉద్ధ్యభిద్యయోః- ఉద్ధ్యభిద్యము లనుపేర్లుగల నదములయొక్క, నామధేయ సదృశం-పేర్లకుదగిన, విచేష్టితం, ఇవ-వ్యాపారమువలె, శైశవాత్-బాల్యమువలన, అశోభత-అందముగానే కనపడెను. బాల్యచాపల్య వశమున రామలక్ష్మణులు చేతులను ఊపుకొనుచు నడచుట చూచుటకు ముచ్చటగా నుండె ననిభావము. ఉజ్జతి ఉదకం ఇతి ఉద్ధ్యః అనియు, భినత్తి కూలం ఇతిభిద్యః అనియు నర్థములు గలయా రెండు శబ్దములును నదముల పేర్లయి యుండగా వానిని "భిద్యోద్ధ్యానదే" అని పాణిని నిపతించి, "్యకన్" ప్రత్యయాంతములుగా జెప్పెను.

శ్లో. తౌ బలాతిబలయోః ప్రభావతో
విద్యయోః పథి మునిప్రదిష్టయోః
మమ్లతు ర్న మణికుట్టిమోచితౌ
మాతృపార్శ్వ పరివర్తనా వివ. 9

వ్యాఖ్య : మణికుట్టిమోచితౌ-మణులుపరచిన నేలపై నడువఁదగిన, తౌ-ఆరామలక్ష్మణులు, మునిప్రదిష్టయోః—విశ్వామిత్రునిచే నుపదేశింపఁబడిన, బలాతిబలయోః, విద్యయోః- "బలా, అతిబలా" అనుపేర్లుగల మంత్రములయొక్క, ప్రభావతః-సామర్థ్యమువలన, మాతృపార్శ్వ పరివర్తనౌ, ఇవ-తల్లి పక్కన ఉన్న వారు వలె, పథి-మార్గమునందు, నమమ్లతుః-వాడిపోలేదు (అలసిపోలేదు). చలువ రాళ్ళు పరచిన నేలపై దిరుగు సుకుమార కుమారులైనప్పటికిని రామలక్ష్మణులు విశ్వామిత్రుఁడుపదేశించిన బలాతిబలా విద్యాప్రభావమువలన కఠినభూములపై నడచుటచేతగాని, సకాల భోజనాదులు లేనందువలనఁగాని ఆలసతఁజెందక తల్లి పక్కన నున్నట్లు సుఖముగా నుండిరని భావము. ఈ సందర్భమునందలి రామాయణ శ్లోకము ఈ విషయమును దృఢపరచుచున్నది:—

శ్లో. "కుత్పిపాసే న తే రామ! భవిష్యేతే నరోత్తమ!
బలా మతిబలాం చైవ పఠతః పథి రాఘవ!"

మార్గమునందు బలా అతిబలా మంత్రములను పఠించుచో నీకు ఆకలి దప్పులు కలుగఁబోవు రామా! అని యర్థము. ఈ విద్యల ప్రభావమువలన రాముని కరణ్యసంచారము మిక్కిలి సులభమైనది.

శ్లో. పూర్వ వృత్త కథితై ఃపురావిదః
సానుజః పితృసఖస్య రాఘవః
ఉహ్యమాన ఇవ వాహనోచితః
పాదచార మపి న వ్యభావయత్. 10

వ్యాఖ్య : వాహనోచితః-ఉత్తమాశ్వరథాదులనెక్కి ప్రయాణము చేయఁదగిన, సానుజః, రాఘవః-లక్ష్మణసహితుఁడగు రాముఁడు, పురావిదః-పురాణ

కథల నెరిగినవాడును, పిత్రసఖస్య-తనతండ్రికి మిత్రుడును నగు విశ్వా మిత్రునియొక్క, పూర్వవృత్తకథితైః-పూర్వకాలపు కథలను చెప్పుమాటలచేత, ఉహ్యమానః, ఇవ-మోసికొనిపోబడుచున్నవాని వలె, పాదచారం, అపి-కాలినడ కను గూడ, నవ్యభావయత్-మనస్సున కెక్కించుకొనలేదు. మనస్సునకు సంతోష మును గలిగించు పూర్వకథలను విశ్వామిత్రుడు చెప్పుచుండుటచేత ఆ సంతోష ములో తాను కాలి నడకన వెళ్ళుచుంటి నన్న తలంపే రామునికి గలుగలేదని భావము. ఇది లోకానుభవసిద్ధము, మధుర సంభాషణముచేయుచు మనము నడ చుచో దారి యెంతదూరమైనను క్లేశమును భావింపక వెళ్ళుదుము గదా!

శ్లో. తౌ సరాంసి రసవద్భి రంబుభిః
కూజితైః శ్రుతిసుఖైః పతత్రిణః
వాయవః సురభిపుష్పరేణుభి
శ్ఛాయయా చ జలదాః సిషేవిరే 11

వ్యాఖ్య : తౌ-ఆరామలక్ష్మణులను, సరాంసి-సరస్సులు, రసవద్భిః-మధురములగు, అంబుభిః జలములచేతను, పతత్రిణః-పక్షులు, శ్రుతిసుఖైఃచెవుల కింపైన, కూజితైఃధ్వనులచేతను, వాయవఃవాయువులు, సురభిపుష్పరేణుభిః-సువాసనగల పువ్వుల పుప్పొడులచేతను, జలదాఃమేఘములు, ఛాయయా-నీడ చేతను, సిషేవిరే-సేవించినవి. విశ్వామిత్రునివెంట కథలువింటూ వెళ్ళుచున్న రామలక్ష్మణులకు దప్పియైనప్పుడు సరస్సులు మధురజలములను, పక్షులు చెవుల కింపైన ధ్వనులను, గాడ్పులు పరిమళవంతములగు పుప్పొడులను, ఎండతగులనీక మేఘములు నీడలను ఇచ్చి సేవించినవట. మహావిష్ణుస్వరూపుడగు రాముడు తమ వద్దికి రాగానే ప్రకృతియంతయు పులకించిన దనియు, అవియన్నియు అట్లు సేవించి ధన్యములైన వనియు భావము.

శ్లో. నాంభసాం కమలశోభినాం తథా
ఛాయినాం చ న పరిశ్రమచ్ఛిదామ్
దర్శనేన లఘునా యథా తయోః
ప్రీతి మాపు రుభయో స్తపస్వినః. 12

వ్యాఖ్య : తపస్వినః-ముకులు, లఘు నా-తమకిష్టమైన, తయోః ఉభయోః-ఆరామలక్ష్మణులిద్దరియొక్క, దర్శనేన-దర్శనముచేత, యథా-ఏవిధముగానైతే, ప్రీతిం-ఆనందమును, ఆపుః-పొందిరో, తథా-ఆవిధముగా, కమల శోభినాం-కమలములతో ప్రకాశించుచున్న, అంభసాం-ఉదకములయొక్క, దర్శనేన-దర్శనముచేత గాని, పరిశ్రమచ్ఛిదాం-ఆలసటను పోగొట్టునట్టి, శాఖినాం-చెట్లయొక్క, దర్శనేనచ-దర్శనముచేతగాని, న, ఆపుః-పొందలేకపోయిరి రామలక్ష్మణుల దర్శనము వనమార్గమందలి మునులకన్నులకు హాయిగానుండె నని భావము. ఇచ్చటి "లఘు" శబ్దమునకు "ఇష్టమైన" అని యర్థము. "(తిష్వేషే ఽలేలఘూ:" అనియమగము

శ్లో. స్థాణు దగ్ధ వపుష స్తపోవనం
ప్రాప్య దాశరథి రాత్తకార్ముకః,
విగ్రహేణ మదనస్య చారుణా
సోఽభవత్ ప్రతినిధి ర్న కర్మణా 13

వ్యాఖ్య : సః-ఆ, ఉత్తకార్ముకః-పట్టుకోబడిన ధనుస్సుగల, దాశరథిః-శ్రీరాముఁడు, స్థాణుదగ్ధవపుషః-శివునిచేత దహింపబడిన శరీరముగల, మదనస్య-మన్మథుని యొక్క, తపోవనం, ప్రాప్య-తపోవనమును ప్రవేశించి, చారుణా-ఆందమైన, విగ్రహేణ-శరీరముచేత, ప్రతినిధిః-ప్రతిరూపము గలవాఁడు, (సమానుఁడు) అభవత్-అయ్యెను. కర్మణా-మన్మథుని చేతలతో మాత్రము, న-కాదు. ధనుర్ధరుఁడై యున్న రాముఁడు దేహమాత్ర సామ్యముచేత మదన సుందరుఁడై యుండెనని యు, మన్మథుఁడు చేయు మునిమనశ్చాలన రూపమైన తపోవిఘ్నమును చేయక, ముని కానందమును గలిగించు దేహ సౌందర్యము గలవాఁడుగా నుండెనని యు భావము.

శ్లో. తా సుకేతు సుతయా ఖిలీకృతే
కౌశికా ద్విదిత శాపయా పథి
నిర్వృతుః స్థలనివేశ శాటనీ
లీలయే వ ధనుషీ అధిజ్యతామ్. 14

వ్యాఖ్య : కౌశికాత్-కథలు చెప్పుచున్న విశ్వామిత్రునివలన, విదిత శాపయా-తెలియఁబడిన శాపము గలదియగు, సుకేతు సుతయా-సుకేతు పుత్రిక యగు తాటకచేత, ఖిలీకృతే-నడచుటకు వీలుపడనట్లు చెడగొట్టఁబడిన, పథి-మార్గము నందు, తౌ-ఆరామలక్ష్మణు లిద్దరును, స్థలనివేశి తాటనీ-స్థల నివేశిత-ఉంచఁదగిన చోట నుంచఁబడిన, అటనీ-ధనుస్సుల చివరిభాగములు గలవారై, లీలయా, ఇవ-అతిసులభముగానే, ధనుషీ-తమ ధనుస్సులను, అధిజ్యతాం-ఎక్కుపెట్టబడిన యల్లెత్రాటు కలవానిని-నిన్యతుః-చేసిరి తే ధనుషీ అధిజ్యతాం నిన్యతుః" అని వాక్యము. ఇది ద్వికర్మక కర్తరి ప్రయోగము. 'నీ' ధాతువట్టిది కనుక. "విదితశాపయా" అను విశేషణము, తాడకకు అగస్త్యుని వలన గలిగిన శాపమును రామలక్ష్మణులకు విశ్వామిత్రుఁడు చెప్పెనని తెలుపును. "అగస్త్యేః పరమ క్రుద్ధ స్తాడకా మభిశప్తవాన్, పురుషాదీ మహాయక్షీ విక్రతా వికృతాననా, ఇదం రూప మపాహాయ దారుణం రూప మస్తు తే" అని రామాయణ వచనము. అట్లు తాడక భయంకర రూపముతో ఖిలమైయున్న ఆ మార్గమునందు మనుష్యులను భక్షించుచున్న సంగతిని విశ్వామిత్రుఁడు చెప్పుటచేత రామలక్ష్మణులు ధనుఃకోటులను నేలపైనుంచి, వంచి, యల్లెత్రాళ్ళను బిగించి. తాడకావధార్థమై సిద్ధపడి రని భావము. "ఖిల మప్రహతం స్థానమ్" అని హలాయుధ నిఘంటువు.

శ్లో. జ్యా నినాద మథ గృహ్ణతీ తయోఃః
ప్రాదురాస బహులక్షపా ఛవిఃః
తాడకా చలకపాలకుండలా
కాలికేవ నిబిడా బలాకినీ. 15

వ్యాఖ్య : అథ-తరువాత (రామలక్ష్మణులు ధనుస్సు లెక్కపెట్టి ప్రయోగించిన పిమ్మట), తయోఃః-వారిద్దరియొక్క,జ్యానినాదం-ధనుష్టంకారమును, గృహ్ణతీ-ఎరిగినదియై (విన్నదియై), బహుల క్షపా ఛవిఃః-కృష్ణపక్ష రాత్రి వర్ణముగలదియు, చల కపాల కుండలా-కదలుచున్న తలపుత్రెల కుండలములుగల, తాడకా-తాటక, నిబిడా-దట్టమైన శరీరము గలదియు, బలాకినీ-తనచుట్టు కొంగలు గలదియు నగుచు, కాలికా, ఇవ-మేఘ పంక్తి వలె, ప్రాదురాస-ప్రత్యక్షమయ్యెను. రామ లక్ష్మణ ధనుష్టంకార ధ్వనులకు కోపించిన తాటక, నల్లని శరీరకాంతితో, తల పుత్రెల కుండలములతో, భయంకర శరీరముతో, కొంగలు తనవద్దనున్న నర

మాంసమునకై చుట్టుకొనుచుండగా మేఘపంక్తివలె ప్రత్యక్షమయ్యె నని భావము. "కాలికా" యనగా ఘనావలియని విశ్వ నిఘంటు వచనము.

శ్లో. తీవ్రవేగ ధుత మార్గవృక్షయా
ప్రేత చీవరవసా స్వనోగ్రయా
అభ్యభావి భరతాగ్రజ స్తయా
వాత్యయేవ పిత్రకాననోత్థయా 16

వ్యాఖ్య : తీవ్ర వేగ ధుత మార్గవృక్షయా-అత్యంతమైన గమన వేగముచేత ఊపివేయబడిన మార్గవృక్షములు గలదియు, ప్రేతచీవర వసా-పీనుగుల వస్త్రము లను ధరించినదియు, స్వనోగ్రయా-సింహనాదములచేత భయంకరమైన, తయా-ఆ తాటకచేత, పిత్రకాననోత్థయా-పిత్రకానన-శ్మశానము నుండి, ఉత్థయా-లేచిన, వాత్యయా, ఇవ-గాడ్పు గుంపుచేత వలె, భరతాగ్రజః-శ్రీరాముడు, అభ్యభావి-తిరస్కరింపబడెను. అతి వేగముతో చెట్లను ఊపుచు, చింకిపాతలను లేపుచు, పెద్ద ధ్వనితోగూడిన శ్మశానమునందలి సుడిగాలి వలె తీవ్రవేగాదులు గల తాటక రాముని చుట్టుముట్టె నని భావము అలంకారము : ఉపమ.

శ్లో. ఉద్యతైక భుజయష్టి మాయతీం
శ్రోణిలంబి పురుషాంత్ర మేఖలామ్
తాం విలోక్య వనితావధే ఘృణాం
పత్రిణా సహ ముమోచ రాఘవః. 17

వ్యాఖ్య : ఉద్యతైకభుజయష్టిం-ఎత్తబడిన దుడ్డుకర్రవంటి భుజముగలదియై, ఆయతీం-వచ్చుచున్నదియు, శ్రోణిలంబి పురుషాంత్రమేఖలాం—శ్రోణిలంబి-పిరుదులపై ప్రేలాడుచున్న, పురుషాంత్ర-మనుష్యుల ప్రేగులనెడు, మేఖలాం-మొలనూలు గలదియునగు, తాం-ఆ తాటకను, విలోక్య-చూచి, రాఘవః-శ్రీరాముడు, వనితావధే-స్త్రీవధయందలి, ఘృణాం-దయను, లేదా అసహ్యభావమును పత్రిణా, సహ-బాణముతోగూడ, ముమోచ-వదలెను. తనను జంపుటకై భుజమునెత్తి భయంకరముగా వచ్చుచున్న తాటకను, "స్త్రీని జంపుట పాపము"

అనుభావమును విడచి, శరముచేత గొట్టెను. ఇచ్చట నేక కాలమున రాముఁడు బాణమును స్త్రీయందలి కరుణతోపాటు విడిచెనని చెప్పుటచే నిది "సహోక్తి" అలంకారము. స్త్రీవధ పాపకృత్య మనుట నిరపరాధిని లేదా ఆతతాయిని కానట్టి స్త్రీవిషయము. ఆతతాయిత్వము (చంపఁదలచుకొని వచ్చుట) గల స్త్రీవిషయము కాదు. కనుక రామునికి స్త్రీవధ పాతకము నంటఁగట్టు విమర్శనము సరికాదు. మనువు ఆతతాయివధ దోషము కాదని యిట్లు చెప్పెను,

శ్లో. "ఆతతాయిన మాయాంతం హన్యాదేవావిచారయన్
జిఘాంసంతం జిఘాంసీయాత్ స తేన బ్రహ్మహా భవేత్
నాతతాయివదే దోషో హంతు ర్భవతి కశ్చన"

శ్లో. య చ్చకార వివరం శిలాఘనే
తాడకోరసి స రామసాయకః
అప్రవిష్ట విషయస్య రక్షసాం
ద్వారతా మగమ దంతకస్య తత్. 18

వ్యాఖ్య : సః, రామసాయకః-ఆరాముని బాణము, శిలాఘనే-రాతివలె గట్టిదై యున్న, తాడకోరసి-తాటకయొక్క వక్షస్థలమునందు, యత్, వివరం-ఏ రంధ్రమును, చకార-చేసెనో, తత్-అది, రక్షసాం-రాక్షసులయొక్క, అప్రవిష్ట విషయస్య-ప్రవేశింపని దేశముగల (ఇంతకుముందు ప్రవేశింపని రాక్షసదేశముగల). అంతకస్య-యమధర్మ రాజునకు, ద్వారతాం-ద్వారమగుటను, అగమత్-పొందెను, శ్రీరాముఁడు తాటక వక్షస్థలమున బాణముచేత చేసిన రంధ్రము యమధర్మరాజునకు రాక్షసదేశ ప్రవేశమునకు ద్వారముగా నేర్పడెను. ఇది ప్రథమ రక్షోమరణమనియు, ఇఁకమీద చచ్చురాక్షసు లెందరోగలరనియు సూచన. తాటకను శిలగా చెప్పుట ఉపమలో లింగస్వారస్యముకొఱకు "తాడకా, శిలా" శబ్దములు రెండును స్త్రీలింగములే. పాషాణ ప్రస్తరాదులు పుంలింగములు కనుక వాటిని వాడలేదు.

శ్లో. బాణభిన్న హృదయా నిపేతుషీ
సా స్వకాననభువం న కేవలామ్,
విష్టపత్రయ పరాజయ స్థిరాం
రావణశ్రియ మపి వ్యకంపయత్. 19

వ్యాఖ్య : బాణభిన్నహృదయా-రామబాణముచేత చీల్చబడిన వక్షస్థలము గలదియై, నిపేతుషీ-నేలపైఁబడిన దగుచున్న, సా-ఆతాటక, కేవలాం-ఒక, స్వకానభువం-తన యరణ్యభూమిని మాత్రమే, నవ్యకంపయత్-వణికింపలేదు, విష్ట పత్రయ పరాజయ స్థిరాం-విష్టపత్రయ-మూడు లోకముల యొక్క, పరాజయము - ఓటమిచేత, స్థిరాం - నిలువఁదొక్కుకొని యున్న, రావణశియం, ఆపి-రావణాసురుని రాజ్యలక్ష్మిని సైతము, వ్యకంపయత్-వణకించెను. రామబాణనిహతయై పడిన తాటకవలన ఆమెయున్న కానన ప్రదేశము వణకిపోయెను, ఆమెయనుచరులు గూడ భయకంపితులైరి. అంతేకాక తాటకావధ శ్రవణముచేత రావణునికిఁగూడ భయముగలిగె నని భావము. కేవల శబ్దము "కేవలం" అనినపుంసకలింగమునందు పయోగించినప్పుడు మాత్రమే నిర్ణయము అను అర్థమును దెలుపును.

శ్లో. రామమన్మథ శరేణ తాడితా
దుఃసహేన హృదయే నిశాచరీ,
గంధవ ద్రుధిరచంద నోక్షితా
జీవితేశవసతిం జగామ సా. 20

వ్యాఖ్య : సా, నిశాచరీ-ఆరాక్షసి (తాటక), దుస్సహేన-సహించుటకు శక్యముగాని, రామమన్మథశరేణ-మదన సుందరుఁడగు రామునిబాణముచేత, హృదయే-వక్షస్థలమునందు, తాడితా-కొట్టబడినదియై, గంధవద్రుధిరచందనోక్షితా-దుర్గంధముగల రక్తమను చందనముచేత పూయఁబడినదియై, జీవితేశవసంతి-సర్వ ప్రాణుల జీవితమున కధిపతియగు యమునియొక్క నివాసమునకు (నరకమునకు) జగామ-చేరెను. ఈ శ్లోకమునందలి విశేషణముల యర్థబలమున ఒక అభిసారికా నాయికావృత్తాంతము గోచరించుచున్నది. ఎట్లనగా, నిశాచరీ-రాత్రివేళ సంచారము చేయునట్టి యభిసారిక, దుస్సహేన - సహించుటకు శక్యముగాని, రామ మన్మథశరేణ-అందగాడగు మన్మథుని బాణముచేత హృదయే - మనస్సునందు, తాడితా-కొట్టబడినదియై, గంధవద్రుధిరచందనోక్షితా-పరిమళముగల కుంకుమపూవు రసముచేతను, శ్రీగంధము చేతను, పూయబడిన శరీరము గలదయై జీవితేశవసతిం-ప్రాణనాథుని మంచిరమునకు, జగామ-వెళ్లెను. అలంకారము: ప్రక్రియాప్రక్రియాశ్లేష. "హృదయం మన ఉరసోఃః" అను విశ్వనిఘంటు వచనముచేత హృదయ శబ్దమునకు వక్షస్థలము, మనస్సు రెండును అర్థము లే.

"రుధిరం కుంకుమాస్పృజోః" అనియు విశ్వామిత్రుడే. కనుక రుధిర శబ్దమునకు రక్తము, కుంకుమపువ్వు అర్థములు. "జీవితేశ" శబ్దము యౌగికార్థమున యముని, జెప్పుట చమత్కారము.

శ్లో. నైర్ఋతఘ్న మథ మంత్రవ న్మునేః
ప్రాప దస్త్ర మవదానతోషితాత్,
జ్యోతి రింధననిపాతి భాస్కరాత్
సూర్యకాంత ఇవ తాడకాంతకః 21

వ్యాఖ్య : అథ-తరువాత, తాడకాంతకః-రాముడు, అవదానతోషితాత్-తన పరాక్రమముచేత సంతోషించిన, మునేః-విశ్వామిత్రునివలన, నైర్ఋతఘ్నం-రాక్షసులను జంపునట్టి, మంత్రవత్-సమంత్రకమగు, అస్త్రం-బాణమును, సూర్యకాంతః-సూర్యకాంతమణి, భాస్కరాత్-సూర్యునివలన, ఇంధననిపాతి-కట్టెలను దహించునట్టి, జ్యోతిః, ఇవ-మంటనువలె, ప్రాపత్-పొందెను. సూర్యకాంతమణి భాస్కరుని వలన తేజస్సునువలె ప్రీతుడైన విశ్వామిత్రునివలన రాక్షసఘ్నమైన అస్త్రమును సమంత్రకముగా రాముడు స్వీకరించె నని భావము. అలంకారము: ఉపమ. "అవదాన" మనగా పరాక్రమము. "పరాక్రమోఽవదానంస్యాత్" అని భాగురి చెప్పెను. భాస్కరునితో విశ్వామిత్రునికిని, సూర్యకాంతమణితో రామునికిని పోలిక చెప్పటలో గురుశిష్యసంబంధము సహజమై రాముడు గుర్వనుగ్రహము నాకర్షించెనని సూచింపబడినది.

శ్లో. వామనాశ్రమపదం తతః పరం
పావనం శ్రుత మృషే రుపేయివాన్,
ఉన్మనాః ప్రథమజన్మచేష్టితా
న్యస్మరన్నపి బభూవ రాఘవః. 22

వ్యాఖ్య : తతఃపరం-ఆతరువాత, రాఘవః-శ్రీరాముడు, ఋషేః-కథలు చెప్పుచున్న విశ్వామిత్రునివలన, శ్రుతం-వినబడినదియు, పావనం-పవిత్రతను జేకూర్చునదియు నగు, వామనాశ్రమపదం-తన పూర్వావతారమగు వామ

నునికి నివాసమైయుండిన ఆశ్రమస్థానమును, ఉపేయివాన్-చేరినవాడగుచు, ప్రథమజన్మచేష్టితాని-పూర్వజన్మ కృతములగు విషయములను, అస్మరన్, అపి-స్మరించుకొనలేనివాడైనను, ఉన్మనాః-ఒక విధమగు ఔత్సుక్యము గలవాడు, బభూవ-అయ్యెను. విశ్వామిత్రుని కథాకథన ప్రసక్తిలో వచ్చిన వామనాశ్రమును జేరినప్పుడు శ్రీరామునికి తన పూర్వజన్మస్మృతి లేకపోయినను, అజ్ఞాతసంస్కార ప్రాబల్యమువలన మనస్సులో నొక సంతోషోద్వేగముగల ఔత్సుక్యము గలిగెనని భావము. భారతీయ వేదాంతసిద్ధాంతము ననుసరించి మానవునికి సంభవించు జన్మ పరంపరలో ప్రాక్తనసంస్కార బలమువలన మనోవికారములు గలుగుచుండునని భావము.

శ్లో. ఆససాద ముని రాత్మన స్తతః
శిష్యవర్గ పరికల్పితార్హణమ్,
బద్ధ పల్లవపుటాంజలి ద్రుమం
దర్శనోన్ముఖ మృగం తపోవనమ్. 23

వ్యాఖ్య : తతః-తరువాత, మునిః-విశ్వామిత్రుడు, శిష్యవర్గ పరికల్పితార్హణం-శిష్యవర్గ-శిష్యబృందముచేత, పరికల్పిత-సిద్ధముచేయబడిన, అర్హణం (అర్హా అస్మిన్ అస్తి ఇతి అర్హణం)-పూజాసామగ్రి గలదియు, బద్ధ పల్లవ పుటాంజలి ద్రుమం-బద్ధ-జోడించుకున్న, పల్లవపుట-దొన్నెలవలెనున్న చిగురాకులే, అంజలి-దోయిళ్ళుగాగల, ద్రుమం-వృక్షములు గలదియు, దర్శనోన్ముఖ మృగం-విశ్వామిత్రదర్శనముకోసమై పైకిచాచిన ముఖములు గల లేళ్ళతోగూడి నదియునగు, ఆత్మనః-తనయొక్క, తపోవనం-తపోవనమును, ఆససాద-చేరెను. అతిథిసత్కార, భక్తి, వినయాదులను ఆశ్రమమునందలి శిష్యవర్గము, వృక్షములు, మృగములు సైతముపాటించు శాంతినిలయమగు తన యాశ్రమమును రామలక్ష్మణ సమేతుడగు విశ్వామిత్రుడు చేరెనని భావము.

శ్లో. తత్ర దీక్షిత మృషిం రరక్షతు
ర్విష్ణుతో దశరథాత్మజౌ శరైః
లోక మంధతమసాత్ క్రమోదితౌ
రశ్మిభిః శశి దివాకరా వివ. 24

వ్యాఖ్య : తత్ర-అచ్చట (విశ్వామిత్రుని తపోవనమునందు), దశరథాత్మజౌ-దశరథుని కుమారులిద్దఱును (రామలక్ష్మణులు), దీక్షితం-యజ్ఞదీక్షా సంస్కారమును పొందిన, ఋషిం-విశ్వామిత్రుని, శరైః-బాణములచేత, విఘ్నతః-విఘ్నముల నుండి, క్రమోదితౌ-వరుసగా ఉదయించిన (రాత్రియందుఁను, పగటియందును) శశి దివాకరౌ-చంద్రుఁడును, సూర్యుఁడును, రశ్మిభిః-కిరణములచేత, అంధతమసాత్-గాఢాంధకారమునుండి, లోకం, ఇవ-ప్రాణిసమూహమును వలె, రరక్షతుః-రక్షణ చేయుటకుఁ బూనిరి. రాత్రియందు చంద్రుడును, పగటివేళ సూర్యుఁడును వరుసగా లోకమును గాఢాంధకారమునుండి కాపాడునట్లు, యజ్ఞదీక్షితుఁడైన విశ్వామిత్రుని, తమశరములచేత రాక్షసులు చేయువిఘ్నముల నుండి రక్షించుటకై, ఒకరి తరువాత నొకరు జాగరూకులై యుండిరని భావము. అలంకారము:ఉపము.

శ్లో. వీక్ష్య వేది మథ రక్తబిందుభి
ర్బంధుజీవ పృథుభిః ప్రదూషితామ్,
సంభ్రమో ఽభవ దపోధకర్మణాం
ఋత్విజాం చ్యుత వికంకత స్రుచామ్. 25

వ్యాఖ్య : అథ-అతరువాత, బంధుజీవ పృథుభిః-మంకెనపూలయంత పెద్ద వియగు, రక్తబిందుభిః-నెత్తురుచుక్కలచేత, ప్రదూషితాం-కలుషితముచేయఁబడిన వేదిం-యజ్ఞవేదికను, వీక్ష్య-చూచి, అపోధకర్మణాం-వదలివేయఁబడిన తమతమ పనులు గలిగినట్టియు, చ్యుత వికంకత స్రుచాం-చేతులనుండిజాఱినపుల్లవెలగకట్టలతో చేసిన స్రుక్కులుగలిగినట్టియు, ఋత్విజాం-యజ్ఞమునందు సహకరించు ఋత్విజులయొక్క, సంభ్రమః-సంచలనము, అభవత్-జరిగెను. యజ్ఞవేదికమీద పెద్ద పెద్ద నెత్తురుచుక్కలుపడి దూషితమైపోగా, దానిని చూచిన ఋత్విజులకు భయము కలిగి, వారిచేతులనుండి స్రుక్ స్రువములు జారిపడెననియు, వారు తమపనులనుమాని కంగారుతో కలవరపాటుఁజెంది రనియు భావము, హోమము చేయునప్పుడుపయోగించు గరిటెలపంటి కట్టపనిముట్లకు స్రుక్ స్రువము లనిపేరు. వాటినిచంద్ర, పుల్ల వెలగకట్టలతో చేయవలెనని శాస్త్రము.

శ్లో. ఉన్ముఖః సపది లక్ష్మణా గ్రజో
బాణ మాశ్రయముఖా త్సముద్ధరన్

రక్షసాం బల మపశ్య దంబరే
గృధ్రపక్ష పవనేరిత ధ్వజమ్. 26

వ్యాఖ్య : సపది-తక్షణమే, లక్ష్మణాగ్రజః-రాముఁడు, బాణం-బాణమును, ఆకాశయముఖాత్-అంబుఁపొదినుండి, సముద్ధరన్- పైకిఁదీయుచున్న వాఁడగుచు, ఊర్ధ్వముఖః-ఆకాశమువైపున కెత్తిన ముఖముగలవాఁడై అంబరే- ఆకాశమునందు, గృధ్రపక్షపవనేరితధ్వజం—గృధ్రపక్ష-గ్రద్దలరెక్కలయొక్క, పవన-గాలిచేత, ఈరిత-కదలింపబడిన, ధ్వజం-రథముల జెండాలు గలదియగు, రక్షసాం-రాక్షసుల యొక్క, బలం-సైన్యమును, అపశ్యత్-చూచెను. యజ్ఞవేదిక రక్తమలినము కాగానే తూణీరమునుండి బాణమును దీయుచు, ఆకసమువైపుకు చూచిన రామునికి గ్రద్దల రెక్కలగాలిచే రెపరెప లాడుచున్న రథకేతనములు గల రాక్షససైన్యము కనపడె నని భావము. రథములపైన గ్రద్దలాడుట రాక్షసులకు దుశ్శకునము. "ఆసన్నమృ త్యోర్బిభేకి చరంతి గృధ్రాదయో మూర్ధ్ని గృహోర్ధ్వభాగే" గద్దలుమొదలగుపక్షులు మృత్యువుసమీపించిన వ్యక్తితలపైనగాని, ఇంటిపైభాగమునందు గాని తిరుగును అని శకునార్ణవమునందుకలదు.

శ్లో. తత్ర యా వధిపతీ ముఖద్విషాం
తౌ శరవ్య మకరో త్స నేతరాన్
కిం మహోరగ విసర్పి విక్రమో
రాజిలేషు గరుడః ప్రవర్తతే? 27

వ్యాఖ్య : సః-ఆరాముఁడు, తత్ర- ఆరాక్షససైన్యమునందు, యౌ-ఏయి ద్దఱు, ముఖద్విషాం-రాక్షసులకు, అధిపతీ- అధిపతులైయున్నారో, తౌ-ఆయిద్దఱగు సుబాహు, మారీచులను, శరవ్యం-తనబాణమునకు లక్ష్యముగా, అకరోత్-చేసెను. ఇతరాన్-ఇతరరాక్షసులను, న-కాదు; (తథాహి-అదియుక్తమే) మహోరగ విసర్పి విక్రమః-మహాసర్పములపైఁబడు పరాక్రమముగల, గరుడః-గరుత్మంతుఁడు రాజి లేషు-ఆల్పములగు జలజంతువులపైకి, ప్రవర్తతేకిం?-వెళ్ళునాయేమి? వెళ్ళదు అని అర్థము. శ్రీరాముఁడారాక్షససైన్యపతులగు సుబాహు మారీచుల పైకి దనబాణము లను వేయఁ బూనెను గాని యల్పులగు నితరరాక్షసుల పైకిఁ గాదు. గరుత్మంతుడు

మహాసర్పముల మీదికి వెళ్ళునుగాని జలజంతువుల పైకి వెళ్ళడుగదా! అనితాత్పర్యము. అలంకారము:అర్థాంతరన్యాసము."అలగర్దో జలవ్యాలః సహౌరాజిలడుండుభౌ అనియమరము.

శ్లో. సోఽస్త్ర ముగ్రజవ మస్త్రకోవిదః
సందధే ధనుషి వాయుదైవతమ్
తేన శైలగురు మప్యపాతయత్
పాండు పత్ర మివ తాడకా సుతమ్. 28

వ్యాఖ్య : అస్త్రకోవిదః-బాణవిద్యాపండితుడగు, సః-ఆరాముడు, ఉగ్ర జవః-మిక్కిలివేగముగల, వాయుదైవతం-వాయువు దేవతగాగల, అస్త్రం-వాయవ్యాస్త్రమును, ధనుషి-ధనుస్సునందు, సందధే-ఎక్కుపెట్టెను. తేన-ఆయస్త్రముచేత శైలగురుంఅపి- పర్వతమంతటియెత్తు, బరువునుగలవాడైనను, తాడకాసుతం-మారీచుని, పాండుపత్రం, ఇవ-ఒక పండుటాకునువలె, అపాతయత్-పడవేసెను. మహావేగముగల వాయవ్యాస్త్రముచేత శ్రీరాముడు పర్వతాకారముతో నున్న మారీచుని పండుటాకునువలె నేలపైగూల్చె నని భావము.అస్త్రకోవిద శబ్దము శ్రీరాముడెప్పుడెవ్వని మీద నెట్టి బాణమును ప్రయోగింపవలెనో యెఱిగియుండె ననితెలుపుచున్నది.

శ్లో. యః సుబాహు రితి రాక్షసోఽపరః
తత్ర తత్ర విససర్ప మాయయా
తం శురప్ర శకలీకృతం కృతీ
పత్రిణాం వ్యభజ దాశ్రమాత్ బహిః 29

వ్యాఖ్య : సుబాహుః, ఇతి-సుబాహువనుపేరుగల, యః-ఏ, అపరః-మరియొకడగు, రాక్షసః-రాక్షసుడు (గలడో)వాడు) తత్రతత్ర-ఆశ్రమప్రాంతము నందచ్చటచ్చట, మాయయా-మాయచేత, విససర్ప-సంచరించుచుండెను. శురప్ర శకలీకృతం-బాణములచే ముక్కముక్కలుగా జేయబడిన, తం-ఆసుబాహువును, కృతీ-నేర్పరియగు రాముడు, ఆశ్రమాత్-ఆశ్రమమునుండి, బహిః-వెలుపల,పత్రి

ణా౨-పక్షులకు, వ్యభజత్-పంచియిచ్చెను.రాముడు, రెండవరాక్షసుఁడగుసుబాహువు దొంగచాటుగా నాశ్రమమం దచ్చటచ్చట తిరుగుచుండగా వానిశరీరమును బాణము లచేత ముక్కలుముక్కలుగాఁజేసి, ఆశ్రమానికి దూరప్రదేశమున బక్షులకు పంచియిచ్చెనని భావము. ఇందలి 'కృతీ' శబ్దము, రాముఁడు సుబాహుని ముక్కలు చేయుటయేకాక ఆమాంసఖండము లాశ్రమమందుపడి కశ్మలముజేయనీయక బహిఃప్రదేశమునఁబడునట్లుచేసె ననుఅర్థమును జెప్పును. "కృతీచకుశలఃసుధౌ" అని యమరము.

శ్లో. ఇ త్యపాస్త ముఖ విఘ్న యోస్తయోఃసాంయుగీన మభినంద్య విక్రమమ్బుత్విజఃకులపతే ర్యథాక్రమంవాగ్యతస్య నిరవర్తయ క్రియాఃఇతి-ఈవిధముగా, అపాస్తముఖవిఘ్నయోఃతొలగింపబడినయాగవిఘ్నములుగల, తయోఃఆరామలక్ష్మణులయొక్క, సాంయుగీనం-యుద్ధమునందుచక్కగాప్రకటింపఁబడిన్నవిక్రమం-పరాక్రమమును, అభినంద్య-మెచ్చుకొని,బుత్విజఃబుత్విక్కులు, వాగ్యతస్య-మౌనదీక్షనువహించిన, కులపతేః-మునిబృందాధిపుడగు విశ్వామిత్రునియొక్క, క్రియాఃయజ్ఞకార్యములను, యథాక్రమం-వరుసగా నిరవర్తయన్-పూర్తిచేసిరి. ఆట్లు రామలక్ష్మణులు మారీచసుబాహుప్రభృతి రాక్షసులను దొలగింపగా బుత్విజులు నిర్భయముగా యజ్ఞకృత్యములను నిర్వర్తించిరి.

శ్లో. తౌ ప్రణామచల కాక పక్షకౌభ్రాతరా వవభృథాప్లుతో మునిఃఆశిషా మనుపదం సమస్పృశత్దర్భపాటిత తలేన పాణినా. 31

వ్యాఖ్య : అవభృథాప్లుతఃఅవభృథ-యజ్ఞదీక్షాంతమునందు, ఆప్లుతఃస్నానముచేసిన, మునిఃవిశ్వామిత్రుఁడు, ప్రణామచల కాకపక్షకౌ-వంగి నమస్కరించుటచేత కదలుచున్న చిన్న జుట్లుగల, తౌ, భ్రాతరౌ-ఆయిద్దరన్న దమ్ము

లను, ఆశిషాం, అనుపదం-ఆశీర్వచనముల వెంటనే, దర్భ పాటిత తలేన-దర్భల చేత గ్రుచ్చబడిన ఆరచేయిగల, (పవిత్రముగల) పాణినా-హస్తముచేత, సమస్త శత్-తాకెను (నిమిరెను). యజ్ఞదీక్షాంతమున నదీస్నానముచేసిన విశ్వామిత్రుని పాదములనంటి నమస్కరించుచున్న రామలక్ష్మణుల తలలపై పవిత్రసహితమగు హస్తముచేత ప్రేమసంతోషములతో విశ్వామిత్రుడు స్పృశించె ననిభావము. రామ లక్ష్మణుల పరాక్రమముచేత తన యజ్ఞము పరిసమాప్తి నొందుట విశ్వామిత్రుని యానందమునకు కారణమని భావము. "చలకాకపక్షకౌ" అనుపదము రామలక్ష్మణుల బాల్యమును దెలుపును.

శ్లో. తం న్యమంత్రయత సంభృత క్రతు
రైక్ష్వాకిలః స మిథిలాం వ్రజన్ వశీ
రాఘవా వపి నినాయ బిభ్రతౌ
తద్ధనుః శ్రవణజం కుతూహలమ్. 32

వ్యాఖ్య : సంభృతక్రతుః-కూర్చుకోబడిన సంభారములతో యజ్ఞమును జేయ దలపెట్టిన, ఐక్ష్వాకిలః-మిథిలానాథుడగు జనకుడు, తం-ఆవిశ్వామిత్రుని, న్యమంత్రయత-యజ్ఞమునకాహ్వానించెను. వశీ-ఇంద్రియనిగ్రహముగల, సః-ఆ విశ్వామిత్రుడు, మిథిలాం, వ్రజన్-జనకరాజధానికి వెళ్ళుచు, తద్ధనుశ్శ్రవణజం-ఆ జనకుని ధనుస్సును గురించి విరుటచేత గలిగిన, కుతూహలం-దానిని చూచుట కుత్సాహమును, బిభ్రతౌ-ధరించుచున్న (వాంఛగల), రాఘవౌ, అపి-రఘువంశ దీపకులగు రామలక్ష్మణులను సైతము, నినాయ-తీసుకవెళ్ళెను. తానుచేయు యజ్ఞము పరిసమాప్త మగుటచేత సంతుష్టుడైయున్న విశ్వామిత్రునికి జనకుడు తలపెట్టిన యజ్ఞమునకు రమ్మని యాహ్వానము వచ్చెను. లోకప్రసిద్ధమై జనకుని వద్దనున్న ధనుస్సును జూడవలెనని కుతూహలపడుచున్న రామలక్ష్మణులను సైతము వెంటబెట్టుకొని విశ్వామిత్రుడు మిథిలకు వెళ్ళెనని భావము.

శ్లో. తైః శివేషు వసతి ర్గతాధ్వభిః
సాయ మాశ్రమతరు ష్వగృహ్యత
యేషు దీర్ఘతపసః పరిగ్రహో
వాసవ ఋణ కలత్రతాం యయౌ. 33

వ్యాఖ్య : గతాధ్వభిః-నడువబడినమార్గముగల (కొంతదూరమునడచిన) తైఃఆ ముగ్గురిచేత (విశ్వామిత్ర రామ లక్ష్మణులచేత), సాయం-సాయంకాలము నందు, శివేషు-రమ్యములగు, ఆశ్రమతరుషు-ఆ శమవృక్షములక్రింద, వసతిః-నివాసము,అగృహ్యత-స్వీకరింపఁబడెను, యేషు-ఏవృక్షములక్రింద, దీర్ఘ తపసః-సుదీర్ఘముగా తపస్సుచేయుచుండిన గౌతమునియొక్క,పరిగ్రహః-భార్య (అహల్య), వాసవ క్షణ కళత్రతాం-వాసవ-ఇంద్రునికి, క్షణ-స్వల్పకాలము, కళత్రతాం-భార్యగానుండుటను, యయౌ-పొందెనో. మిథిలకు బయలుదేరిన విశ్వామిత్ర రామ లక్ష్మణులు, కొంతమార్గమునుదాటి సాయంకాలమునందు చల్లనినీడను, పరిమళ మును ఇచ్చు గౌతమాశ్రమమునందలి వృక్షములక్రింద బసచేసిరి. ఆచోటు ఇంద్రుఁడ హల్యాసంభోగమును జేసిన గౌతమాశ్రమప్రదేశము, "దీర్ఘ తపసః" అను గౌతమ విశేషణము, "శివేషు" అ వృక్షవిశేషణమును, ఇంద్రాహల్యల కలయికకు ఈ ప్రదేశము, ఆనుకూల్యమును గలిగించియుండెనని సూచించుచున్నవి.

శ్లో. ప్రత్య పద్యత చిరాయ యత్పున
శ్చారు గౌతమ వధూః శిలామయీ
స్వం వపుః స కిల కిల్బి షచ్ఛిదాం
రామపాద రజసామను గ్రహః 34

వ్యాఖ్య : శిలామయీ-భర్తశాపమువలన రాయిగా మారిన, గౌతమవధూః-గౌతమునిభార్య (అహల్య), చారు-అందమైన, స్వం-తనదియగు, వపుః-శరీరమును, చిరాయ-బహుకాలమునకు, పునః-మరల, ప్రత్యపద్యత, యత్-పొందెనుట యేది కలదో, సః-ఇది, కిల్బిషచ్ఛిదాం-పాపమును హరించునట్టి, రామపాద రజసాం-శ్రీరాముని పాదధూళుల యొక్క, అనుగ్రహః, కిల-ప్రసాదమేకదా! పాషాణమై పడియున్న అహల్య సుందరమగు తనపూర్వరూపమును బహుకాలము తరువాత పొందుట రామపాదరజస్సుయొక్క అనుగ్రహబలమే యని లోకముచెప్పునని భావము. స్త్రీలింగమగు శిలాశబ్దము అహల్యా ప్రతిరూపముగా చెప్పబడుటయుక్తముగా నున్నది,

శ్లో. రాఘవాన్విత ముపస్థితం మునిం
తం నిశమ్య జనకో జనేశ్వరః,

అర్థకామసహితం సపర్యయా
దేహబద్ధ మివ ధర్మ మభ్యగాత్. 35

వ్యాఖ్య : రాఘవాన్వితం-రఘువంశమునందుపుట్టిన రామలక్ష్మణులకూతోడి నవాఁడై, ఉపస్థితం-వచ్చిన, తం, మునిం-ఆవిశ్వామిత్రుని (గురించి) జ న కః-జనకుఁడను పేరుగల, జనేశ్వరః-రాజు, నిశమ్య-విని, అర్థకామసహితం-అర్థ కామ పురుషార్థములతోఁ గూడినదియు, దేహబద్ధం-మూర్తీభవించినదియు నగు, ధర్మం ఇవ,-ధర్మమునువలె, సపర్యయా-పూజావిధానముతో, అభ్యగాత్-ఎదురేగి స్వాగతముచెప్పెను. అర్థ కామసహిత ధర్మ పురుషార్థమువలెవచ్చిన రామలక్ష్మణ సహితుఁడగు విశ్వామిత్రుని జనకుఁడు భక్తి గౌరవ పురస్సర పూజావిధానముతోనెదుర్కొనెనని భావము.

శ్లో. తౌ విదేహనగరీ నివాసినాం
గాం గతౌ వివ దివః పునర్వసూ,
మన్యతే స్మ పిబతాం విలోచనైః
పక్ష్మపాత మపి వంచనాం మనః. 36

వ్యాఖ్య : దివః-ఆకాశమునుండి, గాం-భూమిని, గతౌ-చేరిన, పునర్వసూ, ఇవ-పునర్వసునక్షత్రాధి దేవతల వలెనుండిన, తౌ-ఆరామలక్ష్మణులను,విలోచనైః-విప్పారిన నేత్రములచేత,పిబతాం-త్రాగుచుండిన (రెప్పవాల్చక ఆసక్తితో చూచుచుండిన) విదేహనగరీ నివాసినాం-మిథిలానగర వాసుల యొక్క, మనః-మనస్సు పక్ష్మపాతం, అపి-రెప్పవాలుటసైతము, వంచనాం-మోసమునుగా మన్యతేస్మ-తలచెను. 'స్మ' అనునది చేరినప్పుడు, భూతకాలిక మగు నర్థముగల క్రియకువర్తమాన (లట్) రూపముండును. మహామంగళప్రదమగు పునర్వసూనక్షత్రమునకు అధిదేవత అదితి, ఆమెదేవమాత,ఆట్టిచల్లని నక్షత్రము ఆకాశమునుండి నేలపైకి వచ్చినట్లు కనఁబడుచున్న రామలక్ష్మణుల సౌందర్యమును జూచుచున్న మిథిలావాసుల మనస్సునకు రెప్పపాటుగూడ విఘ్నముగాఁ దోచెనని భావము. శ్రీరాముఁడు పునర్వసూనక్షత్రమునందు జన్మించియుండుటయు, ఆనక్షత్రజాతుఁడు సత్యవాది, సుగుణుడు ఉత్సాహి, త్యాగి, విభవసంపన్నుఁడు నగునని జ్యోతిశ్శాస్త్రము చెప్పుటయు, సీయు త్రైష్టకుఁగా రణములై యుండును.

శ్లో. యూపవ త్యవసితే క్రియావిధౌ
కాలవిత్ కుశికవంశ వర్ధనః,
రామ మిష్వసన దర్శనోత్సుకం
మైథిలాయ కథయాంబభూవ సః. 37

వ్యాఖ్య : యూపవతి-పశుబంధనస్తంభము గలదియగు, క్రియావిధౌ-కర్మానుష్ఠానము, అవసితే (సతి)-ముగిసినదికాగా(యజ్ఞము పరిసమాప్తిని చెందినదికాగా), కాలవిత్-సమయము నెఱిఁగినవాఁడగు, కుశికవంశ వర్ధనః-కుశికవంశము నున్నతస్థితికిఁదెచ్చినవాఁడగు, సః-ఆవిశ్వామిత్రుఁడు, రామం-రాముని, ఇష్వసన దర్శనోత్సుకం-శివధనుస్సును చూచుటయందలి కుతూహలము గలవానినిగా, మైథిలాయ-జనకునికొఱకు, కథయాంబభూవ-చెప్పెను. జనకుఁడు యజ్ఞదీక్షానిరతుఁడైయున్నప్పుడూరకయుండి, యజ్ఞము ముగియగానే విశ్వామిత్రుఁడు జనకునికి రాముని ధనుర్దర్శన కుతూహలమును సమయము చూచుకొని చెప్పెనని భావము. "ఇష్వసనం" అనగా చాపము. అస్యతే అనేన ఇత్యసనం, ఇషూణాం అసనం-ఇష్వసనం అని విగ్రహము.

శ్లో. తస్య వీక్ష్య లలితం వపుః శిశోః
పార్థివః ప్రథితవంశ జన్మనః,
స్వం విచింత్య చ ధను ర్దురానమం
పీడితో దుహిత్ర శుల్క సంస్థయా. 38

వ్యాఖ్య : పార్థివః-జనకుఁడు, ప్రథితవంశ జన్మనః-ప్రథిత-సుప్రసిద్ధమైన, వంశ-రఘువంశమునందు, జన్మనః-పుట్టుకగల, శిశోః, తస్య-బాలుఁడైయున్న ఆ శ్రీరామునియొక్క, లలితం, వపుః-సుకుమార సుందరమైయున్న శరీరమునున్న, స్వం-తనదియు, దురానమం-వంచుట కశక్యమైనదియునగు, ధనుః చ-ధనుస్సునున్న, విచింత్య-ఆలోచించి, దుహిత్ర శుల్క సంస్థయా-తన కూతురగు సీతకు అల్లుఁ డీయవలసిన శుల్కము (ఓలి) ఆధనుర్భంగ యాపమై

యుండుటచేత, పీడితః-బాధింపఁబడెను. ఉత్తమవంశజుఁడు, సుకుమార సుందర శరీరుఁడగు రాముఁడు తన కల్లుఁడైనచో బాగుండు నను వాంఛగలిగిన జనక చక్రవర్తి రాముని శిశుత్వమును, శుల్కరూపమై వంచుటకు శక్యముగాని శివధనుస్సును చూచి, బాలుఁడగు రాముఁ డీధనుస్సును వంచజాలఁడే! యని మనస్సునందు బాధపడె నని భావము. "శుల్క" మనగా జామాత కన్యకై యీయవలసిన ఓలి. "సంస్థా" అనగా స్థితి యని నైఘంటికార్థములు.

శ్లో. అబ్రవీ చ్చ భగవ! మతంగజై
ర్య దబ్బృహద్భి రపి కర్మ దుష్కరమ్,
తత్ర నాహ మనుమంతు ముత్సహే
మోఘవృత్తి కలభస్య చేష్టితమ్. 39

వ్యాఖ్య : హే భగవన్–షడ్గుణైశ్వర్య సంపన్నుఁడవగు మునీంద్రా! బృహద్భిః-గొప్పవియగు, మతంగజైరపి–ఏనుగులచేతనైనను, దుష్కరం-చేయుటకు సాధ్యపడని, యత్, కర్మ-ఏపనికలదో, తత్ర-ఆపనియందు, కలభస్య-ఏనుఁగుపిల్లయొక్క, మోఘవృత్తి-వ్యర్థవ్యాపారముగల, చేష్టితం-ప్రయత్నమును, అనుమంతుం-అంగీకరించుటకు, అహం-నేను, నోత్సహే (న + ఉత్సహే)-ఇష్టపడను. అని, అబ్రవీత్, చ-అనెను కూడ. పూజ్య విశ్వామిత్రమునీ! మహాగజముల చేతనే కాని పనికి ఒక బాలగజము పూనుకొనుటను నేను అంగీకరింపఁజాల నని జనకుఁ డనెను. అనగా మహావీరులగు ధనుర్ధరు లెందరో ఈశివధనుస్సును గదిలింప లేకపోయిరి. బాలుఁడగు ఈరాముఁ డెట్లు దీనిని వచగలఁడు? అని జనకుని భావము. "ఉత్పత్తిం చ, వినాశం చ, భూతానా మాగతిం,గతిమ్, వేత్తి విద్యా మవిద్యాం చస వాచ్యో భగవాన్ ఇతి" జగత్తులోని ప్రాణులన్నియు నెట్లు పుట్టుచున్నవి? ఎట్లు నశించుచున్నవి? ఎక్కడినుండి వచ్చుచున్నవి? ఎక్కడికి వెళ్ళుచున్నవి? విద్య యనగ నేది? అవిద్య అనగా నేది? అను విషయములు తెలిసిన మహాపురుషుని "భగవన్!" అని పిలువవలెను. జనకుఁడు విశ్వామిత్రుని నట్లు సంబోధించుటచే నతఁ డట్టివాడని తెలియవలయును.

శ్లో. ప్రాపితా హి బహవో నరేశ్వరాః
తేన తాత! ధనుషా ధనుర్భృతః,

జ్యా నిఘాత కఠిన త్వచో భుజాఁ
స్వాఁ విధూయ ధిగితి ప్రతస్థిరే. 40

వ్యాఖ్య: హే తాత-ఓతండ్రీ! తేన,ధనుషా-ఆ చాపములచేత, బహవః-అనేకులగు, ధనుర్భృతః-ధనుర్ధరులైన, నరేశ్వరాః-రాజులు, హేపితా హి-సిగ్గుపరుపబడిరి సుమా, (వారు) జ్యా నిఘాత కఠిన త్వచః-అల్లెత్రాటి దెబ్బలచేత గట్టిపడిన చర్మములుగల, స్వాన్, భుజాన్-తమభుజములను, ధిగితి(ధిక్ + ఇతి)-"ఛీ" యని, విధూయ-అవమానించుకొని, ప్రతస్థిరే-బయలుదేరి వెళ్ళిపోయిరి. ఓతండ్రీ! ఆశివధనుస్సుచేత సిగ్గుపరుపబడిన అనేకరాజులు, అంతకు పూర్వము వివిధ సందర్భములయందు తాము చేసిన ధనుష్టంకారములచేత అల్లెత్రాడు తాకి గరుసువారిన తమ భుజములను, శివధనుస్సును గదిలింపఁజాలనందున "ఛీ" యని తిట్టుకొని తమదారిన తాము నిరాశతోఁ దిరిగి వెళ్ళిరని జనకుఁడు విశ్వామిత్రునికిఁ జెప్పెను. కాగా ఈ బాలుఁడైన రాముఁ డెట్లు దాని నెత్తఁగలఁడని భావము.

శ్లో. ప్రత్యువాచ త మృషి ర్నిశమ్యతాం
సారతో ఽయ మథవా గిరా కృతమ్,
చాప ఏవ భవతో భవిష్యతి
వ్యక్తశక్తి రశని ర్గిరా వివ. 41

వ్యాఖ్య: అయం-ఇతఁడు (రాముఁడు), సారతః-బలముచేత, నిశమ్యతాం-వినఁబడుచుగాక; అథవా-ఆట్లుకాక, గిరా, కృతం-ధనుస్సార వర్ణనమును చాలించుము. అశనిః-వజ్రాయుధము, గిరౌ, ఇవ-పర్వతమునందువలె, చాపే, ఏవ-ధనుస్సునందే, భవతః-నీకు, వ్యక్తశక్తిః-స్పష్టముగాఁ దెలిసిన బలముగలవాఁడు, భవిష్యతి-కాఁగలఁడు, ఇతి-ఇట్లని, ఋషిః-విశ్వామిత్రమునిని, తం-ఆజనకుని గుఱించి, ప్రత్యువాచ-బదులు పలికెను. ఈరాముని బలసారముతో నితనిని గుర్తింపుము, అంతేకాని యీధనుర్గుణ వర్ణనమువలన నేమి లాభము? వజ్రాయుధ బలము పర్వతముపైఁవలె నతనిబలము నిధనుస్సునందే కనఁబడును. అని విశ్వామిత్రుఁడు జనకునికి బదులు చెప్పెను. "కృతం" అనునది చాలును అను అర్థముగల అవ్యయము.

శ్లో. ఏవ మాప్తవచనా త్స పౌరుషం
కాకపక్షకధరే ఽపి రాఘవే,
ప్రేక్షతే ప్రతిదశగోప మాత్రకే
దాహశక్తి మివ కృష్ణవర్త్మని. 42

వ్యాఖ్య : ఆప్తవచనాత్-ఆప్తుఁడగు విశ్వామిత్రునియొక్క మాటవలన, సః-ఆజనకుఁడు, కాకపక్షకధరే, అపి-బాలుఁడైనప్పటికిని, రాఘవే-రామునియందు, పౌరుషం-పరాక్రమమును, ప్రతిదశగోప మాత్రకే-ఆర్ద్ర పురుగంతగానుండిన, కృష్ణవర్త్మని-అగ్నియందు,దాహశక్తిం,ఇవ-దహించు శక్తినివలె,ప్రేక్షతే-నమ్మెను, చెప్పినమాట ఆప్తుఁడగు విశ్వామిత్రుని దగుటవలన జనకుఁడు బాలుఁడై యున్నను రామునియందలి పరాక్రమమును, చిన్న ఆర్ద్రపురుగు ప్రమాణమునందున్న అగ్నియందు దహింపఁగలశక్తిని వలె విశ్వసించె నని భావము. ఆప్తుఁడనగా ప్రయథార్థ వక్తయగు ఇష్టజనుఁడు. 'కాకపక్షక, ప్రతిదశగోపమాత్రక' శబ్దములయందలి 'క' ప్రత్యయములు స్వార్థమునం దుపయోగింపఁబడినవి. సామాన్యవాచకమగు "ప్రతిదశ" శబ్దము, ఇంద్ర అను విశేషార్థమునం దుపయుక్తము. ఇంద్రుడు కూడ దేవతయే కదా! అలంకారము : ఉపమ.

శ్లో. వ్యాదిదేశ గణశో ఽథ పార్శ్వగాన్
కార్ముకాభిహరణాయ మైథిలః,
తైజసస్య ధనుషః ప్రవృత్తయే
తోయదా నివ సహస్రలోచనః. 43

వ్యాఖ్య : అథ-పిమ్మట, మైథిలః-జనకుఁడు, పార్శ్వగాన్-ప్రక్కలనున్న పురుషులను, కార్ముకాభిహరణాయ-కార్ముక-ధనుస్సును, అభిహరణాయ-ఎదురుగా తెచ్చుటకు, సహస్రలోచనః-ఇంద్రుఁడు, తైజసస్య-తేజోమయమగు, ధనుషః-ఇంద్రధనుస్సుయొక్క, ప్రవృత్తయే-ఆవిర్భావముకొఱకు, తోయదాన్, ఇవ-మేఘములనువలె, గణశః-జట్లు జట్లుగా, వ్యాదిదేశ-ఆజ్ఞాపించెను. విశ్వామిత్రుని మాట విన్న పిమ్మట జనకుఁడు తన ప్రక్కలయందున్న సేవకులను జట్లు జట్లుగా పిలిచి, ఇంద్రుఁడు తేజోమయమగు నింద్ర ధనుస్సు నావిర్భవింపజేయుటకు మేఘ

ముల నాదేశించినట్లు శివధనుస్సును బయటికి తెండు అని యాజ్ఞాపించెను. ఒక రిద్దఱు తెచ్చుటకు సాధ్యపడునది కాదు కనుక, జనకుఁడు తన సేవకులను జట్లు జట్లుగా నొక్కొక్కఁ పార్శ్వమునఁ బట్టుకొని శివధనుస్సును వెలుపలికిఁ దెచ్చి పెట్టు డని యాజ్ఞ యిచ్చెను. ఇంద్రధనుస్సువంటి సౌందర్య దార్ఢ్యములు గలది శివ ధనుస్సు అనియు, దానిదర్శన మానందహేతు వనియు భావము.

శ్లో. తత్ ప్రసుప్త భుజగేంద్ర భీషణం
వీక్ష్య దాశరథి రాదదే ధనుః,
విద్రుత క్రతుమృగా నుసారిణం
యేన బాణ మసృజత్ వృషధ్వజః. 44

వ్యాఖ్య : దాశరథిః-రాముఁడు, ప్రసుప్త భుజగేంద్ర భీషణం-నిద్రించిన సర్పరాజువలె భయంకరమైయున్న, తత్, ధనుః-ఆచాపమును, వీక్ష్య-బాగుగాఁ జూచి, ఆదదే-పట్టుకొనెను. వృషధ్వజః-శివుఁడు, యేన-ఏధనుస్సు చేతనైతే, విద్రుత క్రతుమృగా నుసారిణం-విద్రుత-పారిపోవుచున్న, క్రతుమృగ-యజ్ఞ మనెడు లేడిని, అనుసారిణం-అనుసరించి వెళ్ళునట్టి, బాణం—బాణమును, అసృజత్-విడిచెనో; ఏధనుస్సు చేతనైతే శివుఁడు మృగరూపమునఁ బరుగెత్తి పోవుచున్న యజ్ఞమును గొట్టుటకు బాణమును విడిచెనో అట్టి యా ధనుస్సును శ్రీరాముఁడు బాగా పరికించి చూచి చేతఁబట్టుకొనె నని భావము. ఒకప్పుడు ఇంద్రాది దేవత లొక మహాయజ్ఞమును జేయుచు, తపోనిష్ఠుఁడై యున్న పరమశివునికి యజ్ఞభా విర్భాగమును కల్పింపక పోయిరి. అప్పుడు శివుఁడు తపోమయమై, సుదీర్ఘమై సూర్యునివలె ప్రకాశించునట్టి యొకధనుస్సును సృజించి, దానికి శింజినీ ప్రముఖము లైన యంగములు కల్పించి, కోపానల జ్వాలలు ప్రక్కుచు నచ్చటికి వచ్చి యాయజ్ఞ మును ధ్వంసము చేయుటకు సిద్ధపడెను. అట్టి శివుని జూచి దేవతలు భయభ్రాంతు లైరి. శివుఁడు కోపోద్దీపితుఁడై యజ్ఞముపై బాణమును వేయగా నాబాణము దెబ్బకు హృదయము చీలిన యజ్ఞము మృగరూపమును ధరించి అగ్నిహోత్రుని సహితముగాఁ బాఱిపోయెను. ఆ ధనువే యిది యని "క్రతుమృగానుసారిణం" అను పదము తెలుపుచున్నది. ఆ కథను ఇచ్చట ననుసంధించుకొనవలెను.

శ్లో. ఆతతజ్య మకరో త్స సంసదా
విస్మయ స్తిమిత నేత్ర మీక్షితః

శైలసార మపి నాతియత్నతః
పుష్పచాప మివ పేశలం స్మరః.

వ్యాఖ్య : సః- **ఆరాముఁడు**, సంసదా-**సభచేత** (సభాస్థజనులచేత),**విస్మయ స్తిమితనేత్రం**-ఆశ్చర్యముచేత కదలికలేని కన్నులు గలుగునట్లుగా, **ఈక్షితః**-చూడ బడుచున్నవాఁడగుచు, **శైలసారం** ఆపి-పర్వతముయొక్క గట్టితనము, బరువు గలదియై యున్నను, **ధనుః**- ఆ **శివధనుస్సును**, స్మరః-మన్మథుఁడు, **పేశలం**-కోమలమైన, **పుష్పచాపం**, **ఇవ-పూవిల్లునువలె**, **నాతియత్నతః**-ఎక్కువ పయత్నము లేకయే, ఆతతజ్యం-ఎక్కించబడిన **మౌర్వి** కలదానినిగా, అకరోత్-చేసెను. **సభలో** నున్న వారందఱును ఆశ్చర్యముచేత **ఔప్పలు వాల్పక** చూచుచుండగా **రాముఁడు శైలసారమగు శివధనుస్సును**, మన్మథుఁడు పుష్పచాపమును వలె నతి సులభముగా నెత్తి నారిని బిగించె నని భావము.

శ్లో. భజ్యమాన మతిమాత్ర కర్షణాత్
తేన వజ్రపరుషస్వనం ధనుః,
భార్గవాయ ధృఢమన్యవే పునః
క్షత్ర ముద్యత మివ న్యవేదయత్. 46

వ్యాఖ్య : **తేన**-ఆ **రామునిచేత**, **అతిమాత్ర కర్షణాత్**-**ఎక్కువగా** లాగుట వలన, భజ్యమానం-విరువబడుచున్న దగుటచేత, **వజ్రపరుషస్వనం**-పిడుగుయొక్క వలె కఠినమైన ధ్వనిగల, ధనుః-ఆ ధనుస్సు, దృఢమన్యవే-చెఱగని కోపముగల, భార్గవాయ-పరశురామునికొఱకు, క్షత్రం-క్షత్రియవంశమును, పునః-మరల, ఉద్యతం-యుద్ధసన్నద్ధమై యున్నదానిని, న్యవేదయత్, **ఇవ-విజ్ఞాపన** జేసెనా యను నట్లుండెను. **రాముఁడు** నారిని గట్టి యెక్కువెట్టి శింజినిని **బాగా** లాగుటచేత విరిగి పోవుచున్న యా ధనుస్సుయొక్క పిడుగువంటి ధ్వని, దృఢకోపుఁడైన పరశు రామునికి క్షత్రియకులము మళ్ళి లేచినది సుమా యని తెలిపినట్లుండె నని భావము
అలంకారము : **ఉత్ప్రేక్ష**.

శ్లో. దృష్టసార మథ రుద్రకార్ముకే
వీర్యశుల్క మభినంద్య **మైథిలః**,

రాఘవాయ తనయా మయోనిజాం
రూపిణీం శ్రియ మివ న్యవేదయత్. 47

వ్యాఖ్య : అథ-ఆట్లు ధనుస్సు విరిగిన పిమ్మట, మైథిలః-జనకుఁడు, రుద్రకార్ముకే-శివధనుస్సు విషయమున, దృష్టసారం-చూడబడిన స్థిరాంశముగల, వీర్యశుల్కం-ధనుర్భంగ రూపమగు శౌర్యశుల్కమును, అభినంద్య-మెచ్చుకొని, రాఘవాయ-రామునికొఱకు (రామునికి), అయోనిజాం-అందఱివలెగాక దేవయజ్ఞము నందు పుట్టిన, తనయాం-కూతురగు సీతను, రూపిణీం-రూపమును ధరించిన, శ్రియం, ఇవ-లక్ష్మినివలె (సాక్షాల్లక్ష్మినివలె) న్యవేదయత్-అర్పించెను. శివధనుర్విషయమున స్థిరపడిన శక్తిగల రాముని శౌర్యశుల్కమును మెచ్చుకొని, అయోనిజయైన తన కూతురు సీతను రాఘవునికి భార్యనుగా నిచ్చెదనని మాటచెప్పె నని భావము.

శ్లో. మైథిలః సపది సత్యసంగరో
రాఘవాయ తనయా మయోనిజామ్,
సన్నిధౌ ద్యుతిమత స్తపోనిధే
రగ్నిసాక్షిక ఇవా తిసృష్టవాన్. 48

వ్యాఖ్య : సత్యసంగరః-సత్యప్రతిజ్ఞుఁడగు, మైథిలః-జనకుఁడు, రాఘవాయ-రామునికొఱకు, అయోనిజాం-స్త్రీ గర్భజనిత కానట్టి, తనయాం-కూతురిని, ద్యుతిమతః-తేజస్వియగు, తపోనిధేః-విశ్వామిత్రునియొక్క, సన్నిధౌ-సన్నిధియందు, అగ్నిసాక్షికః, ఇవ-అగ్ని సాక్షిగాఁ గలవాఁడువలె, సపది-అప్పుడే, అతిసృష్టవాన్-ఇచ్చివేసినవాఁ డయ్యెను. సత్యమైన ప్రతిజ్ఞగల జనకుఁడు అయోనిజయై తనకూతురుగా భావింపఁబడిన సీతను రామునికి మహాతేజస్వియగు విశ్వామిత్రుని సన్నిధిలో (విశ్వామిత్రుఁడే అగ్నియై సాక్షిగా నున్న వానివలె) అప్పుడే యిచ్చి వివాహము చేసెను. "సంగర" శబ్దమునకు ప్రతిజ్ఞ, యుద్ధము, జ్ఞానము, ఆపద అర్థములు. "అథ ప్రతిజ్ఞాజి సంవిదాపత్సు సంగరః" అని యమరము. ఇచ్చట తాత్కాలికముగా జనకుఁడు, సీతచేత రాముని కంఠమునందు విజయమాలను విశ్వామిత్రాగ్నిసాక్షికముగా వేయించెనని తలఁపవలయును.

శ్లో. ప్రాహిణోచ్చ మహితం మహాద్యుతిః
కోసలాధిపతయే పురోధసమ్,
భృత్యభావి దుహితుః పరిగ్రహాత్
దిశ్యతాం కుల మిదం నిమే రితి. 49

వ్యాఖ్య : మహాద్యుతిః-గొప్ప కాంతిగల జనకుడు, మహితం-పూజితుడగు, పురోధసం-పురోహితుని, కోసలాధిపతయే-కోసలదేశ పాలకుడగు దశరథుని కొఱకు (వద్దికి), ఇదం-ఈ, నిమేః కులం-నిమియొక్క వంశము, దుహితుః-కూతురగు సీతయొక్క, పరిగ్రహాత్-కోడలుగా స్వీకరించుటవలన, భృత్యభావి-భృత్యత్వము కలదిగా, దిశ్యతాం-అనుమతింపబడును గాక, ఇతి-ఇట్లు చెప్పుమని, ప్రాహిణోత్, చ-పంపెనుగూడ. జనకుడొక పురోహితుని సత్కరించి, నీవు వెళ్ళి దశరథునితో నా కుమార్తెను కోడలుగా స్వీకరించి నిమివంశమును నీ సేవలోనికి దీసికొనుట కంగీకరింపు మని చెప్పుటకై పంపెను. ఇచ్చటి "మహాద్యుతిః" అను పదము, శివధనుర్భంగమును జేసిన యల్లుడు దొరకుటచేత జనకునికి గలిగిన సంతోషమును, ముఖకాంతిని వెల్లడించుచున్నది.

శ్లో. అన్వయేష సదృశీం స చ స్నుషాం
ప్రాప చైన మనుకూలవాగ్విజిః,
సద్య ఏవ సుకృతాం హి పచ్యతే
కల్పవృక్షఫల ధర్మి కాంక్షితమ్. 50

వ్యాఖ్య : సః, చ-ఆదశరథుడుకూడ, సదృశీం-రామునికిదగిన, స్నుషాం-కోడలిని, అన్వయేష-వెదకెను,అనుకూలవాక్-కోడలు లభించినదని చెప్పు వాక్కుగల, ద్విజః-బ్రాహ్మణుడు (జనకపురోహితుడు), చ-కూడ, ఏనం-ఈ దశరథుని, ప్రాప-చేరెను. హి-అది యంతే, కల్పవృక్షఫలధర్మి-కల్పవృక్ష ఫలము వలె వెంటనే పండు స్వభావముగల, సుకృతాం-పుణ్యమునుజేసిన వారియొక్క, కాంక్షితం-మనోరథము, సద్యః, ఏవ-వెంటనే, పచ్యతే-ఫలించునుగదా! యుక్త వయస్సు వచ్చిన రామునికి దగినభార్య యెచ్చట లభించునా యని దశరథుడు వెదకుట కారంభించిన వెంటనే జనకుని పురోహితుడు సీతను మీ

కోడలినిగా స్వీకరింపు డనిచెప్పుట కతనివద్దికి వెళ్ళెను. పుణ్యవంతులకోరిక కల్ప వృక్షము ఫలమువలె పుట్టుటయు ఫలించుటయు వెంటనే జరుగునుగదా! దశరథునికి రామవివాహకాంక్ష కలుగుటకును, జనకుఁడు పంపిన వార్తకును వ్యవధానమే లేకుండె నని భావము. అలంకారము : అర్థాంతరన్యాసము.

శ్లో. తస్య కల్పిత పురస్క్రియావిధేః
శుశ్రువాꣳ వచన మగ్రజన్మనః,
ఉచ్చచాల బలభిత్సఖో వశీ
సైన్యరేణు ముషితార్కదీధితిః. 51

వ్యాఖ్య : బలభిత్సఖః-ఇంద్రస్నేహితుఁడును, వశీ-స్వాయత్తుఁడు నగు దశరథుఁడు, కల్పితపురస్క్రియావిధేః-చేయఁబడిన పూజావిధానము గల, తస్య, అగ్రజన్మనః-ఆబ్రాహ్మణునియొక్క, వచనం-జనకుఁడు పంపిన సందేశవచనమును, శుశ్రువాన్-విన్నవాఁడై, సైన్యరేణు ముషితార్కదీధితిః-సైన్యరేణు-సైన్యముయొక్క నడకచేత రేగినదుమ్ముచేత, ముషిత-దొంగిలింపఁబడిన (కప్పివేయఁబడిన), అర్కదీధితిః-సూర్యకాంతిగలవాఁడగుచు, ఉచ్చచాల-లేచెను(ప్రయాణించెను). ఇంద్రసఖుఁడై స్వతంత్రుఁడై యున్నదశరథుఁడు కృతాతిథిసత్కారుఁడగు జనకపురోహితుఁడు చెప్పిన శుభసందేశమును విన్నవెంటనే సర్వసన్నద్ధమగు సైన్యముతో మిథిలకు బయలుదేరె నని భావము. బలభిత్సఖుఁడగుటచేత వివాహసంభారములు క్షణములో సిద్ధమయ్యె ననియు, వశీ యనుటచేత ఇతరుల ఆలోచనలు సంప్రదింపులు అక్కరలేకపోయెననియు, "సైన్యరేణు ముషితార్కదీధితిః" అనుటచేత మహావైభవసమేతుఁడై పయనించెననియు తాత్పర్యము. "ఉచ్చచాల" అనుక్రియ "శుభస్య శీఘ్రం" అన్నట్లు కార్యత్వరను దెలుపుచున్నది.

శ్లో. ఆససాద మిథిలాం స వేష్టయన్
పీడితోపవనపాదపాం బలైః
ప్రీతిరోధ మసహిష్ట సా పురీ
స్రీవ కాంతపరిభోగ మాయతమ్. 52

వ్యాఖ్య : సః-ఆవిధముగా బయలుదేరిన దశరథుఁడు, బలైఃసైన్యముల చేత, పీడితోపవనపాదపాం—పీడిత-బాధింపఁబడిన, ఉపవన-ఉపవనమునందలి, పాదపాం-వృక్షములుగల, మిథిలాం-మిథిలానగరమును, వేష్టయన్-చుట్టును ఆక్రమించుచు, ఆససాద-చేరెను. సా, పురీ-ఆనగరముకూడ, స్త్రీ-యువతి, ఆయతం-విస్తృతమైన, కాంతపరిభోగం, ఇవ-ప్రియసంభోగమునువలె, ప్రీతిరోధం-ప్రేమ చేత జరిగిన ఆడ్డగింపును, అసహిష్ట-సహించెను. అట్లు బయలుదేరిన దశరథుఁడు తనసైన్యములచేత అనగా ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, కాలిబంట్లచేత పీడింప బడిన ఉపవనవృక్షలతాదులుగల మిథిలను చుట్టును ఆవరించుచుఁ జేరెను. ఆమిథిల, ఆయుపరోధమును,ఒక యువతి తనప్రియుఁడు చేయు కచ కుచాకర్షణ దంతక్షత నఖక్షతాది సహిత సంభోగాతిశయమును వలె, ఆప్రీతిరోధమును, అనగా ప్రేమచేత జరిగిన ఆవరోధమును సహించెను. అదియే ద్వేషరోధమైనచో సహించెడిదికాదు. యువతియు ప్రియుఁడు చూపుధార్ష్ట్యమును ప్రేమాధీనయై సహించునుగదా! అలం

కారము : ఉపమ.

శ్లో. తౌ సమేత్య సమయే స్థితౌ ఉభౌ
భూపతీ వరుణవాసవోపమౌ,
కన్యకా తనయ కౌతుకక్రియాం
స్వ్రప్రభావసదృశీం వితేనతుః. ౬౬

వ్యాఖ్య : సమయే-ఆచారమునందు, స్థితౌ-ఉన్నట్టివారును, వరుణవాసవోపమౌ-వరుణునితోను ఇంద్రునితోను సమానులగు, తౌ ఉభౌ, భూపతీ-ఆయిద్దఱురాజులగు జనకదశరథులు, సమేత్య-కలిసి, స్వ్రప్రభావసదృశీం-తమ గొప్పతనమునకు తగినట్టి, కన్యకా తనయ కౌతుకక్రియాం-సీతాదికన్యకల యొక్కయు, రామాది తనయులయొక్కయు, వివాహోత్సవమును, వితేనతుః-విస్తారముగాఁ జేసిరి. దేవతలలో వరుణుఁడు, ఇంద్రుఁడును ఆత్యధికులు, వైదికకర్మ నిష్ఠాపరులు; కనుక ఆట్టివారితోఁ బోల్పఁబడిన జనక దశరథులు సయితము సమయము అనగా ఆచారమునందు నిష్ఠులైయుండుటచేత, తమ సంతానము యొక్క వివాహమంగళములను తమయైశ్వర్యమునకును, శాస్త్రవిధానమునకును దగినట్లు పెంచి నిర్వర్తించి రని భావము. "సమయ" శబ్దమునకు శపథము, ఆచారము, కాలము, సిద్ధాంతము, జ్ఞానము; అర్థములని యమరము.

శ్లో. పార్థివీ ముదవహ ద్రఘూద్వహో
లక్ష్మణ స్తదనుజా మథోర్మిలామ్,
యౌ తయో రవరజౌ వరౌజసౌ
తౌ కుశధ్వజసుతే సుమధ్యమే. 54

వ్యాఖ్య: రఘూద్వహః-శ్రీరాముఁడు, పార్థివీం-పృథివీపుత్రికయగుసీతను, ఉదవహత్-వివాహమాడెను; అథ-తరువాత, లక్ష్మణః-లక్ష్మణుఁడు, తదనుజాం-ఆమెకు చెల్లెలగు జనకుని యౌరసపుత్రి యూర్మిళను, ఉదవహత్-పెండ్లియాడెను. యౌ-ఏ, వరౌజసౌ-మంచి పరాక్రమవంతులును, తయోః-ఆరామలక్ష్మణులకు, అవరజౌ-తరువాతపుట్టినవారునై యున్నారో, తౌ-ఆభరత శత్రుఘ్నులు, సుమధ్యమౌ-చక్కని నడుములుగల, అందగత్తెలగు, కుశధ్వజసుతే-జనకుని తమ్ముఁడు కుశధ్వజుని కూతురులగు మాండవీ శ్రుతకీర్తులను, ఉదవహతాం-వివాహమాడిరి. రాముఁడు సీతను, లక్ష్మణుఁడు ఊర్మిళను, భరతుఁడు మాండవిని, శత్రుఘ్నుడు శ్రుతకీర్తిని వివాహమాడిరని భావము. "అవరజౌ" అనుచోట రామస్య అవరజో భరతః, లక్ష్మణస్య అవరజః శత్రుఘ్నః అని యర్థము చేసికొనవలెను.

శ్లో. తే చతుర్థసహితా స్త్రయో బభుః
సూనవో నవవధూపరిగ్రహాః,
సామ దానవిధి భేద విగ్రహాః
సిద్ధిమంత ఇప తస్య భూపతేః. 55

వ్యాఖ్య: తే-ఆ, చతుర్థసహితాః-నాలుగవవాఁడగు శత్రుఘ్నునితోఁగూడిన, త్రయః-ముగ్గురగు రామ భరత లక్ష్మణు లనబడు, సూనవః-కుమారులు (ఆనలుగురు కుమారులునని యర్థము), నవవధూ పరిగ్రహాః-నూతనకన్యలు భార్యలుగాఁగలవారగుచు, సిద్ధిమంతః-ఫలసిద్ధితోఁగూడిన, తస్య భూపతేః-ఆదశరథునియొక్క, సామ దానవిధి భేద విగ్రహాః ఇవ-సామము, దానము, భేదము, దండమునవెడి చతురుపాయములవలె, బభుః-ప్రకాశించిరి. కుమారులు ఉపాయములతోను, వారి భార్యలు ఫలసిద్ధులతోను పోల్చబడుటచేత ఇది ఉపమాలంకారము. "చత్వారః" అనక చతుర్థసహితాః త్రయః" అనుట కేవలము వృత్తానుసారియగు ఛందోవిషయ

మని మల్లినాథసూరి వ్యాఖ్యానించెను. ఆయినప్పటికిని, అందులో చతుర్థమగు దండోపాయమును అవసరమగుచో నుపయోగింప గలవానికే సామాద్యుపాయత్రయము ఫలించుననియు, దండసహాయము లేనివానికవి సిద్ధించుట దుర్లభమనియు మొదలగు భావములు స్ఫురించుటకే కాళిదాసట్లు రచించె నని భావించుట తప్పుగాదు. సిద్ధిమంతములగు చతురుపాయములవలె వివాహితులగు నలుగురు కుమారులను జూచి దశరథు డానందమును బొందె నని తాత్పర్యము.

శ్లో. తా నరాధిపసుతా నృపాత్మజైః
తే చ తాభి రగమన్ కృతార్థతామ్
సోఽభవ ద్వర వధూ సమాగమః
ప్రత్యయ ప్రకృతి యోగ సన్నిభః. 56

వ్యాఖ్యా: తాః, నరాధిపసుతాః-ఆ జనకకన్యలగు సీతాప్రభృతులు, నృపాత్మజైః-దశరథ పుత్రులగు రామాదులచేతను, తే-ఆ రామాదులును, తాభిః, చ-ఆ సీతా ప్రభృతులచేతను, కృతార్థతాం-కుల శీల వయో రూపాది సాఫల్యమును, అగమన్-పొందిరి. సః వర వధూ సమాగమః-ఆ వరులయొక్కయు, వధువుల యొక్కయు చేరిక, ప్రత్యయ ప్రకృతి యోగసన్నిభః-ప్రత్యయములయొక్కయు, ప్రకృతులయొక్కయు చేరికవలె ప్రకాశించునది, అభవత్-అయ్యెను. శబ్దము లన్నియు ప్రకృతి ప్రత్యయ సంయోగము వలననే ఉద్దిష్టార్థముల నిచ్చును. ఉదాహరణమునకు:-భూ, కృష్, మొదలగునవి ప్రకృతులు. వాటికి తిఙ్ ప్రత్యయములు చేర్చుట వలన "భవతి, కరోతి" అను రూపములు సిద్ధించి, ఉన్నది, ఉన్నాడు, చేయుచున్నది మొ. అర్థములు వచ్చును. అట్లే సనాది ప్రత్యయములు చేర్చినప్పుడు "బుభూషతి, చికీర్షతి" అను రూపము లేర్పడి ఉండదలచుకొన్నాడు, చేయదలచుకొన్నాడు అనునర్థములు సిద్ధించును. అట్లే ఆ వధూవరులు కృతార్థులై పరస్పర సహకారమును పొంది జీవిత లక్ష్యములగు పురుషార్థములను సాధింప గలవారైరి అని భావము. ఇది కాళిదాసునకుగల వ్యాకరణ శాస్త్ర రహస్యజ్ఞానమును, ఆ శాస్త్రముపైగల యభిమానమును వెల్లడించుచున్నది.

శ్లో. ఏవ మాత్తరతి రాత్మసంభవాన్
తాన్ నివేశ్య చతురోఽపి తత్ర సః

అధ్వసు త్రిషు విసృష్టమైథిలః
స్వాం పురిం దశరథో న్యవర్తత. 57

వ్యాఖ్య: ఏవం-ఈపైని చెప్పిన రీతిగా, ఆత్తరతిః-పొందిన యానందము గల, సః, దశరథః-ఆ దశరథుఁడు, చతురః, అపి-నలుగురునగు, ఆత్మసంభవాన్-కుమారులను, తత్ర-ఆ మిథిలానగరమునందు, నివేశ్య-వివాహితులనుజేసి, త్రిషు, అధ్వసు-మూడు విడుదల ప్రయాణములందు, విసృష్టమైథిలః (సన్)-వెనుకకు పంపిన జనక చక్రవర్తి గల వాఁడగుచు, స్వాం, పురీం-తన నగరమగు అయోధ్యను, న్యవర్తత-తిరిగి చేరుటకుఁ బూనెను. 'నివేశ్య' అనుపదమునకు వివాహితులను జేసి యను అర్థము ప్రకరణానుసారముగాఁ జెప్పఁబడినది. దానికి, "నివేశః శిబి రోద్వాహ విన్యాసేషు ప్రకీర్తితః" అను విశ్వనిఘంటువు శ్లోకము ప్రమాణము. పూర్వకాలమున ఆప్తబంధువులు సుదూర ప్రయాణమును జేయునప్పుడు సాగనంపువారు, మూడు మజిలీల వరకు వెళ్ళుట యాచారము. అట్లు వచ్చిన జనకుని మర్యాదతో వెనుకకుండినట్లుచేసి, తన ప్రయాణమును ముందునకు సాగించె నని తెల్పుటకే కవి "త్రిషు అధ్వసు" అని ప్రయోగించెను. కాగా సాగనంపవచ్చిన జనకుని ఆపి, దశరథుఁడు సపుత్ర స్నుషముగా ముందుకు వెళ్లె నని భావము.

శ్లో. తస్య జాతు మరుతః ప్రతీపగా
వర్త్మసు ధ్వజతరు ప్రమాథినః
చిక్లిశు ర్భృశతయా వరూథినీం
ఉత్తటా ఇవ నదీరయాః స్థలీమ్. 58

వ్యాఖ్య: జాతు-ఒకప్పుడు, వర్త్మసు-మార్గములయందు, ధ్వజతరు ప్రమాథినః-ధ్వజములవలె యెత్తుగా నున్న చెట్లను ఊపివేయునవియు, ప్రతీపగాః-ఎదురుగా వీచునవియు నగు, మరుతః-వాయువులు, ఉత్తటాః-తీరములనెక్కి ప్రవహించునట్టి, నదీరయాః-నదులవేగములు, స్థలీం, ఇవ-నేలనువలె, తస్య, వరూథినీం-ఆ దశరథునియొక్క సేనను, భృశతయా-ఎక్కువగా, చిక్లిశుః-క్లేశపరచినవి. దశరథుని తిరుగు ప్రయాణమునం దొక్కొక్కసారి మిక్కుటమైన యెదురు గాడ్పులు వీచుచు సైన్యమును బాధపెట్టిన వని భావము. ప్రయాణమునకు వెనుకనుండి వీచు అనుకూల వాయువులు శుభశకునము, ఎదురుగా వచ్చు

NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

గాడ్పులు దుశ్శకునము అని శకున శాస్త్రమునందు జెప్పబడినది. "ధ్వజతరు" అనుచోట సేనారథముల కేతనములు సైతము ఊగిపోవుచుండెనాయు భావము.

శ్లో. లక్ష్యతే స్మ తదనంతరం రవి
ర్బద్ధ భీమ పరివేష మండలః
వైనతేయ శమితస్య భోగినో
భోగవేష్టిత ఇవ చ్యుతో మణిః. 59

వ్యాఖ్య: తదనంతరం–ఆ యెదురు గాడ్పులు వీచిన పిమ్మట, బద్ధ భీమ పరివేష మండలః-తనచుట్టును చుట్టిన భయంకర పరివేష మండలముగల, రవిః-సూర్యుడు, వైనతేయ శమితస్య-గరుడునిచేత చంపబడిన, భోగినః-సర్పము యొక్క, భోగవేష్టితః–శరీరముచేత మ్రాతము చుట్టబడిన, చ్యుతః మణిః, ఇవ-తలపైనుండి జారిపడిన మణివలె, లక్ష్యతే స్మ-కనబడెను. గరుత్మంతుడు చంపునప్పుడు శిరస్సునుండి రాలి పడిన మణి సర్పముయొక్క మృతదేహముతో చుట్టబడినట్లు సూర్యబింబము తనచుట్టును ఒక పరివేషము గలదియై, పూర్వపు పెదురు గాలులు తగ్గిన వెంటనే దశరథాదులకు కనపడె నని భావము. సూర్యుని చుట్టు నింద్రధనుస్సువలె చుట్టుకొన్న పరివేషము కనపడుట అశుభసూచకము. ఆట్టి దుశ్శకునము దశరథాదులకు గలిగినది.

శ్లో. శ్వేనపత్ర పరిధూస రాలకాః
సాంధ్యమేఘ రుధిరార్ద్ర వాససః,
అంగనా ఇవ రజస్వలా దిశో
నో బభూవు రవలోకనక్షమాః. 60

వ్యాఖ్య: శ్వేనపక్ష పరిధూసరాలకాః-శ్వేనపక్ష-గద్దలయొక్కలనెడు, పరిధూసరాలకాః-దుమ్ముపట్టిన ముంగురులు గలవియు, సాంధ్యమేఘరుధిరార్ద్రవాససః-సాంధ్యమేఘ-సంధ్యాసమయ మేఘము లనెడు, రుధిరార్ద్ర-రక్తముచేత తడిసిన, వాససః-వస్త్రములు గలవియు, రజస్వలాః-దుమ్ముతోగూడిన, దిశః-దిక్కులు, రజస్వలాః-ఋతుమతులగు, అంగనాః, ఇవ-స్త్రీలవలె, అవలోకనక్షమాః-చూచుట

కర్హాలైనవి, నో బభూవుఃకాకపోయెను. ఇచ్చట గద్దఱొక్కలే దిక్కులయొక్క మాసిన ముంగురులు, సాంధ్యమేఘములే రక్తము చేత తడిసిన వస్త్రములు, ఆట్లుండి దుమ్మునిండిన దిక్కులు, తలలు మాసి, వలువలు రక్తార్ద్రములై యున్న ఋతుమతులగు స్త్రీలవలె దర్శనయోగ్యములు కాలేదు. ఋతుమతులైన స్త్రీలను జూడరాదని శాస్తము. దుమ్ముతో నిండిన దిక్కులు చూచుటకు వీలుపడవుగదా! అందు వలన యీపోలిక. ఇది శ్లేషానుప్రాణితమగు ఉపమాలంకారము. ధూళి వ్యాపించుటచేత దిక్కులు కనపడలేదని భావము. ధూళివర్షము ఉత్పాతహేతువగు నొక యపశకునము.

శ్లో. భాస్కర శ్చ దిశ మధ్యువాస యాం
తాం శ్రితాః ప్రతిభయం వవాసిరే,
క్షత్రశోణిత పితృక్రియోచితం
చోదయంత్య ఇవ భార్గవం శివాః. 61

వ్యాఖ్య: భాస్కరః-సూర్యుడు, యాం, దిశం-ఏ దిక్కునందు (ఇచ్చట సప్తమ్యర్థమున ద్వితీయావిభక్తి) అధ్యువాస, చ-ఎక్కియుండెనో, తాం, దిశం-ఆ దిక్కును, శ్రితాః-ఆశ్రయించియుండిన, శివాః-నక్కలు, క్షత్రశోణిత పితృక్రియోచితం-క్షత్ర-క్షత్రియులయొక్క, శోణిత-రక్తముచేనగు, పితృక్రియా-తర్పణమునందు, ఉచితం-పరిచితుడైన, భార్గవం-పరశురాముని, చోదయంత్యః, ఇవ-ప్రోత్సహించుచున్నవివలె, ప్రతిభయం-భయంకరముగా, వవాసిరే-కూతలు పెట్టినవి. సూర్యుడేదిక్కున నున్నప్పు డచ్చటనున్న నక్కలు, క్షత్రియరక్తముచేత పితృతర్పణముఁ జేయునట్టి పరశురాముని ప్రోత్సహించునవివలె భయంకరముగాఁ గూతలుపెట్టినవి. నక్కల అరపులు అమంగళ సూచకములు. "స్త్రియాం శివా" అని యమరము, కనుక ఇచ్చటి "శివా" శబ్దము స్త్రీలింగము. "వవాసిరే"ఇది వాస్య-శబ్దే అను ధాతువునకు లిట్ బహువచనరూపము. "తిరశ్చాం వాసితం రుతమ్" అని యమరము. తిర్యగ్జంతువులధ్వని "వాసితం" అనబడుచున్నది.

శ్లో. తత్పితీప వవనాది వైకృతం
ప్రేక్ష్య శాంతి మధికృత్య కృత్యవిత్,

అన్వయుంక్త గురు మీశ్వరః క్షితేః
స్వంత మి త్యలఘుయ త్స తద్వ్యథామ్. 62

వ్యాఖ్య: తత్ప్రతీపపవనాది-ఆ పతికూలవాయువు మొదలగు, వైకృతం-దుర్నిమిత్తమును, ప్రేక్ష్య-చూచి, కృత్యవిత్-కార్యజ్ఞుడగు, క్షితేః, ఈశ్వరః-భూపతియగు దశరథుడు, శాంతిం-అనర్థనివృత్తిని, అధికృత్య-ఉద్దేశించి, గురుం-కులగురువగు వసిష్ఠుని, అన్వయుంక్త-అడిగెను. సః-ఆవసిష్ఠుడు, స్వంతం-శుభోదర్కమే (దీనిఫలితము శుభాంతమే యగునని), తస్య థా-ఆదశరథుని మనోబాధను, అలఘుయత్-తగ్గించెను. ఈ పతికూలవాయువు మొదలగు దుశ్శకునములు ఫలింపకుండుటకై యేయే శాంతులు చేయవలయు నని దశరథుడడుగగా వసిష్ఠుడాశకునఫలము శుభముగానే పరిణమించు నని చెప్పి, యటని మనోవ్యథ తగ్గునట్లు చేసె నని భావము. "అధికృత్య" అనునది ఉద్దేశించి యనునర్థముక నుపయోగింపబడు ల్యబంతమగు నవ్యయము. "స్వంతం" అనగా సు+అంతం-శుభోదర్క-మని యర్థము.

శ్లో. తేజసః సపది రాశి రుత్థితః
ప్రాదురాస కిల వాహినీముఖే,
యః ప్రమృజ్య నయనాని సైనికై
ర్లక్షణీయ పురుషాకృతి శ్చిరాత్. 63

వ్యాఖ్య: సపది-వెంటనే (అట్లు వారు సంభాషించుచుండగనే), ఉత్థితః-పైకిలేచిన, తేజసః, రాశిః-తేజస్సుయొక్క పుంజము, వాహినీముఖే-సేనయొక్కయెదుట, ప్రాదురాస, కిల-ఆవిర్భవించెను సుమా! యః-ఏతేజోరాశి, సైనికైః-సైనికులచేత, నయనాని-కన్నులను, ప్రమృజ్య-తుడుచుకొని, చిరాత్-చాలకాలమునకు, లక్షణీయపురుషాకృతిః-చూడదగిన పురుషరూపము గలది, అభూత్-అయ్యెనో. అప్పుడు వెంటనే యొక తేజఃపుంజము నేలపైనుండి లేచి సేనయెదుట సాక్షాత్కరించెను. సైనికుల కన్నులు మిఱుమిట్లుగొలిపి చూడలేకపోగా వారు సీటితోను, ప్రేళ్ళతోను మాటిమాటికి కన్నులను దుడుచుకొని, చాలసేపటికి ఆతేజఃపుంజ మొకపురుషాకృతిలో నున్నట్టు కనుగొని రని భావము.

శ్లో. పిత్ర్య మంశ ముపవీతలక్షణం
మాత్మకం చ ధను రూర్జితం దధత్,
యః ససోమ ఇవ ఘర్మదీధితిః
సద్విజిహ్వ ఇవ చందనద్రుమః. 64

వ్యాఖ్య: ఉపవీతలక్షణం-యజ్ఞోపవీతము చిహ్నముగాగల, పిత్ర్యం, అంశం-తండ్రి సంబంధమగు భాగమును, ధనురూర్జితం ధనుస్సుచేత ప్రకాశించు నట్టి, మాత్మకం చ-తల్లి యంశమును, దధత్-ధరించుచున్న, యః-ఏభార్గవుడు, ససోమః-చంద్రునితో గూడిన, ఘర్మదీధితిః, ఇవ-చండభానుడగు సూర్యుని వలెను,సద్విజిహ్వః-సర్పముతో గూడిన, చందనద్రుమః, ఇవ-శ్రీగంధపు వృక్షము వలెను, స్థితః-ఉండెనో; అట్టి పరశురాముడు వారికి గనపడెను. పరశురాముని తండ్రి జమదగ్ని బ్రాహ్మణుడు కావున నతని యంశమగు యజ్ఞోపవీతమును, తల్లి ప్రసేనజితుండను రాజుకూతురు రేణుక యగుటచేత క్షత్రియధర్మమగు ధనుస్సును ధరించిన పరశురాముడు, చంద్రునితో గలసియున్న చండభానుడగు సూర్యుని వలెను, సర్పముతో గూడియున్న చందనవృక్షము వలెను ఉండెనని భావము. అనగా చంద్రచందన తుల్యమగు యజ్ఞోపవీత లక్షణముచేత దయా దాక్షిణ్యానుగ్రహాది బ్రాహ్మణగుణములును, చండభాను, సర్పసదృశమగు ధనుస్సును ధరించుటచేత ఆవక్రపరాక్రమమును భార్గవునియం దుండెనని తాత్పర్యము

శ్లో. యేన రోషపరుషాత్మనః పితుః
శాసనే స్థితిభిదో ఽపి తస్థుషా,
వేపమాన జననీ శిరశ్ఛిదా
ప్రాగజీయత ఘృణా తతో మహీ. 65

వ్యాఖ్య: రోషపరుషాత్మనః-కోపముచేత కఠినమైన బుద్ధిగలవాడును, స్థితిభిదః, అపి-లోకమర్యాదను ఉల్లంఘించినవాడును అయినప్పటికిని, పితుః-తండ్రి యొక్క, శాసనే–ఆజ్ఞయందు, తస్థుషా-నిలిచినవాడై, వేపమాన జననీ శిరశ్ఛిదా-

వేపమాన-భయముచేత వణకుచున్న, జననీ-తల్లియొక్క, శిరశ్ఛిదా-తలను నరుకుచున్న, యేన-ఏభార్గవునిచేత, ప్రాక్-మొదట, ఘృణా-దయాభావము, తతః-తరువాత, మహీ-భూమండలమున్ను, అజీయత-జయింపఁ బడెనో; కోపముచేత కఠినత్వమునుపొందిన బుద్ధిగలవాఁడై లోకమర్యాద నుల్లంఘించిన తండ్రియాజ్ఞ ప్రకారము, భయకంపితురాలగుచున్న తల్లి శిరస్సును ఛేదించి, తనలోని దయను, తరువాత సమస్త రాజమండల శిరశ్ఛేదమున సకల సామ్రాజ్యమును జయించిన పరశురాముని జూచిరని భావము. తల్లిని చంపుటలో పితృవాక్యపాలనము చేసిన భార్గవునికి దుష్టరాజలోకమును జంపుట యేపాటిగొప్ప? ఇచ్చటి "ఆత్మన్" శబ్దమునకు "ఆత్మా జీవో ధృతి ర్బుద్ధిః" అను నమరవాక్యముచేత "బుద్ధి" అని యర్థము. దయాదాక్షిణ్యములు ధర్మనిర్వహణమునందు అడ్డురావనియు, రాకూడదనియు ఈ మాతృ శిరశ్ఛేద కృత్యమున వెల్లడియగుచున్నది. పితృవాక్య పరిపాలనమే ఇచ్చట ధర్మము.

శ్లో. అక్షబీజ వలయేన నిర్బభౌ
దక్షిణశ్రవణ సంస్థితేన యః
క్షత్రియాంతక రణై కవింశతేః
వ్యాజపూర్వ గణనా మి వోద్వహన్. 66

వ్యాఖ్య: యఃఏభార్గవుఁడు, దక్షిణశ్రవణ సంస్థితేన-కుడిచెవి పైననుండిన, అక్షబీజవలయేన-రుద్రాక్షల మాలచేత, క్షత్రియాంతక రణై కవింశతేః-క్షత్రియాంతక-క్షత్రియులను జంపునట్టి, రణ-యుద్ధములయొక్క, ఏకవింశతేః-ఇరువదియొక్క సంఖ్యయొక్క, వ్యాజపూర్వగణనాం-జపమాలారూప మిషతో మొదటినుండి చేయు లెక్కను, ఉద్వహన్, ఇవ-నిర్వర్తించుచున్నవాఁడువలె, నిర్బభౌ-అధికముగా ప్రకాశించుచుండెనో అట్టి భార్గవునిఁ జూచిరి. కుడిచెవిపైన ప్రేలాడుచున్న జపమాలా గణనము తాను చేసిన క్షత్రియవధాత్మక రణముల యేకవింశతి సంఖ్యకు సూచకమా? యనునట్లు అక్షమాలాధరుఁడగు పరశురాముఁడు వారికా తేజఃపుంజమునందు సాక్షాత్కరించె నని భావము.

శ్లో. తం పితు ర్వధభవేన మన్యునా
రాజవంశ నిధనాయ దీక్షితమ్,

బాలసూను రవలోక్య భార్గవం
స్వాం దశాం చ విషసాద పార్థివః. 67

వ్యాఖ్య: పితుః-తన తండ్రియగు జమదగ్ని ముని యొక్క, వధభవేన-క్షత్రియక ర్తృకమగు వధవలన పుట్టిన, మన్యునా-కోపముచేత, రాజవంశనిధనాయ-సర్వరాజవంశముల నాశమునకై, దీక్షితం-దీక్షవహించిన, తం, భార్గవం-ఆ పరశు రాముని, స్వాం, దశాం చ-తనదీనదశను, అవలోక్య-చూచి (ఆలోచించుకొని). బాలసూనుః-బాలురగు కుమారులుగల, పార్థివః-దశరథుడు, విషసాద-దుఃఖించెను, ఒకప్పుడు హైహయ క్షత్ర వంశీయుడగు, కార్తవీర్యార్జునుడు, జమదగ్ని మునీంద్రుని యాశ్రమమునకు ఆహారపానీయవాంఛతో వచ్చెను. జమదగ్ని యతనికి సగౌరవముగా నాహారపానీయము లిచ్చినప్పటికిని, హైహయుడు రాజ్యమదమున మునులనందరి నవమానించి, జమదగ్ని హోమధేనువుయొక్క వత్సము నెత్తుకొని పోయెను, ఫలసమిత్కాహరణమునకై వనమున కేగిన పరశురాముడు తిరిగి వచ్చి, తండ్రివలన కార్తవీర్యుని దుండగము నెఱిగి, సహింపలేక వెంటనే వెళ్ళి సహస్రబాహుడగు వానిని, వాని సైన్యమును తనపరశుధారల కాహుతి జేసెను. అది తెలిసిన హైహయుని కుమారులు, భార్గవుడు లేని సమయమున జమదగ్ని వద్దికి వచ్చి యతనిని వధించిరి. పరశురాముడు తిరిగి వచ్చి తల్లి దుఃఖమును, తండ్రి మృతశరీరమును జూచి, విషయము నెఱిగి, క్రోధావిష్టుడై, దుర్మార్గులగు క్షత్రియులందఱిని వధించి దేశమును అక్షత్రియముగా జేసెదనని దీక్షవహించి యట్లుచేసి, భూమండలమునంతటిని కాశ్యప మునీంద్రునికి యజ్ఞదక్షిణగా నిచ్చి, తాను మహేంద్రపర్వతమునందు తపస్సు చేసుకొనుచుండెను. ఆ భార్గవుడిప్పుడు శివధనుర్భంగ మొక క్షత్రియకుమారునిచేత జరుగుట తెలిసి వచ్చెను. అట్లు వచ్చిన క్షత్రియాంతకుడగు పరశురాముజూచి అశక్తుడైన దశరథుడు బాలురగు తన కొడుకులును, తానును ఏమగుదుమో! యన్న భయముతో పారిపోవుటకు సిద్ధముగానుండె నని భావము.

శ్లో. నామ రామ ఇతి తుల్య మాత్మజే
వర్తమాన మహితే చ దారుణే,

హృద్య మస్య భయదాయి చా భవ
ద్రత్నజాత మివ హారసర్పయోః. 68

వ్యాఖ్య : ఆత్మజే-తన కుమారుని యందును, దారుణే-భయంకరుఁడగు, అహితే, చ-శత్రువునందును, తుల్యం-సమానముగా, వర్తమానం-ఉంటూవున్న, "రామ" ఇతి, నామ-రాముఁడు అనుపేరు, హారసర్పయోః- హారమునందును సర్పమునందును, వర్తమానం-ఉన్నట్టి, రత్నజాతం, ఇవ-రత్నజాతివలె, అస్య-ఈ దశరథునికి, హృద్యం-హృదయమున జేరినట్టి, భయదాయి చ-భయమును గలిగించునదికూడ, అభవత్-అయ్యెను. ముత్యాలహారమునందును, సర్పము శిరస్సుపైనను, ఉండునది రత్నమే అయినప్పటికిని, రత్నశబ్దముచేత సర్పము స్ఫురణకు వచ్చినప్పుడు వలె, దారుణ శత్రువగు భార్గవునికిని, తన కుమారునికిని, నామధేయము "రామ" అని యుండుటచేత, "రామ" శబ్ద శ్రవణోచ్చారణములయందు భార్గవుఁడు స్మృతిలో మెలఁగి, దశరథుఁడు హృద్గత భయముచేత వణకిపోవుచుండెనని భావము.

శ్లో. "అర్ఘ్య మర్ఘ్య" మితి వాదినం నృపం
సోఽనవేక్ష్య భరతాగ్రజో యతః
ఉత్ర కోపదహ నార్చిషం తతః
సందధే దృశ ముదగ్రతారకామ్. 69

వ్యాఖ్య : సః-ఆ భార్గవుఁడు, అర్ఘ్యం అర్ఘ్యం, ఇతి, వాదినం- "పూజాద్రవ్యం పూజాద్రవ్యం" అని యనుచున్న, నృపం-దశరథుని, అనవేక్ష్య-చూడకయే, యతః-ఎచ్చట, భరతాగ్రజః-శ్రీరాముఁడు కలఁడో, తతః-ఆ ప్రదేశమునందు, ఉత్ర కోపదహనార్చిషం—ఉత్ర-క్షత్రియకుల విషయమునగల, కోపదహన-కోపాగ్ని యొక్క, అర్చిషం-జ్వాలవలె నున్నదియు, ఉదగ్రతారకాం-ఎత్తబడిన కనీనికలు గలదియునగు, దృశం-చూపును, సందధే-నిలిపెను. దశరథుఁ "డర్ఘ్యం అర్ఘ్యం" మని యంటున్నప్పటికిని అతనివైపు చూడక, శ్రీరాముఁడెచ్చట నుండెనో ఆ వైపును ఉత్ర కోపాగ్ని జ్వాలవంటి చూపును గ్రుడ్లు పైకెత్తి భార్గవుఁడు చూచెనని భావము. ఇచ్చట "యతః తతః" అనునవి, సార్వ విభక్తిక స్తసిః అను సంప్రదాయమున సప్తమ్యర్థమున ప్రయోగింపబడిన "తసిల్" ప్రత్యయాంతములగు నవ్యయములు.

శ్లో. తేన కార్ముక నిషక్త ముష్టినా
రాఘవో విగతభీః పురోగతః
అంగులీ వివర చారిణం శరం
కుర్వతా నిజగదే యుయుత్సునా. 70

వ్యాఖ్య : కార్ముక నిషక్త ముష్టినా-కార్ముక-ధనుస్సునందు, నిషక్త-గట్టిగా ఉంచబడిన, ముష్టినా-పిడికిగిగలవాఁడును, శరం-బాణమును, అంగులీ వివర చారిణం-వ్రేళ్ళ సందులయందు కదలుచున్న దానిని, కుర్వతా-చేయు చున్నవాఁడును, యుయుత్సునా-యుద్ధము చేయఁ గోరుచున్నవాఁడును నగు, తేన-ఆ భార్గవునిచేత, విగతభీః (సన్)-భయములేని వాఁడగుచు, పురోగతః-ఎదుటికి వచ్చిన, రాఘవః-శ్రీరాముఁడు, నిజగదే-గట్టిగా చెప్పబడెను. ధనుస్సునై ముష్టిని ఉంచి, బాణమును సంధించుచు, యుద్ధము చేయఁ దలచుకున్న పరశు రామునిచేత భయములేక యెదుట నిలుచున్న శ్రీరాముఁడు ముందు చెప్పఁబోవు రీతిగా గట్టిగాఁ జెప్పఁబడెను. ని + జగదే-నిజగదే. "గద" ధాతువునకు కర్మణి లిట్. "ని" ఉపసర్గము.

శ్లో. క్షత్రజాత మపకారవైరి మే
త న్నిహత్య బహుశః శమం గతః
సుప్తసర్ప ఇవ దండఘట్టనాత్
రోషితో ఽస్మి తవ విక్రమశ్రవాత్. 71

వ్యాఖ్య : క్షత్రజాతం-క్షత్రియజాతి, మే-నాకు, అపకార వైరి-పిత్రవధ రూపమయిన అపకారము చేయుటచేత శత్రువు, తత్-ఆ క్షత్రియజాతిని, బహుశః-అనేక పర్యాయములు (ఇరువది యొక్కసార్లు), నిహత్య-చంపి, శమం-శాంతిని, గతః (అస్మి)-పొందియున్నాను. (తథాపి-అట్లయినను) సుప్తసర్పః-నిద్రించి యున్న పాము, దండ ఘట్టనాత్, ఇవ-కఱ్ఱదెబ్బవలన వలె, తవ-నీ యొక్క, విక్రమ శ్రవాత్-పరాక్రమ శ్రవణమువలన, రోషితః-కోపము పొందింపబడిన వాఁడను, అస్మి-అగుచున్నాను. మా తండ్రిని చంపుటయను అపకారము చేసి నందున క్షత్రియులందరు నా శత్రువులే. కనుక వారిని ఇరువదియొక్క పర్యాయ

ములు భూప్రదక్షిణము చేయుచు చంపి శాంతించి యున్నాను. ఇప్పుడు నిద్రించిన పాపును కట్టితో బాపినట్లు నీ పరాక్రమ శ్రవణము గలుగుటవలన కోపము గల వాడనైతి నని భార్గవరాముడు దశరథరామునితో ననెను.

శ్లో. మైథిలస్య ధను రన్యపార్థివై ర్
త్వం కిలా నమితపూర్వ మక్షణోః
త న్నిశమ్య భవతా సమర్థయే
వీర్యశృంగ మివ భగ్న మాత్మనః. 72

వ్యాఖ్య : అన్యపార్థివైః-ఇతర క్షత్రియులచేత, అనమితపూర్వం-పూర్వము వంచబడనట్టి, మైథిలస్య-జనకుని యొక్క, ధనుః-ధనుస్సును, త్వం-నీవు, అక్షణోః కిల-విఱిచితివటకదా! తత్-ఆ ధనుర్భంగమును, నిశమ్య-విని, భవతా-నీ చేత, ఆత్మనః-నా యొక్క, వీర్యశృంగం-శౌర్యమనెడు కొమ్ము, భగ్నం, ఇవ-విఱువఁబడినట్లు, సమర్థయే-తలచుచున్నాను. ఇతర క్షత్రియు లెవ్వరును వంచనైనా వంచలేని జనకునింటిలోని శివధనుస్సును నీవు విఱిచివేసితివట కదా? ఆ వార్తను విని, నీచేత నా శౌర్యశృంగము భగ్నము చేయఁబడినట్లు తలఁచుచున్నానని భార్గవుఁడు రాఘవునితో ననెను.

శ్లో. అన్యదా జగతి "రామ" ఇత్యయం
శబ్ద ఉచ్చరిత ఏవ మా మగాత్
వ్రీడ మావహతి మే స సంప్రతి
వ్యస్తవృత్తి రుదయోన్ముఖే త్వయి. 73

వ్యాఖ్య : అన్యదా-ఇతర కాలమునందు (ఇంతకు పూర్వము) జగతి-లోకమునందు, "రామ" ఇత్యయం, శబ్దః- రాముఁడు అను ఈ శబ్దము, ఉచ్చరితః, సన్-పలుకఁబడినదగుచునే, మాం, ఏవ-నన్నే, అగాత్-పొందినది సంప్రతి-ఇప్పుడు, త్వయి-నీవు, ఉదయోన్ముఖే (సతి)-అభ్యుదయమును పొందుచున్నవాఁడవగుచుండగా, వ్యస్తవృత్తిః-విపరీత వృత్తిగల (మరియొకనిని చెప్పనట్టి) సః-ఆ రామ శబ్దము, మే-నాకు, వ్రీడం-సిగ్గును, ఆవహతి-కలిగించుచున్నది. ఇంతకు

పూర్వము "రామ" శబ్దము అభిధావృత్తిచేత నన్నే బోధించుచుండెను. దానికి నేనే యర్థము ఇప్పు డట్యుదయమును పొందుచున్న నిన్ను గూడ ఆ రామశబ్దము బోధించుచున్నదగుటచేత విపరీతవృత్తిగల యా శబ్దము నాకు సిగ్గును గూర్చు చున్నది. అని పరశురాముడు శ్రీరామునితో ననెను. ఇచ్చటి వృత్తి శబ్దమునకు ఆర్థబోధశక్తి యని యర్థము.

శ్లో. బిభ్రతో ఽస్త్ర మచలే ఽప్యకుంఠితం
ద్వా రిపూ మమ మతౌ సమాగసౌ
ధేనువత్సహరణా చ్చ హైహయః
త్వం చ కీర్తి మపహర్తు ముద్యతః. 74

వ్యాఖ్య : అచలే, అపి-క్రౌంచము మొదలగు పర్వత జాతియందును, అకుంఠితం-మొక్కవోనిదగు, అస్త్రం-ఆయుధమును, బిభ్రతః-ధరించుచున్న, మమ-నాకు, ద్వా-ఇద్దఱు, సమాగసౌ-తుల్యాపరాధములుగల, రిపూ-శత్రువులుగా మతౌ-తోచుచున్నారు. (వారెవ్వ రనగా) ధేనువత్స హరణాత్-ధేను-మా తండ్రి దగు హోమధేనువు యొక్క, వత్సహరణాత్-దూడను ఎత్తుకపోవుట యను అప రాధమువలన, హైహయశ్చ-కార్తవీర్యుడును, కీర్తిం-నా కీర్తిని, అపహర్తుం-అపహరించుటకు, ఉద్యతః-సిద్ధపడిన, త్వం, చ-నీవున్ను. క్రౌంచాది పర్వత భేదనమునం దకుంఠితాస్త్రము గల నాకు, మా తండ్రి హోమధేనువుదూడ నెత్తుక పోయిన కార్తవీర్యార్జునుడును, నా కీర్తి నపహరించుటకుఁ బూనిన నీవును, తుల్యాపరాధముగలఁ యిద్దఱే శత్రువులుగాఁ గనపడుచున్నారని భార్గవుఁడు రాము నితో ననెను.

శ్లో. క్షత్రియాంత కరణోఽపి విక్రమ
స్తేన మా మవతి నాజితే త్వయి
పావకస్య మహిమా స గణ్యతే
కక్షవజ్జ్వలతి సాగరేఽపి యః. 75

వ్యాఖ్య : తేన-ఆకారణముచేత (నీవు ముఖ్యశత్రుద్వయము నందొకడ వగుటచేత), క్షత్రియాంత కరణః, అపి-సకలక్షత్రియ వినాశమునకు సాధనమై

యుండినప్పటికిని, విక్రమః- నా పరాక్రమము, త్వయి-నీవు; అజితే (సతి)-జయింపఁబడనివాఁడవగుచుండగా; మాం-నన్ను. నావతి (న+అవతి)-తృప్తిపరచుటలేదు. (తథాహి-అదియంతే) పావకస్య-అగ్నియొక్క, మహిమా-గొప్పతనము; సః-అదియే, గణ్యతే-లెక్కింపఁబడును, యః-ఏది, కక్షవత్-కసవు గడ్డి మొదలగు దానియందు వలెనే, సాగరే, అపి- సముద్రమున దుస్సైతము, జ్వలతి-మండునో. క్షుద్ర క్షత్రియ వినాశమునకు దోడ్పడిన నా విక్రమము, నీవు జయింపఁబడని కారణమున, నాకు సంతోషమును గలిగించుటలేదు. గడ్డిగాదము నందువలెనే సముద్రజలమునందును జ్వలించినప్పుడే కదా! అగ్నియొక్క మహిమ లెక్కలోనికి వచ్చునది! అని జామదగ్న్యరాముఁడు దశరథరాముని తో ననెను. ఇచ్చట "అవతి" అనుక్రియ యుపయోగింపఁబడినది. దీనికి రక్షణము అర్థము నావతి-రక్షించుటలేదు, అనగా నిన్ను జయింపకపోయినందువలన నా శరీరము బాధాయుక్తముగా నుండి సంతోషములేకున్నదని స్ఫురింపఁజేయుట యుద్దేశము.

శ్లో. విద్ధి చాత్తబల మోజసా హరేః
ఐశ్వరం ధను రభాజి యత్త్వయా
ఖాతమూల మనిలో నదీరయైఃపాతయత్యపి మృదు స్తటద్రుమమ్. 76

వ్యాఖ్య : కించ-మరియును, ఐశ్వరం-ఈశ్వరునికి సంబంధించిన, ధనుః-ధనుస్సు, హరేః-విష్ణువుయొక్క, ఓజసా-బలముచేత, ఆత్తబలం, చ-హరింపఁబడిన సారముగలదిగాను; విద్ధి-తెలుసుకొనుము, యత్-ఏ ధనుస్సు, త్వయా-నీచేత, అభాజి-విఱువఁబడినదో; (తథాహి-అది యట్లే) నదీరయైఃనదీజల వేగములచేత, ఖాతమూలం-పెకలింపఁబడిన ప్రేళ్ళుగల, తటద్రుమం-ఒడ్డుపైనున్న వృక్షమును, మృదుః, అపి-కొద్దిపాటిదేయైనను, అనిలః-వాయువు, పాతయతి-పడవేయునుగదా! జనకునివద్దనున్న ఈశ్వరచాపము విష్ణుతేజస్సుచేత హరింపఁబడిన సారముగలదియై యున్నదనియు, అట్టిదానిని నీవు విఱిచితివనియు తెలిసికొనుము. నదీవేగముచేత పెకలింపఁబడిన ప్రేళ్ళుగలదైయున్న తీరస్థవృక్షమును సన్నపాటిగాలికూడ కూలద్రోయునుగదా! కనుక చిన్నవాఁడనైన నను శివధనుస్సును భగ్నముగావించితి నని గర్వపడకుము. అని భార్గవుఁడు రాఘవునితో ననెను.

శ్లో. తన్మదీయ మిద మాయుధం జ్యయా
సంగమయ్య సశరం వికృష్యతామ్
తిష్ఠతు ప్రధన మేవ మప్యహం
తుల్యబాహుతరసా జిత స్త్వయా. 77

వ్యాఖ్య : తత్-అందువలన, మదీయం-నాదియగు, ఇదం, ఆయుధం-ఈ ధనుస్సు, జ్యయా-అల్లెత్రాటితో, సంగమయ్య-కూర్చి, సశరం-బాణయుక్తమగు నట్లుగా, త్వయా-నీచేత, వికృష్యతాం-లాగబడునుగాక, ప్రధనం-యుద్ధము, తిష్ఠతు-అట్లుండనిమ్ము; ఏవం, అపి-నాధనువునట్లుచేయగలిగినప్పటికిని, అహం-నేను, తుల్యబాహుతరసా-సమానబాహుబలయుగల, త్వయా-నీచేత, జితః-జయింపబడినవాడనే యగుదును. కావున నాయాధనుస్సునకు నారినిగూర్చి, యెక్కుపెట్టి చూపుము. యుద్ధమునాట అట్లుండనీ, ఆవిధముగా ధనురాకర్షణమును జేయగలిగితివేని,సమానబలముగల నీచేత నేను ఓడిపోయినట్లే యని భార్గవుడనెను.

శ్లో. కాతరో ఽసి యది వోద్గతార్చిషా
తర్జితః పరశుధారయా మమ
జ్యా నిగూఢ కఠినాంగులి ర్వృథా
బధ్యతా మభయ యాచనాంజలిః. 78

వ్యాఖ్య : వా-లేక, ఉద్గతార్చిషా-జ్వాలలు ప్రగక్కుచున్న, మమ, పరశుధారయా-నాయొక్క గొడ్డలియంచుచేత, తర్జితః-బెదిరింపబడినవాడవై, కాతరః, అసి, యది-భీతిజెందినవాడవగుచున్నచో, జ్యా నిగూఢ కఠినాంగులిః - జ్యా-అల్లెత్రాటి యొక్క, నిగూఢ - లాగుటచే గలుగు దెబ్బల వలన, కఠిన-మొద్దుబారిన, అంగులిః-ప్రేళ్ళుగలవాడవగుట, వృథా-నిష్ప్రయోజనము. అభయ యాచనాంజలిః-అభయమును యాచించుదోయిలి, బధ్యతాం-కూర్చబడునుగాక. మంటలుప్రగక్కు నా పరశుధారచేత బెదిరింపబడి, భయకంపితుడవగుచున్నయెడల, నాధనుస్సు నెక్కుపెట్టి నారిదెబ్బలతో ప్రేళ్ళు మొద్దుబారజేసికొనుట వృథాప్రయత్నమే యగును. కనుక అభయమును యాచించుట కంజలిని బంధింపు మని యనెను (చంపవద్దని ప్రార్థింపుమని భావము).

శ్లో. ఏవ ముక్తవతి భీమదర్శనే
భార్గవే స్మిత వికంపితాధరః
తద్ధనుర్గ్రహణ మేవ రాఘవః
ప్రత్యపద్యత సమర్థ ముత్తరమ్. 79

వ్యాఖ్య : భీమదర్శనే-భయంకరుడై కనబడుచున్న, భార్గవే-పరశురాముడు ఏవం-ఈపైన జెప్పినరీతిగా, ఉక్తవతి-(సతి) పలికినవాడగుచుండగా, రాఘవః-శ్రీరాముడు, స్మితవికంపితాధరః (సన్)-చిఱునగవుచేత కదల్పబడిన యధరోష్ఠము గలవాడగుచు, తద్ధనుర్గ్రహణం, ఏవ-ఆభార్గవుని ధనుస్సును గ్రహించుటయే, సమర్థం-ఉచితమగు, ఉత్తరం-సమాధానమునుగా, ప్రత్యపద్యత-అంగీకరించెను. భయంకరరూపముగల భార్గవుడట్లు చులకనచేసి పలుకగా రాఘవుడు చిఱునవ్వుచేత కంపించుచున్న పెదవిగలవాడగుచు నతనిధనువు నెక్కుపెట్టి బాణ సంధానము చేయుటయే తగిన సమాధానమగునని యట్లు చేయబూనెను.

శ్లో. పూర్వజన్మధనుషా సమాగతః
సో ఽతిమాత్ర లఘుదర్శనో ఽభవత్
కేవలో ఽపి సుభగో నవాంబుదః
కిం పున స్త్రిదశచాప లాంఛితః. 80

వ్యాఖ్య : పూర్వజన్మధనుషా-పూర్వజన్మయగు నారాయణావతారము నందలి ధనుస్సుచేత, సమాగతః-కూడిన, సః-ఆరాముడు, అతిమాత్ర లఘుదర్శనః- ఎక్కువగా ప్రియదర్శనుడు, అభవత్-అయ్యెను. (ఎట్లనగా) నవాంబుదః-తొలకరిమేఘము, కేవలః, అపి-ఏహంగులులేక సామాన్యముగా నున్నప్పుడే, సుభగః-అందముగానుండును. త్రిదశచాపలాంఛితః-ఇంద్రధనుస్సుతో చిహ్నితమై యున్నప్పుడు, కిం పునః-ఏమి చెప్పవలెను? శ్రీరాముడు నారాయణావతారమున ధరించిన చాపనే యిప్పుడు భార్గవునివద్దనున్నది. కనుక ఆధనుస్సును పట్టుకొన్నరాఘవుడు మిక్కిలి ప్రియదర్శనుడై కన్పట్టెను. వర్షాకాల మేఘము వట్టిగానే యందమై యుండును. ఇక

దానిపై నింద్రధనుస్సు చేరినప్పు డెంతయందముగానుండునో చెప్పవలెనా? అట్లే సహజసుందరుఁడగు రాఘవుఁడు వైష్ణవ ధనుస్సును ధరింపగానే మిక్కిలి దర్శనీయ సౌందర్యముగలవాఁ డయ్యె నని భావము. లఘు శబ్దము సుందరార్థకము.

శ్లో. తేన భూమినిహితైకకోటి త
త్కార్ముకం చ బలినా ధికోపితమ్
నిష్ప్రభ శ్చ రిపు రాస భూభృతాం
ధూమ శేష ఇవ ధూమకేతనః. 81

వ్యాఖ్య : బలినా-బలవంతుఁడగు, తేన-ఆరాఘవునిచేత, భూమి నిహితైక కోటి—భూమి-భూమిమీద, నిహిత-ఉంచఁబడిన, ఏకకోటి-ఒకచివరగల, తత్, కార్ముకం చ-ఆభార్గవుఁడిచ్చిన ధనుస్సుగూడ, అధిరోపితం-అల్లెత్రాడుగూర్చి యెక్కుపెట్టబడిన దయ్యెను. భూభృతాం-రాజులకు, రిపుఃచ-శత్రువగు భార్గవుఁడుగూడ, ధూమశేషఃపొగతో మిగిలిన, ధూమకేతనఃఇవ-అగ్నివలె, నిష్ప్రభఃనిస్తేజస్కుఁడు, ఆస-అయ్యెను. ఒక ధనుఃకోటిని నేలపైనుంచి, నారినిఁ గూర్చి, రాఘవుఁడు విల్లునెక్కుపెట్టుటను జూచిన భార్గవుఁడు, పొగమాత్రము మిగిలిన యగ్నివలె నిస్తేజస్కుఁడయ్యెను. అతనిమొగము పరాభవముచేత కళాహీన మయ్యెనని భావము.

శ్లో. తా వుభా వపి పరస్పరస్థితా
వర్ధమాన పరిహీన తేజసౌ
పశ్యతి స్మ జనతా దినాత్యయే
పార్వణౌ శశిదివాకరా వివ. 82

వ్యాఖ్య : పరస్పరస్థితౌ-ఒకరినొకరు ఎదుర్కొనియున్నవారును, వర్ధమాన పరిహీన తేజసౌ-పెరుగుచున్నదియు, తరుగుచున్నదియు నగు తేజస్సులుగల, తౌ, ఉభౌ, అపి-ఆరాఘవ భార్గవులిద్దఱను, దినాత్యయే-సాయంకాలమునందు, పార్వణౌ-పూర్ణిమయందుండిన, శశి దివాకరౌ, ఇవ-చంద్రసూర్యులనువలె, జనతా-జనసమూహము, పశ్యతి, స్మ-చూచెను. అప్పుడు యోద్ధలై యొకరినొకరు ఎదు

క్కొనియున్న రామ భార్గవులలో రామునితేజస్సు పెరుగుచును, భార్గవుని తేజస్సు తరుగుచును ఉండగా, వారు జనసమూహమునకు పూర్ణిమనాటి సాయంకాలము నందలి చంద్ర సూర్యులవలెఁగనపడి రని భావము. ఇచ్చట రామునికి చంద్రుని తోను, భార్గవునికి సూర్యునితోను ఔపమ్యమును గ్రహింపవలెను. "పార్వణౌ" అనగా పర్వమునందున్నవారని యర్థము. పూర్ణిమ పంచపర్వములలో నొకటి కావున సందర్భానుసారముగా దానినే గ్రహింపవలెను. ఆనాడే సూర్యుఁడస్తమించు చుండఁగాఁ జంద్రుఁడు తేజోరాశి యగుట కననగునుగదా!

శ్లో. తం కృపామృదు రవేక్ష్య భార్గవం
రాఘవః స్ఖలితవీర్య మాత్మని
స్వం చ సంహిత మమోఘ మాశుగం
వ్యాజహార హరసూనుసన్నిభః. 83

వ్యాఖ్య : హరసూనుసన్నిభః-శివునికుమారుఁడగు షణ్ముఖునితో సమానుఁడును, కృపామృదుః-దయచేత మెత్తనివాఁడునునగు, రాఘవః-శ్రీరాముఁడు, ఆత్మని-తనవిషయమున, స్ఖలితవీర్యం-కుంఠితశక్తిగల, తం, భార్గవం-ఆపరశురాముని, స్వం-తనదియు, సంహితం-సంధానము చేయఁబడినదియు, అమోఘం-వ్యర్థముకానిదియు నగు, ఆశుగం, చ-బాణమునున్ను, అవేక్ష్య-చూచి, వ్యాజహార-పలికెను. కుమారస్వామివంటి పరాక్రమవంతుఁడైనప్పటికిని దయాశాలియగు రాముఁడు తనవిషయమున గళితశౌర్యుఁడైయున్న భార్గవుని దీనదశను, తానెక్కు పెట్టిన బాణము వృథగాఁబోవునది గాకుండుటయుఁ దలఁచి పరశురామునితో ముందు చెప్పఁబోవురీతిని భాషించెను.

శ్లో. న ప్రహర్తు మల మస్మి నిర్దయం
విప్ర ఇత్య భిభవత్యపి త్వయి
శంస కిం గతి మనేన పత్త్రిణా
హన్మి లోక ముత తే మభార్జితమ్? 84

వ్యాఖ్య : అభిభవతి. అపి-నన్ను తిరస్కరించుచున్న వాఁడవైనను, త్వయి-నీయందు, విప్రః, ఇతి-బ్రాహ్మణుఁడవగుటచేత, నిర్దయం-దయాహీనముగా, ప్రహర్తుం-బాణమును వేయుటకు, అలం-శక్తుఁడను, న, అస్మి-కాలే

కున్నాను. కాని, అనేన, పత్త్రిణా-ఈబాణముచేత, తే-నీయొక్క, గతిం-గమనమును, హన్మ, కిం-నశింపఁజేయుదునా? ఉత-లేక, మఖార్జిత-యజ్ఞాదులచేత సంపాదింపఁబడిన, లోకం-స్వర్గమును, హన్మి కిం-నశింపఁజేయుదునా? శంస-చెప్పుము. నీవు నన్ను తిరస్కరించుచున్నప్పటికిని, బ్రాహ్మణుఁడవు కనుక, నీపై బాణమువేసి, చంపి, బ్రహ్మహత్యాపాపము నొడిగట్టుకొనుటకు సిద్ధపడలేను. కావున, అమోఘమైన నాయీబాణముచేత నీగమనము నాపివేయమందువా? లేక, నీవు తపోయజ్ఞాదులచేత నార్జించిన స్వర్గమును ధ్వంసముచేయమందువా? చెప్పుమని రాఘవుఁడు భార్గవుని నడిగెను.

శ్లో. ప్రత్యువాచ త మృషి ర్న తత్వతః
త్వాం న వేద్మి పురుషం పురాతనమ్
గాం గతస్య తవ ధామ వైష్ణవం
కోపితో హ్యసి మయా దిదృక్షుణా. 85

వ్యాఖ్య : ఋషిః-భార్గవుఁడు, తం-అట్లుపలికిన రాముని గుఱించి, ప్రత్యువాచ-బదులుపలికెను. (ఏమని?) తత్త్వతః-యథార్థముగా, త్వాం-నిన్ను, పురాతనం, పురుషం-పురాణపురుషుని, న వేద్మి న-ఎఱుగననుటలేదు. కింతు-కాని, గాం, గతస్య-భూలోకమును జేరినట్టి, తవ-నీయొక్క, వైష్ణవం-విష్ణుసంబంధమగు, ధామ-తేజస్సును, దిదృక్షుణా-చూడఁదలచుకొన్నట్టి, మయా-నాచేత, కోపితః, హి-కోపమువచ్చినవాడవుగాఁ జేయఁబడినవాడవు, అసి-అగుచున్నావు. అట్లు శరసంధానముచేసి పలికిన రాఘవునికి భార్గవుఁడిట్లు బదులుపలికెను - మహాత్మా! నిజముగా నీవు పురాణపురుషుఁడవగు నారాయణుఁడవని నేనెఱుఁగని విషయము కాదు. భూలోకమున దశరథసుతుఁడవుగా నవతరించిన నీయందు వైష్ణవతేజస్సు ఏ స్థితిలో నున్నదో చూడఁదలఁచుకొని యట్లు నీకు కోపమువచ్చునట్లు చేసితినికాని వేఱుకాదు.

శ్లో. భస్మసా తత్కృతవతః పిత్రద్విషః
పాత్రసా చ్చ వసుధాం ససాగరామ్

ఆహితో జయవిపర్యయో ఽపి మే
శ్లాఘ్య ఏవ పరమేష్ఠినా త్వయా. 86

వ్యాఖ్య : పితృద్విషః-నా తండ్రి శత్రువులను, భస్మసాత్, కృతవతః-భస్మము చేసి వేసినట్టియును, ససాగరాం-సముద్రములతోఁగూడిన, వసుధాం-భూమిని, పాత్రసాచ్చ, కృతవతః-సత్పాత్రదానముగా నిచ్చివేసినట్టియును, మే-నాకు, పరమేష్ఠినా-పరమ పురుషుఁడవగు, త్వయా-నీచేత, ఆహితః-చేయఁబడిన, జయవిపర్యయః, అపి-పరాజయము కూడ, శ్లాఘ్యః, ఏవ-ఆనందముతోఁగోరఁదగిన దియే. ఇంకను భార్గవుఁ డిట్లనుచున్నాడు, నా పితృవైరులను కోపముచేత భస్మీభూతులను జేసినాను. నేను క్షత్రియ జాతమును సంహరించి, స్వాధీనము చేసికొన్న సమస్త భూమండలమును, సత్పాత్రయగు కశ్యపునికి యజ్ఞదక్షిణగా నిచ్చినాను. ఇట్లు కృతకృత్యుఁడనై యున్న నాకు, పురాణపురుషుఁడవు, పరమేష్ఠివి అగు నీ చేత గలుగు పరాజయముకూడ సంతోషముతోఁ గోరఁదగినదే కాని అన్యము కాదు.

శ్లో. తత్ గతిం మతిమతాం వరేప్సితాం
పుణ్యతీర్థగమనాయ రక్ష మే
పీడయిష్యతి న మాం ఖిలీకృతా
స్వర్గపద్ధతి రభోగ లోలుపమ్. 87

వ్యాఖ్య : తత్-ఆ కారణమువలన, హేమతిమతాంవర!-ఓ బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! పుణ్యతీర్థగమనాయ-పుణ్య తీర్థములకు వెళ్ళుటకొఱకు, ఈప్సితాం-ఇష్టముగల, మే-నా యొక్క, గతిం-గమన శక్తిని, రక్ష-కాపాడుము. ఖిలీకృతా-వెళ్ళుటకు వీలుపడనట్లు చెఱుపఁబడిన దైనను, స్వర్గపద్ధతిః-స్వర్గమార్గము, అభోగ లోలుపం-భోగములయందు నిస్పృహగల వాఁడనగు, మాం-నన్ను,న పీడయిష్యతి-బాధింపఁజాలదు. ఓ మతిమంతుఁడా! అనేక పుణ్యతీర్థముల కేగి యచ్చట తపో నిష్ఠలో నుండఁదలచిన నాకు కాళ్ళు లేకుండ జేయకుము. ఇంక నాకు స్వర్గసౌఖ్యాభిలాష లేదు కనుక, నేను వెళ్ళఁబోవు స్వర్గమార్గమును నీవు దుర్గముగాఁ జేసినప్పటికిని నాకు బాధలేదు. స్వర్గమార్గమునే బాణమువేసి చెఱుపుము అని కోరెను.

శ్లో. ప్రత్యపద్యత తథేతి రాఘవః
ప్రాజ్ముఖ శ్చ విససర్జ సాయకమ్

భార్గవస్య సుకృతో ఽపి సోఽ భవత్
స్వర్గమార్గ పరిఘో దురత్యయః. 88

వ్యాఖ్య : రాఘవః-శ్రీరాముఁడు, తథేతి (తథా + ఇతి)-సరే యని, ప్రత్య పద్యత-ఆంగీకరించెను. ప్రాఙ్ముఖః-తూర్పునకు మరలినవాఁడై, సాయకం-ఎక్కు పెట్టిన బాణమును, విససర్జ, చ-విడువనుగూడ విడిచెను. సః-ఆ బాణము, సుకృతః, అపి-మంచిపనులు చేసిన పుణ్యాత్ముఁడే యైనప్పటికిని, భార్గవస్య-పరశురామునికి, దురత్యయః-ముందునకు వెళ్ళనీక అడ్డగించునట్టి, స్వర్గమార్గ పరిఘః-స్వర్గమార్గమునకు గడియగా, అభవత్-అయ్యెను. భార్గవుఁడు కోరిన కోరికను అంగీకరించి, రాఘవుఁడు ప్రాఙ్ముఖుఁడై తాను సంధానము చేసిన బాణమును వదలెను. ఆ బాణము, పుణ్యాత్ముఁడే అయియున్నప్పటికిని, పరశురామునికి స్వర్గమార్గమును మూసివేసిన గడియగా మారెను అనఁగా భార్గవుఁడు స్వర్గమున కిఁక వెళ్ళుటకు వీలులేదని భావము.

శ్లో. రాఘవో ఽపి చరణౌ తపోనిధేః
క్షమ్యతా మితి వదన్ సమస్పృశత్
నిర్జితేషు తరసా తరస్వినాం
శత్రుషు ప్రణతి రేవ కీర్తయే. 89

వ్యాఖ్య : రాఘవః, అపి-రాముఁడు కూడ, క్షమ్యతాం-క్షమింపఁబడుదును గాక, ఇతి, వదన్-అనియనుచు, తపోనిధేః-భార్గవునియొక్క, చరణౌ-పాదములను, సమస్పృశత్-పట్టుకొని నమస్కరించెను. తరస్వినాం-బలవంతులకు, తరసా-తమ బలముచేత, నిర్జితేషు-ఓడింపఁబడిన, శత్రుషు-శత్రువుల విషయమున, ప్రణతిః, ఏవ-నమస్కారమే, కీర్తయే-కీర్తినిఁగలిగించునుగదా! అట్లు భార్గవుని స్వర్గ మార్గమును ధ్వంసము చేసిన రాఘవుఁడు, "నేను క్షమింపఁబడుదునుగాత". అని భార్గవుని పాదములపైఁ బడి నమస్కరించెను. పరాక్రమవంతులకు, తమచే నిర్జింపఁబడిన శత్రువులను నమస్కారాదులచేతఁ బ్రసన్నులను జేయుటయే మిక్కిలి యశస్కరము అని భావము. రాముఁడు భార్గవుని గర్వము నణచుట కట్లు చేసెనే కాని యతనియందు సంపూర్ణ వినయ గౌరవము లుడినట్లు "తపోనిధి" "సమస్పృశత్" పదములు దెలుపుచున్నవి.

శ్లో. రాజసత్వ మవధూయ మాతృకం
పిత్ర్య మస్మి గమితః శమం యదా
న న్వనింది తఫలో మమ త్వయా
నిగ్రహో ఽప్యయ మనుగ్రహీకృతః. 90

వ్యాఖ్య : మాతృకం-తల్లిద్వారా సంక్రమించిన, రాజసత్వం-రజోగుణ ప్రధానత్వమును, అవధూయ-తొలగించివేసి, పిత్ర్యం-తండ్రిద్వారా సంక్రమించిన శమం-శాంతిని, యదా-ఎప్పుడైతే, గమితః-పొందింపబడినవాడను, అస్మి-అగుచున్నానో, తదా-అప్పుడే, త్వయా-నీచేత, మమ-నాకు, అనిందితఫలః-ఇష్టమయిన స్వర్గహానియే ఫలముగాగల, అయం, నిగ్రహః-ఈయపకారము, అనుగ్రహీకృతః, నను-ఉపకారముగా జేయబడినది సుమా! రాఘవా! నేను, మహా తపస్వియగు జమదగ్నికి క్షత్రియ కన్యయగు రేణుకయం దుద్భవించుటచేత, మాతృకమగు రాజస గుణమును, పిత్ర్యమగు శాంతగుణమును గలవాడనై యుంటిని. నీవు నన్ను రాజసగుణముల (కోపగర్వాదులు) నుండి దూరముచేసి, తపస్వికుండ వలసిన శాంతగుణ ప్రధానునిజేసితివి. స్వర్గసౌఖ్యము నాకిష్టము కానిది, దానిని భంజించుటయను నీ నిగ్రహము, నాకు అనుగ్రహమే యైనది. ఇంతకన్న నేమి యుపకారము కావలయును? అని పరశురాముడు రాఘవుని శ్లాఘించెను. ఆనాటి నుండి భార్గవుడు రాగద్వేషములులేని మహాముని యయ్యెను.

శ్లో. సాధయా మ్యహ మవిఘ్నమస్తు తే
దేవకార్య ముపపాదయిష్యతః
ఊచివా నితి వచః సలక్ష్మణం
లక్ష్మణాగ్రజ మృషి స్తిరోదధే. 91

వ్యాఖ్య: అహం-నేను, సాధయామి-వెళ్ళుచున్నాను. దేవకార్యం-రావణవధాది దేవకార్యమును, ఉపపాదయిష్యతః-సంపాదింపగలుగునట్టి, తే-నీకు, అవిఘ్నం-విఘ్నాభావము, అసు-అగునుగాక. సలక్ష్మణం-లక్ష్మణునితోగూడిన, లక్ష్మణాగ్రజం-శ్రీరాముని గురించి, ఇతి-ఈవిధమగు, వచః-మాటను, ఊచివాన్-పలికినట్టి, ఋషిః-భార్గవరాముడు, తిరోదధే-అంతర్ధానమును పొందెను. నేను

వెళ్ళుచున్నాను. దేవతలు ప్రార్థింపగా రాముడవై పుట్టి, వారి కార్యమగు రావణ వధాదికమును ముందుచేయబోవునట్టి నీకు అవిఘ్నము అగుగాక. అన్నమాటను సలక్ష్మణుడగు రామునికి జెప్పి మహర్షియగు పరశురాముడంతర్ధానమును బొందెను. ఇచ్చట "సలక్ష్మణం" అనునది సాభిప్రాయవిశేషణము. రాముడు అరణ్యవాస, రావణవధాదికమును లక్ష్మణసహితుడై చేయబోవునుగదా! అందు వలన లక్ష్మణుడు సైతము వినునట్లు ఆశీర్వదించెను. అలంకారము: పరికరము.

శ్లో. తస్మిన్ గతే విజయినం పరిరభ్య రామం
స్నేహా దమన్యత పితా పున రేవ జాతమ్
తస్యా భవత్ క్షణశుచః పరితోషలాభ
కక్షాగ్నిలంఘితతరో రివ వృష్టిపాతః. 92

వ్యాఖ్య: తస్మిన్-ఆభార్గవుడు, గతే (సతి)- వెళ్ళిపోయినవాడు కాగానే, విజయినం-విజయమును పొందిన, రామం-శ్రీరాముని, పితా-తండ్రియగు దశరథుడు, స్నేహాత్-వాత్సల్యమువలన, పరిరభ్య-ఆలింగనము చేసికొని, పునః, జాతం, ఏవ-మళ్ళి పుట్టిన వానినిగానే, అమన్యత-తలచుకొనెను. క్షణశుచః-క్షణకాలము దుఃఖమును పొందినట్టి, తస్య-ఆ దశరథునికి, పరితోషలాభః-సంతోషప్రాప్తి, కక్షాగ్ని లంఘితతరోః-కక్ష-ఎండిన వనము నందలి, అగ్ని-అగ్నిచేత (దావాగ్నిచేత), లంఘిత-చుట్టివేయబడిన, తరోః-వృక్షమునకు, వృష్టిపాతః, ఇవ-వర్షపాతమువలె, అభవత్-అయ్యెను. అట్లు ఆశీర్వదించి భార్గవుడు వెళ్ళిపోగానే, విజయమును పొందిన రాముని తండ్రియగు దశరథుడు గాఢాలింగనము చేసికొని, కొడుకుపైగల స్నేహవాత్సల్యములచేత రాముడు పునర్జన్మ యెత్తినట్లు భావించి, సంతోషపడెను. క్షణమాత్రదుఃఖము ననుభవించిన దశరథుని కాసంతోషము, దావాగ్నిచేత చుట్టబడిన వృక్షమునకు వర్షపాతమువలె నుండెను. ఇచ్చట "పునరేవ జాతం" అనువాక్యము, భార్గవుడు, శ్రీరాముడు పరాత్పరుడనియు, దేవకార్యమును సాధించుటకు అవతరించిన నారాయణుడనియు పలికిన పలుకులు విన్న దశరథుడు, మరుక్షణమునందే పుత్రవాత్సల్యలోలుడై రాముని మరల సామాన్యుడగు తనపుత్రుడే యని భావించెనన్న యర్థాంతరమును గూడ స్ఫురింప జేయుచున్నది. అలంకారము: ఉపమ.

శ్లో. అథ పథి గమయిత్వా క్లుప్తరమ్యోపకార్యే
కతిచి దవనిపాలః శర్వరీః శర్వకల్పః
పుర మవిశ దయోధ్యాం మైథిలీదర్శనీనాం
కువలయితగవాక్షాం లోచనైః రంగనానామ్. 93

వ్యాఖ్య: అథ-ఆపిమ్మట, శర్వకల్పః-ఇంచుమించుగా శంకరునియంత వాఁడగు, అవనిపాలః-దశరథుఁడు, క్లుప్తరమ్యోపకార్యే-అలంకరింపబడిన యంద మగుడేరాలు గల, పథి-మార్గమునందు, కతిచిత్, శర్వరీః-కొన్నిరాత్రులను, గమయిత్వా-గడపి, మైథిలీదర్శనీనాం-సీతను జూడదలచిన, అంగనానాం-పురస్త్రీల యొక్క, లోచనైః-కన్నులచేత, కువలయితగవాక్షాం-కువలయిత-కలువలుగలవిగాఁ జేయఁబడిన, గవాక్షాం-మేడల కిటికీలుగల, పురం, అయోధ్యాం-పట్టణమగు నయోధ్యను, అవిశత్-ప్రవేశించెను. ఆ తరువాత నచ్చటచ్చట యందమైన డేరాలతో నేర్పరుపఁబడిన విడుదులయందు కొన్ని రాత్రులు గడపిన దశరథుఁడు, కోదండ్రతోను,కొడుకులతోను సీతనుజూచుటకై యుత్సాహపడుచున్నపురాంగనలకన్నులచేత మేడల కిటికీ లన్నియు కలువలతో నిండినట్లు శోభించుచున్న అయోధ్యానగరమును ప్రవేశించెను. పరశురామునికి కుమారస్వామి సహాధ్యాయి. అట్లే రాముఁడు కుమారస్వామితో సమానుఁడై భార్గవుని నిర్జించుటవలన నట్టి కుమారుఁడు గల దశరథుఁడు శర్వకల్పుఁడని కవి వర్ణించెను. కువలయితగవాక్షాం అనుచోట పురస్త్రీల కన్నులకును కలువలకును అభేదము చెప్పుటచేత రూపకాతిశయోక్తి అలంకారము ధ్వనించుచున్నది. ఇది సీతా వివాహ వర్ణనాత్మకమగు నేకాదశ సర్గము.

ఇది మహాకవి కాళిదాస కృత
రఘువంశకావ్యమున సీతా వివాహ వర్ణనమను ఏకాదశ
పూర్ణమునకుఁ కేశవపంతుల నరసింహశాస్త్రి రచిత దెలుఁగు
లఘువ్యాఖ్య.

శ్రీః

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

ద్వాదశసర్గము

శ్లో. నిర్విష్టవిషయస్నేహః స దశాంత ముపేయివాన్,
ఆసీ దాసన్ననిర్వాణః ప్రదీపార్చి రివోషసి. 1

వ్యాఖ్య : నిర్విష్టవిషయస్నేహః- నిర్విష్ట-ఉపభుక్తములైన, విషయ-భోగ్యవస్తువులనెడు, స్నేహః-వాంఛితములుగలవాఁడును, దశాంతం-జీవనస్థితియొక్క అంతమును (వార్ధకమును), ఉపేయివాన్-పొందియున్నట్టి, సః-(అట్లు సీతాకల్యాణానంతరము స్నుషాపుత్రాదులతో అయోధ్యానగరమునకుఁ జేరిన) ఆ దశరథుఁడు, ఉషసి-ఉషఃకాలమునందు, ప్రదీపార్చిరివ (ప్రదీపార్చిఃఇవ)-దీపజ్వాలవలె, ఆసన్ననిర్వాణః-సమీపించిన మోక్షము (మరణము) గలవాఁడు, ఆసీత్-అయ్యెను. దీపజ్వాలాపక్షమున నిర్విష్టవిషయస్నేహః-నిర్విష్ట-నశించిన (తగ్గిపోయిన), విషయ-ప్రమిదయందలి, స్నేహః-నూనెగలదియునియు, దశాంతం-వత్తియొక్క చివరిభాగమనియు, ఆసన్ననిర్వాణః-సమీపించిన వినాశము గలదియనియు నర్థములు. జీవితకాలమున సర్వసుఖములు అనుభవించి చివరిదశకుఁజేరిన దశరథుఁడు, రాత్రివేళ చక్కఁగావెలిగి, తైలము తగ్గిపోయినపిమ్మట, వత్తిచివరికివచ్చి చల్లారిపోవనున్న దీపకళికవలె, మోక్షమునకై వేచియుండెనని భావము. దీపోపమానము, మానవుఁడు తనయవసరమున్నంతవఱకే వెలిగి పిమ్మట నశించునన్న తత్త్వమును బోధించుచున్నది. "స్నిహ్యంతి పురుషా యేషు ఇతి స్నేహాఃశబ్దాదయః" అని స్నేహశబ్ద వ్యుత్పత్తి. "నిర్వాణం నిర్వృతౌ మోక్షే వినాశే గజమజ్జనే" యని యాదవ నిఘంటువు.

శ్లో. తం కర్ణమూల మాగత్య రామే శ్రీ ర్న్యస్యతా మితి,
కై కేయీశంక యే వాహ పలితచ్ఛద్మనా జరా. 2

వ్యాఖ్య : జరా-వృద్ధత్వము, కైకేయీశంకయా, ఇవ-కైకయందలి అను మానముచేతనో యన్నట్లు, పలితచ్ఛద్మనా-నరసిన వెండ్రుకల మిషచేత, కర్ణ మూలం-దశరథుని చెవి సమీపమునకు, ఆగత్య-చేరి, రామే-శ్రీరామునియందు, శ్రీ:-రాజ్యలక్ష్మి, న్యస్యతాం-ఉంచబడునుగాక; ఇతి-ఇట్లని, తం-అతనిని (ఆ దశరథునికి), ఆహ-చెప్పెను, వృద్ధత్వము (కర్త) చెవులవద్ద తెల్లబడిన జుట్టు రూపమున, కైకేయి వినిపోవునోయేమో! అను ననుమానముచేత, దశరథుని చెవి వద్దికి వచ్చి "రామునిపై రాజ్యలక్ష్మి నుంచుము" అని దశరథునితో జెప్పెను. అనగా దశరథుడు తాను వృద్ధుడైపోయినందున రామునికి యౌవరాజ్యపట్టాభిషేకము జేయుటకు దలపెట్టి నని భావము. ముదుసలితనమునకు జెపులవద్ది వెండ్రుకలు తెల్లబడుట మొదటి చిహ్నము గదా!

శ్లో. సా పౌరాన్ పౌరకాంతస్య రామ స్యాభ్యుదయశ్రుతిః,
ప్రత్యేకం హ్లాదయాంచక్రే కుల్యా ఓదాన్యపాదపాన్. 3

వ్యాఖ్య : సా-ఆ, పౌరకాంతస్య-పురజనులకు మనోహరుడగు. రామస్య-రామునియొక్క, అభ్యుదయశ్రుతిః-పట్టాభిషేకరూపమగు నభ్యుదయవార్త,కుల్యా-కాలువ, ఉద్యానపాదపాన్, ఇవ-తోటయందలి చెట్లనువలె, పౌరాన్-పురజనులను, ప్రత్యేకం-ఒక్కొక్కటిగా, హ్లాదయాంచక్రే-ఆనందపరచెను. ఉద్యానవనము నందలి నీటికాలువ యొక్కొక్కచెట్టుపాదును జేరి యచ్చటి వృక్షము నానందపరచినట్లు రామపట్టాభిషేకవార్త ప్రతి నగరవాసి నత్యంతముగా సంతోషపరచె నని భావము. "శ్రూయతే" ఇతి శ్రుతిః-వినబడునది కనుక వార్తకు "శ్రుతిః" అని పేరు. ఇది స్త్రీలింగము. "కుల్యా" అనునదియు స్త్రీలింగమే. స్త్రీభాషణమువలె జల్లగా మెల్లగా రామపట్టాభిషేకవార్త ప్రతి మనిషి చెవికిని జేరి యానంద పరచినదట!

శ్లో. తస్యాభిషేకసంభారం కల్పితం క్రూరనిశ్చయా,
దూషయామాస కైకేయీ శోకోష్ణైః పార్థివాశ్రుభిః. 4

వ్యాఖ్య : క్రూరనిశ్చయా-భయంకరమైన కార్యనిశ్చయముగల, కైకేయీ-కైక, తస్య-ఆ రామునికి, కల్పితం-ఏర్పాటుచేయబడిన అభిషేకసంభారం-పట్టాభి

షేకమునకుఁ గూర్చిన వస్తుజాతమును, శోకోష్ణేఁ-దుఃఖముచేత వేడియెక్కిన, పార్థివాభిఁ-రాజు కన్నీళ్ళచేత, దూషయామాస-చెడిపోవునట్లు చేసెను. తన కార్యమును సాధించుకొనుటలో మొండిపట్టుదల గల కైకేయి రాముని పట్టాభిషేక వార్తచే నేడ్చుచు, తన్మూలకమైన దశరథ దుఃఖాభ్రువులచేత అభిషేకసంభారము నంతటిని చెడఁగొట్టెను. అనఁగా దశరథుఁడు తాను కూర్చిన సంభారము నంతటిని వ్యర్థముగాఁ దలఁచి దుఃఖించెననియు, నావిధముగా కైక రామపట్టాభిషేకమును ఆపె ననియు భావము.

శ్లో. సా కిలాశ్వసితా చండీ భర్త్రా తత్సంశ్రుతౌ వరౌ,
ఉద్వావా మేంద్రసిక్తా భూ ర్బిలమగ్నా వివోరగౌ. 5

వ్యాఖ్య : చండీ-అతికోపముగల, సా-ఆ కైకేయి, భర్త్రా-భర్తచేత, ఆశ్వసితా (సతీ)-బ్రతిమాలి యోదార్ఛఁబడినదగుచు, తత్సంశ్రుతౌ (తత్ + సంశ్రుతౌ)-ఆతనిచేత ప్రతిజ్ఞాతములైన, వరౌ-రెండు వరములను, ఇంద్రసిక్తా-ఇంద్రునిచేత (మేఘముచేత) వర్షింపఁబడిన, భూఃభూమి, బిలమగ్నా-బిల-పుట్టలు మొదలగువాని రంధ్రములయందు, మగ్నా-దాగియున్న, ఉరగౌ, ఇవ-సర్పము లనువలె, ఉద్వావామ, కిల-బయటికిఁ గక్కినది సుమా! దశరథుఁడు బ్రతిమాలు కొనఁగా నోదార్పును జెందినదగుచు, చండియైన కైక, భర్త పూర్వము తన కిచ్చెదనని చెప్పియున్న రెండు వరములను, మేఘముచేత వర్షింపఁబడిన భూమి పుట్టలోనున్న పాములను పైకి విడిచినట్లు, వెడలఁగక్కి నని భావము. ఉపమాన స్వారస్యముచేత పాము లెంతచెడ్డవో ఆ రెండు వరములు నంతచెడ్డవి యని తేలు చున్నది. కైక రెండు వరములను గోరెనని భావము

శ్లో. తయో శ్చతుర్ద శై కేన రామం ప్రావ్రాజయ త్సమాః,
ద్వితీయేన సుత స్యైచ్ఛ ద్వైధవ్యైకఫలాం శ్రియమ్. 6

వ్యాఖ్య: (సా-ఆకైక) తయోఃఆరెండు వరములలో, ఏకేన-ఒకవరము చేత, రామం-రాముని, చతుర్దశ-పదునాలుగు, సమాఃసంవత్సరములు, ప్రావ్రాజయత్-అరణ్యమునకుఁ బంపునట్లు చేసెను. ద్వితీయేన-రెండవ వరముచేత, సుతస్య-తన కుమారుఁ డగు భరతునికి, వైధవ్యైకఫలాం-తన వైధవ్యము మాత్రమే ఫలము గాఁగల, శ్రియం-రాజ్యలక్ష్మిని, ఐచ్ఛత్-కోరెను, ఆరెండు

వరములలో నొకదానిచేత పదునాలుగు వత్సరములు రామవనవాసమును, రెండవ దానిచేత భరతుని యౌవరాజ్య పట్టాభిషేకమును గోరెను. భరత పట్టాభిషేకము వలన నతనికి రాజ్యభోగము లేకపోగా భర్త చనిపోవుటవలన దనకు వైధవ్యము కలుగుటయే ఫలమని కైక యెఱుగక మొండిపట్టుదలతో వరములను గోరెనని భావము

శ్లో. పిత్రా దత్తాం రుదన్ రామః ప్రాఙ్మహీం ప్రత్యపద్యత,
పశ్చా ద్వనాయ గచ్ఛేతి తదాజ్ఞాం ముదితో ఽగ్రహీత్. 7

వ్యాఖ్య: రామః-శ్రీరాముడు, ప్రాక్-మొదట, పిత్రా-తండ్రిచేత, దత్తాం-ఇయ్యబడిన, మహీం-భూపరిపాలనమును, రుదన్-దుఃఖపడుచు, ప్రత్యపద్యత-అంగీకరించెను పశ్చాత్-తరువాత, వనాయ, గచ్ఛ, ఇతి-వనమునకు వెళ్ళుము అనునట్టి, తదాజ్ఞాం-ఆ తండ్రియొక్క ఆజ్ఞను, ముదితః-సంతోషముగలవాడై, అగ్రహీత్-స్వీకరించెను. దశరథుడు మొదట రాజ్యభారమును వహింపుమన్నప్పుడు దుఃఖముతో నొప్పుకొనుటకు గారణము దశరథుడు బ్రతికియుండగా నేను రాజగుట యెందులకన్న భావము. రెండవ మాటగా వనమున కేగుటవలన పితృాజ్ఞాకరణ లాభము సంతోషము గలుగుటకు కారణము. రామావతారఫలము వనవాసరూపమగు నాజ్ఞలో నుండుటచే నది రాముని కానందము గలిగించెనన్నది నిగూఢమైన భావము.

శ్లో. దధతో మంగళక్షౌమే వసానస్య చ వల్కలే,
దదృశు ర్విస్మితా స్తస్య ముఖరాగం సమం జనాః. 8

వ్యాఖ్య : మంగళక్షౌమే-శుభసూచకములగు పట్టు వస్త్రములను, దధతః-కట్టుకొనుచున్నవాడును, వల్కలే-నార చీరలను, వసానస్య, చ-ధరించుచున్నవాడును, అగు, తస్య-ఆ శ్రీరామునియొక్క, సమం-ఒకే విధమైన, ముఖరాగం-ముఖవర్ణమును, జనాః-ప్రజలు, విస్మితాః-ఆశ్చర్యపడినవారై, దదృశుః-చూచిరి, తండ్రియాజ్ఞచేత పట్టాభిషేకముకొఱకు పట్టు వస్త్రములు కట్టుకొనుచున్నప్పుడును, అది భగ్నమై యరణ్యమునకు వెళ్ళుటకై వల్కలములు ధరించుచున్నప్పుడును, శ్రీరాముని ముఖవర్ణము ఒకే విధముగా నుండుటను జూచి, జనులు ఆశ్చర్యపడిరి.

సుఖము వచ్చినప్పుడు ముఖము వికసించుటయు, దుఃఖము వచ్చినప్పుడు ముఖము ముడుచుకొనుటయు, సామాన్యుల లక్షణము. సుఖ దుఃఖములయందు ముఖవర్ణము మారకుండుట ధీరుల లక్షణ మని భావము.

శ్లో. స సీతాలక్ష్మణసఖః సత్యా ద్గురు మలోపయన్,
వివేశ దండకారణ్యం ప్రత్యేకం చ సతాం మనః. 9

వ్యాఖ్య : సః-అట్టి రాముఁడు, గురుం-తండ్రిని, సత్యాత్-వరదాన రూప మైన సత్యమునుండి, అలోపయన్-జారిపోనియ్యనివాఁడగుచు,సీతాలక్ష్మణసఖః-సీతా లక్ష్మణ సహితుఁడై, దండకారణ్యం-దండకారణ్యమును, సతాం-సత్పురుషుల యొక్క, మనః, చ-మనస్సును, ప్రత్యేకం-ఒక్కొక్కదానినిగాను, వివేశ-ప్రవేశించెను. కైక కిచ్చిన వరదానసత్యము నుండి తండ్రిని తప్పిపోనీయక, సీతా లక్ష్మణ సహితుఁడై రాముఁడు దండకావనమును ప్రవేశించెను. అట్లు చేసిన రాముని చర్య ప్రతి సత్పురుషుని మనస్సు నానందపరచె నని భావము. "సీతాలక్ష్మణయోఃసఖా" అని విగ్రహము. అనఁగా తమకు సర్వకాల సర్వావస్థలయందును అత్యంత స్నేహపాత్రుడై యున్న రాముని విడువలేక వాఁ డతనిని వెంబడించిరని సమాసార్థము తేలును. ఏకస్మిన్ ఏకస్మిన్-ప్రత్యేకం-ప్రతి దా ని య ం దు అని విగ్రహము.

శ్లో. రాజాఽపి తద్వియోగార్తః స్మృత్వా శాపం స్వకర్మజమ్,
శరీరత్యాగమాత్రేణ శుద్ధిలాభ మమన్యత. 10

వ్యాఖ్య : తద్వియోగార్తః-వారియెడఁబాటుచేత శోకార్తుఁడైన, రాజా, అపి-దశరథ మహారాజుకూడా, స్వకర్మజం-మునిపుత్ర వధరూపమైన తన పూర్వ కర్మచేత వచ్చిన, శాపం-పుత్రశోకమువలన తాను మరణించునట్టి శాపమును, స్మృత్వా-స్మరించుకొని, శరీరత్యాగమాత్రేణ-దేహత్యాగముచేతనే, శుద్ధిలాభం-ప్రాయశ్చిత్తమును, అమన్యత-తలంచెను. పుత్రవియోగముచేత దుఃఖితుఁడై ఇక జీవింపలేనని యెంచిన దశరథుఁడు పూర్వము తన బాణముచేత పొరపాటున మరణించిన మునికుమారుని తండ్రి యిచ్చిన శాపము స్మృతికిరాఁగా నాపాపమునకుఁదన శరీరత్యాగమే ప్రాయశ్చిత్త మని యెఱిఁగి మరణించె నని భావము. ప్రాయశ్చిత్తమనఁగా చేసిన పాపమును దొలఁగించుకొనుటకుఁ జేయు శుద్ధికర్మ. "ప్రాయః

పాపం విజానీ ఽత్ చిత్తం తస్య విశోధనమ్" అని ప్రాయశ్చిత్తశబ్దనిర్వచనము. "శరీరత్యాగ మాత్రేణ" అనుపదములోని "మాత్రా" శబ్దము ఏవ కారార్థకము.

శ్లో. విప్రోషితకుమారం త ద్రాజ్య మస్తమితేశ్వరమ్,
రంధ్రాన్వేషణదక్షాణాం ద్విషా మామిషతాం యయౌ. 11

వ్యాఖ్య : విప్రోషితకుమారం-దూరముగావెళ్ళిపోయిన కుమారులుగలదియు, ఆస్తమితేశ్వరం-చనిపోయిన రాజుగలదియు నగు, తత్, రాజ్యం-ఆ అయోధ్యా రాజ్యము, రంధ్రాన్వేషణదక్షాణాం-రంధ్ర-లోపములను, అన్వేషణ-వెదకుటయందు, దక్షాణాం-సమర్థులైన, ద్విషాం-శత్రువులకు, ఆమిషతాం-భోగ్యవస్తుత్వమును, యయౌ-పొందెను; రామలక్ష్మణు లరణ్యమునందును, భరతశత్రుఘ్నులు మేన మామయింటను నుండుటచేత రాజకుమారులులేనియు, దశరథమరణముచేత రాజులేని దియు నగు నయోధ్యారాజ్యము రంధ్రాన్వేషణ తత్పరులైన శత్రురాజుల వశము కానుండె నని భావము. ఆమిష మనగా మాంసము, భోగ్యవస్తువు నర్థములు.

శ్లో. అథానాథాః ప్రకృతయో మాతృబంధునివాసినమ్,
మౌలై రనాయయామాసు ర్భరతం స్తంభితాశ్రుభిః. 12

వ్యాఖ్య : అథ–ఆతరువాత, అనాథాః–ప్రభువు లేనివారగు, ప్రకృతయః–అమాత్యులు, మాతృబంధునివాసినం–తల్లికి చుట్టములైన మేనమామ మొదలగు వారితో నివసించుచున్న, భరతం–భరతుని, స్తంభితాశ్రుభిః–బిగబట్టుకోబడిన కన్నీళ్ళుగల, మౌలైః-ఆప్తులైన సచివులచేత, ఆనాయయామాసుః–రప్పించిరి. "ప్రకృతిః సహజే యోనా వమాత్యే పరమాత్మని" అను విశ్వనిఘంటువు వలన ప్రకృతులనగా అమాత్యులు. మేనమామ యింటిలో నుంటున్న భరతుని ఆప్తులగు ముఖ్య సచివులచేత రప్పించిరి. వెళ్ళినవారు దశరథమరణ, రామవనవాసవార్తను జెప్పి శోకింపరాదనియు నాదేశించిరి. అగ్రజుడగు రాముడరణ్యమున నుండుట చేత, తదనుజుడైన భరతుడు దశరథుని యంత్యక్రియలు చేసి, రాజ్యపట్టాభిషేకము నొందవలసినవాడగుటచేత నతనిని రప్పించిరని భావము.

శ్లో. శ్రుత్వా తథావిధం మృత్యుం కై కేయీతనయః పితుః,
మాతు ర్న కేవలం స్వస్యాః శ్రియోఽ
ప్యాసీత్ పరాఙ్ముఖః. 13

వ్యాఖ్య: కైకేయీతనయుఁ-భరతుఁడు, పితుఃతండ్రియొక్క, తథావిధం-అట్టిది యగు (రామవనవానమును గోరిన తన తల్లియే కారణమైనది యగు), మృత్యుం-మరణమును, శ్రుత్వా-విని, స్వస్యాఃమాతుఃకేవలం, న-తన తల్లికిమాత్రమేకాక, శ్రియఃఅపి-రాజ్యలక్ష్మికిఁగూడ, పరాఙ్ముఖఃపెడమొగముపెట్టినవాఁడు, ఆసీత్-ఆయ్యెను. అట్లు మాతులగృహమునుండి అయోధ్యకు వచ్చినపిమ్మట పితృమరణ, రామవనవాసములు కైకేయీమూలకములని యెఱిఁగిన భరతుఁడు తన తల్లి ముఖమును జూచుటకును, రాజ్యలక్ష్మి నంగీకరించుటకును ఏవగింపుగలవాఁడై బాధ పడెనని భావము. మిక్కిలి కోపము, దుఃఖము గలవాఁడయ్యెను.

శ్లో. ససైన్య శ్చాన్వగా ద్రామం దర్శితా నాశ్రమాలయైఃఁ,
తస్య పశ్యన్ ససౌమిత్రే రుదశ్రు ర్వసతిద్రుమాన్. 14

వ్యాఖ్య: ససైన్యఃసైన్యసమేతుఁడైన భరతుఁడు, ఆశ్రమాలయైఃఆశ్ర మములే యిండ్లుగాఁగల వనవాసులచేత, దర్శితాన్-చూపఁబడినట్టి, ససౌమిత్రేఃలక్ష్మణసహితుఁడగు, తస్యఃఆరామునియొక్క, వసతిద్రుమాన్-నివాసవృక్షములను, పశ్యన్-చూచుచు, ఉదశ్రుఃకన్నీరు గారుచున్నవాఁడగుచు, రామం-శ్రీరాముని, అన్వగాత్-చేరెను (అను+అగాత్) సైన్యసమేతుఁడై భరతుఁడు, ఆశ్రమవాసుల చేత "ఆదిగో ఆవృక్షములక్రింద నున్నాడు" అని చూపఁబడిన రాముని నివాస వృక్షములను జూచి యేడ్చుచు రాముని వద్దికి వెళ్ళెను. ఇచ్చట "ససైన్యఃఁ" అను విశేషణము భరతుని యాత్మరక్షణము కొఱకుఁ గాదనియు, సీతారాముల కరణ్య మున నెట్టియాపదలు వచ్చెనో! వచ్చునో! యన్న భావముచేతనే యనియు గ్రహింప వలయును.

శ్లో. చిత్రకూట వనస్థం చ కథితస్వర్గతి ర్గురోఃఁ,
లక్ష్మ్యా నిమంత్రయాంచక్రే త మనుచ్ఛిష్టసంపదా. 15

వ్యాఖ్య: చిత్రకూటవనస్థం-చిత్రకూట పర్వతారణ్య మందున్న, తం చ-ఆరామునిని, గురోఃతమతండ్రియైన దశరథునియొక్క, కథితస్వర్గతిఃచెప్ప బడిన మరణము కలవాఁడగుచు (భరతుఁడు), అనుచ్ఛిష్టసంపదా-అనుభవింపఁ బడని గుణోత్కర్షగల, లక్ష్మ్యా-రాజ్యలక్ష్మిచేత, నిమంత్రయాంచక్రే-ఆహ్వానిం చెను. అన్నయ్యా! మనతండ్రి మరణించినాఁడు, నేనెంతమాత్రమును రాజ్యసుఖము

లను దాఁకలేదు, నీ వా రాజ్యలక్ష్మినిఁ జేపట్టుటకు రమ్ము. అని భరతుఁడు చిత్ర కూటమునందు వానప్రస్థధర్మమును నిర్వర్తించుచున్న రాముని వెనుకకు రమ్మని పిలిచెను. ఇచ్చటి "సంపత్" శబ్దమునకు గుణోత్కర్ష యని అర్థము. "సంపద్భూతౌ గుణోత్కర్షే" అని కేశవ నిఘంటువు.

శ్లో. స హి ప్రథమజే తస్మి న్నకృతశ్రీపరిగ్రహే,
పరివేత్తార మాత్మానాం మేనే స్వీకరణా ద్భువః. 16

వ్యాఖ్య : సః, హి- ఆ భరతుఁడేమో, ప్రథమజే-అగ్రజుడైన, తస్మిన్-అతఁడు (రాముఁడు), అకృత శ్రీపరిగ్రహే(సతి)-స్వీకరింపఁబడని రాజ్యశ్రీ పరిగ్రహము గలవాఁడగుచుండఁగా, భువః-భూమియొక్క, స్వీకరణాత్-స్వీకారము వలన, ఆత్మానం-తనను, పరివేత్తారం-పరివేత్తనుగా, మేనే-తలఁచెను. రాముఁడు రాజ్యలక్ష్మి పరిగ్రహమును జేయకున్నప్పుడు తాను చేయుట, అన్నకు వివాహము కాకముందే తమ్ముఁడు పెండ్లియాడుట వంటి దగునని భరతుఁడు తలఁచెను. భూపరిగ్రహము కూడ దార పరిగ్రహము వంటిదే యని యతని భావము. "పరివేత్త" యనఁగా నగ్రజునికంటె ముందు వివాహమును జేసుకొన్నవాఁడు.

శ్లో. త మశక్య మపాకర్షుం నిదేశాత్ స్వర్గిణః పితుః,
యయాచే పాదుకే పశ్చాత్ కర్తుం రాజ్యాధిదేవతే. 17

వ్యాఖ్య : స్వర్గిణః-స్వర్గస్థుఁడైన, పితుః-తండ్రియొక్క, నిదేశాత్-ఆజ్ఞ వలన, అపాకర్షుం-ఇంటికి మరల్చుటకు, అశక్యం-సాధ్యపడని, తం-ఆ రాముని, పశ్చాత్-ఎంతగానో ప్రతిమాలుకొన్న పిమ్మట, రాజ్యాధిదేవతే-రాజ్యప్రభువుల నుగా, కర్తుం-చేయుటకు, పాదుకే-రామపాదుకలను, యయాచే-యాచించెను, పితృాజ్ఞాపాలనమునందు దృఢవ్రతుఁడైయున్న రాముని మరల్చుట సాధ్యపడక పోగా నతని పాదుకలను సింహాసనమున నుంచుట కిమ్మని యాచించెనని భావము.

శ్లో. స విసృష్ట స్తథేత్యుక్త్వా భ్రాత్రా నైవావిశత్ పురీం,
నందిగ్రామగత స్తస్య రాజ్యం న్యాస మివాభునక్. 18

వ్యాఖ్య : సః-భరతుఁడు, భ్రాత్రా-అన్నగారిచేత, తథా, ఇతి, ఉక్త్వా-అట్లే యగుఁగాక యని బదులు పలికి, విసృష్టః (సన్)-వెనుకకు పంపఁబడిన వాఁడ

గుచు, పురీం-అయోధ్యానగరమును, నావిశదేవ (న + అవిశత్ + ఏవ) ప్రవేశింపనే లేదు. (కింతు-అయితే) నందిగ్రామగతః-నందిగ్రామమును జేరినవాడై, తస్య, రాజ్యం-ఆ రామునియొక్క రాజ్యమును, న్యాసం, ఇవ-తనవద్ద దాచిన వస్తువును వలె, అభునక్-పాలించెను తాను రాజభోగముల ననుభవింపక మరల నప్పగింప వలసిన వస్తువునుగా భావించి రాజ్యపాలనముఁ జేసెను. న్యాసమనఁగా నితరులు తనవద్ద దాచియుంచిన నిక్షేపము. "అభునక్" అను పరస్మైపదక్రియ అట్టి యర్థమును బోధించును. తా ననుభవింపలేదని భావము.

శ్లో. దృఢభక్తి రితి జ్యేష్ఠే రాజ్యతృష్ణాపరాఙ్ముఖః,
మాతుః పాపస్య భరతః ప్రాయశ్చిత్త మి వాకరోత్. 19

వ్యాఖ్య : జ్యేష్ఠే-అగ్రజుఁడగు రామునియందు, దృఢభక్తిః-అచంచలమైన భక్తిగలవాఁడును, రాజ్యతృష్ణాపరాఙ్ముఖః-రాజ్య-రాజ్యమునందలి, తృష్ణా-ఆశకు, పరాఙ్ముఖః-విముఖుఁడగు, భరతః-భరతుఁడు, ఇతి-ఇట్లు (పూరోక్తప్రవర్తనము చేత) మాతుః-తల్లియొక్క, పాపస్య-పాపమునకు, ప్రాయశ్చిత్తం-నివర్తన కర్మను అకరోత్, ఇవ-చేసెనో! యనునట్లుండెను. తనతల్లి చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తాచరణమా! యనునట్లు రాజ్యకాంక్షను వదలి భరతుఁడు నందిగ్రామమున వసించెను. "దృఢభక్తిః" అనుచోట దృఢా భక్తిః యస్య సః అని విగ్రహమును జెప్పినచో "స్త్రియాః పుంవత్" ఇత్యాదిసూత్రమువలన "ఆపియాదిషు" అని నిషేధ ముండుటచేత, పుంవద్భావము రాఁజాల దనియు, దృఢం భక్తిరస్య అని నపుంసక పూర్వపద బహువ్రీహిని చెప్పినప్పుడే "దృఢ భక్తిః" అన్నది సాధు వగు ననియు మల్లినాథుఁడు నిర్వచించెను. విస్తరభీతిచే నితరమగు చర్చ యుపేక్షింపఁ బడినది

శ్లో. రామోఽపి సహ వైదేహ్యా వనే వన్యేన వర్తయన్,
చచార సానుజః శాంతో వృద్ధేక్ష్వాకువ్రతం యువా. 20

వ్యాఖ్య : సానుజః-తమ్ముఁడగు లక్ష్మణునితో గూడినవాఁడును, శాంతః-ఇంద్రియనిగ్రహము గలవాఁడునగు, రామోఽపి (రామః, అపి)-రాముఁడును, వైదేహ్యా, సహ-సీతతోఁగూడ, వనే-అరణ్యమునందు, వన్యేన-వనమునందు పుట్టిన కందమూలాదికముచేత, వర్తయన్-జీవనమును నడపుచు, వృద్ధేక్ష్వాకువ్రతం-వృద్ధు

లగు ఇక్ష్వాకువంశీయులు చేయు వానప్రస్థ వ్రతమును, యువా-యువకుఁడయ్యు, చచార-ఆచరించెను. రాముఁడు తనతోపాటు సీతాలక్ష్మణులను సైతము కాషాయ వస్త్రధారణ, కందమూలఫలాశనములచేత వానప్రస్థధర్మము నాచరింపఁజేసెను. యువకుఁడైనను శాంతవర్తనము గలవాఁడయ్యె నని భావము.

శ్లో. ప్రభావస్తంభితచ్ఛాయ మాశ్రితః స వనస్పతిమ్,
కదాచి దంకే సీతాయాఃశిశ్యే కించి దివ శ్రమాత్. 21

వ్యాఖ్య : సః-రాముఁడు, కదాచిత్-ఒకానొకప్పుడు, ప్రభావస్తంభిత చ్ఛాయం—ప్రభావ-తనవి స్మృతిచేత, స్తంభిత-ఆపియుంచఁబడిన, ఛాయం-నీడ గల, వనస్పతిం-ఒకమహావృక్షమునుఁ, ఆశ్రితఃసన్-ఆశ్రయించినవాఁడగుచు, కించిత్, శ్రమాత్, ఇవ-కొంచె మలసటవల్లనో యేమొ, సీతాయాఃసీతాదేవియొక్క-అంకే-తొడపైన, శిశ్యే-నిద్రించెను ఒక మహావృక్షము తనవి స్మృతిచేత ప్రాక్ప శ్చిమములనుండి వచ్చు నెండను మధ్యభాగమునకు సోకనీయక చల్లఁదనము నిచ్చు చుండగా, నొకప్పు డలసటఁ జెందిన రాముఁడు సీతతొడపైఁ దలనుంచి నిద్రించెను. ప్రభావ మనగా సత్త, స్థితి అని యర్థము.

శ్లో. ఐంద్రిఃకిల నఖై స్తస్యా విదదార స్తనౌ ద్విజఃశ్,
ప్రియోపభోగచిహ్నేషు పౌరోభాగ్య మి వాచరన్. 22

వ్యాఖ్య : ఐంద్రిఃఇంద్రపుత్రుఁడగు, ద్విజఃపక్షి (కాకము), తస్యాఃఆసీతాదేవియొక్క, స్తనౌస్తనములను, ప్రియోపభోగచిహ్నేషు-పూర్వము రామునిచే నుంచఁబడిన నఖక్షతముల మచ్చలయందు, పౌరోభాగ్యం-కఠినాలింగన దోష విభూతమును, ఆచరన్, ఇవ-చేయుచున్నదివలె, నఖైఃకాలిగోళ్ళచేత, విద దార, కిల-చీల్చినదట. రాముఁ డీసీత స్తనముల నింతగా యనుభవింపవలెనా? యను నసూయచేత కాకము వానినిఁ జీల్చెనని భావము. అది దేవతావరమునొందిన దుష్ట కాకముగనుక నట్లు చేసెను.

శ్లో. తస్మి న్నాస్థ దిషీకా స్త్రం రామో రామావబోధితఃశ్,
ఆత్మానం ముముచే తస్మా దేక నేత్రవ్యయేన సఃశ్. 23

వ్యాఖ్య : రామావబోధితః-సీతచేత మేల్కొల్పఁబడిన, రామః-శ్రీరాముఁడు, తస్మిన్-ఆకాకిపైన, ఇషీకాస్త్రం-రెల్లుగడ్డి బాణమును, ఆస్థత్-పడవేసెను, సః-ఆకాకము, ఏకనేత్రవ్యయేన-ఒకకంటి వినాశముచేత, తస్మాత్-ఆరెల్లు బాణమునుండి, ఆత్మానం-తనను, ముముచే-విడిపించుకొనెను. "ఆస్థత్" ఇది "అసు క్షేపణే" యనుధాతువునకు లఙ్‌రూపము. సీతచే నిద్ర మేల్కొల్పఁబడిన రాముఁడు రెల్లుగడ్డిని బాణముగా మంత్రించి కాకముపై వేయఁగా, నది తట్టుకొనలేక శరణు వేడఁగా బాణప్రయోగము వృథాయగుటకు వీలులేనందున ఒకకంటిని మాత్రము హరించి కాకమును విడిచె నని భావము రామా యనఁగా స్త్రీ. "సుందరీ రమణీ రామా" యని అమరము.

శ్లో. రామ స్త్వాసన్న దేశత్వా ద్భరతాగమనం పునః,
ఆశం కోత్కసారంగాం చిత్రకూటస్థలీం జహౌ. 24

వ్యాఖ్య : రామః-శ్రీరాముఁడు, ఆసన్నదేశత్వాత్-అయోధ్యకు సమీప ప్రదేశ మగుటవలన, పునః-మరల, భరతాగమనం-భరతునియొక్క రాకను, ఆశంక్య-అనుమానించి, ఉత్సుకసారంగాం-ఉత్కంఠితములైన లేళ్ళుగల, చిత్రకూటస్థలీం-చిత్రకూటపర్వత ప్రాంతమును, జహౌ-వదలివెళ్లెను. తమనివాస మయోధ్యకు దగ్గరలోనుండుటచేత భరతుఁడు మరలవచ్చి ప్రతిమాలుకొనునేమో! యను సంశయమువలన, అచ్చటిలేళ్ళు మచ్చికపడియున్నందున తమను విడువలేక బాధపడుచున్నప్పటికిని విధిలేక చిత్రకూట ప్రాంతమును రాముఁడు విడిచివెళ్లెనని భావము.

శ్లో. ప్రయయౌ వాతిథేయేషు వసన్ ఋషికులేషు సః,
దక్షిణాం దిశ మృక్షేషు వార్షి కే ష్వివ భాస్కరః. 25

వ్యాఖ్య : సః-ఆరాముఁడు, ఆతిథేయేషు-చక్కనిఆతిథిసత్కారములుచేయు నట్టి, ఋషికులేషు-ఋష్యాశ్రమములందు, వార్షికేషు-వర్షాకాలమునందలి, ఋక్షేషు-నక్షత్రములు, లేదా రాసులయందు, భాస్కరః ఇవ-సూర్యుఁడువలె, వసన్-నివసించుచు, దక్షిణాం, దిశం-దక్షిణదిక్కును గుఱించి (దక్షిణమునకు), ప్రయయౌ-వెళ్ళిపోయెను. భాస్కరుఁడనఁగా వెలుతురునిచ్చు సూర్యుఁడు, వర్షాకాలమునందలి రాసులలోనుండి జనుల కానందమును గూర్చుట దక్షిణాయనమున జరుఁగును. ఆట్లే

రాముఁ డాశ్రమవాసులకు రాక్షసభీతిని దొలఁగించుచు నానందమును గూర్చుచు దక్షిణదిక్కునకుఁ బ్రయాణము సాగించెను. భాస్కరోపమాన మర్థవంతమై యున్నది.

శ్లో. బభౌ త మనుగచ్ఛంతీ విదేహాధిపతేః సుతా,
ప్రతిషిద్ధాపి కైకేయ్యా లక్ష్మీ రివ గుణోన్ముఖీ. 26

వ్యాఖ్య : తం-ఆరాముని, అనుగచ్ఛంతీ-వెంబడించుచున్న, విదేహాధిపతేః, సుతా-విదేహదేశాధిపతియగు జనకునియొక్క కూతురగు సీత, కైకేయ్యా-కైకేయి చేత, ప్రతిషిద్ధా, అపి-నివారింపబడినదైనను, గుణోన్ముఖీ (గుణ + ఉన్ముఖీ)-సద్గుణములయం దభిలాషగల, లక్ష్మీఃఇవ-రాజ్యలక్ష్మివలె, బభౌ-ప్రకాశించెను. రామునివెంట వెళ్ళుచున్న సీత, కైక వద్దని యడ్డగించినను గుణానురక్తయైన రాజ్యలక్ష్మి రాముని వెంటఁబడి వచ్చుచున్నదా! యనునట్లు భాసించె నని భావము.

శ్లో. అనసూయాతిసృష్టేన పుణ్యగంధేన కాననమ్,
సా చకారాంగరాగేణ పుష్పోచ్చలిత షట్పదమ్. 27

వ్యాఖ్య : సా-ఆ సీత, అనసూయాతిసృష్టేన—అనసూయా-అత్రిముని భార్యయగు అనసూయచేత, అతిసృష్టేన-ఇయ్యఁబడిన, పుణ్యగంధేన-పవిత్రమైన సువాసనగల, అంగరాగేణ-మైపూతచేత, కాననం-ఆరణ్యమును, పుష్పోచ్చలిత షట్పదం—పుష్ప-పువ్వులనుండి, ఉచ్చలిత-పైకిలేచిన, షట్పదం-తుమ్మెదలు గల దానిని, చకార-జేసెను. సీతారామలక్ష్మణులు అత్రిమహాముని యాశ్రమమునకుఁ జేరఁగా నచ్చట వారికి జరిగిన యతిథిసత్కారముకో, ననసూయాదేవి సీతకిచ్చిన మంచి గంధము నామె శరీరముపైఁ బూసికొనఁగా, నాపరిమళముచేత వనపుష్పముల పైనున్న తుమ్మెద లాకర్షింపఁబడినవి. కాననమంతయు నాసుగంధముచే నిండి పోయినది. ముత్తైదువలకుఁ జేయుపూజ పసుపు, కుంకుమ, గంధములతోనే కనుక సీత ననసూయ అట్లు పూజించినదని భావము.

శ్లో. సంధ్యాభ్రకపిశ స్తస్య విరాధో నామ రాక్షసః,
అతిష్ఠ న్మార్గ మావృత్య రామ స్యేందో రివ గ్రహః. 28

వ్యాఖ్య : సంధ్యాభ్రకపిశః—సంధ్యాభ్ర-సంధ్యాసమయమునందలి మేఘ మువలె, కపిశః-నలుపును ఎఱుపును గలిసిన రంగుగలవాఁడై, విరాధః, నామ-విరాధుఁడని పేరువడసిన, రాక్షసః-రాక్షసుఁడు, గ్రహః-రాహుగ్రహము, క్షిందోః, క్షిప-చంద్రునియొక్క-వలె, తస్య, రామస్య-ఆ రాముని యొక్క, మార్గం-దారిని, ఆవృత్య-అడ్డగించి, అతిష్ఠత్-నిలిచెను. గ్రహణకాలమున రాహువు చంద్రుని నడ్డగించినట్లు భయంకర స్వరూపుఁ డగు విరాధుఁడను రాక్షసుఁడు రాముని దారి నడ్డగించి నిలిచెను.

శ్లో. స జహార తయో ర్మధ్యే మైథిలీం లోకశోషణః,
నభోనభస్యయో ర్వృష్టి మవగ్రహ ఇవాంతరే. 29

వ్యాఖ్య : లోకశోషణః-లోకమునకు బాధకుఁడైన, సః-ఆ రాక్షసుఁడు, తయోః-వారిద్దఱియొక్క (రామలక్ష్మణులయొక్క) మధ్యే-నడుమనున్న, మైథిలీం-సీతను, నభోనభస్యయోః-శ్రావణ భాద్రపద మాసములయొక్క, అంతరే-మధ్య భాగమునందలి, వృష్టిం-వర్షమును, అవగ్రహః, ఇవ-వర్షప్రతిబంధమువలె (కఱవు వలె), జహార-అపహరించెను. వృష్టిశబ్దము స్త్రీలింగము కావున సీత కుపమానముగాఁ జెప్పఁబడినది. శ్రావణ భాద్రపదముల మధ్యన తప్పకయుండు వృష్టిని అవగ్రహము అపహరించినట్లు రామలక్ష్మణులమధ్య నున్న సీతను విరాధుఁ డెత్తుకపోయెను. శ్రావణభాద్రపదముల లోకోపకారకత్వము, అవగ్రహముయొక్క లోకవిరోధిత్వము రామలక్ష్మణ విరాధులకు సాధారణ ధర్మముగా స్వీకరించుటవలన ఉపమాలంకా రము బాగున్నది. "వృష్టి ర్వర్షం, తద్విఘాతే ఽవగ్రహావగ్రహౌ సమౌ" అని యమరము.

శ్లో. తం వినిష్పిష్య కాకుత్థ్సౌ పురా దూషయతి స్థలీమ్,
గంధే నాశుచినా చేతి వసుధాయాం నిచఖ్నతుః. 30

వ్యాఖ్య : కాకుత్థ్సౌ-కకుత్థ్సుని వంశమునఁ బుట్టిన రామలక్ష్మణులు, తం-ఆ విరాధుని, వినిష్పిష్య-పిండి చంపి, అశుచినా-అపవిత్రమైన, గంధేన-వాసనచేత, స్థలీం-శ్రమ భూమిని, పురా దూషయతి, ఇతి-తప్పక చెడఁగొట్టఁగలఁడని, వసు ధాయాం-భూమిలోపల, నిచఖ్నతుః, చ-త్రవ్వి పాతిపెట్టిరి కూడాను. మహావీరు లగు రామలక్ష్మణులు ఆ విరాధునిఁ బట్టి నలిపి, కొట్టి, చంపి వాని శరీర దుర్గం

ధముచేత ఆశ్రమ ప్రాంతము కశ్మలమైపోవుట తప్పదని తలఁచి యా శరీరమును నేలో పాతిపెట్టిరి "ఏకుత్స్యస్య గోత్రాపత్యే పుమాంసో కాకుత్స్థా" అని వ్యుత్పత్తి. ఏకుత్స్యుని వంశమునందుఁ బుట్టిన పురుషులని యర్థము. "పురా దూషయతి" దూషయిష్యతి అను భవిష్యదర్థక క్రియకు బదులు 'పురా' అను నిపాతతోఁ జేర్చిన పరమానార్థక క్రియ ఇది. తప్పక చెడఁగొట్టగలదని యర్థము. "యావత్పురా నిపాతయోర్లట్" అని పాణిని సూత్రమువలన నీ ప్రయోగము సాధువు.

శ్లో. పంచవట్యాం తతో రామః శాసనా త్కుంభజన్మనః,
అనపోఢస్థితి స్తస్థౌ వింధ్యాద్రిః ప్రకృతా ఇవ. 31

వ్యాఖ్య : తతః-ఆ విరాధవధయైన పిమ్మట, రామః-రాముఁడు, కుంభజన్మనః-అగస్త్యునియొక్క, శాసనాత్-ఆజ్ఞవలన, పంచవట్యాం-పంచవటియందు, వింధ్యాద్రిః-వింధ్య పర్వతము, ప్రకృతౌ, ఇవ-పూర్వస్థితియందువలె, అనపోఢస్థితిః-అనతిక్రాంత మర్యాదగలవాఁడై, తస్థౌ-నిలిచెను. అగస్త్యము, వింధ్య పర్వతమునకు గురువు, రామునికి కులగురువు. కనుక నాముని యాజ్ఞ వలన పూర్వము వింధ్య కదలక నిలుచున్నట్లు రాముఁడు పంచవటికిఁజేరి యచ్చటినుండి మరియొక యాశ్రమమునకు వెళ్ళక యచ్చటనే స్థిరనివాసమును బర్ణశాలయం దేర్పరచుకొనెను. "పంచవటి" యనఁగా నైదు మట్టివెట్ల గుంపు. "పంచానాం వటానాం సమాహారః-పంచవటీ" అని విగ్రహము. ఇది ద్విగు సమాసము. "ద్విగోః" అను సూత్రముచేత "ఈ" కారమును, "ద్విగు రేకవచనమ్" అని యేకవచనమును వచ్చినవి "పంచవట్యాం" అనునది సప్తమీ విభక్త్యేక వచనాంతము.

శ్లో. రావణావరజా తత్ర రాఘవం మదనాతురా,
అభిపేదే నిదాఘార్తా వ్యాలీవ మలయద్రుమమ్. 32

వ్యాఖ్య : తత్ర-ఆ పంచవటియందు, మదనాతురా-సంభోగవాంఛచేత త్వర పడుచున్న, రావణావరజా (రావణ + అవరజా)-రావణాసురుని చెల్లెలగు శూర్పణఖ, రాఘవం-శ్రీరాముని, నిదాఘార్తా-ఎండవేడిమికిఁ దట్టుకొనలేని, వ్యాలీ-పడు సర్పము, మలయద్రుమం, ఇవ-చందన వృక్షమునువలె, అభిపేదే-వచ్చి చేరెను. పంచవటియం దొకనాఁడు రావణుని చెల్లెలగు శూర్పణఖ మదనబాధతో రామునిఁ

జేరి "నన్ను భోగింపుమని కోరెను. అది యెట్లున్న దనఁగా నొక ఆడునాగుబాము వేసవితాపమున నలిగి శ్రీగంధము చెట్టు వద్దికి ఆలింగనమునకై వచ్చినట్లున్నదట. ఉపమాలంకారము. "వ్యాళీ" అను నుపమానము శూర్పణఖకు,మలయద్రుమ మన్న యుపమానము రామునికిని చాలా చక్కఁగా నున్నవి. ఇట్లే ప్రతిచోటను గల యుపమాన స్వారస్యమును జదువరు లూహించుకొన్నచో గాళిదాసు ప్రతిభ బోధ పడఁగలదు.

శ్లో. సా సీతాసన్నిధా వేవ తం వవ్రే కథితాన్వయా,
అత్యారూఢో హి నారీణా మకాలజ్ఞో మనోభవః. 33

వ్యాఖ్య : సా–ఆ శూర్పణఖ, సీతాసన్నిధౌ, ఏవ-సీతయొక్క సమక్షము నందే, కథితాన్వయా-చెప్పుకోబడిన తన వంశము గలది యగుచు, తం-రాముని, వవ్రే-వరించినది. అత్యారూఢః-మిక్కిలి హెచ్చిపోయిన, నారీణాం, మనోభవః-స్త్రీలయొక్క కామవికారము, అకాలజ్ఞః, హి–సమయమును గుర్తింపనది కాదుగదా! శూర్పణఖ సీతయెదుటనే రాముని బలవంతపెట్టి తనను పెండ్లాడు మన్నది స్త్రీలకుఁ గామవికారము మిక్కిలి హెచ్చినప్పుడు కాలము యొక్కయు కులగోత్రముల యొక్కయు, వరుసభావి యొక్కయు, ఔచిత్యమును గుర్తింపకుగదా. లేనిచో సీత యున్నదని సిగ్గుపడక శూర్పణఖ కోరుట యెట్లు? తార, చిత్రాంగి మొద లయిన వారి తెగకుఁ జెందిన యామెకనుక కవి యిట్టి లోకోక్తినిఁ గూర్చెను.
అలంకారము : అర్థాంతరన్యాసము.

శ్లో. కళత్రవా నహం బాలే! కనీయాంసం భజస్వ మే,
ఇతి రామో వృషస్యంతీం వృషస్కంధః శశాస తామ్. 34

వ్యాఖ్య : వృషస్కంధః-వృషభముయొక్క మూపురములవంటి భుజ శిరస్సులుగల, రామః-రాముఁడు, వృషస్యంతీం-కాముకియగు, తాం-ఆ శూర్ప ణఖను, హే బాలే!-అమ్మాయీ! అహం-నేను, కళత్రవాన్-భార్యతో నున్నాను, మే-నాయొక్క, కనీయాంసం-కనిష్ఠుఁడగు తమ్ముని, భజస్వ-సేవింపుము. ఇతి-ఇట్లని, శశాస-ఆజ్ఞాపించెను. రాముఁడు, కాముకి యగు శూర్పణఖతో 'అమ్మాయీ! నేను భార్యావంతుఁడనై యున్నాను. నాకంటే చిన్నవాఁడగు నా తమ్మునిఁ

గామింపు మని చెప్పెను. "వృషః స్యా ద్వాసవే ధర్మే సౌరభేయే చ శుక్రకే, పుం రాశిభేదయోః శృంగ్యాం మూషక శ్రేష్ఠయో రపి" అను విశ్వనిఘంటువు వలన నిచ్చట "వృషః" అనఁగా సమర్థుఁడగు పురుషుఁడని యర్థము. "వృషం అత్మార్థం ఇచ్ఛతీతి" వృషస్యంతీ అని వ్యుత్పత్తి. "వృషస్యంతీ తు కాముకీ" అని యమరము.

శ్లో. జ్యేష్ఠాభిగమనాత్ పూర్వం తేనా ప్యనభినందితా,
సాభూత్ రామాశ్రయా భూయో నదీ వోభయ
కూలభాక్. 35

వ్యాఖ్య : జ్యేష్ఠాభిగమనాత్, పూర్వం-పెద్దవాఁడగు రాముని యొద్దికి వెళ్ళుటకు ముందే, తేన, అపి-ఆ లక్ష్మణునిచేతఁగూడ, అనభినందితా-మెప్పుతెక నిరాకరింపఁబడినదై, భూయః-మరల మరల, రామాశ్రయా-రాముని నాశ్రయించుచున్న, సా-ఆ శూర్పణఖ, ఉభయకూలభాక్-రెండు గట్టులను జేరుచున్న, నదీవ-నదివలె, అభూత్-ఉండెను. రాముని వద్దికి వచ్చుటకు ముంచే లక్ష్మణునిచేత నిరాకరింపఁబడియుండుటచేత మిక్కిలి కరుణాళుఁడైన రామునినే యా శయించుచున్న శూర్పణఖ, ఇటునుంచి ఆటు, అటునుంచి యిటుఁ దిరుగుచు, శమపడుచు, ఉభయతీరములను జేరుచు, నురుగులు గ్రక్కుచున్న యొక నదివలె నుండెనట.

శ్లో. సంరంభం మైథిలీహాసః క్షణసౌమ్యాం నినాయ తామ్,
నివాత స్తిమితాం వేలాం చంద్రోదయ ఇవోదధేః. 36

వ్యాఖ్య : మైథిలీహాసః-సీతాదేవి నవ్వు, క్షణసౌమ్యాం—క్షణం-స్వల్ప కాలము, సౌమ్యం-శాంతాకారముతోనుండిన, తాం-ఆశూర్పణఖను, నివాతస్తిమితాం-గాలిలేకపోవుటచేత నిశ్చలముగానుండిన, ఉదధేః, వేలాం-సముద్రముయొక్క తీరజలరేఖను (చెల్లెలికట్టను), చంద్రోదయః, ఇవ-చంద్రోదయమువలె. సంరంభం-సంక్షోభమును, నినాయ-పొందించెను. యాతాయాతములచేత రామలక్ష్మణులను ప్రేమింపుడని ప్రతిమాలుచున్న శూర్పణఖను జూచి సీత నవ్వినది. ఆ నవ్వు, చంద్రోదయము సముద్రతీరమునకు ఉల్లోలకల్లోలములు గాలివచ్చినప్పుడు గలిగించునట్లు, ఆ రాక్షసికి క్షణకాలము శాంతమైయున్న స్వాంతమున సంక్షోభమును జేసి కోపముఁ దెప్పించె నని భావము "మైథిలీహాసః తాం సంరంభం నినాయ" అని

ద్వికర్మకక ర్తరిప్రయోగము. ఉపమాలంకారము. కాళిదాసు ఉపమానములన్నియు ఉపమేయగుణాధిక్యమును సంతరించునవే కనుక భావసౌందర్య మూహించుకొన వలయును.

శ్లో. ఫల మస్యోపహాసస్య సద్యః ప్రాప్స్యసి పశ్య మామ్,
మృగ్యాః పరిభవో వ్యాక్రోష్యా మిత్యవేహి త్వయా
కృతమ్. 37

వ్యాఖ్య : అస్య, ఉపహాసస్య-ఈ వెక్కిరింపునవ్వునకు, ఫలం-ఫలమును, సద్యః-ఇప్పుడే, ప్రాప్స్యసి-పొందఁగలవు, మాం, పశ్య-నన్నుఁజూడు, త్వయా-నీచేత, కృతం-చేయఁబడిన పనిని, వ్యాక్రోష్యాం-ఆడుపులి విషయమున, మృగ్యాః-ఆడులేడియొక్క (ఆడులేడి చేసినట్టి), పరిభవః, ఇతి-అవమానమని, అవేహి-తెలిసికొనుము. క్రోధపూర్ణిత యగు శూర్పణఖ సీతను జూచి, నీవు చేసిన యుపహాసమునకుఁ దగినఫల మిప్పుడే యనుభవింతువు, ఇది లేడి పులిని పరిహసించుట వంటిదని యెఱుఁగుము. అని,

శ్లో. ఇత్యుక్త్వా మైథిలీం భర్తు రంకే నివిశతీం భయాత్,
రూపం శూర్పణఖా నామ్నః సదృశం ప్రత్యపద్యత. 38

వ్యాఖ్య : భయాత్-భయమువలన, భర్తుః-భర్తయొక్క, అంకే-తొడమీద, నివిశతీం-కూర్చొనుచున్న, మైథిలీం-సీతను, ఇతి, ఉక్త్వా-వెనుకయన్నట్లు పలికి, బెదిరించి, శూర్పణఖా-శూర్పణఖ, నామ్నః-తన పేరునకు, సదృశం-తగిన, రూపం-ఆకారమును, ప్రత్యపద్యత-పొందెను. (చూపెనని యర్థము) రాక్షసిపలుకులకు బెదిరి సీత భర్త తొడపైనిఁ జేరుచుండగా నిదిగో! చూడుమని శూర్పణఖ తన పేరునకుఁ దగిన రూపమును ప్రదర్శించెను. అనఁగా చేటలంత గోళ్ళుగలడి యని "శూర్పణఖా" శబ్దార్థము కనుక, అంతటి గోళ్ళు, వాటికిఁదగిన వ్రేళ్ళు, చేతులు, కాళ్ళు, ముఖము మొదలగు నవయవములతో భయంకరాకారమును జూపెనని భావము. శూర్ప + నఖ-శూర్పణఖ "రషాభ్యాం నోణః సమానపదే" అనుపాణిని సూత్రముచేత ఏకపదమునందు రేఫషకారముల తరువాతనున్న "న" కారమునకు "ణ" కారము వచ్చినది. "ప" కారము మధ్యలోనున్నను వచ్చును.

శ్లో. లక్ష్మణః ప్రథమం శ్రుత్వా కోకిలామంజువాదినీమ్,
శివాఘోరస్వనాం పశ్చాత్ బుబుధే వికృతేతి తామ్. 39

వ్యాఖ్య : లక్ష్మణుఁడు, ప్రథమం-మొదట, కోకిలామంజువాదినీం-కోకిలవలె మనోహరముగాఁ బలికినదియు, పశ్చాత్-పిమ్మట, శివాఘోరస్వనాం-నక్కవలె భయంకరమగు కంఠస్వరముగలదియు నగు, తాం-ఆ శూర్పణఖను, శ్రుత్వా-విని, వికృతా, ఇతి-మాయావిని యని, బుబుధే-తెలిసికొనెను. మొదట మధురముగాఁ గోకిలవలె సంభాషించి పిమ్మట నక్కవలె కర్ణకఠోరముగా భాషించిన శూర్పణఖ మాయావిని యగు రాక్షసి యని లక్ష్మణుఁడు గుర్తించెను.

శ్లో. పర్ణశాలా మథ క్షిప్రం వికృష్టాసిః ప్రవిశ్యసః,
వైరూప్యపౌనరుక్త్యేన భీషణాం తా మయోజయత్. 40

వ్యాఖ్య : అథ-అట్లు గుర్తించిన వెంటనే, సః-ఆ లక్ష్మణుఁడు, వికృష్టాసిః, సన్-ఒరనుండి లాగబడిన ఖడ్గము గలవాఁడగుచు, క్షిప్రం-వేగముగా, పర్ణశాలాం, ప్రవిశ్య-పర్ణశాలను ప్రవేశించి, భీషణాం-భయంకర రూపముగల, తాం-ఆశూర్పణఖను, వైరూప్యపౌనరుక్త్యేన-వైరూప్య-వికార రూపముయొక్క, పౌనరుక్త్యేన-ద్విగుణత్వముచేత, అయోజయత్-కూర్చెను. సీతారాములకుఁ గొంచము దూరమున నున్న లక్ష్మణుఁడు తమ ప్రేమభిక్షకై వచ్చిన స్త్రీ యొక సుందరాంగికాక మాయావిని యగు నొక రాక్షసి యని స్ఫురముచేత గుర్తించిన వెంటనే, రామ లక్ష్మణుల కెట్టి కీడును జేయునో! యన్న భావముచేత ఖడ్గపాణియై, శీఘ్రముగాఁ బర్ణశాలను జేరి, యచ్చట భయంకర రూపముతోనున్న శూర్పణఖయొక్క ముక్కు, చెవులను, ఛేదించి, మొదటనే వికృతరూపముతోనున్న దాని నింకను వికృత రూపిణిగాఁ జేసెనని భావము. వైరూప్యపౌనరుక్త్య మనగా విరూపముయొక్క పునరుక్తి, రెండుసార్లు వైరూప్యమును (వైరూప్యము + వైరూప్యము) జెందుట. లక్షణాశక్తిచేత ద్వైగుణ్యమని యర్థము.

శ్లో. సా వక్రనఖధారిణ్యా వేణుకర్కశపర్వయా,
అంకుశాకార యాంగుల్యా తా వతర్జయ దంబరే. 41

వ్యాఖ్య : సా-ఆ శూర్పణఖ, వక్రనఖధారిణ్యా-వంకరలు తిరిగిన గోటిని ధరించినదియు, వేణుకర్కశపర్వ్యా-వేణు-వెదురుకఱ్ఱవలె, కర్కశపర్వ్యా-కఠినములగు గనుపులు కలదియు నగుటచేతనే, అంకుశాకారయా-అంకుశమను ఆయుధమువంటి యాకారముగల, అంగుళ్యా-వ్రేలిచేత, తౌ-ఆ రామలక్ష్మణులను, అంబరే (స్థితా)-ఆకసమున నిల్చుని, అతర్జయత్-బెదిరించెను. లక్ష్మణునిచేత ముక్కుఁజెవులు కోయఁబడిన శూర్పణఖ క్రుద్ధురాలై, వంకర తిరిగిన గోరు, కర్కశములైన గనుపులు గల తన తర్జని వ్రేలితో రామలక్ష్మణులను చూడండి! మిమ్ము నేమిచేయుదునో! యని యాకసమున నిల్చి బెదిరించెను.

శ్లో. ప్రాప్య చాశు జనస్థానం ఖరాదిభ్య స్తథావిధం,
రామోపక్రమ మాచఖ్యౌ రక్షఃపరిభవం నవమ్. 42

వ్యాఖ్య : ఆశు-వెంటనే, జనస్థానం-రాక్షస జననివాసమును, ప్రాప్య-చేరి, ఖరాదిభ్యఃఖరాసురుడు మొదలగువారికి, తథావిధం-అట్టిది యగు (తన యవయవములను నరుకుట వంటి), రామోపక్రమం-రాముని దుష్కార్యారంభమును, నవం-క్రొత్తదియగు, రక్షఃపరిభవం-రాక్షసుల నవమానించుటను, ఆచఖ్యౌ, చ-చెప్పివేసెనుగూడ. శూర్పణఖ వెంటనే జనస్థానమునకుఁ జేరి, తన యవయవచ్ఛేదము జేయుటకు రాముడే పూనుకొనుట యనెడు నూతన రాక్షసావమానమును ఖరదూషణాదులకుఁ జెప్పి వారికిఁ గోపము వచ్చునట్లు చేసినదని భావము.

శ్లో. ముఖావయవలూనాం తాం నైర్ఋతా యత్పురో దధుఃరామాభియాయినాం తేషాం తదే వాభూ దమంగళమ్. 43

వ్యాఖ్య : నైర్ఋతాఃరాక్షసులు, ముఖావయవలూనాం-ముఖావయవములగు నాసికాకర్ణములయందు ఛేదింపఁబడిన, తాం-ఆ శూర్పణఖను, పురఃముందర, దధుఃఇతి యత్-ఉంచుకొని రనుట యేది కలదో, తదేవ (తత్+ఏవ)-అదియే, రామాభియాయినాం-రామునిపైకి యుద్ధమునకు వెళ్ళునట్టి, తేషాం-ఆ రాక్షసులకు, అమంగళం-అశుభము, అభూత్-అయ్యెను. ముక్కు చెవులు తెగిన వనితను ముందు పెట్టుకొని రామునిపైకి యుద్ధమునకువెళ్ళిన ఖరదూషణాదుల కదే యపశకునముగా పరిణమించెనని భావము.

శ్లో. ఉదాయుధా నాపతత స్తాన్ దృప్తాన్ ప్రేక్ష్య రాఘవః,
నిదధే విజయాశంసాం చాపే సీతాం చ లక్ష్మణే. 44

వ్యాఖ్య : ఉదాయుధాన్-ఎత్తబడిన మారణాయుధములు గలవారును, ఆపతతః-తనమీదికి వచ్చుచున్నవారును, దృప్తాన్-గర్వితులైయున్న, తాన్-ఆ ఖరదూషణాది రాక్షసులను, ప్రేక్ష్య-పరికించి చూచి. రాఘవః-శ్రీరాముఁడు, చాపే-ధనుస్సునందు, విజయాశంసాం-విజయముయొక్క ఆశను, లక్ష్మణే-లక్ష్మణునియందు, సీతాం చ-సీతనున్ను, నిదధే-ఉంచెను. గర్వితులై తన పైకి వచ్చుచున్న రాక్షసులను జూచి, సీతారక్షణమునందు లక్ష్మణుని నియోగించి రాముఁడు యుద్ధసన్నద్ధుఁ డయ్యెనని భావము.

శ్లో. ఏకో దాశరథిః కామం యాతుధానాః సహస్రశః,
తే తు యావంత ఏవాజౌ తావాంశ్చ దదృశే సతైః. 45

వ్యాఖ్య: దాశరథిః-రాముఁడు, ఏకః-ఒకఁడే, యాతుధానాః-రాక్షసులు, కామం-మిక్కుటముగా, సహస్రశః-వేలకువేలు, తైః, తు-ఆరాక్షసులచేతనై తే సః-ఆరాముఁడు, ఆజౌ-యుద్ధమునందు, తే, యావంతః, ఏవ-ఆరాక్షసులు ఎంత సంఖ్యతో నుండిరో, తావాంశ్చ (తావాన్ + చ)-అంతసంఖ్యగలవాఁడుగా, దదృశే-కనఁబడెను. నిజమునకు రాముఁ డొక్కఁడు, రాక్షసులు వేలకొలఁదిగాను నుండిరి. కాని రాక్షసులకు యుద్ధరంగమున తామెంద రుండిరో అంత సంఖ్యలో రాములు కనఁబడిరి. అనఁగా ప్రతిరాక్షసునితోను బాణప్రతిబాణములు వేయుచు రాముఁడు యుద్ధము చేసెనని భావము.

శ్లో. అసజ్జనేన కాకుత్స్థః ప్రయుక్త మథ దూషణమ్,
న చక్షమే శుభాచారః స దూషణ మివాత్మనః. 46

వ్యాఖ్య: అథ-తరువాత, శుభాచారః-యుద్ధమున నియమము తప్పనివాఁడై న (మంచినడవడికలవాఁడని యర్థాంతరము), సః కాకుత్స్థః-కకుత్థ్స వంశీయుఁడగు ఆరాముఁడు, అసజ్జనేన-దుర్జనులగు రాక్షస జనముచేత, ప్రయుక్తం-పలుపఁబడిన (ఉచ్చరింపఁబడిన యని యర్థాంతరము) దూషణం-దూషణుఁడను రాక్షసుని ఆత్మనః-తనయొక్క, దూషణం, ఇవ-దోషవచనమువలె, న, చక్షమే-సహింప

లేదు. సత్ప్రవర్తనగల వ్యక్తి దుష్టజనముచేత నిందింపబడిన తన దోషమును వలె రాముడు రాక్షసజనముచేత తనపైకిఁబంపఁబడిన దూషణుఁడను రాక్షసుని ప్రతి ఘటనమును సహింపలేదు, అనగా వానినిఁ జంపుటకుఁ బూనెనని భావము.

శ్లో. తం శరైః ప్రతిజగ్రాహ ఖరస్తిశిరసౌ చ సః,
క్రమశస్తైః పునస్తస్య చాపాత్సమమివోద్యయుః. 47

వ్యాఖ్య: సః-రాముఁడు, తం-ఆ దూషణుని, ఖరత్రిశిరసౌ, చ-ఖరాసుర, తిశిరోఽసురులను సైతము, ప్రతిజగ్రాహ-ఎదురుకొట్టెను. క్రమశః (ప్రయుక్తా అపి)-ఒకదానివెనుక నొకటిగా విడువబడినవే అయినప్పటికిని, తస్య-శ్రీరాముని యొక్క, తే, పునః-ఆబాణములేమో, చాపాత్-రామ ధనుస్సునుండి, సమం, ఇవ-ఏకకాలమునందు వలె, ఉద్యయుః-ఎగిరిపోయినవి. అనగా రాముఁడు వరుసగా దూషణ, ఖర, త్రిశిరసులపైకి విడిచినప్పటికిని ఆబాణము లొకేసారి ధనుస్సునుండి బయలుదేరినట్లు చూపరుల కగపడినవట! అట్టి హస్తలాఘవముతో రాముడా రాక్షసులను ముగ్గురిని ప్రతిఘటించె నని భావము.

శ్లో. తైస్త్రయాణాం శితైర్బాణైర్యథాపూర్వవిశుద్ధిభిః,
ఆయుర్దేహాతిగైః పీతం, రుధిరం తు పత్త్రిభిః. 48

వ్యాఖ్య: దేహాతిగైః-దేహములను భేదించి వెళ్ళినవియు, యథాపూర్వ విశుద్ధిభిః-యథాపూర్వ-ప్రయోగించుటకుముందున్న, విశుద్ధిభిః-నైర్మల్యముగల, శితైః-తీక్ష్ణములైన, తైః, బాణైః-ఆరామబాణములచేత, త్రయాణాం-ముగ్గురియొక్క (ఖర, దూషణ, త్రిశిరోసురులయొక్క), ఆయుః-ఆయుష్యము, పీతం-ప్రాగబడినది. రుధిరం తు-రక్తమేమో, పత్త్రిభిః-గ్రద్దలు మొదలగు పక్షులచేత, పీతం-ప్రాగఁబడినది. రాముఁడు ప్రయోగించిన మూడుబాణములు, తీక్ష్ణములై వేగాతిశయముచేత ఆముగ్గురు రాక్షసుల శరీరములు దూఱి, మరల నెప్పటివలె ననఁగా రక్తసిక్తములు గాక, వారి ప్రాణములను మాత్రము హరించినవనియు, ఆరాక్షస దేహములనుండి కారుచున్న రక్తమును కాకులు, గద్దలు మొదలగు పక్షులు ప్రాగిన వనియు భావము.

శ్లో. తస్మిన్ రామశరోత్కృత్తే బలే మహతి రక్షసామ్,
ఉత్థితం దదృశేఽన్యచ్చ కబంధేభ్యో న కించిన. 49

వ్యాఖ్య: తస్మిన్-ఆ, రామశరోత్కృత్తే-రాముబాణములచేత ఛేదింపఁబడిన, మహతి-గొప్పదియగు, రక్షసాం, బలే-రాక్షసులయొక్క సైన్యమునందు, ఉత్థితం-లేచినిల్చున్నది, కబంధేభ్యః-మొండెములకంటె, అన్యచ్చ-మరియొకటి యైనది, కించన-ఏదియును, న దదృశే-కనఁబడలేదు. అట్లు రామబాణ హతమైన ఆరాక్షస సైన్యమునందు లేచి నిల్చున్నవి రాక్షల మొండెములు తప్ప మరియే ప్రాణులు లేకుండెను. తండోపతండములుగా వచ్చిన రాక్షససైన్యము రామునిచేత నిశ్శేషముగాఁ జంపఁబడినదని భావము. "కబంధ" మనఁగా ప్రాణముండి తల తెగిన శరీరము.

శ్లో. సా బాణవర్షిణం రామం యోధయిత్వా సురద్విషాం,
అప్రబోధాయ సుష్వాప గృధ్రచ్ఛాయే వరూథినీ. 50

వ్యాఖ్య: సా, సురద్విషాం, వరూథినీ-ఆరాక్షసులయొక్క సైన్యము, బాణ వర్షిణం-శరవర్షమును గురిపించునట్టి, రామం-రాముని, యోధయిత్వా-యుద్ధము చేయించి, గృధ్రచ్ఛాయే-గ్రద్దతొక్కల నీడయందు, అప్రబోధాయ - మరల మేల్కొనకుండుటకై, సుష్వాప-నిద్రించెను (దీర్ఘ నిద్రపోయెను). అట్లు రాక్షససేన తానై రామునికిఁ గోపమును తెప్పించి యతని బాణ వర్షముచేతఁ బ్రాణములు గోల్పోయి గ్రద్దతొక్కల నీడలో దీర్ఘ నిద్రపోయెను. అనఁగా మరణించెనని భావము.

శ్లో. రాఘవాస్త్రవిదీర్ణానాం రావణం ప్రతి రక్షసామ్,
తేషాం శూర్పణఖై వైకా దుష్పృవృత్తిహరా ఽభవత్. 51

వ్యాఖ్య: ఏకా-ఒకతెయగు, శూర్పణఖా, ఏవ-శూర్పణఖమాత్రమే, రావణం, ప్రతి-రావణుని గురించి, రాఘవాస్త్ర విదీర్ణానాం-రామబాణములచేత చీల్చఁబడిన (చచ్చిన), తేషాం, రక్షసాం-ఆఖరాదిరాక్షసులయొక్క, దుష్పృవృత్తిహరా-దుర్మరణవార్తను తీసుకవెళ్ళవలసినది, అభవత్-అయ్యెను, ఖరదూషణాదిరాక్షసుల మరణవార్తను రావణునికిఁ జెప్పుట కొక్క శూర్పణఖ మాత్రమే మిగిలియుండె ననియు రాక్షసు లందరును రామబాణములచేత హతులైరనియు భావము. శూర్ప + నఖా శూర్పణఖా "పూర్వపదాత్సంజ్ఞాయాం" అను సూత్రముచేత 'నఖ' శబ్దము నందలి 'న' కారమునకు "ణ" కారము రాగా, "నఖముఖాత్సంజ్ఞాయామ్" అను

సూత్రముచేత "జీప్" కునిషేధ ముండుటవలన, "శూర్పణఖీ" యని ఈకారాం తము కాక "శూర్పణఖా" యని ఆకారాంతశబ్దమైనది శూర్పణఖ వెళ్ళి రావణునికి రాముడు తనకుఁ జేసిన యవమానమును, ఖరదూషణాదుల మరణమును, జెప్పినదని గ్రహింపవలయును.

శ్లో. నిగ్రహా త్స్వసు రాప్తానాం వధాచ్చ ధనదానుజః,
రామేణ నిహితం మేనే పదం దశసు మూర్ధసు. 52

వ్యాఖ్య: స్వసుఃచెల్లెలగు శూర్పణఖయొక్క,నిగ్రహాత్-కర్ణనాసికాచ్ఛేదము వల్లను, ఆప్తానాం-బంధువులగు ఖరదూషణాదులయొక్క, వధాచ్చ-వధవల్లను, ధనదానుజఃకుబేరుని తమ్ముడగు రావణుఁడు, రామేణ-శ్రీరామునిచేత, దశసు, మూర్ధసు-తన పది తలల మీదను, పదం-పాదమును, నిహితం-ఉంచఁబడినదిగా, మేనే-తలఁచెను. తన చెల్లెలి ముక్కు చెవులు కోయుటవల్లను, తన బంధువులు ఖరాదులను జంపుటవల్లను, రాముఁడు తన పది తలలపైన పాదమునుంచి యవమానించినట్లు భావించి క్రుద్ధుఁడయ్యె నని భావము. రామాయణ కథాభాగమును సంగ్రహించి వ్రాయుచున్న యీద్వాదశసర్గమునందు కాళిదాసు తనకు మహాకవి వాల్మీకిపైఁ గల వినమ్రభక్తిభావమును ప్రకటించుటకో! యనునట్లు కథను అతి క్లుప్తముగా సంగ్రహించుటకుఁ బూనెనుగాని నేను సయితము రామకథను వ్రాయుదు ననికాని, వాల్మీకి కంటే అతిశయించి వ్రాయుదు ననిగాని తలఁచినట్లు లేదు. అందుకే ఆదిలోనే "మందః కవియశఃప్రార్థీ గమిష్యా మ్యపహాస్యతామ్" అని యనెను. ఇచ్చటి కవి శబ్దమునకు వాల్మీకియే యర్థము. మందుఁడనైన నేను వాల్మీకి కీర్తినిఁ గోరినట్టయితే నలుగురు నవ్విపోవుదు రని యాశ్లోకభావము. కనుక రఘువంశవృక్ష చరిత్రలో వచ్చుటచేత కాళిదాసు రామకథను తాకెను గాని లేనిచోఁ దాకువాఁడుగాఁడని మనము గ్రహింపవలెను. ఆయనకు వాల్మీకిపై నపార మైన భక్తియున్నది. వాల్మీకిని మించి రామకథను నడుపఁజాల నన్న భయము గూడ నున్నది.

శ్లో. రక్షసా మృగరూపేణ వంచయిత్వా స రాఘవౌ,
జహార సీతాం పక్షీంద్రప్రయాసక్షణ విఘ్నితః. 53

వ్యాఖ్య : సఃఅట్లు క్రుద్ధుఁడైన రావణుఁడు, మృగరూపేణ-బంగారులేడి రూపమును ధరించిన, రక్షసా-మారీచునిచేత, రాఘవౌ–రామలక్ష్మణులను, వంచ

యిత్వా-మోసగించి, పక్షీంద్ర ప్రయాస క్షణ విఘ్నితః--పక్షీంద్ర-జటాయువు యొక్క, ప్రయాస-యుద్ధరూపమైన శ్రమచేత, క్షణ-కొలదికాలము, విఘ్నితః-విఘ్నముగలవాఁడగుచు, సీతాం-సీతాదేవిని, జహార-అపహరించుకొని వెళ్ళెను. రామాయణకథా భాగసంగ్రహరూపమైన యీశ్లోకమునందు, శూర్పణఖ రావణుని రెచ్చఁగొట్టుటచేత నతఁడు గ్రుద్ధుడై, మారీచుని తనవాక్చాతుర్య తర్జనములచేత లొంగదీసి బంగరులేడినిఁ జేసుకొని, పంచవటికివచ్చి బంగరులేడిపై సీతకు అభిలాషను గలిగించి తన్మూలముగా రామలక్ష్మణులను దూరముగాఁ పంపి, బ్రాహ్మణ వేషమున భిక్షనుగోరి సమీపమునకు వచ్చిన సీతను పట్టుకొని వెళ్ళుచు దారిలో జటాయువు ఎదుర్కొనఁగా నతని ఱెక్కలు ఛేదించి కొంచమాలస్యముగా సీతను లంకకుఁ జేర్చుకొనె నన్న భావము వెల్లడియగుచున్నది.

శ్లో. తౌ సీతాన్వేషిణౌ గృధ్రం లూనపక్షం మపశ్యతామ్,
ప్రాణైర్దశరథప్రీతే రనృణం కంఠవర్తిభిః. 54

వ్యాఖ్య : సీతాన్వేషిణౌ-సీతనువెదకుచు వెళ్ళిన, తౌ-ఆ రామలక్ష్మణులు, లూనపక్షం-చేదింపఁబడిన ఱెక్కలుగలదియు, కంఠవర్తిభిః-కంఠమునందున్న, ప్రాణైః-ప్రాణములచేత, దశరథప్రీతేః-దశరథస్నేహమునకు, అనృణం-ఋణము తీర్చుకొనినదియునగు, గృధ్రం-జటాయువను గ్రద్దను, అపశ్యతాం-చూచిరి. సీతకై యరణ్యమున వెదకుచుఁ దిరుగుచున్న రామలక్ష్మణులు, ఱెక్కలు తెగి, కంఠమునఁ ప్రాణముల నిలుపుకొని, తమకు సీతను రావణుఁ డెత్తుకొనిపోయినవార్తను జెప్పి, దశరథుని సఖ్యమునకు ఋణముఁ దీర్చుకొన్న జటాయువును జూచిరి.

శ్లో. స రావణహృతాం తాభ్యాం వచసాఽఽచష్ట మైథిలీం,
ఆత్మనః సుమహత్కర్మ ప్రణైర్ యావేద్య సంస్థితః. 55

వ్యాఖ్య : సః-అట్లు కంఠగతప్రాణుఁడై యున్న జటాయువు, రావణ హృతాం-రావణునిచేత అపహరింపఁబడిన, మైథిలీం-సీతను గుఱించి, తాభ్యాం-ఆ రామలక్ష్మణులకు (షష్ఠీ విభక్త్యర్థమున చతుర్థీ విభక్తి), వచసా-మాటచేత, ఆచష్ట-చెప్పెను. ఆత్మనః-తనయొక్క, సుమహత్-మిక్కిలి గొప్పదియగు, కర్మ-యుద్ధరూపమైన ప్రయత్నమును, ప్రణైః-తన శరీరమునకుఁ దగిలిన గాయముల చేత, ఆవేద్య-తెలిపి, సంస్థితః-మరణించెను. సీతను రావణుఁ డెత్తుకపోయిన వార్తను

మాత్రము వాక్కుతో జెప్పి, తాను ప్రతిఘటించిన రావణయుద్ధ వివరములను జెప్పుటకు శక్తిచాలక, గాయములచేతనే రామలక్ష్మణులు గ్రహించునట్లు చేసి జటాయువు మరణించెనని భావము. సంస్థితః--"సమ్" అను ఉపసర్గతోజేరిన "స్థా" ధాతువునకు మరణము అర్థము కనుక ఆ యర్థముననే "సంస్థిత" శబ్దమును ప్రయోగించెను.

శ్లో. తయో స్తస్మి న్నవీభూత పిత్రవ్యాపత్తి శోకయోః,
పితరీ వాగ్నిసంస్కారాత్ పరా వవృతిరే క్రియాః. 56

వ్యాఖ్య : నవీభూత పిత్రవ్యాపత్తి శోకయోః--నవీభూత-మరల క్రొత్త దిగామారిన, పిత్రవ్యాపత్తి-తండ్రి మరణము పలని, శోకయోః- దుఃఖము గల్గిన, తయోః-ఆరామలక్ష్మణులయొక్క, తస్మిన్-ఆజటాయువునందు, పితరి, ఇవ-తండ్రియందువలె, అగ్నిసంస్కారాత్-అగ్నిసంస్కారమునుండి, పరాః క్రియాః-ఉత్తరక్రియలు, వవృతిరే-జరిగినవి. అట్లు మరణించిన జటాయువును జూచి మరల పిత్రమరణదుఃఖము ననుభవించుచున్న రామలక్ష్మణులు ఆ జటాయువునకు అగ్నిసంస్కారము మొదలు తర్పణాంతము లగు ఔర్ధ్వదైహిక క్రియలను తమ తండ్రికి చేసినట్లు చేసిరని భావము. అనాథప్రేత సంస్కారము కోటి యజ్ఞతుల్యము గనుక రాముడట్లు చేసెను. వ్యాపత్తి అనగా మరణము.

శ్లో. వధ నిర్ధూతశాపస్య కబంధ స్యోపదేశతః,
ముమూర్ఛ సంఖ్యం రామస్య సమానవ్యసనే హరౌ. 57

వ్యాఖ్య : వధనిర్ధూతశాపస్య--వధ-రామకృతమైన వధచేత, నిర్ధూత-తొలగింపబడిన, శాపస్య-శాపముగలిగి స్వర్గమునుజేరిన, కబంధస్య-కబంధుడను రాక్షసునియొక్క, ఉపదేశతః-ఉపదేశమువలన, రామస్య-రామునికి, సమాన వ్యసనే-తనకు సమానమైన ఆపదగల, హరౌ-కపియగు సుగ్రీవునియందు, సఖ్యం-స్నేహము, ముమూర్ఛ-వృద్ధిచెందెను. కబంధరాక్షసుడు రామబాణ నిహతిచేత శాపముతొలగి దేవత్వమును పొంది రామునికి సుగ్రీవునితో సఖ్యముజేసినచో నీ కార్యము సిద్ధించునని చెప్పెను. ఆ కారణమువల్లనే రాముడు తనవలెనే భార్యను పోగొట్టుకున్న సుగ్రీవునితో మైత్రిని బెంచుకొనెను. "ఉపదేశ" మనగా తెలి యని విషయమును దెలుపుట (అజ్ఞాత జ్ఞాపన ముపదేశః) "మూర్ఛ-మోహస

ముచ్ఛ్రియయోః" అనుటవలన మూర్ఛధాతువునకు తెలివిలేక పడిపోవుటయు, అభివృద్ధియు నర్థములు. ఇచ్చట అభివృద్ధ్యర్థకము.

శ్లో. స హత్వా వాలినం వీర స్తత్పదే చిర కాంక్షితే,
ధాతోఃస్థాన ఇవాదేశం సుగ్రీవం సంన్యవేశయత్. 58

వ్యాఖ్య : వీరః-వీరుడైన, సః-ఆరాముడు, వాలినం-వాలిని, హత్వా-చంపి, చిరకాంక్షితే-బహుకాలమునుండి కోరబడిన, తత్పదే-ఆవాలి స్థానమునందు, ధాతోః, స్థానే, ఆదేశం, ఇవ-ధాతువుయొక్క స్థానమున ఆదేశధాతువును వలె, సుగ్రీవం-సుగ్రీవుని, సంన్యవేశయత్-స్థాపించెను. హనుమద్దర్శన, సుగ్రీవసఖ్య ప్రభృతి కార్యములు జరిగిన పిమ్మట మహావీరుడైన రాముడు వాలినిజంపి యతని స్థానమున అనగా కపిరాజ్యమునందు సుగ్రీవునిపట్టాభిషేకమును జరిపించె నని భావము. అది ధాతుస్థానమున వచ్చిన ఆదేశము (మరియొకధాతువు)వలెనున్న దట. అస్తే ర్భూః" అని అస్తిధాతుస్థానమునం దాదేశముగా వచ్చిన "భూ" ధాతువు అసధాతురూపముల నన్నిటిని పొందును. అట్లే సుగ్రీవుడు వాలి సర్వస్వమున కధిపతియై, తారాదిపరిగ్రహణముఁ జేసెనని వ్యంగ్యార్థము.

శ్లో. ఇత స్తత శ్చ వై దేహీ మన్వేష్టుం భర్తృచోదితాః,
కపయ శ్చేరు రార్తస్య రామ స్యేవ మనోరథాః. 59

వ్యాఖ్యః వైదేహీం-సీతను, అన్వేష్టుం-వెదకుటకు, భర్తృచోదితాః-తమ ప్రభువైన సుగ్రీవునిచేత ప్రోత్సహింపబడిన, కపయః-హనుమంతుడు మొదలగు వానరులు, ఆర్తస్య-సీతావిరహాతురుడగు, రామస్య-రామునియొక్క, మనోరథాః, ఇవ-కోరికలవలె, ఇత స్తతః-ఇటునటు నానావనప్రదేశములందు, చేరుః, చ-తిరిగిరి (వెదకిరిగూడ). సీతావిరహబాధ ననుభవించు రాముని కోరికలవలె సుగ్రీవుని యాజ్ఞచేత హనుమదాది కపీశ్వరులు వనప్రదేశములం దంతటను సీతను వెదకుచుఁ దిరిగిరి.

శ్లో. ప్రవృత్తా వుపలబ్ధాయాం తస్యాఃసంపాతిదర్శనాత్
మారుతిఃసాగరం తీర్ణఃసంసార మివ నిర్మమః. 60

వ్యాఖ్య: సంపాతిదర్శనాత్-సంపాతియొక్క దర్శనమువలన, తస్యాః-సీత యొక్క, ప్రవృత్తౌ-వార్త, ఉపలబ్ధాయాం-తెలియఁబడినదికాగా, మారుతిః-హనుమంతుఁడు, సాగరం-సముద్రమును, నిర్మమః-మమకారములేనివాఁడు, సంసారం, ఇవ-అవిద్యాబంధనమువలె, తీర్ణః-దాటెను సీతాన్వేషణమున శ్రమపడుచున్న వానరులకు జటాయువు సోదరుఁడగు సంపాతి కనఁబడి, సీత లంకయందున్న విషయమును జెప్పఁగా, ఆంజనేయుఁడు లంకను జేరుటకై సముద్రమును దాటెను. అది, అవిద్యారూపమై జనన మరణ క్లేశములతోఁ గూడిన సంసారసాగరమును నిర్మముఁడు మమకారము లేనివాఁడు, దాటిన ట్లుండెనట. అంత దుస్తరమని భావము. "నిర్మమ" శబ్దమునందలి మను యనునది మనుతార్థకమగు అవ్యయము. "తీర్ణ" కర్త్రర్థక క్త ప్రత్యయాంతము గనుక దాటెను అని యర్థము. కార్మార్థకమైనప్పుడు దాటఁబడిన యను నర్థమున నుండును.

శ్లో. దృష్టా విచిన్వతా తేన లంకాయాం రాక్షసీవృతా,
జానకీ విషవల్లీభిః పరీతేవ మహౌషధిః. 61

వ్యాఖ్య : లంకాయాం-లంకయందు, విచిన్వతా-వెదకుచుండిన, తేన-ఆ హనుమంతునిచేత, రాక్షసీవృతా-రాక్షస స్త్రీలచేత చుట్టఁబడియుండిన, జానకీ-సీత, విషవల్లీభిః-విషపుఁదీగలచేత, పరీతా-చుట్టుకొనబడిన, మహౌషధిః, ఇవ-సంజీవినీలతవలె, దృష్టా-చూడఁబడెను రావణ రాజధానియందు వెదకుచున్న హనుమంతునికి విషలతలచేతఁ జుట్టఁబడిన సంజీవినీమహౌషధివలె, రాక్షసస్త్రీలచేత చుట్టఁబడియుండిన జానకి కనఁబడెను.

శ్లో. తస్యై భర్తురభిజ్ఞాన మంగుళీయం దదౌ కపిః,
ప్రత్యుద్గత మివానున్నై స్తదానందాశ్రుబిందుభిః. 62

వ్యాఖ్య : కపిః-హనుమంతుఁడు, భర్తుః-భర్తయగు రామునియొక్క, అభిజ్ఞానం-ఆనవాలుగానుండిన, అంగుళీయం-ఉంగరమును, తస్యై-అట్లుకనఁబడిన సీతకు, దదౌ-ఇచ్చెను. (ఆ యుంగగము) అనున్నైః-చల్లని, తదానందాశ్రు బిందుభిః-ఆ సీతాదేవియొక్క, ఆనందాశ్రుబిందువులచేత, ప్రత్యుద్గతం, ఇవ-యెదుర్కొనబడినట్లుండెను. ఆంజనేయుఁడు సీతకు ఇది నాభర్తదే యనిగుర్తుపట్టుటకు వీలగు రామాంగుళీయకము నీయఁగా నామె యానందాశ్రుబిందువులు రాల్చుచు

సంతోషముగ స్వీకరించెనని భావము. అభిజ్ఞాన మనగా ప్రత్యభిజ్ఞానసాధకము, ఆనవాలు అని యర్థము.

శ్లో. నిర్వాప్య ప్రియసందేశై ః సీతా మక్షవధోద్ధతః,
స దదాహ పురీం లంకాం క్షణసోఢారినిగ్రహః. 63

వ్యాఖ్య : సః-ఆ హనుమంతుడు, ప్రియసందేశైః-భర్తయగు రాముని యొక్క సందేశవచనములచేత, సీతాం-సీతను, నిర్వాప్య-సంతోషపరచి, అక్షవధోద్ధతః-రావణకుమారుడు అక్షయునియొక్క వధచేత దర్పితుడగుచు, క్షణసోఢారినిగ్రహః—క్షణసోఢ-క్షణకాలము సహింపబడిన, అరినిగ్రహః-ఇంద్రజిత్కర్తృకమగు బ్రహ్మాస్త్రబంధరూపమైన బాధగలవాడై, లంకాం—లంకను, దదాహ-కాల్చివేసెను. హనుమంతుడు రామసందేశమును సీతకు జేర్చి, అశోకవనభంజన, అక్షయకుమారవధలు చేసి, ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచేత బంధింపగా క్షణకాల మాబాధను సహించి పిమ్మట తన వాలము నంటించుటకు రాక్షసకృతమైన యగ్నిచేతనే రావణరాజధానియగు లంకను భస్మీపటలముగా జేసెను.

శ్లో. ప్రత్యభిజ్ఞానరత్నం చ రామా యాదర్శయత్ కృతీ,
హృదయం స్వయ మాయాతం వైదేహ్యా ఇవ
మూర్తిమత్. 64

వ్యాఖ్య : కృతీ-కృతకృత్యుడైన హనుమంతుడు, స్వయం, ఆయాతం-తనకుతానై వచ్చినదియు, వైదేహ్యాఃసీతయొక్క, మూర్తిమత్-సాకారమైన, హృదయం, ఇవ-హృదయమును బోలియుండిన, ప్రత్యభిజ్ఞానరత్నం, చ-సీతదియగు చూడారత్నమును సైతము, రామాయ—రామునికి, ఆదర్శయత్-చూపెను. లంకాదహనముచేత కృతకృత్యుడైన ఆంజనేయుడు ఒక వస్తురూపమునుబొంది తానైవచ్చిన సీత హృదయమా? యనదగిన చూడారత్నమును ప్రతిసందేశవాక్యరస్సరముగా రాముని కిచ్చెను.

శ్లో. స ప్రాప హృదయన్యస్తమణిస్పర్శ నిమీలితః,
అపయోధర సంసర్గాం ప్రియాలింగన నిర్వృతిమ్. 65

వ్యాఖ్య: హృదయన్యస్త మణిస్పర్శ నిమీలితః-హృదయన్యస్త-వక్ష స్థలమునం దుంచుకోఁబడిన, మణిస్పర్శ-ఆచూడారత్నముయొక్క స్పర్శచేత, నిమీ లితః-ముకుళిత నేత్రములుగల. సః-ఆరాముడు, అపయోధరసంసర్గాం-స్తనస్పర్శ లేని, ప్రియాలింగననిర్వృతిం-ప్రియురాలి ఆలింగనముచేతఁ గలుగుసుఖమును, ప్రాప-పొందెను. హనుమంతుఁ డిచ్చిన సీతాచూడారత్నమును హృదయమునకు హత్తుకొనుటచేతఁ గలిగిన యోదార్పుచేతఁ గన్నులు మూసికొన్న రామచంద్రుఁడు స్తనసంబంధములేని సీతాలింగనసంతోషమును బొందెను. ఈ యాలింగనమునకు సీతా స్తనస్పర్శలేకుండుటను "అపయోధరసంసర్గాం" అనువిశేషణముఁ దెలుపు చున్నది. దీనివలన రామునికి వనవాసకాలమున కామవాంఛ లేకుండెను. లేదా దుఃఖపరితప్తుఁడగు నతనికి సీతాలింగనము ఆమె పునర్దర్శన భాగ్యానందమాత్ర ఫలకము. లేదా రామవియోగముచేత సీత కృశించియున్నందున స్తనాభావము. మొదలగు నూహలను వ్యంగ్యభంగిచేత ఈ విశేషణము గలిగించుచున్నది.

శ్లో. శ్రుత్వా రామః ప్రియోదంతం మేనే తత్సంగమోత్సుకః,
మహార్ణవపరిక్షేపం లంకాయాః పరిఖాలఘుమ్. 66

వ్యాఖ్య: ప్రియోదంతం (ప్రియా + ఉదంతం)-ప్రియురాలియొక్కవార్తను శ్రుత్వా-విని, తత్సంగమోత్సుకః-ఆమెయొక్క సమాగమమునందు ఆతురతగల, రామః-రాముఁడు, లంకాయాః-లంకయొక్క, మహార్ణవపరిక్షేపం-మహాసముద్ర పరివేషమును, పరిఖాలఘుం-చిన్నయగడ్డచే చుట్టబడియుండుటనుగా, మేనే-తలఁ చెను. ప్రియురాలివార్త తెలియఁగానే యామెను కలసికొనవలెనను త్వరగల రాముఁడు లంకాపట్టణము మహాసముద్రముచేత చుట్టబడియున్నను అది యొకచిన్న యగడ్డనడుమ నున్నట్టు భావించెను. అనఁగా మహాపరాక్రమవంతుఁడైన రాము నికి సీతాదర్శనమునందలి యౌత్సుక్యముచేత లంకకుఁజేరుట యొకగొప్పపని కాదని తోచె నని భావము.

శ్లో. స ప్రతస్థే ఽరినాశాయ హరిసైన్యైరనుద్రుతః,
న కేవలం భువః పృష్ఠే వ్యోమ్ని సంబాధవర్తిభిః. 67

వ్యాఖ్య: కేవలం-ఒక, భువః, పృష్ఠే-భూతలము పైననే, న-కాదు, వ్యోమ్ని-ఆకాశమునందును, సంబాధ వర్తిభిః-చోటుచాలక యొకరినొకరు త్రోసి

కొని సదమచున్న, హరిసైన్యైః–వానరసైన్యములచేత, అనుద్రుతః–అనుసరింపఁ బడుచున్నవాఁడగుచు, సః–వాఁడు, అరినాశాయ–శత్రునాశముచేయుటకొరకు, ప్రహస్తేన–బయలుదేరెను. సీతారక్షణ దర్భాది వ్యగ్రమనస్కుఁడైన రాముఁడు శత్రువినాశముకొఱకు బయలుదేరగా నతనివెంట కోట్లసంఖ్యగల సుగ్రీవాదివానరులు నేలయు నింగియుఁ బట్టక యొకరినొకరు రాచుకొనుచుఁ బరుగెత్తిరని భావము.

శ్లో. నివిష్ట ముదధేః కూలే తం ప్రపేదే విభీషణః,
స్నేహాత్ రాక్షసలక్ష్మ్యేవ బుద్ధి మావిశ్య చోదితః. 68

వ్యాఖ్య : ఉదధేః-సముద్రముయొక్క, కూలే-తీరమునందు, నివిష్టం-కూర్చునియున్న, తం-ఆ రాముని, విభీషణః-విభీషణుఁడు, రాక్షసలక్ష్మ్యా-రాక్షసరాజ్యలక్ష్మిచేత, స్నేహాత్-స్నేహమువలన, బుద్ధిం-బుద్ధిని, ఆవిశ్య-ప్రవేశించి, చోదితః, ఇవ-ప్రేరణచేయఁబడినవాఁడువలె, ప్రపేదే-చేరెను. సర్వవానరసైన్యముతో రాముఁడు సముద్రతీరమును జేరి కూర్చుని కర్తవ్యము నాలోచించు సమయమున రాక్షసరాజ్యలక్ష్మిచేత రాక్షసులయంచలి ప్రేమవలనఁ ప్రోత్సహింపఁబడినవాఁడు వలె రాముని ప్రార్థించుటకై విభీషణుఁడు విన్నమ భావముతో రాముని సన్నిధికి వచ్చెను "విశేషేణ భీషయతే శత్రూన్ ఇతి విభీషణః" అని విభీషణ శబ్ద వ్యుత్పత్తి. శత్రుభయంకరుఁడు అని యర్థము.

శ్లో. తస్మై నిశాచరైశ్వర్యం ప్రతిశుశ్రావ రాఘవః,
కాలే ఖలు సమారబ్ధాః ఫలం బధ్నంతి నీతయః. 69

వ్యాఖ్య : రాఘవః-రాముఁడు, తస్మై-అట్లువచ్చి యా శయించిన విభీషణునికి, నిశాచరైశ్వర్యం-రాక్షసరాజ్యాధిపత్యమును, ప్రతిశుశ్రావ-ఇచ్చెదనని ప్రతిజ్ఞచేసెను (తథాహి–అధియుక్తమే) కాలే-సరియైన సమయమునందు, సమారబ్ధాః-ప్రారంభింపఁబడిన, నీతయః-యుక్తిప్రవర్తనములు, ఫలం, బధ్నంతి ఖలు-ఫలమును జేకూర్చునుగదా! శ్రీరాముఁడు తనాశ్రయింపవచ్చిన విభీషణునికి అభయము నిచ్చి లంకాధిపత్యము నొసఁగెదనని మాట యిచ్చెను. రాముఁడు జయించు నన్న నమ్మకముతో విభీషణుఁడు రావణకృతావమానమును భరింపలేక వచ్చి శరణువేఁడుటయు రాముఁడతనిని విశ్వసించి రాక్షసరాజ్యలక్ష్మి నొసఁగెదనని ప్రతిజ్ఞచేయుటయు జరిగెను. సకాలమునఁ జేసిన రాజనీతి ప్రయోగము తప్పక

ఫలించును గనుక ఆప్రతిజ్ఞవలన విభీషణుఁడు రామభృత్యుఁడగుటయు నతనికి రాక్షసరాజ్యము లభించుటయు జరిగినవని భావము. అలంకారము: అర్థాంతర న్యాసము.

శ్లో. స సేతుం బంధయామాస ప్లవగై ర్లవణాంభసి
రసాతలా దివోన్మగ్నం శేషం స్వప్నాయ శార్ఙ్గిణః. 70

వ్యాఖ్య: సః-రాముఁడు, లవణాంభసి-లవణసముద్రమునందు, ప్లవగైః-వానరులచేత, శార్ఙ్గిణః-విష్ణువుయొక్క, స్వప్నాయ-శయనముకొఱకు, రసాతలాత్-పాతాళమునుండి, ఉన్మగ్నం-పైకిఁదేలిన, శేషం, ఇవ-ఆదిశేషునివలెనున్న, సేతుం-వంతెనను (వారధిని), బంధయామాస-కట్టించెను. రాముఁడు వానరులచేత సముద్రముపై సేతువును గట్టించెను. అది విష్ణువు శయనించుటకై పాతాళమునుండి జలోపరిభాగమునకు వచ్చిన ఆదిశేషుఁడా! యన్నట్లుండెనట. రాముఁడు విష్ణుమూర్తి యొక్క యవతారమేయగుటచేత సేతువునకు శేషోపమానము మిక్కిలి సమంజసముగా నున్నది. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. తేనో త్తీర్య పథా లంకాం రోధయామాస పింగళైః
ద్వితీయం హేమప్రాకారం కుర్వద్భి రివ వానరైః. 71

వ్యాఖ్య: రాముఁడు, తేనపథా-ఆసేతుమార్గముచేత, ఉత్తీర్య-సాగరమును దాటి, పింగళైః-సువర్ణవర్ణముగలవారైనందున, ద్వితీయం-రెండవదియగు, హేమప్రాకారం-బంగారపుకోటను, కుర్వద్భిః, ఇవ-సిద్ధము చేయుచున్న వారివలెనున్న, వానరైః-కపులచేత, లంకాం-లంకాపట్టణమును, రోధయామాస-చుట్టును ముట్టడి చేయించెను. రాముఁడు సేతుమార్గమున సముద్రమునుదాటి వానరసైన్యములతో లంకను ముట్టడించెను. వానరులు పింగళవర్ణముగలవారగుటవలన వారు చుట్టును ఆవ్రక్కగింపఁగా లంక తనకు మొదటనున్న సువర్ణప్రాకారముతోపాటు రెండవ బంగారు కోటతో విలసిల్లినట్లుండెనట. "హేమప్రాకార" శబ్దమునందలి "మ" కారము లేఫ సంయుక్తాక్షరముకంటె ముందున్నందున, లఘువేకాని గురువుకాదు. అలం: ఉత్ప్రేక్ష.

శ్లో. రణః ప్రవవృతే తత్ర భీమః ప్లవగరక్షసామ్
దిగ్విజృంభిత కాకుత్స్థ పౌలస్త్య జయఘోషణః. 72

వ్యాఖ్యః తత్ర ఆలంకయందు, ప్లవగరక్షసాం-వానరులకును రాక్షసులకును, భీమః-భయంకరమైనదియు, దిగ్విజృంభిత కాకుత్స్థపౌలస్త్య జయఘోషణః—దిగ్విజృంభిత-దిక్కులకెగఁ బ్రాకిన, కాకుత్స్థపౌలస్త్య-రామరావణులయొక్క, జయఘోషణః-"జయ, జయ" యను నినాదములుగల, రణః-యుద్ధము, ప్రవవృతే-జరిగెను. లంకయందు "రామజయ! రామజయ!" అని యొకప్రక్కను, "రావణజయ! రావణజయ" అని యొకప్రక్కను బయలు వెడలుచున్న రామ రావణ జయనినాద ఘోషణముల వలన దిక్కులు పిక్కటిల్లఁగా వానర రాక్షసులకు భయంకరమైన యుద్ధము జరిగెను. "సమర, అనీక, రణ, కలహ, విగ్రహ" శబ్దములు పుంలింగములు.

శ్లో. పాదపావిద్ధపరిఘః శిలానిష్పేష్టముద్గరః
అతిశస్త్రనఖన్యాసః శైలరుగ్ణమతంగజః. 73

వ్యాఖ్యః ఆరణము, పాదపావిద్ధపరిఘః-వృక్షములచేత విరుగఁగొట్టబడిన యినుపముఖాల గదలుగలదిగను, శిలానిష్పేష్టముద్గరః-రాళ్ళచేత పిండిచేయఁబడిన ద్రుఘణములనబడు శూలములు గలదిగను, అతిశస్త్రినఖన్యాసః-ఖడ్గములను మించిన గోటిచీల్పులు గలదిగను, శైలరుగ్ణమతంగజః-కొండబండలు మీదఁబడుటచే చచ్చిన గజములు గలదిగను నుండెను. అనఁగా వానరులు వృక్షశిలానఖపాషాణ ఘాతములచేత రాక్షసుల శస్త్రాస్త్రములను ద్రుంచి భయంకర యుద్ధమును గావించిరి.

శ్లో. అథ రామశిరశ్ఛేద దర్శనోద్భ్రాంత చేతనామ్
సీతాం మాయేతి శంసంతీ త్రిజటా సమజీవయత్. 74

వ్యాఖ్యః అథ-అనంతరం, రామశిరశ్ఛేద దర్శనోద్భ్రాంత చేతనాం—రామ-శ్రీరామునియొక్క, శిరశ్ఛేద-నఱుకబడినతలయొక్క, దర్శన-దర్శనముచేత, ఉద్భ్రాంతచేతనాం-ఎగిరిపోయిన చైతన్యముగలదియగు (మూర్ఛిల్లిన), సీతాం-సీతను, త్రిజటా-త్రిజటయను పేరుగల రాక్షస వనిత, మాయా, ఇతి-ఇదిమా

యాకల్పితమని, శంసంతీ-చెప్పుచున్నదియై, సమజీవయత్-బ్రతికించెను. విద్యు జ్జిహ్వుడను రాక్షసుడు సీతవద్దకివెళ్ళి రాముడు రావణునిచే జంపబడెనని తన మాయచేత రాముని తలను జూపగా ఆరామశిరఃఖండమును జూచి సీత గత చేతనయై మూర్ఛిల్లినది. అప్పుడు త్రిజట "ఇది మాయాకల్పితము నిజముకాదు" అని సీతకు జెప్పుచు, మూర్ఛదీర్చి బ్రతికించిన దని భావము.

శ్లో. కామం జీవతి మే నాథ ఇతి సా విజహౌ శుచమ్
ప్రాజ్ఞాత్వా సత్య మస్యాంతం జీవితాస్మీతి లజ్జితా. 75

వ్యాఖ్య: సా—అట్లు బ్రతికిన సీ, మే, నాథఃనాథ ర్తయైన రాముడు, జీవతి, ఇతి- బ్రతికియేయున్నా డను కారణము వలన, శుచం-శోకమును, కామం, విజహౌ-పూర్తిగా వదలిపెట్టెను. కాని, ప్రాక్-పూర్వము, అస్య-అతనియొక్క, అంతం-నాశమును, సత్యం, మత్వా-నిజమని తలచి, జీవితా, అస్మి, ఇతి-బ్రతికిన దాననైతినే యని, లజ్జితా- సిగ్గుపడినది. త్రిజటానవచనమువలన రాముడు జీవించియేయున్నాడని యెఱిగి సీత దుఃఖమును పూర్తిగా విడచినది. కాని మొదట రాముడు మరణించెనన్న వార్తను నమ్మి మరల బ్రతికితినేయని సిగ్గుపడెను. ఆ మహావీరుని మరణమును నమ్ముటయు, మరల బ్రదుకుటయు లజ్జకుగారణములు. దుఃఖము కన్నను లజ్జాభరము దుస్సహమైన దని భావము.

శ్లో. గరుడాపాత విశ్లిష్ట మేఘనాదాస్త్ర బంధనః
దాశరథ్యోః క్షణక్లేశః స్వప్నవృత్త ఇవాభవత్. 76

వ్యాఖ్య: గరుడాపాత..... బంధనఃగరుడాపాత-గరుత్మంతునియొక్క యాగమనముచేత, విశ్లిష్ట-విడిపోయిన, మేఘనాద-ఇంద్రజిత్తుయొక్క, అస్త్ర బంధనఃనాగాస్త్రబంధనముగల, క్షణక్లేశఃస్వల్పకాలమునందలి బాధ, దాశరథ్యోఃదశరథ పుత్రులకు (రామలక్ష్మణులకు), స్వప్నవృత్తఃస్వప్నమునందు ఇవ జరిగిపోయినది వలె, అభవత్-ఉండెను. ఇంద్రజిత్తు నాగాస్త్రముచేత రామలక్ష్మణులను బంధింపగా విష్ణువాహనమైన గరుత్మంతుడచ్చటికి వచ్చి వాలెను. అతనినిఁ జూచి నాగాస్త్రము భయముచే సడలిపోయెను. క్షణకాలమున జరిగిన ఆబాధ రామలక్ష్మణులకు స్వప్న వృత్తాంతమువలె నుండెనట. గరుత్మంతుడు వచ్చుటకు రాముడు శ్రీమహావిష్ణుని యవతారమై యుండుటయే కారణమని భావము.

శ్లో. తతో బిభేద పౌలస్త్యః శక్త్యా వక్షసి లక్ష్మణమ్
రామస్త్వనాహతో ఽప్యాసీత్ విదీర్ణహృదయః శుచా. 77

వ్యాఖ్యా: తతః-ఆతరువాత, పౌలస్త్యః-రావణుఁడు, శక్త్యా-శక్తియను పేరు గల ఆయుధముచేత లక్ష్మణం-లక్ష్మణుని, వక్షసి-వక్షస్థలమునందు, బిభేద-చీల్చెను. రామస్తు (రామః+తు)-రాముఁడేమో, అనాహతః, అపి-కొట్టఁబడనివాఁడైనను, శుచా-శోకముచేత, విదీర్ణహృదయః-చీల్పఁబడిన హృదయము గలవాఁడు, అసీత్-అయ్యెను. ఆ తరువాత రావణుఁడు శక్త్యాయుధమును లక్ష్మణుని వక్షముపైవేసి యతనిని మూర్ఛిల్లఁజేయఁగా నట్టియాపదవలని శోకముచేత రాముని హృదయము బ్రద్దలయ్యెను. అనగాఁ రాముఁడు మిక్కిలి దుఃఖించెనని భావము.

శ్లో. స మారుతి సమానీత మహౌషధి హృతవ్యథః
లంకాస్త్రీణాం పున శ్చక్రే విలాపాచార్యకం శరైః 78

వ్యాఖ్యా: సః-ఆట్లుమూర్ఛిల్లిన లక్ష్మణుఁడు మారుతి.....వ్యథః-మారుతి-హనుమంతునిచేత, సమానీత-తీసుకరాఁబడిన, మహౌషధి-సంజీవినీలత చేత, హృతవ్యథః-తొలఁగింపఁబడిన బాధగలవాఁడగుచు, పునః-మరల, లంకాస్త్రీణాం-లంకాపట్టణమునందలి స్త్రీలకు, శరైః-బాణములచేత, విలాపాచార్యకం-శోకించుట యందు ఆచార్యత్వమును, చక్రే-చేసెను. హనుమంతుఁడు తెచ్చిన సంజీవనీ ప్రభావముచేత మూర్ఛతొలఁగిన లక్ష్మణుఁడు మరల శరములు ధరించి యుద్ధము చేసెను. "విలాపాచార్యక" శబ్దము, తత్పూర్వము శోకించుటయే యెఱుఁగని రాక్షసవనితలకుఁ గ్రొత్తగా దుఃఖింపవలసిన గతిని (భర్తృపుత్రాది మరణముల వలన) లక్ష్మణుఁడు పట్టించెనని తెలుపుచున్నది.

శ్లో. స నాదం మేఘనాదస్య ధనుశ్చేంద్రాయుధప్రభమ్
మేఘస్యేవ శరత్కాలో న కించిత్ పర్యశేషయత్. 79

వ్యాఖ్యా: సః-లక్ష్మణుఁడు, శరత్కాలః-శరత్కాలము, మేఘస్య, ఇవ-మేఘము యొక్క వలె, మేఘనాదస్య-ఇంద్రజిత్తుయొక్క, నాదం-సింహనాదమును, (మేఘ పక్షమున గర్జితమును) ఇంద్రాయుధప్రభం-ఇంద్రధనుస్సుకాంతివంటి కాంతిగల, ధనుశ్చ-ధనుస్సునును, కించిత్-కొంచమునూడ, న, పర్యశేషయత్-మిగుల్చలేదు.

అతనిని జంపెనని యర్థము. శరత్కాలము, మేఘముయొక్క గర్జితములను తత్సంబంధముగల ఱింద్రధనుస్సును మిగుల్పనట్లు లక్ష్మణుఁ డింద్రజిత్తును సింహనాద ధనుస్సహితముగాఁ జంపెనని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. కుంభకర్ణః కపీంద్రేణ తుల్యావస్థః స్వసుః కృతః
రురోధ రామం శృంగీవ టంకచ్ఛిన్నమనఃశిలః. 80

వ్యాఖ్య : కపీంద్రేణ-కపిరాజగు సుగ్రీవునిచేత, స్వసుః-చెల్లెలికి (శూర్పణఖకు) తుల్యావస్థః-సమానమగు స్థితిగలవాఁడుగా, కృతః-చేయఁబడిన, కుంభకర్ణః-కుంభకర్ణుఁడు, టంకచ్ఛిన్నమనఃశిలః-టంక-సమ్మెటచేత, ఛిన్న-విరుగగొట్టఁబడిన, మనఃశిలః-ఎఱ్ఱని ధాతువిశేషము (మణిశిల) గల, శృంగీ, ఇవ-పర్వతమువలె, రామం-రాముని, రురోధ-అడ్డగించెను. సుగ్రీవునిచేత ముక్కు-చెవులును గోయఁబడి తన చెల్లెలు శూర్పణఖవంటి దుస్థితినిఁబొందిన కుంభకర్ణుఁడు, రాళ్ళను పగులఁగొట్టు సమ్మెటచేత భగ్నము చేయఁబడిన మణిశిలా ఫలకములుగల పర్వతమువలె రాముని కడ్డముగావచ్చి నిల్చెను. ముక్కు చెవులుదెగి రక్తసిక్తములైన యవ యవములుగల కుంభకర్ణకు పగులఁగొట్టఁబడిన మణిశిలతో వ్యాప్తమైయున్న పర్వతముతో నుపమింపఁబడుటచేత నిది యుపమాలంకారము. వాఁడు పర్వతమంతయుండెనట!

శ్లో. అకాలే బోధితో భ్రాత్రా ప్రియస్వప్నో వృథా భవాన్
రామేషుభి రితి వాసౌ దీర్ఘనిద్రాం ప్రవేశితః. 81

ప్రియస్వప్నః-ఇష్టమైన నిద్రగల, భవాన్-నీవు, వృథా-వ్యర్థముగ, భ్రాత్రా-మీయన్నయైన రావణునిచేత, అకాలే-ఆ సమయమునందు, బోధితః, ఇతి, ఇవ-మేలుకొలుపఁబడితి వన్నట్లు, అసౌ-ఆ కుంభకర్ణుఁడు, రామేషుభిః-రాముబాణములచేత, దీర్ఘనిద్రాం-దీర్ఘనిద్రను (మరణమును), ప్రవేశితః-పొందింపఁబడెను. ఆట్లు ఎదురొక్కన్న కుంభకర్ణుని "అయ్యో! పాపం నిద్ర అంటే యెంతో ఇష్టముగల నీవు మీయన్నచేత వృథాగా నిద్రనుండి మేల్కొల్పఁబడితివే!" అన్నభావము చేత వలె కుంభకర్ణుఁడు రామబాణములచేత దీర్ఘనిద్రను పొందింపఁబడెను. అనఁగా మళ్ళి మేల్కొనుటలేని నిద్రను పొందింపఁబడెను. రామునిచేతిలో కుంభకర్ణుఁడు చచ్చె నని భావము.

శ్లో. ఇతరాణ్యపి రక్షాంసి పేతు ర్వానరకోటిషు
రజాంసి సమరోత్థాని తచ్ఛోణిత నదీష్వివ. 82

వ్యాఖ్య : ఇతరాణి, రక్షాంసి, అపి-తక్కిన రాక్షసులుసైతము, వానర కోటిషు-అసంఖ్యాకములై యున్న వానరులదండులో, సమరోత్థాని-యుద్ధమునందు లేచిన, రజాంసి-ధూళులు, తచ్ఛోణితనదీషు, ఇవ-ఆరాక్షసుల రక్తనదులయందువలె పేతుః-పడి నశించిరి. కుంభకర్ణాదులుగాక మిగిలిన రాక్షసులందఱు, యుద్ధభూమి నుండిలేచిన ధూళులు ఆచ్చటనే చచ్చినవారి రక్తప్రవాహమునఁ బడినట్లు, రామ సైన్యములగు వానరులపైఁబడి యచ్చటనే నశించిపోయిరని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. నిర్యయౌ వథ పౌలస్త్యః పున ర్యుద్ధాయ మందిరాత్
అరావణ మరామం వా జగ దద్యేతి నిశ్చితః. 83

వ్యాఖ్య : అథ-ఆపిమ్మట, పౌలస్త్యః-రావణుఁడు, అద్య-ఈరోజున, జగత్-లోకము, అరావణం-రావణుఁడు లేనిదిగానో, అరామం-రాముఁడు లేనిది గానో, ఇతి-అగునని, నిశ్చితః-నిర్ణయించుకున్నవాఁడై, పునః-మరల యుద్ధాయ-యుద్ధముకొఱకై, మందిరాత్-గృహమునుండి, నిర్యయౌ-బయలుదేరెను. కుంభ కర్ణాది రాక్షస వినాశమును విన్న రావణుఁడు క్రుద్ధుఁడై ఈక ప్రపంచము అరావ ణం లేక అరామం ఆయిపోవలె నన్న నిశ్చయముతో విజయమును లేదా వీరస్వర్గ మును జేపట్టఁదలఁచి గృహమునుండి బయలుదేరెను.

శ్లో. రామం పదాతి మాలోక్య లంకేశం చ వరూథినమ్
హరియుగ్యం రథం తస్మై ప్రజిఘాయ పురందరః. 84

వ్యాఖ్య : పదాతిం-పాదచారియైయున్న, రామం-రాముని, వరూథినం-రథమునందున్న, లంకేశం, చ-రావణాసురునిగూడ, ఆలోక్య-చూచి, పురందరః-ఇంద్రుఁడు, హరియుగ్యం-కపిలవర్ణాశ్వములుగల, రథం-రథమును, తస్మై-రామునికొఱకు, ప్రజిఘాయ-పంపెను.రాముఁడు నేలపైనుండుటను, రావణుఁడు రథముపై నుండుటను జూచిన యింద్రుఁడు, రామవిజయమును గోరినవాఁడగుటచేత కపిల వర్ణములగు నశ్వములుకట్టిన తనరథమును రామునికై పంపెను. వరూథము గల

వాఁడు వరూథీ అని తద్ధితాంతశబ్దము, నకారాంతము" రథగు ప్తిర్వరూథోనా"యని అమరము. "రథమునందున్నవాఁడు అని యర్థము. "హరియుగ్య"మన్నచోటఁగల "హరి" శబ్దమునకు కపిలవర్ణమనియు, "యుగ్య" శబ్దమునకు గుఱ్ఱములనియు నర్థములు.

శ్లో. త మాధూతధ్వజపటం వ్యోమగంగోర్మి వాయుభిః
దేవసూతభుజాలంబీ జైత్ర మధ్యాస్త రాఘవః. 85

వ్యాఖ్య : రాఘవః-శ్రీరాముఁడు, వ్యోమగంగోర్మి వాయుభిః-వ్యోమ గంగా-ఆకాశగంగయొక్క, ఊర్మివాయుభిః-తరంగములపైనుండి వచ్చిన గాలులచేత ఆధూతధ్వజపటం-కదల్పఁబడిన జెండావస్త్రము గలదియు, జైత్రం-జయముఁ జేకూర్పగల, తం-ఆరథమును, దేవసూతభుజాలంబీ--దేవసూత-దేవతలసారథి యగు మాతలియొక్క, భుజాలంబీ-భుజమును ఊతఁగాఁబట్టుకొన్న వాడగుచు, అధ్యాస్త-యెక్కి కూర్చుండెను. ఆకాశగంగామార్గంగా పిల్లవాయువుల చల్లదనమును సంతరించుకొని వచ్చిన జయశీలమగు నింద్రరథమునందు మాతలి చేయూతగొని రాముఁడెక్కి కూర్చుండెను.

శ్లో. మాతలి స్తస్య మాహేంద్ర మాముమోచ తనుచ్ఛదమ్
యత్రో త్పలదలశ్లైబ్య మస్త్రిణ్యాపుః సురద్విషామ్. 86

వ్యాఖ్య : మాతలిః-ఇంద్రసారథి, మాహేంద్రం-ఇంద్రుఁడు పంపిన, తను చ్ఛదం-కవచమును, తస్య-ఆరామునికి, ఆముమోచ-ధరింపఁజేసెను, యత్ర-యేకవచముపై, సురద్విషాం-దేవశత్రువులగు రాక్షసులయొక్క, అస్త్రిణి-బాణ ములు, ఉత్పలదలశ్లైబ్యం-కలువరేకులయొక్క మెత్తఁదనమును, ఆపుః-పొందెనో! మాతలి ఇంద్రుఁడు పంపిన వజ్రకవచమును రామునికిఁ దొడిగింపఁగా, రాక్షసులు రామునిపైవేసిన బాణములు కలువదళములవలె నాకవచమునకుఁదాకి క్రుచ్చుకొన లేక నిర్వీర్యములై వృథా యయిపోయెనని భావము. బాణములకు రంగునందును ఆకారమునందును కలువదళముల పోలిక చక్కఁగా నున్నది.

శ్లో. అన్యోన్య దర్శనప్రాప్త విక్రమావసరం చిరాత్
రామరావణయో ర్యుద్ధం చరితార్థ మివాభవత్. 87

వ్యాఖ్య : చిరాత్-బహుకాలమునకు, అన్యోన్య...సరం-అన్యోన్యదర్శన-ఒకరినొకరు చూచుటచేత, ప్రాప్త-లభించిన, విక్రమావసరం-పరాక్రమ సమయము గల, రామరావణయోః-రామరావణులయొక్క, యుద్ధం-యుద్ధము, చరితార్థం-సఫలమైనది, అభవదివ-అయినదా? యనునట్లుండెను. పూర్వము రావణుని శౌర్యమును రాముడును, రాముని శౌర్యమును రావణుడును వినుటయేకాని చూడలేదు. బహుకాలమున కిప్పుడుభయులకును పరాక్రమ ప్రదర్శనావసరము లభించుటచేత వారియుద్ధము చరితార్థమైనదిగా నుండెను. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. భుజమూర్ధోరుబాహుల్యా దేకోఽపి ధనదానుజః
దదృశే హ్యయథాపూర్వో మాతృవంశ ఇవ స్థితః. 88

వ్యాఖ్య : అయథాపూర్వః-పూర్వమువలెలేనివాడు గనుక (నిహతబంధువుడయినందున రాక్షస పరివారములేనివాడని యర్థము), ఏకః, అపి-ఒక్కడేయైయున్నప్పటికిని, ధనదానుజః-రావణుడు, భుజమూర్ధోరు బాహుల్యాత్-భుజములయొక్కయు, తలలయొక్కయు, పాదములయొక్కయు బాహుళ్యముపలన, మాతృవంశే-తల్లికి సంబంధించిన వర్గమునందు, స్థితః ఇవ-ఉన్నవాడువలెనే, దదృశే, హి-కనబడెను సుమా! విశ్రవోబ్రహ్మకు కుబేరుడు, రావణుడును పుత్రులు. కనుక రావణుడు "ధనదానుజుడు" కుబేరుని తమ్ముడని యర్థము. "దశాస్యో వింశతిభుజ శ్చతుష్పా న్మాతృమండిశే" యను యాదవ నిఘంటు వచనముచేత నతడు పదితలలు, ఇరువది భుజములు గలవాడై తల్లియింటియందును, తలచుకొన్నప్పుడు మాయచేతను, గనపడునను నర్థము స్పష్టమగును. బంధువులందరును జచ్చి యొంటరివాడైయున్నప్పటికి రావణుడు తన భుజశీర్షపాదముల బాహుళ్యము చేత మాతృబంధువులగు రాక్షసు లనేకు లతనిచుట్టు నున్నట్లు గోచరించె నని భావము. రావణుని తండ్రి బ్రహ్మఋషి, తల్లి రాక్షసస్త్రీ యగుటచే "మాతృవంశ" శబ్దముపయోగింపబడినది. కాగా నతనికి "దశాస్యత్వము" స్థానమునుబట్టియు, అతని యిచ్ఛనుబట్టియు నుండు నని యర్థము.

శ్లో. జేతారం లోకపాలానాం స్వముఖై రర్చితేశ్వరమ్,
రామ స్తుతిత్వకై లాస మరాతిం బహ్వమన్యత. 89

వ్యాఖ్య : లోకపాలానాం-ఇంద్రాది లోకపాలురను (కర్మణి షష్ఠి), జేతారం-జయించినవాడును, స్వముఖైః- తన శిరస్సులచేత, అర్చితేశ్వరం-

పూజింపఁబడిన శంకరుఁడు గలవాఁడును, తులితకైలాసం-ఎత్తబడిన కైలాస పర్వతము గలవాఁడును నగు, అరాతిం-శత్రువును, రామఃరాముఁడు, బహ్వమన్యత (బహు+అమన్యత)-గౌరవముతోఁ జూచెను. ఇంద్రాదృష్ట దిక్పాలకులను జయించి, తన శిరస్సుల హోమముతో శివుని మెప్పించి, తన యిష్టసిద్ధికై కైలాసమునే చేతులతో నెత్తిన రావణాసురుఁడు, తన విక్రమమునకుఁ దగిన శత్రువై యుద్ధమునకు వచ్చెనని గుణగ్రాహి యగు రాముఁడు తలఁచి యతనిని గౌరవించె నని భావము.

శ్లో. తస్య స్ఫురతి పౌలస్త్యః సీతాసంగమశంసినీ।
నిచఖా నాధికక్రోధః శరం సవ్యేతరే భుజే. 90

వ్యాఖ్య : అధికక్రోధః-బంధు వినాశముచేత మిక్కిలి క్రుద్ధుఁడై యున్న, పౌలస్త్యః-రావణుఁడు, స్ఫురతి-అదరుచున్నదియు (అందువల్లనే), సీతాసంగమ శంసిని-సీతా సమావేశమును సూచించుచున్న, తస్య-ఆ రామునియొక్క, సవ్యేతరే, భుజే-దక్షణ (కుడి) భుజమునందు, శరం-బాణమును, నిచఖాన-నాటెను. కోపావిష్టుఁడైన రావణుఁడు రాముని కుడిభుజముపై బాణము నాటెను. కుడిచేతితోనే కదా! శరసంధానముచేసి బాణప్రయోగమును జేయునది. అట్లు చేయుటకు వీలు పడనీయరాదని రావణుఁ డాచేతిని విరుగఁగొట్టఁదలఁచి యచ్చట బాణమును నాటె నని భావము. కాని ఆ భుజము ఆదరుచుండుట శుభశకునము, ఆ శకునఫల మనతికాలమున సీతాసమాగమును గలిగించుటయే. "సవ్యఃఇతరో యస్మాత్ సఃసవ్యేతరఃతస్మిన్-సవ్యేతరే" అని బహువ్రీహి సమాసమును జెప్పవలెను. అప్పుడు "నబహువ్రీహౌ" అను సూత్రముచేత "ఇతర" శబ్దమునకు సర్వనామ సంజ్ఞా ప్రతిషేధమువలన ప్రయోగము సాధువగును. లేనిచో "సవ్యేతరస్మిన్" అని అనిష్ట రూపము వచ్చును. సవ్యమనఁగా ఎడమప్రక్క.

శ్లో. రావణస్యాపి రామాస్త్రో భిత్వా హృదయ మాశుగః।
వివేశ భువ మాఖ్యాతు మురగేభ్య ఇవ ప్రియమ్. 91

వ్యాఖ్య : రామాస్త్రః (రామ+ఆస్త్రః)-రామునిచేఁ ప్రయోగింపఁబడిన, ఆశుగఃబాణము, రావణస్య, అపి-రావణునియొక్కయు, హృదయం-వక్షస్థలమును, భిత్వా-చీల్చి, ఉరగేభ్యఃపాతాళలోకము వారగు సర్పరాజులకు, ప్రియం-ఇష్ట

మైన వార్తను, ఆఖ్యాతుం, ఇవ-చెప్పటకువలె, భువం-భూమిని, వివేశ-ప్రవేశించెను. రావణుడే ఆరంభించిన యుద్ధమునందు రాముడు వేసిన ప్రతి బాణము రావణుని వక్షమును జీల్చి పోయి భూమిలోనికి వెళ్ళుటను కవి సర్పరాజులకీ వార్తను జెప్పటకు వెళ్ళినట్లు ఉత్ప్రేక్షించుటవలన రామబాణ సామర్థ్య వేగములు స్పష్టపడుచున్నవి. అలంకారము : ఉత్ప్రేక్ష. రావణ శబ్ది వ్యుత్పత్తి : విశ్రవసః అపత్యం పుమాన్ రావణః అని చెప్పవలెను. విశ్రవః శబ్దమునకు అపత్యార్థమున "అణ్" ప్రత్యయము రాగా "విశ్రవసో విశ్రవణరవణౌ" అని రవణాదేశము వచ్చును. అట్లు వచ్చిన "రవణ" శబ్దముపై "రావణః" అనురూపము సిద్ధి చును.

శ్లో. వచసైవ తయోర్వాక్య మస్త్రై మస్త్రేణ నిఘ్నతోః
అన్యోన్యజయసంరంభో వవృధే వాదినో రివ. 92

వ్యాఖ్య : వాక్యం–మాటను, వచసా, ఏవ-మాటతోనే, అస్త్రం-బాణమును, అస్త్రేణ-అస్త్రముతోనే, నిఘ్నతోః–ప్రతిపక్షొట్టుచున్న, తయోః–ఆ రామరావణులకు, వాదినోః, ఇవ–కలహించుచున్న వారికివలె, అన్యోన్యజయసంరంభః–ఒకరి నొకరు జయింపవలెనను నుత్సాహము, వవృధే–వృద్ధిఁజెందెను. ఒక శాస్త్రీయ విషయముపై వాదోపవాదములకుఁ బూనిన వారికివలె మాటను మాటతో, అస్త్రము నస్త్రముతోఁ ప్రతిపక్షొట్టుచున్న రామరావణులకు పరస్పర విజయ విజృంభణము పెరిగిపోయెనని భావము.

శ్లో. విక్రమవ్యతిహారేణ సామాన్యాభూత్ ద్వయోరపి ।
జయశ్రీ రంతరా వేది ర్మత్తవారణయో రివ. 93

వ్యాఖ్య : జయశ్రీః–జయలక్ష్మి, విక్రమ వ్యతిహారేణ–పరాక్రమము యొక్క పర్యాయక్రమముచేత, ద్వయోః, అపి-ఆ రామరావణులిద్దఱియొక్కయు, అంతరా-నడుమ, వేదిః-వేదికగానున్న గోడ, మత్తవారణయోః, ఇవ-మదపుటేనుఁగులు రెండింటికివలె, సామాన్య-సమానభావముగలది, అభూత్-ఆయ్యెను. రెండు గజములను పోరించునప్పుడు నడుమ ఆరుగువంటి యొక గోడ నుంచుట యాచారము. ఏ గజమైనను ఆ యరుగుపై దన ముందటి కాళ్ళనుంచి పోరాడ వచ్చును కనుక దానిపై నుభయ గజములకును సమానమైన హక్కు ఉండును. అట్లే ప్రస్తుతమున రాముఁడొక్కసారియు రావణుఁడొక్కసారియు పరాక్రమము

నందు అధిక్యమును జూపుచుండుటచేత జయలక్ష్మి ఉభయ సాధారణమై ఎవరు జయింతురో! చెప్పుటకు వీలులేకుండెనట! అట్లు మహాపరాక్రమముతో నుభయులును విజృంభించుచుండిరని భావము.

శ్లో. కృతప్రతికృతప్రీతై స్తయో ర్ముక్తాం సురాసురై ।
పరస్పరశరవ్రాతాః పుష్పవృష్టిం న సేహిరే. 94

వ్యాఖ్య : కృతప్రతికృతప్రీతైః-ఒకరు ప్రయోగించిన బాణములచేతను వాటికి ప్రతిప్రయోగము చేసిన బాణములచేతను సంతుష్టులైన, సురాసురైః-దేవతలచేతను, రాక్షసులచేతను, తయోఃఆ రామరావణులపైన, ముక్తాం-వదలఁబడిన, పుష్పవృష్టిం-పుష్పవర్షమును, వరస్పరశరవ్రాతాఃఒకరిపై నొకరు కురిపించుచున్న బాణ పరంపరలు, న సేహిరే-సహింపలేకపోయినవి. రామరావణ బాణప్రయోగములకు సంతసించిన దేవరాక్షసులు ఒకరి పిమ్మట నొకరు గుఱిపించిన పుష్పవృష్టిని, రామునిపైఁ గురియు పుష్పవృష్టిని రావణ బాణములు, రావణునిపై బడనున్న పుష్పవృష్టిని రాముని బాణములు అంతరాళమునందే అడ్డగించినవి. అనఁగా వారి బాణ వర్షమంత దట్టమై పుష్పవృష్టిని వారిపైఁ బడనీయలేదని భావము.

శ్లో. అయఃశంకుచితాం రక్షః శతఘ్నీ మథ శత్రవే,
హృతాం వైవస్వతస్యేవ కూటశాల్మలి మక్షిపత్. 95

వ్యాఖ్యా: అథ-పిమ్మట, రక్షఃరావణుఁడు, అయఃశంకుచితాం-ఇనుప మేకులు పొదుగఁబడిన, శతఘ్నీం-గదాముఖముగల ఆయుధమును, హృతాం-తన విజయమునందపహరించి తెచ్చుకొనఁబడిన, వైవస్వతస్య-యమునియొక్క, కూటశాల్మలిం, ఇవ-"కూటశాల్మలి" యను పేరుగల ఆయుధమునువలె, శత్రవే-శత్రువు కొఱకు (రామునిపైన), అక్షిపత్-వేసెను (ప్రయోగించెను). రావణుఁడు తన విజయ యాత్రలో యముని జయించి అపహరించుకొని వచ్చిన కూటశాల్మలి (యముని గదా దండము) యను నాయుధమా? యనునట్లున్న ఇనుపసూదుల శతఘ్నిని రామునిపైఁ బ్రయోగించె నని భావము. కూటశాల్మలి యనఁగా నొకే వేఱుతో నేలలోదిగి ముండ్లతో నుండుచెట్టు. రావణుని శతఘ్ని అయఃశంకుకీలితమై యున్నందున దాని సాదృశ్యము చెప్పఁబడినది.

శ్లో. రాఘవో రథ మప్రాప్తాం తా మాశాంచ సురద్విషామ్,
అర్ధచంద్రముఖై ర్బాణై శ్చిచ్ఛేద కదలీసుఖమ్. 96

వ్యాఖ్య: రాఘవః-రాముఁడు, రథం-తన రథమును, అప్రాప్తాం-చేరకయే యుండిన, తాం-ఆశతమ్మిని, సురద్విషాం-రాక్షసులయొక్క, ఆశాం, చ-విజయ తృష్ణనుగూడ, అర్ధచంద్రముఖైః-అర్ధచంద్రాకారముఖములుగల, బాణైః-బాణముల చేత, కదలీసుఖం-అరఁటి చెట్టునందువలె అక్లేశముగా, చిచ్ఛేద-ముక్కలు ముక్కలుగా విరుగఁగొట్టెను. రావణుఁడు ప్రయోగించిన శతఘ్నిని అర్ధచంద్ర ముఖములుగల బాణములచేత అది తన రథము వద్దికి రాకమునుపే (దారిలోనే) ముక్కలు ముక్కలుగా విరుగఁగొట్టి రాక్షసుల విజయతృష్ణను వమ్ముచేసె నని భావము.

శ్లో. అమోఘం సందధే చాస్మై ధను ష్యేకధనుర్ధరః,
బ్రాహ్మ మస్త్రం ప్రియాశోకశల్య నిష్కర్షణౌషధమ్. 97

వ్యాఖ్య: ఏకధనుర్ధరః-అద్వితీయ ధనుర్ధారియగు రాముఁడు, ప్రియాశోక శల్యనిష్కర్షణౌషధం-ప్రియా-సీతాదేవియొక్క, శోకశల్య-దుఃఖమనెడు శల్య మును, నిష్కర్షణ-తొలగించునట్టి, ఔషధం-ఔషధమై, అమోఘం-వ్యర్థముకాని, బ్రాహ్మం-బ్రహ్మదేవతాకమగు, అస్త్రం-అభిమంత్రితమైన బాణమును, అస్మై, చ-ఆ రావణుని కొఱకుఁగూడ (వానినిఁ జంపుటకని యర్థము), ధనుషి-ధనుస్సు నందు, సందధే-ఎక్కుపెట్టెను. ప్రపంచమునం దేకైక ధనుర్ధరుఁడైన రాముఁడు సీతా దుఃఖశల్యమును దొలగించు మహౌషధమగు బ్రహ్మాస్త్రమును రావణునిపైఁ ప్రయోగించుట కెక్కుపెట్టెను. "అస్త్ర" మనఁగా ఒక మంత్రముచేత నభిమం త్రించి వేయఁబడు బాణము. శస్త్రమనఁగా మంత్రమక్కరలేని ఆయుధము.

శ్లో. తత్ వ్యోమ్ని శతధా భిన్నం దదృశే దీప్తిమన్ముఖమ్,
వపు ర్మహోరగస్యేవ కరాలఫణమండలమ్. 98

వ్యాఖ్య: వ్యోమ్ని-ఆకాశమునందు, శతధా-అనేక రూపములతో, భిన్నం ప్రసరించినదియు, దీప్తిమన్ముఖం (దీప్తిమత్ + ముఖం)-ప్రకాశించుచున్న ముఖ

ములు గలదియునగు, తత్-ఆబ్రహ్మాస్త్రము, కరాళఫణమండలం-భయంకరములగు ఫణముల సమూహముగల, మహోరగస్య-మహాసర్పమగు శేషునియొక్క, వపుః, ఇవ-దేహమువలె, దదృశే-కనఁబడెను. అట్లు ప్రయోగింపఁబడిన రాముని బ్రహ్మాస్త్రము నానారూపములతో దేదీప్యమానమై ఆకాశమున భయంకర ఫణామండలముతో నాలుకలు చాచుచున్న మహాసర్పమువలెఁజూపఱులకుఁ గనపడెను.

శ్లో. తేన మంత్రప్రయుక్తేన నిమేషార్ధా దపాతయత్,
స రావణశిరః పంక్తి మజ్ఞాత్రవణవేదనామ్. 99

వ్యాఖ్య: సః-రాముఁడు, మంత్రప్రయుక్తేన-మంత్రయుక్తముగాఁ బ్రయోగించిన, తేన-ఆ బ్రహ్మాస్త్రముచేత, అజ్ఞాతవ్రణవేదనాం-అతివేగగమనముచేత రావణుని కెఱుకపడని వ్రణబాధగల, రావణశిరః పంక్తిం-రావణునియొక్క శిరముల వరుసను, నిమేషార్ధాత్-అరనిముషములో, అపాతయత్-నేలపైఁ బడఁగొట్టెను. అట్లు మంత్రపూతమగు బ్రహ్మాస్త్రముచేత రాముఁడు రావణుని శిరస్సుల నన్నింటిని అర్ధనిముషములో నేలపైఁ గూల్చెను. అతివేగముతో ఛేదించుట వలన కంఠము లందు రావణునికి బాధయే కనపడలేదని భావము.

శ్లో. బాలార్కప్రతిమే వాప్సు వీచిభిన్నా పతిష్యతః,
రరాజ రక్షఃకాయస్య కంఠచ్ఛేదపరంపరా. 100

వ్యాఖ్య: పతిష్యతః-నేలపైఁ బడఁబోవుచున్న, రక్షఃకాయస్య-రావణుని కళేబరముయొక్క, కంఠచ్ఛేద పరంపరా-కంఠఖండములయొక్క వరుస, వీచిభిన్నా-తరంగములచేత నానావిధములుగా విడఁగొట్టఁబడిన అప్సు-జలములయందలి, బాలార్కప్రతిమా, ఇవ-బాలసూర్యుని ప్రతిబింబమువలె, రరాజ-ప్రకాశించెను. నేలపైఁ బడఁబోవు రావణ శరీరమునుండి రక్తస్రావయుక్తముగాఁ బడుచున్న యతని శిరఃఖండములు, మహానదీ తటాకాదుల యందు ప్రతిఫలించు సూర్యబింబమును తరంగము లొకదానివెంబడి మరియొకటి కొనిపోవుచు నెఱ్ఱదనముతో నున్నట్లు ప్రకాశించెనని భావము. ఇచ్చట "బాలార్క" యనుట యెఱ్ఱఁదనము కొఱకని యెరుగవలెను. అలంకారము: ఉపమ.

శ్లో. మరుతాం పశ్యతాం తస్య శిరాంసి పతితాన్యపి,
మనో నాతివిశశ్వాస పునఃసంధానశంకినామ్. 101

వ్యాఖ్య : పతితాని-నేలపై బడినట్టి, తస్య, శిరాంసి-ఆరావణునియొక్క తలలను, పశ్యతాం, అపి-చూచుచున్నవారైనప్పటికిని, పునఃసంధానశంకినాం-మరల శరీరమున కంటుకొనునేమో! యని అనుమానపడుచున్న, మరుతాం-దేవతలయొక్క, మనః-మనస్సు, నాతివిశశ్వాస (న+అతి+విశశ్వాస)-అంతగా నమ్మలేదు. దేవత లింతకుపూర్వము రావణుని శిరస్సులు ఛేదించబడినను మరల మొలచుట నెఱిగియున్నారు. కనుక యిప్పుడు నేలపైబడి యున్న యతనితలలను తాము ప్రత్యక్షముగాజూచుచున్నను ఆవి మరల నతుకుకొనునేమో! యని యనుమానపడుచుండిరి. కాని, రాముని బ్రహ్మాస్త్రము, అపునఃసంధానముగా రావణుని శిరస్సులను చేదించినదని భావము.

శ్లో. అథ మదగురుపత్తై ర్లోకపాలద్విపానా
మనుగత మలిబృందై ర్గండభిత్తీ ర్విహాయ,
ఉపనతమణిబంధే మూర్ధ్ని పౌలస్త్యశత్రోః
సురభి సురవిముక్తం పుష్పవర్షం పపాత. 102

వ్యాఖ్య : అథ-ఆపిమ్మట, మదగురుపత్తైఃమద-గజగండస్థల సంచారముచేత అంటుకున్న మదముచేత, గురు-బరువెక్కిన, పత్తైఃరెక్కలుగల, అలిబృందైఃతుమ్మెదగుంపులచేత, లోకపాలద్విపానాం-ఆకసమునందున్న దిక్పాలక గజములయొక్క, గండభిత్తీఃగండస్థలములను, విహాయ-వదలిపెట్టి, అనుగతం-వెంబడింపబడినదియు, సురభి-పరిమళముగలదియు, సురవిముక్తం-దేవతలచేత గుఱిపింపబడినదియునగు, పుష్పవర్షం-పువ్వులవాన, ఉపనతమణిబంధే-సమీప కాలమున జరుగబోవు రత్నకిరీటధారణముగల, పౌలస్త్యశత్రోఃరావణశత్రువగు శ్రీరామునియొక్క, మూర్ధ్ని-తలపైన, పపాత-పడెను (కురిసెను). అట్లు రావణ సంహారముజేసిన శ్రీరాముని శిరస్సుపైన ఆకసమునుండి చూచుచున్న యింద్రాది దేవతలు, మంచి పరిమళముగల పుష్పములను గురిపించి యనతికాలమున జరుగబోవు రామపట్టాభిషేకమును సూచించిరని భావము.

శ్లో. యంతా హరేః సపది సంహృతకార్ముకజ్య
మాపృచ్ఛ్య రాఘవ మనుష్ఠితదేవకార్యమ్,
నామాంక రావణ శరాంకిత కేతుయష్టి
మూర్ధ్వం రథం హరిసహస్రయుజం నినాయ. 103

వ్యాఖ్య : హరేః-ఇంద్రునియొక్క, యంతా-సారథియగు మాతలి, సపది-అప్పుడే సంహృతకార్ముకజ్యం-ఉడఁదీయబడిన వింటినారి గలవాఁడును, అనుష్ఠితదేవకార్యం-పూర్తిచేయబడిన రావణవధరూపమగు దేవకార్యము గలవాఁడును నగుఁ రాఘవం-శ్రీరాముని, ఆపృచ్ఛ్య-ఆమంత్రణముచేసి (మంచిది, వెళ్ళివచ్చెదనని రామునికిఁ జెప్పియని అర్థము), నామాంక రావణ శరాంకిత కేతుయష్టిం-నామాంక-పేరును దెలుపు నక్షరముల గుర్తులుగల, రావణశర-రావణుని బాణములచేత, అంకిత-చిహ్నితమైన, కేతుయష్టిం-ధ్వజదండముగలదియు, హరిసహస్రయుజం-అనేకాశ్వములు గలదియునగు, రథం-ఇంద్రుఁడుపంపిన రథమును, ఊర్ధ్వం-పైకి అనఁగా స్వర్గలోకమునకు, నినాయ-తీసికొని వెళ్ళెను. దేవతలు పుష్పవృష్టిని గురిసినవెంటనే యింద్రసారథియగు మాతలి, శ్రీరాముఁడు రావణవధరూపమైన దేవకార్యమును బూర్తిచేసినందున ధనుర్బాణముల నుపసంహరించియుండఁగా, "వెళ్ళివచ్చెదను సెలవు!" అని రామునికిఁ జెప్పిఁ రావణనామాక్షరములు చెక్కినబాణములు ధ్వజదండమునకుఁ గ్రుచ్చుకొనియున్న యింద్రరథమును స్వర్గమునకుఁ జేర్చెను. "హరి" శబ్దమునకు యమ, అనిల, ఇంద్ర, చంద్ర, అర్క, విష్ణు, సింహ, అంశు, వాజి, శుక, అహి, కపి, భేకములు అర్థమని యమరము

శ్లో. రఘుపతి రపి జాతవేదోవిశుద్ధాం ప్రగృహ్య ప్రియాం
ప్రియసుహృది విభీషణే సంగమయ్య శ్రియం వైరిణః,
రవిసుతసహితేన తేనానుయాతః ససౌమిత్రిణా
భుజవిజిత విమానరత్నాధిరూఢః ప్రతస్థే పురీమ్. 104

వ్యాఖ్య : రఘుపతిః, అపి-శ్రీరాముఁడుఁగూడ, జాతవేదోవిశుద్ధాం-అగ్నియందు ప్రవేశించుటచేత పరిశుద్ధురాలైన, ప్రియాం-ప్రియురాలగు సీతను, ప్రగృహ్య-స్వీకరించియు, ప్రియసుహృది-ఇష్టమిత్రమైన, విభీషణే-విభీషణునియందు, వైరిణః-శత్రువగు రావణునియొక్క, శ్రియం-సంపదను (రాజ్యలక్ష్మిని) సంగమయ్య-సంక్రమింపఁజేసియు, రవిసుతసహితేన-సుగ్రీవునితోఁగూడిన వాఁడును, ససౌమిత్రిణా-లక్ష్మణసహితుడునునగు, తేన-ఆవిభీషణునిచేత, అనుయాతః-వెంబడింపఁబడినవాఁడగుచు, భుజవిజిత విమానరత్నాధిరూఢః-భుజవిజిత-తన పరాక్రమముచేత గెల్చుకున్న, విమానరత్న-శ్రేష్ఠమైన విమానమగు పుష్పకమును, అధిరూఢః-ఎక్కినవాఁడై, పురీం-అయోధ్యానగరమునుగుఱించి, ప్రతస్థే-

బయలుదేరెను. శ్రీరాముఁడు రావణగృహనివాసముచేతఁ గలిగిన మాలిన్యము తొలఁగుటకై యగ్నిప్రవేశముఁ జేయించిన సీతాదేవినిఁబరిశుద్ధనుగా లోకమునకుఁ దెలిపి యామెను స్వీకరించియు, తనను శరణువేడి వచ్చిన విభీషణునికి లంకారాజ్య పట్టాభిషేకముఁజేయఁంచియు లక్ష్మణ సుగ్రీవ సహితుఁడై తనవెంటనడచుచున్న విభీషణుని పుష్పకవిమానము నధిరోహించి సంతోషముతో అయోధ్యానగరమునకు బయలుదేరెను.

ఇది మహాకవి కాళిదాస కృత రఘు వంశ
కావ్యమున రావణవధయను ద్వాదశసర్గమునకు
కేశవపంతుల నరసింహాశాస్త్రి రచిత
తెలుఁగు లఘువ్యాఖ్య.

శ్రీః

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

త్రయోదశసర్గము

శ్లో. అథాత్మనః శబ్దగుణం గుణజ్ఞః
పదం విమానేన విగాహమానః,
రత్నాకరం వీక్ష్య మిథః స జాయాం
రామాభిధానో హరి రిత్యువాచ. 1

వ్యాఖ్య: అథ–అట్లు ప్రయాణము చేసిన పిమ్మట, గుణజ్ఞః-మార్గమునందలి ఆయావస్తువుల గుణముల నెఱిఁగిన, సః, రామాభిధానః, హరిః-రాముఁడనుపేరుగల యావిష్ణువు, శబ్దగుణం-శబ్దము గుణముగాఁ గల, ఆత్మనః, పదం-తనయొక్క స్థానమును, అనగా విష్ణుపదం, ఆకాశమునని యర్థము. "వియద్విష్ణుపదమ్" అనియమరము. విమానేన-పుష్పక విమానముచేత, విగాహమానః-చొచ్చుకొని పోవుచున్నవాఁడగుచు, రత్నాకరం-సముద్రమును, వీక్ష్య-చూచి, మిథః-రహస్యమున, జాయాం-భార్యను (సీతనుగుఱించి), ఇతి-ముందుచెప్పఁబోవు రీతిగా, ఉవాచ-పలికెను అట్లు పుష్పక విమానముపై నాకాశమున వెళ్ళుచు సముద్రమును జూచి సీతతో నెమ్మదిగా ముందు చెప్పఁబోవుమాటలను పలికెనని భావము. భూమికి గంధము గుణము, జలమునకు శీతస్పర్శ గుణము, ఆకాశమునకు శబ్దము గుణము ఈ మొదలయిన నిర్ణయములు "గంధవతీపృథివీ, శబ్దగుణక మాకాశమ్" ఇత్యాది వాక్యములతో తార్కికులు చేసినారు. ఇక్కడ రాముని "హరి" యనుట ఆతఁడు నిరంకుశమహిమ గలవాఁడని తెలుపుటకు, "మిథః" అను పదము సీతారాముల స్వేచ్ఛాసంభాషణము కొఱకు, అని గ్రహింపవలయును.

శ్లో. వైదేహి! పశ్యామలయా ద్విభక్తం
మత్సేతునా ఫేనిల మంబురాశిమ్,
ఛాయాపథేనేవ శరత్ప్రసన్న
మాకాశ మావిష్కృతచారుతారమ్. 2

వ్యాఖ్య: హేవైదేహి-ఓసీతా!, ఆ, మలయాత్-మలయ పర్వతము వఱకు, మత్సేతునా-నేనుకట్టించిన వంతెనచేత, విభక్తం-రెండుగా విభజింపఁబడినదియు, ఫేనిలం-నురుగుకలదియునగు, అంబురాశిం-సముద్రమును, ఛాయాపథేన-ఛాయాపథముచేత, విభక్తం-విభజింపఁబడినదియు, శరత్ప్రసన్నం-శరదృతువునందు నిర్మలముగా నున్నదియు, ఆవిష్కృత చారుతారం-కనఁబడునట్లు చేయబడిన చక్కని చుక్కలుగలదియునగు, ఆకాశం, ఇవ-ఆకాశమునువలె (ఉన్నదానిని), పశ్య-చూడుము. సీతా! నేను కట్టించిన సేతువుచేత మలయపర్వతముదాక రెండుగా చీలి, బుడగలు బుడగలుగానున్న నురుగుతో యీ సముద్రము, శరదృతువునందు ఛాయాపథముచేత రెండుభాగములు గలిగి, మెఱయుచున్న సకల నక్షత్రములతోఁ గనఁబడునట్టి, యాకాశమువలె, ముచ్చటఁగొల్పుచున్నదిచూడు! అని రాముఁడు సీతతోననెను. "మత్సేతునా" ఇందలి మత్, అస్మచ్ఛబ్దము, నేను నీకొఱకెంత యద్భుతకార్యమును జేసితినో! చూచితివా? యన్న భావముతో ఆత్మ సంతోషమును, సీత కూరడింపును స్ఫురింపజేయుచున్నది. "ఛాయాపథేన" ఛాయాపథమనఁగా ఆకాశమునందలి నక్షత్రమండల మధ్యమున ఆడ్డముగా నేర్పడియున్న దీర్ఘమగు అవకాశము (ఖాళీభాగము) అని యర్థము.

శ్లో. గురో ర్యయజ్ఞో: కపిలేన మేధ్యే
రసాతలం సంక్రమితే తురంగే,
తదర్థ ముర్వీ మవదారయద్భిః
పూర్వైః కిలాయం పరివర్ధితో నః. 3

వ్యాఖ్య : యియక్షోః-యజ్ఞముచేయఁదలపెట్టిన, గురోః-తండ్రియగు సగర చక్రవర్తియొక్క, మేధ్యే-అశ్వమేధమునకర్హమగు, తురంగే-గుఱ్ఱము, కపిలేన-కపిలమహర్షిచేత, రసాతలం-పాతాళమును, సంక్రమితే-చేర్పఁబడినదికాఁగా, తదర్థం-ఆగుఱ్ఱముకొఱకై, ఉర్వీం-భూమిని, అవదారయద్భిః-త్రవ్వుచున్న, నః,

పూర్వైః-మాపూర్వులచేత (సగరపుత్రులచేత), అయం-ఈ సముద్రము, పరిపర్ధితః, కిల-విశాలముగాఁజేయఁబడినదని చెప్పుదురు సుమా! పూర్వము మాసూర్య వంశీయుఁడగు సగరచక్రవర్తి అశ్వమేధయాగమునకై విడిచిన గుఱ్ఱమును, ఇంద్రుఁడపహరించి కపిలమునివద్దఁ జేర్చఁగా, కపిలుఁడే యపహరించినట్లు భ్రమపడిన సగరపుత్రులగు మా పెద్ద లాయశ్వమును దెచ్చుటకై భూమినిఁ ద్రవ్వుటచేత యీ సముద్ర మింత వెడల్పయినదని యితిహాసము గలదు. కనుక నీ సాగరము మనకుఁ బూజ్యమైనది సుమా! యని రాముఁడు సీతకుఁ జెప్పెను.

శ్లో. గర్భం దధ త్యర్క-మరీచయో ఽస్మా
ద్వివృద్ధి మ్రాశ్నువతే వసూని,
అబింధనం వహ్ని మసౌ బిభ ర్తి
ప్రహ్లాదనం జ్యోతి రజ నయ్యనేన. 4

వ్యాఖ్య : అర్క-మరీచయః-సూర్యకిరణములు, అస్మాత్-ఈ సముద్రము నుండి, గర్భం-జలమయ గర్భమును, దధతి-ధరించును. అత్ర-ఈ సాగరము నందు, వసూని-ధనములు, వివృద్ధిం-అభివృద్ధిని ఆశ్నువతే-కాంచుచున్నవి. అసౌ-ఈ యర్ణవము, అబింధనం (అప్ + ఇంధనం)-నీరు ఇంధనముగాఁగల, వహ్నిం-బడబాగ్నిని (విద్యుత్తును), బిభ ర్తి-భరించును. అనేన-ఈ జలనిధిచేత, ప్రహ్లాదనం-అందఱికిని ఆహ్లాదమును గలిగించు. జ్యోతిః-వెలుతురు (చంద్రుఁడు), అజని-పుట్టింపఁబడినది. రాముఁడు సీతతో నింకను సముద్ర మహిమ నిట్లు చెప్పుచున్నాఁడు, సీతా! సూర్యకిరణములలో కొన్ని యీ సముద్రమునుండి జలమయమైన గర్భమును ధరించి వర్షమును గురియుచున్నవి. కనుక ఇతఁడు లోకోపకారియని యెఱుఁగుము, ధనములు ఇతని యందున్న రత్నరాసులను జేర్చుకొనుచు వృద్ధిజెందును గనుక యితఁడు సంపన్నుఁడనియేకాక ప్రజలను సంపన్నులను జేయువాఁడనియుఁ దెలిసికొనుము. నీళ్ళను ఇంధనముగా గ్రహించి మండుచున్న బడబాగ్నిని (విద్యుత్తును) భరించును గావున అపకారియైనను ఆశ్రితుని దూరము చేయ వాఁడని గుర్తింపుము. సర్వ ప్రాణి సమాహ్లాదకుఁడైన చంద్రుని యితఁడే పుట్టించెనని గ్రహింపుము. (సూర్యకిరణములు జలగర్భమును ధరించు విషయము దశమసర్గ 58వ శ్లోకమున విపులముగాఁ జెప్పబడినది) ఇది, కాళిదాసు భౌతికశాస్త్ర విజ్ఞానము.

శ్లో. తాంతా మవస్థాం ప్రతిపద్యమానం
స్థితం దశ వ్యాప్య దిశో మహిమ్నా,
విష్ణో రివా స్యానవధారణీయ
మీదృక్తయా రూప మియత్తయా వా. 5

వ్యాఖ్య : తాం, తాం-ఆయా (అనేక విధములైన), అవస్థాం-అక్షోభ్యావస్థను (విష్ణుపక్షమున సత్త్వ ప్రధానావ్యవస్థను), ప్రతిపద్యమానం-పొందుచున్నట్టియు, మహిమ్నా-గొప్పదనముచేత (మహిమచేత), దశ, దిశః, వ్యాప్య-పది దిక్కులను వ్యాపించి (పది యవతారములను పొంది), స్థితం-ఉన్న, విష్ణోః, ఇవ-విష్ణువుయొక్కవలె, అస్య-ఈ సముద్రముయొక్క, రూపం-స్వరూపము, ఈదృక్తయా-ఈ ప్రకారమైనదనిగాని, ఇయత్తయా, వా-ఇంత పరిమాణముగలది యని కాని, అనవధారణీయం-తెలిసికొనుటకు సాధ్యముగానిది సుమా! ఒకప్పుడు స్తిమితముగాను, ఒకప్పుడుల్లోలకల్లోలయుక్తముగాను ఉండుచు దశ దిశలు వ్యాపించియున్న యీ సాగరము మహా మహిమోపేతమై సత్త్వరజస్తమో గుణములలో నన్యతమముతో వివిధావతారములు దాల్చు విశ్వరూపుడు విష్ణువు యొక్క స్వరూపమువలె ఇట్టిదనికాని యింతదనికాని తెలిసి నిరూపించుటకు సాధ్యపడదని భావము. "తాంతాం" వీప్సయందు ద్విరుక్తి యని తెలియవలెను.

శ్లో. నాభిప్రరూఢాంబురుహాసనేన
సంస్తూయమానః ప్రథమేన ధాత్రా,
అముం యుగాంతోచిత యోగనిద్రః
సంహృత్య లోకాన్ పురుషో ఽధిశేతే. 6

వ్యాఖ్య : యుగాంతోచితయోగనిద్రః— యుగాంత - కల్పాంతమునందు, ఉచిత-పరిచితమైన, యోగ-ఆత్మనిష్ఠయే, నిద్రః-నిద్రగాజెప్పబడు నిద్రగలవాడై, పురుషః-విష్ణువు, లోకాన్-సమస్తభువనములను, సంహృత్య-తనలో నుప సంహరించుకొని, నాభిప్రరూఢాంబురుహాసనేన— నాభి-తన బొడ్డునందు, ప్రరూఢ-మొలచియున్న, అంబురుహ-కమలము, ఆసనేన-ఆశ్రయముగా గల వాడును, ప్రథమేన-దక్షాదులలో మొదటివాడునగు, ధాత్రా-సర్వసృష్టికర్త

యగు బ్రహ్మచేత, సంస్తూయమానః (సన్)-స్తుతింపఁబడుచున్న వాఁడగుచు, అముం, అధిశేతే-ఈ సముద్రమునందు శయనించును. ఇచ్చట, అధిపూర్వక శీఙ్ ధాతువు సంబంధమువలన, ఆధారమునకు కర్మత్వము (సప్తమికి బదులు ద్వితీయ) వచ్చి "అముం" అనియైనది. సీతా! కల్పాంతమునందు శ్రీమహావిష్ణువు సర్వ భువనములను ఉపసంహరించి యోగనిద్రతో బ్రహ్మాభివంద్యమానుఁడగుచు నీ సముద్రమునందు శయనించును. ఇది కల్పాంతమునందును ఉండునట్టి జలరాశి సుమా! యని చెప్పెను. సర్వసృష్టికి ఆధారభూతమైనదనియు భావము.

శ్లో. పక్షచ్ఛిదా గోత్రభిదా ఽత్తగంధాః
శరణ్య మేనం శతశో మహీధ్రాః,
నృపా ఇవోపప్లవినః పరేభ్యో
ధర్మోత్తరం మధ్యమ మాశ్రయంతే. 7

వ్యాఖ్య : పక్షచ్ఛిదా-రెక్కలు నఱుకునట్టి, గోత్రభిదా-పర్వతములను గొట్టు ఇంద్రునిచేత, ఆత్తగంధాః-హరింపఁబడిన గర్వముగల(తిరస్కరింపఁబడిన), మహీధ్రాః-పర్వతములు, శతశః-నూటికి నూరువంతులు, శరణ్యం-రక్షకుఁడైన, ఏనం-ఈ సముద్రుని, పరేభ్యః-శత్రువులవలన, ఉపప్లవినః-భయకంపితులైన, నృపాః-రాజులు, ధర్మోత్తరం-ధర్మప్రధానుఁడగు, మధ్యమం, ఇవ-మధ్యస్థుఁడగు రాజునువలె, ఆశ్రయంతే-ఆశ్రయించుచున్నవి. ఇంద్రునికి భయపడి గర్వమును విడిచిన పర్వతములన్నియు నితఁడే శరణాగత రక్షకుఁడని యెఱిఁగి, శత్రువుల వలన భయకంపితులగు రాజులు ధర్మమును బాటించు మధ్యవర్తి రాజునువలె నాశ్రయించుచున్నవి, అట్టితఁడు ఆర్తబంధువని యెఱుఁగుము అని భావము.

శ్లో. రసాతలా దాదిభవేన పుంసా
భువః ప్రయుక్తోద్వహనక్రియాయాఃl
అస్యాశ్చ మంభః ప్రలయప్రవృద్ధం
ముహూర్తవక్త్రా భరణం బభూవ. 9

వ్యాఖ్య : ఆదిభవేన, పుంసా-ఆదివరాహమూర్తిచేత, రసాతలాత్-పాతాళమునుండి, ప్రయుక్తోద్వహనక్రియాయాఃl—ప్రయుక్త - చేయఁబడిన

ఉద్వహనక్రియాయాః—ఉద్ధరణ క్రియగల, భువః—భూదేవికి, ప్రలయ పవృద్ధం-ప్రళయకాలమునందు వృద్ధిచెందిన, అస్యా, అచ్ఛం, అంభః-ఈ సముద్రముయొక్క నిర్మలమైన జలము, ముహూర్తవక్త్రీభరణం-క్షణకాలము ముసుగుగా, బభూవ-ఉండినది. హిరణ్యాక్షాది రాక్షసులచేత భూమి ముంచఁబడినప్పుడు శ్రీమహావిష్ణువు ఆదివరాహమై భూమిని ఉద్ధరించెను గదా! అప్పుడు ఆదివరాహమూర్తికిని భూదేవికిని జరిగిన వివాహమునందు క్షణకాలము అనఁగా ముహూర్త సమయమువరకు ఈ సముద్రజలము కన్యాలజ్జావ గుంఠనముగా నుండినదని భావము. ఆదికాలమునందే ఆట్టి పవిత్రత గలది యీ సముద్రము.

శ్లో. ముఖార్పణేషు ప్రకృతి ప్రగల్భాః
స్వయం తరంగాధర దానదక్షః,
అనన్యసామాన్య కళత్ర వృత్తిః
పిబ త్యసౌ పాయయతే చ సింధూాః, 9

వ్యాఖ్య : అనన్య సామాన్య కళత్రవృత్తిః—అనన్య సామాన్య—ఇతర పురుషుల కెవ్వరికిని సాధారణముకాని, కళత్రవృత్తిః—భార్యల విషయమునందలి భోగప్రవృత్తిగలవాఁడై, తరంగాధర దానదక్షః—తరంగాధర-తరంగమనెడు ఆధరోష్ఠమును, దాన—ఇచ్చుటయందు, దక్షః-చతురుఁడైన, అసౌ-ఈసముద్రుఁడు, ముఖార్పణేషు-ముఖముల నర్పించుటయందు, ప్రకృతిప్రగల్భాః-సహజముగా ప్రౌఢలైన, సింధూాః—నదులను, (తరంగా ధరమును) స్వయం, పిబతి-తాను పానము చేయును, పాయయతే, చ-నదులతో పానముఁ జేయించును. సఖుల ప్రేరణ లేకయే సహజ ప్రౌఢలైన నదీమతల్లికలు వచ్చి ముఖార్పణము చేసినప్పుడు, తాను వారి తరంగాధరపానముఁ జేయుచు, వారికి తన తరంగాధర పానము గలిగించును. ఇట్లు దంపతుల కేకకాలమునందు పరస్పరాధరపానముజేయు భాగ్యమీ సముద్రునికిఁదప్ప మరియొకనికి లేదని భావము. "నపాదమ్యాజ్" ఇత్యాది సూత్రము వలన నిచ్చట ణ్యంతమగు 'పా' ధాతువునకు పరస్మైపద నిషేధము కలిగి "పాయయతే" అని ఆత్మనేపది వచ్చినది.

శ్లో. స సత్త్వ మాదాయ నదీముఖాంభః
సంమీలయంతో వివృతాననత్వాత్, 10

అమీ శిరోభి స్తిమయః సరంధ్రైః
ఊర్ధ్వం వితన్వంతి జలప్రవాహాన్.

వ్యాఖ్యః అమీ-ఈ, తిమయః-ఒకవిధమగు మత్స్యములు, వివృతాననత్వాత్-తెరువఁబడిననోళ్ళు గలవగుటవలన, ససత్త్వం-మత్స్యాదిప్రాణులతో గూడిన, నదీముఖాంభః-నదీముఖజలమును, ఆదాయ-తీసికొని, సమ్మీలయంతః-ముక్కుపుటములను నోటిని మూసికొనుచు, సరంధ్రైః-రంధ్రములుగల, శిరోభిః-తలలచేత జలప్రవాహాన్-జలప్రవాహములను, ఊర్ధ్వం-పైకి, వితన్వంతి-ఎగఁజిమ్ముచున్నవి. "అస్తి మత్స్యా స్తిమిర్నామ శతయోజన మాయతః" ఎను వచన ప్రకారము నూరామడల పొడవును దానికిఁదగిన వెడల్పును గల "తిములు"అనఁబడు నీమత్స్యములు విశాలముగాఁ దెఱువఁబడిన నోళ్ళుగలవి యగుటవలన చిన్నచేఁపలు మొదలగు ప్రాణులతోఁ గూడిన నదీముఖజలమును, అనగా సముద్రమునందప్పుడే వచ్చి పడుచున్న నీటిని ప్రాగి నోరుమూసికొన్నవియై తమ శిరస్సులందున్న రంధ్రముల ద్వారా జలప్రవాహములను ఆకాశమునకు ఎగఁజిమ్ముచున్నవి! ఆదృశ్యము జలయంత్ర క్రీడవలెనున్నఁకదూ! అని రాముఁడు సీతకుఁ జూపెను.

శ్లో. మాతంగనక్రైః సహసోత్పతద్భిః
భిన్నాఽ ద్విధా పశ్య సముద్రఫేనాఽ,
కపోలసంసర్పితయా య ఏషాం
వ్రజంతి కర్ణక్షణచామరత్వమ్. 11

వ్యాఖ్యః సహసా-వేగముగా, ఉత్పతద్భిః-ఎగిఱిపడుచున్న, మాతంగనక్రైః-గజాకారముగల మొసళ్ళచేత, ద్విధా, భిన్నాఽ-రెండుగా వేరుపరుపఁబడిన, సముద్రఫేనాన్-సముద్రమునందలి నురుగునును, పశ్య-చూడుము, యే-యేనురుగులు, ఏషాం-ఈజలమాతంగనక్రములకు, కపోలసంసర్పితయా-చెక్కిళ్ళయందు రాచుకొనుచున్న కారణముచేత, కర్ణక్షణ చామరత్వం-చెవులయందు క్షణకాలము చామరములై యుండుటను, వ్రజంతి-పొందుచున్నవో! సీతా! జలోపరిభాగమున కెగురుచున్న ఆజలగజ నక్రములచేత రెండుగాఁ జీల్పఁబడిన సముద్రపునురుగులు, ఆనక్రముల చెంపల నొరసికొనుచు, వాటికి క్షణకాలము చామరములుగాఁ గన్నట్టుచున్నవి చూడు! అన్నాఁడు. రాచయేనుఁగులపై రాజులూఁగు

నప్పుడు ఆ యేనుఁగులకుఁజేయు నలంకారములలో చెవులకుఁ జెంపలకు నడుమ తెల్లని చామరములు గట్టుదురు. అట్లే యీజలగజము లనఁబడు మొసళ్ళ సముద్రపు నురుగు రెండుప్రక్కలందుండుటచేత రాచయేనుఁగులవలెఁ గనఁబడుచున్నవని భావము. ద్రష్టాలంకారము.

శ్లో. వేలానిలాయ ప్రసృతా భుజంగాః
మహోర్మి విస్ఫూర్జథు నిర్విశేషాః,
సూర్యాంశు సంపర్క సమృద్ధరాగైః
వ్యజ్యంత ఏతే మణిభిః ఫణస్థైః. 12

వ్యాఖ్య: వేలానిలాయ-సముద్రతీరవాయువుకొఱకు (గాలినిఁదినుటకు), ప్రసృతాః-నీటినుండి బయలుదేరిన వియు, మహోర్మి విస్ఫూర్జథు నిర్విశేషాః— మహోర్మి - పెద్ద తరంగములయొక్క, విస్ఫూర్జథు-విజృంభణముకంటె, నిర్విశేషాః-భేదముకానివియునగు, ఏతే, భుజంగాః-ఈజలసర్పములు, సూర్యాంశు సంపర్క సమృద్ధరాగైః— సూర్యాంశు-సూర్య కిరణములయొక్క, సంపర్క—సంబంధముచేత, సమృద్ధరాగైః—వృద్ధిచెందిన యెఱ్ఱని కాంతులుగల, ఫణస్థైః-ఫణములపైనున్న, మణిభిః-పద్మరాగమణులచేత, వ్యజ్యంతే—ఊహింపఁబడుచున్నవి. ఈసముద్రతరంగములు ఎత్తుగాలేచి తీరమును జేరుచున్నవి గదా! తీరమునందలిగాలినిఁ బీల్చుటకై యీతరంగములలోఁగలిసి తీరమునకు జేరుచున్న సర్పములను, తెల్లనివగుటచేతను, వేగమున వచ్చుచున్నవగుటచేతను, తరంగములకంటె భిన్నములై యున్నట్లు మనము గుర్తింపలేకపోయినను, తరంగములపైఁబడుచున్న సూర్యకిరణములకాంతి, సర్పముల శిరస్సులందలి మాణిక్యముల కాంతిని యినుమడింపఁజేయుటచేత ఇవి సర్పములు సుమా! అని యూహించుటకు వీలుకలిగినదని భావము.

శ్లో. తవాధరస్పర్ధి షు విద్రుమేషు
పర్యస్త మేత త్సహసోర్మివేగాత్,
ఊర్ధ్వాంకుర ప్రోతముఖం కథంచిత్
శ్లేశా దవక్రామతి శంఖయూథమ్. 13

వ్యాఖ్య: తవ, అధరస్పర్ధిని-నీయధరోష్ఠమును బోలియున్న, విద్రుమేషు-పగడములపైన, సహసా-హఠాత్తుగా, ఊర్మివేగాత్-తరంగముల వేగమువలన, పర్యస్తం-పడవేయఁబడినదియు, ఊర్ధ్వాంకుర ప్రోత ముఖం-ఊర్ధ్వాంకుర-పైకివచ్చిన పగడపు మొలకలచేత, ప్రోత-గ్రుచ్చఁబడిన, ముఖం-ముఖభాగములు గలదియు గు, ఏతత్-ఈ, శంఖయూథం-శంఖముల మొత్తము, కథంచిత్-ఎట్టకేలకు, క్లేశాత్-కష్టముగా, అపక్రామతి-తొలఁగి చనుచున్నది (ఆలస్యముగా శంఖములు దొరలిపోవుచున్నవని యర్థము). సీతా! నీయధరోష్ఠమును బోలియున్న పగడముల గుంపు పైన తరంగవేగముచేత బడవేయఁబడిన శంఖముల మొత్తము అచ్చటి పగడపు మొక్కలు ముఖరంధ్రములలో నిరుకుటచేత ఎట్లోతప్పించుకొని నిదానముగా ఇకింపికి దొరలిపోవుచున్నది చూడము! అన్నాడు. ఇచ్చట "తవాధరస్పర్ధిని" అన్నచోట ఉపమానమే ఉపమేయమును బోలియున్నట్లు చెప్పుటచేత వ్యతిరేకాలంకారమును, పగడములపై శంఖములు బడుట, అధరోష్ఠముపై చిఱునగవు ప్రసరించుట వంటిదగుటచేత వస్తుధ్వనియుఁ గలవు.

శ్లో. ప్రవృత్తమాత్రేణ పయాంసి పాతు
మావర్తవేగాత్ భ్రమతా ఘనేన,
ఆభాతి భూయిష్ఠ మయం సముద్రః
ప్రమథ్యమానో గిరిణేవ భూయః. 14

వ్యాఖ్య: పయాంసి-జలములను, పాతుం-త్రాగుటకు, ప్రవృత్తమాత్రేణ-పూనుకొన్నవాఁడు మాత్రమే యయినవాఁడును, ఆవర్తవేగాత్-సముద్రమునందలి సుడుల వేగమువలన, భ్రమతా-గుండ్రముగాఁ దిరుగుచున్నవాఁడునగు, ఘనేన-మేఘునిచేత, అయం, సముద్రః-ఈ సముద్రము, భూయః-మరల, గిరిణా-మందరపర్వతముచేత, ప్రమథ్యమానః, ఇవ-తఱచఁబడుచున్నదివలె, భూయిష్ఠం-మిక్కిలి, ఆభాతి-ప్రకాశించుచున్నది. మేఘము సముద్రజలమును త్రాగుటకై సీది చెంతకు వచ్చినంతనే యచ్చటి సుడులవేగముచే ఉపహతమై యచ్చటనే వలయముగాఁదిరుగుచున్నది. దానినిఁ జూడగా, ఈసముద్రము మరల గూడ మందరాద్రిచేత మథింపఁబడుచున్నదా? యన్నట్లు కనఁబడుచున్నది సుమా! అలంకారము: వస్తూత్ప్రేక్ష.

శ్లో. దూరా దయశ్చక్ర నిభస్య తన్వీ
తమాల తాలీవన రాజి నీలా,
ఆభాతి వేలా లవణాంబురాశే
ర్ధారా నిబద్ధేవ కలంక రేఖా. 15

వ్యాఖ్య: అయశ్చక్రనిభస్య-ఇనుపచక్రముతో సమానముగానున్న, **లవణాం** బురాశేః-**లవణ**సముద్రమునకు, దూరాత్-దూరముగా, **తన్వీ**-సూక్ష్మముగా నున్నదియు, **తమాల తాలీవన** రాజినీలా—తమాల-క్రానుగుచెట్లయొక్కయు, తాలీవన-తాటితోపులయొక్కయు, రాజి-వరుసలచేత, నీలా-నల్లదనము కలదియు నగు, వేలా-సముద్రతీరము (చెల్లెలికట్ట), ధారానిబద్ధా-చక్రము అంచుకు గట్టబడిన, కలంకరేఖా, ఇవ-ఇనుపకమ్మియనబడు మాలిన్యరేఖవలె, ఆభాతి-ప్రకాశించుచున్నది. వర్తులముగానున్న సముద్రము చక్రమువలె నుండగా దానిచుట్టును **తమాలతాలీవన** పంక్తులతో నల్లగా గనబడుచున్న తీరరేఖ బండిచక్రముయొక్కయినుపకమ్మివలె గోచరించుచున్నదని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. వేలానిలః కేతక రేణుభిస్తే
సంభావయ త్యానన మాయతాక్షి!
మా మత్తమం మండనకాలహానే
ర్వేత్తీవ బింబాధర బద్ధతృష్ణమ్. 16

వ్యాఖ్య: హేఆయతాక్షి-ఓవిశాలనేత్రములుగలదానా! వేలానిలః-ఈసముద్ర తీరవాయువు, కేతకరేణుభిః-మొగలిపూల పుప్పొడులతో, తే-నీయొక్క, ఆననం-ముఖమును, సంభావయతి-అలంకరించుచున్నది? బింబాధరబద్ధతృష్ణం-దొండపండువంటి నీయధరోష్ఠమునందు మిక్కిలియాశగల, మాం-నన్ను, మండనకాలహానేః-అలంకరించుటచేతనగు కాలహరణమునకు, అక్షమం-సహింపలేనివానినిగా (తట్టుకోలేని వానినిగా) వేత్తీవ (వేత్తి+ఇవ)-ఎఱుగునా యేమి? సీతా! ఈసముద్ర తీరవాయువు అచ్చటనున్న మొగలిపూల పరాగమును దెచ్చి నీముఖమునకు పులిమి యలంకరించుచున్నదే! నీయధరోష్ఠపానమును క్షణమైనను విడువలేని నేను ఈయలంకార కాలయాపనమునకు తట్టుకోజాలనని యెఱుగునాయేమి? నన్ను నీవిరహ

ముతో నుడికించుటకా! యేమి యీవాయువిట్లు చేయుట? అని భావము. ఈఘట్టము చిరవిరహ దుఃఖితులగు సీతారాములు రహస్యముగా విశంభాలాపములు చేయు నదియు, విశేషించి రాముఁడు సీతనోదార్చునదియుఁగావున రాముఁడిట్లు పలికెను.

శ్లో. ఏతే వయం సైకతభిన్న శుక్తి
పర్యస్తముక్తాపటలం పయోధేః
ప్రాప్తా ముహూర్తేన విమానవేగాత్
కూలం ఫలావర్జితపూగమాలమ్. 17

వ్యాఖ్య : ఏతే, వయం-ఈమనము, సైకతభిన్నశుక్తి పర్యస్తముక్తాపటలం-సైకత-ఇసుకదిబ్బలమీద, భిన్న-పగిలిన, శుక్తి-ముత్తెపుఁజిప్పలచేత, పర్యస్త-ఆంతటను చల్లఁబడిన, ముక్తాపటలం-ముత్యాల కుప్పలు గలధియు, ఫలావర్జితపూగమాలం—ఫల-పండ్లచేత, ఆవర్జిత-వంగునట్లు చేయఁబడిన, పూగమాలం-పోకచెట్లు వరుసలు గలదియునగు, పయోధేః, కూలం-సముద్రముయొక్క తీరమును, విమాన వేగాత్-విమానముయొక్క వేగమువలన, ముహూర్తేన, ప్రాప్తాః-ముహూర్తకాల మునఁజేరితిమి (ముహూర్తమనఁగా రెండు గడియలు. 48 నిముషముల కాలము). సీతా! ఇదుగో! మనము, ఇసుక నేలపై చిటిలిన ముత్తెపుఁజిప్ప లిటునటుఁజల్లిన ముత్యాలకుప్పలతోను, పండ్లగుత్తుల బరువుచే వంగిన పోకచెట్ల బారులతోను రమణీయముగానున్న సముద్రతీరమును, వేగముగావచ్చిన విమానమువలన ముహూర్త కాలంలో చేరుకున్నాము సుమా! అన్నాఁడు.

శ్లో. కురుష్వ తావత్కరభోరు! పశ్చా
న్మార్గే మృగప్రేక్షిణి! దృష్టిపాతమ్,
ఏషా విదూరీభవతః సముద్రాత్
సకాననా నిష్పతతీవ భూమిః. 18

వ్యాఖ్య : హేకరభోరు! కరభమువంటి తొడలుగలదానా! హేమృగప్రేక్షిణి!-ఓలేడి చూపులుగల సీతా! తావత్-పూర్తిగా, పశ్చాన్మార్గే (పశ్చాత్ + మార్గే)-మనము దాటివచ్చిన మార్గమునందు, దృష్టిపాతం, కురుష్వ-చూపును ప్రసరింప జేయుము (చూడుము!), ఏషా—ఈ, సకాననా-అరణ్యసహితమగు, భూమిః-భూమి

విదూరీభపతః-క్రమముగా దూరమగుచున్న, సముద్రాత్-సాగరమునుండి, నిష్ప తతి, ఇవ-నిష్క్రమించుచున్నదివలె నున్నది. సకాననయగు భూమి సముద్రము నుండి వెడలివచ్చుచున్నట్లు విమాన వేగమువలన మనకుఁ గనఁబడుచున్నదని భావము. ఇచ్చట కరభోరు! అన్నప్పుడు రాముఁడు ఇతర వస్తుదర్శన పారవశ్యము నందున్న సీతను తొడతట్టి, ప్రస్తుత భూమిదర్శనమునకై మృగపేక్షిణి! అని ప్రోత్సహించెనని ఈ సంబోధన పదద్వయ సార్థక్యము నూహింపవలయును. భావ విశేషములందట్టి క్రియా విశేషములు సహజములు.

శ్లో. క్వచిత్ పథా సంచరతే సురాణాం
క్వచిత్ ఘనానాం, పతతాం క్వచిచ్చ,
యథావిధో మే మనసో ఽభిలాషః
ప్రవర్తతే పశ్య తథా విమానమ్. 19

వ్యాఖ్య : హేదేవి!-ఓసీతా! విమానం-పుష్పక విమానము, మే, మనసః-నా మనస్సుయొక్క-, అభిలాషః-కోరిక, యథావిధః-ఏఢవిముగా నున్నదో, తథా, అట్లే, ప్రవర్తతే-నడచుచున్నది, పశ్య-చూడుము, క్వచిత్-ఒకచోట, సురాణాం-పథా-దేవతలయొక్క దారివెంబడి, సంచరతే-నడుచుచున్నది. క్వచిత్-మరియొక చోట, ఘనానాం-మేఘముల యొక్కయు, క్వచిత్-ఇంకొకచోట, పతతాం, చ-పక్షుల యొక్కయును, పథా-మార్గముద్వారా, సంచరతే-వెళ్ళుచున్నది. సీతా! ఈ పుష్పక విమానము నా మనస్సులోని కోరిక నెట్లుగుర్తించుచున్నదో! నేను ఏ మార్గమును జూడఁదలఁచితినో అదే దేవమార్గ, మేఘమార్గ, పక్షిమార్గములలో నిది వెళ్ళుచున్నది. ఇది అద్భుతము సుమా! "సంచరతే" సమ్ అను ఉపసర్గతోను, తృతీయాంతమగు "పథా" అను పదముతోను, చేరుటచేత "చర" ధాతువున కాత్మనే పది వచ్చినది. "సమస్తృతీయా యుక్తాత్" అని సూత్రము.

శ్లో. అసౌ మహేంద్రద్విప దానగంధిః
త్రిమార్గగావీచి విమర్ద శీతః,
ఆకాశవాయు ర్ది నయోవనోత్థా
నాచామతి స్వేదలవాన్ ముఖే తే. 20

వ్యాఖ్య : మహేంద్రద్విప దానగంధిః-మహేంద్రద్విప-ఐరావతమునొక్క, దానగంధిః-మదపువాసనగలదియు, త్రిమార్గగావీచి విమర్దశీతః---త్రిమార్గగా-గంగయొగ్క, వీచివిమర్ద-తరంగముల సంబంధముచేత, శీతః-చల్లగానున్నదియునగు, అసౌ, ఆ కా శ వా యుః-ఈ యా కా శ వా యు వు, దినయౌవనోత్థాన్-దిన యౌవన-మధ్యాహ్న కా ల ము చే త, ఉత్థాన్-బ య లు దే రి న (కలిగిన), తే-నీయొక్క, ముఖే-ముఖమునందలి, స్వేదలవాన్-చెమటచుక్కలను, ఆచామతి-ఆచమనముచేయుచున్నది (తొలగించుచున్నది) సీతా! ఐరావతమదగంధ పరిమళముతోను, గంగాతరంగ సంపర్కమువలని చల్లదనముతోను వచ్చుచున్న యీ యాకాశపవనము, ఈ మధ్యాహ్నకాలమున నీ ముఖముపై బొడమిన చెమటచుక్కలను దొలగించుచున్నది సుమా! ఇది, విమానమునొక్క సురపథ సంచారమని భావము. ఆకాశ, భూ, పాతాళమార్గములందు ప్రవహించుటచేత గంగ "త్రిమార్గగా" యనబడుచున్నది. మధ్యాహ్నమును "దినయౌవన" మనుట చక్కనిప్రౌఢప్రయోగము.

శ్లో. కరేణ వాతాయనలంబితేన
స్పృష్ట స్త్వయా చండి! కుతూహలిన్యా,
ఆముంచతీ వాభరణం ద్వితీయ
ముద్భిన్నవిద్యుద్వలయో ఘన స్తే. 21

వ్యాఖ్య : చండి!-ఓకోపముగలదానా! కుతూహలిన్యా-వినోదార్థినివగు, త్వయా - నీచేత, వాతాయనలంబితేన - గవాక్షమునందు జార్చబడిన, కరేణ - చేతితో, స్పృష్టః - తాకబడినదగుటవలన, ఉద్భిన్నవిద్యుద్వలయః-పైకెగిరినవలయాకార విద్యుత్తుగల, ఘనః-మేఘము, ద్వితీయం, ఆభరణం-రెండవకంకణమును, ఆముంచతి, ఇవ-ఒర్పించుచున్నదివలెనున్నది. విమానగవాక్షమునుండి (కిటికీవంటిది) జార్చిన చేతితో నీవు తాకగా యెగిరిన విద్యుత్తుగల మేఘము నీచేతికి మరియొక మణి కంకణమును దొడుగుచున్నదా? యన్నట్లున్నది సీతా! అనెను. అలంకారము : ఉత్ప్రేక్ష. ఇచ్చటి "చండి" అను శబ్దము సీతయొక్క ప్రణయకోపమును దెలుపును. ఇన్ని రోజులు నన్నేలయుపేక్షించితివని యలిగిన సీతను రాముడు, చండి! అనిపిలిచి, యీ వినోదవాక్యముచేత నామె నోదార్చుచున్నట్లు భావింపవలెను.

శ్లో. అమీ జనస్థాన మపోఢవిఘ్నం
మత్వా సమారబ్ధనవోట జాని,
అధ్యాసతే చిరభృతో యథాస్వం
చిరోజ్ఝితా న్యాశ్రమ మండలాని. 22

వ్యాఖ్య : అమీ, చిరభృతః-ఈతపస్వీజనులు, జనస్థానం-జనస్థానమును (పూర్వము రాక్షసపాలనమునందున్న ప్రాంతము), అపోఢవిఘ్నం-తొలగిన విఘ్నములుగలదానినిగా, మత్వా-తెలిసికొని, సమారబ్ధనవోటజాని-ఆరంభింపబడిన క్రొత్తపర్ణశాలలుగలవియు, చిరోజ్ఝితాని-రాక్షసభయమువలన చాలకాలముక్రింద విడువబడినవియునగు, ఆశ్రమమండలాని-ఆశ్రమభాగములను, యథాస్వం-తమ తమభాగముల ప్రకారము కట్టుకొని, అధ్యాసతే-అధివసించుచున్నారు. పూర్వము ఖరదూషణ తాటకాదులు చేయుచుండిన విఘ్నములవలన తమతపోయజ్ఞాదులను సర్వ్తించుకొనుట కితరప్రాంతములకు వెళ్ళిపోయిన మునిజనులు, రావణవధవలన విఘ్నము లింకమీదనుండవను భావముతో మరల జనస్థానమునకు వచ్చి తమ పూర్వస్థలములందే పర్ణకుటీరములు గట్టుకొని నివసించుచున్నారు చూడుము! ఇది జనస్థాన మని రాముడు సీతకుదెలిపెను.

శ్లో. సైషా స్థలీ యత్ర విచిన్వతా త్వాం
భ్రష్టం మయా నూపుర మేక ముర్వ్యామ్,
అదృశ్యత త్వచ్చరణారవింద
విశ్లేష దుఃఖా దివ బద్ధమౌనమ్. 23

వ్యాఖ్య: సైషా (సా + ఏషా), స్థలీ-ఆదేయీచోటు; యత్ర-యెచ్చట సైతే, త్వాం-నిన్ను, విచిన్వతా-వెదకుచుండిన, మయా-నాచేత, త్వచ్చరణార వింద విశ్లేష దుఃఖాత్, ఇవ-త్వచ్చరణారవింద-నీపాదకమలముతో, విశ్లేష-విడిపో వుటచేతనైన దుఃఖాత్, ఇవ-దుఃఖమువలననో యనునట్లు, బద్ధమౌన -చప్పుడు లేనిదై, ఉర్వ్యాం-భూమిమీద, భ్రష్టం-జారిపడియుండిన, ఏక , నూపురం-ఒక కాలియందె, అదృశ్యత-చూడబడియుండెనో! సీతా! యెచ్చటనైతే నిన్ను వెదకు చున్ననాకు, నీపాదవియోగదుఃఖమువలననో యనునట్లు నిశ్శబ్దముగా నేలపైబడి యుండిన నీపాదమంజీరము కనబడినదో ఆచోటు ఇదేసుమా! మంజీరమౌనమునకు పాదవియోగదుఃఖము హేతువనుటచే నిది హేత్వపేక్షాలంకారము.

శ్లో. త్వం రక్షసా భీరు! యతో ఽపనీతా
తం మార్గ మేతాః కృపయా లతా మే,
అదర్శయన్ వక్తు మశక్నువత్యాః
శాఖాభి రావర్జిత పల్లవాభిః. 24

వ్యాఖ్య : భీరు-భయస్వభావముగల ఓసీతా!, త్వం-నీవు, రక్షసా-రాక్షసునిచేత (రావణునిచేత), యతః-యేమార్గముచేత (ద్వారా), అపనీతా-అపహరింపఁబడితివో, తం, మార్గం-ఆత్రోవను, వక్తుం-చెప్పుటకు, అశక్నువత్యాః-శక్తి లేనందున చేతఁగానివై, ఏతాః, లతాః-తీఁగలు, ఆవర్జితపల్లవాభిః-వంచఁబడిన చిగురుటాకులుగల, శాఖాభిః-కొమ్మలచేత, కృపయా-దయతో, మే, అదర్శయన్-నాకుఁజూపినవి. సీతా! రావణుఁడే త్రోవన నిన్నపహరించుకొని వెళ్లెనో ఆమార్గము నీలతలు అరచేతులవంటి చిగురాకులనువంచి తమ కొమ్మలనెడు బాహువులతో నాకుఁజూపినవి. ఇవినోరులేనివగుటచేత దయతో నట్లు సంజ్ఞచేసి మార్గమును జూపినవని భావము. "భీరు!" అనిపిలుచుట, ఇప్పటికిని ఆ సంఘటనము జ్ఞప్తికి వచ్చినచో సీత వణికిపోవుననియు, "రక్షసా" యనుట దుష్టుఁడైన రావణునిపేరు నుచ్చరింపరాదనియు, సూచించును. లతలు కృపతో రామునికిఁ ద్రోవనుజూపుట కేవలం మాలంకారికభావన యనుకొనుట తగదు. వృక్షలతాదులు మానవులవలెనే సుఖదుఃఖాది భావములు గలిగియున్నట్లు ఆధునిక విజ్ఞానశాస్త్రవేత్తలు, కీ. శే. జగదీశచంద్రబోసు మొదలగువారు, చెప్పువరకు మనము నమ్మలేదు, కాని, ఈవిషయము, "అంతఃసంజ్ఞా భవంత్యేతే సుఖదుఃఖ సమన్వితాః" అని బహుపురాతన కాలమునందే మనువు చెప్పెను.

శ్లో. మృగ్యశ్చ దర్భాంకుర నిర్వ్యపేక్షాః
తవాగతిజ్ఞం సమబోధయన్ మామ్,
వ్యాపారయంత్యో దిశి దక్షిణస్యాం
ఉత్పక్ష్మరాజీని విలోచనాని. 25

వ్యాఖ్య: దర్భాంకుర నిర్వ్యపేక్షాః-తినుచున్న దర్భమొలకలపై నిస్పృహ గలవియగు, మృగ్యాః, చ-ఆడుజింకలుకూడ, ఉత్పక్ష్మరాజీని-యెత్తిన రెప్పల వారులుగల, విలోచనాని-కన్నులను, దక్షిణస్యాం, దిశి-దక్షిణదిక్కునందు, వ్యాపారయంత్యాః-ప్రవర్తింపఁజేయుచున్నవగుచు, తవ-నీయొక్క, అగతిజ్ఞం-గమన

మార్గము నెఱుఁగని, మా-నన్ను-సమబోధయన్-ఎఱుకగలవానిని జేసినవి. నీకు జరిగిన విపత్తునకుఁ జింతించుచున్న మృగాంగనలు దక్షిణదిక్కు-వైపునకు జెప్ప లెత్తిచూచుచు నీవు కొనిపోఁబడిన మార్గమును నాకుఁదెలిపిన వని భావము. వాని దృష్టిచేష్టద్వారా నాకు బోధించినవిసుమా!

శ్లో. ఏత ద్గిరే ర్మాల్యవతః పురస్తా-
ద్ఆవిర్భవ త్యంబర లేఖి శృంగమ్,
నవం పయో యత్ర ఘనై ర్మయా చ
త్వద్విప్రయోగా శ్రు సమం విసృష్టమ్. 26

వ్యాఖ్య : మాల్యవతః-మాల్యవంతమను పేరుగల, గిరేః-పర్వతముయొక్క, అంబరలేఖి-ఆకాశమును తాకుచున్న, శృంగం-శిఖరము, ఏతత్-ఇదియే, పురస్తాత్-ఎదుట, ఆవిర్భవతి-కానవచ్చుచున్నది. యత్ర-ఏశిఖరమునఁదు, ఘనైః-మేఘముల చేత, నవం, పయః-నూతనవర్షజలము, మయా-నాచేత, త్వద్విప్రయోగాశ్రు—త్వత్-నీయొక్క, విప్రయోగ-ఎడఁబాటుచేత, అశ్రు, చ-కన్నీరున్ను, సమం, విసృష్టం-ఏకకాలమునందు విడువఁబడినదో! ఈ కనపడుచున్నది మాల్యవంతము యొక్క శిఖరము, ఆచ్చట వర్షఋతువునందు మేఘములు నూతనజలమును, నేను నీవియోగముచేతవచ్చిన కన్నీటిని, సమముగా విడిచితిమి. వర్షఋతువు వియోగుల కెక్కువబాధాకర మని భావము.

శ్లో. గంధశ్చ ధారాహత పల్వలానాం
కాదంబ మర్ధోదత కేసరం చ,
స్నిగ్ధాశ్చ కేకాః శిఖినాం బభూవుః
యస్మి న్నసహ్యాని వినా త్వయా మే. 27

వ్యాఖ్య : యస్మిన్-ఏపర్వత శృంగమునందు, ధారాహత పల్వలానాం-ధారాహత-వర్షధారలచేత కూలఁగొట్టబడిన యొడ్డులుగల, పల్వాలానాం-చిన్న చిన్న సరస్సులయొక్క, గంధః, చ-పరిమళమున్ను, అర్ధోద్గత కేసరం-సగముపైకివచ్చిన కింజల్కములుగల, కాదంబం, చ-కడిమి పువ్వును, స్నిగ్ధాః-మధురములగు, శిఖినాం,

కేకాః, చ-నెమళ్ళయొక్క కేకలున్న, త్వయా, వినా—నీవు లేనందుచేత, మే-నాకు అసహ్యాని-సహించుటకు వీలుగానివి, బభూవుః—అయినవి. నీవు లేనప్పుడు నాకే భోగ్య వస్తువును సుఖమునియ్య లేదని భావము. "అసహ్యాని" అనునది గంధ, కాదుంబ. కేకలకు సాముదాయికమగు ఏకశేష, "నపుంసక మనపుంసకేన" అను సూత్రముచే సిద్ధించును.

శ్లో పూర్వానుభూతం స్మరతా చ యత్ర
కంపోత్తరం భీరు! తవోపగూఢమ్,
గుహావిసారీ ణ్యతివాహితాని
మయా కథంచిత్ ఘనగర్జితాని. 28

వ్యాఖ్య : హేభీరు!-ఓ భయస్వభావము గలదానా! యత్ర-యేశృంగము నందు, పూర్వానుభూతం-పూర్వ మనుభవింపబడినదియు, కంపోత్తరం-శరీర కంపమే ముఖ్యముగా గలదియునగు, తవ, ఉపగూఢం-నీయాలింగనమును, స్మరతా-స్మరించుచున్న, మయా-నాచేత, గుహావిసారీణి-గుహాలయందు వ్యాపించుచుండిన, ఘనగర్జితాని-మేఘగర్జనములు, కథంచిత్-అతికష్టముగా, అతివాహితాని-గడుపఁబడ్డవో! ఎచ్చట, మేఘగర్జనములు గుహలలోదూరి ప్రతిధ్వనించుటచేత, పూర్వానుభూతమైన నీయాలింగనమును స్మరించుచుండిన నాచేత నారోజులు శరీరకంప సహితములై గడుపఁబడినవో ఆప్రదేశమే యీగిరిశిఖరము సుమా! యని చెప్పెను. నాటి మేఘగర్జనము లుద్దీపకములై తత్పూర్వాలింగన స్మృతిని గలిగించినవని తాత్పర్యము.

శ్లో. ఆసారసిక్త క్షితిబాష్ప యోగాత్
మా మక్షిణో ద్యత్ర విభిన్నకోశైః,
విడంబ్యమానా నవకందలైస్తే
వివాహధూమారుణ లోచనశ్రీః. 29

వ్యాఖ్య : యత్ర-ఏమాల్యవచ్ఛిఖరమునందు, విభిన్నకోశైః-విచ్చినమొగ్గలు గల, నవకందలైః-క్రొత్త నేలయరటి పువ్వులచేత, ఆసారసిక్తక్షితి బాష్పయో

గాత్—ఆసార-ధారాసంపాత వర్షముచేత, సిక్త-తడపఁబడిన, క్షితిబాష్ప-ధూమ వర్ణముగల నేలయా రియొక్క, యోగాత్-సంబంధముకలుగుటయను కారణము వలన, విడంబ్యమానా-అనుకరి పఁబడుచున్న, తే-ీయొక్క, వివాహ ధూమారుణ లోచనశ్రీ-వివాహకాల హోమధూమముచేత నెఱ్ఱబడిన నీకన్నుల కాంతి (స్మరింపఁబడినదగుచు) మాం, ఆక్షిణోత్-నన్ను బాధించెనో! యెచ్చటనైతే వికసించిన నేలయరటిమొగ్గలు వర్షపాతముచే బాష్పము గమ్మిన నేలపై జలబిందువులనురాల్చుచు, వివాహధూమారుణమైన నీనేత్రశోభను బోలుటకు యత్నించుచుండెనో అచ్చటి దృశ్యము నిన్నుస్మరింపఁజేసి యెక్కువగా బాధించెను. అదియే యీ పర్వత శిఖరము. "శోభా సంపత్తిపద్మాసు లక్ష్మీ శ్రీ రివకథ్యతే" అను నిఘంటువచనమున నిచ్చట శ్రీ శబ్దమునకు "కాంతి" యని యర్థము

శ్లో. ఉపాంత వానీర వనోపగూఢా
న్యాలక్ష్య పారిప్లవ సా సానీ,
దూరావతీర్ణా పిబతీవ ఖేదా
దమూని పంపాసలిలాని దృష్టిః. 30

వ్యాఖ్య : ఉపాంత వానీర వనోపగూఢాని--ఉపాంత- పక్కనయున్న, వానీరవన-నీటి పబ్బలివనములచేత, ఉపగూఢాని-కప్పఁబడినవియు, ఆలక్ష్య పారిప్లవసారసాని--ఆలక్ష్య-కొంచెముకనఁబడనివియై, పారిప్లవ-కదలుచున్న(ఈదుచున్న)సారసాని-చిన్నకొంగలుగలవియునగు, అమూని, పంపాసలిలాని-ఈపంపాసరోవల జలములను, దూరావతీర్ణా--దూరాత్-దూరమునుండి. అవతీర్ణా-దిగినట్టి. దృష్టిః-నాచూపు ఖేదాత్-అలసటవ న పిబతి, ఇవ- తాగుచున్నదివలె నున్నది. మాల్యవత్పర్వత పాంతమును దాటి విమానము పంపాసరోవర పాంతమునకు వచ్చినది. అప్పుడు రాముఁడు సీతా! బబ్బలివనములతోఁ జుట్టఁబడి, కదలుచునీమచున్న సారసములుగల యీ పంపాజలమును దూరప్రయాణమువలన అలసిన నాదృష్టి త్రాగుచున్నట్లున్నదిసుమా! అనఁగా నాకీచోటును విడుచుటకు బుద్ధిపుట్టుట లేదని భావము.

శ్లో. అత్రావియుక్తాని రథాంగనామ్నా
మన్యోన్య దత్తోత్పల కేసరాణి,

ద్వంద్వాని దూరాంతరవర్తినా తే
మయా ప్రియే! సస్పృహ మీక్షితాని. 31

వ్యాఖ్య : అత్ర-ఈపంపా సరస్సునందు, అన్యోన్య దత్తోత్పల కేసరాణి అన్యోన్య-ఒకదానికొకటి, దత్త-ఇయ్యఁబడిన, ఉత్పలకేసరాణి-కలువల కేసరములు గలవియు, అవియుక్తాని-ఎడబాటులేనివియు నగు, రథాంగనామ్నాం-చక్రవాకములయొక్క, ద్వంద్వాని-జంటలు, తే-నీకు, దూరాంతరవర్తినా-దూరదేశమునుండిన, మయా-నాచేత, ప్రియే-ప్రియురాలా! సస్పృహం-అభిలాషపూర్వముగా, ఈక్షితాని-చూడఁబడినవి. ఈ పంపాసరస్సునందలి చక్రవాకమిథునములు కలువకింజల్కములనందించుకొనుచు, ఒకదానినొకటి యొరసికొనుచు నుండఁగాఁ జూచిన నాకు నీవు స్మృతికివచ్చుటయు, దూరవర్తినగుటచేత నిన్నుఁగలిసికొనలేక పోయితినే యని బాధపడుటయు జరిగి, ఆజంటలనే సాభిలాషముగాఁ జూచుచుంటిని ప్రియా! యని భావము.

శ్లో. ఇమాం తటాశోకలతాం చ తన్వీం
స్తనాభిరామ స్తబకాభినమ్రామ్,
త్వత్ప్రాప్తిబుద్ధ్యా పరిరబ్ధుకామః
సౌమిత్రిణా సాశ్రు రహం నిషిద్ధః. 32

వ్యాఖ్య : మరియును, స్తనాభిరామ స్తబకాభినమ్రాం- స్తనాభిరామ- స్తనములవలె నందముగానున్న, స్తబక-పూగుత్తులచేత, అభినమ్రాం-ఎదురుగావంగి సదియు, తన్వీం-సన్నగానున్న, ఇమాం-ఈ, తటాశోకలతాం-పంపాతటమున నున్న యశోకలతను, త్వత్ప్రాప్తిబుద్ధ్యా-నీవు వచ్చితి వనుభ్రమచేత, పరిరబ్ధుకామః-ఆలింగనము చేసికొనుటకుఁ బూనినట్టి, అహం-నేను, సౌమిత్రిణా-లక్ష్మణునిచేత, సాశ్రుః-కన్నీరుఁగార్చుచున్న వాఁడనై, నిషిద్ధః-తొలఁగింపబడితిని. స్తనములవంటి రెండు పూగుత్తులతో నెదురుగా వంగియుండిన యీ పంపాతటము నందలి యశోకలతను జూచి నీవే యచ్చట నిలువఁబడియుంటివని యాలింగనము చేసికొనఁబోగా లక్ష్మణుఁడు "ఇచ్చట సీతలేదు, ఇది యశోకలత" యనిచెప్పి, నిజముతెలిసినమీదటఁ గన్నీరుఁగార్చుచున్న నన్ను అచ్చటినుండి తొలఁగించెను. అది, ఈయశోకశాఖ యని చెప్పెను.

శ్లో. అమూ ర్విమానాంతర లంబినీనాం
శ్రుత్వా స్వనం కాంచనకింకిణీనామ్,
ప్రత్యుద్వ్రజంతీవ ఖ ముత్పతంత్యో
గోదావరీ సారసపం క్తయ స్త్వామ్. 33

వ్యాఖ్య : విమానాంతరలంబినీనాం-విమానముయొక్క సందులలోనుండి వ్రేలాడుచున్న, కాంచనకింకిణీనాం-బంగారపుగజ్జెలయొక్క, స్వనం-చప్పుడును, శ్రుత్వా-విని, (తమజాతిగుంపు ధ్వని యను భ్రమచేత) ఖం-ఆకాశమును గుఱించి, ఉత్పతంత్యః-ఎగురుచున్న, అమూః-ఈ, గోదావరీ సారసపం క్తయః-గోదావరీ నదియందలి బెగ్గురు పక్షులు (కొంగలు), త్వాం, ప్రత్యుద్వ్రజంతి, ఇవ-నిన్ను యెదుర్కొనుచున్నట్లు ఉన్నవి. మనవిమానము గోదావరీనది ప్రాంతమునకు వచ్చినది యని చెప్పుటలో, సీతా! విమానపుసందులలో వ్రేలాడుచున్న సువర్ణకింకిణుల చప్పుడును తమజాతికొంగలేవో యలికిడి చేయుచున్నట్లు భావించి పైకెగురుచున్న యీ బెగ్గురుపక్షులు నీకు స్వాగతమును జెప్పుటకు వచ్చుచున్నట్లున్నవి సుమా! అన్నాడు. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. ఏషా త్వయా పేశలమధ్యయా ఽపి
ఘటాంబు సంవర్ధిత బాలచూతా,
ఆనందయ త్యున్ముఖ కృష్ణసారా
దృష్టా చిరాత్ పంచవటీ మనో మే. 34

వ్యాఖ్య : పేశలమధ్యయా, అపి-సుకుమారమైన నడుముగలదానవై నను, త్వయా-నీచేత, ఘటాంబు సంవర్ధిత బాలచూతా-ఘటాంబు-కడవలనీటినేత, సంవర్ధిత-పెంచబడిన, బాలచూతా-గుమ్మమామిడి చెట్లుగలదియు, ఉన్ముఖకృష్ణసారా-మనవైపు మొగములెత్తిచూచు మగలేళ్ళుగలదియు, చిరాత్-బహుకాలము తర్వాత, దృష్టా-మనచేజూడబడినదియునగు, ఏషా, పంచవటీ-ఈపంచవటి, మే, మనః-నామనస్సును, ఆనందయతి-ఆహ్లాదపరచుచున్నది బరువును మోయజాలని సుకుమారమధ్యము గలదానవై నను, కడవలతో గోదావరి జలమునుదెచ్చిపోసి, ప్రేమతో పెంచిన మామిడిమొక్కలు గలిగియుండినదియు, నీచేబెంచబడిన కృష్ణసారములు మొగములెత్తి మనవద్దికివచ్చి సౌభాగ్యముగలదియు నైయుండిన యీపంచవటి నెంత

కాలమునకుఁజూచితిమి సీతా! ఇది నామనస్సునెంతగానో యాహ్లాదపరచుచున్నది అని భావము.

శ్లో. అత్రానుగోదం మృగయానివృత్తః
తరంగవాతేన వినీతఖేదః,
రహస్త్వదుత్సంగ నిషణ్ణ మూర్ధా
స్మరామి వానీరగృహేషు సుప్తః. 35

వ్యాఖ్య : అత-ఈపంచవటియందు, అనుగోదం-గోదావరిసమీపమున, మృగయానివృత్తః-వేటనుండి మరలివచ్చినవాఁడనై, తరంగవాతేన-గోదావరి తరంగముల పైనుండివచ్చు గాలిచేత, వినీతఖేదః-తొలఁగింపఁ బడిన యలసటగల వాఁడనై, రహః-ఏకాంతమున, త్వదుత్సంగ నిషణ్ణమూర్ధా-త్వదుత్సంగ-నీతొడ యందు, నిషణ్ణ-ఉంచఁబడిన, మూర్ధా-శిరస్సుగలవాఁడనగుచు, వానీరగృహేషు-ప్రబ్బలిపొదలయందు, సుప్తః-నిద్రించియుండినని, స్మరామి-స్మరించుచున్నాను. ఈపంచవటివద్ది గోదావరియొడ్డుననున్న ప్రబ్బలిపొదలలో వేఁటనుండివచ్చి, తరంగ వాయువులు హాయినిఁ గూర్పఁగా నీతొడపైఁదలనుంచి నేను నిద్రించిన విషయము జ్ఞాపకమునకు వచ్చుచున్నది సీతా! "గోదా" గోదావరికి పర్యాయపదము.

శ్లో. భ్రూభేదమాత్రేణ పదా న్మఘోనః
ప్రభ్రంశయాం యో నహుషం చకార
తస్యా విలాంభఃపరిశుద్ధిహేతోః
భౌమో మునేః స్థానపరిగ్రహో ఽయమ్. 36

వ్యాఖ్య : యః-ఏముని, భ్రూభేదమాత్రేణ-కనుబొమ్మలు చిట్లించినమాత్ర ముచేతనే, నహుషం-నహుషుఁడను రాజును, మఘోనః, పదాత్-ఇంద్రునియొక్క పదవినుండి, ప్రభ్రంశయాంచకార-భ్రష్టునిగాఁజేసెనో, ఆవిలాంభఃపరిశుద్ధి హేతోఃఆ విలాంభఃకలుషితమగు జలముయొక్క పరిశుద్ధిహేతోః నిర్మ లత్వమునకుఁగారణుఁడయిన, తస్య, మునేః - ఆయగస్త్యమునియొక్క, భౌమఃభూమియందలిదగు, స్థానపరిగ్రహఃనివాసయోగ్యమగు నాశ్రమము, అయం-ఇది. ఏమునియొక్క క్రోధదృష్టి నహుషునిఁజేసినదో,

నక్షత్రరూపమున యేమని గగనమునందావిర్భవింపఁగా శరదృతువున నదీతటాకాది జలములన్నియు వర్షాకాలపుఁగాలుష్యమును బాసి నిర్మలములగునో, ఆ యగస్త్యముని "లోకకళ్యాణమునకై భూమిపై నేర్పరచుకొన్న నివాసమగు ఆశ్రమము ఇది, అని చెప్పెను. ఇంద్రపదవీగర్వితుఁడై మునులను, అగస్త్యుని నవమానించుటచే నహుషుని కగస్త్యుఁడు పదభ్రష్టుఁడగునట్లు శాపము నిచ్చెను. అగస్త్యనక్షత్రోదయము శరదృతువున జరుగుటయు జలము స్వచ్ఛముగా మారుటయు నేటికిని లోకానుభవసిద్ధము.

శ్లో. త్రేతాగ్నిధూమాగ్ర మనింద్యకీర్తేః
తస్యేద మాక్రాంతవిమానమార్గమ్,
ఘ్రాత్వా హవిర్గంధి రజోవిముక్తః
సమశ్నుతే మే లఘిమాన మాత్మా. 37

వ్యాఖ్య: అనింద్యకీర్తేః-ఉత్తమకీర్తిగల, తస్య-ఆయగస్త్యునియొక్క, ఆక్రాంతవిమానమార్గం-ఆక్రమింపఁబడిన మనవిమానమార్గము గలదియు, హవిర్గంధి-హుతద్రవ్యపరిమళము గలదియునగు, త్రేతాగ్నిధూమాగం-అగ్నిత్రయధూమముయొక్క శిఖాభాగమైన, ఇదం-దీనిని, ఘ్రాత్వా-ఆఘ్రాణించి, రజోవిముక్తః-రజోగుణముచేతవదలఁబడిన, మే, ఆత్మా-నాయంతఃకరణము లఘిమానం-లఘుత్వగుణమును, సమశ్నుతే-పొందుచున్నది. ఆయగస్త్యుని హోమధూమము మనమార్గమున వ్యాపించుటచేత దాని నాఘ్రాణించిన నామనస్సు రజోగుణవిముక్తమై తేలికపడినదని భావము. త్రేతాయనఁగా అగ్నిత్రయము. "అగ్నిత్రయమిదం త్రేతా" అని యమరము.

శ్లో. ఏత న్మనే ర్మానిని! శాతకర్ణేః
పంచాప్సరో నామ విహారవారి,
ఆభాతి పర్యంతవనం విదూరాత్
మేఘాంతరాలక్ష్య మివేందుబింబమ్. 38

వ్యాఖ్య: మానిని-ఓ సీతా! శాతకర్ణేః-శాతకర్ణి యను మునికి సంబంధించిన, పంచాప్సరః, నామ-పంచాప్సర మని పేరుఁబడసినదియు, పర్యంతవనం-

చుట్టును వనములు గలదియునగు, ఏతత్, విహారవారి-ఈ క్రీడా సరస్సు, విదూరాత్-ఎక్కువ దూరమునుండి, మేఘాంతరాలక్ష్యం-మేఘముల నడుమ కొంచముగా గనబడునట్టి, ఇందుబింబం, ఇవ-చంద్రబిబమువలె, ఆభాతి-ప్రకాశించు చున్నది. మేఘముల నడుమ నున్న చంద్రబింబమువలె దూరమునుండి వన మధ్యమున కొద్దిగా గనబడుచున్న యీ వెలగు "పంచాప్సర" మను పేరుగల శాతకర్ణి మునియొక్క క్రీడా సరోవరము సీతా! య చెప్పెను. "పంచ అప్సరసః యస్మిన్ తత్ పంచాప్సరః" అని విగహము చెప్పవలసిన బహువ్రీహి సమాస మిది.

శ్లో. పురా స దర్భాంకురమాత్రవృత్తిః
చరన్ మృగైః సార్ధ మృషి ర్మఘోనా,
సమాధిభీతేన కిలోపనీతః
పంచాప్సరోయౌవనకూటబంధమ్. 39

వ్యాఖ్య : పురా-పూర్వకాలమునందు, దర్భాంకురమాత్ర వృత్తిః-దర్భ మొలకలు మాత్రమే యాహారముగా గలవాడై, మృగైః, సార్ధం-లేళ్ళతోగూడి, చరన్-తిరుగుచుండిన (లేక దర్భను మేయుచుండిన), సఃఋషిః-ఆ శాతకర్ణిముని, సమాధిభీతేన-శాతకర్ణియొక్క తపస్సమాధివలన భయపడిన, మఘోనా-ఇంద్రుని చేత, పంచాప్సరోయౌవనకూటబంధం—పంచాప్సరో-అయిదుగురు అప్సర స్త్రీల యొక్క, యౌవన-యౌవనమనెడు, కూటబంధం-కూటయంత్రమును, ఉపనీతః, కిల-చేర్పబడెనని చెప్పదురు. ఘోర తపస్వియగు శాతకర్ణి మృగరూపమునుదాల్చి మృగములతో దిరుగుచు, దర్భాంకురమాత్ర భోజనముగలవాడై యుండగా నతని తపోనిష్ఠకు భయపడిన యింద్రుడు పంచాప్సర స్త్రీలను ఆడులేళ్ళ రూపముతో బంపి మృగమును బంధించినట్లే యా ఋషిని బంధించెనని ఐతిహ్యము గలదని చెప్పెను.

శ్లో. త స్యాయ మంతర్హితసౌధభాజః
ప్రసక్త సంగీత మృదంగ ఘోషః,
వియద్గతః పుష్పకచంద్రశాలాః
శ్రుణం ప్రతిశ్రున్ముఖరాః కరోతి. 40

వ్యాఖ్య : అంతర్హితసౌధభాజః—అంతర్హిత-జలాంతర్గతమైన, సౌధ-మేడను, భాజః-చేరియున్న, తస్య-ఆ శాతకర్ణియొక్క, అయం-ఈ, ప్రసక్త సంగీత మృదంగ ఘోషః—ప్రసక్త-ఎడతెగని, సంగీత-సంగీతమునకు సంబంధించిన, మృదంగఘోషః-మృదంగ ధ్వని, వియద్గతః (సన్)-ఆకాశమునుజేరిన దగుచు, పుష్పకచంద్రశాలాః-ఈ పుష్పక విమానముయొక్క శిరోగృహములను, క్షణం-క్షణకాలము, ప్రతిశ్రున్ముఖరాః—ప్రతిశ్రుత్-ప్రతిధ్వనులచేత, ముఖరాః-ధ్వనించువానినిగా, కరోతి-చేయుచున్నది. అప్సరసల చేతిలో జిక్కిన శాతకర్ణి జలాంతర్గత సౌధమున నివసించుచు నిరంతర సంగీత లోలుపుడై యుంటచేత నచ్చటి మృదంగ ధ్వని మన విమాన చంద్రశాలల యందు క్షణకాలము ప్రతిధ్వనించినది. "క్షణం" అని చెప్పుట విమాన మొకచోట నిలుచునది కాదు గావున. "చంద్రశాలా శిరోగృహమ్" అని హలాయుధ నిఘంటువు; "స్త్రీ ప్రతిశ్రుత్ ప్రతిధ్వానే" అని యమరము.

శ్లో. హవిర్భుజా మేధవతాం చతుర్ణాం
మధ్యే లలాటంతపస్తప్తిః,
అసౌ తపస్య త్యపర స్తపస్వీ
నామ్నా సుతీక్ష్ణ శ్చరితేన దాంతః. 41

వ్యాఖ్య : నామ్నా, సుతీక్ష్ణః-పేరుచేత సుతీక్ష్ణుడనియు, చరితేన,దాంతః-నడవడిచేత దాంతుడనియు ప్రసిద్ధుడైన, అసౌ-ఈ, అపరః,తపస్వీ, మరియొక ముని, ఏధవతాం-ఇంధనవంతములగు, చతుర్ణాం, హవిర్భుజాం-నాలుగగ్నుల యొక్క, మధ్యే-నడుమనుండి, లలాటంతపస్తప్తిః—లలాటంతప-ఫాల ప్రదేశమును మండించుచున్న, సప్తసప్తిః-సూర్యుడుగలవాడగుచు, తపస్యతి-తపస్సును జేయుచున్నాడు. పేరు సుతీక్ష్ణుడైనను ప్రవర్తనలో సౌమ్యుడైన యీ మరియొక ఋషి అగ్ని చతుష్టయ మధ్యగతుడై చూపును తీక్ష్ణ రవిబింబము పై నిలిపి తపస్సును జేయుచున్నాడు చూడుమని శాతకర్ణిని దాటివచ్చిన పిమ్మట జూపెను. "ఏధ" శబ్దమునకు కాష్ఠము, ఇంధనము అనునవి పర్యాయపదములు. "లలాటం తపతి ఇతి లలాటంతపః" అని విగ్రహము. "ఖశ్" ప్రత్యయాంత మగునీశబ్దమునకు "ఆరుర్ద్విష" దిత్యాది సూత్రముచేత నుమాగమము వచ్చి" లలాటంతపః" అనియైనది. లేనిచో "లలాట తప" అని కావలసియుండును. "సప్తసప్తిః" అనగా ఏడు గుఱ్ఱములు (రథము

నకు) గలవాఁడు, సూర్యుఁడు అని యర్థము. "దాంతః" అనఁగా దమము (ఇంద్రియ వాంఛలనణచుట) గలవాఁడు.

శ్లో. అముం సహాస ప్రహితేక్షణాని
వ్యాజార్ధ సందర్శిత మేఖలాని,
నాలం వికర్తుం జనితేంద్రశంకం
సురాంగనా విభ్రమ చేష్టితాని. 42

వ్యాఖ్య : జనితేంద్రశంకం-తపస్సుచేత నింద్రునికి సందేహమును బుట్టించిన, అముం-ఈసుతీక్ష్ణమునిని, సహాస ప్రహితేక్షణాని—సహాస-నవ్వులతో, ప్రహిత-పంపఁబడిన, ఈక్షణాని-చూపులుగలవియు, వ్యాజార్ధసందర్శిత మేఖలాని—వ్యాజ-ఏదేనొకనెపముతో, అర్ధసందర్శిత-సగము చూపఁబడిన, మేఖలాని-మొలనూళ్ళు గలవియునగు, సురాంగనా విభ్రమ చేష్టితాని-ఇంద్రుఁడు పంపిన దేవాంగనలవిలాస చేష్టితములు, వికర్తుం-వికారమునుజెందించుటకు, నాలం (న + ఆలం)-చాలలేదు. సుతీక్ష్ణముని తపస్సువలన తన యింద్రపదవి కేమిముప్పువచ్చునోయని యింద్రుఁడు పంపిన రంభాద్యప్సరసలు నవ్వులు, అనురాగవీక్షణములు, అర్ధదర్శిత నాభిప్రదేశములు గల శృంగార విలాసముల నెన్నిటినిఁజూపినప్పటికిని అవి యామునికిఁ జిత్తవికారమును గలిగింపలేకపోయెను. ఈముని చలింపలేదు.

శ్లో. ఏషో ఽక్షమాలావలయం మృగాణాం
కండూయితారం కుశసూచిలావమ్,
సభాజనే మే భుజ మూర్ధ్వబాహుః
సవ్యేతరం ప్రాధ్వ మితః ప్రయుంక్తే. 43

వ్యాఖ్య : ఊర్ధ్వబాహుః-ఎత్తినబాహువుగల, ఏషః-ఈసుతీక్ష్ణముని, అక్ష మాలావలయం-జపమాలయే కంకణముగాఁగలదియు, మృగాణాం-లేళ్ళను, కండూయితారం-గోకునదియు, కుశసూచిలావం-దర్భాంకురములను గోయునదిఁయు, సవ్యేతరం (సవ్య + ఇతరం) కుడిప్రక్కదియగు (సవ్యమనఁగా నెడమప్రక్క), భుజం-బాహువును, మే, సభాజనే-నాయొక్క సంమానమునకై, ఇతఃప్రాధ్వం-ఇచ్చట నానుకూల్యముగా నున్నదని, ప్రయుంక్తే-ప్రయోగించుచున్నాఁడు (చూపు

చున్నాడు). ఊర్ధ్వబాహువై కనబడుచున్న యీసుతీక్ష్ణముని, తన జపశీలత్వ, భూతదయావత్వ, కర్మక్షమత్వ ద్యోతకమగు దక్షిణబాహువును, ఇచ్చట సత్కారమును స్వీకరించి వెళ్ళవలసినదని నన్ను బలవంతపెట్టుచు, జూపుచున్నాడని తాత్పర్యము. "ప్రాధ్వం" ఇది యవ్యయము. ఆనుకూల్యార్థకం ప్రాధ్వమ్ అని యమరము.

శ్లో. వాచం యమత్వాత్ ప్రణతిం మమైష
కంపేన కించిత్ ప్రతిగృహ్య మూర్ధ్నః,
దృష్టిం విమానవ్యవధాన ముక్తాం
పునః సహస్రార్చిషి సంనిధత్తే. 44

వ్యాఖ్య : ఏషః-ఈసుతీక్ష్ణుడు, **వాచంయమత్వాత్**-మౌనవ్రతముగల వాడగుటవలన, మమ, ప్రణతిం-నానమస్కారమును, కించిత్-కొంచము **మూర్ధ్నః**, కంపేన-శిరఃకంపముచేత, ప్రతిగృహ్య-స్వీకరించి, విమానవ్యవధానముక్తాం-విమానముయొక్క యడ్డగింపువలన విడువబడిన, దృష్టిం-తన చూపును, పునః-మరల, సహస్రార్చిషి-సూర్యునియందు, సంనిధత్తే-చక్కగా నిలుపుచున్నాడు. ఈముని మౌనవ్రతముగలవాడగుటవలన నానమస్కారమును కొంచముగా తలయూపి స్వీకరించి, తన దృష్టికిని సూర్యునికిని మధ్యలోవచ్చిన మన విమానము ముందునకు సాగగానే మరలభాస్కరునిపై దనచూపును నిలిపెను సుమా! యన్నాడు. "వాచం యచ్ఛతి ఇతివాచం యమః" అని విగ్రహము.

శ్లో. అదః శరణ్యం శరభంగనామ్న
స్తపోవనం పావన మాహితాగ్నేః,
చిరాయ సంతర్ప్య సమిద్ధ రగ్నిం
యో మంత్రపూతాం తను మప్యహాసీత్. 45

వ్యాఖ్య : శరణ్యం-ఆశ్రయింపదగినదియు, పావనం-పవిత్రతగలిగించు నదియు, అదః-ఈ (కనపడుచున్న), తపోవనం-తపోవనము, ఆహితాగ్నేః-నిత్యాగ్నిహోత్రియగు, శరభంగనామ్నః-శరభంగుడను పేరుగల మునికి సంబంధించినట్టిది. యః-ఏ శరభంగ మహాముని,

చిరాయ బహుకాలము, అగ్నిం-అగ్నిహోత్రుని, సమిద్భిః-సమిధలచేత, సంతర్ప్య-తృప్తిపరచి, (పిమ్మట) మంత్రపూతాం-మంత్రములచేత శుద్ధమైన, తనుం, అపి-తన శరీరమును సైతము, అహౌషీత్-హోమముచేసెనో! చిరకాలము యజ్ఞ యాగ నిత్యాగ్ని కార్యములను సమిదాజ్యాది ద్రవ్యములతో చేసి, యగ్నిని తృప్తిపరిచి, చివరికి తన దేహమునే యగ్నిహోత్రునికి సమర్పించిన శరభంగ మహర్షికి సంబంధించిన పుణ్యాశ్రమ మిది యని సీతకు జూపెను. "అహౌషీత్" ఇది "హు-దానాదనయోః" అను ధాతువుయొక్క లుఙ్ రూపము.

శ్లో. ఛాయా వినీతాధ్వ పరిశ్రమేషు
భూయిష్ఠ సంభావ్య ఫలే ష్వమీషు,
తస్యాతిథీనా మధునా సపర్యా
స్థితా సుపుత్రేష్వివ పాదపేషు. 46

వ్యాఖ్య : అధునా-ఇప్పుడు (శరభంగముని యనంతరమున), తస్య-ఆ మునికి సంబంధించిన, అతిథీనాం, సపర్యా-అతిథులయొక్క సత్కారము, ఛాయా వినీతాధ్వపరిశ్రమేషు-నీడలచేత దొలగింపబడిన మార్గశ్రమగలవియు, భూయిష్ఠ సంభావ్య ఫలేషు-అధికములై మెచ్చదగిన ఫలములుగలవియునగు, అమీషు,పాద పేషు-ఈ యాశ్రమ వృక్షములయందు, సుపుత్రేషు, ఇవ-సత్పుత్రులయందువలె, స్థితా-ఉన్నది. ఆ శరభంగముని లేకపోయినను ప్రస్తుతకాలమున యిచ్చటికి వచ్చు నతిథులకు చల్లని నీడనిచ్చి మార్గాయాసమును దొలగించుచును, వలసిన ఫలములు పుష్కలముగా నిచ్చుచును ఆశ్రమ వృక్షములు అతిథి పూజను ఆ ముని సత్పుత్రులవలె నెరవేర్చుచున్నవి. ఇప్పుడును అతిథులిచ్చటికి వచ్చుచుందురు. సత్పుత్రులు తమ తండ్రి చేయుచుండిన సత్కార్యములను విడువరు.

శ్లో. ధారాస్వనోద్గారి దరీముఖో ఽసౌ
శృంగాగ్ర లగ్నాంబుద వప్రపంకః,
బధ్నాతి మే బంధురగాత్రి! చక్షుః
దృష్టః కకుద్మానివ చిత్రకూటః. 47

వ్యాఖ్య : ధారాస్వనోద్గారిదరీముఖః—ధారా–జలధారలయొక్క స్వనోద్గారి-ధ్వనిని వెలువరచుచున్న, దరీముఖః-దరియే ముఖముగా గలది యు, శృంగాగ్ర లగ్నాంబుద వ్రపపంకః—శృంగ-శిఖరమనెడు కొమ్మయొక్క, అగ్ర-చివరిభాగమునందు, లగ్న–చేరిన, అంబుదవ్రపపంకః-మేఘమనియెడు వ్రపక్రీడా కర్దమము గలదియునైన, అసౌ, చిత్రకూటః-ఈచిత్రకూట పర్వతము, బంధుర గాత్రి!–ఎత్తును వంపును గలదేహముగలదానా! (లేక యౌవనముచేత దిట్టములగు నవయవములు గలదానా!) దృప్తః-మదించిన, కకుద్మాన్, ఋష-వృషభమువలె, మే, చక్షుః-నాచూపును, బధ్నాతి-కట్టివేయుచున్నది. ఎడతెగని జలధారాధ్వనిగల కందరముతోను, శిఖరాగ్రమునందున్న మేఘముతోను యీచిత్రకూటము, అంకెలు వేయుచు, కొమ్మలకు కోరాడుటచేత అంటుకొన్న బురదగలిగి, మదించిన వృషభమువలె గన్పట్టుచు, నాదృష్టినిగ జలింపనీయకున్నది సుమా! అనగా దానివైపు నకే చూడమనసగుచున్న దని భావము. "బంధురంతూన్నతానతమ్" అని యమర కోశము.

శ్లో. ఏషా ప్రసన్న స్తిమిత ప్రవాహా
సరి ద్విదూరాంతరభావ తన్వీ,
మందాకినీ భాతి నగోపకంఠే
ముక్తావలీ కంఠగతేవ భూమేః. 48

వ్యాఖ్య : ప్రసన్న స్తిమిత ప్రవాహా-నిర్మలమై నిష్పందమైన ప్రవాహము గలదియు, విదూరాంతరభావతన్వీ-దూరాన లోతుననుండుటచేత చిన్నదిగా గాన నగు, మందాకినీ-మందాకిని పేరుతో చిత్రకూటమునంటి పాఱుచున్నట్టి, ఏషా, సరిత్-ఈనది, నగోపకంఠే-పర్వతప్రాంతమునందు, భూమేః-భూదేవికి, కంఠగతా-మెడపై నున్న, ముక్తావళీ, ఇవ-ముత్యాలదండవలె, భాతి-ప్రకాశించుచున్నది. నెమ్మదిగా ప్రవహించుచు దూరమున నుండుటచేత చిన్నదిగా గనబడు ఈ మందాకినినది చిత్రకూట ప్రాంతమున భూదేవి మెడలోని ముత్యాలహారమువలె నున్నది. ఇచ్చట చిత్రకూటమును భూదేవి శిరస్సునుగాను, తత్ప్రాంతమును కంఠమునుగాను భావింప వలయును. ఇది "మందాకిని" యను పేరుగల యొక చిన్ననది. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. అయం సుజాతో ఽనుగిరం తమాలః
ప్రవాల మాదాయ సుగంధి యస్య,
యవాంకురాపాండు కపోలశోభి
మయా ఽవతంసః పరికల్పిత స్తే. 49

వ్యాఖ్య : అనుగిరం-ఈచిత్రకూట పర్వత సమీపమున, సుజాతః-చక్కఁగాపుట్టిన, తమాలః-క్రొనుఁగచెట్టు (ఉలిమిరి, చీకటిమాను) అయం-ఇది. యస్య-ఏతమాలవృక్షముయొక్క, సుగంధి-మంచిపరిమళముగల, ప్రవాలం-చిగురును, ఆదాయ-తీసికొని, మయా-నాచేత, తే-నీకు, యవాంకురాపాండు, కపోల శోభీ-యవాంకురమువలె తెల్లనిదగు నీకపోలమునందు ప్రకాశించునట్టి, అవతంసః-కర్ణభూషణము, పరికల్పితః-కల్పింపఁబడియుండెనో! పరిమళవంతమగు దేనిచిగురును దెచ్చి నీకపోలమునందు అవతంసముగా మునుపునేను అలంకరించితినో ఆ తమాలవృక్షమే యీగిరి ప్రక్కననున్నది. "గిరేః సమీపే అనుగిరం" గిరేశ్చ సేనకస్య అనుసూత్రముచేత సమాసాంతమున "టచ్" ప్రత్యయము (అ) వచ్చి "అనుగిరం" అయినది.

శ్లో. అనిగ్రహత్రాస వినీత సత్త్వ
మపుష్పలింగాత్ ఫలబంధివృత్తుమ్,
వనం తపఃసాధన మేత దద్రేః
ఆవిష్కృతోదగ్రతర ప్రభావమ్. 50

వ్యాఖ్య : అనిగ్రహత్రాస వినీతసత్త్వం—అనిగ్రహత్రాస-దండభయము లేనివైనను, వినీత-వినయముగల (లొంగి క్రమశిక్షణమున మెలఁగునట్టి) సత్త్వం-శార్దూలాది జంతువులుగలదియు, అపుష్పలింగాత్-పుష్పరూప నిమిత్తములేకయే, ఫలబంధివృక్షం-పండ్లుపండునట్టి వృక్షములుగలదియు (కావుననే), ఆవిష్కృతోదగ్రతర ప్రభావం-ఆవిష్కృత-ప్రకటింపఁబడిన, ఉదగ్రతర-అత్యున్నతమైన, ప్రభావం-మహిమగల, అద్రేః-అద్రిమహాముని యొక్క, తపఃసాధనం-తపస్సునకుసాధనమగు, వనం—వనము, ఏతత్-ఇది. కొట్టుట, కోపగించుట లేకయే వినయవినమ్రములైన మృగము లిచ్చట సంచరించును. పూతపట్టకయే యిచ్చటి వృక్షములు ఫలములనిచ్చును కనుక మహామహిమగలదియని ప్రసిద్ధిఁజెందిన యీ

వనము అత్రిమహాముని యొక్క తపోవనము సుమా! యని రాముఁడు సీతకుఁ జెప్పెను.

శ్లో. అత్రా భిషేకాయ తపోధనానాం
సప్తర్షి హస్తోద్ధృత హేమపద్మామ్,
ప్రవర్తయామాస కిలా నసూయా
త్రిస్రోతసం త్ర్యంబక మౌలిమాలామ్. 51

వ్యాఖ్య : అత్ర-ఈ యత్రివనమునందు, అనసూయా-ఆత్రిభార్యయగు అనసూయాదేవి, సప్తర్షి హస్తోద్ధృత హేమపద్మాం-సప్తఋషుల చేతులతోఁ గోయఁబడిన బంగారు తామరలు గలదియు, త్ర్యంబక మౌలిమాలాం-శివునితలపైని పూలదండయునగు, త్రిస్రోతసం-గంగానదిని, తపోధనానాం-ఋషులయొక్క, అభిషేకాయ-స్నానముకొఱకై, ప్రవర్తయామాస, కిల-ప్రవహింపఁజేసె నందురు. పూర్వము అనసూయాదేవి యతిథులుగా వచ్చిన ఋషులందఱికిని స్నాన సౌకర్యార్థమై, స్వర్గవాహినియై సప్తర్షులు స్వయముగాఁ దెంపుకొను కనక కమలములు గలదియు, శివుని తలపై మల్లెదండగా మెఱయునదియు నగు గంగానదిని ఈ వనమునందుఁ ప్రవహించునట్లు చేసినదని పెద్దలు చెప్పుదురు. "త్రిస్రోతసం" స్వర్గ మర్త్య పాతాళ లోకములందుఁ ప్రవహించుటచేత "గంగ" త్రిపథగా అని వ్యవహరింపఁబడుచున్నదని యర్థము. "త్రీణి స్రోతాంసి యస్యాఃసా త్రిస్రోతాఃతాం త్రిస్రోతసం" అని వ్యుత్పత్తి.

శ్లో. వీరాసనై ర్ధ్యానజుషా మృషీణా
మమీ సమధ్యాసిత వేదిమధ్యాఃనివాత నిష్కంపతయా విభాంతి
యోగాధిరూఢా ఇవ శాఖినోఽపి. 52

వ్యాఖ్య: వీరాసనైఃవీరాసనములచేత, ధ్యానజుషాం-ధ్యానమును పొందిన, ఋషీణాం-ఋషులయొక్క (వారికి సంబంధించిన), సమధ్యాసితవేదిమధ్యాఃధ్యానవేదికల నడుమనున్న, అమీ, శాఖినఃఅపి-ఈ వృక్షములుసైతము, నివాత నిష్కంపతయా-గాలి లేనందున చలింపకుండుటచేత, యోగాధిరూఢాఃఇవ-

ధ్యానముచేయుచున్నవిలె, విభాంతి-ప్రకాశించుచున్నవి. తమ్రకింద ధ్యానమగ్నులై యున్న ఋషులకు సంబంధించిన వృక్షములు సైతము ఆ వేదికలపై గదలికలేక ధ్యాననిమగ్నములై యున్నట్లున్నవి. వీరాసన లక్షణమును "ఏకపాద మథైకస్మిన్ విన్యస్యోరుణి సంస్థితమ్, ఇతరస్మిన్ తథాచాన్యం వీరాసన ముదాహృతమ్" అని వసిష్ఠుడు చెప్పెను స్పష్టము.

శ్లో. త్వయా పురస్తా దుపయాచితో యః
సోఽయం వటః శ్యామ ఇతి ప్రతీతః,
రాశి ర్మణీనా మివ గారుడానాం
స పద్మరాగః ఫలితో విభాతి. 53

వ్యాఖ్య : త్వయా-నీచేత, పురస్తాత్-పూర్వము, యః-ఏది, ఉపయాచితః-ప్రార్థింపబడియుండెనో, శ్యామః, ఇతి, ప్రతీతః-"శ్యామ"మని ప్రసిద్ధినిఁజెందిన, సః, వటః, అయం-ఆ మఱ్ఱిచెట్టేయిది, ఫలితః-పండ్లు కలదియగుచు సపద్మరాగః-పద్మరాగమణులతోఁగూడిన (కెంపులతో), గారుడానాం-పచ్చలయొక్క, రాశిః, ఇవ-కుప్పవలె, విభాతి-ప్రకాశించుచున్నది. నా యరణ్యావాసముయొక్క ఆరంభమునందు, మనము ఈన్యగ్రోధవృక్షము (మఱ్ఱిచెట్టు) వద్దికి వచ్చినప్పుడు, నీ వీవనస్పతిని, వ్రత పరిపాలనమును నాథర్త నిర్వహించునట్లనుగ్రహింపుమని కోరియుంటివే ఆన్యగ్రోధమే యిది. రామాయణశ్లోకం: "న్యగ్రోధం తముపస్థాయ వైదేహీ వాక్య మబ్రవీత్ నమ స్తేఽస్తు మహావృక్ష! పాలయే న్మేవ్రతం పతిః". ఇప్పుడు పండ్లుకాచి, చూచుటకు పద్మరాగమణులు కలిసిన గరుడపచ్చల రాశివలెఁ గనపడుచున్నది! అని రాముఁడు సీతకుఁజెప్పెను. అలంకారము : ఉపమ.

శ్లో. క్వచి త్ప్రభాలేపిభి రింద్రనీలై ర్ముక్తామయీ యష్టిరి
వాను విద్ధా
అన్య త్రమాలా సితపంకజానా మిందీవరై రుత్ఖచింతాతరేవ. 54
క్వచి త్ఖగానాం ప్రియమానసానాం కాదంబసంసర్గవతీవ
పంక్తిః,
అన్యత్ర కాలాగురుదత్తపత్రా భక్తి ర్భువ శ్చందన
కల్పితేవ. 55

క్వచి త్ర్పభా చాంద్రమసీ తమోభి శ్ఛాయావిలీనై ఃశబలీకృతేవ,
అన్యత్ర శుభ్రా శరదభ్రలేఖా రంధ్రేష్వి వాలత్యనభఃప్రదేశా. 56
క్వచిచ్చ కృష్ణోరగభూషణేవ భస్మాంగరాగా తను రీశ్వరస్య,
పశ్యా నవద్యాంగి! విభాతి గంగా భిన్నప్రవాహా యమునాతరంగై ఃశ. 57

వ్యాఖ్య : హే అనవద్యాంగి!-ఓ చక్కని దేహముగలదానా! యమునాత రంగై ఃయమునానది తరంగములచేత, భిన్నప్రవాహా-వివిధరీతుల కలసిపాఱు చున్న, గంగా-ఈ గంగానది, క్వచిత్-ఒకచోట, ప్రభాలేపిభిఃకాంతిచేత యితర వస్తువులను పూ యు న ట్టి, ఇంద్రనీలై ఃఇంద్రనీలమణులచేత, అనువిద్ధా-కలిపి కూర్చఁబడిన, ముక్తామయీ, యష్టిఃఇవ-ముత్యాలహారమువలెను, అన్యత్ర-మరియొకచోట, ఇందీవరై ఃనల్లకలువలచేత, ఉత్ఖచితాంతరా-క్రుచ్చఁబడిన నడిమి భాగములుగల. సితపంకజానాం-తెల్లతామరపువ్వులయొక్క, మాలా, ఇవ-దండ వలెను, క్వచిత్-మరియొకచోట, కాదంబసంసర్గవతీ-నీలహంసల సంబంధముగల, ప్రియమానసానాం-ప్రియమైన మానస సరోవరముగలవియగు, ఖగానాం, పంక్తిఃఇవ-హంసలబారువలెను, అన్యత్ర-ఇంకొకచోట, కాలాగురుదత్తపత్రా-అగురు చేత వ్రాయఁబడిన మకరికాదిపత్రరచనలుగల, భువఃభూదేవియొక్క, చందన కల్పితా-శ్రీగంధముచేతఁబూయఁబడిన, భక్తిఃఇవ-మైపూఁతవలెను, క్వచిత్-ఒక చోట, ఛాయావిలీనై ఃనీడలయందు దాగిన, తమోభిఃచీకట్లచేత, శబలీకృతా-బూడిదవర్ణముకలదిగాఁ జేయఁబడిన, చాంద్రమసీ-చంద్రసంబంధినియగు, ప్రభా, ఇవ-కాంతివలెను (వెన్నెలవలెననియర్థము), అన్యత్ర-మరియొకచక్కన, రంధ్రేషు-రంధ్రములయందు, ఆలక్ష్యనభఃప్రదేశా-కనఁబడు గగనఖండములుగల, శుభ్రా, శరదభ్రలేఖా, ఇవ-తెల్ల నిశరత్కాలమేఘపంక్తివలెను, క్వచిత్-ఇంకొకస్థలమున, కృష్ణోరగభూషణా-కృష్ణసర్పము భూషణముగాఁగలిగి, భస్మాంగరాగా-భస్మమును మైపూఁతగాఁచేసికొన్న, ఈశ్వరస్య, తనుఃఇవ-శివునిదేహమువలెను, విభాతి-ఎంతయోచక్కఁగా ప్రకాశించుచున్నది, పశ్య-చూడుము. ఓసీతా! అటుచూడు, ఆ గంగానది యమునాతరంగమిళితయై యీ ప్రయాగతీర్థమునం దెంతమనోహర ముగాఁ ప్రవహించుచున్నదో! ఒకచోట, ఇంద్రనీలాలతోఁ గలిపిక్రుచ్చిన ముత్యాల హారమువలెను, మరియొకచోట, నల్లకలువలుచేర్చి కూర్చిన తెల్లతామరలదండ

వలెను, ఇంకొక ప్రదేశమున కాదంబపక్షులతో జేరిన రాజహంసల బారుల తీరునను, మరియొక్కచోట గంధలేపనము చేసిన భూదేవి శరీరముపై రచించిన కాలాగురుపత్రచనల బోలియు, ఇంకొకతావున వృక్షకుడ్యాది ఛాయలలో దాగిన చీకట్లతో గూడిన వెన్నెలవలెను, మరియొక్క-చోట రంధ్రములందు గన్పట్టు నాకాశభాగములుగల శరత్కాల మేఘపంక్తిని బోలియు, వేరొక్కచోట కృష్ణసర్పములను ధరించిన భస్మానులిప్తశివశరీరము తీరునను గనబడుచున్నదికదూ! అని గంగా యమునా సంగమ ప్రదేశమును రాముడు వర్ణించి చెప్పెను. ఇట్లు నాలుగు శ్లోకములను ఒకే మహావాక్యముగా గూర్చుటకు "కలాపకమ్" అని పేరు సర్వత్ర ఉపమాలంకారములే యని యెఱుగవలెను.

శ్లో. సముద్రపత్న్యా ర్జలసంనిపాతే
పూతాత్మనా మత్ర కిలాభిషేకాత్,
తత్త్వావబోధేన వినాపి భూయ
స్తనుత్యజాం నాస్తి శరీరబంధః. 58

వ్యాఖ్య : అత్ర-ఇచ్చట, సముద్రపత్న్యాః-సముద్రుని భార్యలగు గంగా యమునలయొక్క, జలసంనిపాతే-జలసంగమమునందు, అభిషేకాత్-స్నానము చేయుటవలన, పూతాత్మనాం-శుద్ధమైన శరీరమానసములు గలవారై, తనుత్యజాం-శరీరమును విడిచిన పురుషులకు, తత్త్వావబోధేన, వినా, అపి-ఆత్మతత్త్వజ్ఞానము లేకపోయినను, భూయః-మరల (ప్రస్తుత ప్రారబ్ధ శరీరమును విడిచిన పిమ్మట), శరీరబంధః-శరీరము కలుగుట, నాస్తికిల-లేదుసుమా! ఈ గంగా యమునా సంగమ ప్రదేశమున స్నానమును జేసినవారికి ఆత్మతత్త్వజ్ఞానము లేకపోయినను పునర్జన్మరహితమగు మోక్షము లభించును. "అన్యత్ర జ్ఞానాదేవ ముక్తిః, అత్రతు స్నానాదేవ ముక్తిః" అని పెద్దల యభిప్రాయమని భావము.

శ్లో. పురం నిషాదాధిపతే రిదం తత్
యస్మిన్ మయా మౌలిమణిం విహాయ,

జటాసు బద్ధా స్వరుద త్సుమంత్రః
"కై కేయి! కామాః ఫలితా స్తవేతి." 59

వ్యాఖ్య : నిషాదాధిపతేః-బోయలదొరయగు గుహు యొక్క, తత్,పురం-అప్పుడు మనము చూచిన పట్టణము. ఇదం-ఇదియే. యస్మిన్-దే యందు, మయా-నాచేత, మౌలిమణిం, విహాయ-రాజచిహ్నమగు మణి కిరీటమును దీసివేసి, జ టాసు, బద్ధాసు (సతీషు)-జడలు ధరింపబడినవి కాగా, సుమంత్రః-సుమంత్రుడు, "హే కైకేయి-ఓ కైకా! తవ, కామాః-నీ కోరికలు, ఫలితాః, ఇతి-సఫలములైన వనుచు, అరుదత్-దుఃఖి చెనో! ఇది గుహుని పక్కణము, ఇచ్చటనే నేను రాజ చిహ్నమగు మణికిరీటమును త్యజించి జటాధారినికాగా జూచి సుమంత్రుడు "కైకా! నీ దుష్టవాంఛితములు ఫలించినవనుచు" నేడ్చెనుగదా!

శ్లో. పయోధరైః పుణ్యజనాంగనానాం
నిర్విష్ట హేమాంబుజ రేణు యస్యాః,
బ్రాహ్మం సరః కారణ మాప్తవాచో
బుద్ధేరివాన్యక్త ముదాహరంతి. 60

వ్యాఖ్య : పుణ్యజనాంగనానాం-యక్షస్త్రీలయొక్క, పయోధరైః- స్తనముల చేత, నిర్విష్ట హేమాంబుజరేణు—నిర్విష్ట-ఉపభోగింపబడిన, హేమాంబుజ-బంగారు కమలములయొక్క, రేణు-పరాగములదియగు, బ్రాహ్మం, సరః-బ్రహ్మకు సంబంధించిన మానససరోవరము, యస్యాః-ఏ సరయూనదికి, బుద్ధేః-మహత్తత్త్వమునకు, అవ్యక్తం, ఇవ-ప్రధానము (ప్రకృతి) వలె, కారణం-ఉత్పత్తికి కారణమని, ఆప్త వాచః-వేదవాక్కులు, లేదా మునులు, ఉదాహరంతి-చెప్పుచున్నారో! జలక్రీడలాడు చున్న యక్షాంగనల స్తనములచేత ననుభవింపబడు సువర్ణకమల పరాగముగల మానస సరోవరము సరయూనది పుట్టుకకు కారణమని మహామునులు చెప్పుదురు అది అవ్యక్తమువల్ల మహత్తత్త్వము పుట్టునని చెప్పు సాంఖ్యదర్శన వచనములను విశ్వసించునట్లు, ఆప్తవాక్కులవలన, సరయూజన్మకు మానస సరస్సు అంతర్గత, పరోక్షకారణమని నమ్మవలెనుగాని ప్రత్యక్షగోచరముకాదని భావము.

శ్లో. జలాని యా తీరనిఖాతయూపా
వహ త్యయోధ్యా మను రాజధానీమ్,

తురంగమేధా వభృథా వతీర్ణైః
ఇక్ష్వాకుభిః పుణ్యతరీకృతాని. 61

వ్యాఖ్య : తీరనిఖాతయూపా—తీరనిఖాత–ఒడ్డునపాతఁబడిన, యూపా-మంత్రసంస్కారయుక్త యజ్ఞపశుబంధన స్తంభములుగల, యా–ఏ సరయూనది, తురంగమేధావభృథావతీర్ణైః-అశ్వమేధయాగములందు అవభృథస్నానార్థమై దిగినట్టి, ఇక్ష్వాకుభిః-ఇక్ష్వాకు వంశీయులగు మాపూర్వులచేత, పుణ్యతరీకృతాని-పవిత్ర తరములుగాఁ జేయఁబడిన, జలాని–ఉదకములను, అయోధ్యాం, రాజధానీం, అను-అయోధ్యానగర సమీపమున, వహతి-ప్రవహించునో! తీరమున యూప స్తంభములు గలిగి, అశ్వమేధయాగ సమయము లందవభృత స్నానార్థమై దిగిన మాపూర్వుల చేత ద్విగుణీకృత పవిత్రతను సంపాదించుకొన్న జలములను అయోధ్యా సమీపమున బారునట్లు చేయుచున్న సరయూనది యిది యనిభావము. ఇక్ష్వాకురాజులెవ్వరును జేయనన్ని యశ్వమేధయాగములుచేసి రనటకీసరయూనది సాక్ష్యముగానున్నదని యభిప్రాయము.

శ్లో. యాం సైకతోత్సంగసుఖోచితానాం
ప్రాజైశ్యైః పయోభిఃపరివర్ధితానామ్,
సామాన్యధాత్రీ మివ మానసం మే
సంభావయ త్యుత్తరకోసలానామ్. 62

వ్యాఖ్య : యాం-ఏసరయూనదిని, మే, మానసం-నామనస్సు, సైకతోత్సంగ సుఖోచితానాం-సైకతోత్సంగ-ఇసుకతిన్నెయను నొడియందలి, సుఖ-ఆనందమునకు, ఉచితానాం–తగినవారును, ప్రాజైశ్యైః–ఆధికములైన, పయోభిః-ఉదకములచేత (క్షీరములచేతనని యర్థాంతరము), పరివర్ధితానాం-పోషింపఁబడిన వారునునగు, ఉత్తరకోసలానాం-ఉత్తరకోసలదేశ ప్రభువులకు, సామాన్యధాత్రీం, ఇవ-అందఱికిని సమానయగు పెంపుడుతల్లిని (దాదిని) వలె, సంభావయతి-గౌరవించుచున్నది. దీని యిసుకతిన్నెలపై తల్లియొడిలోవలె సుఖపడుచు, క్షీరసదృశమగు జలమునుత్రాగి, పుష్టినిఁబొందిన మాయుత్తరకోసలాధిపతులందఱికిని యీ సరయువు దాది వంటిదన్న భావముతో నా మనస్సినదిని గౌరవించుచున్నది సీతా!

అన్నాఁడు. "ఉత్తరకోసలానాంరాజానఃఉత్తరకోసలాఃతద్రాజస్య "ఇత్యాది సూత్రముచేత తద్ధిత ప్రత్యయమునకు లోపమువచ్చును. ధాత్రీశబ్దమునకు "జనని, ఆమలకీ, వసుమతీ, ఉపమాతా" అర్థములని విశ్వకోశము. అలంకారము: ఉపమ.

శ్లో. సేయం మదీయా జననీవ తేన
మాన్యేన రాజ్ఞా సరయూ వియుక్తా,
దూరే వసంతం శిశిరానిలై ర్మాం
తరంగహస్తైరుపగూహతీవ. 63

వ్యాఖ్య : మదీయా, జననీ, ఇవ-మాతల్లియగు కౌసల్యవలెనే, మాన్యేన-పూజ్యుడగు, తేన, రాజ్ఞా-స్వర్గతుఁడైన యాదశరథునిచేత, వియుక్తా-విడువఁబడిన, సేయం (సా + ఇయం), సరయూఃఇంతవఱకు నాచేత నుల్లేఖింపఁబడిన సరయూ నది, దూరే, వసంతం-దూర పదేశమునకుండిన, మాం-పుత్రభూతుఁడనైన నన్ను శిశిరానిలైఃచల్లనిగాలితోఁగూడిన, తరంగహస్తైఃతరంగములనెడి చేతులతో, ఉపగూహతి, ఇవ-ఆలింగనము చేసికొనుచున్నదివలె నున్నది. మాతల్లి కౌసల్యవలెనే స్వర్గతుఁడైన పతిదండిచేత వియుక్తురాలైన యీ సరయూనది భర్తృ దుఃఖము చేతను, దూరస్థుఁడనై యుండిన నావలని పుత్రదుఃఖముచేతను బాధపడుచుండి నదియై యిప్పుడు తిరిగి వచ్చుచున్న నన్ను చల్లని తరంగ హస్తములతో దగ్గఱికిఁ జేర్చుకొనుచున్నట్లున్నది. అలంకారము : రూపకాను ప్రాణితమగు నుత్ప్రేక్ష.

శ్లో. విరక్తసంధ్యాకపిశం పురస్తాత్
యతో రజఃపార్థివ మూర్జిహీతే,
శంకే హనూమత్కథిత ప్రవృత్తిః
ప్రత్యుద్గతో మాం భరతఃసైన్యైఃసహ. 64

వ్యాఖ్య : విరక్తసంధ్యాకపిశం--విరక్త-తక్కువ యెఱ్ఱదైన, సంధ్యా-సంధ్యారాగమువలె, కపిశం-ఎఱుపు నలుపు కలిసిన వర్ణముగల, పార్థివం, రజఃభూసంబంధమైన ధూళి, పురస్తాత్-మనయెదుట, యతఃఏకారణమువలన, ఊర్జిహీతే-ఎగయుచున్నదో! (తస్మాత్-ఆకారణమువలన) హనూమత్కథిత ప్రవృత్తిః-హనుమంతునిచేతఁజెప్పఁబడిన మన యాగమనవార్తగల, భరతఃభరతుఁడు,

ససైన్యః (సన్)-సైన్య సహితుఁడగుచు, మాం, ప్రత్యుద్గతః-నన్ను స్వాగతించుచున్నాఁడని, శంకే-ఊహించుచున్నాను. ఎదురుగాఁచిన ధూళివలన, మనము వచ్చుచున్నవార్తను ముందుగా నాచేఁబంపఁబడిన హనుమంతుఁడు చెప్పఁగా విన్న భరతుఁడు సైన్యసమేతుఁడై మననెదుర్కొని తీసుక వెళ్ళుటకు వచ్చున్నాఁడని భావింతును. "హనూమాన్" హనుః-అస్య ఆస్తితి హనూమాన్. అని విగ్రహము. "శరాదీనాంచ" అనుసూత్రముచేత "హను" శబ్దము శరాది గణపఠితమగుటచేత దీర్ఘము వచ్చి "హనూ" అయినది. "విరక్త" సంధ్యాకపిశం" అనునది రజస్సునకు (ధూళికి) విశేషణము. "విరక్త" పదమునకు "అతిరక్తాయాసంధ్యా" అని మల్లినాథుఁడు వ్రాయుటచేత నేను "తక్కువ యెఱ్ఱనైన" యని అర్థమును వ్రాసితిని. "అతిక్రాంతా రక్తం" అని యప్పుడు విగ్రహము. "ప్రకర్షే లంఘనే ప్యతి" అని యమరము "అతి" కి లంఘనార్థమును సైతము చెప్పెను.

శ్లో. అద్ధా శ్రియం పాలితసంగరాయ
ప్రత్యర్పయిష్య త్యనఘాం స సాధుః,
హత్వా నివృత్తాయ మృధే ఖరాదీన్
సంరక్షితాం త్వా మివ లక్ష్మణో మే. 65

వ్యాఖ్య : సాధుః, సః-సజ్జనుఁడైన యాభరతుఁడు, పాలితసంగరాయ-నెఱవేర్చఁబడిన పితృ ప్రతిజ్ఞగల మే-నాకొఱకు, అనఘాం-దోషరహితయై, సంరక్షితాం-కాపాడఁబడినదియగు, శ్రియం-రాజ్యలక్ష్మిని, మృధే-యుద్ధమునందు, ఖరాదీన్-ఖరదూషణాదులను, హత్వా-చంపి, నివృత్తాయ-తిరిగివచ్చిన, మే-నాకొఱకు, లక్ష్మణః-లక్ష్మణుఁడు త్వాం, ఇవ-దోషరహితవై, సంరక్షితవైన నిన్నువలె, ప్రత్యర్పయిష్యతి-తిరిగి సమర్పింపఁగలఁడు. అద్ధా-సత్యము(తప్పదు). సజ్జనుఁడైన భరతుఁడు తానేమాత్రమును అనుభవింపక కేవలము సంరక్షించిన రాజ్యలక్ష్మిని తండ్రి ప్రతిజ్ఞను నెఱవేర్చివచ్చిన నాకు, పూర్వమరణ్యమున ఖరాదులను యుద్ధమునఁజంపి తిరిగివచ్చిన నాకు లక్ష్మణుఁడు నిన్నుకాపాడి యప్పగించినట్లు, తప్పక సమర్పింపఁగలఁడని భావించుచున్నాను. "సంగర" మనఁగా ప్రతిజ్ఞ. రాజ్యలక్ష్మికి సీత నుపమానముగాఁజెప్పుట భరతుఁడు రాజ్యసుఖ మిసుమంతయు ననుభవింపక రాముని రాజ్యమును రామునికే ప్రత్యర్పణముఁజేయుననుటకే. అలంకారము: దృష్టాంతము. "తత్త్వేత్యద్ధా" అనియమరము. "అద్ధా" అనునది అవ్యయము.

శ్లో. అసౌ పురస్కృత్య గురుం పదాతిః
పశ్చా దనస్థాపితవాహినీకః,
వృద్ధై రమాత్యై్యః సహ చీరవాసాః
మా మర్ఘ్యపాణి ర్భరతో ఽభ్యుపైతి. 66

వ్యాఖ్య : అసౌ-ఇతఁడే, పదాతిః-పాదచారియు, చీరవాసాః-వల్కల వస్త్రముగలవాఁడునగు, భరతః-భరతుఁడు, పశ్చాత్-తనవెనుక, అవస్థాపితవాహినీకః-ఉంచుకోఁబడిన సేనగలవాఁడగుచు, గురుం-మాకులగురువగు వసిష్ఠుని, పురస్కృత్య-తనముందుంచుకొనిఁ, వృద్ధైః, అమాత్యైఃసహ-పెద్దలయిన మంత్రులతో పాటు, అర్ఘ్యపాణిఃసన్-పూజాద్రవ్యములను చేతులయం దుంచుకొన్నవాఁడగుచు, మాం-నన్ను, అభ్యుపైతి-ఎదురొక్కన వచ్చుచున్నాఁడు. వల్కలధారియుఁ బాదచారియు నగుభరతుఁడు సైన్యమును వెనుకవచ్చుటకు నియోగించి వసిష్ఠమహర్షిని ముందుంచుకొని పూజాద్రవ్యములను మంత్రులయుక్తముగాఁబుచ్చుకొని నాకు స్వాగతముఁజెప్పుట కదిగో! వచ్చుచున్నాఁడు చూడుము! అని సీతకుఁ జెప్పెను. పూజావస్తువులను మంత్రులుసైతము పట్టుకొని యుండిరని భావము.

శ్లో. పిత్రా విసృష్టాం మదపేక్షయా యః
శ్రియం యువా ప్యంకగతా మభోక్తా,
ఇయంతి వర్షాణి తయా సహోగ్ర
మభ్యస్యతీవ వ్రత మాసిధారమ్. 67

వ్యాఖ్య : యఃఏభరతుఁడు, పిత్రా-తండ్రిచేత, విసృష్టాం-ఇయ్యఁబడినదియై, అంకగతాం, అపి-ఒడినిఁజేరినదియైనను, శ్రియం-రాజ్యలక్ష్మినిఁ యువా-యువకుఁడైకూడ, మదపేక్షయా-నాయందలిభక్తిచేత, అభోక్తాసన్-అనుభవింపక యున్నవాఁడగుచు, ఇయంతి, వర్షాణి-ఇన్నిసంవత్సరములు, తయాసహ-ఆరాజ్యలక్ష్మితోఁగూడ, ఉగ్రం-కఠినమైన, ఆసిధారం-ఆసిధారమనుపేరుగల, వ్రతం-వ్రతమును, అభ్యస్యతి, ఇవ-నటుపుచున్నాఁడువలెనున్నాఁడో. తండ్రిచేత నీయఁబడి తనవద్దికి వచ్చిన రాజ్యలక్ష్మిని యువకుఁడైయుండియు భరతుఁడు, తన తొడపైకి వచ్చిన ప్రియురాలిని అనుభవింపఁదలపని యువకునివలె, నాయందలి

భక్తిచేత భోగింపకయున్నాడనగా నితడిన్ని సంవత్సరాలామెతోడగలసి "ఆసిధారావ్రతము" నాచరించుచున్నట్లున్నది. "పితావిస్మృష్ట" తండ్రియిచ్చినదికనుక ధర్మవిరుద్ధముగాని, న్యాయవిరుద్ధముగాని కాదని యర్థము. "అంకగతాం" స్వయముగా ప్రేమించినట్టిది. ఇట్టిరాజ్యశ్రీని అనుభవించకుండుట "ఆసిధారావ్రతము" కాదా? "యువా యువత్యాసార్ధంయత్ ముగ్ధభర్తృవ దాచరేత్, ఆతర్వ్యావృత్త సంగః స్యాత్ ఆసిధారావ్రతం హి తత్" అని యాదవ నిఘంటువు నిర్వచించెను. స్త్రీభోగము నెఱుగని మూర్ఖునివలె "నాతిగల బ్రహ్మచర్యమును బాటించుట యని యర్థము. అసిధారా—కత్తియంచు. దానిపై నడుచుటవంటి దగుటచేత దీనిని "ఆసిధారావ్రతం" అన్నారు.

శ్లో. ఏతావ దుక్తవతి దాశరథౌ తదీయా
మిచ్ఛాం విమాన మధిదేవతయా విదిత్వా,
జ్యోతిష్పథా దవతతార సవిస్మయాభి
రుద్వీక్షితం ప్రకృతిభి ర్భరతానుగాభిః. 68

వ్యాఖ్య : దాశరథౌ-రాముడు, ఏతావత్-ఇంతమాత్రము, ఉక్తవతి-వచించినవాడుకాగానే, విమానం-పుష్పకము, తదీయాం, ఇచ్ఛాం-రామునికోరికను, అధిదేవతయా—తనయధిదేవతచేత, విదిత్వా—తెలిసికొని, సవిస్మయాభిః-ఆశ్చర్యముగలవారై, భరతానుగాభిః-భరతునివెంటవచ్చుచున్న, ప్రకృతిభిః—ప్రజలచేత, ఉద్వీక్షిత (సత్)—తలలెత్తి చూడబడుచున్నదగుచు, జ్యోతిష్పథాత్-ఆకాశమునుండి, అవతతార-దిగెను. రాముడు తననెదిరొక్కనుటకు భరతుడువచ్చుచున్నాడని యనగానే, రామునికోరికను తనయధిదేవతచేసిన సంజ్ఞద్వారా తెలిసికొన్న పుష్పకవిమానము భరతునివెంట వచ్చిన అయోధ్యాపురజను లాశ్చర్యముతో జూచుచుండగా నేలపైకిదిగె నని భావము. "జ్యోతిష్పథ" మనగా నక్షత్రమార్గము, ఆకాశమనియర్థము.

శ్లో. తస్మా త్ప్రరాసర విభీషణ దర్శితేన
సేవావిచక్షణ హరీశ్వరదత్త హస్తం,
యానా దవాతర దదూరమహీతలేన
మార్గేణ భంగిరచిత స్ఫటికేన రామః. 69

వ్యాఖ్య : రామః-శ్రీరాముఁడు, సేవావిచక్షణ హరీశ్వరదత్తహస్తః-సేవావిచక్షణ–సేవించుటయందునేర్పరియగు, హరీశ్వర-కపిరాజైన సుగ్రీవుని చేత, దత్తహస్తః–ఇయ్యఁబడిన హస్తావలంబము గలవాఁడగుచు, పురఃసర విభీషణదర్శితేన–పురస్సర-ముందునడచుచున్న, విభీషణదర్శితేన-విభీషణునిచేతఁజూపబడినదియు, ఆదూరమహీతలేన-ఆసన్నమైన భూప్రదేశముగలదియు, భంగిరచితస్ఫటికేన-మెట్లుగాఁగట్టఁబడిన స్ఫటికశిలలు గలదియునగు, మార్గేణ–సోపానమార్గముద్వారా, తస్మాత్, యానాత్-ఆపుష్పకవిమానమునుండి, అవాతరత్-దిగెను. సుగ్రీవునిచేతిని యవలంబముగాఁబట్టుకొని, విభీషణుఁడు చూపుచున్న స్ఫటికసోపాన మార్గముగుండా రాముఁడు పుష్పకవిమానమునుండి నేలపైకి దిగెనని భావము. "అవాతరత్" తృ-ప్లవనతరణయోః (తగతి) అనుధాతువునకు "లఙ్" రూపము.

శ్లో. ఇక్ష్వాకువంశగురవే ప్రయతః ప్రణమ్య
స భ్రాతరం భరత మర్ఘ్యపరిగ్రహాంతే,
పర్యశ్రు రస్వజత మూర్ధని చోపజఘ్రౌ
తద్భక్త్యపోఢ పిత్ర్యరాజ్య మహాభిషేకే. 70

వ్యాఖ్య: ప్రయతః-శాస్త్రవిధి ననుసరించిన, సః-ఆరాముఁడు, ఇక్ష్వాకువంశగురవే-ఇక్ష్వాకుల కులగురువగు వసిష్ఠునికొఱకు (వసిష్ఠునికి), ప్రణమ్య-నమస్కరించి, అర్ఘ్యపరిగ్రహాంతే-తాను అర్ఘ్యమును స్వీకరించిన పిమ్మట, పర్యశ్రుః-ఆనందబాష్పములు గలవాఁడగుచు, భ్రాతరం, భరతం-తమ్ముఁడగు భరతుని, అస్వజత్-ఆలింగనముచేసికొనెను, తద్భక్త్యపోఢ పిత్ర్యరాజ్య మహాభిషేకే తద్భక్తి-ఆరామునియందలి భక్తిచేత, అపోఢ-పరిహరింపఁబడిన, పిత్ర్యరాజ్య-తండ్రిరాజ్యమునందలి, మహాభిషేకే-పట్టాభిషేకముగల, మూర్ధని-శిరస్సునందు, ఉపజఘ్రౌచ-వాసనచూచెను (మూర్కొనెను) గూడ. అట్లు విమానము దిగిన రాముఁడు, యథాశాస్త్రముగా వసిష్ఠునికి నమస్కరించి, భరతుఁడిచ్చిన యర్ఘ్యమును స్వీకరించిన పిమ్మట, ఆనందాశ్రుముఖుఁడై భరతునిఁగౌఁగిలించుకొని, తనయందలి భక్తిచేత పట్టాభిషేకమునొల్లని యతనితలను ప్రేమతో మూర్కొనె నని భావము.

శ్లో. శ్మశ్రుప్రవృద్ధి జనితానన విక్రియాంశ్చ
ప్లక్ష్ణా ప్రరోహజటిలానివ మంత్రివృద్ధాన్
అన్వగ్రహీత్ ప్రణమతః శుభదృష్టిపాతైః
వార్తానుయోగ మధురాక్షరయా చ వాచా. 71

వ్యాఖ్య: శ్మశ్రుప్రవృద్ధి జనితానన విక్రియా, చ-మీసములు గడ్డముల యొక్క పెరుగుదలచేత కలిగిన ముఖవికారముగలవారై, ప్రరోహజటిలా-ఊడల చేత జటాధారులై యున్న, ప్లక్ష్ణా, ఇవ (స్థితా)-వటవృక్షములవలె నుండినవారై, ప్రణమతః-నమస్కరించుచున్న, మంత్రివృద్ధా, చ-వృద్ధమంత్రులను సైతము, శుభదృష్టిపాతైః-చల్లనిచూపులచేతను, వార్తానుయోగ మధురాక్షరయా-కుశల ప్రశ్నములయందలి మధురాక్షరములుగల, వాచా, చ-వాక్కుచేతను, అన్వగ్రహీత్-అనుగ్రహించెను. భరతునిఁగౌఁగిలించుకొన్న పిమ్మట, రాముఁడు పెద్దలయిన వృద్ధమంత్రులు నమస్కరింపఁగా, వారిని ప్రేమార్ద్ర దృష్టిచేతను, కుశల ప్రశ్నల చేతను అనుగ్రహించి గౌరవించెనని భావము. ఊడలు దిగిన మర్రిచెట్లను మంత్రుల కుపమానముగాఁ జెప్పుట వారియాకారముతోఁ బాటు లోకానుభవ విశేషమును సైతము చెప్పుటకేయని తెలియవలెను. అలంకారము: ఉపమ.

శ్లో. దుర్జాతబంధు రయ మృక్షహరీశ్వరో మే
పౌలస్త్య ఏష సమరేషు పురఃప్రహర్తా,
ఇత్యాదృతేన కథితౌ రఘునందనేన
వ్యత్క్రమ్య లక్ష్మణ ముభౌ భరతో వవందే. 72

వ్యాఖ్య: అయం-ఇతఁడు, మే-నాయొక్క, దుర్జాతబంధుః-ఆపద్బాంధవుఁడగు, ఋక్షహరీశ్వరః-భల్లూకములకు వానరములకు ప్రభువైన సుగ్రీవుఁడు, ఏషః-ఈతఁడు, సమరేషు-యుద్ధములయందు, పురఃప్రహర్తా-ముందుకు దూకునట్టి (వీరాగ్రణియగు), పౌలస్త్యః-విభీషణుఁడు. ఇతి-ఇట్లు, ఆదృతేన-ఆదరవంతుఁడగు, రఘునందనేన-రామునిచేత, కథితౌ-చెప్పఁబడిన, ఉభౌ-సుగ్రీవ విభీషణులు నిద్దఱిని, లక్ష్మణా-తమ్ముఁడైనను లక్ష్మణుని, వ్యత్క్రమ్య-దాటవేసి, భరతః-భరతుఁడు,వవందే-నమస్కరించెను రాముని కాపద్బాంధవులైన సుగ్రీవ విభీషణులకు భరతుఁడు తమ్ముఁడైనను లక్ష్మణుని యాలింగనాదులకంటే వారిని నమస్కరించుట

ముఖ్యమనియు నదికృతజ్ఞతా సూచకమనియు భావము. "దుర్ధాతం వ్యసనం ప్రోక్తమ్" అని విశ్వనిఘంటువు. వి+ఉత్క్రమ్య-వ్యుత్క్రమ్య-క్రమమును దప్పించియని అర్థము.

శ్లో. సౌమిత్రిణా తదను సంసస్వజే స చైన
ముత్థాయ నమ్రశిరసం భృశ మాలిలింగ,
రూఢేం ద్రజిత్ప్రహరణవ్రణ కర్కశేన
క్లిశ్య న్నివాస్య భుజమధ్య ముర: స్థలేన. 73

వ్యాఖ్య : తదను-సుగ్రీవాదివందనానంతరము, సః-ఆభరతుఁడు, సౌమిత్రిణా-లక్ష్మణునితో, సంసస్వజే-కలుసుకొనెను. నమ్రశిరసం-ప్రణతుఁడైన ఏనం-అతనిని, ఉత్థాయ-లేపి, రూడేంద్రజి త్ప్రహరణవ్రణ కర్కశేన-రూఢ-పైకిఁగనఁ బడుచున్న, ఇంద్రజిత్ప్రహరవ్రణ-ఇంద్రజిత్తుకొట్టిన దెబ్బలవలని వ్రణముల చేత, కర్కశేన-కఠినమైన (నొప్పిని గలిగించు), ఉరఃస్థలేన-తనవక్షఃస్థలముచేత, అస్య, భుజమధ్యం-ఆ లక్ష్మణుని వక్షమును, క్లిశ్య, ఇవ-నొప్పించుచున్నవాఁడువలె, భృశం-గాఢముగా, ఆలిలింగ, చ-ఆలింగనమును సైతము చేసికొనెను. భరతుఁడు సుగ్రీవాదులకు నమస్కరించి, లక్ష్మణునివద్దికి వెళ్ళగా నతఁడువంగి నమస్కరించెననియు, నట్లుపాదపతితుఁడైన సౌమిత్రినిలేపి, ఇంద్రజిత్తు యుద్ధమునందలి ప్రహారములచేతఁ గలిగిన వ్రణములతోఁగన్పట్టు లక్ష్మణుని వక్షమును నొప్పించునా! యనితోచునట్లు గాఢముగా నాలింగనముఁజేసికొనెననియు భావము. గాఢానురాగవాత్సల్యములు స్వల్పమగు శరీరబాధను లెక్కింపవుగదా!

శ్లో. రామాజ్ఞయా హరిచమూపతయ స్తదానీం
కృత్వా మనుష్యవపు రారురుహు ర్గజేంద్రాన్,
తేషు ద్రుతత్సు బహుధా మదవారిధారా:
శైలాధిరోహణసుఖా న్యుపలేభిరే తే. 74

వ్యాఖ్య: తదానీం-అప్పుడు, హరిచమూపతయః-వానరసేనాపతులు, రామాజ్ఞయా-రామునియొక్క ఆజ్ఞచేత, మనుష్యవపుః-మానవశరీరమును, కృత్వా-ధరించి, గజేంద్రాన్-ఉత్తమగజములను, ఆరురుహుః-ఎక్కిరి. బహుధా-విశేష

ముగా, మదవారిధారాః-మదజలధారలను, క్షరత్సు-కురియుచున్న, తేషు-ఆగజముల యందు, తే-ఆకపిసైన్యనాథులు, శైలాధిరోహణసుఖాని-పర్వతములనెక్కుట యందలి సుఖములను, ఉపలేభిరే-అనుభవించిరి. రాముఁడు తనవెంట గౌరవముగాఁ బురమును ప్రవేశించుటకై వానరపతులను మానవశరీరములను ధరింపుఁడని యాజ్ఞాపింపఁగా, దేవాంశసంభూతులుగావున వారట్లేమారి మత్తగజములపై నెక్కిరి. మదధారలను గురియుచున్న గజములపై నుండినవారు సెలయేళ్ళతోఁ గూడిన పర్వతములపైఁ గూర్చున్నప్పటి తమ సహజసంతోషమును పొందిరని భావము. అలంకారము: గమ్యోపమ.

శ్లో. సానుప్లవః ప్రభు రపి క్షణదాచరాణాం
భేజే రథాన్ దశరథప్రభవానుశిష్టః,
మాయావికల్పరచితై రపి యే తదీయై
ర్న స్యందనై స్తులితకృత్రిమభక్తిశోభాః. 75

వ్యాఖ్య: సానుప్లవః (స+అనుప్లవః)-అనుచరులతోఁగూడిన, క్షణదాచరాణాం, ప్రభుః, అపి-విభీషణుఁడుగూడ, దశరథప్రభవానుశిష్టః- దశరథప్రభవ-రామునిచేత, ఆనుశిష్టః-ఆజ్ఞాపింపఁబడినవాఁడగుచు, రథాన్-రథములను, భేజే-ఎక్కెను. యే-ఏరథములు, మాయావికల్పరచితైః, అపి-రాక్షసమాయచేత కల్పింపబడిన వైనప్పటికిని, తదీయైఃస్యందనైఃఆవిభీషణుని రథములతో, తులిత కృత్రిమభక్తిశోభాః-పోల్పఁబడిన కృత్రిమభాగముల కాంతులుగలవి, న-కావో. రాముఁడు తెప్పించిన యే సహజ నిర్మాణముగల రథములు, రాక్షస మాయాకల్పితములైన విభీషణుని రథములు కలిగియున్న కృత్రిమశోభను నిరాకరించుచున్నవో అట్టి రథములను విభీషణుఁడు సపరివారముగా రామాజ్ఞచేత నెక్కెను. "అనుప్లవః" అనఁగా వెంటవచ్చువాఁడు, "అభిసార స్త్వనుసరః సహాయోఽనుప్లవోఽనుగః" అని యాదవకోశము. "క్షణదా" యనఁగారాత్రి, క్షణదాచరులనగా రాత్రించరులు-రాక్షసులని యర్థము. దశరథప్రభవః-దశరథుఁడు తన పుట్టుటకుఁ గారణమైన వాఁడు, రాముఁడని యర్థము (ప్రభవత్యస్మాదితి ప్రభవః-జనకః).

శ్లో. భూయ స్తతో రఘుపతి ర్విలసత్పతాకం
అధ్యాస్త కామగతి సావరజో విమానమ్,

దోషాతనం బుధబృహస్పతియోగ దృశ్య
స్తారాపతి స్తరలవిద్యు దివాభ్రవృందమ్. 76

వ్యాఖ్య: తతః-పిమ్మట, రఘుపతిః-రాముఁడు, సావరజః-తమ్ములతో (భరతలక్ష్మణులతో) గూడినవాఁడగుచు, విలసత్పతాకం-ప్రకాశించుచున్న జెండాలు గలదియు, కామగతి-కోరినట్లు నడచునదియునగు, విమానం-పుష్పకవిమానమును, భూయః-మరలఁగూడ, బుధబృహస్పతియోగ దృశ్యః-బుధబృహస్పతి నక్షత్రముల సంబంధముతోఁ జూడముచ్చటయైన, తారాపతిః-చంద్రుఁడు, దోషాతనం-రాత్రి యందలిదియు, తరలవిద్యుత్-మెరయుచున్న మెఱుపుగల, అభ్రవృందం, ఇవ-మేఘమండలమునువలె, అధ్యాస్త-ఎక్కెను. ఎవరెవ తేయే వాహనములపై నెక్కి రావలయునో నిర్ణయించి, భరతలక్ష్మణ సహితుఁడై రాముఁడు మరల విమానము నెక్కెను. ఆదృశ్యము బుధబృహస్పతులతోఁ గూడిన చంద్రుఁడు, మెరుపుతో నుండిన మేఘము నెక్కినట్లు హృద్యముగానుండెను. ఇచ్చట బుధబృహస్పతులు భరత లక్ష్మణులకును, చంద్రుఁడు రామునికిని, మేఘము పుష్పకమునకును, విద్యుత్తు విమానమునందేయుండిన సీతకును, ఉపమానములని గ్రహింపవలెను.
అలంకారము: ఉపమ.

శ్లో. తత్రేశ్వరేణ జగతాం ప్రలయా దివోర్వ్వీం
వర్షాత్యయేన రుచ మభ్రఘనా దివేందోః,
రామేణ మైథిలసుతాం దశకంఠకృచ్ఛ్రాత్
ప్రత్యుద్ధృతాం ధృతిమతీం భరతో వవందే. 77

వ్యాఖ్య: తత-ఆవిమానమునందు, జగతాం, ఈశ్వరేణ-లోకములకు ప్రభువైన ఆదివరాహమూర్తిచేత, ప్రలయాత్-జల ప్రళయమునుండి, ఉర్వ్వీం, ఇవ-భూదేవిని వలెను; వర్షాత్యయేన-శరదృతువుచేత (వర్షఋతువు యొక్క అవసానము) అభ్రఘనాత్-మేఘ సంఘమునుండి, ఇందోః, రుచం, ఇవ-చంద్రుని యొక్క కాంతినివలె (చంద్రికనువలె), రామేణ-రామునిచేత, దశకంఠకృచ్ఛ్రాత్-రావణుఁడను సంకటమునుండి, ప్రత్యుద్ధృతాం-ఉద్ధరింపఁబడినదియై, ధృతీమతీం-సంతోషముతోనున్నదియగు, మైథిలసుతాం-సీతను, భరతః-భరతుఁడు, వవందే-నమస్కరించెను. ఆదివరాహమూర్తిచేతఁ బ్రళయమునుండి భూదేవినివలెను, శర

దృతువుచేత మేఘమండలమునుండి చంద్రికనువలెను, రామునిచేత రావణునినుండి విడిపింపబడిన సీతాదేవిని భరతుఁడు నమస్కరించెను. అనఁగా భరతుఁడు ప్రత్యుద్గమనముచేత సత్కరించుటకు వచ్చినప్పుడు, రాముఁడును సుగ్రీవాదులును పుష్పకమునుండి దిగిరనియు, సీత పుష్పకమునందే యుండెననియు, ఇప్పుడు రాముఁడు సానుజుఁడై మరల విమానము నెక్కఁగా నచ్చటనున్న సీతకు భరతుఁడు ఇప్పుడు నమస్కరించెననియు భావము. అది సంప్రదాయమే కదా! అలంకారము : ఉపమ.

శ్లో. లంకేశ్వర ప్రణతిభంగ దృఢవ్రతం త
ద్వంద్వ్యం యుగం చరణయో ర్జనకాత్మజాయాఃశ్లో.
జ్యేష్ఠానువృత్తిజటిలం చ శిరోఽస్య సాధ్వోఃశ్లో.
అన్యోన్యపావన మభూ దుభయం సమేత్య. 78

వ్యాఖ్య : లంకేశ్వర ప్రణతిభంగ దృఢవ్రతం—లంకేశ్వర-రావణుని యొక్క, ప్రణతి-నమస్కారములయొక్క, భంగ-నిరసనముచేత, దృఢవ్రతం-చలింపనిపాతివ్రత్యముగలది యగుటవలన, వంద్యం-నమస్కరింపదగినదగు, జనకాత్మజాయాఃశ్లో.-సీతాదేవియొక్క, చరణయోఃశ్లో., యుగం-పాదములయొక్కజంటయు, జ్యేష్ఠానువృత్తిజటిలం-జ్యేష్ఠానువృత్తి-పెద్దవాఁడగు రామునియందలి భక్తిచేత, జటిలం-జడలుదాల్చిన, సాధ్వోఃశ్లో.-సజ్జనుఁడగు, అస్య-ఈభరతునియొక్క, శిరఃశ్లో., చ-శిరస్సును, ఉభయం-ఈరెండును, సమేత్య-కలిసికొని, అన్యోన్యపావనం-ఒకదాని నొకటి పవిత్రముఁ జేయునది, అభూత్-ఆయ్యెను. రావణుని ప్రార్థనల నంగీకరింపక పాతివ్రత్యమును గాపాడుకొన్న సీతాపాదయుగ్మమును, అన్నకై రాజ్యమును వదలి జటాధారియైన భరతుని శిరస్సును గలిసికొని, యొకదాని నొకటి పావనముఁ జేసెనని భావము. రెండును సమప్రాధ్యాన్యముగల మహత్తర కార్యములగుటచేఁ గవి ఇట్లు వర్ణించెను.

శ్లో. క్రోశార్ధం ప్రకృతిపురఃసరేణ గత్వా,
కాకుత్థ్సఃశ్లో. స్తిమితజవేన పుష్పకేణ,
శత్రుఘ్నప్రతివిహితోపకార్య మార్యఃశ్లో.
సాకేతోపవన ముదార మధ్యువాస. 79

వ్యాఖ్య : ఆర్యుఁ-పూజ్యుఁడైన, కాకుత్స్థుఁ-రాముఁడు, ప్రకృతిపురఃసరేణ-పురజనులు ముందు నడచునట్టిదై, స్తిమితజవేన-తగ్గినవేగముగల, పుష్పకేణ-పుష్పక విమానముతో, క్రోశార్ధం-అఱకోసుదూరము, గత్వా-వెళ్ళి, శత్రుఘ్న ప్రతివిహితోపకార్యం-శత్రుఘ్న-శత్రుఘ్ననిచేత, ప్రతివిహిత-వేయింపఁబడిన, ఉపకార్యం-పటకుటీరములు (డేరాలు) గలదిచ్చు, ఉదారం-గొప్పదియునగు, సాకేతోపవనం-అయోధ్యానగరము యొక్క ఉపవనమును, అధ్యువాస-ఆధివసించెను. అప్పుడు రాముఁడు, జనులముందు నడచుచుండగా విమానమును నెమ్మదిగాఁబోవనిచ్చి శత్రుఘ్నుఁడు ముందే సిద్ధపరచియుంచిన పటకుటీరములుగల అయోధ్యానగరోపవనమున విడిసెను. భరతుఁడు, నంది గామమునఁదాను రాముని నెదుర్కొని తెచ్చువఱకు నుద్యానమున సవానర విభీషణుఁడగు రామునికిఁ దాత్కాలికవాసము నేర్పాటుచేయుమని శత్రుఘ్నునికి వార్తనంపియుండెననియు, అతఁడాప్రదేశముననే యుండి యన్నయాజ్ఞను నిర్వర్తించెననియు భావము. మహోత్సవముతో రాముని నగరమునఁ బ్రవేశించునట్లు చేయుటకి డేర్పాట్లని తెలియవలయును.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశ కావ్యమునఁ దండకాప్రత్యాగమన
మను త్రయోదశసర్గకు కేశవపంతుల నరసింహాశాస్త్రి రచిత
తెలుఁగు లఘు వ్యాఖ్య

శ్రీః

మహాకవి కాళిదాసకృత

రఘువంశము

చతుర్దశసర్గము

శ్లో. భర్తుః ప్రణాశా దథ శోచనీయం
దశాంతరం తత్ర సమం ప్రపన్నౌ,
అపశ్యతాం దాశరథీ జనన్యౌ
ఛేదా దివోపఘ్నతరో ర్వ్యథితౌ. 1

వ్యాఖ్య : అథ-శ్రీరామాదు లుపవనమున విడిసిన పిమ్మట, దాశరథీ-రామలక్ష్మణులు, ఉపఘ్నతరోః-ఆశ్రయవృక్షముయొక్క, ఛేదాత్-నఱుకుటవలన, ప్రవతౌ్యా, ఇవ-లతలవలె, భర్తుః భర్తయగు దశరథునియొక్క, ప్రణాశాత్-మరణమువలన, శోచనీయం-దుఃఖింపఁదగిన, దశాంతరం-అవస్థాంతరమును, ప్రపన్నౌ-పొందియుండిన, జనన్యౌ-తల్లులగు కౌసల్యాసుమిత్రలను, తత్ర-ఆ సాకేతనగరోపవనమునందు, సమం-ఏకకాలమునందు, అపశ్యతాం-చూచిరి. తాము ప్రాకిన చెట్టును కొట్టివేయఁగా నిరాలంబములై, వాడి కళాహీనములైన తీఁగలవలె దశరథ మరణమువలన సౌభాగ్యమునుఁగోలుపోయి శోచనీయ దశలోనున్న కౌసల్యా సుమిత్రలను రామలక్ష్మణు లేకకాలమునఁజూచి బాధపడిరని భావము. ఆశ్రయము అను నర్థమున "ఉపఘ్న" శబ్దము వ్యాకరణమున 'నిపాత' చేయఁబడినది. "దశా" శబ్దమునకు వస్త్రపుటంచు, అవస్థ అర్థములని విశ్వనిఘంటువు. "అపశ్యతామ్" దృశిర్-ప్రేక్షణేధావునకు కర్తర్యర్థమున లఙ్ ప్ర.పురుష ద్వి.వచనము.

శ్లో. ఉభా వుభాభ్యాం ప్రణతౌ హతారీ
యథాక్రమం విక్రమణోభినౌ తౌ,

విస్పష్ట మశ్రాంధతయా న దృష్టౌ
జ్ఞాతౌ సుతస్పర్శసుఖోపలంభాత్. 2

వ్యాఖ్య : యథాక్రమం-వరుసతప్పనీయక (స్వస్వమాతృపూర్వకముగా), ప్రణతౌ-నమస్కరించినవారును, హతారీ-చంపఁబడిన శత్రువులుగలవారును, విక్రమశోభినౌ-శౌర్యప్రకాశము గలవారునునగు, తౌ, ఉభౌ-ఆ రామలక్ష్మణులిద్దఱు, ఉభాభ్యాం-ఇద్దఱు తల్లులచేత, అశ్రాంధతయా-కన్నీటిచేత కట్టఁగిన అంధత్వకారణమున, విస్పష్టం-స్పష్టముగా, న, దృష్టౌ-చూడబడలేదు. సుతస్పర్శ సుఖోపలంభాత్-సుతస్పర్శ-కుమారునిఁదాకుటచేతనగు, సుఖ-ఆనందమునొక్క-, ఉపలంభాత్-అనుభవమువలన, జ్ఞాతౌ-తెలిసికొనఁబడిరి. రామలక్ష్మణులు తన తన తల్లికి నమస్కరించినప్పుడు, కన్నీళ్ళతో నిండిన చూపులుగలవారగు కౌసల్యా సుమిత్రలు కుమారులను స్పష్టముగాఁ గుర్తింపలేకపోయిరి, కాని సుతదేహస్పర్శ వలని" యనిర్వచనీయ సుఖమువలన నితఁడు నా కుమారుఁడే యని గుర్తించిరని భావము. "నమాతుఃపరదైవతమ్" అను శాస్త్రక్రమము నతిక్రమింపక యెవరి తల్లికి వారు ముందుగా నమస్కరించిరి. సుతస్పర్శసుఖ మనుభవైకవేద్యముగాన వారు గుర్తింపఁగలిగిరి. "అశ్ర" శబ్దమునకు రక్తము, కన్నీరు రెండును అర్థము లని యాదవకోశము.

శ్లో. ఆనందజఃశోకజ మశ్రు బాష్ప
స్తయో రశీతం శిరో బిభేద,
గంగాసరయ్వో ర్జల ముష్ణత ప్తం
హిమాద్రినిష్యంద ఇవావతీర్ణః. 3

వ్యాఖ్య : తయోఃఆ యిద్దఱు తల్లులయొక్క, ఆనందజఃసంతోషము వలనఁ బుట్టిన, శిరఃబాష్పఃచల్లని కన్నీరు, శోకజం-దుఃఖమువలనఁ గలిగి నదియు, అశీతం-ఉష్ణమైన, అశ్రు-కన్నీటిని, ఉష్ణతప్తం-సూర్యరశ్మిచేత వేడి యెక్కిన, గంగాసరయ్వోఃగంగా సరయూనదులయొక్క, జలం-నీటిని, అవతీర్ణఃక్రిందికిఁ బ్రవహించిన, హిమాద్రినిష్యందఃఇవ-హిమాలయ నిర్ఝరమువలె, బిభేద-వేరుపరచెను. రామలక్ష్మణుల దర్శనముచేత వారి యరణ్యవాసక్లేశస్మరణమున వేడికన్నీరుగార్చు కౌసల్యాసుమిత్రల నేత్రములనుండి సుతస్పర్శసుఖానుభూతిచేత

దొరలివచ్చు చల్లని యానందబాష్పములు గురిసెననియు, అది గ్రీష్మమునందు గంగా సరయూనదుల జలము ఉష్ణమైయుండగా హిమాద్రినుండి దిగివచ్చిన హిమ ప్రవాహము దానిని చల్లగా మార్చినట్లుండెననియు, ఆ తల్లుల కన్నులనుండి యుబుకు శోకబాష్పముల యుష్ణతను ఆనందబాష్ప శైత్యము చల్లబరచె ననియు భావము. దుఃఖబాష్పము లుష్ణముగానుండుటయు, ఆనందబాష్పములు చల్లగా నుండుటయు లోకానుభవసిద్ధముగదా! దుఃఖముపోయి వారానందపడి రన్నది పర మార్థము. అలంకారము:ఉపమ.

శ్లో. తే పుత్రయో ర్నైర్ఋతశస్త్రమార్గా
న్నార్ద్రాన్ నివాంగే సదయం స్పృశంత్యౌ,
అపీప్సితం పుత్రకులాంగనానాం
న వీరసూశబ్ద మకామయేతామ్. 4

వ్యాఖ్య : తే-ఆ తల్లులిద్దఱు, పుత్రయోః-ఇద్దరు కుమారులయొక్క, అంగే-శరీరమునందు, నైర్ఋత శస్త్రమార్గాన్-రాక్షసఖడ్గ వ్రణములను, ఆర్ద్రాన్ ఇవ-పచ్చివానివిగా, సదయం-నొప్పనన్న దయకలిగి, స్పృశంత్యౌ-తాకుచున్నవారై, పుత్రకులాంగనానాం-ఉత్తమ క్షత్రియాంగనలకు, ఈప్సితం, అపి-ఇష్టమైనదే యైనను, వీరసూశబ్దం-వీరమాత యనుపేరును, న, అకామయేతాం-కోరుట తగదను కొనిరి. రాక్షసుల శస్త్రములచేత వ్రణితములగు రామలక్ష్మణుల శరీరములను నెమ్మదిగా నిమురుచున్న కౌసల్యాసుమిత్రలు "వీరమాత" యను బిరుదము క్షత్రి యాంగనలకు ఇష్టమేయైనను దుఃఖహేతువగుటచేత నది కోరదగినదికాదని భావించి రని తాత్పర్యము. "అకామయేతాం" స్వార్థణిజంతమగు "కము-కాంక్షాయాం" అను ధాతువునకు ఆత్మనేపదిలఙ్ ద్వివచనము. ఇచ్ఛ కాంక్ష శబ్దమునకు ఇచ్ఛ అని యర్థము.

శ్లో. క్లేశావహో భర్తు రలక్షణాహం
సీతేతి నామ స్వ ముదీరయంతీ,
స్వర్గప్రతిష్ఠస్య గురో ర్మహాత్మ్యా
వభక్తి భేదేన పధూ ర్వవందే. 5

వ్యాఖ్య : భర్తుః-భర్తకు-, క్లేశావహా-కష్టములు గలిగించినదానను (కనుక) అలక్షణా–శుభలక్షణములులేని, అహం-నేను, సీతా-సీతను, ఇతి–అని, స్వాం, నామ-తన పేరును, ఉదీరయంతీ-పలుకుచున్నదియగుచు, స్వర్గప్రతిష్ఠస్య-స్వర్గమునందున్న, గురోః-మామయగు దశరథునికి, మహిష్యా–రాణులగు కౌసల్యా సుమిత్రలను, వధూః–కోడలగు సీత, అభక్తిభేదేన–భక్తిలో భేదభావము లేక, ననందే–నమస్కరించెను. "భర్తకుగష్టములు గూర్చిన యవలక్షణురాలగు సీతను" అని తనపేరు చెప్పుకొనుచు సీత అత్తలిద్దఱికిని సమాన భక్తితో నమస్కరించెను. పెద్దలకు నమస్కరించునప్పుడు తన పేరును జెప్పుకొనుట ధర్మశాస్త్రవిహితము. "స్వర్గప్రతిష్ఠస్య" అను పదముచేత అత్తలకుగలిగిన వైధవ్యమును జూచి సీత దుఃఖించెనని సూచితము. "అలక్షణా" అనునదియు తనమూలమున వారికిగలిగిన యాపదలను సూచించును.

శ్లో. ఉత్తిష్ఠ వత్సే నను సానుజో ఽసౌ
వృత్తేన భర్తా శుచినా తవైవ,
కృచ్ఛ్రం మహ త్తీర్ణ ఇతి ప్రియార్హాం
తా మూచతు స్తే ప్రియ మప్యమిథ్యా. 6

వ్యాఖ్య : నను, వత్సే-చూడు అమ్మాయీ! ఉత్తిష్ఠ-లెమ్ము, అసౌ-ఈ, సానుజః-తమ్మునితోగూడిన, భర్తా-నీభర్తయగు రాముడు, తవ+ఏవ-నీయొక్కయే, శుచినా, వృత్తేన-పవిత్రమైన నడవడిచేత, మహత్, కృచ్ఛ్రం-గొప్ప దుఃఖమును, తీర్ణః-దాటిన వాడయ్యెను. ఇతి-ఇట్లనుచు, ప్రియార్హాం, తాం–ప్రియవచనములకే తగిన ఆకోడలిని గురించి, ప్రియం, అపి-ఇష్టమైనదైనను, అమిథ్యా-సత్యమును, తే–ఆ యిద్దరత్తలు, ఊచతుః-పలికిరి. తమ పాదములపైబడిన సీతను అమ్మాయీ! లే, నీ నిర్మల ప్రవర్తనముచేతనే తమ్మునితోగూడ యీనీ భర్త మహాదుఃఖమును తరించెను. అని కౌసల్యా సుమిత్రలు ప్రియమైన సత్యమును బలికి సీతను దేర్చిరని భావము. "ప్రియార్హాం" అను విశేషణము సీతయొక్క మనఃసౌకుమార్యమును, కష్టాసహనమును దెలుపుచున్నది. "హితం మనోహారిచ దుర్లభం వచః" అనికదా అభియుక్తోక్తి. కాని వీరికి అపవాదముగా కౌసల్యా సుమిత్రలు సీతకు మనోహరమైన సత్యమును (హితమును) జెప్పిరి

శ్లో. అథాభిషేకం రఘువంశకేతోః
ప్రారబ్ధ మానందజలై ర్జననోర్యాః,
నిర్వర్తమాయాసు రమాత్యవృద్ధాః
తీర్థాహృతైః కాంచనకుంభతోయైః. 7

వ్యాఖ్య : అథ-ఆతరువాత, జననోర్యాః-యిద్దరు తల్లులయొక్క, ఆనంద జలైః-ఆనందబాష్పములచేత, ప్రారబ్ధం-ప్రారంభింపఁబడిన, రఘువంశకేతోః-రఘువంశ శ్రేష్ఠుఁడగు రామునియొక్క, అభిషేకం-పట్టాభిషేకమును, అమాత్య వృద్ధాః-పెద్దలైన మంత్రులు, తీర్థాహృతైః-గంగాది పుణ్యతీర్థములనుండి తేఁబడిన, కాంచనకుంభతోయైః-సువర్ణకలశములయందలి జలములచేత, నిర్వర్తయామాసుః-జరిపించిరి. తల్లులయిన కౌసల్యా సుమిత్ర ఆనందబాష్పములచేత ఆరంభింప బడిన రామపట్టాభిషేకమును, వృద్ధులగు మంత్రులు సువర్ణకలశములయందు తీసి కొనిరాఁబడిన గంగాది పుణ్యతీర్థజలములతో జరిపించిరి. తల్లుల సంతోషజలము లచేతఁదడిసిన రామునితలపై గంగాదిజలములుంచి యభిషేకించిరని భావము.

శ్లో. సరిత్సముద్రాన్ సరసీశ్చ గత్వా
రక్షఃకపీంద్రై ర్ఋషపాదితాని,
త స్యాపతన్ మూర్ధ్ని జలాని జిష్ణోః
వింధ్యస్య మేఘప్రభవా ఇవాపః. 8

వ్యాఖ్య : రక్షఃకపీంద్రైర్ఋః-రాక్షసశ్రేష్ఠులచేతను, కపిశ్రేష్ఠులచేతను, సరిత్స ముద్రాన్-గంగాదినదులను, ప్రాక్పశ్చిమాది సముద్రములను, సరసీఃచ-మానసాది సరస్సులనుసైతము, గత్వా-చేరి, ఋషపాదితాని-తీసుకరాఁబడిన, జలాని-నీరములు, జిష్ణోః, తస్య-జయశీలుఁడగు ఆరామునియొక్క, మూర్ధ్ని-శిరస్సునైపైన, వింధ్యస్య-వింధ్యపర్వతముయొక్క, మూర్ధ్ని-తలపైన, మేఘప్రభవాఃమేఘమునుండిపుట్టిన, ఆపఃఇవ-జలములవలె, అపతన్-పడినవి. కపిరాక్షసవీరులు సర్వ నదీసముద్ర సరస్సులనుండి తెచ్చిన తీర్థోదకములు రాముని శిరస్సునైపై వింధ్యాద్రిమీదవర్ష జలములవలె పడినవి. వింధ్యాద్రియొక్క ఉపమానము రాముని యౌన్నత్యమును, వర్షజలోపమానము, రాక్షసకపివీరులు తెచ్చిన అభిషేకజల బాహుళ్యమును

సూచించుచున్నవి. "జిష్ణోః" అను విశేషణము సందర్భయుక్తముగా నున్నది.
ఆలంకారము:ఉపమ.

శ్లో. తపస్వివేష క్రియయాపి తావత్
యః ప్రేక్షణీయః సుతరాం బభూవ,
రాజేంద్రనేపథ్య విధానశోభా
త స్యాది తాసీత్ పునరుక్తదోషా. 9

వ్యాఖ్య : యః-ఏ రాముఁడు, తపస్వివేషక్రియయా, ఆపి-మునివేషరచన చేతనే, సుతరాం-మిక్కిలి, ప్రేక్షణీయః, తావత్-చూడముచ్చటైనవాఁడుగా, బభూవ-ఉండెనో, తస్య-ఆ రామునికి, రాజేంద్రనేపథ్యవిధానశోభా-రాజవేషరచన చేతఁ గలిగిన కాంతి, ఉదితా-ఏర్పడినదియై, పునరుక్తదోషా-పునరుక్తదోషముగలది, ఆ సిత్-అయినది. తాపస వేషముచేతనే యెంతయో దర్శనీయశోభ గలిగియుండిన శ్రీరామునికిఁ బట్టాభిషేక సమయమునఁ గూర్చిన మణికిరీటరత్నకంకణాదికము రాజేంద్రవేషము పునరుక్తదోషము గలదిగా నుండెను. అనఁగా అందగాఁడైయున్న వానిని మరల నందగానిఁజేయు యత్నమువలె నిరుపయోగముగా నుండెనని భావము. కవితలో వేసినపదమునే వేయుట, చెపి న భావమునే చెప్పుటవలె నుండె ననుట. జటావల్కలధారి యగు రాముఁడు దర్శనీయతరశోభ గలవాఁడని కవి హృదయము.

శ్లో. స మౌలరక్షోహరిభిః ససైన్యః
తూర్యస్వనానందిత పౌరవర్గః,
వివేశ సౌధోద్గత లాజవర్షా
ముత్తోరణా మన్వయరాజధానీమ్. 10

వ్యాఖ్య : సః-ఆ రాముఁడు, ససైన్యః-సైన్యముతోఁగూడినవాఁడును, తూర్యస్వనానందితపౌరవర్గః—తూర్యస్వన-మంగళవాద్యధ్వనులచేత, ఆనందిత-సంతోషమును పొందిన, పౌరవర్గః-పురజన సమూహము గలవాఁడును నగుచు, మౌలరక్షోహరిభిః-మంత్రి వృద్ధులతోను, రాక్షసులతోను, కపిశ్రేష్ఠులతోను, సౌధోద్గతలాజవర్షాం-మేడలనుండిపడు పేలాల వర్షము గలదియు, ఉత్తోరణాం-

ఎత్తైనగవనివాకిండ్లు గలదియునగు, అన్వయరాజధానీం-తమ వంశపు రాజులకు నివాసమగు నయోధ్యానగరమును, వివేశ-ప్రవేశించెను. రాముఁడు సైన్యసమేతుఁడై వృద్ధమంత్రులు, కపిరాక్షసవీరులు వెంటరాగా, మంగళవాద్య పురజన కోలాహలమున, పుణ్యాంగనలు మేడలపైనుండి లాజవర్షము గురియుచుండ తమ వంశ రాజధాని యగు నయోధ్యను ప్రవేశించెను. "మూలేభవాఃపౌలాః" ముఖ్యస్థానమున నుండువారు, వృద్ధమంత్రులని యర్థము. రాజులు నగరమునవెళ్ళునప్పుడు పేలాలు చల్లుట యాచారము.

శ్లో. సౌమిత్రిణా సావరజేన మంద
మాధూతవాలవ్యజనో రథస్థః,
ధృతాతపత్రో భరతేన సాక్షా
దుపాయసంఘాత ఇవ ప్రవృద్ధః. 11

వ్యాఖ్య : సావరజేన (స + ఆవరజేన)-తమ్ముఁడగు శత్రుఘ్ననితోఁ గూడిన, సౌమిత్రిణా-లక్ష్మణునిచేత, మందం-మల్లఁగా, ఆధూతవాలవ్యజనః-వీచఁబడిన చామరములు గలవాఁడును, రథస్థః-రథమునందున్నవాఁడును, భరతేన-భరతునిచేత, ధృతాతపత్రః-పట్టుకొనఁబడిన ఛత్రముగలవాఁడును నగు రాముఁడు ప్రవృద్ధః-వృద్ధిఁజెందిన, సాక్షాత్-ఎదుటఁగనఁబడు, ఉపాయసంఘాతః, ఇవ-సామాద్యుపాయ చతుష్టయమువలె (నగరమును ప్రవేశించెనని పూర్వశ్లోకముతో నన్వయము). అనుజసహాఁడైన రాముఁడు మూర్తీభవించిన ఉపాయచతుష్టయము వలె నగరమునఁ బ్రవేశించెనని భావము. ఇది భావిరాజ్యపాలన చాతుర్య సూచకము. రవివర్మ వ్రాసిన రామపట్టాభిషేక పటమున కిదిమూలమా?

శ్లో. ప్రాసాద కాలాగురు ధూమరాజిః
తస్యాః పురో వాయువశేన భిన్నా,
వనా న్నివృత్తేన రథూత్తమేన
ముక్తా స్వయం వేణి రివావభాసే. 12

వ్యాఖ్య : వాయువశేన-గాలివచ్చుటచేత, భిన్నా-వేరుపడిన, ప్రాసాద కాలాగురు ధూమరాజిః—ప్రాసాద-సౌధమునందలి, కాలాగురుధూమ-అగురుపొగ

యొక్క, రాజిః–రేఖ, వనాత్, నివృత్తేన-ఆరణ్యమునుండి మరలివచ్చిన, రఘూ
త్తమేన-రామునిచేత, స్వయం, ముక్తా-స్వంతముగా విడువఁబడిన, తస్యాఃపురః-ఆ యయోధ్యారాజధానియొక్క, వేణిః, ఇవ-జడవలె, అవభాసే-ప్రకాశిం
చెను. రాముఁడు ప్రవేశించునప్పుడు రాజప్రాసాదముమీద గాలిచేదూరముగా సాగిన
అగురుధూమరేఖ, అయోధ్యాపురి, తన పతియగు రాముఁడు ప్రవాసముననున్న
కాలమున పాతివ్రత్య ధర్మముననుసరించి విడువక ముడుచుకొన్న జడను, రాముఁ
డరణ్యమునుండి వచ్చి విప్పినట్లుండెనని భావము. "పురః" పూః అనుశేషాంత
స్త్రీలింగశబ్ద షష్ఠ్యేక వచనము. భర్తపరదేశమున నుండగా భార్య తలదువ్వుకొన
రాదనియు, జడను విడువరాదనియు హారీతస్మృతి చెప్పుచున్నది. "నప్రోషితే తు
సంస్కుర్యా న్నవేణీంచ ప్రమోచయేత్" ఆలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. శ్వశ్రూజనానుష్ఠిత చారువేషాం
కర్ణీరథస్థాం రఘువీర పత్నీం,
ప్రాసాద వాతాయన దృశ్యబంధైః
సాకేతనార్యో ఽంజలిభిః ప్రణేముః. 13

వ్యాఖ్య: శ్వశ్రూజనానుష్ఠిత చారువేషాం-అత్తలచేతఁ జేయఁబడిన మంచి
వస్త్రాలంకార వేషముగలదియు, కర్ణీరథస్థాం-స్త్రీలకుయోగ్యమగు చిన్నరథము
నందుఁ గూర్చున్నదియునగు, రఘువీరపత్నీం-సీతను, సాకేతనార్యాః-అయోధ్యా
నగరస్త్రీలు, ప్రాసాదవాతాయన దృశ్యబంధైఃప్రాసాదవాతాయన-మేడల కిటికీ
లలో, దృశ్యబంధైఃకనఁబడు జోడింపులుగల, అంజలిభిః-దోయిళ్ళతో,
ప్రణేముః-నమస్కరించిరి. అరణ్యావాసవేషమును దొలఁగించి యత్తలు రాజమహిషి
వేషమును ధరింపఁజేయఁగా స్త్రీయోగ్యమగు చిన్న రథమునందు రాజప్రాసాదము
నకు వెళ్ళుచున్న సీతను నగరస్త్రీలు మేడలపైనిల్చి కిటికీలగుండాఁ గనఁబడుచున్న
తమయంజలిపుటములతో నమస్కరించిరి. "కర్ణీరథః ప్రవహణం దయనం రథ
గర్భకే" అని యాదవనిఘంటువు.

శ్లో. స్ఫురత్ప్రభామండల మానసూయం
సా బిభ్రతీ శాశ్వత మంగరాగమ్,

రరాజ శుద్ధేతి పునఃస్వపుర్యై
సందర్శితా వహ్నిగతేవ భర్త్రా. 14

వ్యాఖ్య : స్ఫురత్ప్రభామండలం-మెఱయుచున్న కాంతిమండలము గల దియు, ఆనసూయం-అనసూయాదేవిచే నియ్యఁబడినదియు, శాశ్వతం-చెదరక బహుకాల ముండునదియునగు, అంగరాగం-ఎఱ్ఱనిమైపూతను, బిభ్రతీ-ధరించినది యగు, సా-ఆసీత, భర్త్రా-భర్తచేత, స్వపుర్యై-తన నగరముకొఱకు (అయోధ్యా నగరజనుల కని లక్షణావృత్తిచేత నర్థము) శుద్ధా, ఇతి-పరిశుద్ధురాలేయని, సంద ర్శితా-చూపఁబడినదియై, పునఃమరల, వహ్నిగతా, ఇవ-అగ్నిని ప్రవేశించినది వోలె, రరాజ-ప్రకాశించెను. దారిలో అనసూయాదేవి యిచ్చిన యంగరాగము చెక్కుచెదరక యెఱ్ఱనికాంతితోనుండగా సీత, భర్తచేత పురజనుల విశ్వాసము కొఱకై మరల నగ్నిప్రవేశముఁజేయించి, యామె లంకలోనుండి వచ్చినను పరిశుద్ధు రాలే యని నిరూపింపఁబడినట్లు ప్రకాశించెనని భావము. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. వేశ్మాని రామః పరిబర్హవంతి
విఘ్నాణ్యై సౌహార్దనిధిఃసుహృద్భ్యఃః,
బాష్పాయమాణో బలిమ న్ని కేత
మా లేఖ్యశేషస్య పితు ర్వివేశ. 15

వ్యాఖ్య : సౌహార్దనిధిః – సౌజన్యనిధియగు, రామఃరాముఁడు, సుహృద్భ్యఃస్నేహితులగు సుగ్రీవాదులకు, పరిబర్హవంతి-ఉపకరణములుగల, వేశ్మాని-గృహములను, విఘ్నాణ్య-ఇచ్చి, ఆలేఖ్యశేషస్య-చిత్రపటముగానే మిగి లిన, పితుఃతండ్రియొక్క, బలిమత్-పూజాయుక్తమగు, నికేతం-గృహమును, బాష్పాయమాణఃకన్నీరుఁగార్చుచున్నవాఁడగుచు, వివేశ-ప్రవేశించెను. మంచితన మునకుఁబెన్నిధియగు రాముఁడు సుగ్రీవాది మిత్రులకు సకలోపకరణశోభితము లగు గృహములను విడుదులుగాఁజేసి, చిత్రపటముగాఁ బూజలందుకొనుచున్న తండ్రి దశరథుని యింటిని పిత్రవియోగజనిత బాష్పములు గార్చుచున్నవాఁడ గుచుఁ బ్రవేశించెనని భావము. "వివేశ" విశ-ప్రవేశనేధాతువునకు లిట్ ప్ర. పు. ఏకవచనము.

శ్లో. కృతాంజలి స్తత్ర యదంబ! సత్యాత్
నాభ్రశ్యత స్వర్గఫలాత్ గురు ర్మనఃః,

తచ్చింత్యమానం సుకృతం తవేతి
జహార లజ్జాం భరతస్య మాతుః. 16

వ్యాఖ్య : తత్ర-ఆ సౌధమునందు, కృతాంజలిః-నమస్కరించుచున్న వాఁడగుచు, హేఅంబ-ఓ తల్లీ, నః, గురుః-మా తండ్రి, స్వర్గఫలాత్-స్వర్గము ఫలముగానున్న, సత్యాత్-సత్యమునుండి, న, అభ్రశ్యత, ఇతియత్-జారిపడలేదను నది యేదికలదో, తత్-ఆయభ్రంశసము, చింత్యమానం-విచారింపఁబడినదగుచు, తవ-నీయొక్క, సుకృతం-మంచిపనియే యగుచున్నది. ఇతి-ఇట్లు పలికి, భరతస్య మాతుః-కైకేయియొక్క, లజ్జాం-రామునిఁజూడఁజాలని సిగ్గును, జహార-తొలఁగించెను. దశరథసౌధమునందుఁ జేరిన రాముఁడు బద్ధాంజలియై కైకనుజేరి, "అమ్మా! మా తండ్రి స్వర్గఫలమైన సత్యవాక్యమునుండి దూరముకాకుండుటకు నీవు చేసిన మంచిపనియే, సుకృతమే, కారణము" అని పలుకుచుఁ, దనను కన్నెత్తి చూచుటకు సిగ్గుపడుచున్న కైకేయి లజ్జను హరించి యాయెకు మనఃప్రసాదమును గలిగించెను. భరతశబ్దప్రయోగము రామునికి భరతుని కన్నను కైకేయి ముఖ్యురా లను భావమును సూచించుటకు.

శ్లో. తథైవ సుగ్రీవ విభీషణాదీ
నుపాచర త్కృత్రిమ సంవిధాభిః,
సంకల్పమాత్రోదితసిద్ధయ స్తే
క్రాంతా యథా చేతసి విస్మయేన. 17

వ్యాఖ్య : సుగ్రీవవిభీషణాదీన్ - సుగ్రీవవిభీషణాదులను, కృత్రిమ సంవిధాభిః-కల్పింపఁబడిన భోగ్యవస్తువులచేత, తథైవ-అదేవిధముగా, ఉపాచరత్-గౌరవించెను. యథా-ఏవిధమున, సంకల్పమాత్రోదితసిద్ధయః-తలఁచుకొనుటచేతనే చేకూరు కార్యములుగల, తే-ఆ సుగ్రీవాదులు, చేతసి-మనస్సునందు, విస్మయేన-ఆశ్చర్యముతో, క్రాంతాః-ఆక్రమింపఁబడిరో. పిమ్మట నానావిధ వస్తుసామగ్రితో సుగ్రీవాదులకు నివాస సౌకర్యమును గూర్చఁగా సంకల్పముచేతనే సర్వవస్తువులు సంపాదించుకోఁగల సుగ్రీవాదులు రాముఁడు సమర్పించిన వస్తుజాతమును జూచి ఔరా! ఎంత మనోహరము లీవస్తువులని యాశ్చర్యపడిరని భావము.

శ్లో. సభాజనా యోపగతాన్ స దివ్యాన్
మునీన్ పురస్కృత్య హతస్య శత్రోః,
శుశ్రావ తేభ్యః ప్రభవాది వృత్తం
స్వవిక్రమే గౌరవ మాదధానమ్. 18

వ్యాఖ్య : సః-రాముఁడు, సభాజనాయ-తన నభినందించుటకై, ఉపగతాన్-వచ్చినవారును, దివ్యాన్-స్వర్గవాసులునగు, మునీన్-అగస్త్యాదిమునులను, పురస్కృత్య-పూజించి, హతస్య, శత్రోః-తనచేఁజంపఁబడిన శత్రువగు రావణుని యొక్క, ప్రభవాది-పుట్టుక మొదలయినదియు, స్వవిక్రమే-తనశూరత్వమునందు, గౌరవం-గొప్పతనమును, ఆదధానం-నిలుపుచున్నదియు నగు, వృత్తం-చరిత్రను, తేభ్యః-ఆ మునులవలన, శుశ్రావ-వినెను. రావణ వధవలన సంతసించిన అగస్త్యాది దేవమునులు రామునభినందించుటకు రాఁగా వారిని గౌరవించి, సత్కరించి రాముఁడు వారివలన తాను వధించిన రావణుని చరిత్రనంతయు వినెనని భావము. ఓడిపోయిన వాని గొప్పతనము గెలిచిన వీరుని శౌర్యము నినుమడింపఁజేసి కీర్తిదాయక మగును గదా! అంచులకే రామునికి మునులు రావణ జన్మాదిక వృత్తాంతమును జెప్పుట యని గ్రహింపవలెను.

శ్లో. ప్రతిప్రయాతేషు తపోధనేషు
సుఖా దవిజ్ఞాత గతార్ధమాసాన్,
సీతా స్వహస్తోపహృతాగ్ర్య పూజాన్
రక్షఃకపీంద్రాన్ విససర్జ రామః. 19

వ్యాఖ్య : తపోధనేషు-అగస్త్యాదిమునులు, ప్రతిప్రయాతేషు-తిరిగి వెళ్ళిపోయినవారుకాఁగా (సతిసప్తమి), సుఖాత్-సుఖానుభవమువలన, అవిజ్ఞాతగతార్ధమాసాన్—అవిజ్ఞాత-తమకుఁదెలియకయే, గత-కడచిపోయిన, అర్ధమాసాన్-సగము నెల గలవారును (కావున) సీతాస్వహస్తోప హృతాగ్ర్యపూజాన్—సీతాస్వహస్త-సీతయొక్క హస్తములచేత, ఉపహృత-తీసుకరాఁబడిన, అగ్ర్యపూజాన్-ఉత్తమ సత్కార వస్తువులుగలవారును నగు, రక్షఃకపీంద్రాన్-రాక్షసేంద్ర కపీంద్రులను, రామః-రాముఁడు, విససర్జ-పంపివేసెను. మునులు తమ నివాసములకు వెళ్ళిన

పిమ్మట, సుఖముగా తామెన్ని రోజులనుండి యచ్చటనుండిరో గమనింపక హాయిగా పదునైదుదినములు గడపిన సుగ్రీవాది కపీంద్రులను, విభీషణాది రాక్షసేంద్రులను సీత తన హస్తములతోడెచ్చిన యుత్తమవస్త్రభూషణాదులతో సత్కరించి, వారిని రాముడు స్వగృహములకుబంపె ననిభావము. "గతార్ధమాసా" చుట్టము, మిత్రుడు పదునైదుదినములుంతుట, ఉండవలెనని కోరుట, లోకమర్యాద యని సూచించుచున్నది.

శ్లో. తచ్చాత్మచింతాసులభం విమానం
హృతం సురారేః సహ జీవితేన
కైలాసనాథోద్వహనాయ భూయః
పుష్పం దివః పుష్పక మన్వమంస్త. 20

వ్యాఖ్య: ఆత్మచింతాసులభం – స్వేచ్ఛామాత్రముచేత లభించునదియు, సురారేః–దేవశత్రువగు రావణునియొక్క, జీవితేన, సహ–ప్రాణముతోడగూడ, హృతం-తనచేడీసికొనబడినదియు, దివః-ఆకాశమునకు, పుష్పం-పుష్పమువలె నాభరణప్రాయమైనదియు నగు, తచ్చ, పుష్పకం, విమానం-ఆపుష్పకవిమానమును గూడ, భూయః-మరల, కైలాసనాథోద్వహనాయ-కైలాసనాథ-కుబేరుని, ఉద్వహనాయ-ఆకసముపైడ్రిప్పటకొఱకు, అన్వమంస్త-అనుమతించెను. అధిపతి తలచినట్లు మెలగునదియు, రావణునిడ జంపినప్పుడు తనవశమైనదియు, ఆకాశమునకు భూషణమైనట్టిదియు నగు పుష్పకవిమానమును మరలడ గుబేరునివద్దికి వెళ్ళుటకు రాముడనుమతించెను. "భూయః" అనుపదము పుష్పక విమానము కుబేరునిదేయనియు, రావణుడపహరించియుండె ననియు సూచించుచున్నది. అను + అమంస్త-అన్వమంస్త "మన-అవబోధనే" ధాతువులుఙ్ ప్ర.ఏ.

శ్లో. పితుర్నియోగా ద్వనవాస మేవం
నిస్తీర్య రామః ప్రతిపన్నరాజ్యః,
ధర్మార్థకామేషు సమాం ప్రపేదే
యథా తథై వావరజేషు వృత్తిమ్. 21

వ్యాఖ్య: రామః-రాముఁడు, ఏవం-ఇట్లు, పితుః-**తండ్రి**యొక్క,నియోగాత్-ఆజ్ఞవలన, వనవాసం-**అరణ్యవాసమును**, నిస్తిర్య-దాటి (పూర్తిచేసి), ప్రతిపన్న రాజ్యః-పొందఁబడినరాజ్యముగలవాఁడగుచు, ధర్మార్థకామేషు-పురుషార్థములగు ధర్మార్థకామములందు, యథా-ఎట్లో, తథైవ-ఁట్లే, అవరజేషు-తమ్ములయందు, సమాం, వృత్తిమ్-సమానమగు ప్రవృత్తిని, ప్రపేదే-పొందెను. **తండ్రి** శాసనము వలన సుదీర్ఘమైన వనవాసమును బూర్తిచేసి పట్టాభిషిక్తుఁడైన రాముఁడు ధర్మార్థ కామములందువలె ముగ్గురు తమ్ముల విషయమునను సమానప్రేమగలవాఁడై యుండెను. ధర్మార్థకామపురుషార్థములను వైషమ్యములేక సేవించుచు, తమ్ములంద రిని సమానముగాఁ జూచెనని భావము.

శ్లో. సర్వాసు మాతృష్వపి వత్సలత్వాత్
స నిర్విశేషప్రతిపత్తి రాసీత్,
షడాననాపీతపయోధరాసు
నేతా చమూనా మివ కృత్తికాసు. 22

వ్యాఖ్య : సః-రాముఁడు, వత్సలత్వాత్-సహజప్రేమ గలవాఁడగుటవలన, సర్వాసు, మాతృషు, అపి-తల్లులందఱియందును, నిర్విశేషప్రతిపత్తిః-సమానసత్కారములు చేయువాఁడు, చమూనాం, నేతా-దేవసైన్యములకు నాయకుఁడగు షణ్ముఖుఁడు, షడాననాపీతపయోధరాసు-ఆరు మొగములచేతను ద్రాగఁబడిన స్తన్యములుగల, కృత్తికాసు, ఇవ-తల్లులైన షట్కృత్తికలయందువలె, ఆసీత్-అయ్యెను. షణ్ముఖుఁడు ఆరు మొగములద్వారా ఆర్గురు తల్లుల పాలు ద్రాగి వారందఱియందును సమాన భక్తిగలిగియున్నట్లు సహజ వాత్సల్యపూర్ణుఁడగు రాముఁడు తల్లులందఱి యందును తుల్యగౌరవము గలవాఁడై యుండెనని భావము. మాతాపుత్ర ప్రేమకు స్తన్యపానము పరాకాష్ఠ యగుట వలన షడాననోపమాన మిచ్చటఁ జెప్పఁబడినది.

శ్లో. తేనార్థవాన్ లోభపరాఙ్ముఖేన
తేన ఘ్నతా విఘ్నభయం క్రియావాన్,
తేనాస లోకః పితృమాన్ వినేత్రా
తథైవ శోకాపనుదేన పుత్రీ. 23

వ్యాఖ్య : లోకః-జనము, లోభపరాఙ్ముఖేన-లోభగుణమునకు విముఖుఁడైన (దాతయగు), తేన-ఆ రామునిచేత, అర్థవాన్-ధనముగలది, ఆస-అయినది, విఘ్నభయం-విఘ్నములవలని భయమును, ఘ్నతా-నశింపఁజేయుచున్న, తేన-ఆతనిచేత, క్రియావాన్-సత్కర్మానుష్ఠానముగలది, ఆస-అయ్యెను, వినేత్రా-కర్తవ్యమువైపున నడపునట్టి, తేన-ఆతనిచేత, పితృమాన్-తండ్రిగలది, ఆస-అయ్యెను. శోకాపనుదేన-దుఃఖమును దొలఁగించునట్టి, తేన, ఏవ-ఆ రామునిచేతనే, పుత్రీ-కుమారులఁగలది (పుత్రః ఆస్య అస్తీతి పుత్రీ ఆని విగ్రహము). ఆస-అయ్యెను. రాముఁడు ప్రజలను దాతయై ధనవంతులనుజేయుచు, విఘ్నములను దొలఁగించి సత్కర్మానుష్ఠానపరులను జేయుచు, సన్మార్గనియామకుఁడై తండ్రిగల వారినిగా జేయుచు, దుఃఖములు తొలఁగించి పుత్రవదానందమును గూర్చుచుఁ బరిపాలించెనని భావము. "ఆస" అనునది క్రియవలెఁగనఁబడునట్టి అవ్యయము.

శ్లో. స పౌరకార్యాణి సమీక్ష్య కాలే
రేమే విదేహాధిపతే ర్దుహిత్రా,
ఉపస్థిత శ్చారు వపు స్తదీయం
కృతోప భోగోత్సుక యేవ లక్ష్మ్యా. 24

వ్యాఖ్య : సః-రాముఁడు, కాలే-సరియగునవసరమునందు, పౌరకార్యాణి-పౌరులపనులను, సమీక్ష్య-విచారించి, విదేహాధిపతేః దుహిత్రా-జనకునియొక్క కూతురగు సీతతో, ఉపభోగోత్సుకయా-సౌఖ్యానుభవమునకై త్వరపడుచున్నది యగుటచేత, తదీయం, చారు, వపుః-సీతాదేవిదగు నందమైన దేహమును, కృత్వా-ధరించియున్న లక్ష్మ్యా, ఇవ-లక్ష్మీదేవిచేతవలె, ఉపస్థితః(సన్)-కలిసికోఁబడిన వాఁడగుచు, రేమే-క్రీడించెను. సకాలమునఁ బ్రజాహితకార్యములను సరిదిద్ది, సౌఖ్యానుభవమునకుఁ ద్వరపడుచున్న లక్ష్మి యామెరూపమును ధరించెనా? యన్నట్లుండిన సీతాసుందరితో రాముఁ డిష్టసుఖముల ననుభవించె ననిభావము. "ఉపస్థానంతు సంగతిః" అనిఁబాదవ నిఘంటువు. 'రేమే' రము-క్రీడాయాం అను ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ.

శ్లో. తయో ర్వ్యథాప్రార్థిత మింద్రియార్థా
నాసేదుషోఃసద్మసు చిత్రవత్సు,

ప్రాప్తాని దుఃఖాన్యపి దండకేషు
సంచింత్యమానాని సుఖా న్యభూవన్. 25

వ్యాఖ్య : చిత్రపత్స్న-తమవనవాసచిత్రములు నిలిపిన, సద్మసు-భవనము లయందు, యథా పార్థితం-కోరికల పకారముగా, ఇంద్రియార్థా-జిహ్వాదీంద్రియ ములకు వలసిన రసాదులను, ఆసేదుషోః-అన భవించుచుండిన, తయోః-ఆసీతా రాముల కు. దండకేషు-దండకారణ్యములయందు, ప్రాప్తాని-పొందబడినవి, దుఃఖాని, ఆపి–కష్టములేయైనను, సంచింత్యమానాని-ఇప్పుడు స్మరింపబడుచున్న వగుచు, సుఖాని-సుఖములే, అభూవన్-అయినవి. రామవనవాస సంఘటనలను చిత్రపటములపై వేసి రాజభవనములందుంచగా సకలసౌఖ్యము లనుభవించు చున్న సీతారాములు చిత్రపటదర్శనమున స్మృతికి వచ్చిన విరహవిలాపాది కష్ట ములను సుఖములుగానే భావించిరి. పూర్వకష్టములు స్మరణసమయమున మధు రములగుట లోకసిద్ధముగదా! ఇంద్రియములు. "త్వక్చక్షుఃశ్రోత్రజిహ్వాఘ్రాణ ములు. అర్థములనగా స్పర్శ, రూప, శబ్ద, రస, గంధములు; ఇవి వాంఛితము లగుచో నానందము కల్గును.

శ్లో. అథా ధికస్నిగ్ధవిలోచనేన
ముఖేన సీతా శరపాండురేణ,
ఆనందయిత్రీ పరిణేతు రాసీ
దనక్షర వ్యంజితదోహదేన. 26

వ్యాఖ్య: అథ-ఆతరువాత, సీతా-సీతాదేవి, అధిక స్నిగ్ధవిలోచనేన-మిక్కిలి మస్పణములగు కన్నులుగలదియు, శరపాండురేణ-రెల్లుపువ్వువలె తెల్లనైనదియు, అనక్షర వ్యంజితదోహదేన—అనక్షర వ్యంజిత-వాగ్వ్యాపారములేకయే సూచింప బడిన, దోహదేన-గర్భముగలదియు నగు, ముఖేన-మొగముచేత, పరిణేతుః-భర్తకు, ఆనందయిత్రీ-సంతోషమును జేకూర్చునది, ఆసీత్-అయ్యెను. రాజ్యసుఖము ననుభవించుచు సీతారాములు కొంతకాలముగడపిన పిమ్మట, ఎక్కువ జిడ్డువారిన కన్నులతో తెల్లపువ్వువలెదెల్లబడి గర్భచిహ్నములను సూచించు ముఖముచేత సీత రాముని కానందముగలిగించె నని భావము. అనగా సీత గర్భవతి యయ్యెను.

శ్లో. తా మంక మారోప్య కృశాంగయష్టిం
వర్ణాంతరాక్రాంతపయోధరాగ్రామ్,
విలజ్జమానాం రహసి ప్రతీతః
పప్రచ్ఛ రామాం రమణో ఽభిలాషమ్. 27

వ్యాఖ్య : ప్రతీతః-గర్భమును, సీత మనస్సును ఎఱిగినట్టి, రమణః-ప్రియుడగు రాముఁడు, కృశాంగయష్టిం-కృశించిన దేహముగలదియు, వర్ణాంతరాక్రాంత పయోధరాగ్రాం--వర్ణాంతరాక్రాంత-నలుపువారిన, పయోధరాగ్రాం-స్తనాగ్రములు (చూచుకములు) గలదియు, విలజ్జమానాం-సిగ్గుపడుచున్నదియు నగు, తాం, రామాం-ఆప్రియురాలిని (సీతను), రహసి-ఏకాంతమునందు, ఆంకం, ఆరోప్య-తొడనెక్కించుకొని, అభిలాషం-మనోరథమును, పప్రచ్ఛ-అడిగెను. శరీరము కృశించుట, చూచుకములు నల్లబడుట, ఆమె సిగ్గుపడుచుండుట మొదలగు లక్షణములతో సీతమనోగతము నెఱిఁగినరాముఁడామెనేకాంతమునఁదొడపై నిడుకొని "నీ కోరికయేదో! తెలుపు" మని యడిగెను. "రమణః రామాం అభిలాషం పప్రచ్ఛ" ఇది ద్వికర్మక కర్తరి ప్రయోగము. ఈ రామారమణ శబ్దములు సీతారాముల యనురాగమును దెలుపుచున్నవి. రమయతీతి రమణః అని వ్యుత్పత్తి.

శ్లో. సా దష్టనీవారబలీని హింస్రైః
సంబద్ధవైఖానసకన్యకాని,
ఇయేష భూయః కుశవంతి గంతుం
భాగీరథీ తీర తపోవనాని. 28

వ్యాఖ్య : సా-సీత, హింస్రైః-క్రూరమృగములచేత, దష్టనీవారబలీని-దష్ట-కొరుకఁబడిన, నీవార-నివ్వరిధాన్యములే, బలీని-దేవతా తిర్యగ్జంతువుల బలులు గలవియు, సంబద్ధవైఖానసకన్యకాని-సంబద్ధ-స్నేహముగల, వైఖానసకన్యకాని-మునికన్యలుగలవియు, కుశవంతి-దర్భలుగలవియు నగు, భాగీరథీ తీర తపోవనాని-గంగాతీరమునందలి తపోవనములను గురించి, భూయః-మరల, గంతుం-వెళ్ళుటకు, ఇయేష-కోరెను. గడ్డిధాన్యములే పూజా దానములకు యోగ్యములై, తనతో సఖ్యముగలిగియున్న మునికన్యలు గలిగినవై, దర్భారణ్యములుగల గంగాతీరస్థ తపోవనములకు మరల నొకపర్యాయము వెళ్ళినబాగుండు. నని సీత రాముని కిఁదనయభిలాషను వెల్లడించెను. "ఇయేష" ఇష-ఇచ్ఛాయాం అనుధాతువునకు లిట్ ప్ర.పు. ఏకవచనము.

శ్లో. తస్యై ప్రతిశ్రుత్య రఘుప్రవీర
స్తదీప్సితం పార్శ్వచరానుయాతః,
ఆలోకయిష్యన్ ముదితా మయోధ్యాం
ప్రాసాద మభ్రంలిహ మారురోహ. 29

వ్యాఖ్యః రఘుప్రవీరః-రాముఁడు. **తస్యై**-సీతకొఱకు, **తదీప్సితం**-ఆకోరికను, **ప్రతిశ్రుత్య**-తీర్చెదనని ప్రతిజ్ఞచేసి, **పార్శ్వచరానుయాతః**—పార్శ్వచర-అప్ప డచ్చటనుండిన, సేవకజనముచేత, **అనుయాతః**-వెంబడింపఁబడిన వాఁడగుచు, **ముదితాం**-తమయునికివలన నానందమును జెందిన, **అయోధ్యాం**-అయోధ్యానగరమును, **ఆలోకయిష్యన్**-చూడఁబోవువాఁడగుచు, **అభ్రంలిహం**-ఆకాశమునుదాకుచున్న, ప్రాసాదం-మేడను, **ఆరురోహ**-ఎక్కెను. గంగాతీరస్థ తపోవనములను మరలఁజూడఁదలచిన సీత యొక్కకోరికను తప్పకతీర్చెదనని చెప్పి, రాముఁడు తనరాజ్యపాలనమున అయోధ్యానగర మెట్టులానందించుచున్నదో చూడఁదలచినవాఁడై సేవకజన మనుసరించుచుండగా మహోన్నతమైనరాజభవనమునపైకి వెళ్లెను. ఆఙ్ అను ఉపసర్గతోఁగూడిన "రుహ" ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ. (ఆ+రురోహ-ఆరురోహ). ఆరురోహ-ఎక్కెను, అవరురోహ-దిగెను. అని యర్థములు.

శ్లో. బుద్ధాపణం రాజపథం స పశ్యన్
విగాహ్యమానాం సరయూం చ నౌభిః
విలాసిభి శ్చాధ్యుషితాని పౌరైః
పురోపకంతోపవనాని తేమే. 30

వ్యాఖ్య : సః-ఆ రాముఁడు, **బుద్ధాపణం**-సమృద్ధిగా [illegible], **రాజపథం**-పెద్దవీధిని, **నౌభిః**-పడవలచేత, **విగాహ్యమానాం**-[illegible] ప్రవేశింపబడుచున్న **సరయూం చ**-సరయూనదినిన్ను, **విలాసిభిః**-విలాసశీలురగల, **పౌరైః**-నగరవాసులచేత, **అధ్యుషితాని**-కూర్చోఁబడినవగు, **పురోపకంతోపవనాని, చ**-నగరసమీపమునన్నున్న తోటలను సైతము, **పశ్యన్**-చూచుచున్నవాఁడగుచు, **తేమే**-ఆనందించెను. వికయవిక్రయార్థమై వచ్చిన జనుల కలకలముతో వస్తుసమృద్ధిగలకొట్లతో ముచ్చటగొల్పు రాజవీథిని, వ్యాపారార్థమై సముద్రమువైపునకు వెళ్ళు నోడలచేఁ

ప్రవేశింపఁబడుచున్న సరయూనదిని, ఆనందోత్సాహవిలాసములు వెల్లివిరియు పుర జనులతోనిండిన నగరోద్యాన ప్రదేశములను జూచుచు రాముఁడానందించెను.
అలంకారములు: ఉదాత్తము, అనుప్రాసము.

శ్లో. స కింవదంతీం వదతాం పురోగః
స్వవృత్త ముద్దిశ్య విశుద్ధవృత్తః,
సర్వాధిరాజోరుభుజో ఽపసర్పం
ప్రచచ్ఛ భద్రం విజితారిభద్రః. 31

వ్యాఖ్య : వదతాం,పురోగః-వాగ్మిజనపురోగామియు. విశుద్ధవృత్తః–నిర్మలమైన నడతగలవాఁడును, సర్వాధిరాజోరుభుజః-ఆదిశేషునివలె దీర్ఘములగు బాహువులుగలవాఁడును, విజితారిభద్రః-విజిత-జయింపఁబడిన, అరిభద్రః-గొప్ప శత్రువుగలవాఁడును నగు, సః-ఆరాముఁడు, స్వవృత్తం, ఉద్దిశ్య-తననడవడిని గుఱించి, భద్రం-భద్రుఁడనుపేరుగల, అపసర్పం–చారుని, కింవదంతీం-జనవాక్యమును, ప్రప్రచ్ఛ-అడిగెను. మాటలలో, నడవడిలో, సౌందర్యములో, పరాక్రమములోను ఏలోపములేనివాఁడయినను రాముఁడు తననడవడిని గురించి ప్రజలేమనుకొనుచున్నారో తెలుపమని భద్రుఁడను చారుని ప్రశ్నించెను. "అపసర్ప శ్చరఃస్పశఃు" అని, "కింవదంతీ జనశ్రుతిఃు" అనియు నమరకోశము.

శ్లో. నిర్బంధపృష్టః స జగాద సర్వం
స్తువంతి పౌరా శ్చరితం త్వదీయమ్,
అన్యత్ర రక్షోభవనోషితాయాఃు
పరిగ్రహా న్మానవదేవ! దేవ్యాఃు. 32

వ్యాఖ్య : నిర్బంధపృష్టఃు-ఒత్తిడిచేసి యడుగఁబడిన, సఃు-ఆచారుఁడు. మానవదేవ–ఓ పభూ! రక్షోభవనోషితాయాఃు-రక్షోభవన–రావణునియింటియందు, ఉషితాయాఃు-నివసించియుండిన, దేవ్యాఃు-సీతాదేవియొక్క, పరిగ్రహాత్-స్వీకరించుటకంటే, అన్యత్ర-ఇతరాంశమునందలి (అది తప్పయని అర్థము), త్వదీయం-తమరికి సంబంధించిన, సర్వం, చరితం-నడవడినంతటిని, పౌరాఃు-పురజనులు, స్తువంతి-పొగడుచున్నారు, (అని) జగాద-చెప్పెను. రాముఁడు మరిమరీ

యొత్తిడిచేసి యడుగఁబడిన భద్రుఁడు "స్వామీ! రావణగృహనివాసముచేసిన సీతా దేవిని మీరు స్వీకరించిన విషయము తప్ప మిగిలిన మీ చరిత్రమునంతటిని ప్రజలు మెచ్చుకొనుచున్నారు" అని స్పష్టముగాఁ జెప్పెను, "జగాద" గద-వ్యక్తాయాం వాచి అనుధాతువునకు లిట్ ప్ర. పు. ఏ. "పరిగ్రహ" శబ్దమునకు భార్య అర్థ మగుటచేత, మరల భార్యనుగా స్వీకరించుట పౌరుల కసమ్మతముగా నున్నదని సూచింపఁబడినది.

శ్లో. కళత్రనిందాగురుణా కిలైవ
మభ్యాహతం కీర్తివిపర్యయేణ,
అయోఘనే నాయ ఇవాభితప్తం
వైదేహిబంధో ర్హృదయం విదద్రే. 31

వ్యాఖ్య : ఏవం,కిల-ఇట్లువచ్చిన, కళత్రనిందాగురుణా-భార్యాదూషణము చేత మోయజాలనిదగు, కీర్తివిపర్యయేణ-అపకీర్తిచేత, అభ్యాహతం-పగులఁగొట్ట బఁడిన, వైదేహిబంధోఃహృదయం-సీతావల్లభుఁడగు రామునియొక్క హృద యము, అమోఘనేన-సమ్మెటచేత, అభితప్తం-అగ్నిలోకాల్చిన, అయఃఇవ-ఇనుమువలె, విదద్రే-ముక్కలైపోయినది. భద్రుని వాక్యమువలన సీతాదేవికి వచ్చినిందను తన్మూలముగాఁదనకువచ్చిన యపకీర్తిని భరింపఁజాలని యా సీతావల్లభుని హృదయము అగ్నితప్తమైన యినుము సమ్మెటవ్రేటుచేతవలె పగిలి ముక్కలైనదని భావము. "కళత్ర" శబ్దము, సీత ఆపత్సంపదలయందుఁ దనను వీడని యమాయికురాలనియు, "వైదేహిబంధు" శబ్దము, రాముఁడు సీతపై నవ్యా జానురాగముగలవాఁడైయుండెననియు స్ఫురింపఁజేయుచున్నవి. కీర్తివిపర్యయ" మనఁగా కీర్తికి తలక్రిందులుగానుంటుట "అపకీర్తి" యని అర్థము. "వైదేహి" శబ్దము "ఈ" కారాంతము. కాని "వైదేహి" అని "ఇ" కారాంతముగాఁ ప్రయో గింపఁబడుట "జ్యాపోఃసంజ్ఞాఛందసో ర్బహులమ్" అను పాణిని సూత్రాంగీ కారమువలన నని గ్రహింపవలెను. ఇది కాళిదాసః, రేవతిపుత్రః మొదలయినవాని వలె సాధుప్రయోగమే.

శ్లో. కిమాత్మనిర్వాదకథాముపేక్షే?
జాయామదోషామథ సంత్యజామి?

ఇ త్యేకపక్షాశ్రయ విక్లబత్వా
దాసీ త్స దోలాచల చిత్తవృత్తిః. 34

వ్యాఖ్య : ఆత్మనిర్వాదకథాం-నాయపకీర్తికథను, కిం,ఉపేక్షే-ఉపేక్ష సేయుదునా? (లెక్క_చేయకుందునా?), ఉత-లేక, ఆదోషాం-ఏతప్పునుజేయని, జాయాం-భార్యను, సంత్యజామి-విడిచిపెట్టుదునా?, ఇతి-ఇట్లని, ఏకపక్షాశ్రయ విక్లబత్వాత్—ఏకపక్ష-రెండింటిలో నొకదానిని, ఆశ్రయ-స్వీకరించుటయందు, విక్లబత్వాత్-ఆధీరుడై నిర్ణయించుకో జాలకపోవుటవలన, సః-రాముడు, దోలా చలచిత్తవృత్తిః-ఊయెలవలె నిలుకడలేని మనోవ్యాపారముగలవాడు, ఆసీత్-అయ్యెను, తనపైవచ్చిన యపకీర్తిని లెక్కచేయకుండుటయా? లేక యెట్టిదోష మునులేని భార్యను విడుచుటయా? అన్న రెండు పక్షములలో నొకదాని నాశ్ర యింపజాలక రాముడు సంశయగ్రస్తమనస్కుడయ్యె నని భావము. అపకీర్తి మరణము కంటెను గొప్పది. పతివ్రతయై తప్పుచేయని భార్యను విడుచుట పాప హేతువు కనుక రామునికట్టి స్థితి యేర్పడెను. "జాయా" శబ్దము, సంతానప్రద త్వార్థము గలదియు, "విక్లబ" శబ్దము, సర్వేంద్రియవ్యాపార శూన్యత్వమును దెలుపునదియు నగుటచే సార్థకములు.

శ్లో. నిశ్చిత్య చానన్యనివృత్తి వాచ్యం
త్యాగేన పత్న్యాః పరిమార్ష్టు మైచ్ఛత్,
అపి స్వదేహాత్ కిము తేంద్రియార్థాత్
యశోధనానాం హి యశో గరీయః. 35

వ్యాఖ్యః చ-మరియు, వాచ్యం-అపకీర్తిని, అనన్యనివృత్తి-మరియొక దానిచేత నివర్తింపని దానినిగా, నిశ్చిత్య-నిశ్చయించుకొని, పత్న్యాః-భార్యయొక్క_ త్యాగేన-త్యాగముచేత, పరిమార్ష్టుం-తుడిచివేయుటకు (పరిహరించుటకు) ఐచ్ఛత్-ఇష్టపడెను. హి-అదియుక్తమే; యశోధ నానాం-యశోధనులగు వారికి, స్వదేహాత్, అపి-తమశరీరముకంటెను, యశః-కీర్తి, గరీయః-గొప్పదై యుండగా, ఇంద్రి యార్థాత్-ప్రసక్చందన వనితాదిక మగు భోగ్యవస్తు జాతముకంటే, గరీయః-గొప్పదని, కిముత-చెప్పవలసినదేమున్నది? ఈ వచ్చిన యపకీర్తికి సీతాపరిత్యా

గముతప్ప మరియొక నివృత్తిమార్గము లేదని నిశ్చయించుకొని, భార్యను విడిచి పెట్టుటకే రాముఁడు ఇష్టపడెను. కారణమేమనగా యశోధనులకు కీర్తి తమ శరీరము కంటెను గొప్పదై యున్నప్పుడు శరీరోపభోగ్య వస్తుజాతము సంగతి చెప్పవలసిన దేమున్నది? పురుషునికి స్త్రీ ఉపభోగ్యయే కనుక రాముఁడాత్మాపవాద వృత్తికై సీతను విడువఁదలచెనని భావము. పరి + మార్ష్టుం-పరిమార్ష్టుం. "మృజూ-శుద్ధౌ" ధాతువునకు "తుమున్" ప్రత్యయాంతమగు నవ్యయము.

శ్లో. స సంనిపా త్యావరజాన్ హతౌజాః
తద్వ్రీడియా దర్శన లుప్తహర్షాన్,
కౌలీన మాత్మాశ్రయ మాచచక్షే
తేభ్యః పున శ్చేద మువాచ వాక్యమ్. 36

వ్యాఖ్య: హతౌజాః-నిస్తేజస్కుఁడగు, సః-రాముఁడు, తద్వ్రీడియా దర్శన లుప్తహర్షాన్-తత్-ఆరాధునియొక్క, వ్రీడియాదర్శన-ముఖవికారదర్శనముచేత, లుప్త-లోపించిన, హర్షాన్-సంతోషముగల, అవరజాన్-తమ్ములను, సంనిపాత్య-ఒక్కచోటఁజేర్చి, ఆత్మాశ్రయం-స్వవిషయకమగు, కౌలీనం-నిందను, తేభ్యః-వారికి, ఆచచక్షే-చెప్పెను. పునశ్చ-మరియును, ఇదం-ఇకచెప్పఁబోవు, వాక్యం-మాటను, ఉవాచ-పలికెను. కలిగిన యపకీర్తిచేతఁ దేజోహీనుడై యున్న రాముఁడు తన దర్శనముచేత సంతోషము నశించిన తమ్ములందఱి నొక్కచోటఁజేర్చి తనకు వచ్చిన లోకనిందను వివరించిచెప్పి మరియు నిట్లుపలికెను. ఆ + చచక్షే-"ఆచచక్షే" చక్షిఙ్-వ్యక్తాయాంవాచి అనుధాతువునకు ఆత్మనే పదిలిట్ ప్ర.పు.ఏ.

శ్లో. రాజర్షివంశస్య రవిప్రసూతేః
ఉపస్థితం పశ్యత కీదృశో ఽయమ్,
మత్తః సదాచారశుచేః కలంకః
పయోదవాతా దివ దర్పణస్య. 37

వ్యాఖ్య: రవిప్రసూతేః-సూర్యునివలనఁబుట్టిన, రాజర్షివంశస్య-ఇక్ష్వాకు వంశమునకు, సదాచారశుచేః-సచ్ఛీలమువలన శుద్ధమ్మెయున్న దానికి, మత్తః-

నానుండి, దర్పణస్య-అద్దమునకు, పయోదవాతాత్, ఇవ-మేఘయుక్త వాయువు వలనవలె, కీదృశః-ఎట్టి, అయం, కలంకః-ఈలోపము, ఉపస్థితః-ప్రాప్తమైనదో, పశ్యత-చూడుడు. ఇంటియందున్న అద్దమునకు జినుకులతోడిగాలి సోకి యపకాశమును జేకూర్చినట్లు నావలన సూర్యసంజాతమై సదాచారయుక్తమైయున్న యిక్ష్వాకువంశమున కెట్టికళంకము వచ్చినదో చూడుడని తమ్ములతో ననెను. పయోదవాత శబ్దమునకు జలకణయుక్త మేఘముతో గూడినగాలి యర్థము.

శ్లో. పౌరేషు సోఽహం బహులీభవంత
మపాం తరంగే ష్వివ తైలబిందుమ్,
సోఢుం న తత్పూర్వ మవర్ణ మీశే
ఆలానికం స్థాణు మివ ద్విపేంద్రః. 38

వ్యాఖ్య: సోఽహం (సః + అహం)-అట్టిస్థితిలోనున్ననేను, అపాం, తరంగేషు-జలతరంగములయందు, తైలబిందుం, ఇవ-నూనెచుక్కవలె, పౌరేషు-పురజనులయందు, బహులీభవంతం-వ్యాపించిపోవునదియు, తత్పూర్వం-అదియే మొదటిదియు నగు, అవర్ణం-అపవాదమును, ద్విపేంద్రః-ఉత్తమగజము, ఆలానికం-కట్టుగొయ్యగానున్న, స్థాణుం, ఇవ-స్తంభమునువలె, సోఢుం-సహించుటకు, నేశే (న + ఈశే)-శక్తుడనుగాలేకయున్నాను. తరంగములపైబడిన నూనెచుక్కవలె పౌరులయం దొకరినుండి మరియొకరికిబ్రాకి పెరుగుచున్న యీక్రొత్తయపకీర్తిని గజేంద్రము బంధన స్తంభమునువలె సహింపలేకున్నాను. తరంగోపమానము పౌరులకు జెప్పుట చక్కగానున్నది. స్వేచ్ఛావిహారకమగు నాలానమున గజము బాధపడునట్లు లీయపకీర్తివలన నలుగురిలో దలయెత్తుకొని తిరుగజాలని బాధ పడుచున్నానని భావము.

శ్లో. తస్యా పనోదాయ ఫల ప్రవృత్తా
వుపస్థితాయా మపి నిర్వ్యపేక్షమ్
త్యక్ష్యామి వై దేహసుతాం పురస్తాత్
సముద్రనేమిం పితు రాజ్ఞ యేవ. 39

వ్యాఖ్య: తస్య-ఆయపవాదముయొక్క, అపనోదాయ-తొలగింపు కొఱకు, ఫలప్రవృత్తౌ-సంతానోత్పత్తియందు (ఫలమునిచ్చుటయందు), ఉపస్థితాయాం,

అపి-సమీపించియున్న దైనప్పటికిని, నిర్వ్యపేక్షః(స౯)-నిస్పృహగలవాఁడనగుచు, వైదేహసుతాం-సీతను, పురస్తాత్-పూర్వము, పితుః, ఆజ్ఞయా-తండ్రియొక్క ఆజ్ఞచేత, సముద్రనేమిం, ఇవ-భూమినివలె, త్యక్ష్యామి-విడిచెదను. వచ్చిన యపవాదమును దొలగించుకొనుటకు సంతానవతికాఁ బోవుచున్నదైనను సీతను, పూర్వము తండ్రియాజ్ఞచేత రాజ్యమును విడిచినట్లు, ఎట్టియాశయులేక విడువనున్నానని చెప్పెను. సముద్రః నేమిరివ నేమిః యస్యాఃసా-సముద్రనేమిః. ఐండి చక్రమునకు ఇనుపకమ్మివలె తనచుట్టు సముద్రము గలది, భూమి ఆని యర్థము. "త్యక్ష్యామి" తజధాతువునకు భవిష్యదర్థకల్యుట్. ఉ.పు.ఏ.

శ్లో. అవైమి చైనా మనఘేతి కింతు
లోకాపవాదో బలవాన్ మతో మే,
ఛాయా హి భూమేః శశినో మలత్వే
నారోపితా శుద్ధిమతః ప్రజాభిః. 40

వ్యాఖ్యః ఏనాం-సీతను, అనఘా, ఇతి, చ-దోషములేనిదని కూడా, అవైమి-ఎఱుగుదును, కింతు-కాని, మే-నాకు, లోకాపవాదః-వచ్చిన లోకనింద, బలవాన్, మతఃగొప్పదని తలఁచెదను. హి-ఏకారణము వలన, ప్రజాభిః-ప్రజలచేత, భూమేః, ఛాయా-భూమియొక్క ప్రతిబింబము, శుద్ధిమతఃనిర్మలుఁడైన, శశినఃచంద్రునికి, మలత్వేన-కళంకముగా, ఆరోపితా-ఆరోపింపఁబడియున్నదో, అందువలన లోకాపవాదమే బలవత్తరమని తలఁచెదనని యర్థము. "పదుగురాడు మాట పాటియైధరఁ జెల్లు"నన్నట్లు సత్యమునకు దూరమైనను, చంద్రునిలోఁగనఁబడు భూచ్ఛాయను కళంకముగా స్థిరపరచినట్లు నిష్కళంకయైన సీతను దోషయుక్తనుగాఁ జిత్రించుచున్న ప్రజావాణిని నేను అనురింపక తప్పదని భావము. అవ+ఏమి-అవైమి. ఇణ్ ధాతువునకు లట్. ఉత్తమ పురుష ఏకవచము

శ్లో. రక్షోవధాంతో న చ మే ప్రయాసో
వ్యర్థఃస వైరప్రతిమోచనాయ,
అమర్షణఃశోణితకాంక్షయా కిం
పదా స్పృశంతం దశతి ద్విజిహ్వాః. 41

వ్యాఖ్య: కించ-మరియును, మే-నాయొక్క, రక్షోవధాంతః-రావణునివధ వఱకు నుండిన, ప్రయాసః-శ్రమ, వ్యర్థః, న-ప్రయోజనములేనిదికాదు. కింతు-మరియేమనఁగ, వైరప్రతిమోచనాయ, సః-వైరనిర్మూలనముకొఱకేయది, తథాహి-అదియెట్లనగా, అమర్షణః-కీడును సహింపఁజాలని, ద్విజిహ్వః-సర్పము, పదా-కాలితో, స్పృశంతం-తాకుచున్నవానిని, శోణితకాంక్షయా-నెత్తురు మీది కోరిక చేతనే, దశతికిం?-కఱచునా? నాప్రయాసము రావణునిఁ జంపుటతో ముగియలేదు. ఆవైరము, తన్మూలకమగు నపకీర్తి సమూలముగా నశింపఁ జేయువఱకు ఆది యాగదు. అవమానమును సహింపలేని సర్పము కాలితో తొక్కిన పురుషుని రక్తము కొఱకై వానినిఁ గఱచునా? వానిపైఁగల శత్రుత్వమును దీర్చుకొనుటకే వానిని గఱచును. అట్లే నాయీకష్టము రావణాపకారఫలస్వర్మ నశించువఱకు నుండును, అది సీతా పరిత్యాగముతోఁగాని యాగదని భావము. "దశతి" "దంశ-దశనే" ధాతువులట్. ప్ర.పు.ఏ. "దశన"మనఁగా దంష్ట్రా వ్యాపారము.

శ్లో. త దేష సర్గః కరుణార్ద్రచిత్తై
ర్న మే భవద్భిః ప్రతిషేధనీయః,
యదర్థితా నిర్హృతవాచ్యశల్యాన్
ప్రాణాన్ మయా ధారయితుం చిరం వః. 42

వ్యాఖ్య: తత్-అందువలన, ఏషః-ఈ, మే, సర్గః-నాయొక్క నిశ్చయము, కరుణార్ద్రచిత్తైః, భవద్భిఃదయార్ద్రచిత్తులై న మీచేత, న, ప్రతిషేధనీయఃనివారింపఁదగినదికాదు. నిర్హృతవాచ్యశల్యాఃనిర్హృత-పూర్తిగాఁ దీసివేయఁబడిన, వాచ్య-లోకనిందయనెడి, శల్యాఃశల్యములగల, ప్రాణాఃప్రాణములను, మయా నాచేత, చిరం, ధారయితుం-ఎక్కువకాలము ధరింపఁ జేయుటకు, వఃమీకు, అర్థితా, యది-వాంఛ ఉన్నట్లయితే. వెనుక చెప్పిన కారణము వలన నా నిశ్చయమును, నేను నిందారహితుఁడనై కొంతకాలము జీవింపవలె నన్న కోరిక మీకున్నట్లయితే, దయాభావముతో నివారింపవద్దని రాముఁడు తమ్ములతో ననెను. "సర్గఃస్వభావనిర్మోక్ష నిశ్చయాధ్యాయ సృష్టిషు" అని యమరము.

శ్లో. ఇత్యుక్తవంతం జనకాత్మజాయాం
నితాంతరూఢాభినివేశ మిశమ్,

న కశ్చన భ్రాతృషు తేషు శక్తో
నిషేద్ధు మాసీ దనుమోదితుం వా. 43

వ్యాఖ్య : ఇతి, ఉక్తవంతం-ఇట్లుపలికినవాఁడును, జనాకాత్మజాయాం-సీతావిషయమున, నితాంతరూక్షాభినివేశం—నితాంతరూక్ష-మిక్కిలిక్రూరమైన, అభినివేశం-పట్టుదలగలిగియున్న, ఈశం-ప్రభువైన శ్రీరాముని, తేషు, భ్రాతృషు-ఆసోదరులయందు, కశ్చన-ఎవ్వఁడుఁగూడ, నిషేద్ధుం-నివారించుటకుఁగాని, అనుమోదితుం, వా-సతేయని యంగీకరించుటకుఁగాని, శక్తఃచాలినవాఁడు, న,ఆసీత్-కాలేదు. అట్లు సీతావిషయమున కఠిన ప్రవృత్తినిఁ జూపఁదలఁచుకొన్న రాముని వారించుటకుఁగాని, అట్లే ప్రవర్తింపుమని ఆమోదించుటకుఁగాని, రెండుపక్షములును ప్రబలములైయున్నందున, తమ్ములలో నెవ్వరును సమర్థులుగాక మౌనము వహించిరని భావము.

శ్లో. సౌ లక్ష్మణం లక్ష్మణపూర్వజన్మా
విలోక్య లోకత్రయగీతకీర్తిఃసౌమ్యేతి చాభాష్య యథార్థభాషీ
స్థితం నిదేశే పృథగాదిదేశ. 44

వ్యాఖ్య : లోకత్రయగీతకీర్తిఃమూడులోకములవారిచేత కొనియాడఁబడిన కీర్తిగలవాఁడును, యథార్థభాషీ-సత్యమును వచించువాఁడును, లక్ష్మణపూర్వజన్మా-లక్ష్మణాగ్రజుడుఁను నగు, సఃరాముఁడు, నిదేశే,స్థితం-ఆజ్ఞాకారియగు, లక్ష్మణం-లక్ష్మణుని, విలోక్య-చూచి, హేసౌమ్య ఇతి, ఆభాష్య, చ-ఓసౌమ్యుఁడా! యని పలుకరించియు, పృథక్-భరతశత్రుఘ్నులు లేనిచోట, ఆదిదేశ-ముందుఁచెప్పఁబోవురీతి నాజ్ఞాపించెను. ఎవ్వరును పలుకకపోఁగా తనయాజ్ఞను సర్వధా శిరసావహించు లక్ష్మణుని ప్రక్కకుఁబిలిచి కర్తవ్యము నాజ్ఞాపించెను.

శ్లో. ప్రజావతీ దోహదశంసినీ తే
తపోవనేషు స్పృహయాలు రేవ;
స త్వం రథీ తద్వ్యపదేశనేయాం
ప్రాపయ్య వాల్మీకిపదం త్యజైనామ్. 45

వ్యాఖ్య: దోహదశంసినీ-గర్భిణీ మనోరథమును తెప్పుచున్న, తే ప్రజావతీ-మీవదినె, తపోవనేషు-తపోవనములయందు, స్పృహయాలుః, ఏవ-కోరికగలదియే యైయున్నది. సః, త్వం-అట్లు ఇట్టిందిలేని నీవు, రథీ(సన్)-రథమును గట్టించు కొన్నవాఁడవై, తద్వ్యపదేశనేయాం-ఆదోహదమిష.చేత తీసుకొనివెళ్ళుటకు పిలైన, ఏనాం-ఆమెను (సీతను), వాల్మీకి పదం-వాల్మీకి తపోవనమును, ప్రాపయ్య-చేర్చి, త్యజ-విడువుము. గర్భిణిగానున్న మీవదినె తపోవనమును మరలఁ జూడవలెనన్నది కనుక ఆమిషతో నామెను రథమెక్కించుకొని వాల్మీకి తపోవనమున విడిచిరమ్మని యాజ్ఞాపించెను. "ప్రజావతీ భ్రాతృజాయా" అని యమరము. "త్యజ" శోట్ మధ్యమపురుష ఏ.

శ్లో. స శుశ్రువాన్ మాతరి భార్గవేణ
పితు ర్నియోగాత్ ప్రహృతం ద్విషద్వత్,
పత్యగ్రహీ దగ్రజశాసనం తత్
ఆజ్ఞా గురూణాం హ్యవిచారణీయా. 46

వ్యాఖ్య: పితుః-తండ్రియగు జమగ్నియొక్క. నియోగాత్-శాసనము వలన, భార్గవేణ-పరశురామునిచేత, మాతరి-తల్లియందు, ద్విషద్వత్-శత్రువునందువలె, ప్రహృతం-చేయబడిన పరశుప్రహారమును, శుశ్రువాన్-వినియుండిన, సః-అలక్ష్మణుఁడు, తదగ్రజశాసనం-ఆయన్నగారి యాజ్ఞను, ప్రత్యగ్రహీత్-స్వీకరించెను. హి-ఏకారణము వలన, గురూణాం-పెద్దలయొక్క, ఆజ్ఞా-శాసనము, అవిచారణీయా-ముందు వెనుకలాలోచింపఁ దగినదిగాదో! పూర్వము జమదగ్నియాజ్ఞచేత తల్లితలను నఱికిన పరశురాముని చరిత్రను విన్నవాఁడు గావున లక్ష్మణుఁడన్న శాసనమును బదులాడక స్వీకరించెను. పెద్దలు చేయుమన్న పనిలో మంచిచెడ్డలు తానాలోచింపక చేయుటయే సోదర పుత్రాదుల ధర్మము. "పితృసమో జ్యేష్ఠః" అన్న ధర్మవచన ప్రకారము లక్ష్మణునికి రాముఁడు తండ్రివంటివాఁడు గదా!

శ్లో. అథా నుకూలశ్రవణప్రతీతా
మత్రస్నుభి ర్యుక్తధురం తురంగైః,
రథం సుమంత్రప్రతిపన్నరశ్మి
మారోప్య వైదేహసుతాం ప్రతస్థే. 47

వ్యాఖ్య : అథ-పిమ్మట, లక్ష్మణుఁడు, అనుకూలశ్రవణప్రతీతాం—అనుకూలశ్రవణ-ఇష్టమైన విషయమును వినుటచేత. ప్రతీతాం-సంతోషమునుజెందిన, వైదేహసుతాం-సీతను, అ్రతస్నుభిః-బెదురులేని, తురంగైః—గుఱ్ఱములచేత, యుక్తధురం-కట్టఁబడిన భారముగలదియు, సుమంత్రప్రతిపన్నరశ్మిం-సుమంత్రసారథిచేత పట్టుఁకోబడిన పగ్గములుగలదియునగు, రథం-రథమును, ఆరోప్య-ఎక్కించుకొని, ప్రతస్థే-బయలుదేరెను. అన్నయాజ్ఞకుబద్ధుఁడైన లక్ష్మణుఁడు సీతకోరిక ప్రకారం తపోవనమునకు దీసికొని వెళ్ళెదనని చెప్పి, గర్భిణీస్త్రీలకు శ్రమకలుఁగనిరీతిగా నదరు బెదరులేని గుఱ్రాలు కట్టిన రథముపై నామెనెక్కించుకొని ప్రయాణమయ్యెను: అ్రతస్నుభిః (న+త్రస్నుభిః) త్రసిధాతువునకు "క్ను" ప్రత్యయాంతము.

శ్లో. నా నీయమానా రుచిరాన్ ప్రదేశాన్
ప్రియంకరో మే ప్రియ ఇత్యనందత్,
నాబుద్ధ కల్పద్రుమతాం విహాయ
జాతం త మాత్మ న్యసిపత్రవృత్తమ్. 48

వ్యాఖ్య : సా-ఆసీత, రుచిరాన్-అందములైన, ప్రదేశాన్-ప్రదేశములను, నీయమానా-చేర్ఫఁబడినదగుచు, మే-నాయొక్క, ప్రియః-ప్రియుఁడగు భర్త, ప్రియంకరః, ఇతి-నాయిష్టమును గూర్చువాఁడని, అనందత్- సంతోషించెను. తం-అతనిని, ఆత్మని-తనవిషయమున, కల్పద్రుమతాం-కల్పవృక్షత్వమును, విహాయ-విడిచి, అసిపత్రవృక్షం-ఖడ్గాకారపత్రములుగల విషవృక్షముగా, జాతం-మారినవానిఁగా, నాబుద్ధ (న+అబుద్ధ)-తెలిసికొనలేకపోయెను. అట్లులక్ష్మణుఁడు రమ్యప్రదేశములకుఁ దీసికొనిపోవుచుండఁగా సీత తనభర్తను తనకుఁ ప్రియములను గూర్చువానిఁగానే తలఁచి యానందించెనుగాని, ఆతఁడు తనయభీష్టములను గూర్ఫఁగల కల్పవృక్షత్వమును వీడి యొక విషవృక్షముగా మారిన సంగతిని గురింపలేకపోయెనని భావము. "అసిపత్ర" మనఁగాఖడ్గాకారముగల యాకులతో నుండు వృక్షమనియు, ఒక నరకమునకునిలయము విశ్వనిఘంటువు. "ఆనందత్" టునది—సమృద్ధిధాతువునకు లఙ్; "అబుద్ధ" బుధ-అవగమనే ధాతువునకు లుఙ్. ప్ర. పు. ఏ.

శ్లో. జుగూహ తస్యాః పథి లక్ష్మణో యత్
సవ్యేతరేణ స్ఫురతా త దక్ష్ణా,
ఆఖ్యాత మస్యై గురు భావి దుఃఖం
అత్యంత లుప్త ప్రియదర్శనేన. 49

వ్యాఖ్యా: పథి-మార్గమునందు, లక్ష్మణః-లక్ష్మణుడు, యత్-ఏదుఃఖమును, తస్యాః-సీతాదేవినుండి, జుగూహ-దాచియుంచెనో, తత్, గురు-ఆగొప్పదియగు, భావి, దుఃఖం-ముందుకలుగబోవు దుఃఖము, అత్యంతలుప్త ప్రియదర్శనేన-మిక్కిలిలోపించిన అందమగుచూపు గలదియు, స్ఫురతా-అదరుచున్నదియు, సవ్యేతరేణ-కుడిదియునగు (అపసవ్యమైన), అక్ష్ణా-కంటిచేత, అస్యై-ఆమెకొఅకు (ఆమెకు) ఆఖ్యాతం-చెప్పబడినది. లక్ష్మణుడేదుఃఖమును సీతకుజెప్పక దాచియుంచెనో! మార్గమునందు, మాటిమాటికిని అదరుచున్న యామెకుడికంటిచేత భవిష్యత్తునదాగల యామహత్తర దుఃఖము చెప్పబడినది. స్త్రీలకు దక్షిణాక్షిస్ఫురణము అపశకున మగుటచేత సీత యేదియో యాపద రానున్నదని యూహించెనని భావము. "జుగూహ" గుహూ-సంవరణే ధాతువునకు భూతకాలార్థక లిట్ ప.పు. ఏకవచనము.

శ్లో. సా దుర్నిమిత్తో పగతాత్ విషాదాత్
సద్యః పరిమ్లానముఖారవిందా,
రాజ్ఞః శివం సావరజస్య భూయాత్
ఇ త్యాశశంసే కరణై రబాహ్యైః. 50

వ్యాఖ్యా: సా-ఆమె(సీత), దుర్నిమిత్తోపగతాత్-దుశ్శకునమువలన గలిగిన, విషాదాత్-దుఃఖమువలన, సద్యఃతప్పడే పరిమ్లానముఖారవిందా-వాడిన ముఖకమలము గలదగుచు, సావరజస్య-అనుజసహితుడయిన, రాజ్ఞః-రాజునకు (రామునికి) శివం-శుభము, భూయాత్-అగునుగాక, ఇతి-అని, అబాహ్యైః,కరణైఃఅంతఃకరణములచేత (మనస్సుచేత), ఆశశంసే-కోరెను. ఆ కలుగుచున్న దుఃశకునమువలని భయము వలన వాడి కళాహీనమగు ముఖముగలదైనసీత రామునికిని, ఆయన తమ్ములకును శుభమగునుగాక యని మనస్సులో దీవించెను. "కరణైః" బహువచనము మనోబుద్ధిహృదయములలో మాటిమాటికి అట్లుకోరె

ననియు, "ఆశశంసే" యనుఆత్మనే పదప్రయోగము సానుజుఁడగు భర్తక్షేమమే తనక్షేమమనియు సూచించుచున్నవి. "భూయాత్" ప్రార్థనార్థకమగు లిఙ్ ప్ర.పు ఏ. ఉత్తమ పతివ్రత యెట్టియాపదయందును ముందుగాఁగోరునది భర్త క్షేమమేయని పరమార్థము.

శ్లో. గురో ర్నియోగా ద్వనితాం వనాంతే
సాధ్వీం సుమిత్రాతనయో విహాస్యన్,
అవార్య తే వోత్థితవీచిహస్తైః
జహ్నో ర్దుహిత్రా స్థితయా పురస్తాత్. 51

వ్యాఖ్య : గురోః-జ్యేష్ఠునియొక్క, నియోగాత్-ఆజ్ఞవలన, సాధ్వీం, వనితాం-పతివ్రతయైనస్త్రీని (సీతను), వనాంతే-అరణ్యమునందు, విహాస్యన్-విడువఁబోవువాఁడగు, సుమిత్రాతనయః-లక్ష్మణుఁడు, పురస్తాత్-ఎదుట. స్థితయా-ఉన్నదియగు, జహ్నోః, దుహిత్రా-జాహ్నవిచేత, ఉత్థితవీచిహస్తైః-పైకిలేచిన తరంగములనెడు చేతులతో, అవార్యత, ఇవ-నివారింపఁబడెనా? యన్నట్లుండెను. అన్నయాజ్ఞవలన సాధ్వియైన సీతను అరణ్యమున విడిచిపెట్టఁదలచిన లక్ష్మణుఁడు, తమయెదుట ఇఁకదాటవలసినదిగానున్న గంగానదిచేత "వద్దుఅకార్యమునుజేయవద్దు" అని తరంగహస్తములెత్తి నివారింపబడుచున్నాఁడా? యన్నట్లుండెను. లక్ష్మణుఁడు సీతాయుక్త రథముతో గంగాతీరమునకుఁజేరెనని భావము. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. రథా త్స యంత్రా నిగృహీతవాహాత్
తాం భ్రాతృజాయాం పులినే ఽవతార్య,
గంగాం నిషాదాహృతనౌ విశేషః
తతార సంధా మివ సత్యసంధః. 52

వ్యాఖ్య : సః-ఆలక్ష్మణుఁడు, యన్త్రా-సారథిచేత! నిగృహీతవాహాత్-ఆపఁబడినగుఱ్ఱములుగల, రథాత్-రథమునుండి, తాం, భ్రాతృజాయాం-ఆవదినెను, పులినే-గంగయందలి యిసుకదిబ్బపై, అవతార్య-దింపి, నిషాదాహృతనౌవిశేషః-నిషాద-పల్లెవానిచేత, ఆహృత-తీసుకరాఁబడిన, నౌవిశేషః-దృఢమైన మంచి పడవగలవాఁడగుచు, గంగాం-గంగానదిని, సత్యసంధః-సత్యనిష్ఠగలవాఁడు, సంధాం, ఇవ-ప్రతిజ్ఞనువలె, తతార-దాటెను. గంగాతీరమున సారథి రథము

నాపగా, సీతాదేవిని యిసుకదిబ్బపై దింపి నిషాదుఁడుతెచ్చిన మంచిపడవపై నెక్కించి ఆమెతో భాగీరథినిదాటెను. ఆదాటుట ఒక సత్యసంధుఁడు తన ప్రతిజ్ఞను జెల్లించుకొనుసట్లుండెనట. అనఁగా నతికష్టముపై తనకిష్టమున్ననులేకున్నను నిర్వహింపవలసిన ప్రతిజ్ఞనుగా లక్ష్మణుఁడు మానసిక క్లేశముననుభవించుచు సీతాయుక్తముగా గంగనుదాటె నని భావము "సంధాప్రతిజ్ఞామర్యాదా" అని యమరము. ఆలంకారము: ఉపమ.

శ్లో. అథ వ్యవస్థాపితవాక్ కథంచిత్
సౌమిత్రి రంతర్గత బాష్పకంఠః,
ఔత్పాతికం మేఘ ఇవాశ్మవర్షం
మహీపతేః శాసన ముజ్జగార. 53

వ్యాఖ్య: అథ-గంగనుదాటిన పిమ్మట, కథంచిత్-అతికష్టముతో, వ్యవస్థాపితవాక్-స్వభావముగా (సరిగా) నుంచుకొనఁ బడిన వాక్కుగలిగినవాఁడును, అంతర్గత బాష్పకంఠః - కంఠమునందు స్తంభించిన కన్నీరుగలవాఁడును నగు, సౌమిత్రిః-లక్ష్మణుఁడు, మహీపతేః-రాజుయొక్క, శాసనం-ఆజ్ఞను, మేఘః-మేఘము, ఔత్పాతికం-ప్రళయమునందుఁ గలిగిన, అశ్మవర్షం, ఇవ-శిలావర్షమును వలె, ఉజ్జగార-వెడలఁగ్రక్కెను (చెప్పెను). గంగనుదాటిన పిమ్మట సీతకుఁ జెప్పవలసినమాట దారుణము, అవాచ్యము నగుటచేత నెట్లో వాక్కును స్థిరపరచుకొని, వచ్చుచున్న కన్నీటిచేత రుద్ధమైన కంఠముగల లక్ష్మణుఁడు రాజశాసనమును, మేఘము ఉత్పాత సమయమునఁ గురియు శిలావర్షమునువలె, వెలుపలికి గ్రక్కెను. అనఁగా అత్యంత దుఃఖపరవశుఁడై చెప్పెనని భావము. ఇచ్చట రామునిదనక "మహీపతి" యనుట రాజశాసన మసుల్లంఘనీయమనియు, "ఉజ్జగార" పదము తనయిష్టములేకయే వెలువరించెననియు, "ఔత్పాతిక" పదము సీతకావాక్కు శిలావర్షమువలె నుండెననియు స్ఫురింపఁజేయును, "ఉజ్జగార" (ఉత్ + జగార) గృనిగరణే. ధాతువునకు లిట్. అలంకారము; ఉపమ.

శ్లో. తతో ఽభిషంగానిల విప్రవృద్ధా
ప్రభ్రష్టమా నాభరణ ప్రసూనా,
స్వమూర్తిలాభప్రకృతిం ధరిత్రీం
లతేవ సీతా సహసా జగామ. 54

వ్యాఖ్య: తతః-ఆందువలన, అభిషంగానిల విప్రవృద్ధా-పరాభవమనెడి వాయువుచేత గొట్టబడినదియు, ప్రభ్రశ్యమానాభరణ ప్రసూనా-జారిపడుచున్న పూలవంటి ఆభరణములు గలదియు నగు, సీతా-సీత, లతేవ-ఒకతీగవలె, సహసా-హఠాత్తుగా, స్వమూర్తిలాభ పక్వతి-తనశరీరోత్పత్తికి గారణమగు, ధరిత్రీం-భూమిని, జగామ-చేరెను. పెద్దగాలిదెబ్బకు పువ్వులురాల్చుచు నేలపైబడు తీగవలె సీతాదేవి, ఆయవమానమును సహింపలేనిదై యాభరణములు జారిపడు చుండ తనజన్మకు కారణమైన భూమిపై మూర్ఛిల్లి హఠాత్తుగా బడిపోయెను. స్త్రీలకు ఆపదయందు తల్లియొడిలోజేరుట సహజముగదా! ఆలంకారము ఉపమ.

శ్లో. ఇక్ష్వాకువంశప్రభవః కథం త్వాం
త్యజే దకస్మా త్పతి రార్యవృత్తః,
ఇతి క్షితిః సంశయితేవ తస్యై
దదౌ ప్రవేశం జననీ నతావత్. 55

వ్యాఖ్య: ఇక్ష్వాకువంశప్రభవః-సుప్రసిద్ధమగు ఇక్ష్వాకువంశమునందుట్టి నవాడును, ఆర్యవృత్తః-సాధుచరితముగలవాడును నగు, పతిః-భర్త, త్వాం-నిన్ను, అకస్మాత్-అకారణముగా, కథం, త్యజేత్-ఎట్లువిడుచును? ఇతి-ఇట్లని, సంశయితా, ఇవ, తావత్-పూర్తిగా సందేహపడినది వలె, జననీ,క్షితిః-తల్లియగు భూదేవి, తస్యై-ఆసీతకు (కొఱకు), ప్రవేశమును, న, దదౌ-ఇయ్యలేదు. రాముడు. సీతను విడుచుటకు గల కారణము తెలియని భూదేవి. గొప్పవంశమునందుట్టి, ఆర్యవృత్తము ననుసరించుభర్త నిష్కారణముగా నిన్నేలవిడుచును? అని సంశయించుచున్నదివలె సీతకుదనలో ప్రవేశమునియ్యలేదు. మూర్ఛతో సీత యట్లే నేలపైబడియుండెననియు, త్యాగహేతువు తెలియుటకు ఔర్వము భూదేవి యుపేక్షించినదనియు భావము. "త్యజేత్" త్యజధాతువునకు సంభావనార్థక లిఙ్.

శ్లో. సా లుప్తసంజ్ఞా న వివేద దుఃఖం
ప్రత్యాగతాసుః సమతప్య తాంతః,
తస్యాః సుమిత్రాత్మజయత్నలబ్ధో
మోహో దభూత్ కష్టతరః ప్రబోధః. 56

వ్యాఖ్య: లుప్తసంజ్ఞా-స్పృహతప్పినట్టి, సా-ఆసీత, దుఃఖమును, న, వివేద-తెలిసికొనలేదు. ప్రత్యాగతాసుః-తిరిగి వచ్చిన ప్రాణములుగలదియయి, అంతః-మనస్సులో, సమతప్యత-తపించెను. తస్యాః-ఆమెకు, సుమిత్రాత్మజయత్న లబ్ధః-సుమిత్రాత్మజ-లక్ష్మణునియొక్క యత్న-ప్రయత్నములచేత, లబ్ధః-పొందఁబడిన, ప్రబోధః-మేలుకువ, మోహాత్-మూర్ఛకంటె, కష్టతరః-ఎక్కువ దుఃఖమును గలిగించుచున్నది, అభూత్-అయెను నష్టచేతనయైన సీత దుఃఖమును ఎఱుగలేదుకాని, ప్రాణములు వచ్చినదై మనస్సులో ఉడికిపోయెను. లక్ష్మణ ప్రయత్నలబ్ధమైన మెలకువయే ఆమెకు మూర్ఛకంటె అధికతరబాధను గలిగించెను మూర్ఛలో బాధ తెలియదుగదా! "వివేద" విద-జ్ఞానేచాతువునకు లిట్ ప్ర పు ఏ. "ఆతప్యత" తప-సంతాపే ధాతువునకు లఙ్. ప్ర.పు ఏ.

శ్లో. న చావదత్ భర్తు రవర్ణ మార్యా
నిరాకరిష్ణో ర్వ్యలీకా దృతే ఽపి,
ఆత్మాన మేవ స్థిరదుఃఖ భాజం
పునఃపున ర్దుష్కృతినం నినింద. ౫

వ్యాఖ్య : ఆర్యా-సాధ్వియైనసీత, వ్యలీకాత్, ఋతే, అపి-పాపములేక పోయినను, నిరాకరిష్ణోః-నిరసించినట్టి, భర్తుః-భర్తయొక్క, అపవాదం-లోకాపవాదమును గుఱించి, న, చ, అవదత్-పలుకనేలేదు స్థిరదుఃఖభాజం-ఎల్లకాలమును దుఃఖమునకు గుఱియగుచున్న, దుష్కృతినం-పాపమునుజేసినట్టి, ఆత్మానంఏవ-తనను గురించియే, పునఃపునః-మాటిమాటికిని, నినింద-నిందించెను. సాధ్వి గావున సీత ఏపాపమును జేయుని తనను నిరాకరించిన భర్తయొక్క అపవాద సత్యాసత్యములను గురించి పలుకక శాశ్వతముగా దుఃఖమునే యనుభవించు పాపమును జేసిన తనయాత్మనే పలుమారు పలువిధముల దూషించుకొనె నని భావము. అది పతివ్రతాలక్షణము. "కలుషం వ్యలీకై నోఽఘమ్" అని యమరము: "అవదత్" వద-వ్యక్తాయాంవాచి అనుదాత్తువునకు లఙ్; "నినింద" ణిది-కుత్సాయాం ధాతువునకు లిట్.

శ్లో. ఆఖ్యాస్య రామావరజః సతీం తా
మాఖ్యాతవాల్మీకి నికేతమార్గః,
నిఘ్నస్య మే భర్తృనిదేశరౌక్ష్యం
దేవి! క్షమస్వేతి బభూవ నమ్రః. ౬

వ్యాఖ్య : రామావరజః-రామునితమ్ముఁడు (లక్ష్మణుడు), సతీం-పాధ్వియగు, తాం-ఆసీతను, ఆశ్వాస్య-ఊరడించి, ఆఖ్యాతవాల్మీకి . నికేతమార్గః-చెప్పబడిన వాల్మీకి ఆశ్రమముయొక్క మార్గముగలవాఁడగుచు, నిమ్నస్య-పరాధీనుఁడనైన, మే-నాయొక్క, భర్తృనిదేశరౌక్ష్యం-ప్రభువునాజ్ఞచేతఁ జూపిన పరుషత్వమును, దేవి!-తల్లి! క్షమస్వ-క్షమింపుము, ఇతి-ఇట్లనుచు, నమ్రః-పాదములపైఁబడినవాఁడు, బభూవ-అయ్యెను. రాముని తమ్ముఁడుగావున నతనియాజ్ఞను నెరవేర్చుటలో నేను చూపిన కాఠిన్యమును క్షమింపుము, నేను పరాధీనుఁడను అనుచు సీతకాళ్ళపైఁబడెను. వాల్మీకిమహర్షి ఆశ్రమమునకు వెళ్ళుదారినిఁ జూపి యట్లు ప్రబతిమాలెనని భావము.

శ్లో. సీతా త ముత్థాప్య జగాద వాక్యం
ప్రీతాస్మి తే సౌమ్య! చిరాయ జీవ,
బిడౌజసా విష్ణు రివాగ్రజేన
భ్రాత్రా యదిత్థం పరవా నసి త్వమ్. 59

వ్యాఖ్య : సీతా–సీతాదేవి, తం-లక్ష్మణుని, ఉత్థాప్య-తనకాళ్ళపైనుండిలేపి, వాక్యం–ఏఁదుచెప్పఁబోవువాక్యమును, జగాద-పలికెను. (కిమితి-ఏమనియనఁగా) హేసౌమ్య-ఓసజ్జనుఁడా! తే, ప్రీతాస్మి-నీకొఱకు సంతోషించినదాననగుచున్నాను. చిరాయ, జీవ-చిరకాలము జీవింపుము. యత్-ఏకారణమువల్లనైతే, బిడౌజసా-ఇంద్రునిచేత, విష్ణుఃఇవ-ఉపేంద్రుఁడువలె, అగ్రజేన, భ్రాత్రా-పెద్దవాఁడైన అన్న చేత, త్వం-నీవు, ఇత్థం-ఇట్లు, పరవాన్-పరతంత్రుఁడవు, అసి-అయియున్నావో! పాదములపైనుండి లేపి సీత లక్ష్మణునితో నిట్లనెను, సౌమ్యుఁడా! నీయందు నాకు కోపములేదు, చిరకాలము వర్ధిల్లుము. ఇంద్రునిచేత నుపేంద్రుఁడువలె జ్యేష్ఠుని యాజ్ఞకు బద్ధుఁడవై యిట్లుచేసితివి, పరతంత్రుఁడవైన నీయందు తప్పేమియుఁదు.

శ్లో. శ్వశ్రూజనం సర్వ మనుక్రమేణ
విజ్ఞాపయ ప్రాపిత మత్ప్రణామ,
ప్రజానిషేకం మయి వర్తమానం
సూనో రనుధ్యాయత చేత సేతి. 60

వ్యాఖ్య : సర్వం, శ్వశ్రూజనం-శ్వశ్రూజనంవరిని, అనుక్రమేణ-క్రమము ననుసరించి, ప్రాపితమాత్సణామఃసన్-చేర్చబడిన నా నమస్కారములు గల వాడవగుచు, విజ్ఞాపయ-విన్నవింపుము (ఏమనియనగా), మయి-నాయందు, వర్తమానం-ఉన్నట్టి, సూనోఃమీకుమారునియొక్క, ప్రజాభిషేకం-సంతానని షేపమును (గర్భమును), చేతసా-మనస్సుచేత, అనుధ్యాయత, ఇతి-మంగళమగు కాక యని స్మరింపుడు, అని. సీత మరియు లక్ష్మణునితో నాయత్తలందరికిని వరు సగా నా నమస్కారములందించి, నాగర్భమునందున్న వారికుమారుని సంతాననిషే పమును దీవించుడని చెప్పు మని యనెను. నిషిచ్యత ఇతి నిషేకఃగర్భఃఅని యర్థము. "విజ్ఞాపయ" "వి" అను ఉపసర్గతోగూడిన జ్ఞా-అవబోధనే ధాతువునకు ప్రేరణార్థకమగు లోట్ మధ్యమపురుషైకవచనము. "అనుధ్యాయత" అనుపూర్వ ధ్యై-చింతాయాం ధాతువునకు లోట్ మధ్యమ పురుష బహువచనము.

శ్లో. వాచ్య స్త్వయా మద్వచనా త్స రాజా
వహ్నౌ విశుద్ధా మపి య త్సమక్షమ్
మాం లోకవాదశ్రవణా దహాసీఃశ్రుతస్య కిం త త్సదృశం కులస్య? 61

వ్యాఖ్యఃసఃరాజా-ఆరాజు (రాముడు), త్వయా-నీచేత, మద్వచనాత్-నామాటగా, వాచ్యఃచెప్పదగియున్నాడు. (ఏమనియందువా) సమక్షం-నీకనుల యెదుట, వహ్నౌ-అగ్నియందు విశుద్ధాం అపి-పరిశుద్ధురాలనైయున్నప్పటికిని, మాం-నన్ను, లోకవాద శ్రవణాత్-ప్రజలయసత్యవచనములు విన్నందున, అహాసీఃఇతియత్-విడిచి పెట్టితివనునదియేదికలదో ! తత్-అది, శ్రుతస్య-ప్రఖ్యాతినొందిన, కులస్య-మీవంశమునకు, సదృశంకిం ? - తగియున్నదా ? లేక శ్రుతస్య-శాస్త్రముసకుగాని, కులస్య - ఇక్ష్వాకువంశమునకుగాని, సదృశంకిం-తగినట్టిదేనా? నీకన్నులయెదుట నగ్నిప్రవేశముజేసిన నన్ను దహింపక అగ్నిహోత్రుడే నీవద్దకిదెచ్చి "యీమెపరిశుద్ధురాలు" స్వీకరింపుమని నీకుజెప్పెనుగదా! అట్టినన్ను లోకాపవాదశ్రవణమాత్రముచేత విడిచితివి. ఇది శాస్త్రసమ్మతమా? లేక మీవంశము నకుచితమా? లేక కామచారివై నీయిష్టమువచ్చినట్లు చేసితివా? యని రాజైన మీ యన్ననడుగుమని సీత దుఃఖించుచు లక్ష్మణునితోసనెనని భావము. "రాజా!" యనుట ఇదిరాజధర్మమా? యని యెత్తిపొడుచుట. "అహాసీఃఓహాక్-త్యాగే ధాతువునకు లఙ్ మధ్య పు.ఏ.

శ్లో. కల్యాణబుద్ధే రథవా తవాయం
న కామచారో మయి శంకనీయః
మమైవ జన్మాంతరపాతకానాం
విపాకవిస్ఫూర్జథు రప్రసహ్యాః 62

వ్యాఖ్య: అథవా-లేక, కల్యాణబుద్ధేః-మంచిబుద్ధిమంతుఁడవగు, తవ-నీకు, మయి-నావిషయమునందు, అయం-ఈత్యాగము, కామచారః-స్వేచ్ఛతోఁజేసినట్టిదని, నశంకనీయః-అనుమానింపఁ దగినదికాదు (కింతు-అయితే) మమైవ (మమ + ఏవ)-నాయొక్కయే, జన్మాంతర పాతకానాం-పూర్వజన్మకృత పాపములయొక్క, అప్రసహ్యాః-సహించుటకు శక్యముగాని, విపాకవిస్ఫూర్జథుః-ఫలమేయగు పిడుగు పాటు. లేదా ఇట్లు చెప్పము, చక్కని శాస్త్రసంస్కారము, ధర్మస్వరూపము నెఱిఁగిన బుద్ధిగలవాఁడవగు నీవు చేసిన యీదారత్యాగము కామచారమని, అనఁగా శాస్త్ర ధర్మ కులాచార విరుద్ధమగు స్వేచ్ఛాప్రవృత్తి యని యెట్లు ఊహించుటకు వీలున్నది? ఇది నేను పూర్వజన్మమునందుఁ జేసిన మహాపాపములకు ఫలమై నాపైఁబడిన పిడుగుపాటే యని తలఁచుచున్నాను, దీనిని నేనుభరింపలేకున్నాను. "స్ఫూర్జథు ర్వ్రజనిర్ఘోషః" అనియమరము. "కామచార" మనఁగా శాస్త్రవిరుద్ధముగా నడచుట.

శ్లో. ఉపస్థితాం పూర్వ మపాస్య లక్ష్మీం
వనం మయా సార్ధ మసి ప్రపన్నః,
త దాస్పదం ప్రాప్య తయాతిరోషాత్
సోఢాస్మి న త్వద్భవనే వసంతీ. 63

వ్యాఖ్య: పూర్వం-మొదట, ఉపస్థితాం-నిన్నుజేరిన, లక్ష్మీం-రాజ్యలక్ష్మిని, అపాస్య-దూరముచేసి, మయా, సార్ధం-నాతోఁగూడ, వనం-అరణ్యమును, ప్రపన్నః, అసి-చేరితివి, తత్-అందువలన, తయా-ఆలక్ష్మిచేత, అతిరోషాత్-మిక్కిలికోపమువలన, త్వద్భవనే-నీగృహమునందు, ఆస్పదం-నిలుకడను, ప్రాప్య-పొంది, వసంతీ-నివసించుచున్ననేను, సోఢా-సహింపఁబడిన దానను, న, అస్మి-కాకున్నాను. నేను వచ్చిన క్రొత్తలో నిన్నువరించిన రాజ్యలక్ష్మిని వదలివేసి

నాయందలి యనురాగముచేత నన్నుఁగొని యరణ్యమున కేగితివి. ఆకారణమువలన మిక్కిలి క్రుద్ధురాలైయున్న యాలక్ష్మి నేను మరల నీగృహమందు స్థిరముగా నివసించినచోఁ దనపై నీకనురాగము కలుగఁబోదను నీర్ష్యచేత నన్నచ్చట నుండనీక గెంటివేసినదని భావించుచున్నాను. సవతిపోరులేకుండఁ జేసికొన్నదేమో! యని యుత్ప్రేక్ష. "ఆస్పదం ప్రతిష్ఠాయామ్" ఇతినిపాతః. తిష్ఠవేయుట అని యర్థము.

శ్లో. నిశాచరోపప్లుతభర్తృకాణాం
తపస్వినీనాం భవతః ప్రసాదాత్,
భూత్వా శరణ్యా శరణార్థ మన్యం
కథం ప్రపత్స్యే త్వయి దీప్యమానే. 64

వ్యాఖ్య: నిశాచరోపప్లుతభర్తృకాణాం - నిశాచర-రాక్షసులచేత, ఉపప్లుత-పీడింపఁబడిన, భర్తృకాణాం-తమ భర్తలు గలవారగు, తపస్వినీనాం-మునిపత్నులకు, భవతః-నీయొక్క, ప్రసాదాత్-అనుగ్రహమువలన, శరణ్యా-రక్షణము నిచ్చినదానను, భూత్వా-ఆయియుండి, అద్య—ఇప్పుడు, త్వయి, దీప్యమానే-నీవు సర్వవిధముల ప్రకాశించుచున్నవాఁడవై యుండఁగానే, శరణార్థం-నన్నురక్షించుటకొఱకు, అన్యం-మరియొక తపస్విని, కథం. ప్రపత్స్యే-ఎట్లు చేరఁగలను? పూర్వము మునిపత్నులెందఱో తమ భర్తలను రాక్షసులు పీడించుచుండఁగా నీభార్యనైయుండుటచేత నన్ను శరణువేడిరి. నీయనుగ్రహమువలన వారికి రక్షణము నీయఁగల్గితిని. అట్టినేను ఇప్పుడు నీవు విరాజమానుఁడవై యుండఁగానే యరణ్యమున మరియొక తపస్విని యెట్లుశరణువేడఁగలను? రాక్షసభీరువగునాముని నన్నెట్లు కాపాడఁగలఁడు? అని భావము. విషమాలంకారము.

శ్లో. కింవా తవా త్యంతవియోగమోఘే
కుర్యా ముపేక్షాం హతజీవితే ఽస్మిన్,
స్యా ద్రక్షణీయం యది మే న తేజ
స్త్వదీయ మంతర్గత మంతరాయః 65

వ్యాఖ్య: కింవా-లేదా, తవ-నీయొక్క, అత్యంతవియోగమోఘే—అత్యంత వియోగ-పునఃప్రాప్తిరహితమగు వియోగముచేత, మోఘే-నిష్ఫలమైన, అస్మిన్,

హతజీవితే-ఈతుచ్ఛజీవితమునందు. ఉపేక్షాం-ఔదాసీన్యమును; రక్షణీయం-ఎట్లయి ననుగాపాడఁదగినదియు, అంతర్గతం-నాగర్భముననున్నదియు, త్వదీయం-నీదియు నగు, తేజః-సంతానఫలకమగు తేజస్సు, మే-నాకు, అంతరాయః-విఘ్నము, న, స్యాత్, యది-కాకయుండినచో, కుర్యాం-చేసియేయుందును. నీశాశ్వత వియోగ మునే యనుభవింపవలసిన యీతుచ్ఛజీవితమును, నాలోగర్భరూపముననున్న నీతేజస్సు విఘ్నముగా నేర్పడకుండినచో, వదలివేసియే యుందును, అనఁగా గర్భ వతిని కాకయుండినచో నీవ్యర్థజీవితమును త్యజించియే యుందునని భావము. "కుర్యామ్" తుకృఞ్-కరణేధాతువునకు, "స్యాత్" "అస"ధాతువునకును లిఙ్ రూపములు.

శ్లో. సాహం తపః సూర్యనివిష్టదృష్టి
ర్ఊర్ధ్వం ప్రసూతే శ్చరితుం యతిష్యే,
భూయో యథా మే జనానాంతరేఽపి
త్వ మేవ భర్తా న చ విప్రయోగః. 66

వ్యాఖ్య : సాహం (సా + అహం)-అట్టి నిశ్చయముగలనేను, ప్రసూతేః, ఊర్ధ్వం- పసూతియొక్క యనంతరము, సూర్యనివిష్టదృష్టిః-సూర్యమండలముపై నుంచఁబడినచూపు గలదాననగుచు, తపః, చరితుం-తపస్సును జేయుటకు, యతిష్యే-ప్రయత్నింపఁగలను. యథా-ఏవిధమున, భూయః-మరల, మే-నాకు, జనానాంతరే, అపి-పునర్జన్మయందును, త్వం,ఏవ-నీవే, భర్తా-భర్తవగుదువో, విప్రయోగః, న,చ-వియోగములేకుండునో అట్టి తపస్సును జేయఁగలనని యర్థము. ఇప్పుడు నాగర్భమున నీవంశాంకుర ముండుటచేత నాశరీరము పేక్షించు టకుఁగాని తపఃక్లేశమునను భవించుటకుఁగాని యోగ్యముకాదు. ప్రసూతియనంత రమున శరీరమును లెక్కచేయక ఘోరమైన తపస్సును జేసి తత్ఫలముగా రాఁబోవునాజన్మమున నీవే నాభర్తవై వియోగరహిత జీవనమును గడుపునట్లు చేయుదునని భావము. "యతిష్యే" యతీ-ప్రయత్నేధాతువునకు ల్యుట్. ఉ. ఏ.

శ్లో. నృపస్య వర్ణాశ్రమపాలనం యత్
స ఏవ ధర్మో మనునా ప్రణీతః,

నిర్వాసితా పేవ మత స్త్వయా హం
తపస్విసామాన్య మవేక్షణీయా. 67

వ్యాఖ్య : వర్ణాశ్రమపాలనం, యత్-బ్రాహ్మణాది వర్ణధర్మముల యొక్కయు బ్రహ్మచర్యా ద్యాశ్రమధర్మములయొక్కయు పాలనమేదికలదో, స, ఏవ-అదియే, నృపస్య-రాజుయొక్క, ధర్మః-ధర్మముగా, మనునా, ప్రజీతః-మనువుచేత జెప్పఁబడినది. అతః-ఈకారణమువలన, ఏవం-ఇట్లు, త్వయా-నీచేత, నిర్వాసితా, అపి-వెళ్ళఁగొట్టఁబడినదాననై నను, అహం-నేను, తపస్విసామాన్యం - తపస్విజనులందజీతో సమానమగురీతిని, అవేక్ష జీయా-చూడఁదగియున్నాను. లోకమునందలి వర్ణాశ్రమములకుఁజెందిన ప్రజలను దగినరీతిని పాలించుటయే రాజుకు ధర్మమని మనువుచెప్పియున్నాఁడు. కనుక నన్ను భార్యనుగా కాకపోయినను ఒకతాపసస్త్రీనిగా జూచి నాకు రక్షణను గల్పింపుము, నిర్వాసితురాలుగదా! యని యుపేక్ష సేయకు మని భావము. "యత్, సపేవ" ఇచ్చట తచ్ఛబ్దముయొక్క లింగభేదము విధేయమగు "ధర్మః" అను శబ్దము ననుసరించి వచ్చినదని తెలియవలెను.

శ్లో. తథేతి తస్యాః ప్రతిగృహ్య వాచం
రామానుజే దృష్టిపథం వ్యతీతే,
సా ముక్తకంఠం వ్యసనాతిభారా
చ్చక్రంద విగ్నా కురరీవ భూయః. 68

వ్యాఖ్య: తథేతి (తథా + ఇతి)-అట్లేచెప్పెదనని, తస్యాః, వాచం-ఆసీత యొక్క మాటను, ప్రతిగృహ్య-అంగీకరించి, రామానుజే-లక్ష్మణుఁడు, దృష్టిపథం-చూపునకందుమార్గమును, వ్యతీతే (సతి)-దాటివెళ్ళినవాఁడుకాఁగా, సా-సీతాదేవి, వ్యసనాతిభారాత్-దుఃఖాతిశేకమువలన, ముక్తకంఠం-పెద్దగాకంఠము విడివడునట్లు, విగ్నా-భీతయై, కురరీవ-పెద్దగా అరచు అనాగరికస్త్రీవలె, భూయః-మాటిమాటికి, చక్రంద-ఏడ్చెను. వెనుకఁజెప్పిన సీత పలుకులను గ్రహించి అట్లే రామునికి విన్న వించెదనని లక్ష్మణుఁడు తిరిగివెళ్ళుచుఁ గనుచూపు మేరను దాటగా సీతాదేవి దుఃఖమును భరింపలేక భయకంపితురాలై మాటిమాటికిని పెద్దగా నేడ్చుచుండెను. "కురరీవ" అను ఉపమానము సీత యడవిలో భయముచేత తన సౌకుమార్య

నాగరికత్వములను విడచి యేడ్చె ననుభావమును సూచించుచున్నది. "చక్రంద" క్రకది-వైక్లబ్యేఅను ధాతువునకు పరస్మైపదిలిట్. అవశురాలై యేడ్చెనని యర్థము.

శ్లో. నృత్యం మయురాః కుసుమాని వృక్షా
దర్భా నుపాత్తా విజహు ర్హరిణ్యః,
తస్యాః ప్రపన్నే సమదుఃఖభావ
మత్యంత మాసీత్ రుదితం వనేఽపి. 69

వ్యాఖ్య: మయూరాః-నెమళ్ళు, నృత్యం-నాట్యమును, వృక్షాః-వృక్షములు, కుసుమాని-పువ్వులను, హరిణ్యాః-ఆడులేళ్ళు, ఉపాత్తాన్, దర్భాన్-నోటియందుంచు కొన్న దర్భపరకలను, విజహుః-విడిచిపెట్టినవి. తస్యాః-ఆమెతకు, సమదుఃఖ భావం-సమానమగు దుఃఖానుభవమును, ప్రపన్నే-పొందినట్టి, వనే, అపి-వనము నందుగూడ, అత్యంతం-అధికాధికమైన, రుదితం-శోకము, ఆసీత్-నెలకొనెను. సీతశోకమును వినుచున్న నెమళ్ళు నృత్యమును చాలించెను; వృక్షములు కన్నీటి చుక్కలవలె పూలనురాల్చెను; లేళ్ళు నోటియందలి దర్భపరకలను నేలపైజార విడిచెను. ఇట్లు సీతతో సమదుఃఖను నుభవించుచున్న వనమునందుసైతము అత్యంతమైన శోకము నిండిపోయెను. "వనేఽపి" అచ్చటి 'ఆపి' శబ్దము వనము నండేకాక శోకము అయోధ్యయందును, రామునిమందిరమందును మిక్కుటమయ్యె నని సూచించును.

శ్లో. తా మభ్యగచ్ఛత్ రుదితానుసారీ
కవిః కుశేధ్మాహరణాయ యాతః,
నిషాద విద్ధాండజ దర్శనోత్థః
శ్లోకత్వ మాపద్యత యస్య శోకః. 70

వ్యాఖ్య : కుశేధ్మాహరణాయ-దర్భలను సమిధలను దెచ్చుకొనుటకొఱకు, యాతః-వెళ్ళినట్టి, కవిః-కవియగు వాల్మీకి, రుదితానుసారీ(స్త్రీ)-ఏడ్పునువినుచు వచ్చువాడై, తాం-ఆసీతను, అభ్యగచ్ఛత్-చేరెను నిషాదవిద్ధాండజదర్శనోత్థః— నిషాద-బోయవానిచేత, విద్ధ-బాణముచేగ్రుచ్చి చంపబడిన, అండజ-క్రౌంచపక్షి యొక్క, దర్శనోత్థః-దర్శనముచేత ఉత్పన్నమైన, యస్య-ఏవాల్మీకియొక్క,

శోకః-దుఃఖము, శ్లోకత్వం-శోకరూపమును, ఆపద్యత-పొందెనో! నిత్యాగ్ని హోత్రాదులకై స్వయముగా దర్భలను, సమిధలను దెచ్చుకొనుటకు వచ్చినవాల్మీకి సీతయేడ్చును వినుచు నామెవద్దికివచ్చెను. కరుణాళుడైనయేవాల్మీకి తమసాతీర మున వ్యాధునిచేత జంపబడిన మగ క్రౌంచపక్షిని జూచుటచేత దనలోనుబికి వచ్చిన శోకమునకు శ్లోకత్వమును అనగా, "మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః, యత్క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్" అను వాగ్రూపమును ఇచ్చియుండెనో! వాల్మీకి సీతవద్దికి జూడవచ్చుట అత డత్యంత దయాళువగుటచేతనే యనియు, పశుపక్ష్యాదులయందే దయావంతుడై యున్న యతడు సీతాశోకమును విని యచ్చటికివచ్చుటలో వింతలేదనియు గ్రహింపదగును. ఇచ్చట "కవిః" అని వాల్మీకిని గుఱించి నిరుపపదముగా గాఁ దాసు చెప్పటలో నతని యుద్దేశమున "కవి" యనగా వాల్మీకియనియు నత డొక్కడే కవిశబ్దవాచ్యుడనియు భావము. కాళిదాసునకు వాల్మీకిపై గలభక్తిని ఈ ప్రయోగము స్థిరపరచును.

శ్లో. త మశ్రు నేత్రావరణం ప్రమృజ్య
సీతా విలాపా ద్విరతా వవందే,
తస్యై ముని ర్దోహదలింగదర్శీ
దాశ్వాన్ సుపుత్రాశిష మిత్యువాచ. 71

వ్యాఖ్య : సీతా-సీతాదేవి, విలాపాత్-ఏడ్పునుండి, విరతా-విరమించినదై, నేత్రావరణం-చూపునకు ప్రతిబంధకమగు, అశ్రు-కన్నీటిని, ప్రమృజ్య-తుడుచుకొని, తం-ఆవాల్మీకిమునిని, వవందే-నమస్కరించెను. దోహదలింగదర్శీ- సీత యొక్క గర్భచిహ్నములను జూచుచున్న, మునిః-వాల్మీకి, తస్యై-ఆమెకు, సుపుత్రాశిషం-"సుపుత్రప్రాప్తిరస్తు" అను నాశీర్వచనమును, దాశ్వాన్-ఇచ్చినవాడై, ఇతి-ముందుజెప్పబోవురీతిగా, ఉవాచ-పలికెను. వాల్మీకి తనవద్దికిరాగానే సీత పెద్దగానేడ్చుటను మాని, చూపునకడ్డముగానున్న కన్నీటిని దుడుచుకొని, ఆతనికి నమస్కరించెను. వాల్మీకి యామె గర్భవతిగానున్న సంగతిని గుర్తించి, "సుపుత్ర ప్రాప్తిరస్తు" అని దీవించి సీతతో నీరీతిగా (ముందువచ్చుశ్లోకములు) ననెను. "దాశ్వాన్" ఇది "దాణ్-దానే" అనుధాతువుపై 'క్వసు' ప్రత్యయాంతము. దీనిని వైదికప్రక్రియయందు పాణిని "దాశ్వా"నిత్యాదిసూత్రముచే నిపతించెను. దీనివలన

కాళిదాసునకుఁగల వైదికభాషా పరిచయము తెల్లమగును. "వవందే" వది-అభివాద నస్తుత్యోఃధాతువులిట్ రూపము.

శ్లో. జానే విసృష్టాం ప్రణిధానత స్త్వాం
మిథ్యాపవాద శుభితేన భర్త్రా,
త న్మా వ్యథిష్ఠా విషయాంతరస్థం
ప్రాప్తాసి వై దేహి! పితు ర్నికేతమ్. 72

వ్యాఖ్య : త్వాం-నిన్ను, మిథ్యాపవాదశుభితేన—మిథ్యాపవాద-అసత్య ముపై నాధారపడిన లోకనిందచేత, శుభితేన-కలతఁజెందిన, భర్త్రా-భర్తచేత, విసృష్టాం-విడిచిపెట్టఁబడిన దానినిగా, ప్రణిధానతఃసమాధి దృష్టిచేత, జానే-ఎఱుఁగుచున్నాను. హేవైదేహి-ఓసీతా! విషయాంతరస్థం-దేశాంతరమునందున్న, పితుఃనికేతం-తండ్రియొక్క యింటినే, ప్రాప్తాసి (ప్రాప్తా+ఆసి)-చేరితివి. తత్-అందువలన, మావ్యథిష్ఠాఃదుఃఖింపకుము. వాల్మీకి యిట్లనుచున్నాఁడు, అసత్య విషయముపై నాధారపడిన లోకులనిందవలన భయపడినభర్తచేత నీవు విడువఁబడితివని ఆంతరదృష్టితోఁగనుగొనుచున్నాను. ఓవిదేహతనయా! నీవు మరియొక ప్రదేశమునందున్న మీతండ్రియింటినే చేరినావు కనుక దుఃఖింపకుము. "పితుర్నికేతం" తాను జనకచక్రవర్తితో సమానుఁడననియు, తనయాశ్రమము సీతకుఁబుట్టినిల్లనియు, భర్తచేవిడువఁబడిన యిల్లాలు పుట్టినింటిలోనుండుట ధర్మమనియు వాల్మీకిమునియభిప్రాయము. "జానే" జ్ఞా-అవబోధనే అనుధాతువునకు ఆత్మనేపది లట్ ఉత్తమపురుష. ఏ. "మా-వ్యథిష్ఠాఃవ్యథ-భయసంచలనయోఃఅనుధాతువునకు ఆత్మనేపది లుఙ్ మధ్య. పు. ఏ. "అవ్యథిష్ఠాఃఅనునది నిజరూపము. ఇచ్చట "మా" తోఁ జేరుటచేత "నమాఙ్యోగే" అనునిషేధమువలన "అ" లోపించి వ్యథిష్ఠాఃఅయినది.

శ్లో. ఉత్ఖాతలోకత్రయకంటకే ఽపి
సత్యప్రతిజ్ఞే ఽప్యవికత్థనే ఽపి,
త్వాం ప్రత్యకస్మా త్కలుషప్రవృత్తా
వత్స్యేవ మన్యు ర్భరతాగ్రజే మే. 73

వ్యాఖ్య : ఉత్ఖాతలోకత్రయకంటకే, అపి-ఉత్ఖాత—తీసివేయఁబడిన, లోక త్రయకంటకే, ముల్లోకములకు కంటకప్రాయుఁడగు రావణుఁడు గలవాఁడు, అపి-ఐనను, సత్యప్రతిజ్ఞే, అపి–సత్యసంధుఁడైయున్నను, అవికత్థనే, అసి-ఆత్మశ్లాఘా పరాయణుఁడు గాకున్నను, త్వాం, ప్రతి-నిన్ను గుఱించి, అకస్మాత్-అకారణముగా, కలుషప్రవృత్తౌ-గర్హితప్రవర్తనముగల, భరతాగ్రజే-రామునియందు, మే-నాకు, మన్యుః-కోపము, అస్త్యేవ (అస్తి + ఏవ) ఉండనేయున్నది. సీతా! ముల్లోకము లకుఁ గంటకప్రాయుఁడగు రావణుని వధించి లోకోపకారమును జేసినవాఁడును, సత్యసంధుఁడు, ఆత్మశ్లాఘాదూరుఁడు నగుపతిచేత స్నేహపాత్రుఁడైనప్పటికిని నీవిష యమునఁ గలుషవర్తనమునుజూపి ఆగుణములన్నిటిని మాయించుదోషమును జేసిన భరతాగ్రజుఁడంటే నాకెంతో మంటగానున్నది సుమా! అన్నాఁడు వాల్మీకి. "భర తాగ్రజ" శబ్దము "నామాతిక్రపణస్యచ" అను ధర్మవచనప్రకారము వాల్మీకి "రామ" నామము నుచ్చరింపలేదని సీతగ్రహించుటకై ప్రయోగింపఁబడినది. వాల్మీకి చేసిన యీరామోపాలంభము సీతను ఓదార్చుటకుద్దేశింపఁ బడినదని మనము గ్రహింపవలయును, నిజముగా వాల్మీకికి రామునిపైఁ గోపము వచ్చుట యసంభవముగదా!

శ్లో. తవోరుకీర్తిః శ్వశురః సఖా మే
సతాం భవోచ్ఛేదకరః పితా తే,
ధురి స్థితా త్వం పతిదేవతానాం
కిం తన్న యేనాసి మమానుకంప్యా? 74

వ్యాఖ్య : ఉరుకీర్తిః-మహాకీర్తినుంతుఁడగు, తవశ్వశురః-మీమామ, మేసఖా-నాకుమిత్రుఁడు; తేపితా-మీతండ్రియగు జనకచక్రవర్తి, సతాం-విద్వాం సులకు, భవోచ్ఛేదకరః-జ్ఞానోపదేశముచేత సంసారదుఃఖమును దొలఁగించు బ్రహ్మజ్ఞాని; త్వం-నీవు, పతిదేవతానాం-పతివ్రతలయొక్క, ధురి-అగ్రస్థానము నందు, స్థితా-ఉన్నట్టిదానవు; యేన-ఏకారణముచేత, మమ-నాకు, అనుకంప్యా-గౌరవముగా దయచూపఁదగినదానవు, నాసి (న + అసి)-కాకున్నావో!, తత్కిం-ఆదియేది? మీమామ నామిత్రుఁడు, బ్రహ్మజ్ఞానియైన మీతండ్రి నాకుపూజ్యుఁడు, నీవా పతివ్రతలలో నుత్తమురాలవు. ఇఁక నిన్ను దయతో నాయాశ్రమమున నుంచుకొనకుండుటకుఁ గారణమేమున్నది? ఏదియులేదు; నీవు సర్వధా నాకు ఆదర ణీయురాలవని వాల్మీకి సీతతో ననెను.

శ్లో. తపస్వి సంసర్గవినీతసత్త్వే
తపోవనే వీతభయా వసాస్మిన్,
ఇతో భవిష్య త్యనఘప్రసూతేః
అపత్యసంస్కారమయో విధి స్తే. 75

వ్యాఖ్య : తపస్విసంసర్గవినీతసత్త్వే–తపస్విసంసర్గ - మునిజనులయొక్క స్నేహముచేత, వినీతసత్త్వే-శాంతములగు మృగములుగల, అస్మిన్, తపోవనే-ఈతపోవనముకందు, వీతభయా-భయములేనిదానవగుచు, వస-నివసింపుము. ఇతః-ఈవనమునందే, అనఘప్రసూతేః-సుఖప్రసవము గలిగిన, తే-నీయొక్క, అపత్యసంస్కారమయః-సంతానమునకు జాతకర్మాదిరూపమగు, విధిః-అనుష్ఠానము భవిష్యతి-జరుగగలదు. ముని సహవాసముచేత క్రౌర్యమును విడిచిన జంతువులు గల యాతపోవనముకందు నిర్భయముగా నివసింపుము. నీవు సుఖముగా ప్రసవించిన పిమ్మట నీసంతానమునకు జాతకర్మాదికమగు అనుష్ఠానము ఇచ్చటనే జరుపదగునని వాల్మీకి సీతకుఁజెప్పెను. "ఇతః" అస్మిన్ఇతః అనివిగ్రహము. "సార్వవిభక్తిక స్తసిః" అను ప్రమాణమువలన ఇదంశబ్దమునకు సప్తమ్యర్థమున వచ్చిన "తసిల్" ప్రత్యయాంతమగు నవ్యయము.

శ్లో. అభూస్యతీరాం మునిసంనివేశైః
తమోనిహంత్రీం తమసాం వగాహ్య,
తత్రైకతోత్సంగ బలిక్రియాభిః
సంపత్స్యతే తే మనసః ప్రసాదః. 76

వ్యాఖ్య : మునిసంనివేశైః-మునులయొక్క కుటీరములచేత, అభూస్యతీరాం-నిండినయొడ్డుగలదియు, తమోనిహంత్రీం-శోకమును, పాపమును దొలగించునదియు నగు, తమసాం-తమసానదిని, వగాహ్య-ప్రవేశించి (ఆనదిలో స్నానముచేసి యనియర్థము), తత్రైకతోత్సంగబలిక్రియాభిః—తత్రైకతోత్సంగ-ఆనదియిసుకదిబ్బలనడుమఁజేయు, బలిక్రియాభిః-ఇష్టదేవతాపూజలచేత, తే, మనసః-నీమునసున్నకు, ప్రసాదః-నైర్మల్యము (సంతోషము), సంపత్స్యతే-కలుగగలదు. ఉభయతీరములందును మునుల కుటీరములతో నిండిన తమసానదీ జలములందు స్నానముఁజేసి, ఆనదియిసుకతిన్నెలపై యిష్టదేవతాపూజలు సలుపునప్పుడు

సీమనస్సు నిర్మలమై శోకము నశించు నమ్మా! యని వాల్మీకి పలికెను. "సం నివిశంతే యేషు ఇతి సంనివేశాః" అని విగ్రహము. "వగాహ్య" అవగాహ్యకు రూపాంతరము. "సంపత్స్యతే, సమ్ అను ఉపసర్గతోఁగూడిన పద్-గతౌధాతువునకు ల్యుట్ ప్రప.పు ఏ. (సంపత్స్యతే, సంపత్స్యేతే, సంపత్స్యంతే, ఇత్యాది).

శ్లో. పుష్పం ఫలం చార్తవ మాహరంత్యో
బీజం చ బాలేయ మకృష్టరోహి,
వినోదయిష్యంతి నవాభిషంగా
ముదారవాచో మునికన్యకా స్త్వామ్. 77

వ్యాఖ్య : ఆర్తవం-ఆయాఋతువునకు సంబంధించిన, పుష్పం-పూలను, ఫలంచ-పండ్లను సైతము, అకృష్టరోహి-దున్నక నాటకయే మొలచిన, బాలేయం-బలికి (పూజకు) యోగ్యమగు, బీజం, చ-నీవారాదిధాన్యమును గూడ, ఆహరంత్యః-తెచ్చువారును, ఉదారవాచః-చక్కఁగా మాట్లాడువారును నగు, మునికన్యకాః-తాపసకన్యలు, నవాభిషంగాం-నూతన దుఃఖముగల లేదా క్రొత్తగాస్నేహితురాలవైన, త్వాఁ-నిన్ను, వినోదయిష్యంతి-ఆనందపరుపఁగలరు. సురభిళము లగు పూలు, మధురములగు పండ్లు, పూజార్థమై దున్నకయే పండిన నీవారధాన్యమును నీకిచ్చుచు, చక్కఁగా భాషించుచు మునికన్యలు క్రొత్తదానవైననిన్ను సంతోషపరచును నీశోకమును దొలఁగింతురు. "పుష్పం, ఫలం, బీజం" జాత్యేక వచనములు. "బలయే హితం బాలేయం" అని విగ్రహము.

శ్లో. పయోఘటైర్ ఆశ్రమబాలవృక్షాం
సంవర్ధయంతీ స్వబలానురూపైః,
అసంశయం ప్రాక్ తనయోపపత్తేః
స్తనంధయప్రీతి మవాప్స్యసి త్వమ్. 78

వ్యాఖ్యః స్వబలానురూపైః-నీశక్తికిఁదగిన, పయోఘటైః-జలకుంభములచేత, ఆశ్రమబాలవృక్షాం-ఆశ్రమమునందలి చిన్నమొక్కలను, సంవర్ధయంతీ-పెంచుచున్న, త్వం-నీవు, తనయోపపత్తేః-పుత్రోత్పత్తికి, ప్రాక్-ముందుగానే అసంశయం-నిస్సంశయముగా, స్తనంధయప్రీతిం-శిశువిషయకమైన యానందమును, అవా

ప్పుసి-పొందఁగలవు. నీశక్తికిఁదగిన చిన్నకడవలతో నీరునుదీసుకవెళ్ళి చిన్నచిన్న యాశమవృక్షకములకుఁ బోసి వాటినిఁ బెంచుచున్ననీవు, నీకుఁ బుత్రోత్పత్తి కలుగకముందే తప్పక శిశుదర్శన లాభన పోషణాదులవలనఁ గలుగఁబోవు ప్రీతిని పొందఁగలవమ్మా! అన్నాఁడు. "పయోఘటైః" సస్యమునిచ్చుటను, స్తనంధయ శబ్దము రాఁబోవు శిశుదర్శనమును ధ్వనింపఁ జేయుచున్నవి. స్త్రీలకు సంతానోత్పత్తి పోషణాదులు సర్వదుఃఖములను విస్మరింపఁజేయుననన్నది ముఖ్య తాత్పర్యము. అందువలన నిట్లు ఓదార్చుట.

శ్లో. ఆనుగ్రహ ప్రత్యభినందినీం తాం
వాల్మీకి రాదాయ దయార్ద్రచేతాః,
సాయం మృగాధ్యాసితవేదిపార్శ్వం
స్వ మాశ్రమం శాంతమృగం నినాయ. 79

వ్యాఖ్య : దయార్ద్రచేతాః-కరుణామయచిత్తుఁడగు, వాల్మీకిః-వాల్మీకిముని, ఆనుగ్రహ ప్రత్యభినందినీం-తానుచూపిన యనుగ్రహమునుగురించి యెంతోసంతోష పడుచున్న, తాం-ఆసీతాదేవిని, ఆదాయ-తీసికొని, సాయం-సాయంకాలమున, మృగాధ్యాసితవే పార్శ్వం—మృగ-లేళ్ళచేత, అధ్యాసిత-కూర్చోఁబడిన, వేది పార్శ్వం-యజ్ఞవేదిక ప్రక్కచోటులుగలదియు, శాంతమృగం-శాంతస్వభావముతో నున్న శార్దూలాది మృగములు గలదియునగు, స్వం, ఆశ్రమం-తనయాశ్రమమును, నినాయ-చేర్చెను. దయావంతుఁడగు వాల్మీకి తానుచూపినయాదరమున కెంతగానో యానందించుచుఁ గృతజ్ఞురాలై యున్న సీతను తనయాశ్రమమునకుఁ దీసుకవెళ్ళెను. "సాయం" అనుట, సీత వాల్మీకివచనముల కంగీకరించుట కంతసేపుపట్టినదనియు, ఆశ్రమము శాంతమృగముగాఁ గనపడుట కదేసమయమనియు మున్నగు భావములు స్ఫురింపఁజేయుటకు. "వాల్మీకిః తాం ఆశ్రమం నినాయ" ద్వికర్మకకర్తరి ప్రయోగము.

శ్లో. తా మర్పయామాస చ శోకదీనాం
తదాగమప్రీతిషు తాపసీషు,
నిర్విష్టసారాం పితృభి ర్హిమాంశో
రంతర్వ్యం కలాం దర్భ ఇవౌషధీషు. 80

వ్యాఖ్య : శోకదీనాం,తాం-శోకముచేత దీనురాలైయున్న యాసీతను, తదాగమ్రపీతిమ-ఆసీతరాకచేతసంతుష్టురాండ్రగు, తాపసీమ-మునిపత్నులయందు. పితృభిః-అగ్నిష్వాత్తాది పితృదేవతలచేత, నిర్విష్టసారాం-భుక్తమగుసారముగల, హిమాంశోః-చంద్రునియొక్క, అంత్యాం, కలాం-మిగిలిన చివరికళను, దర్శః-అమావాస్యాకాలము, ఓషధీమ, ఇవ-ఓషధులందువలె, ఆర్ష్యామాసచ-ఆర్ష్యం చెనుగూడ. వాల్మీకి తనవెంటదీసుకపోబడి, శోకార్తయైయున్న సీతను మునిపత్నులుచూచి సంతోషపడుచుండ వారికి సీతయాతిథ్యాదులను నిర్వర్తింపుడని యప్పగించెను. ఆయర్ష్ణము పితృదేవతలు భుజింపగా మిగిలిన చంద్రుని చివరి కళను దర్శకాలము ఓషధులకప్పగించినట్లుగా నుండెనట. సీత దుఃఖత ప్తయగుటచేత సర్వసౌందర్యమును గోలుపోయి కళామాత్ర పరిశిష్టగానున్నను తాపసీజనమున కానందమునే యోషధీశునికళ యోషధులకువలె గూర్చెనట. "అమాయాంతు సదా సోమ ఓషధీః ప్రతిపద్యతే" ఆని వ్యాసవచనము. అలంకారము: ఉపమ.

శ్లో. తా ఇంగుదీస్నేహకృతప్రదీప
మా స్తీర్ణమేధ్యాజినతల్ప మంతః,
తస్యై సపర్యానుపదం దినాంతే
నివాసహేతో రుటజం వితేరుః. 81

వ్యాఖ్య : తాః-ఆతపస్వికాంతలు, తస్యై-సీతకొఱకు, సపర్యానుపదం-పూజానంతరము, దినాంతే-సాయంకాలమునందు, నివాసహేతోః-సీతానివాసము కొఱకు, ఇంగుదీస్నేహకృతప్రదీపం—ఇంగుదీస్నేహ-గారనూనెచేత, కృతప్రదీపం-వెలిగింపబడినదీపముగలదియు, అంతః-లోపల, ఆస్తీ...ల్పం-ఆస్తీర్ణ-పరువబడిన, మేధ్యాజినతల్పం-పరిశుద్ధమైన కృష్ణాజినమే పడకగాగలదియునగు, ఉటజం-పర్ణశాలను, వితేరుః-ఇచ్చిరి. మునిపత్నులు సీతకు ఆశ్రమవాసయోగ్యమైన, విడిది నిచ్చిరని భావము. "ఇంగుదీ తాపసతరుః" అనియమరము. "వితేరుః"వి అను ఉపసర్గతోగూడిన త్యా-ప్లవనతరణయోః అనుధాతువునకు ఇచ్చట అనియర్థము.

శ్లో. తత్రా భిషేకప్రయతా వసంతీ
ప్రయుక్తపూజా విధినా తిథిభ్యః,

వన్యేన సా వల్కలినీ శరీరం
పత్యుః ప్రజాసంతతయే బభార. 82

వ్యాఖ్య : తత్ర-ఆయాశ్రమమునందు, అభిషేక ప్రయతా-స్నానముచేత నియమముగలది యగుచు, వసంతీ-నివసించుచున్నదియై, విధినా-శాస్త్రవిధానము చేత, అతిథిభ్యః-అతిథులకు, ప్రయుక్తపూజా-చేయబడిన సత్కారముగలదియై, వల్కలినీ-వల్కలముధరించిన, సా-సీత, పత్యుః-భర్తయొక్క, ప్రజాసంతతయే-సంతానము ముందుకు సాగుటకొఱకై, వన్యేన-కందమూల ఫలాదికముచేత, శరీరం-శరీరమును, బభార-పోషించెను. స్నానము, అతిథిపూజ, వల్కలధారణము మొదలయిన తాపసీవృత్తిని అవలంబించిన సీత, భర్తయొక్కసంతానము అవిచ్ఛిన్నముగా సాగవలెనను కోరికచే మాత్రము అరణ్యలభ్యమగు కందమూలాదికముచేత శరీరమును పోషించుకొనెను. లేనిచో నుపవాసాదులు చేసియుండెడిదే యని భావము.

శ్లో. అపి ప్రభుః సానుశయో ఽధునా స్యాత్
కి ముత్సుకః శక్రజితో ఽపి హన్తా,
శశంస సీతాపరిదేవనాంత
మనుష్ఠితం శాసన మగ్రజాయ: 83

వ్యాఖ్య: ప్రభుః-రాముఁడు, అధునా, అపి-ఇప్పటికైనను, సానుశయః-సానుతాపముగలవాఁడు, స్యాత్కిం-అయియుండునో (లేదో), అని ఉత్సుకః-త్వరపడుచున్న, శక్రజితః-ఇంద్రజిత్తును (కర్మణిషష్ఠి) హన్తా, అపి-చంపిన లక్ష్మణుఁడు సైతము, సీతాపరిదేవనాంతం-సీతావిలాపమే అంతముగాఁగలదియై, అనుష్ఠితం-తనచేనాచరింపఁబడిన, శాసనం-ఆజ్ఞను, అగ్రజాయ-అన్నగారికి, శశంస-వివరముగాఁ జెప్పెను. లోకాపవాదభీతుఁడై కాఠిన్యమునువహించి సీతను బంపివేసిన రాముఁడు అయ్యో! ఇట్టిపని చేయవలసివచ్చెనే! యని పశ్చాత్తప్తుఁడయ్యెనో లేదో ఇంతలో త్వరత్వరగావచ్చిన లక్ష్మణుఁడు సీతశోకించువఱకుఁగల శాసనానుష్ఠానమును అన్నకు నివేదించెను. "శక్రజితఃహన్తా" యను విశేషణము లక్ష్మణుఁడు మహాపరాక్రమవంతుఁడైయున్నను రామశాసనము ననుష్ఠించుటయందు విధేయతగలవాఁడని సూచించును.

శ్లో. బభూవ రామః సహసా సబాష్పః
తుషారవర్షీవ సహస్య చంద్రః,
కాలీనభీతేన గృహా న్నిరస్తా
న తేన వై దేహసుతా మనస్తః. 84

వ్యాఖ్య : సహసా-లక్ష్మణుడు విన్నవించినవెంటనే, సబాష్పః-కన్నీటితోడగూడిన, రామః-రాముడు, తుషారవర్షీ-మంచుచుక్కలనుగురియుచున్న, సహస్యచంద్రః, ఇవ-పౌషమాసచంద్రుడువలె, బభూవ-అయ్యెను. కాలీనభీతేన-లోకాపవాదమువలన భయపడిన, తేన-రామునిచేత, వైదేహసుతా-సీతాదేవి, గృహాత్, నిరస్తా-ఇంటినుండి వెళ్ళగొట్టబడినదిగాని, మనస్తః-తనమనస్సునుండి, న-కాదు లక్ష్మణుడు సీతాత్యాగమును వివరింపగానే కండ్లనుండి యశ్రువులు రాల్చుచున్న రాముడు తుషారమువర్షించునట్టి పుష్యమాసపుచంద్రునివలె నయ్యెను. తానై సీతను బంపినవానికాదన యెట్లువచ్చెనన గా లోకాపవాదభీతుడై యింటినుండి బహిష్కరించెనుగాని తనమనస్సునుండికాదు. మనస్సు సీతావిషయకమగుదుఃఖము కలిగియేయున్నందున అట్లుకన్నీరురాల్చె ననిభావము. ధీరుడైనపురుషుడు బోరునయేడ్చుట తగదుకావున తుషారోపమానము కన్నీటికిజెప్పబడినది. అలంకారము: ఉపమ. "మనస్తక" పంచమ్యర్థమున "తసిల్" ప్రత్యయాంతమగు నవ్యయము.

శ్లో. నిగృహ్య శోకం స్వయ మేవ ధీమా
వర్ణాశ్రమా వేక్షణజాగరూకః,
స భ్రాతృసాధారణభోగ మృద్ధం
రాజ్యం రజోరిక్తమనాః శశాస. 85

వ్యాఖ్య : ధీమాన్-బుద్ధిమంతుడగు, సః-ఆరాముడు, స్వయం, ఏవ-తనకుదానే, శోకం-సీతావియోగదుఃఖమును, నిగృహ్య-అణచుకొని, వర్ణాశ్రమావేక్షణజాగరూకః—వర్ణాశ్రమ-ప్రజలవర్ణాశ్రమధర్మాచరణమయొక్క, అవేక్షణ-పర్యవేక్షణమునందు, జాగరూకః-అప్రమత్తుడై, రజోరిక్తమనాః-రజోగుణప్రయుక్తమగు భోగలాలసత్వము లేనిమనస్సుగలవాడగుచు, భ్రాతృసాధారణభోగం-సోదరులందరికిని సమానమగు సుఖానుభవముగల, ఋద్ధం, రాజ్యం-సర్వ

సంపత్సమృద్ధమైన రాజ్యమును, శశాస-ఏలెను. దైవికము కానందున యితరు లోదార్పుటకు వలనుపడని సీతావియోగ దుఃఖమును తానే నిరోధించుకొని, వర్ణాశ్రమధర్మానుసరణము ప్రజలకుముఖ్యముగావున వారిప్రవర్తనపర్యవేక్షణము నందు జాగరూకుడై, సోదరులకంటే తనకు విశేషములేని భోగము ననుభవించుచు సర్వసమృద్ధమైన అయోధ్యారాజ్యమును రాముడుపాలించుచుండెనని భావము. "శశాస" శాసు-అనుశిష్టౌ ధాతువునకు లిట్ ప్ర.పు ఏ.

శ్లో. తా మేకభార్యాం పరివాదభీరోః
సాధ్వీ మపి త్యక్తవతో నృపస్య,
వక్షస్యసంఘట్టసుఖం వసంతీ
రేజే సపత్నీరహితేవ లక్ష్మీః. 86

వ్యాఖ్య : పరివాదభీరోః - అపకీర్తికిభయపడువాడుగావున, ఏకభార్యాం, అపి-ఒకతెయేభార్యయైయున్నప్పటికిని, సాధ్వీం, అపి-పతివ్రతయైయున్నప్పటికిని, తాం-సీతాదేవిని, త్యక్తవతః-విడిచిపెట్టిన, నృపస్య-రాజైన రామునియొక్క, వక్షసి-వక్షస్థలమునందు, అసంఘట్టసుఖం - అడ్డములేనిసుఖముగలుగునట్లుగా, వసంతీ-నివసించుచున్న, లక్ష్మీః-రాజ్యలక్ష్మి, సపత్నీరహితా, ఇవ-సవతిలేనిదివలె, రేజే-ప్రకాశించెను. లోకాపవాదభీరువై ఉన్నఒక్కభార్యను విడిచిపెట్టిన రాముని వక్షస్థలమున నెదురులేక నివాసముచేయుచున్నరాజ్యలక్ష్మి సవతిపోరులేనిదానివలె ప్రకాశించెను. అనగా మరల రాముడుమరియొకస్త్రీని జేపట్టలేదని భావము. "రేజే" రాజృ-దీప్తౌధాతువునకు లిట్యనేపదిలిట్ ప్ర.పు.ఏ. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. సీతాం హిత్వా దశముఖరిపు ర్నోపయేమే యదన్యాం
తస్యా ఏవ ప్రతికృతిసఖో యత్కృతా నాజహార,
వృత్తాంతేన శ్రవణవిషయప్రాపితా తేన భర్తుః
సా దుర్వారం కథమపి పరిత్యాగదుఃఖం విషేహే. 87

వ్యాఖ్య : దశముఖరిపుః-రాముడు, సీతాం, హిత్వా-సీతనువిడిచి, అన్యాం-మరియొకస్త్రీని, నోపయేమే (న+ఉపయేమే) ఇతియత్-వివాహముచేసి

కొనలేదనునది యేఁకలదో, (కించ-మరియు) తస్యాఃఏవ-ఆసీతయొక్కయే, ప్రతికృతిసఖఃస-బంగారుప్రతిమతోఁ గూడినవాఁడగుచు, క్రతూ-యజ్ఞములను, ఆజహార ఋతియత్-స్వీకరించెననునది యేఁగలదో, తేన-అట్టి, శ్రవణవిషయ ప్రాపితా-చెవినిసోకినట్టి (వినవచ్చినట్టి), భర్తుః, వృత్తాంతేన-భర్తకుసంబంధించిన వార్తచేత, సా-ఆసీత, దుర్వారం-తొలఁగించుటకు సాధ్యపడని, పరిత్యాగదుఃఖం-తననువిడుచుటచేతఁ గలుగుచున్నదుఃఖమును, కథమపి-ఎట్లో (అతికష్టముతో), విషేహే-సహించెను. రాముఁడు తనకు విడిచిన పిమ్మట మరియొకస్త్రీని వివాహమాడలేదనియు, తనరూపముతోనే సువర్ణప్రతిమను నిర్మించి, దానితో భార్యావంతుఁడై యజ్ఞములు చేయుచున్నాఁడనియు, వార్తలు వచ్చుచుండుటచేత భరయందు భక్తిగలిగిన సీత దుర్వారమైన పరిత్యాగదుఃఖము నెట్లో భరించుచుండెనని భావము. "ఉపయేమే" "యమ-ఉపరమే" అనుధాతువు పరస్మైపదయైనను ఉపఅనునుపసర్గతోఁగూడి వివాహార్థకమగును. అప్పుడు "ఉపాద్యమఃస్వకరణే" అనుసూత్రమువలన ఆత్మనేపదిగామారును. కాఁగా నిది యమధాతువునకాత్మనేపది లిట్ ప్ర. పు. ఏ. "విషేహే" "వి" పూర్వక షహ-మర్షణే ధాతువునకు ఆత్మనేపది లిట్ ప్ర. ఏ.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశకావ్యమునందలి
సీతాపరిత్యాగమను చతుర్దశ సర్గమునకు
కేశవపంతుల నరసింహశాస్త్రి రచిత
తెలుఁగు లఘువ్యాఖ్య.

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

పంచదశసర్గము

శ్లో. కృతసీతా పరిత్యాగః సరత్నాకరమేఖలామ్,
బుభుజే పృథివీపాలః పృథివీ మేవ కేవలామ్. 1

వ్యాఖ్య : కృతసీతాపరిత్యాగః - చేయఁబడిన సీతాపరిత్యాగముగల, సః పృథివీపాలః-భూపరిపాలకుఁడైన యారాముఁడు, రత్నాకరమేఖలాం-సముద్రము మొలనూలుగాఁ గలదియు, కేవలాం-ఒక్కతెయేయైన, పృథివీం, ఏవ-భూమిని మాతమే, బుభుజే-అనుభవించెను. సీతను విడిచినరాముఁడు నిర్వేదమును జెందక పృథివీపాలనముఁజేసె ననుభావమును "రత్నాకరమేఖలాం" అను పృథివీవిశేషణము తెల్పుచున్నది. "కేవలాం" అనువిశేషణము రాముఁడు మరియొకస్త్రీని వివాహమాడ లేదనియు, ఏకపత్నీవ్రతస్థుఁడై! యుండె ననియుఁ దెల్పుచున్నది. "సఃపృథివీం బుభుజే" అన్నది వాక్యము. ఇతరములు వాక్యస్థపదములకు సంబంధపడునవి. ఇది "సకర్మకక ర్తరిప్రయోగము." బుభుజే-"భుజ-పాలనాభ్యవహారయోఃః" అను ధాతువునకు లిట్ ప్ర.పు. ఏకవచనము.

శ్లో. లవణేన విలుప్తేజ్యా స్తామ్రసేన త మభ్యయుః,
మునయో యమునాభాజః శరణ్యం శరణార్థినః. 2

వ్యాఖ్య : లవణేన-లవణుఁడనుపేరుగల, తామ్రసేన - రాతించరునిచేత, విలుప్తేజ్యాఃః-లోపించినయాగక్రియలుగలవారై, శరణార్థినఃః-రక్షణమునుగోరుచున్న, యమునాభాజఃః-యమునాతీరవాసులగు, మునయఃః-ఋషులు, శరణ్యం-రక్షణసమర్థుఁడగు, తం-ఆరాముని, అభ్యయుఃః-చేరిరి. తమయజ్ఞకర్మలను లవణాసురుఁడు ధ్వంసముచేయుచుండగా యమునాతీరవాసులైన మునులు రక్షణమును గోరువారై

శ్రీరాముని వద్దికి వచ్చిరని భావము. తమి స్రాయాం చరతీతి తామి సః అని విగ్ర హము. ఇచ్చట "యమునా 'శబ్దమునకు లక్షణావృత్తిచేత "యమునాతీర" మని యర్థము. "మునయః తం అభ్యయుః" సకర్మకక ర్తరి ప్రయోగము. "అభ్యయుః" (అభి + అయుః) యా-ప్రాపణే. లఙ్ ప్ర.పు.బహు. అయాత్, ఆయాతాం, అయుః. అని రూపములు. శరణేసాధుః శరణ్యః అనివ్యుత్పత్తి.

శ్లో. అవేక్ష్య రామం తే తస్మి న్న ప్రజ ప్రహుః స్వతేజసా,
త్రాణాభావే హి శాపాస్త్రైః కుర్వంతి తపసో వ్యయమ్. 3

వ్యాఖ్య : తే-ఆ మునులు, రామం-రక్షకుఁడగు రాముని, అవేక్ష్య-చూచు కొని, తస్మి న్-ఆలవణాసురుఁయందు, స్వతేజసా-శాపరూపమైన తమ తపస్సుచేత నప్రజ ప్రహుః-విక్రమింపక యుండిరి. హి-అదియు క్తమే. త్రాణాభా ఽ-రక్షకుడు లేనియప్పుడే, శాపాస్త్రైః-శాపమే ఆయుధముగాఁ గలమునులు, తపసః-తపస్సు యొక్క, వ్యయం-వ్యయమును, కుర్వంతి-చేయుచుందురు. శాపమిచ్చుట వలన తపస్సు వ్యయమగును గావున ఆ మునులు లవణాసురుని శాపదగ్ధుని జేయక, రక్షకుఁడై యున్న రాముని లవణబాధను దొలఁగింపుమని వేడిరని భావము. "ప్రజ ప్రహుః" (ప్ర + జ ప్రహుః) "ప్ర" అను ఉపసర్గతోఁగూడిన "హృ"ధాతువు నకు లిట్ ప్ర పు బ జహార, జ్రహతుః జ్రహుః. ఇది "ప్ర" అనుఉపసర్గతోఁ జేరినప్పుడు కొట్టుట అను నర్థము నిచ్చును.

శ్లో. ప్రతిశు శ్రావ కాకుస్థ స్తేభ్యో విఘ్న ప్రతి క్రియామ్,
ధర్మసంరక్షణార్థైవ ప్రవృ త్తి ర్భువి శార్ఙిణః. 4

వ్యాఖ్య : కాకుస్థః-రాముఁడు తేభ్యః-ఆ మునుల కొఱకు, విఘ్న ప్రతి క్రియాం-లవణవధరూపమైన విఘ్న ప్రతీకారమును, ప్రతిశు శ్రావ-తప్పక చేయుదు ననిమాటయిచ్చెను. భువి-లోకమునందు, శార్ఙిణః-ధనుర్ధరుఁడగు క్షత్రియుని యొక్క (విష్ణువుయొక్క), ప్రవృ త్తిః-ప్రవర్తనము (రాముఁడుగా నవతరించుట), ధర్మ సంరక్షణార్థా, ఏవ-ధర్మమును గాపాడుటకొఱకేకదా! రాజధర్మము. ధర్మ మును గాపాడుటయు, విష్ణువు రామావతారమును స్వీకరించుటయు నందులకేగావున రాముఁడు తప్పక లవణాసురునిఁజంపి మీయజ్ఞములకు విఘ్నములు గలుగనీయ నని ప్రతిజ్ఞ చేసెను. "ప్రతిశు శ్రావ" ప్రతియను నుపసర్గతోఁ జేరినప్పుడు "శ్రు-

శ్రవణే" అనుధాతువునకు ప్రతిజ్ఞ అర్థము. ఇది లిట్ ప్ర.పు.ఏ. "కాకుస్థః విష్ణు ప్రతిక్రియాం ప్రతిశ్రావ" సకర్మక కర్తరిప్రయోగము. కకుస్థస్య గోత్రాపత్యం పుమాన్ కాకుస్థః అని విగ్రహము.

శ్లో. తే రామాయ వధోపాయ మాచఖ్యు ర్విబుధద్విషః,
దుర్జయో లవణఃశూలీ విశూలఃప్రార్థ్యతా మితి. 5

వ్యాఖ్య : తే-మునులు, రామాయ-రామునికి, విబుధద్విషః-దేవద్వేషియైన లవణునియొక్క, వధోపాయం-చంపుటుపాయమును, ఆచఖ్యుఃచెప్పిరి. (ఎట్లనగా) లవణః-లవణాసురుడు, శూలీ-శూలమును ధరించినవాడయినప్పుడు, దుర్జయః-జయించుటకు సాధ్యపడడు; విశూలఃశూలరహితుడైనప్పుడు, ప్రార్థ్యతాం-ఎదుర్కొనబడునుగాక, ఇతి-ఇట్లని (చెప్పిరి) శూలధారియైన లవణుడజయ్యుడనియు శూలధారి కానప్పుడే యతని నెదుర్కొను మనియు మునులు రామునికి లవణవధోపాయమును జెప్పిరి. "తే వధోపాయం ఆచఖ్యుఃః" సకర్మక కర్తరి ప్రయోగము. "ఆచఖ్యుఃః" ఆఙ్ పూర్వక 'ఖ్యా-ప్రకథనే' ధాతువునకు లిట్ ప్ర.బ. "ప్రార్థ్యతామ్" యాచ్ఞాయా మభియానేచ ప్రార్థనా కథ్యతేబుధైఃః అను కేశవనిఘంటువు వలన అభియానము (ఎదుర్కొనుట) అను నర్థమున ప్రయోగింపబడినది.

శ్లో. ఆదిదేశాథ శత్రుఘ్నం తేషాం క్షేమాయ రాఘవః,
కరిష్యన్నివ నామాస్య యథార్థ మరినిగ్రహాత్. 6

వ్యాఖ్య : అథ-తరువాత, తేషాం-ఆ మునులకు, క్షేమాయ-క్షేమమును కలిగించుటకొఱకు, రాఘవఃరాఘుడు, శత్రుఘ్నం-శత్రుఘ్నుని, అస్య-అతని యొక్క, నామ-పేరును, అరినిగ్రహాత్-శత్రుహనన కారణమువలన, యథార్థం-సార్థకమైన దానినిగా, కరిష్యన్, ఇవ-చేయబోవువాడువలె, ఆదిదేశ-ఆజ్ఞాపించెను. శత్రూన్ హంతి ఇతి శత్రుఘ్నఃః అను వ్యుత్పత్తిగల యతనిపేరును సార్థకము చేయదలచుచున్నవాడువలె రాముడు మునుల క్షేమపు కొఱకై వెళ్ళుమని శత్రుఘ్ను ని యాజ్ఞాపించె ననిభావము. "ఆదిదేశ" ఆఙ్ పూర్వక"దిశ-అతిసర్జనే" ధాతువునకు లిట్ ప్ర పు.ఏ. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. యఃకశ్చన రఘూణాంహి పరమేకఃపరంతపఃఃః

వ్యాఖ్య : హి-ఎందువలననఁగా పరంతపః-శత్రువులను బాధింపఁగల వాఁడైన, రఘూణాం-రఘువంశీయులలో, యఃకశ్చన-ఎవఁడో ఒకఁడగు, ఏకః-ఒకపురుషుఁడే, అపవాదః-విశేషశాస్త్రము, ఉత్సర్గం-సామాన్యశాస్త్రమును, ఇవ-వలె పరం-శత్రువును, వ్యావర్తయితుం-బాధించుటకు (మరల్చుటకు), ఈశ్వరః-సమర్థుడు. అందువలన శత్రుఘ్నుని నాజ్ఞాపించెనని పూర్వశ్లోకముతో సమన్వయము. వ్యాకరణాది శాస్త్రములందలి సూత్రములలోఁ గొన్ని సామాన్యశాస్త్రములనియు (ఉత్సర్గములు), కొన్ని విశేషశాస్త్రములనియు (అపవాదములు) నుండును. ప్రస్తుతమున లవణుఁడు శత్రుసామాన్యములోనివాఁడు కావున ఉత్సర్గము రఘువంశీయులగు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులలో నేయొక్కఁడైనను విశేషశాస్త్రమువలె (అపవాదము) అతనిని జయింపఁ గలఁడు కావున రాముఁడు శత్రుఘ్నునిఁ బంపెనని భావము. "గిరీశః" (గిరి + ఈశః) అనుచోట "ఇకోయణచి" అనుసూత్రము చేత వచ్చు యణాదేశమును ఉత్సర్గముచేసి, "అకస్సవర్ణేదీర్ఘః" అనుసూత్రము అపవాదశాస్త్రమై సవర్ణదీర్ఘము వచ్చునట్లు చేయుట ఉత్సర్గాపవాద సంబంధమని యెరుగవలయును.

శ్లో. అగ్రజేన ప్రయుక్తాశీ స్తతో దాశరథీ రథీ,
యయౌ వనస్థలీః పశ్య పుష్పితాః సురభీ రభీః. 8

వ్యాఖ్య : తతః-పిమ్మట, అగ్రజేన-అన్నగారిచేత, ప్రయుక్తాశీః-చేయఁబడిన యాశీర్వాదముగలవాఁడై, రథీ-రథమునధిష్ఠించినవాఁడై, అభీః-భయరహితుఁడై, దాశరథిః-దశరథుని కుమారుఁడగు శత్రుఘ్నుఁడు, పుష్పితాః-పువ్వులుగలవియు, సురభీః-పరిమళవంతములునగు, వనస్థలీః-వనప్రదేశములను, పశ్య-చూచుచు, యయౌ-వెళ్ళెను. రామునిచేత నాశీర్వాదముబొంది, రథమునెక్కి నిర్భీకుఁడై, పుష్పితవనములను జూచుచు శత్రుఘ్నుఁడు లవణాసురవధకై సంతోషముగా వెళ్ళెను. అత్మశౌర్యము, అన్నగారి యాశీర్వాదము నిర్భయానందములకుఁ గారణములు. "దాశరథిః యయౌ" అకర్మక కర్తరి ప్రయోగము. "యయౌ" యా-ప్రాపణే ధాతువునకు లిట్ ప్ర.పు.ఏ. "దాశరథీరథీ, సురభీరభీః" అనుచోట్ల ఛేకాను ప్రాసమనఁబడు శబ్దాలంకారము.

శ్లో. రామాదేశా దనుగతా సేనా తస్యా ర్థసిద్ధయే,
పశ్చా దధ్యయనార్థస్య ధాతో రధి రివాభవత్. 9

వ్యాఖ్య : రామాదేశాత్-రాముని నుండి జ్ఞవలన, అనుగతా-వెంటవచ్చిన, సేవా-సైన్యము, తస్య-ఆశత్రుఘ్నునికి,అధ్యయనార్థస్య-చదువుటఆర్థముగానున్న,ధాతోః-"ఇఙ్ అధ్యయనే" అను ధాతువునకు, పశ్చాత్-వెనుకప్రక్కన, అధిః, ఇవ-'అధి' యను నుపసర్గవలె, అర్థసిద్ధయే-ప్రయోజనసాధనము కొఱకు (ఉపసర్గపక్షమున అర్థమును జెప్పుట కొఱకు), అభవత్-ఆయ్యెను. "ఇజికా వధ్యుపసర్గం నవ్యభిచరతః" అను వైయాకరణన్యాయానుసారముగా 'అధి' యను నుపసర్గము, స్వయముగానే అర్థసాధకమగు "ఇఙ్" ధాతువునకు సంనిధిమాత్రముచేత నుపయోగించునట్లు, సైన్యము శత్రుఘ్నునికి లవణవధయందు నామమాత్రముగా నుండెనని భావము. అర్థశబ్దమునకు అభిధేయము, ధనము, వస్తువు, ప్రయోజనము, నివృత్తి అర్థములని యమరము "ఇఙ్-అధ్యయనే" నిత్యమధిపూర్వః అనిశాసనము. దీనికి కర్మరూపము: "అధీతే" అనియు, కర్మరూపము "అధీయతే" అనియు నుండును. ప్రేరణార్థమున "అధ్యాపయతి" యనియు, కృదంతములు అధ్యేతుం, అధీతం, అధ్యయనం, అధీయానః ఇత్యాదిగాను నుండును.

శ్లో. ఆదిష్టవర్త్మా మునిభిః స గచ్ఛన్ తపతాం వరః,
విరరాజ రథప్రష్ఠే ర్వాలఖిల్యై రివాంశుమాన్. 10

వ్యాఖ్య : రథప్రష్ఠేః-రథముముందు నడచుచున్న, మునిభిః-శరణమువేడిన మునులచేత, ఆదిష్టవర్త్మా-చూపఁబడిన మార్గముగలవాఁడై, గచ్ఛన్-వెళ్ళుచున్న, తపతాం, వరః-దేదీప్యమానులలో శ్రేష్ఠుఁడగు, సః-ఆశత్రుఘ్నుఁడు, వాలఖిల్యైః-వాలఖిల్యలను పేరుగల మునులచేత, అంశుమాన్, ఇవ-సూర్యుడువలె, విరరాజ-మిక్కిలి ప్రకాశించెను. శరణాగతులైన యమునాతీరవాసి మునిజనులు తనరథము ముందు నడచుచు దారిని చూపఁగా వెళ్ళుచున్న శత్రుఘ్నుఁడు, సూర్యరథము ముందు నడచు వాలఖిల్యాదిమునులతో నేగు సూర్యభగవానునివలె, దేదీప్యమానుఁడై ప్రకాశించెనని భావము. సూర్యరథమునకుముందు వాలఖిల్యులు నడతురని పురాణప్రసిద్ధము. "సః విరరాజు" అకర్మక, కర్తరి ప్రయోగము. 'విరరాజ' వి ఉపసర్గతో గూడిన "రాజృ-దీప్తౌ" ధాతువునకు లిట్ ప్ర పు.ఏ. "ప్రష్ఠోఽగ్రగామిని" అని నిపాతము.

శ్లో. తస్య మార్గవశా దేకా బభూవ వసతి ర్వ్యతః,
రథస్యానోత్కంఠమృగే వాల్మీకీయే తపోవనే. 11

వ్యాఖ్య : యతః-వెళ్ళుచున్న, తస్య-ఆశత్రుఘ్నునికి, మార్గవశాత్-మార్గ వశమువలన, రథస్వనోత్కంమృగే—రథస్వన-రథధ్వనిని వినుటయందు, ఉత్కంత—ఎత్తఁబడిన మెడలుగల, మృగే-లేళ్ళుగలదియు, వాల్మీకియే-వాల్మీకి మునికి సంబంధించినదియునగు, తపోవనే-తపోవనమునందు, ఏకా, వసతిః-ఒక రాత్రి, బభూవ-నివాసముగా నయ్యెను. అట్లు వెళ్ళుచున్న శత్రుఘ్నుఁడు మార్గ వశమున వాల్మీకి తపోవనమునం దొక రాత్రి నివసించుట జరిగెను. "యతః" ఇణ్-గతౌధాతువునకు వర్తమానార్థకమగు శతృప్రత్యయాంతము "యన్" అను శబ్దమునకు షష్ఠివిభక్తి యేకవచనము. "వసతీరాత్రివేశ్మనోః" అను నమరము వలన నిచ్చటి వసతి శబ్దమునకు రాత్రి యని యర్థము.

శ్లో. త మృషిః పూజయామాస కుమారం క్లాంతవాహనమ్,
తపఃప్రభావసిద్ధాభి ర్విశేష ప్రతిపత్తిభిః. 12

వ్యాఖ్య : క్లాంతవాహనం-అలసిన గుఱ్ఱములుగల, తం, కుమారం-ఆ శత్రుఘ్నుని, ఋషిః-వాల్మీకి, తపఃప్రభావసిద్ధాభిః-తన తపశ్శక్తిచేత సృజింపఁబడిన, విశేషప్రతిపత్తిభిః-ఉత్కృష్ట గౌరవమునకుఁ దగిన వస్తువులచేత, పూజయామాస-సత్కరించెను. తన మానసిక సృష్టిచేత రాజభోగమునకుఁదగిన యాహారపానీయ వస్త్రాదులను కల్పించి వాల్మీకి శత్రుఘ్నుని సత్కరించెనని భావము. "ఋషిః కుమారం పూజయామాస" సకర్మక కర్తరి ప్రయోగము. "పూజయామాస" పూజ-పూజాయాం ధాతువు లిట్.

శ్లో. తస్యా మేవాస్య యామిన్యా మంతర్వత్నీ ప్రజావతీ,
సుతా వసూత సంపన్నౌ కోశదండా వివ క్షితిః. 13

వ్యాఖ్య : తస్యాం, ఏవ, యామిన్యాం-ఆరాత్రియందే, అంతర్వత్నీ-గర్భిణియై యుండిన, అస్య, ప్రజావతీ-శత్రుఘ్నుని వదినెయైనసీత, క్షితిః-భూమి సంపన్నౌ-సమగ్రములగు, కోశదండౌ, ఇవ-భాండాగార రాజశాసనములను వలె, సుతౌ-ఇద్దఱు కుమారులను, అసూత-కనెను. శత్రుఘ్నుఁడు వాల్మీక్యాశ్రమమున నివసించిన రాత్రియందే సీత యిద్దఱు కుమారులను ప్రసవించెను. భూమి రాజ్యమునకు ప్రసాదించు కోశదండములవలె నాకుమారులు పుట్టిరనియు, రాజ్యమునకు కోశదండములు ముఖ్యములైనట్లు వారు రఘువంశమునకు ముఖ్యులనియు

భావము. "ప్రజావతీ సుతా అసూత" సకర్మక కర్తరి ప్రయోగము, "అసూత" ఘూఙ్-ప్రాణిగర్భవిమోచనే అను ఆత్మనేపది ధాతువునకు లఙ్ ప్ర.పు.ఏ. "ప్రజావతీభ్రాతృజాయా" అని యమరము.

శ్లో. సంతానశ్రవణాత్ భ్రాతుః సౌమిత్రిః సౌమనస్యవాన్,
ప్రాంజలి ర్మునిం మామంత్ర్య ప్రాత ర్యుక్తరథో
యయౌ. 14

వ్యాఖ్య : భ్రాతుః-జ్యేష్ఠుడగు రామునియొక్క, సంతానశ్రవణాత్-సంతానోత్పత్తిని విన్నకారణమువలన, సౌమనస్యవాన్-సంతోషమును బొందిన మనస్సుగలవాడగు, సౌమిత్రిః-సుమిత్రానందనుడగు శత్రుఘ్నుడు ప్రాతః-మరుసటి ప్రాతఃకాలమున,యుక్తరథః-సిద్ధపరుపబడిన రథముగలవాడగుచు, ప్రాంజలిః-చేతులు జోడించినవాడై, మునిం-వాల్మీకిని, ఆమంత్ర్య-ఆ మంత్రణముచేసి (మునికి వెళ్ళివచ్చెదనని చెప్పి), యయౌ-వెళ్ళిపోయెను. రాముడు సంతానవంతుడైనట్లు విని, సంతోషభరితమగు మనస్సుతో నారాత్రి యచ్చటనుండి, మరునాటి ఉదయమున వాల్మీకికి నమస్కరించి సెలవు తీసికొని వెళ్ళిపోయెను. "సౌమిత్రిః యయౌ" అకర్మక కర్తరి ప్రయోగము.

శ్లో. స చ ప్రాప మధూపఘ్నం కుంభీనస్యాశ్చ కుక్షిజః,
వనాత్ కర మివాదాయ సత్త్వరాశి ముపస్థితః. 15

వ్యాఖ్య : సః, చ-శత్రుఘ్నుడును, మధూపఘ్నం-మధూపఘ్నమను పేరుగల లవణపురమును, ప్రాప-చేరెను. కుంభీనస్యాః-రావణుని చెల్లెలగు కుంభీనసియొక్క కుక్షిజః, చ-కడుపునబుట్టిన లవణాసురుడును, వనాత్-అరణ్యమునుండి, కరం, ఇవ-పన్నునువలె, సత్త్వరాశిం-జంతువులరాసిని, ఆదాయ-తీసికొని, ఉపస్థితః-చేరెను. శత్రుఘ్నుడు లవణపురమును జేరిన సమయముననే లవణుడు తమ యాహారముకొఱకు మృగరాశిని వనమునుండి తోలుకొని యెదురుపడెను. "కుంభీనసీ కుక్షిజ" శబ్దములు పూర్వవైరమును, లవణుని నిరర్థక జన్మను సూచించుచున్నవి. ప్రాప (ప్ర+ఆప). "సః మధూపఘ్నం ప్రాప" సకర్మక కర్తరి ప్రయోగము. ఆవనము వాని రాజ్యమని "కర" శబ్దము సూచించును.

శ్లో. ధూమధూమ్రో వసాగంధీ జ్వాలాబభ్రుశిరోరుహాః,
క్రవ్యాద్గణపరీవార శ్చితాగ్ని రివ జంగమః. 16

వ్యాఖ్య : ధూమధూమ్రః-పొగవలె నలుపు ఎఱుపు గలిసిన వర్ణముగల వాఁడును, వసాగంధీ-హృదయ మేదో గంధము గలవాఁడును, జ్వాలాబభ్రుశిరోరుహాః—జ్వాలా-మంటలవలె, బభ్రు-పసుపు నెఱుపురంగుగల, శిరోరుహాఃకేశములుగలవాఁడును, క్రవ్యాద్గణపరీవారః — క్రవ్యాత్-మాంసభక్షకులగు రాక్షసులయొక్క, గణ-గుంపులే, పరీవారః-తనను సేవించు పరివారముగాఁ గల వాఁడును, జంగమః-నడచుచున్న, చితాగ్నిః, ఇవ-శ్మశానాగ్నివలె, లవణుఁడు, శత్రుఘ్ననికిఁ గనిపించెను. (శ్మశానాగ్ని పక్షమున ధూమములచేత ధూమవర్ణఁడనియు, జ్వాలలే శిరోజములనియు, క్రవ్యాదులనఁగా గ్రద్దలు మొదలగు పక్షులనియు నర్థము). భావము స్పష్టము. క్రవ్యం-మాంసం అదంతీతి క్రవ్యాదః అని వ్యుత్పత్తి. "హ్యన్మేదస్తు వపా వసా" అను నమరమువలన మేధస్సు అనఁగా గుండె నుండి కారు ద్రవము. దానిని వంటినిండఁ బూసికొన్నవాఁడని యర్థము.

శ్లో. అపశూలం త మాసాద్య లవణం లక్ష్మణానుజః,
రురోధ సంముఖీనో హి జయో రంధ్రప్రహారిణామ్. 17

వ్యాఖ్య : లక్ష్మణానుజః-శత్రుఘ్నుఁడు, అపశూలం-శూలరహితుఁడగు, తం, లవణం- ఆ లవణాసురుని, ఆసాద్య-చేరి, రురోధ-ఆడ్డగించెను, రంధ్రప్రహారిణాం-ఎదటివాని లోపమును గుర్తించికొట్టు స్వభావముగలవారికి, జయః-విజయము, సంముఖీనః, హి-ఎదురుగాఁగనఁబడునట్టిదిగదా! మునులు లవణాసురుఁడు శూలహస్తుఁడు కానియప్పుడే జయింపఁబడునని చెప్పియుండుటచేత శత్రుఘ్నుఁడు శూలరహితుఁడైయున్న లవణునిఁగని యెదురుగానేగి యడ్డగించెనని భావము. శత్రువు రంధ్రము (లోపము) తనకు విజయసాధనమగుట లోకప్రసిద్ధము. ఇచ్చట లవణుని యపశూలతయే రంధ్రము. "లక్ష్మణానుజః లవణం రురోధ" సకర్మక కర్తరి ప్రయోగము. "రురోధ" రుధిర్-ఆవరణే ధాతువునకు పరస్మైపది లిట్.ప్ర.పు.ఏ. అలంకారము : ఆర్థాంతరన్యాసము. "సంముఖీనః" సర్వస్య ముఖస్య దర్శనః అను విగ్రహముగల యీ శబ్దము "యథాముఖేత్యాది సూత్రవిహిత"ఖ"ప్రత్యయాంతము స్పష్టముగాఁగనబడునది యని యర్థము.

యుగ్మమ్

శ్లో. నాతిపర్యాప్త మాలభ్య మత్కృతే రద్య భోజనమ్,
దిష్ట్యా త్వ మసి మే ధాత్రా భీతేనే వోపపాదితః. 18
ఇతి సంతర్జ్య శత్రుఘ్నం రాక్షస స్తర్జిఘాంసయా
ప్రాంశు ముత్పాటయామాస ముస్తా స్తంబ మివ ద్రుమమ్ 19

వ్యాఖ్య : రాక్షసః-లవణుఁడు, అద్య- ఈరోజున, మత్కృతే-నా కడుపు నకు, భోజనం-మృగాదిభోజ్యపదార్థమును, నాతిపర్యాప్తం-బాగుగా చాలనిదానినిగా, ఆలక్ష్య చూచి, భీతేన, ఇవ-భయపడినవాఁడగు ధాత్రా-బ్రహ్మదేవునిచేత, దిష్ట్యా-అదృష్టవశమున, మే-నాకొఱకు, త్వం, ఉపపాదితః, అసి-నీవు కల్పింపబడ్డ వాఁడ వగుచున్నావు, ఇతి-ఇట్టిమాటలచేత, శత్రుఘ్నం-శత్రుఘ్నుని, సంతర్జ్య-బెదిరించి, తర్జిఘాంసయా-అతనినిఁ జంపుకోరికచేత, ప్రాంశుం-ఉన్నతమైన, ద్రుమం చెట్టును, ముస్తా స్తంబ మివ-తుంగగడ్డిపఱకనువలె, ఉత్పాటయామాస-పైకిఁబెకలించుకొనెను. లవణాసురుఁడు ఓయీ! "యీనాడు నా కుక్షికి మృగాది భోజ్యపదార్థము చాలదనియు, నా కడుపునిండకున్నచో నేనేమి చేయుదునో! యని భయపడియు బ్రహ్మ నాకొఱకు నిన్ను కల్పించినాడు" అని శత్రుఘ్నుని బెదిరించుచు నొకమహావృక్షమును గడ్డిపఱకనువలె సులభముగాఁబెకలించుకొని యతనిని జంపుట కుద్యుక్తుఁడయ్యె నని భావము.

శ్లో. సౌమిత్రే ర్నిశితై ర్బాణై రంతరా శకలీకృతః,
గాత్రం పుష్పరజః ప్రాప న శాఖీ నైర్ఋతేరితః. 20

వ్యాఖ్య : నైర్ఋతేరితః-రాక్షసునిచే విసిరివేయఁబడిన, శాఖీ-వృక్షము, అంతరా-నడుమనే, నిశితైః-తీక్ష్ణములైన, బాణైః-శరములచేత, శకలీకృతః-చిన్న ముక్కలుగాఁజేయఁబడినదగుచు, సౌమిత్రేః-శత్రుఘ్నునియొక్క, గాత్రం-శరీరమును, నప్రాప-చేరలేదు (కాని), పుష్పరజః-పుప్పొడి ప్రాప-చేరెను. లవణాసురుఁడు విసరివేసిన మహావృక్షము శత్రుఘ్నుఁడు ప్రయోగించిన బాణములచేత దారిలోనే చూర్ణమై యతని శరీరమును జేరలేకపోయెను గాని ఆ వృక్షపుష్పముల లోని రజమువూత్రము శత్రుఘ్నుని శరీరమును గప్పెను. 'శాఖీ గాత్రం నప్రాప' "పుష్పరజః గాత్రం ప్రాప" అన్నవి సకర్మక వాక్యములు. అది శత్రుఘ్నునికి విజయసూచకమని భావము.

శ్లో. వినాశా త్తస్య వృక్షస్య రక్ష స్తస్మై మహోపలమ్,
ప్రజిఘాయ కృతాంతస్య ముష్టిం పృథ గివ స్థితమ్. 21

వ్యాఖ్య : రక్షః-లవణాసురుఁడు, తస్య, వృక్షస్య-ఆవృక్షముయొక్క, వినాశాత్-నశించిన కారణమువలన, మహోపలం-పెద్దపాషాణమును, పృథక్, స్థితం-విడిగానుండిన, కృతాంతస్య-యమునియొక్క, ముష్టిం, ఇవ-పిడికిలివలె, తస్మై-శత్రుఘ్నునికొఱకు, ప్రజిఘాయ-విసిరివేసెను. లవణాసురుఁడు తానువేసిన మహావృక్షము శత్రుఘ్నుని బాణములచేత చూర్ణమైపోగా ఒక పెద్దగుండును, యమునిదేహమునకు దూరముగానున్న యమముష్టినివలె శత్రుఘ్నునిపై విసరెనని భావము.

శ్లో. ఐంద్ర మస్త్ర ముపాదాయ శత్రుఘ్నో న స తాడితః,
సికతాత్వా దపి పరాం ప్రపేదే పరమాణుతామ్. 22

వ్యాఖ్య : సః-ఆ మహోపలము, శత్రుఘ్నేన-శత్రుఘ్నునిచేత, ఐంద్రం-ఇంద్రదేవతాకమగు, అస్త్రం-బాణమును, ఉపాదాయ-తీసికొని, తాడితఃసన్-కొట్టఁబడినదగుచు, సికతాత్వాత్, అపి-సికతాభావముకంటెను (ఇసుకగా మారుట కంటెను), పరాం-ఎక్కువదియగు, పరమాణుతాం-పరమాణువుగా మారుటను, ప్రపేదే-పొందెను. లవణుఁడు విసరినగుండు ఇంద్రదేవతాకమగు అస్త్రమును దీసికొని శత్రుఘ్నునిచేతఁ గొట్టబడినదై యిసుకరేణువులకంటెను చిన్నవియగు పరమాణువులుగా చూర్ణమైపోయెనని భావము. పర్వతపాషాణాదులను భేదించువాడింద్రుఁడు గావున నిచ్చట మహాపాషాణమును జూర్ణము చేయుటకు ఇంద్రదేవతాకమగు నస్త్రముపయోగింపఁబడినది. "యతః అణు ర్నాస్తి స పరమాణుః (దేనికంటెను చిన్నదియగు అణువులేదో అది పరమాణువు) అని పరమాణుశబ్దార్థము. "సః పరమాణుతాం ప్రపేదే" సకర్మక కర్తరిప్రయోముగ. ప్రపూర్వక పద-గతౌ ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ.

శ్లో. త ముపాద్రవ దుద్వ్యమ్య దక్షిణం దో ర్నిశాచరః,
ఏక తాల ఇవోత్పాతపవనప్రేరితో గిరిః. 23

వ్యాఖ్య : నిశాచరః-లవణాసురుఁడు, దక్షిణం, దోః-కుడిభుజమును, ఉద్యమ్య-పైకెత్తి, ఏకతాలః-ఒకేతాటిచెట్టుగలదియు, ఉత్పాతపవనప్రేరితః-ఉత్పాత-భూకంపాద్యుపద్రవ సమయమునందలి, పవన-వాయువుచేత, ప్రేరితః-ప్రోయబడిన, గిరిః, ఇవ-పర్వతమువలె, తం-ఆశత్రుఘ్నుని-ఉపాద్రవత్-ఎదుర్కొనెను. తాను విసరినగుండు చూర్ణమైపోగా క్రుద్ధుఁడైన లవణాసురుఁడు దక్షిణ బాహువును పైకెత్తుకొని, ఒకేతాటి చెట్టుగల పర్వతము ప్రళయకాల వాయువుచే నెగురఁగొట్టబడి వచ్చినట్లు; శత్రుఘ్నునిపైకుఱికె నని భావము: కవిప్రయోగములందును, నిఘంటువులయందును "దోశ్శబ్దము" పులింగముగా (ప్రపేష్టోదోఃదోషంతస్య అనురీతిగా), నున్నను ఇచ్చట నపుంసకలింగముగాఁ బ్రయోగింపఁబడుటకు "ఉకుద్దోషణీ" యను వ్యాకరణమహాభాష్యకారుని (పతంజలి) ప్రయోగము కారణమని యెఱుగవలెను "ఉపాద్రవత్" (ఉప+అద్రవత్) ద్రు-గతౌ ధాతువునకు భూతార్థకమగు లఙ్. ప్ర. పు. ఏ. "ఉప" ఉపసర్గము.

శ్లో. కార్ష్ణేన పత్రిణా శత్రుఃస భిన్నహృదయఃపతన్,
ఆనినాయ భువఃకంపం జహారాశ్రమవాసినామ్. 24

వ్యాఖ్య : సఃశత్రుఃఆ లవణాసురుఁడు, కార్ష్ణేన-విష్ణుదేవతాకమగు, పత్రిణా-బాణముచేత, భిన్నహృదయఃచీల్చఁబడిన వక్షస్థలముగలవాఁడై, పతన్-పడుచు, భువఃభూమికి-కంపం-చలనమును, ఆనినాయ-కలిగించెను; ఆశ్రమవాసినాం-మునులయొక్క, కంపం-భయమును, జహార-తొలఁగించెను. శత్రుఘ్నుఁడువేసిన వైష్ణవబాణముచేత వక్షము చీలి నేలపైఁబడుచున్న లవణునివలన భూమి యతని దేహభారముచేతఁ గంపించెననియు మునులకు రాక్షసభయము తొలఁగిపోయెననియు భావము. కృష్ణస్యేదంకార్ష్ణం. ఇచ్చటికృష్ణ శబ్దమునకు "విష్ణుర్నారాయణఃకృష్ణఃఅను అమరమువలన విష్ణువనియు, వైష్ణవబాణమనఁగా నారాయణాస్త్ర మనియు నర్థములు 'ఆనినాయ' నీఞ్-ప్రాపణే ధాతువునకును, "జహార" హృఞ్-హరణే ధాతువునకును లిట్ ప్ర. పు. ఏకవచనములు.

శ్లో. వయసాం పంక్తయఃపేతుర్హతస్యోపరి విద్విషః,
తత్ప్రతిధ్వంధ్వినో మూర్ధ్ని దివ్యాఃకుసుమవృష్టయః. 25

వ్యాఖ్య : హతస్య-చంపఁబడిన, విద్విషః-శత్రువగులవణునియొక్క, ఉపరి-మీద, వయసాం-పక్షులయొక్క, పంక్తయః-బారులు, పేతుః-పడెను; తత్ప్రతిద్వంద్వినః-వానితోయుద్ధముచేసిన శత్రుఘ్ననియొక్క, మూర్ధ్ని-శిరస్సునందు, దివ్యాః, కుసుమవృష్టయః-దేవతలు కురిపించిన పూలవానలు, పేతుః-పడినవి. చచ్చినేలపైఁబడిన లవణాసురునిమీద కాకులు గ్రద్దలు మొదలగు పక్షులు వాలెననియు, విజయమును పొందిన శత్రుఘ్నుని తలపై దేవతలు పుష్పవృష్టినిఁ గురిపించిరనియు భావము. "పేతుః" పపాత, పేతతుః, పేతుఃపత్ల్-గతౌ ధాతువు లిట్. ప్ర. బ. "పేతుః", అనుక్రియ పక్షులపంక్తులకును, కుసుమవృష్టికిని ఆవృత్తిని పొందుటచేత నిది దీపకాలంకారము (శబ్దావృత్తి దీపకము).

శ్లో. స హత్వా లవణం వీర స్తదా మేనే మహౌజసః,

భ్రాతుః సౌదర్య మాత్మాన మింద్రజిద్వధశోభినః. 26

వ్యాఖ్య : సః, వీరః-వీరుఁడగు శత్రుఘ్నుఁడు, లవణం-లవణాసురుని, హత్వా-చంపి, తదా-అప్పుడు, ఆత్మానం-తనను, మహౌజసః-గొప్పపరాక్రమశాలియు, ఇంద్రజిద్వధశోభినః-ఇంద్రజిత్తు వధచేత ప్రకాశించువాఁడును నగు, భ్రాతుః-అన్నయగు లక్ష్మణునియొక్క, సౌదర్యం-ఏకోదరుఁడగు తమ్మునిగా, మేనే-తలఁచుకొనెను. మహావీరుఁడు భయంకరుఁడు నగు లవణాసురునిఁ జంపి, అప్పుడు, శత్రుఘ్నుఁడు ఇంద్రజిత్తును వధించి కీర్తిమంతుఁడగు తనయన్న లక్ష్మణునికిఁ దగినసోదరుఁడనైతినని భావించి సంతసించెనని భావము. "సమానోదరే శయితః సౌదర్యః" అని విగ్రహము. "మేనే" మను-అవబోధనే లిట్. ప్ర. పు. ఏ.

శ్లో. తస్య సంస్తూయమానస్య చరితార్థై స్తపస్విభిః,

శుశుభే విక్ర మోదగ్రం వ్రీడయా వనతం శిరః. 27

వ్యాఖ్య : చరితార్థైఃకృతార్థులైన, తపస్విభిఃమునులచేత, సంస్తూయమానస్య-పొగడఁబడుచున్న, తస్య-ఆశత్రుఘ్ననియొక్క, విక్రమోదగ్రం-పరాక్రమముచేత ఉన్నతమైనదియు, వ్రీడయా-మునులపొగడ్తవలన గలిగిన సిగ్గుచేత, అవనతం-వంచఁబడినదియునగు, శిరఃశిరస్సు, శుశుభే-ప్రకాశించెను. లవణ

వధరూపమైన తమ కార్యము సిద్ధించిన పిమ్మట మునులు పొగడుచుండగా విజయము కలిగినందున నెత్తఁబడినదియు, సమక్షమున మునులు పొగడుచుండుట చేత సిగ్గున వంచఁబడినదియు నగు శత్రుఘ్నుని శిరస్సు మిక్కిలి ప్రకాశించెను. విజయము పొందినవానికి లజ్జయే భూషణమని భావము. "శుశుభే" శుభ-దీప్తౌ ఆత్మనేపది లిట్ ప్ర. పు. ఏ. "శిరఃశుశుభే" ఆకర్మక కర్తరి ప్రయోగము.

శ్లో. ఉపకూలం స కాలింద్యాః పురీం పౌరుషభూషణః,
నిర్మమే నిర్మమో ఽర్థేషు మధురాం మధురాకృతిః. 28

వ్యాఖ్య : పౌరుషభూషణః-పురుషప్రయత్నముభూషణముగాఁగలవాఁడును, అర్థేషు-భోగ్యవిషయములయందు, నిర్మమః-మమకారములేనివాఁడును, మధురాకృతిః-దర్శనీయరూపముగలవాఁడును నగు, సః-ఆశత్రుఘ్నుఁడు, కాలింద్యాః-యమునా నదియొక్క, ఉపకూలం-తీరమునందు, మధురాం, పురీం-మధురానామకనగర మును, నిర్మమే-నిర్మించెను. కార్యశూరుఁడును, విషయలోలుపుఁడుగాని వాడు నగు శత్రుఘ్నుఁడు, యమునాతీరమునందు మధుర యను పట్టణమును తన పౌరుషచిహ్నమునుగా నిర్మించెను. "నిర్మమే" నిర్ అను నుపసర్గతోఁగూడిన "మా-మానే" య ఁ పస్మైపది ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ.

శ్లో. యా సౌరాజ్యప్రకాశాభి ర్బభౌ పౌరవిభూతిభిః,
స్వర్గాభిష్యందవమనం కృత్వా సోపనివేశితా. 29

వ్యాఖ్య : యా-ఏమధురాపురి, సౌరాజ్యప్రకాశాభిః-మంచిరాజు (శత్రు ఘ్నుఁడు) కలిగియుండుటచేత ప్రకాశమానము లగుచున్న, పౌరవిభూతిభిః-పుర జనులయైశ్వర్యములచేత, స్వర్గాభిష్యందవమనం—స్వర్గ-స్వర్గమునకు, అభిష్యంద-ఎక్కువగానున్న జనముయొక్క, వమనం-ఆహరణమును, కృత్వా-చేసి, ఉపని వేశితా, ఇవ-స్థాపింపఁబడినదివలె, బభౌ-ప్రకాశించెనో! అట్టి మధురానగరము నిర్మించెను. అట్లు యమునాతీరమున నిర్మింపఁబడిన మధురానగరము శత్రుఘ్నుని పాలనమున రాజన్వతియై తన్మూలములగు నైశ్వర్యములతో ప్రజలు తులదూగుచుండఁగా నానగరము, స్వర్గముపట్టక మిగిలిన స్వర్గవాసి జనమును దెచ్చి నిర్మింపబడెనాయేమి! యనునట్లు దేదీప్యమానమై విలసిల్లుచుండెననియు, దానిని శత్రుఘ్నుఁడు చక్కగా పరిపాలించుచుండెననియు భావము. "బభౌ" భా-దీప్తౌ

అనుధాతువునకు లిట్. ప్ర.పు.ఏ. ఇచ్చట కాళిదాసుయొక్క అర్థశాస్త్ర విజ్ఞానము "స్వర్గాభిష్యందవమనం" మొదలగు పద ప్రయోగములవలన వ్యక్తమగుచున్నది. కౌటిల్యార్థ శాస్త్రమునందు "జనపదనివేశః" అను శీర్షిక క్రింద నొకరాజు నూతన నగర నిర్మాణము నెట్లు చేయవలెనో చెప్పెను. "భూతపూర్వ మభూత పూర్వంవా జనపదం పరదేశాపవాహనేన స్వదేశాభిష్యందవమనేన వా నివేశయేత్" అనగర మంతకు ముందొకవిధముగా నున్నదికాని, లేక క్రొత్తదికాని కావచ్చును. అచ్చట నివసింపవలసిన జనమును పరదేశమునుండి తెచ్చికాని, తనదేశమున మిగిలియున్న, అనగా గృహారామక్షేత్రాదులులేని ఆయా వృత్తులవారిని, తెచ్చి యా నగరమున నిలుపవలెను. ఆతరువాత దాని సీమలు, నచ్చట కల్పింపవలసిన సౌకర్యములు, జనుల వృత్తిభేదములు మొదలగునవి చేయవలెనని చెప్పెను. ప్రస్తుత మధురానగరమునకు శత్రుఘ్నుడు స్వర్గమున మిగిలియున్న జనమును దెచ్చి నిలిపెనా? యను ఉత్ప్రేక్షాలంకారముచేత నచ్చటిసౌకర్యములు, ఐశ్వర్యములు చాణక్యార్థశాస్త్రప్రకారమున విరాజిల్లుచుండెనని తెలియుచున్నది

శ్లో. తత్ర సౌధగతః పశ్యన్ యమునాం చక్రవాకినీమ్,
హేమభక్తిమతీం భూమేః ప్రవేణీ మివ పిప్రియే. 30

వ్యాఖ్య : తత్ర-ఆ మధురానగరమునందు, సౌధగతః-మేడమీదికెక్కినవాడై, సః-ఆశత్రుఘ్నుడు, చక్రవాకినీం-చక్రవాకపక్షులుగలదియగు, యమునాం-యమునానదిని, హేమభక్తిమతీం-బంగారపు రేకులతో, ఆభరణములతోను గూడిన, భూమేః-భూదేవియొక్క, ప్రవేణీం, ఇవ-పొడుగుగానున్న జడనువలె, పశ్యన్-చూచుచున్నవాడై, పిప్రియే-ప్రీతినొందెను. ఆ మధురానగరరాజధానిలోని మేడమిద నిల్చుని శత్రుఘ్నుడు, చక్రవాక పక్షులతోనున్న యమునానదియందమును చూచుచు, పొడుగైనజడలో సువర్ణాభరణములు పెట్టుకొని యున్న భూదేవి సౌందర్యమును భావించుచు ఆనందమొందుచుండెనని భావము "పిప్రియే" ప్రీఞ్-ప్రీణనే అనుధాతువునకు లిట్. ప్ర.పు.ఏ.

శ్లో. సభా దశరథస్యాపి జనకస్యచ మంత్రకృత్,
సంచస్కారో భయప్రీత్యా మైథిలేయో యథావిధి. 31

వ్యాఖ్య: దశరథస్య-దశరథునికి, జనకస్యచ-జనకమహారాజునకును, సభా-మిత్రుడగు, మంత్రకృత్, అపి-మంత్రదృష్టయగు వాల్మీకిగూడ, ఉభయప్రీత్యా-

జనకదశరథు లిద్దఱియందునుగల స్నేహనుచేత. మైథిలేయౌ-మైథిలీతనయుల నిద్దఱిని, యథావిధి-శాస్త్రానుసారముగా, సంచస్కార-జాతకర్మాదులతో సంస్కరించెను. దశరథుఁడు, జనకుఁడు సైతము, తన మిత్రులై నందున, వాల్మీకి ఆయుభయులకును వంశవర్ధనులగు శిశువులు సంస్కారరహితులై యుండుట తగదుగనుక, స్వయముగా వేదవేత్తయైనందున బాలురిద్దఱికి శాస్త్రప్రకారము జాతకర్మాదిసంస్కారములు జరిపెనని భావము. ఇచ్చట రామునిపేరెత్తక జనక దశరథులను జెప్పుట వలన వాల్మీకికి రాముఁడు లోకాపవాదభీతుఁడై ధర్మదార పరిత్యాగము చేసెనన్న చిఱుకోపముండినట్లు స్ఫురించుచున్నది. ద్విజశబ్ద వాచ్యులగు బ్రహ్మ క్షత్రియ వైశ్యులకు "నిషేకాది శ్మశానాంతః" అను మనుస్మృతి వాక్యమువలన సమంత్రకములగు "గర్భాధాన పుంసవన సీమంతోన్నయన జాతకర్మాదులగు నలువది సంస్కారములు ధర్మశాస్త్రముచేత విహితములై యున్నవి. అట్టి సంస్కారముల వలన ద్విజుడు పరిశుద్ధుఁడగును. కావున వాల్మీకి ఆ శిశువులకు సంస్కార లోపమును జరుగనీయలేదు. మిథిలానాం రాజా మైథిలః అనగాజనకుఁడు, మైథిల్యా అపత్యంస్త్రీ-మైథిలీ అనఁగా సీత, మైథిల్యాః సుతౌ మైథిలేయౌ-ఇద్దరు సీతాసుతులగు శిశువులు అని వ్యుత్పత్తి. "సంచస్కార" "డు కృఞ్-కరణే" అను ధాతువు "సమ్" అను ఉపసర్గతోకూడినప్పుడు ధాతుమాత్రమునకు "సుట్" అను ఆగమము వచ్చి "సంస్కరోతి" అని లట్‌రూపము సిద్ధించును. ప్రస్తుత లిట్ రూపమునందు అభ్యాస "చ" కారముతో వ్యవధానమున్నను సుడాగమమువచ్చి "సంచస్కార" అని యగును. కాగా లిట్ ప్రపు ఏ. "మంత్రకృత్" అను శబ్దము "సుకర్మపాప మంత్రపుణ్యేషు కృఞః" అను సూత్రమువలన క్విప్ ప్రత్యయాంతముగా బయుక్తమైనది. ఇవి సుకృత్, కర్మకృత్, పాపకృత్, మంత్రకృత్, పుణ్యకృత్. అనుతకారాంత శబ్దములుగా నుంటును.

శ్లో. స తౌ కుశలవోన్మృష్టగర్భక్లేదౌ తదాఖ్యయా,
కవిః కుశలవా వేవ చకార కిల నామతః. 32

వ్యాఖ్య : సఃకవిః-ఆ వాల్మీకిముని, కుశలవోన్మృష్టగర్భక్లేదౌ-కుశదర్భలచేతను, లవ-గోపుచ్ఛలోమములచేతను, ఉన్మృష్ట-ఉపమార్జనముచేసి తొలగింపఁబడిన, గర్భక్లేదౌ-గర్భోపద్రవముగల, తౌ-ఆ కుమారులిద్దఱిని, తదాఖ్యయా ఏవ-వాటిపేర్లతోనే, నామతః-పేర్లగునట్లు, కుశలవౌ, ఏవ-కుశలవులు అనియే, చకార, కిల-నామకరణము చేసెనుసుమా. గర్భస్థశిశువులకు లోన నెట్టి బాధయుఁ

గలుగకుండునట్లు సమంతకముగా దర్భలతోను, గోవు తోకయందలి వెంట్రుకల తోను గర్భమునకు ఉపమార్జనముచేయుట ఆచారమైయున్నందున అట్టి మార్జనము చేత సుఖముగా ఉద్భవించిన యాశిశువులకు వాల్మీకి ఆ కుశలవముల పేర్లే పెట్టెనని భావము. ఉపమార్జనమనగా క్రిందినుండి పైకి ప్రోక్షించుట. "కుశైః ఉన్మృష్టః కుశః; లవైఃఉన్మృష్టః లవః" అని వ్యుత్పత్తి. "లవో లవణ కింజల్క పక్ష్మ గోపుచ్ఛలోమసు" అని వైజయంతి నిఘంటువు.

శ్లో. సాంగం చ వేద మధ్యాప్య కించిదుత్కైంతశైశవౌ,
స్వకృతిం గాపయామాస కవిప్రథమపద్ధతిమ్. 33

వ్యాఖ్య : కించిదుత్కైంతశైశవౌ-కొంచముగా గడచిపోయిన శిశుత్వము గల యా బాలురను, సాంగంచ-అంగములతోగూడినదియునగు, వేదం వేదమును, అధ్యాప్య-అధ్యయనముచేయించి,కవిప్రథమపద్ధతిం-కవులకు మేలుబంతియగు(కవితా రచనకు బీజభూతమైన) స్వకృతిం-తన కావ్యమగు రామాయణమును,గాపయామాస-గానము చేయించెను. వాల్మీకి ఆ కుశలవులకు కొంతశైశముగడచి చెప్పనచదువును పలుకగల బాల్యమురాగానే వేదమును, వేదాంగములను నేర్పి పిమ్మట తాను రచించి నదియు, కవిత్వమునకు బీజభూతమైనదియు నగు రామాయణమును గానముచేయు టకు నేర్పెను. ఋగ్వేద, యజుర్వేద, సామవేదములు, అధర్వణవేదమునునేర్పుటయే గాక శిక్ష, వ్యాకరణం ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషము, కల్పము అనువేదాంగము లను సైతము నేర్పెను. "గాపయామాస"గై-శబ్దే ధాతువునకు ణిచ్‌లో (ప్రేరణార్థ కము) లిట్. ప్ర.పు ఏ. ఇచ్చటి "కవిప్రథమపద్ధతిమ్" అనునది రామాయణము యొక్క ఆదికావ్యత్వ కవిమార్గదర్శకత్వ ములను వెల్లడించుచున్నది.

శ్లో. రామస్య మధురం వృత్తం గాయంతౌ మాతు రగ్రతః,
తద్వియోగవ్యథాం కించిత్ శిథిలీచక్రతుః సుతౌ. 34

వాఖ్య : తౌ, సుతౌ-ఆ కుమారులిద్దఱు, రామస్య-శ్రీరాముని యొక్క, వృత్తం-చరిత్రను, మాతుః-తల్లియొక్క, అగ్రతః-ఎదుట, మధురం-మనోహర ముగా, గాయంతౌ-గానముచేయుచున్నవారగుచు, తద్వియోగవ్యథాం-సీతకుగల రామవియోగవేదనను, కించిత్-కొంచము, శిథిలీచక్రతుః-సడలించిరి అట్లు వాల్మీకి నేర్పిన రామాయణమువలన కుశలవులు రాముని జీవితవిశేషములను తల్లిముందు

గూర్చుని మధురముగా గానముఁజేయుచు నామెకు రాముని యెడబాటువలనఁ గలిగిన దుఃఖములను కొంచము తగ్గించిరని భావము. మానవులకు దూరమైన ప్రేమాస్పద వ్యక్తియొక్కఁగాని, వస్తువుయొక్కఁగాని గుణవర్ణనము కొంత దుఃఖశాంతిని గలిగించునుగదా!

శ్లో॥ ఇతరేఽపి రఘో ర్వంశ్యా స్త్రయ స్తేషాగ్ని తేజసః,
తదోగ్యా త్పతివత్నీషుపత్నీ ష్వాసఁ ద్విసూనవః. 35

వ్యాఖ్య : రఘోః-రఘుమహారాజుయొక్క, వంశ్యాఃవంశీయులును, త్రేతాగ్ని తేజసః-గార్హపత్యము, దాక్షిణాగ్నియు, ఆహవనీయము, అను మూడు యజ్ఞాగ్నులయొక్క తేజస్సువంటి తేజస్సుగల, ఇతరే, త్రయఃఅపి-రాముని కంటె యితరులగు భరతాదులు ముగ్గురును, తదోగ్యాత్-వారివారి సంబంధమువలన, పతిపత్నీషు-పతివ్రతలుగా ప్రఖ్యాతలైన, పత్నీషు-భార్యలయందు, ద్విసూనవఃఇద్దఱిద్దఱు కుమారులుకలవారు, ఆసన్-అయిరి. పవిత్రమగు రఘువంశమునందుఁ త్రేతాగ్నులవంటి తేజస్సుగల భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు సైతము పతివ్రతలైన తమ భార్యలయందు ఇద్దఱిద్దఱు కుమారులను బడసిరని భావము. "ద్వౌద్వౌ సూనూ యేషాంతే ద్విసూనవఃఅని విగ్రహము. "అంతర్వత్పతివతోర్నుక్"అను సూత్రముచేత జీప్, నుగాగములు వచ్చి, అంతర్వత్నీ, పతివత్నీ శబ్దములు సిద్ధించును. అంతర్వత్నీ యనఁగా గర్భిణీయనియు, పతివత్నీ యనగా జీవత్పతిక యనియు నర్థమున్ను. కాని ప్రస్తుత శ్లోకభావానుసారముగా పతివ్రతలుగా ప్రఖ్యాతలైన అని యర్థము వ్రాయఁబడినది.

శ్లో. శత్రుఘాతిని శత్రుఘ్నః సుబాహౌ చ బహుశ్రుతే,
మధురావిదిశే సూనో ర్నిదధే పూర్వజోత్సుకః. 36

వ్యాఖ్య : పూర్వజోత్సుకఃజ్యేష్ఠుఁడగురామునిఁ జూచుటయందు ప్రేమగల శత్రుఘ్నఃశత్రుఘ్నుఁడు, బహుశ్రుతే-బహుశ్రుతుఁడనియు, శత్రుఘాతిని-శత్రువులనుజంపఁగల, సుబాహౌచ-సుబాహుఁడనియుఁ బేర్లుగల, సూనోఃఇద్దఱుకుమారులయందు, మధురావిదిశే-మధురా విదిశా నగరములను, నిదధే-ఉంచెను. మధురా నగరనిర్మాణానంతరము కొంతకాల మచ్చటనుండిన శత్రుఘ్నుఁడు, అగ్రజుఁడగు

రామునివద్దికేగుటయందు వాంఛగలవాఁడగుటచేత తనకుమారులగు బహుశ్రుత సుబాహువుల యందు మధురానగర విదిశానగర పరిపాలన బాధ్యతను ఉంచి, తాను అయోధ్యకు వెళ్ళెనని భావము "నిదధే" ని అను ఉపసర్గతోఁగూడిన (డు) ధాఞ్-ధారణపోషణయోః అను ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ.

శ్లో. భూయ స్తపోవ్యయో మాభూత్ వాల్మీకే రితి
సో ఽత్యగాత్,
మైథిలీతనయోద్గీత నిఃస్పందమృగ మాశ్రమమ్. 37

వ్యాఖ్య : సః-ఆశ తుఘ్నుఁడు, మైథిలీతనయోద్గీతనిఃస్పందమృగం— మైథిలీతనయ-కుశలవులయొక్క, ఉద్గీత-పెద్దగావినఁబడు గానముచేత, నిస్పంద-నిశ్చలములగుచువినుచున్న, మృగం-లేళ్ళుగల, వాల్మీకేః, ఆశ్రమం-వాల్మీకి యొక్క ఆశ్రమమును, భూయః-మరలగూడ, తపోవ్యయః-తనకు ఆతిథ్యాదుల నేర్పరచుటకగు తపోహాని, మాభూత్, ఇతి--లేకు డునుగాకయని, అత్యగాత్-దాటివెళ్ళెను. కుశలవులు చేయుచున్న రామాయణగానమును వినుచు నిశ్చలములై యున్న లేళ్ళతో ప్రశాంతముగానున్న వాల్మీకి తపోవనమునకు తన ప్రవేశమువలన మరల నంతరాయము, తపోవ్యయము గలుగుట తగదని భావించిన శత్రుఘ్నుఁడందుఁబవేశింపక దాటివెళ్లెనని భావము. మా + అభూత్-మాభూత్ "నమాఙ్ యోగే" అనుసూత్రమువలన "మా"తోసంబంధమున్న ధాతువునకు "అ" చేరదు. అతి + అగాత్-అత్యగాత్. అతి ఉపసర్గతోఁగూడిన "ఇఙ్—గతౌ" ధాతువు రెండును భూతార్థకలుఙ్ ప్ర. పు. ఏకవచనములు.

శ్లో. వశీ వివేశ చాయోధ్యాం రథ్యాసంస్కారశోభినీమ్,
లవణస్య వధాత్ పౌరై రీక్షితో ఽత్యంతగౌరవమ్. 38

వ్యాఖ్య: వశీ-ఇంద్రియ నిగ్రహముగల శత్రుఘ్నుఁడు, లవణస్య-లవణా సురునియొక్క, వధాత్-చంపుటకారణముగా, పౌరైఃపురజనులచేత, అత్యంత గౌరవం-మిక్కిలిగౌరవ యుక్తముగా, ఈక్షితఃసన్-చూడఁబడినవాఁడగుచు, రథ్యాసంస్కారశోభినీం-తోరణాది సంస్కారముతోగూడిన రాజమార్గముగల, అయోధ్యాం-అయోధ్యానగరమును, వివేశచ-ప్రవేశించెనుగూడ. లవణాసురుని ఱంపిన వీరుఁడని ప్రజలు గౌరవపురస్సరముగాఁజూచుచుండ శత్రుఘ్నుఁ డలంక

రింపఁబడిన రాజమార్గములు, రచ్చలుగల అయోధ్యను జేరెను. ఇందలి "వశీ" అను విశేషణము శత్రుఘ్నుఁడు సీతా విషయమును రామునితోఁజెప్పక మనస్సులోనే యుంచుకొన్న విషయమును సూచించును. "వివేశ" విశ-ప్రవేశనే ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ.

శ్లో. స దదర్శ సభామధ్యే సభాసద్భి రుపస్థితమ్,
రామం సీతాపరిత్యాగా దసామాన్యపతిం భువః. 39

వ్యాఖ్య : సః-ఆ శత్రుఘ్నుఁడు, సభామధ్యే-సభామధ్యప్రదేశమునందు, సభాసద్భిః-సభ్యులచేత, ఉపస్థితం-సేవింపబడినవాఁడును, సీతాపరిత్యాగాత్-సీతను పరిత్యజించుటవలన, భువః-భూమికి, అసామాన్యపతిం-అసాధారణ భర్తయు నగు, రామం-రాముని, దదర్శ-చూచెను. సభ్యులతో సభామధ్యననున్న యసాధారణ భూభర్త యగు రాముని శత్రుఘ్నుఁడు దర్శించెను. ఏ రాజైనను భూమికి సామాన్య భరయే అనఁగా భూదేవితోపాటు అతని పట్టపురాణియు నుండునుగావున ఆ రాజు వారిద్దరికిని, లేక పెక్కండ్రకు సమానభోక్తగా నుండును. ఇచ్చట సీతా పరిత్యాగమును జేసినరామునఁ డొక్కభూదేవికే భర్తగావున అసామాన్యపతిగాఁ జెప్పటలో రామునఁడు మరియొకస్త్రీని వివాహముజేసికొనలేదని సూచితము. "దదర్శ" దృశిర్-ప్రేక్షణే ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ.

శ్లో. త మభ్యనందత్ ప్రణతం లవణాంతక మగ్రజః,
కాలనేమివధాత్ ప్రీత స్తురాషా డివ శార్ఙ్గిణమ్. 40

వ్యాఖ్య : అగ్రజః-అన్నయగు రామునఁడు, లవణాంతకం-లవణునిఁజంపిన వాఁడును, ప్రణతం-తనకు నమస్కరించువాఁడునునగు, తం-ఆ శత్రుఘ్నుని, కాలనేమివధాత్-కాలనేమి యను రాక్షసునిఁ జంపుటవలన, ప్రీతః-సంతుష్టుఁడైన, తురాషాట్-ఇంద్రుఁడు, శార్ఙ్గిణం, ఇవ-ఉపేంద్రుఁడగు విష్ణువునువలె, అభ్యనందత్-అభినందించెను. కాలనేమి రాక్షసుని జంపిన యుపేంద్రుని ఇంద్రుఁ డెంతగా మెచ్చుకొనెనో అంతగా రాముడు లవణ వధచేసివచ్చిన శత్రుఘ్నుని మెచ్చు కొని సంతోషించెను. తురాం-వేగం సహతే ఇతి తురాషాట్ అని వ్యుత్పత్తి. అభి + అనందత్-అభ్యనందత్. "అభి" అను ఉపసర్గతో కూడిన "(టు)నది-సమృద్ధౌ" ధాతువునకు లఙ్. ప్ర.పు.ఏ.

శ్లో. సపృష్టః సర్వతో వార్తా మాఖ్య ద్రాజ్ఞే స సంతతిమ్,
ప్రత్యర్పయిష్యతః కాలే కవే రాద్యస్య శాసనాత్. 41

వ్యాఖ్య: సః-శత్రుఘ్ను డు, పృష్టసన్-అడగబడినవాడగుచు, సర్వతః, వార్తం-అంతటనుగల కుశలమును రాజ్ఞే-రాజైన రామునికి, ఆఖ్యత్-చెప్పెను, సంతతిం-కుశలవోత్పత్తి రూపమగు సంతాన విషయమును గురించి మాత్రము, కాలే-సరియైన అవసరమున, ప్రత్యర్పయిష్యతః-రాముని కప్పగింపబోవుటకుదల పెట్టిన, ఆద్యస్య, కవేః-ఆదికవియగు వాల్మీకియొక్క, శాసనాత్-ఆజ్ఞవలన, ఆఖ్యత్-చెప్పలేదు. ప్రభువైన రాముడు ప్రశ్నింపగా శత్రుఘ్నుడు సర్వ విషయికమగు కుశలమును విన్నవించెనుగాని, వాల్మీకి "సరియైన సమయమున నేనే కుశలవులను రాముని కప్పజెప్పవలె కీవిషయమును దెలుపవద్దని" శాసించి యుండుటవలన సంతతి విషయమును జెప్పలేదని భావము. 38వ శ్లోకమున శత్రుఘ్నునకు "ఋషి" యని విశేషణమువేయుట యిందులకేయని గ్రహింప వలయును. "ఆఖ్యత్" చక్షిఙ్-వ్యక్తాయాంవాచి అను ధాతువునకుగాని, లేఖ్యా-ప్రకథనే అను ధాతువునకుగాని లుఙ్ ప్ర.పు ఏ.

శ్లో. అథ జానపదో విప్రః శిశు మప్రాప్తయౌవనమ్,
అవతార్యాంకశయ్యాస్థం ద్వారి చక్రంద భూపతేః. 42

వ్యాఖ్య: అథ-ఆ పిమ్మట, జానపదః, విప్రః-దేశమునందలి యొకానొక బ్రాహ్మణుడు, అప్రాప్తయౌవనం-యువకుడుగానెమగని, శిశుం-మృతబాలుని, భూపతేః-రామునియొక్క, ద్వారి-రాజభవన ద్వారమునందు, అంకశయ్యాస్థం-తొడపై బండుకొనునట్లుగా, అవతార్య-క్రిందకు దింపి, చక్రంద-రోదనము చేసెను. తరువాత నొకప్పుడు దేశమునందలి యొక విప్రుడు చనిపోయిన తన కుమారుని దెచ్చి రాజభవన ద్వార ప్రదేశమునందు తొడపైదలయుంచునట్లు పండబెట్టుకొని పెద్దగా నేడ్చుచుండెను. "జనపదేభవః జానపదః అని విగ్రహము. "చక్రంద" క్రదీ-రోదనే ధాతువు లిట్ ప్ర పు.ఏ.

శ్లో. శోచనీయా సి వసుధే! యా త్వం దశరథా చ్చ్యుతా,
రామహస్త మనుప్రాప్య కష్టాత్కష్టతరం గతా. 43

వ్యాఖ్య : హేవసుధే-ఓభూదేవీ! దశరథాత్-దశరథునినుండి, చ్యుతా-జారి పోయిన, యా, త్వ-ఏనీవు, రామహ సం-రామునిచేతిని, అనుప్రాప్య-చేరి, కష్టాత్కష్టతరం-మిక్కిలి కష్టమును, గతా (సతీ)-పొందినదానవగుచు, శోచనీయా, అసి-శోచనీయురాలవగుచున్నావు ఓభూదేవీ! దశరథుడుబ్రాసి రామునిచేతిలోపడ్డ నీవు మహాకష్టములపాలై అయ్యో! అని దుఃఖింపబడుచున్నావని బ్రాహ్మణుడు రోదనముచేయుచు పలికెనని భావము. నీస్థితి మిక్కిలి హీనదశనుబొందినది. "అసి" ఆస-భువిధాతువు లట్ మధ్య. పు.ఏ.

శ్లో. శ్రుత్వా తస్య శుచో హేతుం గోప్తా జిహ్రాయ రాఘవః,
న హ్యకాలభవో మృత్యు రిక్ష్వాకుపద మస్పృశత్. 44

వ్యాఖ్య : గోప్తా-రక్షకుడగు, రాఘవః-రాముడు, తస్య-ఆవిప్రుని యొక్క. శుచః-శోకమునకు, హేతుం-కారణమును (పుత్రమరణమును), శ్రుత్వా-విని,జిహ్రాయ-సిగ్గుపడెను. హి-ఎందవల్లనైతే. అకాలభవః-అసమయమున గలిగెడు మృత్యుః-మరణము, ఇక్ష్వాకుపదం-ఇక్ష్వాకుల రాష్ట్రమును, న, అస్పృసత్-స్పృశించియుండలేదో! పెద్దలు బ్రతికియుండగా చిన్నవారు చచ్చుట యెన్నడులేని యిక్ష్వాకుల రాష్ట్రమునందు ఈవిప్రుని కుమారుడు మరణించుట విన్న రామునికి ఆశ్చర్యలజ్జకలిగెనని భావము. "జిహ్రాయ" హ్రీ-లజ్జాయాం ధాతువునకు "లిట్" ప్ర.పు ఎ. జిహ్రాయ జిహ్రియతుః, జిహ్రియుః. ఇత్యాదులుండును. "అస్పృశత్" స్పృశ-సంస్పర్శే ధాతువునకు లఙ్. ప్ర.పు ఏ.

శ్లో. స ముహూర్తం క్షమస్వేతి ద్విజ మాభాష్యాస్య దుఃఖితమ్,
యానం సస్మార కౌబేరం వైవస్వతజిగీషయా. 45

వ్యాఖ్య : సః-రాముడు. దుఃఖితం, ద్విజం-దుఃఖపడుచుండిన విప్రుని, ముహూర్తం-క్షణకాలము, క్షమస్వ-ఓర్చుకొనుము, ఇతి-అని, ఆభాష్యస్య-ఊరడించి వైవస్వతజిగీషయా-యముగూడ జయించుకోరికచేత, కౌబేరం-కుబేరునిదగు, యానం-పుష్పకవిమానమును, సస్మార-స్మరించెను. ఏడ్చుచున్న బ్రాహ్మణుని క్షణకాలము ఓర్చుకొనుమని యోదార్చి రాముడు ఇట్లు చేసిన యమధర్మరాజు నైనను జయించి విప్రునికి మేలుచేయసలసినదే యన్న కోరికచేత నచ్చటికి శీఘ్ర గతిని వెళ్ళుటకై పుష్పకవిమానమును స్మరించెను పుష్పకము అక్కడుపడినప్పుడు

స్మరించినచో వచ్చి సేవించెదనని చెప్పియుండెనుగదా! "క్షమస్వ" క్షమూష్-సహనే ధాతువు ఆత్మనేపది. దానిలోట్. మధ్యమపురుష.ఏ. "సస్మార" స్మృ-చింతాయాం (పరస్మైపది) ధాతువునకు లిట్.ప్ర.పు.ఏ.

శ్లో. ఆత్తశస్త్ర స్తదధ్యాస్య ప్రస్థితః స రఘూద్వహః,
ఉచ్చచార పుర స్తస్య గూఢరూపా సరస్వతీ. 46

వ్యాఖ్య : సః, రఘూద్వహః-అట్లుసిద్ధపడిన రాముఁడు, ఆత్తశస్త్రః-తీసికోఁబడిన ఆయుధముగలవాఁడగుచు, తత్-ఆపుష్పకమును, అధ్యాస్య-ఎక్కి, ప్రస్థితః-బయలుదేరెను. తస్య, పురః-అతనియెదుట, గూఢరూపా, సరస్వతీ-అశరీరవాణి, ఉచ్చచార-పలికెను. రాముఁడు స్మరణమాత్రమున తనవద్దికి వచ్చిన పుష్పకమును సాయుధుఁడై యెక్కి బయలుదేరినవెంటనే ఒకయశరీరవాణి ముందు చెప్పబోవురీతిగా పలికెనని భావము. ఉచ్చచార (ఉత్ + చచార) "ఉత్" అను నుపసర్గతోఁగూడిన చర-గతిభక్షణయోః అను ధాతువునకు లిట్ ప్ర.పు.ఏ.

శ్లో. రాజన్! ప్రజాసు తే కశ్చి దపచారః ప్రవర్తతే,
త మన్విష్య ప్రశమయే ర్భవితాసి తతః కృతీ. 47

వ్యాఖ్య : హేరాజన్-ఓరాజా! తే, ప్రజాసు-నీప్రజలయందు, కశ్చిత్-ఒకానొక, అపచారః-వర్ణధర్మవ్యతిరేకము, ప్రవర్తతే-జరుగుచున్నది. తం-ఆయపచారమును, అన్విష్య-వెదకి, ప్రశమయేః-శమింపజేయుము. తతః-దానివలన, కృతీ-కృతకృత్యుఁడవు, భవితాసి-కాఁగలవు. రాజా! నీప్రజలలో నొక వర్ణధర్మ విరుద్ధమగుపని జరుగుచున్నది, దానిని తొలగించితివేని నీవు కృతకృత్యుఁడవు కాఁగలవని ఆయశరీరవాణి పలికెను. "ప్రవర్తతే" ప్రపూర్వకవృతు-వర్తనే. ధాతువునకు లట్ ప్ర.పు.ఏ. "ప్రశమయేః" ప్రపూర్వకశమ-ఉపశమేధాతువునకు విధిలిఙ్. మధ్య పు.ఏ. "భవితాసి" భూ-సత్తాయాం ధాతువునకు భవిష్యదర్థక మగు లుట్. మధ్య.పు.ఏ.

శ్లో. ఇత్యాప్తవచనాత్ రామో వినేష్యన్ వర్ణవిక్రియామ్,
దిశః పపాత పత్త్రేణ వేగనిష్కంపకేతునా. 48

వ్యాఖ్య : ఇతి-ఈవిధముగా వినఁబడిన, ఆప్తవచనాత్-ఆప్తవాక్యము వలన, రామః-రాముఁడు, వర్ణవిక్రియాం-వర్ణాపచారమును, విసేష్యఁ-తొలగింపగల వాఁడగుచు, వేగనిష్కంపకేతునా—వేగ-గమనవేగముచేత, నిష్కంప-చలింపని, కేతునా-జెండాగల, పత్త్రేణ-వాహనమగు పుష్పకముచేత, విదిశః, పపాత-దిక్కులను జేరెను (పరుగెత్తెననియర్థము). ఆప్తవచనమగు నశరీరవాణిని విన్న రాముఁడు వర్ణధర్మవిరుద్ధకార్యమును దొలగింపఁదలచి, యతివేగముగా వెళ్ళు విమానముద్వారా అన్నిదిక్కులకుఁ బరుగిడెనని భావము. "పపాత" పత్ల-గతౌ ధాతువునకు లిట్ ప్ర.పు ఏ.

శ్లో. అథ ధూమాభితామ్రాక్షం వృక్షశాఖావలంబినమ్,
దదర్శ కంచి దైక్ష్వాక స్తపస్యంత మధోముఖమ్. 49

వ్యాఖ్య : ఐక్ష్వాకః-రాముఁడు, అథ-ఒకదిక్కును జేరినపిమ్మట, ధూమాభితామ్రాక్షం—ధూమ-పొగత్రాగుటచేత, అభితామ్ర-అంతటనెఱ్ఱబారిన, అక్షం-కన్నులుగలవాఁడును, వృక్షశాఖావలంబినం-చెట్టుకొమ్మయందు ప్రేలాడుచున్న వాఁడును, అధోముఖం-నేలవైపున ముఖముగలవాఁడును, తపస్యంతం-తపస్సు చేయుచున్నవాఁడునగు, కంచిత్-ఒకానొక పురుషుని, దదర్శ-చూచెను. అట్లు వెళ్ళినరాముఁడొకచోట ధూమపానముచేత నెఱ్ఱబడిన కన్నులు గలిగి, అధోముఖముగా నొకచెట్టుకొమ్మకు ప్రేలాడుచు తపస్సు నాచరించుచున్న యొక అపరిచిత పురుషుని జూచెను. ఇక్ష్వాకువంశేభవఃఐక్ష్వాకః, అని విగ్రహము. అణ్ ప్రత్యయాంతమైన ఇక్ష్వాకుశబ్దము నందలి "ఉ" కారమునకు లోపముఁ జెప్పుటచేత "ఐక్ష్వాకః" అనియైనది. "దదర్శ" దృశిర్-ప్రేక్షణే ధాతువునకు లిట్ ప్ర.పు.ఏ

శ్లో, పృష్టనామాన్వయో రాజ్ఞా స కిలాచష్ట ధూమపః.
ఆత్మానం శంబుకం నామ శూద్రం సురపదార్థినమ్. 50

వ్యాఖ్య : రాజ్ఞా-రాజుచేత, పృష్టనామాన్వయఃపృష్ట-అడుగఁబడిన, నామ-పేరును, అన్వయఃవంశమును గలవాఁడును, ధూమపఃధూమపాయియు నగు, సఃఆ పురుషుఁడు, ఆత్మానం-తనను, సురపదార్థినం-స్వర్గమునుగోరుచున్న, శంబుకం, నామ-శంబుకుఁడనుపేరుగల, శూద్రం-శూద్రునిగా, అచష్టకిల-చెప్పెను సుమా! రాముఁడు నీపేరేమి? నీవంశమేది? ఎందులకీ తపస్సును జేయుచున్నావు?

వ్యాఖ్య : కుంభయోనిః-అగస్త్యుఁడు, పీతేన-తనచే పానముచేయఁబడిన, సముద్రేణ-సముద్రునిచేత, ఆత్మనిష్క్రీయం, ఇవ–తనను విడుచుటకై యర్పించిన వెలనువలె, దత్తం-ఇయ్యబడిన, దివ్యపరిగ్రహం-దివ్యపురుషులచేత స్వీకరింపఁదగినది యగు, అలంకారం-భూషణమును (రత్నకంకణమును), తస్మై-అట్లు కలిసికొన్న ఆ మునికి దదౌ-ఇచ్చెను. అగస్త్యుఁడు, సముద్రముచే దాగిన కాలకేయులు బయల్పడుటకై దేవతల ప్రార్థనపై సముద్రమును పానముఁజేసెను. ఆ సమయమునఁ దనను విడుచుటకు వెలగా సముద్రుఁడిచ్చిన రత్నభూషణమును రామునికి బహుమానముగా నగస్త్యుఁడిచ్చెననియు, శంబూకవధ ధర్మకార్యమేయని దేవర్షియగు నగస్త్యుఁ డభినందించె ననియుఁ దాత్పర్యము. "దదౌ" దాఞ్-దానే-లిట్.

శ్లో. తం దధ మైథిలీకంఠ నిర్వ్యాపారేణ బాహునా,
పశ్చా న్నివవృతే రామః ప్రా క్ప్రా స్థా ర్ద్విజాత్మజః. 56

వ్యాఖ్య : మైథిలీకంఠ నిర్వ్యాపారేణ-సీతాకంఠాలింగనములేని, బాహునా-బాహువుచేత, తం-అగస్త్యుఁడిచ్చిన యాభరణమును, దధన్-ధరించుచు, రామః–రాముఁడు;పశ్చాత్-తరువాత,నివవృతే-తిరిగివెళ్ళెను. పరాసుఃమృత్యుడైన, ద్విజాత్మజః-బ్రాహ్మణకుమారుఁడు, ప్రాక్-రాముఁడు వచ్చుటకు ముందే, నివవృతే-తిరిగి వచ్చెను (బ్రతికెను). అగస్త్యుఁడిచ్చిన భూషణమును సీతావియోగముగల రాముఁడు ధరింపక చేతితో పట్టుకొని అయోధ్యకుఁ దిరిగి వచ్చెననియు, రాముఁడు వచ్చుటకు ముందే విప్రకుమారుఁడు బతికియుండె ననియు భావము. నివవృతే (ని+వవృతే) "ని" ఉపసర్గతోఁజేరిన వృతు-వర్తనే ధాతవు లిట్ ప్ర.పు.ఏ.

శ్లో. తస్య పూర్వోదితాం నిందాం ద్విజః పుత్రసమాగతః,
స్తుత్యా నివర్తయామాస త్రాతు ర్వైవస్వతా దపి. 57

వ్యాఖ్య : పుత్రసమాగతః-పుత్రునితోఁగలసికొన్న, ద్విజఃబ్రాహ్మణుఁడు, వైవస్వతాత్, అపి-యముని వద్దినుండికూడ, త్రాతుఃతెచ్చి రక్షింపఁగల్గిన, తస్యరామునియొక్క, పూర్వోదితాం-తనచే మొదట పలుకఁబడిన, నిందాం-దూషణమును, స్తుత్యా-అప్పుడు చేసిన స్తోత్రముచేత; నివర్తయామాస-తొలఁగించెను. బ్రతికిన కొడుకును జూచుకొన్న విప్రుఁడు మొదట తాను ఎరుఁగకచేసిన రామ

నిందను మరల ననేకవిధములుగా స్తోత్రముఁజేయుచుఁ దొలఁగించెను. తన ధర్మ పాలనమున యముఁడుసైతము విఘ్నమును జేయుఁజాలఁడని రాముఁడు నిరూపించె నని ద్విజుఁడు మెచ్చుకొనెనను భావము. "నివర్తయామాస" నిపూర్వక వృతు-వర్తనే ధాతువునకు "ణిచ్" (ప్రేరణమున) లిట్. ప్ర.పు.ఏ.

శ్లో. త మధ్వరాయ ముక్తాశ్వం రక్షఃకపినరేశ్వరాః,
మేఘాఃసస్య మివాంభోభి రభ్యవర్ష న్నుపాయనైఃః. 58

వ్యాఖ్య : అధ్వరాయ-యాగముకొరకు, ముక్తాశ్వం-విడువఁబడిన గుఱ్ఱము గల, తం-ఆరాముని, రక్షఃకపినరేశ్వరాఃవిభీషణ, సుగ్రీవ ప్రభృతులును, దేశము నందలిరాజులును, మేఘాఃమేఘములు, అంభోభిఃజలములచేత, సస్యం, ఇవ-పైరుసువలె, ఉపాయనైఃకానుకలచేత, అభ్యవర్షన్-వర్షించిరి. రాముఁడు తన రాజ్యపాలనకాలమున అశ్వమేధయాగముఁ జేయఁదలపెట్టి యశ్వమును విడువగానే విభీషణాదులగు రాక్షసరాజులు, సుగ్రీవాదులగు వానరపతులు, వివిధప్రాంతముల యందలి నరపాలురును, మేఘములు సస్యములపై వర్షమును గురిసినట్లు, వివిధము లగు ఉపాయనములు తెచ్చి రాముని ముందు ప్రకుమ్మరించిరి. రామాశ్వమేధప్రయ త్నము లోకమున కానందదాయకముగా నుండెనని భావము. అభ్యవర్షన్ (అభి + అవర్షన్) "అభి" ఉపసర్గతోఁగూడిన వృషు-సేచనే ధాతువు లఙ్. ప్ర. బహు. "ఆవర్షత్, అవర్షతాం, అవర్షꣳ" ఇత్యాదిరూపములుండును.

శ్లో. దిగ్భ్యో నిమంత్రితా శ్చైన మభిజగ్ము ర్మహర్షయః,
న భౌమాన్యేవ ధిష్ణ్యాని హిత్వా జ్యోతిర్మయాన్యపి. 59

వ్యాఖ్య : నిమంత్రితాఃఆహూతులగు, మహర్షయఃచ-మహర్షులందఱు, భౌమాని-భూమిపైనుండినవగు, ధిష్ణ్యాని, ఏవ-నివాసములనే, న-కాదు, జ్యోతిర్మ యాని, అపి-నక్షత్రరూపస్థానములనుగూడ, హిత్వా-వదలి, దిగ్భ్యఃఅన్నిదిక్కు-ల నుండి, ఏనం-రాముని, అభిజగ్ముఃచేరిరి. భూ నక్షత్ర లోకములందున్న మహర్షు లందఱును యజ్ఞమున కాహ్వానింపఁబడి, తమ తమ నివాసములను వదలి, యన్ని దిక్కులనుండియు వచ్చి రామునిఁజేరిరి. "ధిష్ణ్యం స్థానే గృహే భేఽగ్నౌ" అని యమరము. "అభిజగ్ముఃꣳ" (అభి + జగ్ముఃꣳ) గమ్లృ-గతౌధాతువునకు లిట్ ప్ర. పు. బహు.

శ్లో. ఉపశల్యనివిష్టైస్తై శ్చతుర్ద్వారముఖీ బభౌ,
అయోధ్యా సృష్టలోకేవ సద్యఃపైతామహీ తనుః. 60

వ్యాఖ్య : చతుర్ద్వారముఖీ-నాలుగుద్వారములే ముఖములుగానున్న, అయోధ్యా-అయోధ్యానగరము, ఉపశల్యనివిష్టైఃఉపశల్య-పొలిమేర ప్రాంతముల యందు, నివిష్టైఃకూర్చొనియున్న, తైఃఆమహర్షులచేత, సద్యఃఅప్పుడే, సృష్ట లోకా-సృజింపఁబడినజనులుగల, పైతామహీ, తనుఃఇవ-బ్రహ్మకుసంబంధించిన మూర్తివలె, బభౌ-ప్రకాశించెను. నాలుగు ద్వారములుగా అలంకరింపఁబడిన అయోధ్య పొలిమేరలయందు నివసింపఁజేయఁబడిన మునిజనుల వేదపఠనాదులచేత అప్పుడే సృష్టినిజేయుచున్న బ్రహ్మదేవునిమూర్తివలె ప్రకాశించెను. నాలుగుద్వారము లలో వేదోచ్చారణము, అసంఖ్యాకజనోల్బణము, బ్రహ్మయొక్క సద్యఃసృష్టిని దల పించుచుండెనని భావము. "బభౌ" భా-దీప్తౌ" ధాతువునకు లిట్ ప్ర. పు. ఏ. "బభౌ, బభతుఃబభుఃఇత్యాది.

శ్లో. శ్లాఘ్య స్త్యాగోఽపి వైదేహ్యాఃపత్యుఃప్రాగ్వంశవాసినః,
అనన్యజానేఃపైవాసీ ద్యస్మా జ్జాయా హిరణ్మయీ. 61

వ్యాఖ్య : వైదేహ్యాఃసీతయొక్క, త్యాగఃఅపి-త్యాగముగూడ, శ్లాఘ్యఃమెచ్చుకొనఁదగినట్టిది. (కుతఃఎందుకనగా) యస్మాత్-ఏకారణమువఁన, ప్రాగ్వం శవాసినఃప్రాచీనస్థూణ మనుపేరుగల యజ్ఞశాలయందున్నవాఁడును, అనన్యజానేఃమరియొకభార్యలేనట్టి, పత్యుఃప్రభువగు రామునికి, హిరణ్మయీసువర్ణముతో నిర్మితయైన, సా, ఏవ, జాయా-ఆ సీతయే భార్య, ఆసీత్-అయ్యెనో సీతాపరి త్యాగముగూడ మెచ్చఁదగినదే. కారణమేమనగా యజ్ఞశాలయందు మరియొకభార్య లేనందున సువర్ణముతో సీతామూర్తిని నిర్మించి యామెనే భార్యనుగా స్వీకరించెను గనుక. అనఁగా రామునికి సీతపై అనన్య సామాన్యమగు ప్రేమ యుండుటచేతనే మరియొకజాయను చేపట్టక, సీతనే బంగారుబొమ్మనుగా నిర్మింపఁజేసి, "ధర్మేచ, అర్థేచ నాతిచరామి" యని పెండ్లికాలమునఁజేసిన ప్రతిజ్ఞను పాలించి, యజ్ఞఫలభాగి నినిగా సహధర్మచారిణినే తన ప్రక్కన నుంచుకొనుట కంటే రాముఁడు సీతపైఁ జూపవలసిన ప్రేమగాని, సీత కింతకంటే కోరవలసిన భాగ్యముగాని యేమున్నది? కనుక సీతాపరిత్యాగముసైతము ఒకవిధముగా మెచ్చఁదగినదే యని కాళిదాసు హృదయము.

శ్లో. విధే రధికసంభార స్తతః ప్రవవృతే మఖః,
ఆసన్ యత్ర క్రియావిఘ్నా రాక్షసా ఏవ రక్షిణః. 62

వ్యాఖ్య : **తతః**-అట్లు స్వర్ణసీతాదులతో సిద్ధపరుపఁబడిన పిమ్మట, **విధేః**-శాస్త్రనియమముకంటే, **అధికసంభారః**-మించిన పరికరములుగల, **మఖః**-యజ్ఞము, **ప్రవవృతే**-ప్రారంభమయ్యెను. **యత్ర**-ఏయజ్ఞమునందు, **క్రియావిఘ్నాః**-అనుష్ఠానవిఘాతకులైన, **రాక్షసాః,ఏవ**-రాక్షసులే, **రక్షిణః**-రక్షకులు, **ఆసన్**-అయియుండిరో, సర్వత్ర యజ్ఞములను ధ్వంసముఁజేయువారు రాక్షసులేయైనను, **ఈ** రామాశ్వమేధమునందు విభీషణాది రాక్షసులే రక్షకులైయున్నందున, శాస్త్రముదప్పిన దానికంటె నధికమగు సంభారము గూర్పఁబడిన యజ్ఞము ప్రారంభమయ్యెనని భావము. "ప్రవవృతే" ప్రపూర్వక వృత-వర్తనే. లిట్.

శ్లో. అథ ప్రాచేతసోపజ్ఞం రామాయణ మిత స్తతః,
మైథిలేయౌ కుశలవౌ జగతు ర్గురుచోదితౌ. 63

వ్యాఖ్య : అథ-అట్లుయజ్ఞము మొదలయిన పిమ్మట, **మైథిలేయౌ**-సీతాకుమారులగు, **కుశలవౌ**-కుశలవులు, **గురుచోదితౌ(సంతౌ)**-గురువగు వాల్మీకిచేత ప్రేరేపింపఁబడినవారగుచు, **ప్రాచేతసోపజ్ఞం**-వాల్మీకిచేత మొదటిసారిగా రచింపఁబడిన, **రామాయణం**-రామాయణమను కావ్యమును, **ఇత స్తతః**-ఇచ్చటను అచ్చటను, **జగతుః**-గానముచేసిరి. రాముఁడశ్వమేధమును జేయుకాలమున కుశలవులు గురువైన వాల్మీకిచేత ప్రోత్సహింపఁబడినవారై వాల్మీకి క్రొత్తగా రచించిన రామాయణ కావ్యమును అయోధ్యానగరమునందు అచ్చటచ్చట గానముచేసిరి. "ప్రచేతసః పుత్రః ప్రాచేతసః" అని విగ్రహము. వాల్మీకికి "ఋషిఁ" డని జన్మనామము. "మైత్రావరుణి" అని వంశనామము. "వాల్మీకి" బిరుదనామము ఇతఁడు భృగువంశమువాఁడు. "ఉపజ్ఞ" యనఁగా ప్రథమునఁదెలిసికొనుట. "ఉపజ్ఞా జ్ఞానమాద్యంస్యాత్" అని యమరము. "ఆయ్యతే జ్ఞాయతే అనేన ఇత్యయనం చరితం, రామస్య అయనం రామాయణం (రామచరితం) అని విగ్రహము. "జగతుః" గై-శబ్దేధాతువునకు లిట్ ప్ర. పు. ద్వివచనము. జగౌ, జగతుః, జగుః ఇత్యాది.

శ్లో. వృత్తం రామస్య వాల్మీకేః కృతి స్తౌ కిన్నరస్వనౌ,
కిం త ద్యేన మనో హర్తు మలం స్యాతాం న శృణ్వతామ్ 64

వ్యాఖ్య : రామస్య, వృత్తం-కావ్యవస్తువు రామచరితము; వాల్మీకేః,కృతిః-రచన వాల్మీకికావ్యము, తౌ-ఆ కుశలవులు, కిన్నరస్వనౌ-కిన్నరకంఠులగు గాయకులు, (పునః-మరి) తత్, కిం-అది యేమున్నది? యేన-ఏ కారణముచేత, తౌ-ఆ కుశలవులు, శృణ్వతాం-వినుచున్నవారియొక్క, మనః-మనస్సును,హర్తుం-ఆకర్షించుటకు, అలం-సమర్థులు, న, స్యాతాం-కాకపోవుదు రనుటకు. కావ్యవస్తువు లోకోత్తర గుణోత్తరుఁడగు రాముని చరితము; గేయమగు కావ్యమా ఆదికవి వాల్మీకి కృతి; గాయకులగు కుశలవులా? కింనరకంఠస్వరముగలవారు; ఇంక నేకారణమున వారి రామాయణగానము శ్రోతలచిత్తమును రంజింపఁజాలకపోయెనని చెప్పఁగలము? సత్యము సరసమే, అందఱును ఆ రామాయణగానమును ఆసక్తులై వినుచుండిరని భావము. "స్యాతాం" అస-భువి ధాతువునకు విధి లిఙ్. ప్ర.పు ద్వి. స్యాత్, స్యాతాం, స్యుః. ఇత్యాదిరూపము లుండును.

శ్లో. రూపే గీతే చ మాధుర్యం తయోస్తజ్ఞై ర్నివేదితమ్,
దదర్శ సానుజో రామః శుశ్రావచ కుతూహలీ 65

వాఖ్య : తజ్ఞైః-అభిజ్ఞులగువారిచేత, నివేదితం-తెలుపఁబడిన, తయోః-ఆ కుశలవులయొక్క, రూపే-ఆకారమునందును, గీతేచ-గానమునందును గల, మాధుర్యం-రామణీయకమును, సానుజః-తమ్ములతోఁ గూడిన రామః-రాముఁడు, కుతూహలీ-ఆనందముగలవాఁడగుచు. దదర్శ-చూచెను, శుశ్రావచ-వినెనుగూడ. కుశలవుల రూపమునందు, గానమునందుఁగల మాధుర్యము నెఱిఁగినవారు చెప్పఁగా రాముఁడు సానుజుఁడై వెళ్ళి చూచి, విని యానందించెను. "దదర్శ" దృశిర్-ప్రేక్షణే, "శుశ్రావ" శ్రు-శ్రవణె ధాతువులకు లిట్ రూపములు.

శ్లో. తద్గీతశ్రవణైకాగ్రా సంసదశ్రుముఖీ బభౌ,
హిమనిష్యందినీ ప్రాతర్నిర్వాతేవ వనస్థలీ. 66

వ్యాఖ్య : తద్గీత శ్రవణైకాగ్రా-తత్-ఆకుశలవులయొక్క, గీతశ్రవణ-గానమును వినుటయందు, ఏకాగ్రా-నిశ్చలచిత్తముగలదియు, అశ్రుముఖీ-ఆనంద బాష్పములుగల ముఖముగలదియు నగు, సంసత్-సభ, ప్రాతః- ప్రాతఃకాలమున, హిమనిష్యందినీ-మంచునురాల్చునదియై, నిర్వాతా-గాలిలేనిదియైయున్న, వనస్థలీ,

ఇవ-వనభూమివలె, బభౌ-ప్రకాశించెను. సానుజుడగు రామునితో గూడియున్న సభయంతయు నేకాగ్ర చిత్తమున వారిగానమునువినుచు, ఆనందాశ్రువులురాల్చుచు ప్రాతఃకాలమునందు నిష్కంపముగా హిమబిందువులు రాల్చు వనస్థలివలె శోభించె నని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. వయోవేషవిసంవాది రామస్య చ తయోస్తదా,
జనతా ప్రేక్ష్య సాదృశ్యం నాక్షికంపం వ్యతిష్ఠత. 67

వ్యాఖ్య : జనతా-జనసమూహము, వయోవేషవిసంవాది—వయః-వయస్సు చేత, వేష-వస్త్రధారణముచేత మాత్రమే, విసంవాది-విలక్షణమగు (వేరుగానుండిన), తదా-అప్పటి, తయోః-ఆకుశలవుల యొక్కయు, రామస్యచ-రామునియొక్కయు, సాదృశ్యం-పోలికను, ప్రేక్ష్య-చూచి, నాక్షికంపం-కన్నులు గదలింపక, వ్యతిష్ఠత-నిలిచియుండెను వయస్సునందు వస్త్రధారణమునందు మాత్రమే భేదము గన్పడుచున్న కుశలవులకును రామునికినిగల పోలికనుజూచి యాశ్చర్యపడుచున్న జనము కనులప్పగించి చలనములేక నిలిచియుండెనని భావము. వ్యతిష్ఠత (వి + అతిష్ఠత) సమ్, అవ, ప్ర, వి అను ఉపసర్గలతోజేరినప్పుడు "స్థా" ధాతువు ఆత్మనేపదిగా మారును. ఇది "ష్ఠా-గతినివృత్తౌ" అను (స్థా) ధాతువునకు ఆత్మనేపది లఙ్. ప్ర. ఏ.

శ్లో. ఉభయోర్న తథా లోకః ప్రావీణ్యేన విసిష్మియే,
నృపతేః ప్రీతిదానేషు వీతస్పృహతయా యథా. 68

వ్యాఖ్య : లోకః-జనము, ఉభయోః-కుశలవులయొక్క, ప్రావీణ్యేన-నైపుణ్యముచేత, తథా-ఆవిధముగా, నవిసిష్మియే-ఆశ్చర్యమునుపొందలేదు. యథా-ఏవిధముగానైతే, నృపతేః-రాజగురామునియుక్క, ప్రీతిదానేషు-ప్రేమచేతజేయు బహుమానములయందు, వీతస్పృహతయా - ఆశలేని వారగుటచేత, విసిష్మియే-ఆశ్చర్యమును బొందెనో! మధురగానముచేసిన కుశలవులను ప్రీతితో రాముడు సత్కరింపబోగా వారు మాకెట్టిదానములును అక్కరలేదని నిస్పృహను వెల్లడించిరి. ఆదృశ్యమును జూచుచున్నజనము కుశలవులగాన నైపుణ్యమున కాశ్చర్యపడినదానికంటె ప్రతిఫలాపేక్షలేని వారినైస్పృహ్యమున కెక్కువగా నాశ్చర్యపడిరని భావము. "విసిష్మియే" (వి + సిష్మియే) ష్మిఙ్-ఈషద్ధసనే

(ఆత్మనేపది) ధాతువునకు "వి" అను ఉపసర్గతోగూడి లిట్ ప్ర పు. ఏ. విసిష్మియే, విసిష్మియాతే. విసిష్మియిరే. ఇత్యాది. ఈపద్ధసనమనగా జిఱు నగవు.

శ్లో. గేయే కోను వినేతా వాం కస్య చేయం కృతిః కవేః,
ఇతి రాజ్ఞా స్వయం పృష్టౌ తౌ వాల్మీకి మశంసతామ్. 69

వ్యాఖ్య : గేయే-సంగీతమునందు, కోను (కః, ను)-ఎవ్వాడు, వాం-మీ యిద్దఱికి, వినేతా-శిక్షకుడు? ఇయం. చ-ఇదియు, కస్య కవేః-ఏకవియొక్క, కృతిః-కావ్యము? ఇతి-ఇట్లని, రాజ్ఞా-రాజుచేత, స్వయం, పృష్టౌ-స్వంతముగా అడుగబడిన, తౌ-ఆకుశలవులు, వాల్మీకిని, అశంసతాం-చెప్పిరి. రాముడు స్వయముగా మీకు సంగీతమును నేర్పినదెవరు? మీరు పఠించిన యీ కావ్యమును రచించిన దెవరు? అని యడుగగా కుశలవులు మాకుగానమునేర్పినవాడును, ఈ కావ్యమును రచించినవాడును వాల్మీకియే యని చెపి రి. "స్వయం" అనుపదము రాజైన రాముడు ఇతరులద్వారా ప్రశ్నింపక వారియందుగల ప్రేమగౌరవములవలన స్వంతముగా ప్రశ్నించెనని సూచించుచున్నది. "అశంసతామ్" శంసు-స్తుతౌ ధాతువునకు లఙ్. ప్ర ద్వి. అశంసత్, అశంసతాం, అశంసన్. ఇత్యాది.

శ్లో. అథ సావరజో రామః ప్రాచేతస ముపేయివాన్,
ఊరీకృ తాత్మనో దేహం రాజ్య మస్మై న్యవేదయత్. 70

వ్యాఖ్య : అథ-పిమ్మట, సావరజః-తమ్ములతోగూడిన, రామః-రాముడు, ప్రాచేతసం-వాల్మీకిని, ఉపేయివాన్-చేరినవాడగుచు, ఆత్మనః-తనయొక్క, దేహం-శరీరమును, ఊరీకృత్య-నిలుపుకొన్నవాడై రాజ్యం-సమస్తరాజ్యమును, అస్మై-వాల్మీకికొఅకు, న్యవేదయత్-సమర్పించెను. వాల్మీకిసన్నిధికి సాను జుడై వెళ్ళి రాముడు తనదేహమును తప్ప సర్వరాజ్యమును ఆమహర్షికి అర్పించెనని భావము. న్యవేదయత్ (ని + అవేదయత్) "ని" ఉపసర్గతోగూడిన విద-జ్ఞానేధాతువునకు ప్రేరణార్థకము. లఙ్. ప్ర.పు.ఏ.

శ్లో. స తా నాఖ్యాయ రామాయ మైథిలేయౌ తదాత్మజౌ,
కవిః కారుణికో వవ్రే సీతాయాః సంపరిగ్రహమ్. 71

వ్యాఖ్య : కారుణికః-దయాళువైన, సః కవిః-ఆవాల్మీకి, రామాయ-రామునికొఱకు; తౌ, మైథిలేయౌ-ఆసీతాకుమారులను, తదాత్మజౌ-రామునికుమారులనుగా ఆఖ్యాయ-వివరించిచెప్పి, సీతాయాః-సీతయొక్క, సంపరిగ్రహం-స్వీకారమును, వవ్రే-కోరెను. అట్లు వినయవినమ్రుఁడైయున్న రామునికి ఈకుమారులు నీపుత్రులేయని వివరించిచెప్పి, కరుణాళుఁడైన వాల్మీకి సీతను మఱ్ఱి స్వీకరింపు మని కోరెను. "వవ్రే" వృఙ్-వరణే (ఆత్మనేపది) ధాతువు లిట్ ప్ర.ఏ. "వృణుతే" అనిలట్; వవ్రే, వవ్రాతే, వవ్రిరే. ఇత్యాది లిట్ రూపములుండును.

శ్లో. తాత! శుద్ధా సముఖం నః స్నుషా తే జాతవేదసి,

దౌరాత్మ్యా ద్రక్షస స్తాం తు నాశ్రత్యాః శ్రద్దధుః

ప్రజాః. 72

వ్యాఖ్య : హేతాత-తండ్రీ! తే-నీయొక్క, స్నుషా-కోడలగుసీత, నః-మాయొక్క, సముఖం-కన్నులయెదుట, జాతవేదసి-అగ్నిహోత్రునియందు, శుద్ధా-శుద్ధినిపొందియున్నది. తు-కాని, రక్షసః-రాక్షసునియొక్క, దౌరాత్మ్యాత్-దుర్భావమువలన, అశ్రత్యాః-ఇచ్చటనున్న, ప్రజాః-జనులు, తాం-ఆమెను, నశ్రద్దధుః-విశ్వసింపలేదు. సీతను స్వీకరింపుమని కోరిన వాల్మీకితో, రాముఁడు "తండ్రీ! నీకోడలయిన సీత మాకండ్లయెదుట అగ్నిలో ప్రవేశించి పరిశుద్ధురాలైనది, అగ్నియు నామెపవిత్రతను ధృవపరచెను, మాకు సంపూర్ణవిశ్వాసమున్నది. కాని దురాత్ముఁడగు రావణునివద్ద నుండివచ్చుటచేత నయోధ్యావాసులయన జనులు మా త మామెను నమ్ముటలేదు, నేనేమి చేయఁగలను?" అని బదులుపలికె ననిభావము. "శ్రద్దధుః" లిట్. ప్ర బ.

శ్లో. తాః స్వచారిత్ర ముద్దిశ్య ప్రత్యాయయతు మైథిలీ,

తతః పుత్రపతీ మేనాం ప్రతిపత్స్యే త్వదాజ్ఞయా. 73

వ్యాఖ్య : మైథిలీ-సీత, స్వచారిత్రం-తననడవడిని, ఉద్దిశ్య-ఉద్దేశించి, తాః-ఆ ప్రజలను, ప్రత్యాయయతు-నమ్మించునుగాక, తతః-అట్లుచేసిన పిమ్మట, పుత్రపతీం, ఏనాం-పుత్రవంతురాలైనయీమెను, త్వదాజ్ఞయా-నీయాజ్ఞచేత, ప్రతిపత్స్యే-స్వీకరింపఁగలను మరియు, సీత తన నడవడిచేత తానుదోషరహితయైనట్లు

ప్రజలను నమ్మించినట్లయితే పిమ్మట మీ యాజ్ఞప్రకారము పుత్రవతియగు నీమెను తప్పక స్వీకరింపఁగలనని చెప్పెను. "ప్రత్యాయయతు" ప్రతి + ఆయయతు. ప్రతిపూర్వకమగు "ఆయ-గతౌ" అను ధాతువునకు ప్రేరణార్థమున (ణిజంతము) లోట్ ప్ర.పు.ఏ. "ప్రతిపత్స్యే" ప్రతిపూర్వక "పద-గతౌ" ధాతువునకు (ఆత్మనే పది) ల్యట్ ఉత్తమ పు.ఏ.

శ్లో. ఇతి ప్రతిశ్రుతే రాజ్ఞా జానకీ మాశ్రమా న్మునిః,
శిష్యై రానయయామాస స్వసిద్ధిం నియమై రివ. 74

వ్యాఖ్య : రాజ్ఞా-రామునిచేత, ఇతి-ఇట్లు, ప్రతిశ్రుతే-ప్రతిజ్ఞ చేయఁబడఁగా మునిః-వాల్మీకి, ఆశ్రమాత్-ఆశ్రమమునుండి, జానకీం-సీతను, శిష్యైఃశిష్యులచేత, స్వసిద్ధిం-స్వార్థసిద్ధిని, నియమైఃఇవ-తపోనియమములచేతవలె, ఆనయయామాస-తీసుకరప్పించెను. రాముఁడట్లు ప్రతిజ్ఞ చేయఁగా వాల్మీకి శిష్యులనుబంపి యాశ్రమమునుండి సీతను రప్పించెను. ఆ రప్పించుట వాల్మీకి తపస్సులచేత కార్యసిద్ధిని పొందినట్లుండెనట. అలంకారము: ఉపమ. "ఆనయయామాస" ఆఙ్ పూర్వక నీఞ్-ప్రాపణే ధాతువునకు ణిజంతము. లిట్ ప్ర.పు.ఏ.

శ్లో. అన్యేద్యు ర్ధ కాకుత్స్థః సంనిపాత్య పురౌకసః,
కవి మాహ్వాయయామాస ప్రస్తుతప్రతిపత్తయే. 75

వ్యాఖ్య : అథ-పిమ్మట, కాకుత్స్థఃరాముఁడు, అన్యేద్యుఃమరియొక దినమున, ప్రస్తుత ప్రతిపత్తయే-ప్రస్తుతకార్యాను సంధానము కొఱకు, పురౌకసఃనగరవాసులను, సంనిపాత్య-ఒకచోటఁజేర్చి, కవిం-వాల్మీకిని, ఆహ్వాయయామాస-ఆహ్వానించెను. రాముఁడు తన మాటకు వాల్మీకియు, సీతయు నంగీకరింపఁగా అయోధ్యకుఁ దిరిగి వచ్చిన పిమ్మట ఒకరోజున ప్రస్తుతకార్యమును నిర్వహించుటకై నగరవాసుల నందఱిని నొకచోటఁజేర్చి వాల్మీకి మునిని పిలిపించెను. "ఆహ్వాయయామాస" ఆఙ్ పూర్వక "హ్వేఞ్-స్పర్ధాయాం శబ్దేచ" ఆను ధాతువునకు ప్రేరణార్థకము (ణిజంతము) లిట్. ప్ర.పు.ఏ.

శ్లో. స్వరసంస్కారవత్యాసౌ వుత్రాభ్యా మథ సీతయా,
ఋచే ఽథోదర్చిషం సూర్యం రామం మునిరుపస్థితః. 76

వ్యాఖ్య : అథ-ఆహ్వానమందిన పిమ్మట, స్వరసంస్కారవత్యా-స్వర-ఉదాత్తాది స్వరములును, సంస్కారవత్యా-శబ్దశుద్ధియుఁ గలిగిన, ఋచా-సావిత్రీ ఋక్కుచేత (గాయత్రీ మంత్రము చేత), ఉదర్చిషం, సూర్యం, ఇవ-ఉదయించుచున్న సూర్యునివలె, పుత్రాభ్యాం-ఇద్దఱు కుమారులతోనున్న, సీతయా-సీతాదేవితో, రామం-రాముని, అసౌ-ఆవాల్మీకి, ఉపస్థితః-సేవించెను. సర్వసంస్కార ములుగల గాయత్రీ మంత్రముచేత సూర్యుని ఉపాసించినట్లు పుత్రులతోడి సీతతోఁ గలిసి వాల్మీకి రాముని దర్శించె నని భావము. స్వరసంస్కారములు కుశలవుల కును, సావిత్రీఋక్కు సీతకును, సూర్యుఁడు రామునికిని ఉపమానములై వారి పవిత్రతను, నిత్యసంబంధమును వెల్లడించుచున్నవి. అలంకారము: ఉపమ.

శ్లో. కాషాయపరివీతేన స్వపదార్పితచక్షుషా,

అన్వమీయత శుద్ధేతి శాంతేన వపుషైవ సా. 77

వ్యాఖ్య : కాషాయపరివీతేన-కషాయవర్ణముగల యుత్తరీయము గలదియు, స్వపదార్పితచక్షుషా-తనపాదములందుంచిన చూపు గలదియు, శాంతేన-ప్రసన్న మైన, వపుషా, ఏవ-దేహముచేతనే, సా-ఆ సీత, శుద్ధా-పవిత్రురాలు, ఇతి-అని, అన్వమీయత-ఊహింపఁబడినది. కషాయపురంగు వస్త్రమును గప్పుకొని, తనపాద ములందే చూపు నిలుపుకొని నడచుట, ప్రసన్నమగు దేహముతోనే సీత పరిశుద్ధు రాలేయని చూచుజను లూహించిరని భావము. "అన్వమీయత" అను ఉపసర్గతోఁ గూడిన "మాఙ్-మానే" ధాతువునకు కర్మణి లఙ్ ప్రథ.పు.ఏ

శ్లో. జనాస్తదాలోకపథాత్ప్రతిసంహృతచక్షుషః,

తస్థుస్తే ఽవాఙ్ముఖాః సర్వే ఫలితా ఇవ శాలయః. 78

వ్యాఖ్య : తదాలోకపథాత్-ఆ సీతయొక్క దర్శనమార్గమునుండి, ప్రతి సంహృతచక్షుషః-తొలగించుకొన్న చూపులుగలవారై, తే, సర్వేజనాః-ఆజనులందఱు ఫలితాః-పండిన, శాలయః ఇవ-వరిమొక్కలవలె, అవాఙ్ముఖాః-నేలకు వంచిన ముఖములుగలవారై, తస్థుః-నిలుచుండిరి. పండిన వరిమొక్కలవలె తలలువంచి సీతనుజూచు మార్గమునుంచి చూపులు ప్రతిప్పుకొని జనులందఱు నిలుచుండిరనియు, వారట్లుచేయుటకుఁ గారణము సీతను అనుమానించియుండుట పొరపాటనియు భావము. "తస్థుః" ష్ఠా-గతినివృత్తౌ ధాతువునకు లిట్ ప్రథ.పు. బహువచనము.

శ్లో. తాం దృష్టివిషయే భర్తు ర్మని రాస్థితవిష్టరః,
కురు నిఃసంశయం వత్సే! స్వవృత్తే లోక మిత్యాహ్. 79

వ్యాఖ్య : ఆస్థితవిష్టరః-పవిత్రాసనముపై గూర్చున్న, మునిః-వాల్మీకి, హేవత్సే!-ఓఅమ్మాయీ! (సీతా!), భర్తుః-నీభర్తయొక్క, దృష్టివిషయే-సమక్షమున, స్వవృత్తే-నీనడవడివిషయమున, లోకం-జనమును, నిఃసంశయం-అనుమానములేనిదానినిగా, కురు-చేయుము, ఇతి-ఇట్లని, తాం-ఆసీతను-ఆహ్-ఆజ్ఞాపించెను. రాముఁడు అయోధ్యాజనులు గల ఆసభామధ్యమున పవిత్రాసనముపైఁ గూర్చున్న వాల్మీకిముని సీతనుద్దేశించి అమ్మాయీ! నీభర్తయెదుట నీజనులందఱికిని నీనడతయనుఁగల సందేహమును దీర్చు మని శాసించెను. "ఆహ్" శాసు-అనుశిష్టౌ ధాతువునకు భూతార్థక లఙ్. ప్ర.పు.ఏ.

శ్లో. అథ వాల్మీకి శిష్యేణ పుణ్య మావర్జితం పయః,
ఆచ మ్యోదీరయామాస సీతా సత్యాం సరస్వతీమ్. 80

వ్యాఖ్య : అథ-అట్లు వాల్మీకి యాజ్ఞాపించిన పిమ్మట, వాల్మీకి శిష్యేణ-వాల్మీకియొక్క శిష్యునిచేత, ఆవర్జితం-చేతియందు వంచఁబడిన, పుణ్యం, పయఃపవిత్రమగు జలమును, ఆచమ్య-ఆచమనముచేసి, సీతా-సీతాదేవి, సత్యాం-నిజమైన, సరస్వతీం-వాక్కును, ఉదీరయామాస-పలికెను. వాల్మీకి శాసనమును పాటించినసీత మునిశిష్యుఁడు తన చేతిలో పోసిన పవిత్రజలముతో నాచమనము చేసి ముందు చెప్పఁబోవురీతిగా తన విషయమును దెలుపు సత్యవచనమును బలికెనని భావము. "ఉదీరయామాస" (ఉత్ + ఈరయామాస) ఉత్ ఉపసర్గతోఁగూడిన ఈర-గతౌ, క్షేపేచ అను ధాతువునకు లిట్. ప్ర.పు.ఏ. (స్వార్థణిజంతము).

శ్లో. వాఙ్మనః కర్మభిః పత్యౌ వ్యభిచారో యథా న మే,
తథా విశ్వంభరే దేవి! మా మంతర్ధాతు మర్హసి. 81

వ్యాఖ్య : వాఙ్మనః కర్మభిః-వాక్కుచేతగాని, మనస్సుచేతగాని, క్రియచేతగాని, పత్యౌ-భర్తవిషయమున, మే-నాకు, వ్యభిచారః-స్థాలిత్యము, నయథా-లేకయున్నచో, తథా-అట్లయినయెడల, హేవిశ్వంభరే, దేవి-ఓభూదేవీ! మాం-నన్ను, అంతర్ధాతుం-నీగర్భమునందుంచుకొనుటకు, అర్హసి-తగుదువు. ఓ భూదేవీ! నేను

భర్తవిషయమున వాఙ్మనఃకర్మలచేత అతిక్రమణము లేనిదాననేని నన్ను నీలో జేర్చుకొనుము" అని సీత పలికె నని భావము. "అర్హసి" అర్హ-పూజాయాం అను ధాతువునకు లట్. మ.పు.ఏ.

శ్లో. ఏవ ముక్తే తయా సాధ్వ్యా రంధ్రా త్సద్యోభవా ద్భువః,
శాతహ్రద మివ జ్యోతిః ప్రభామండల ముద్యయౌ. 82

వ్యాఖ్య : సాధ్వ్యా-పతివ్రతయగు, తయా-సీతాదేవిచేత, ఏవం-ఇట్లు, ఉక్తే-పలుకబడగా, సద్యోభవాత్-అప్పుడే కలిగిన, భువః, రంధ్రాత్-భూమి యొక్క రంధ్రమునుండి, శాతహ్రదం-మెఱుపునకు సంబంధించిన, జ్యోతిః, ఇవ-తేజస్సువలె, ప్రభామండలం-కాంతిమండలము, ఉద్యయౌ-పైకిలేచెను. అట్లు పతివ్రతయగు సీత పలుకగానే అప్పుడే యేర్పడిన భూరంధ్రమునుండి మెఱుపువంటి యొక మండలాకారముగల కాంతిపుంజము పైకి వచ్చెనని భావము. "శతహ్రదాయాఃఇదం శాతహ్రదం" అనివిగ్రహము "శంపా శతహ్రదా" ఆని యమరము. "ఉద్యయౌ" (ఉత్ + యయౌ) ఉత్పూర్వక యా-ప్రాపణే ధాతువునకు లిట్. ప్రపు.ఏ. ప్రాపణమనగా గమనమని యర్థము.

శ్లో. తత్ర నాగఫణోత్క్షిప్త సింహాసన నిషేదుషీ,
సముద్రరశనా సాక్షా త్ప్రాదురాసీత్ వసుంధరా. 83

వ్యాఖ్య : తత్ర-ఆప్రభామండలమునందు, నాగఫణోత్క్షిప్త సింహాసన నిషేదుషీ-నాగఫణా-ఆదిశేషుని ఫణములచేత, ఉత్క్షిప్త-పైకియెత్తబడిన, సింహాసన-సింహాసనమునందు, నిషేదుషీ-కూర్చునియున్నదియు, సముద్రరశనా-సాగరములు మొలనూలుగా గలదియునగు, సాక్షాత్ వసుంధరా-భూదేవియే, ప్రాదురాసీత్-ఆవిర్భవించెను. అట్లు భూరంధ్రమునుండి పైకివచ్చిన కాంతివలయమునందు ఆదిశేషుడు తన ఫణములయందు నిల్పుకొన్న సింహాసనపై గూర్చున్న సాక్షాత్ భూదేవి ఆవిర్భవించి యందఱికిని దర్శనమిచ్చె నని భావము. "ప్రాదురాసీత్." ప్రాదుఃఅనునవ్యయముతో గూడిన అస-భువి అను ధాతువునకు లఙ్ ప్ర.పు.ఏ.

శ్లో. సా సీతా మంక మారోప్య భర్తృప్రణిహితేక్షణాం,
మా మేతి వ్యాహరత్యేవ తస్మిన్ పాతాల మభ్యగాత్. 84

వ్యాఖ్య : సా-అట్లు ప్రత్యక్షమైన భూదేవి, భర్తృప్రణిహితేక్షణాం-భర్త యందుంచబడిన చూపులుగల, సీతాం-సీతను, అంకం, ఆరోప్య-తొడపై నెక్కించుకొని, తస్మిన్-రాముడు, "మామా" ఇతివ్యాహరతి, (సతి) ఏవ-వద్దు వద్దు అని పలుకుచున్నవాడైనప్పటికిని, పాతాలం-పాతాళలోకమును, అభ్యగాత్-చేరెను. అట్లు ఆవిర్భవించిన భూదేవి, భర్తపై నుంచిన చూపులుగల సీతను తన తొడపై నెక్కించుకొని, రాముడు "వద్దు వద్దు" అని మొరపెట్టుచున్నప్పటికిని, ఆతని మాటలను లెక్కచేయక పాతాళలోకమునకు వెళ్ళిపోయెనని భావము. "అభ్యగాత్" (అభి + అగాత్) అభి పూర్వకమగు ఇణ్ ధాతువునకు లుఙ్.

శ్లో. ధరాయాం తస్య సంరంభం సీతాప్రత్యర్పణైషిణః,
గురు ర్విధిబలాపేక్షీ శమయామాస ధన్వినః. 85

వ్యాఖ్య : సీతాప్రత్యర్పణైషిణః-సీతను తనకు మరల నియ్యవలెనని కోరుచున్నట్టివాడును, ధన్వినః-స్వీకరింపబడిన ధనుస్సుగలవాడును నగు, తస్య-ఆరాముని యొక్క, ధరాయాం, సంరంభం-భూదేవి విషయము నందలి యుద్రేకమును, విధిబలాపేక్షీ-దైవశక్తిని గుర్తించిన, గురుః-వాల్మీకి, శమయామాస-శాంతింపజేసెను. భూదేవి సీతను దీసికొనిపోవగా రామునికి గోపము వచ్చి తనసీతను తనకు మరల నర్పించుమని ధనుస్సునెక్కుపెట్టి బాణమును భూదేవిపై నేయుటకు సిద్ధపడగా వాల్మీకి విధివిలాసము అపరిహార్యమనియు, అది యట్లే జరుగవలసి యున్నదనియు జెప్పి రాముని శాంతింపజేసెనని భావము. "శమయామాస" శము-ఉపశమే ధాతువునకు ప్రేరణార్థకము (ణిజంతము). లిట్ ప్ర.పు.ఏ.

శ్లో. ఋషీ విసృజ్య యజ్ఞాంతే సుహృదశ్చ పురస్కృతాన్,
రామః సీతాగమం స్నేహం నిదధే తదపత్యయోః 86

వ్యాఖ్య : రామః-రాముడు, యజ్ఞాంతే-అశ్వమేధయాగము ముగింపునందు, పురస్కృతాన్-సత్కరింపబడిన, ఋషీన్-యజ్ఞక్రియను నిర్వహించిన మునులను, సుహృదః, చ-యజ్ఞదర్శనార్థమై వచ్చిన మిత్రులను, విసృజ్య-పంపివేసి, సీతాగమం-సీతయందుండిన, స్నేహం-తనప్రేమను, తదపత్యయోః-ఆమె కుమారులయందు, నిదధే-ఉంచుకొనెను. యజ్ఞమున కాహ్వానింపబడిన ఋత్విజులను,

బంధుమిత్రాదులను సత్కరించిపంపి, తనకు సీతయందుండిన ప్రేమకు కుమారులగు కుశలవులయందు వాత్సల్యమునుగా మార్చుకొని యానందమును బొందుచు రాజ్యము నేలెనని భావము. "నిదధే" "ని" ఉపసర్గతో గూడిన (డు) ధాఞ్-ధారణపోషణయోః (ఆత్మనేపది) ధాతువునకు లిట్. ప్ర.పు.ఏ. క్రియాఫలము కర్తను జెందుచున్నది గావున ఆత్మనేపదిగా ధాతువును ప్రయోగించెను.

శ్లో. యుధాజిత శ్చ సందేశాత్ స దేశం సింధునామకమ్,
దదౌ దత్తప్రభావాయ భరతాయ భృతప్రజః. 87

వ్యాఖ్య : భృతప్రజః-భరింపబడిన ప్రజలుగల, సః-రాముడు, యుధాజితః-భరతునిమేనమామయగు యుధాజిత్తుయొక్క, సందేశాత్-సందేశమువలన, సింధునామకం-"సింధు" అనుపేరుగల, దేశం-దేశమును, దత్తప్రభావాయ-రాజ్యపాలనమునకువలసిన యైశ్వర్యమీయబడిన, భరతాయ-భరతునికొఱకు, దదౌ-ఇచ్చెను. భరతుని మేనమామ యగుయుధాజిత్తు "భరతు"నికి ప్రత్యేక రాజ్యపాలనమునకు గొంతదేశము నిమ్ము" అని రామునికి సందేశమును బంపగా రాముడు రాజ్యపాలనమున కవసరమగు వస్తువాహనాద్యైశ్వర్యముతో సింధుదేశమును భరతునికిచ్చెను. "దదౌ" దాఞ్-దానే ధాతువునకు లిట్. ప్ర.పు.ఏ. క్రైక యిష్టసిద్ధి కిది సూచకము.

శ్లో. భరత స్తత్ర గంధర్వాం యుధి నిర్జిత్య కేవలమ్,
ఆతోద్యం గ్రాహయామాస సమత్యాజయ దాయుధమ్. 88

వ్యాఖ్య : తత్-ఆసింధుదేశమునందు, భరతః-భరతుడు, యుధి-యుద్ధమునందు, గంధర్వాన్-గంధర్వులను, నిర్జిత్య-ఓడించి, కేవలం-ఒక,, ఆతోద్యం-వీణాదికమును, గ్రాహయామాస-పట్టుకొనునట్లుచేసెను (పట్టించెను). ఆయుధం-ఆయుధమును, సమత్యాజయత్-విడుచునట్లుచేసెను (విడిపించెను). భరతుడు సపరివారముగా సింధుదేశమునకు వెళ్ళి, యచ్చట నివసించుచున్న గంధర్వజాతివారు ఎదురొక్కనగా, యుద్ధమునందు వారినోడించి, శాంతిని నెలకొల్పి వారికిష్టమైన గాంధర్వకలా "ప్రావీణ్యమునకు వీణలు" పట్టుకొనునట్లును, యుద్ధములకై ఆయుధములు పట్టకుండునట్లును చేసెను. ఆనాడు సింధుదేశవాసులు గంధర్వులైయుండి రని భావము. "గ్రాహయామాస" గ్రహ-ఉపాదానే ధాతువునకు

ప్రేరణార్థకము (ణిజంతము) లిట్. ప్ర.పు.ఏ. సమత్యాజయత్ (సమ్ + అత్యాజయత్) 'సమ్' అను ఉపసర్గతోఁగూడిన "త్యజ-హానౌ" ధాతువునకు ప్రేరణార్థకము (ణిజంతము) భూతార్థక లఙ్. ప్ర.పు ఏ.

శ్లో. స తక్షపుష్కలౌ పుత్రౌ రాజధానోర్య స్తదాఖ్యయోః,
అభిషి చ్యాభిషేకార్హౌ రామాంతిక మగా త్పునఃి. 89

వ్యాఖ్య : సఃి-భరతుఁడు, అభిషేకార్హౌ - రాజ్యాభిషేకమునకుఁదగిన వయస్సు వచ్చిన, తక్షపుష్కలౌ-తక్షుఁడు, పుష్కలుఁడు అనుపేర్లుగల, పుత్రౌ-ఇద్దఱుకుమారులను, తదాఖ్యయోఃి-వారిపేర్లేయున్న, (తక్షశిల, పుష్కలావతి అనఁబడు), రాజధానోర్యఃి-నగరములయందు, అభిషిచ్య-పట్టాభిషేకముచేసి నిలిపి, పునఃి-మరల, రామాంతికం-రాముని సమీపమును, అగాత్-చేరెను. సింధుదేశమున గంధర్వులను జయించి కొంతకాలముండి, తన కొడుకులు పెద్దవారైన పిమ్మట ముఖ్యపట్టణములగు తక్షశిలా పుష్కలావతుల యందు, వరుసగా తన కుమారులగు తక్షుని, పుష్కలుని రాజ్యాధినేతలనుగా నభిషేకించి, రామభక్తిధురంధరుఁడగు భరతుఁడు తిరిగి అయోధ్యకు వచ్చి రాముని సేవించెనని భావము. "అగాత్" పూర్వముపచ్చిన క్రియ.

శ్లో. అంగదం చంద్రకేతుం చ లక్ష్మణో ఽప్యాత్మసంభవౌ,
శాసనా ద్రఘునాథస్య చక్రే కారాపథేశ్వరౌ. 90

వ్యాఖ్య : లక్ష్మణఃి, అపి-లక్ష్మణుఁడుసైతము, రఘునాథస్య-రామచంద్రునియొక్క, శాసనాత్-ఆజ్ఞవలన, అంగదం, చంద్రకేతుం, చ-అంగదుఁడు, చంద్రకేతువనియుఁ బేర్లుగల, ఆత్మసంభవౌ-తనకుమారులను, కారాపథేశ్వరా-కారాపథమనుదేశమునకు ప్రభువులనుగా, చక్రే-చేసెను. రాముని యాజ్ఞవలన లక్ష్మణుఁడుగూడ తనకుమారులగు అంగదుని, చంద్రకేతువును, "కారాపథ"మను పేరుగల దేశమునకు ప్రభువులనుగాఁజేసెను. "చక్రే" ఱు, కృఞ్-కరణే (ఆత్మనేపది) ధాతువునకు లిట్. ప్ర.పు.ఏ.

శ్లో. ఇత్యారోపితపుత్రా స్తే జననీనాం జనేశ్వరాఃి,
భర్తృలోకప్రపన్నానాం నివాపాఞ్జ విదధుఃి క్రమాత్. 91

వ్యాఖ్య : ఇతి-పైవిధముగా, ఆరోపితపుత్రాః-రాజ్యసింహాసనములెక్కింపఁబడిన కుమారులుగల, తే, జనేశ్వరాః-ఆరాజులు, భర్తృలోకప్రపన్నానాం-భర్తయున్న స్వర్గలోకమును జేరిన, జననీనాం-తల్లులకు, క్రమాత్-వరుసగా, నివాపాన్-శ్రాద్ధతర్పణాదులను, విదధుః-చేసిరి. అట్లు తమకుమారులను రాజ్యసింహాసనములం దెక్కించిన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు స్వర్గముఁజేరిన కౌసల్యాసుమిత్రాకైకలకు వరుసగా శ్రాద్ధతర్పణా ద్యంతక్రియలను చక్కగా నిర్వర్తించిరి. "విదధుః" వి పూర్వక(డు) ధాఞ్-ధారణపోషణయోః ధాతువునకు లిట్ ప.పు. బహువచనము.

శ్లో. ఉపేత్య మునివేషో ఽథ కాలః ప్రోవాచ రాఘవమ్,
రహఃసంవాదినౌ పశ్యే దావాం యస్తం త్యజే రితి. 92

వ్యాఖ్య : అథ-ఆతరువాతికాలమున, కాలః-యముఁడు, మునివేషఃసన్-మునివేషముగలవాఁడగుచు, ఉపేత్య-వచ్చి, రాఘవం-రామునిగుఱించి, ప్రోవాచ-పలికెను (ఏమనియనఁగా), రహఃసంవాదినౌ-రహస్యముగామాట్లాడుచున్న, ఆవాం-మనయిద్దఱిని, యః-ఎవఁడు, పశ్యేత్-చూచునో, తం-అతనిని, త్యజేః-విడిచిపెట్టుము. ఇతి-ఇట్లని. పుత్రులకు రాజ్యములప్పగించి, తల్లులకు అంత్యక్రియలు చేసి, రామాదులు కొంతకాలమున్న పిమ్మట నొకనాఁడు యముఁడు మునివేషమునవచ్చి "మనరహస్య సంభాషణమును విని యెవ్వఁడు రహస్య భంగము చేయునో వానిని విడువుము" అని రామునితోఁ బలికెనని భావము. "పశ్యేత్" దృశిర్-ప్రేక్షణే ధాతువునకు సంభావనాలిఙ్. ప్ర పు.ఏ. "త్యజేః" త్యజ-హానౌ ధాతువునకు విధిలిఙ్. మధ్య.పు.ఏ.

శ్లో. తథేతి ప్రతిపన్నాయ వివృతాత్మా నృపాయ సః,
ఆచఖ్యౌ దివ మధ్యాస్వ శాసనాత్ పరమేష్ఠినః. 93

వ్యాఖ్య : సః-ఆయముఁడు, తథేతి (తథా, ఇతి)-అట్లేయని, ప్రతిపన్నాయ-అంగీకరించినట్టి, నృపాయ-రామునికొఱకు, వివృతాత్మా-ప్రకాశింపఁబడిన నిజస్వరూపము గలవాఁడగుచు, పరమేష్ఠినః-బ్రహ్మయొక్క, శాసనాత్-ఆజ్ఞవలన, దివం, అధ్యాస్వ-స్వర్గమునందు నిలువుము. ఇతి-అని, ఆచఖ్యౌ-చెప్పెను. అంతకుఁడుచెప్పిన నియమమును సరేయని యొప్పుకొన్న రామునికి తన నిజస్వ

రూపమునుజూపి, బ్రహ్మ నిన్ను స్వర్గమును జేరుమని యాజ్ఞాపించియున్నాఁడు. కనుక అట్లుచేయుమని చెప్పెను. "దివమధ్యాస్వ" అధిపూర్వకమైన "ఆస" ధాతువుతోఁజేరుటవలన "దివి" అని యుండవలసినది "దివం" అని సప్తమ్యర్థమున ద్వితీయగా వచ్చినది. "ఆచఖ్యౌ" ఆఙ్ పూర్వక ఖ్యా-ప్రకథనే ధాతువునకు లిట్ ప్ర.పు.ఏ. "అధ్యాస్వ (అధి + ఆస్వ) అధిపూర్వక ఆస-ఉపవేశనే (ఆత్మనేపది) లోట్. మ.పు.ఏ.

శ్లో. విద్వానపి తయో ర్ద్వాస్థ్సః సమయం లక్ష్మణో ఽభినత్,
భీతో దుర్వాససః శాపా ద్రామసందర్శనార్థినః. 94

వ్యాఖ్య : ద్వాస్థ్సః-ద్వారమునందున్న, లక్ష్మణః-లక్ష్మణుఁడు, విద్వాన్, అపి-ఆవిషయము నెఱిఁగినవాఁడైనను, రామసందర్శనార్థినః-రాముని దర్శనమును గోరుచున్న, దుర్వాససః-దూర్వాసమునియొక్క, శాపాత్-శాపమువలన, భీతః స-భయపడిన వాఁడగుచు, తయోః-ఆకాలపురుష రాములయొక్క, సమయం-సంవాద ప్రతిజ్ఞను, అభినత్-భంగము చేసెను. యముఁడు రాముఁడును సంభాషించునప్పుడు లోనికెవ్వరిని రానీయవద్దని చెప్పి ద్వారమునందుంచఁబడిన లక్ష్మణుఁడు రామదర్శనమునకై వచ్చిన దూర్వాసుని విషయమును రామునికిఁ దెలుపకపోయినచో శాపము పెట్టునేమో యన్నభయమువలన లోనికి వెళ్ళి అంతకరాముల సంభాషణ నియమమునకు భంగముఁ గలిగించెనని భావము. "అభినత్" భిదిర్-విదారణే ధాతువునకు లఙ్ ప్ర.పు.ఏ.

శ్లో. స గత్వా సరయూతీరం దేహత్యాగేన యోగవిత్,
చకా రావితథాం భ్రాతుః ప్రతిజ్ఞాం పూర్వజన్మనః. 95

వ్యాఖ్య : యోగవిత్-యోగమార్గము నెఱిఁగిన, సః-ఆలక్ష్మణుఁడు, సరయూతీరం-సరయూనదియొడ్డును, గత్వా-చేరి, దేహత్యాగేన-తన శరీరమును విడుచుట చేత, పూర్వజన్మనః-తనకంటే ముందుజన్మించిన (జ్యేష్ఠుఁడైన), భ్రాతుః-అన్న యొక్క, ప్రతిజ్ఞాం-ప్రతిజ్ఞను, అవితథాం-సత్యమైనదానిని, చకార-చేసెను. అట్లు నియమభంగముఁజేసిన లక్ష్మణుఁడు యోగమార్గము ద్వారా సరయూనదీ తీరమున శరీరమును విడిచి, యమరామ సంభాషణమునకు విఘ్నముఁ గలిగించిన వానిని రాముఁడు విడివిపెట్టవలయు నన్న ప్రతిజ్ఞ ఆబద్ధముకానియట్లుచేసె నని భావము.

లక్ష్మణుఁడు ఆదిశేషుని యవతారమై యుండుటచేతను, ఆదిశేషుఁడు పతంజలియవ తారమున యోగసూత్రములను రచించుటచేతను "యోగవిత్" అను విశేషణము మిక్కిలి సమంజసముగా నున్నది.

శ్లో. తస్మి న్నాత్మచతుర్భాగే ప్రాఙ్నాక మధితస్థుషి,
రాఘవః శిథిలం తస్థౌ భువి ధర్మ స్త్రిపాదివ. 96

వ్యాఖ్య : ఆత్మచతుర్భాగే-తనయొక్క నాల్గవభాగమైన, తస్మిన్-ఆలక్ష్మ ణుడు. ప్రాక్-ముందుగానే, నాకం-స్వర్గమును, అధితస్థుషి-చేరినవాఁడుకాగా, రాఘవః-రాముఁడు, భువి-భూలోకమునందు. త్రిపాద్-మూడుపాదములేయున్న, ధర్మఃఇవ-ధర్మమువలె, శిథిలం-శిథిలముగా. తస్థౌ-నిలిచెను. విష్ణువు నాలుగంశ ములుగా రామలక్ష్మణభరతశత్రుఘ్నులుగాఁ బుట్టియుండెనుగదా! అందులో నొక భాగమైన లక్ష్మణుఁడు ముందుగానే స్వర్గమునకువెళ్ళఁగా, నాలుగుకాళ్ళలో నొకటి విరిగిన ధర్మదేవతవలె, రాముఁడు శిథిలభావముతో నిలిచెనని భావము. త్రేతాయుగ మున ధర్మము త్రిపాత్గా నుండునన్నది దీనికిమూలము. "చతుర్థఃభాగః చతు ర్భాగః" అనియు, "త్రయఃపాదాఃయస్యసఃత్రిపాత్" అనియు విగ్రహవాక్య ములు. "తస్థౌ" స్థాధాతువునకు లిట్.

(యుగ్మమ్)

శ్లో. స నివేశ్య కుశావత్యాం రిపునాగాంకుశం కుశమ్,
శరావత్యాం సతాం సూక్తైర్జనితాశ్రులవం లవమ్. 97
ఉదక్ప్రతస్థే స్థిరధీ: సానుజో ఽగ్నిపురస్సరః,
అన్వితః పతివాత్సల్యాత్ గృహవర్జ మయోధ్యయా. 98

వ్యాఖ్య : స్థిరధీఃస్థితప్రజ్ఞుఁడగు, సఃఆరాముఁడు, రిపునాగాంకుశం-శత్రువులనెడు నేనుఁగులకు అంకుశమువంటివాఁడగు, కుశం-కుశకుమారుని, కుశావత్యాం-కుశావతీపట్టణమునందు, నివేశ్య-ఉంచియు, సూక్తైఃచక్కనిపలుకుల చేత, సతాం-సత్పురుషులకు, జనితాశ్రులవం-కలిగింపఁబడిన ఆనందాశ్రుకణములఁగల, లవం-లవకుమారుని, శరావత్యాం-శరావతీపట్టణమునందు, నివేశ్య-ఉంచియు, సానుజఃతమ్ములతోఁగూడినవాఁడై, అగ్నిపురస్సరఃసఃఅగ్నినితమముందుంచు కొన్నవాఁడగుచు, పతివాత్సల్యాత్ పత్న్యా-తమప్రభువైనరామునియందలి. వాత్స

ల్యాత్-ప్రేమవలన, గృహవర్జం-ఇండ్లనుమాత్రం వదలివచ్చిన, అయోధ్యయా-అయోధ్యావాసి జనసమూహముచేత, అన్వితః-వెంబడింపబడినవాడై, ఉదక్-ఉత్తరదిశకు, ప్రతస్థే-బయలుదేరెను. స్థితప్రజ్ఞుడైన రాముడు కుశుని కుశావతీ పట్టణమునకును, లవుని శరావతీపట్టణమునకును అధిపతులనుగానిలిపి, తమ్ములతోను, తనయందలిప్రేమతో వెంటవచ్చు నయోధ్యాజనముతోను, అగ్నిని ముందు తీసుకపోవునట్లు నియమించి మహాప్రస్థానమును ఉత్తరదిశగా జేసె ననిభావము. "గృహాన్ వర్జయిత్వాగృహవర్జం" ఇండ్లను దీసికొనిపోవుటకు వీలులేనందున ఆవి తప్ప అందఱును వెళ్ళరనియర్థము, "ప్రతస్థే" ప్రపూర్వకస్థాధాతువునకు ప్రయాణమర్థము.

శ్లో. జగృహు స్తస్య చిత్తజ్ఞాః పదవీం హరిరాక్షసాః,
కదంబముకుళస్థూలై రభివృష్టాం ప్రజాశ్రుభిః. 99

వ్యాఖ్య : చిత్తజ్ఞాః-రామునిచిత్తము నెఱిగిన, హరిరాక్షసాః-కపిరాక్షస వీరులు, కదంబముకుళస్థూలైః-కడిమి మొగ్గలంత పెద్దవియగు, ప్రజాశ్రుభిః-ప్రజల కన్నీళ్ళచేత, అభివృష్టాం-వర్షింపబడిన (తడిసిన). తస్య-రామునియొక్క, పదవీం-మార్గమును, జగృహుః-అనుసరించిరి. రాముని మనస్సు నెఱిగిన కపి రాక్షసవీరు లందఱును, ప్రజలు దుఃఖముచేతగార్చుచున్న కన్నీటితో దడిసిన రాముని మార్గమును బట్టి యతనివెంట వెళ్ళిరి. కన్నీటిచుక్కలు కదంబముకుళము లంత పెద్దగానుండుట దుఃఖసమయమునందే జరుగునన్నది. కాళిదాసుయొక్క లోకజ్ఞతకు మచ్చుతునక. "జగృహుః" గ్రహ-ఉపాదానే ధాతువునకు లిట్. ప్ర.పు.బ.

శ్లో. ఉపస్థితవిమానేన తేన భక్తానుకంపినా,
చక్రే త్రిదివనిశ్రేణిః సరయూ రనుయాయినామ్. 100

వ్యాఖ్య : ఉపస్థిత విమానేన-తనకైవచ్చిన విమానముగలవాడును, భక్తాను కంపినా-భక్తులను దయతోజూచువాడును నగు, తేన-రామునిచేత, అనుయాయినాం-తనవెంట వచ్చువారికి, సరయూః-సరయూనది, త్రిదివనిశ్రేణిః-స్వర్గమునకు నిచ్చెనగా, చక్రే-చేయబడినది. తాను వెళ్ళుటకు విమానము వచ్చి యుండగా, భక్తులపై నత్యంతదయావంతుడైన రాముడు తనవెంట స్వర్గమునకు రాదలచిన వారందరికిని సరయూనదిని స్వర్గమునకుజేర్చునట్టి నిచ్చెననుగా,

జేసెను. అనఁగా నట్టివారందరికిని సరయూనదియందు శరీరత్యాగముచేసి స్వర్గమును జేరుఁడని చెప్పెనని భావము. "చక్రే" (డు) కృఞ్-కరణే ధాతువునకు కర్మణి లిట్ ప్ర.పు.ఏ. "తేన సరయూ: చక్రే" ఇది కర్మార్థక వాక్యము.

శ్లో. యద్గోప్రతరకల్పోఽభూత్సంమర్ద స్తత్ర మజ్జతామ్,
అత స్తదాఖ్యయా తీర్థం పావనం భువి ప్రథే. 101

వ్యాఖ్య : యత్-ఏకారణమువలన, తత్ర-ఆసరయూనదియందు, మజ్జతాం-మునుగుచున్నవారియొక్క, సమ్మర్దఃఒరసికొనుట, గోప్రతరకల్పఃఆవులమంద ప్రవేశము వంటిది, అభూత్-అయియుండెనో, అతఃఆ కారణమువలన, తదాఖ్యయా-ఆ గోప్రతర మను పేరుచేతనే, పావనం-పవిత్రతను గలిగించునట్టి, తీర్థం-పుణ్యతీర్థము, భువి-లోకమునందు, ప్రథే-ప్రసిద్ధిని బొందెను. రామునియాదేశముచేత కపి రాక్షస నరులందఱును నొక్కసారిగా సమ్మర్దమున గోప్రతరమువలె ననఁగా నావులమందలు జలపానముకొఱకు నదిలో ప్రవేశించినట్లు ప్రవేశించుటచేత ఆప్రదేశము అదే పేరుతో సరయూ నదీతీరమునందలి పుణ్యతీర్థమగు గోప్రతరము (గోప్రతారము)గా నావిర్భవించి ప్రసిద్ధికెక్కినదని భావము. "ప్రథే" ప్రథ-ప్రఖ్యానే (ఆత్మనేపది, అకర్మకము) లిట్. ప్ర. పు. ఏ.

శ్లో. స విభు ర్విబుధాంశేషు ప్రతిపన్నాత్మమూర్తిషు,
త్రిదశీభూతపౌరాణాం స్వర్గాంతర మకల్పయత్. 102

వ్యాఖ్య : విభుఃసఃప్రభువైన రాముఁడు, విబుధాంశేషు-దేవాంశలుగల సుగ్రీవాకులు, ప్రతిపన్నాత్మమూర్తిషు (సత్సు)-పొందఁబడిన తమ పూర్వరూపములు గలవారుకాఁగా, త్రిదశీభూతపౌరాణాం-క్రొత్తగా దేవతలైన పురజనులకు, స్వర్గాంతరం-మరియొక స్వర్గమును, అకల్పయత్-కల్పించెను. రామావతార సమయమునందు రాక్షసవధకుఁ దోడ్పడుటకై సుగ్రీవాదులై పుట్టిన దేవతలందఱును వారి వారి పూర్వరూపములు ధరించి వెళ్ళిపోగా, రామానుగ్రహమునఁ గ్రొత్తగా దేవత్వమును బొందిన అయోధ్యానగర పౌరులకై ప్రభువైన రాముఁడు ఒక నూతన స్వర్గమును కల్పించెనని భావము. "ఇచ్ఛామాత్రం ప్రభోఃసృష్టిఃఅనున్యాయమున నారాయణాంశగల రాముని ప్రభావమువలన నూతన స్వర్గము వెలయుటలో వింతలేదు. "అకల్పయత్" కృపూ-సామర్థ్యే అను ధాతువునకు

ప్రేరణార్థకము (ణిజంతము). లజ్.ప్ర పు ఏ. ఈ ధాతుసంబంధమగు ణికారావయ లేపమునకు "ల" కారము వచ్చును.

శ్లో, నిర్వ్యూహ్యైవం దశముఖశిరశ్ఛేదకార్యం సురాణాం
విష్వక్సేనః స్వతను మవిశ త్సర్వలోక ప్రతిష్ఠాస్,
లంకానాథం పవనతనయం చోభయం స్థాపయిత్వా
కీర్తిసంభద్వయ మివ గిరౌ దక్షిణే చోత్తరే చ, 103

వ్యాఖ్య : విష్వక్సేనః-విష్ణువు, ఏవం-ఈవిధముగా, సురాణాం-దేవతల యొక్క, దశముఖశిరశ్ఛేదకార్యం-రావణుని శిరస్సును చేదించుటయను కార్యమును, నిర్వ్యూహ్య-పూర్తిచేసి,లంకానాథం-విభీషణుని,పవనతనయం-హనుమంతుని, ఉభయం చ-ఇద్దఱినిగూడ, కీర్తిస్తంభద్వయం-తనకీర్తి స్తంభములు రెండిటినివలె, దక్షిణగిరౌ-దక్షిణదిక్కునందలి చిత్రకూట పర్వతమునందును, ఉత్తరే, గిరౌచ-ఉత్తరదిక్కు నందలిహిమాలయమునందును,స్థాపయిత్వా-నిలిపి, సర్వలోక ప్రతిష్ఠాం-సర్వలోకము లకును ఆధారమైన, స్వతనుం-తన మూర్తిని, అవిశత్-ప్రవేశించెను. ఈవిధముగా దేవతల కోరికపై రామావతారమును పొందిన విష్ణుమూర్తి దేవకార్యమైన రావణ వధనుచేసి ఉత్తరమున హిమగిరిపై విభీషణుని, దక్షిణమున చిత్రకూటపర్వతముపై హనుమంతుని, తన కీర్తి ధ్వజములవలె శాశ్వతముగా నిలిపి అఖిల సృష్టికినిఆధార భూతమైన స్వస్వరూపమును మరల ధరించెనని భావము. విభీషణ హనుమంతులు చిరంజీవులై నేటికిని యున్నట్లు ఆస్తికులు విశ్వసించుచున్నారు. దక్షిణభారతమున హనుమదాలయములు ఎక్కువగా నిర్మింపబడుట కిదియే కారణమేమో! "అవిశత్" విశ-ప్రవేశనే ధాతువునకు లజ్. ప్ర. పు. ఏ.

ఇది మహాకవి కాళిదాస కృతరఘువంశ కావ్యమున
శ్రీరామస్వర్గారోహణమను పంచదశసర్గకు
కేశవపంతుల నరసింహశాస్త్రి రచిత
తెలుగు లఘువ్యాఖ్య.

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

షోడశసర్గము

శ్లో. అథేతరే సప్త రఘుప్రవీరా జ్యేష్ఠం పురోజన్మతయా గుణైశ్చ,
చక్రుః కుశం రత్నవిశేషభాజం సౌభ్రాత్ర మేషాం హి
కులానుసారి. 1

వ్యాఖ్య : అథ-రామనిర్వాణానంతరమున, ఇతరే సప్త-ఇతరులైన ఏడుగురు రఘుప్రవీరాః-రఘువంశపు వీరులు, పురోజన్మతయా-మొదట బుట్టినవాడగుటచేతను, గుణైః చ-సత్యశౌర్యాది గుణములచేతను, జ్యేష్ఠం-పెద్దవాడగు కుశం-కుశుని, రత్నవిశేషభాజం-ఆయా శ్రేష్ఠ వస్తువుల ననుభవించు వానినిగా, చక్రుః-చేసిరి. హి-అది సరియే, సౌభ్రాత్రం-మంచిసోదరభావము, ఏషాం-ఈకుశలవాదులకు, కులానుసారి, హి-వంశక్రమాను గతమైనది సుమా! రామాదుల పుత్రులెనమండుగురిలోను వయస్సు చేతను, సద్గుణములచేతను పెద్దవాడైయున్న కుశునికి సర్వశ్రేష్ఠ వస్తువులను జేకూర్చి యితరులగు నేడ్గురును అతనిని సేవించుచుండిరని భావము. అట్లు అన్నదమ్ములలో బొరపొచ్చములులేక సౌభ్రాతమును నెరపుట రఘువంశరాజులకు వంశక్రమాగతమైన యాచారము. "జాత్రా జాత్రా యదుత్కృష్టం తద్రత్న మభిధీయతే" అనియుండుటవలన కుశునికి ఉత్తమోత్తమ రథగజాశ్వ సౌధ రత్నాభరణాదులు చేకూర్చిరని తాత్పర్యము.

శ్లో. తే సేతువార్తాగజబంధముఖ్యై రభ్యుచ్ఛ్రితాః కర్మభి
రప్యవంధ్యైః,
అన్యోన్యదేశప్రవిభాగసీమాం వేలాం సముద్రా ఇవ న
వ్యతీయుః. 2

వ్యాఖ్య : సేతువార్తాగజబంధముఖైర్యైః— సేతు - జలాశయములుకట్టుట, వార్తా-కృషిగోరక్షణాదులు, గజబంధ-ఏనుఁగులను పట్టుకొనుట, ముఖైర్యైః-మొదలయిన, అవంధ్యైః-సఫలములగు, కర్మభిః-పనులచేత, అభ్యుచ్ఛ్రితాః అపి-సామర్థ్యముచేత నభ్యుదయము పొందినవారై యున్నప్పటికిని, తే-ఆకుశలవాదులు, అన్యోన్యదేశప్రవిభాగసీమాం - అన్యోన్యదేశ - ఒండొరులదేశములయొక్క, ప్రవిభాగ-పరిధులను సూచించు ప్రదేశములయొక్క, సీమాం-హద్దును, వేలాం-చెలియలికట్టను, సముద్రాః, ఇవ-సముద్రములువలె, నవర్తీయుః-అతిక్రమింపరైరి. "కృషి ర్వణిక్పథో దుర్గం సేతుః కుంజరబంధనం, ఖన్యాకరధనాదానం శూన్యానాంచ నివేశనమ్, అష్టవర్గ మిమం సాధుః స్వయం వృద్ధోఒపి వర్ధయేత్" అనుకామందక రాజనీతివచనానుసారముగా, రాజు సర్వసంపదభివృద్ధిగలవాడై యున్నను, కృషి, వాణిజ్యము, దుర్గములు, జలాశయములు, గజసైన్యవృద్ధి, గనులనుండి ధనసంపాదనము, ఆకరములనుండి తత్తద్వస్తుసంపాదనము, శూన్యప్రదేశములను గ్రామములుగా మార్చుట, ఆను అష్టవర్గమును అభివృద్ధిపరచుచునే యుండవలయును. కాని కుశాదులు సేతువార్తాదుల సమృద్ధికలవారై నూతనాభివృద్ధిచేయుటకు సమర్థులైయున్నను, అట్టి యభివృద్ధికై యొకరిదేశములం దొకరు ప్రవేశింపక యన్యోన్యప్రేమతో సోదరభావమును నెఱపుచుండిరని భావము.

శ్లో. చతుర్భుజాంశప్రభవః స తేషాం దానప్రవృత్తే

రనుపారతానామ్,

సురద్విపానా మిన సామయోని ర్భిన్నోఽష్టధా
విప్రససార వంశః. 3

వ్యాఖ్య : చతుర్భుజాంశ ప్రభవః-విష్ణువుజన్మకారణమైనదియగు, దాన ప్రవృత్తేః-త్యాగప్రవృత్తిగుండి (గజపక్షమున మదోదకప్రవాహమునుండి) అనుపారతానాం-విరమింపనట్టి, తేషాం-ఆకుశలవాదులయొక్క, సః వంశః-ఆరమువంశము, సామయోనిః-సామవేదమునుండి పుట్టినదియగు, సురద్విపానాం-దిగ్గజములయొక్క, వంశఃఇవ-వంశమువలె, అష్టధా-ఎనిమిదివిధములుగా, భిన్నః-వేరుపడినదగుచు, విప్రససార-విస్తరించెను. విష్ణ్వంశసంభూతులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నుల పుత్రులగు కుశలవాదులెనమండుగురును మహాదాతలై, నిరంతరదానధారలచేత పవిత్రముగావించిన తమవంశమును, సామవేదమునుండి పుట్టిన దిగ్గజములు తమతమవంశమునువలె విస్తరింపఁజేసిరని భావము. గజమునకు

"సామజము" అనుపేరువచ్చుటకు కారణము, "సూర్యస్యాండకపాలే ద్వే సమానీయ ప్రజాపతిః, హస్తాభ్యాం పరిగృహ్యాథ సప్త సామా న్యగాయత, గాయతో బ్రహ్మణస్తస్మా త్సముత్పేతు ర్మతంగజాః" అను పాలకాప్యవచనము. అనగా, బ్రహ్మ సూర్యగోళాండకపాలములను రెంటినిఁజేర్చి చేతులలోపట్టుకొని సప్తసామలను గానముచేయుచుండగా నందులోనుండి మతంగజములు పుట్టినట. అట్లు ఎన మండుగురి వంశములును అతిపవిత్రములు, ఉదాత్తములునుగా క్రమాభివృద్ధినిఁ జెందినవి.

శ్లో. అథార్ధరాత్రే స్తిమితప్రదీపే శయ్యాగృహే సుప్తజనే
ప్రబుద్ధః,
కుశః ప్రవాసస్థకళత్రవేషా మదృష్టపూర్వాం
వనితా మపశ్యత్. 4

వ్యాఖ్య : అథ-కుశాదు లెవరి రాజ్యమునఁదు వారున్నపిమ్మట నొకరోజున ఆర్ధరాత్రే-నిశీథమునందు, స్తిమితప్రదీపే-నిశ్చలమైన దీపములుగలదియు, సుప్తజనే-నిద్రించిన జనులుగలదియు నగు, శయ్యాగృహే-పడకటింటియందు, ప్రబుద్ధః-మేల్కొనియుండిన, కుశః-కుశుఁడు, ప్రవాసస్థకళత్రవేషాం-దూరదేశమునందున్నవాని భార్యవేషముగలదియు (పోషిత భర్తృకావేషముగలది) అదృష్టపూర్వాం-అంతకుముం దెప్పుడును జూడబడనిదియునగు, వనితాం-ఒక స్త్రీని, అపశ్యత్-చూచెను. ఒకనాటిరాత్రి శయ్యాగృహమున నిద్రపట్టక మేల్కొనియున్న కుశుఁడు పోషితభర్తృక వేషమునందున్న యొకానొక స్త్రీనిఁ జూచెనని భావము.

శ్లో. సా సాధుసాధారణపార్థివర్ధేః స్థిత్వా పురస్తాత్ పురుహూతభాసః,
జేతుః పరేషాం జయశబ్దపూర్వం తస్యాంజలిం బంధుమతో
బబంధ. 5

వ్యాఖ్య : సా-ఆవనిత, సాధుసాధారణ పార్థివర్ధేః-సజ్జనులందఱికిని సాధారణముగానుండునట్టి రాజ్యలక్ష్మి గలిగినట్టియు, పురుహూతభాసః-ఇంద్రుని తేజస్సువంటి తేజస్సుగలిగినట్టియు, పరేషాం జేతుః-శత్రువులను జయించువాఁడును,

బంధుమతః-బంధు సంపదగలవాఁడును నగు, తస్య-ఆ కుశునియొక్క, పురస్తాత్-ఎదుట, స్థిత్వా-నిలుచుని, జయశబ్దపూర్వం-జయ ! అనుశబ్దము మొదట నుండు నట్లుగా, అంజలిం, బబంధ-చేతులు జోడించెను. అట్లు కనఁబడిన వనిత, రాజ్య లక్ష్మీయుతుఁడై, ఇంద్ర తేజస్సుగలవాఁడై, శత్రువిజేతయై, బంధుయుక్తుఁడై యుండిన కుశుని యెదుట నిలుచుండి, చేతులు జోడించుకొని, "జయ! జయ!" అని పలికెను.

శ్లో. అథా నపోఢార్గల మప్యగారం ఛాయా మివాదర్శతలం
ప్రవిష్టామ్,
సవిస్మయో దాశరథే స్తనూజః ప్రోవాచ పూర్వార్ధ
విసృష్టతల్పః. 6

వ్యాఖ్య : అథ-అట్లు "జయ" శబ్దము పలికినపిమ్మట, సవిస్మయః-ఆశ్చర్యయుక్తుఁడై, పూర్వార్ధ విసృష్టతల్పః-శరీరపూర్వభాగముచేత విడువఁబడిన పడకగలవాఁడైన, దాశరథేః, తనూజః-రామునిపుత్రుఁడగు కుశుఁడు, అనపోఢార్గలం, అపి-తొలగింపఁబడని తలుపుగడియ గలదియైనను, అగారం-గృహమును, ఆదర్శతలం-అద్దములోని భాగమును, ప్రవిష్టాం-ప్రవేశించిన, ఛాయాం, ఇవ-ప్రతిబింబమునువలె, ప్రవిష్టాం-ఇంటిలోనికి ప్రవేశించిన, తాం-ఆస్త్రీని ప్రోవాచ-ముందు చెప్పఁబోవురీతిగా వివరములడిగెను.జయశబ్దమును విన్నకుశుఁడు, పరుపుమీద సగము లేచినవాఁడై, గడియవేసియున్న శయ్యాగృహములోనికి,అద్దములోనికి ప్రతిబింబము ప్రవేశించినట్లు, ఎట్లు వచ్చినదో! ఊహింపరాని ఆ వనితతో సంభాషించెను. ఆదర్శ చ్ఛాయా ప్రవేశోపమానము లోకోత్తరముగా నున్నది. కుశుఁడుపడకపై, యెదుట బద్ధాంజలియైన వనిత, శయ్యాగృహము; ఇది చిత్రకారుని చిత్రరచనకు అనుకూలముగానున్న సన్నివేశము. అలంకారము : ఉపమ.

(యుగ్మమ్)

శ్లో. లబ్ధాంతరా సావరణేఽపి గేహే యోగప్రభావో నచ
లక్ష్యతే తే,
బిభర్షి చాకార మనిర్వృతానాం మృణాళినీ హైమ
మివోపరాగమ్. 7

కా త్వం శుభే! కస్య పరిగ్రహో వా? కింవా మదభ్యాగమ
కారణం తే?
ఆచక్ష్వ మత్వా వశినాం రఘూణాం మనః పరస్త్రీ విముఖ
ప్రవృత్తి. 8

వ్యాఖ్య : సావరణే, అపి-ఆవరణముగలదైనను, గేహే-గృహమునందు, లబ్ధాంతరా-పొందబడిన యవకాశముగలదానవయితివి, యోగప్రభావః, చ-యోగ శక్తిగూడ, తే, న, లక్ష్యతే-నీకున్నట్లు గనబడదు. మృణాళినీ-తామరతీగ, హైమం-మంచువలన వచ్చిన, ఉపరాగం, ఇవ-ఉపద్రవమునువలె, అనిర్వ్యాతానాం-సుఖములేనివారియొక్క, ఆకారం-రూపమును, బిభర్షి, చ-ధరించుచున్నావుగూడను, హేశుభే-ఓ అమ్మాయీ! త్వం, కా-నీవు ఎవరు? కస్య, వా, పరిగ్రహః-ఎవని యొక్క పత్నివి? తే-నీకు, మదభ్యాగమకారణం-నావద్దికి వచ్చుట యందలి కారణము, కింవా-ఏమైయున్నది? వశినాం-జితేంద్రియులగు, రఘూణాం-రఘు వంశపు రాజులయొక్క, మనః-మనస్సు, పరస్త్రీ విముఖ ప్రవృత్తి-పరస్త్రీల విష యమున పెడమొగముపెట్టు నడవడిగలదానినిగా, మత్వా-తెలిసికొని, ఆచక్ష్వ-చెప్పుము. ఓ శుభాంగీ! తలుపులు మూసియున్న యీ గృహములోని కెట్లు వచ్చి తివి? నీలో యోగశక్తి యున్నట్టును దోచుటలేదు, మంచుదెబ్బతిన్న తామరతీగ వలె దుఃఖితమైన రూపముగలదానవై యున్నావు. నీ వెవరు? ఎవని భార్యవు? నా వద్దికి వచ్చుటకుగారణమేమి? మా రఘువంశీయుల మనస్సు పరస్త్రీ విముఖమైనట్టి దని తెలిసికొని, ఆలోచించుకొని, నీ విషయమును వివరముగాజెప్పుమని కుశు డావనిత నడిగెనని భావము.

శ్లో. త మబ్రవీ త్సా గురుణా నవద్యా యా నీతపౌరా
స్వపదోన్ముఖేన,
తస్యాః పురః సంప్రతి వీతనాథాం జానీహి రాజ
న్నధిదేవతాం మామ్. 9

వ్యాఖ్య : సా-ఆవనిత, తం-కుశునుద్దేశించి, అనవద్యా-ఎట్టిదోషమునులేని, యా-ఏపురము, స్వపదోన్ముఖేన-తనస్థానమగు వైకుంఠమునకు వెళ్ళుచున్న, గురుణా-మీతండ్రిచేత, నీతపౌరా-తనవెంటదీసికొనిపోబడిన పురజనులుగలదై

యున్నదో! హేరాజ-ఓరాజా, మాం-నన్ను, సంప్రతి-ఇప్పుడు, వీతనాథాం-అనాథనైన, తస్యాః, పురః-ఆ అయోధ్యానగరముయొక్క, అధిదేవతాం-అధిదేవతనుగా, జానీహి-ఎఱుగుము, ఆని, అబ్రవీత్-పలికెను. ఆవనిత, మీతండ్రి రాముఁడు తన నిర్వాణసమయమున జనులనందఱిని వెంటఁబెట్టుకొని వైకుంఠమునకు వెళ్ళగా నిర్మానుష్యమైన అయోధ్యకు అధిదేవతనై అనాథనై యున్నానని కుఱునికిఁ జెప్పెను. ఇచ్చటి విశేషము రాముఁ డయోధ్యలోఁదనకు సమకాలికులై యుండిన వారినందఱిని వైకుంఠముఁజేర్చి మోక్షమొసఁగుట. "అబ్రవీత్" క్రియకు వాక్యార్థము కర్మ.

శ్లో. వసోవ్యకసారా మభిభూయ సాహం సౌరాజ్య
బద్ధోత్సవయా విభూత్యా,
సమగ్రశక్తా త్వయి సూర్యవంశ్యే సతి ప్రపన్నా
కరుణా మవస్థామ్. 10.

వ్యాఖ్య : సాహం (సా+అహం)- అయోధ్యాధిదేవతనై ననేను, సౌరాజ్యబద్ధోత్సవయా-మంచిరాజుపాలనముచేత ఉత్సవయుక్తమగు, విభూత్యా-సంపదచేత, వసోవ్యకసారాం-అలకాపురిని లేదా ఇంద్రనగరమును, అభిభూయ-తిరస్కరించి, సమగ్రశక్తౌ-సంపూర్ణశక్తిమంతుఁడవగు, త్వయి-నీవు, సూర్యవంశ్యే సతి-సూర్యవంశీయుఁడవై యున్నందున, కరుణాం, ఆవస్థాం-దీనదశను, ప్రపన్నా-పొందియున్నాను. మంచిరాజుగల అయోధ్యావిభూతిని మీతండ్రికాలమున అనుభవించుటచేత కుబేరనగరమగు అలకాపట్టణమునుగాని, వసోవ్యకసారమను పేరుగల ఇంద్రనగరమునుగాని లెక్కచేయనినేను సూర్యవంశీయుఁడవే అయి, సమగ్రశక్తిమంతుఁడవైన నీవుండియు నన్ను పరామర్శించుటలేదేయని దీనదశకు లోనైతి నని యావనిత కుఱునితోననెను. రామరాజ్యము స్వర్గరాజ్యముకన్నను వైభవోపేతమై యుండినదని భావము.

శ్లో. విశీర్ణతల్పాట్టశతో నివేశః పర్యస్తశాలః ప్రభుణా వినా మే,
విడంబయ త్యస్తనిమగ్న సూర్యం దినాంత
ముగ్రానిలఘ్న మేఘమ్. 11

వ్యాఖ్య : విశీర్ణతల్పాట్టశతః-శిథిలమైపోయిన అట్టాలికలయొక్కయు, సౌధగృహములయొక్కయు శతములుగలదియు, పర్యస్తశాలః-పడిపోయిన ప్రాకారములు గలదియునగు, మేనివేశః-నానివేశనము, ప్రభుణావినా-స్వామిలేనిదై, అస్తనిమగ్నసూర్యం-అస్తపర్వతమున మునిగిన-సూర్యుఁడుగలదియు, ఉగ్రానిలభిన్నమేఘం-ప్రచండ వాయువు చేత ముక్కలు చేయఁబడిన మేఘములు గలదియునగు, దినాంతం-సాయంకాలమును, విడంబయితి-పోలియున్నది. మేడలు, మేడలపైని అట్టాలకములు శిథిలములై, ప్రాకారములు పడిపోయి, ప్రభువులేకయున్ననానివాసమగు నయోధ్యానగరము, అస్తమించిన సూర్యుఁడును పెనుగాడ్పులచేత చెదరి ముక్కలయిన మేఘములును గల సాయం సమయమును బోలుచు కళాహీనమైయున్నదని చెప్పెను. ఇచ్చటి "తల్ప" శబ్దమునకు అట్టాలిక యని అర్థము.

శ్లో. నిశాసు భాస్వత్కలనూపురాణాం యః సంచరోఽభూ
దభిసారికాణామ్,
నదన్ముఖోల్కావిచితామిషాభిః స వాహ్యతే రాజపథః
శివాభిః. 12

వ్యాఖ్య : నిశాసు-రాత్రులయందు, భాస్వత్కలనూపురాణాం-ప్రకాశించుచు అవ్యక్తమధురధ్వనులుచేయు కాళ్ళయందెలుగల, అభిసారికాణాం-అభిసారికానాయికలకు. యః-ఏరాజమార్గము, సంచరః-సంచారమార్గమైయుండెనో, సః, రాజపథః-ఆరాజవీధి, నదన్ముఖోల్కావిచితామిషాభిః-నదన్ముఖ-అరచుచున్న నోళ్ళయందలి, ఉల్కా-మండుచున్న శ్మశానపు కొఅవులచేత, విచితామిషాభిః-వెదకబడుచున్న మాంసపుముక్కలుగల, శివాభిః-ఆడునక్కలచేత, వాహ్యతే-నడువఁబడుచున్నది. రాత్రులయందు శృంగారనాయికలగు అభిసారికలు రత్ననూపురధ్వనులతోఁ ప్రియులవద్దికి వెళ్ళుట కుపయోగపడిన రాజమార్గము నేడు నోళ్ళలో శ్మశానపు కొఅవులను బట్టుకొని కూతలుపెట్టుచు మాంసములను వెదకుచున్న నక్కలు నడచు దౌర్భాగ్యమును పొందియున్నదని భావము. రత్నకాంతులకు కొఅవి మంటలు, కలనాదములకు నక్కకూతలు సామ్యమును పొందియున్నవి. "సంచరంతి అనేన ఇతి సంచరః" గోచరసంచర ఇత్యాది సూత్రముచేత "ఘ" ప్రత్యయాంతమగు నిపాతము. ఇట్లే గోచరః (దేశము), వహః (స్కంధము), వ్యజః (తాలవృంతము), ఆపణః (పణ్యస్థానము) ఇత్యాది శబ్దములు నిపతింపఁబడినవి.

శ్లో. ఆస్ఫాలితం యత్ ప్రమదాకరాగ్రై ర్మృదంగధీర ధ్వని
మన్వగచ్ఛత్,
వన్యై రిదానీం మహిషై స్తదంభ శ్శృంగాహతం క్రోశతి
దీర్ఘి కాణామ్. 13

వ్యాఖ్య : యత్-ఏజలము, ప్రమదాకరాగ్రైః-జలక్రీడలాడుస్త్రీలయొక్క హస్తములచేత, ఆస్ఫాలితం-కొట్టబడినదగుచు, మృదంగధీరధ్వనిం-మృదంగముల యొక్క గంభీరధ్వనిని, అన్వగచ్ఛత్-అనుకరించియుండెనో, తత్-అట్టి, దీర్ఘి కాణాం-దిగుడుబావులయుక్క, అంభః-జలము,ఇదానీం-ఇప్పుడు, వన్యైఃమహిషైః-అడవిదున్నలచేత, శృంగాహతం-కొమ్ములతో చెలగఁబడినదగుచు, క్రోశతి-ఆరచుచున్నది. పూర్వ మయోధ్యయందలి దిగుడుబావులలో జలక్రీడలు సలుపు ప్రమదలు హస్తములతో వాయింపఁగా, మృదంగధ్వనివలె వినఁబడుచుండిన నీటిచప్పుడు ఇప్పుడు అడవిదున్నల కొమ్ములతో చెలగఁబడుచు రోదనధ్వనితో హోరెత్తుచున్నదని భావము.

శ్లో. వృక్షేశయా యష్టినివాసభంగా న్మృదంగశబ్దాపగమా
దలాస్యాః,
ప్రాప్తా దవోల్కాహత శేషబర్హాః క్రీడామయూరా
వనబర్హిణత్వమ్. 14

వ్యాఖ్య : యష్టినివాస భంగాత్-నివాసముగా కట్టిన కఱ్ఱలు విరుగుటవలన, వృక్షేశయాఃచెట్టుపై నిద్రించుచున్న వగుచును, మృదంగశబ్దాపగమాత్-మృదంగ నాదములు లేనందువలన, అలాస్యాఃనృత్య శూన్యములగుచును, దవోల్కాహత శేషబర్హాఃదవోల్కా-వనాగ్నియొక్క మిణుగురులచేత, హతశేష-కాలగామిగిలిన బర్హాఃపింఛములుగలవి యగుచును, క్రీడామయూరాఃవిలాసమయూరములు, వన బర్హిణత్వం-అడవి నెమళ్ళగుటను, ప్రాప్తాఃపొందినవి. అయోధ్యయందలి క్రీడా మయూరములు, సౌధములయందలి తమ నివాసయష్టులు విరిగిపోవుటచేత చెట్లపై నిద్రించుచు, ఎచ్చటను మృదంగనాదము వినఁబడకుండుటచేత లాస్యమును విడిచి, అరణ్యముగామారిన అయోధ్యలో నప్పుడప్పుడు రగుల్కొను వనాగ్నిమిణుగురులచే కాలాగా మిగిలిన పింఛములతో అడవి నెమళ్ళవలె దీనదశను పొందియున్నవి అని చెప్పెను. "వృక్షేశయాఃఅలుక్సమాసము.

శ్లో. సోపానమార్గేషు చ యేషు రామా నిక్షిప్తవత్యశ్చరణాన్ సరాగాన్,
సద్యో హతన్యంకుభి రస్రదిగ్ధం వ్యాఘ్రైః పదం తేషు నిధీయతే మే. 15

వ్యాఖ్య : యేషు, సోపానమార్గేషు-ఏ సోపాన మార్గములయందు, రామాః-స్త్రీలు, సరాగాన్-లాక్షా రస ము చేఁద డి సి న, చరణాన్-పా ద ము ల ను, నిక్షిప్తవత్యః-ఉంచుచుండిరో, తేషు, మే, మార్గేషు-ఆనాసోపానమార్గములయందు, సద్యఃఅప్పుడే, హతన్యంకుభిః-చంపఁబడిన యిట్టులు గల, వ్యాఘ్రైఃపులుల చేత; అస్రదిగ్ధం-రక్తముచే పూయఁబడిన, పదం-అడుగు, నిధీయతే-ఉంచఁబడు చున్నది. మరియు సౌధాదులసోపానమార్గములందు పూర్వము విలాసవతులు లక్క-పూతలతోఁదడిసిన చరణము లుంచుచుండిరి. ఇప్పుడు పులులు అప్పుడే చంపిన లేళ్ళ నెత్తురుతోఁ దడిసిన తమ యడుగుల నదేమెట్లపై నుంచుచున్నవని వాపోయెను.

శ్లో. చిత్రద్విపాః పద్మవనావతీర్ణాః కరేణుభి ర్దత్తమృణాలభంగాః,
నఖాంకుశాఘాతవిభిన్నకుంభాః సంరబ్ధసింహాప్రహృతం
వహన్తి 16

వ్యాఖ్య : పద్మవనావతీర్ణాఃకమలవనమున దిగినవిగాను, కరేణుభిఃఆడ యేనుగులచేత, దత్తమృణాలభంగాఃఈయఁబడిన తామరకాడల ముక్కలఁ గలవి గాను ప్రాయఁబడిన, చిత్రద్విపాఃభిత్తిచిత్రములయందలి యేనుఁగులు, నఖాంకుశా ఘాతవిభిన్నకుంభాఃఅంకుశములవంటి గోళ్ళ దెబ్బలచేత పగిలిన కుంభస్థలములు గలవి యగుచు, సంరబ్ధసింహాప్రహృతంకోపించిన సింహముల ప్రహారమును, వహంతిభరించుచున్నవి. నగరసౌధములగోడలపై, కమలవనములోనికి దిగి ఆడ యేనుఁగు లందించు తామరతూండ్లను దినుచున్నట్టు, చిత్రింపఁబడిన యేనుఁగు బొమ్మలను, సత్యగజములని భ్రమించి పాదువడిన యయోధ్యలోనికిఁ బ్రవేశించిన సింహాలు తమ గోళ్ళతో నాయేనుఁగుల కుంభస్థలములను జీల్చి, కోపించి కొట్టు చున్నవని భావము. భ్రాంతిమదలంకారము వ్యంగ్యము.

శ్లో. స్తంభేషు యోషిత్ప్రతియాతనానా ముత్కాంతవర్ణక్రమ
ధూసరాణామ్,
స్తనోత్తరీయాణి భవంతి సంగా నిర్మోకపట్టాః ఫణిభి
ర్విముక్తాః. 17

వ్యాఖ్య : ఉత్కాంత వర్ణక్రమ ధూసరాణాం—ఉత్కాంత-వెలిసి పోయిన, వర్ణక్రమ-మొదటవేసిన రంగులుగలవగుటచేత, ధూసరాణాం-బూడిదరంగు గల, స్తంభేషు-కట్టస్తంభములయందలి, యోషిత్ప్రతియాతనానాం-శిల్పరూపమున నున్న స్త్రీమూర్తులకు, ఫణిభిః-సర్పములచేత, విముక్తాః-విడువఁబడిన, నిర్మోక పట్టాః-బట్టముక్కలవంటికుబుసములు, సంగాత్-తగులుకొనియున్నందువలన, స్తనో త్తరీయాణి-స్తనాచ్ఛాదనవస్త్రములు, భవంతి—అగుచున్నవి,సౌధములలోని స్తంభము లపై స్త్రీశిల్పములను జెక్కి వాటివస్త్రాదులను పెక్కురంగులతో వేసియుండిరి. కాల క్రమమున ఆరంగులు మాసిపోయినందున స్త్రీశిల్పములకు స్తనములు బయల్ప డఁగా నచ్చట సర్పములు విడిచిన కుబుసములు దగుల్కొని స్తనోత్తరీయములుగా నుండు దశవచ్చినదనిచెప్పెను. ఈ స్తనోత్తరీయములు ఉత్తరదేశపుస్త్రీలు వేసుకొను చున్నపాటివని గ్రహింపవలెను. అయోధ్యానగర మంతపాడువడినదని భావము.

శ్లో. కాలాంతరశ్యామసుధేషు నక్త మితస్తతో
రూఢతృణాంకురేషు,
త ఏవ ముక్తాగుణశుద్ధ యోపి హర్మ్యేషు మూర్ఛంతి
న చంద్రపాదాః 18

వ్యాఖ్య : కాలాంతరశ్యామసుధేషు — కాలాంతర - కాలవ్యవధానముచేత, శ్యామ-నల్లఁబడిన, సుధేషు-సున్నపుపూతలుగలవియు, ఇత స్తతః-ఇచ్చటచ్చట, రూఢతృణాంకురేషు-మొలచినగడ్డిపరకలు గలవియునగు, హర్మ్యేషు-గృహముల మీద, నక్తం-రాత్రియందు, ముక్తాగుణశుద్ధయః, అపి-ముత్యాలహారములవలె తెల్లనివైయున్నప్పటికిని, తే, ఏవ-ఇంతకుపూర్వము ప్రకాశించినవేయగు, చంద్ర పాదాః-చంద్రకిరణములు, న మూర్ఛంతి—ప్రతిఫలించుటలేదు. పూర్వము రాత్రి వేళలలో సౌధములయందు తళతళమని ప్రతిఫలించిన చంద్రకిరణములే యిప్పుడు మేడలన్నియు సున్నమువేయువారులేకయు, అచ్చటచ్చట గడ్డిమొలకలు మొల

చియుఁ గళాహీనములై యున్నందున ఆహార్యములమీద చంద్రకిరణములు ప్రతిఫలించుటయే లేదట.

శ్లో. ఆవర్జ్య శాఖాః సదయం చ యాసాం పుష్పాణ్యపాత్తాని విలాసినీభిః,
వన్యైః పులిందైరివ వానరైస్తాః క్లిశ్యంత ఉద్యానలతా మదీయాః. 19

వ్యాఖ్య : విలాసినీభిః-సుకుమారయువతులచేత, సదయం-దయాపూర్వకముగా, శాఖాః-కొమ్మలను, ఆవర్జ్య-వంచి, యాసాం-ఏతీఁగలయొక్క, పుష్పాణి-పువ్వులు, ఉపాత్తాని-తెంపుకోఁబడియుండెనో, తాః-అట్టి, మదీయాః, ఉద్యానలతాః-నాయుద్యానలతలు, పులిందైః, ఇవ-ఆటవికజనులచేతవలె వన్యైఃవానరైః-అడవికోతులచేత, క్లిశ్యంతే-బాధింపఁబడుచున్నవి. ఏనాయుద్యానలతలు పూర్వము విలాసినులచేత దయతోవంచఁబడి పువ్వులుకోసుకోఁబడుచుండెనో యవి నేఁడు కర్కశస్వభావముగలయాటవికులచేతవలె వనవానరములచేత నిర్దయముగా బాధింపఁబడుచున్నవని చెప్పెను.

శ్లో. రాత్రా వనావిష్కృతదీపభాసః కాంతాముఖశ్రీవియుతా దివాపి,
తిరస్క్రియంతే కృమితంతుజాలై ర్విచ్ఛిన్నధూమప్రసరా గవాక్షాః. 20

వ్యాఖ్య : రాత్రౌ-రాత్రియందు, అనావిష్కృతదీపభాసః-శూన్యమైన దీపకాంతులు గలవియు, దివా, అపి-పగటియందును, కాంతాముఖశ్రీవియుతాః-స్త్రీల ముఖకాంతిచేత వియుక్తములైనవియు, విచ్ఛిన్నధూమప్రసరాః-నష్టమైన ధూమప్రసారముగలవియునగు, గవాక్షాః-గవాక్షములు, కృమితంతుజాలైః-సాలెపురుగుల దారాల వలలచేత, తిరస్క్రియంతే-మూయఁబడుచున్నవి. నగరసౌధ గవాక్షములు రాత్రివేళలో దీపకాంతులు లేనివగుచు, పగలు అప్పుడప్పుడు తొంగిచూచు స్త్రీల ముఖములులేనివగుచును, లోపలమనుష్యులులేనందున పొగవెళ్ళుటలేనివగుచు, సాలెపురుగు లల్లిన దారములతో మూతపడుచున్నవి సుమా! అని వాపోయెను.

ఈ గవాక్షములు గోడలకే ఆవుకన్నులవంటి రంధ్రములతో నిర్మింపబడిన నేటి కిటికీలవంటివి.

శ్లో. బలిక్రియావర్జితసైకతాని స్నానీయసంసర్గ మనాప్నువంతి,
ఉపాంతవానీరగృహాణి దృష్ట్వా శూన్యాని దూయే
సరయూజలాని. 21

వ్యాఖ్య : బలిక్రియావర్జితసైకతాని-బలిక్రియా-పూజాకర్మలచేత, వర్జిత-వర్జితములైన, సైకతాని-ఇసుకతిన్నెలుగలవియు, స్నానీయసంసర్గం-స్నానసాధనములగు పిండి మొదలగు వానితో గలియుటను, అనాప్నువంతి-పొందనివియు, ఉపాంతవానీరగృహాణి-సమీపమునందు నెలకొన్న ప్రబ్బలిపొదలు గలవియునగు, సరయూజలాని-సరయూనదీజలములను, శూన్యాని-నిర్మానుష్యములైన వానినిగా, దృష్ట్వా-చూచి, దూయే-పరితపించుచున్నాను. ఇక సరయూనదీ సైకతములందు పూజలు చేయువారులేరు, స్నానము చేయువారు శరీరమునకు రాచుకొను ఇప్ప, సెనగ మొదలగు వాని చూర్ణములు నీటిలో గలియుటలేదు, నదిలోనికి దిగు దారులన్నియు ప్రబ్బలిపొదలతో నిండియున్నవి, ఇట్లు శూన్యములైన సరయూ జలములను జూచినప్పుడు నామనస్సు చాలానొచ్చుచున్నది అని యావనిత కుశుని యెడుట దురపిల్లెనని భావము. "బలిః పూజోపహారః స్యాత్" అని శాశ్వతనిఘుంటువు. స్నాంతి అనేన ఇతి "స్నానీయం" కరణార్థమున "అనీయర్" ప్రత్యయము.

శ్లో. త దర్హసీమాం వసతిం విసృజ్య మా మభ్యుపైతుం
కులరాజధానీమ్,
పితా తనుం కారణమానుషీం తాం యథా గురు స్తే
పరమాత్మ-మూర్తిమ్. 22

వ్యాఖ్య : తత్-అందువలన, ఇమాం, వసతిం-ఈ నివాసమును (కుశావతీ పట్టణమును), విసృజ్య-వదలిపెట్టి, కులరాజధానీం-మీవంశ రాజధానినగు, మాం-నన్ను (అయోధ్యను), అభ్యుపైతుం-చేరుటకు, అర్హసి-తగియున్నావు. (ఎట్లనగా) తే-నీయొక్క, గురుః-తండ్రియగు రాముడు, తాం, కారణమానుషీం, తనుం-కారణవశమున మానవరూపముగల యాశరీరమును, హిత్వా-వదలి, పరమాత్మ మూర్తిం-విష్ణు శరీరమును, యథా-ఎట్లుపొందెనో అట్లు. రావణవధరూప కారణ

మున మానవరూపమును ధరించిన మీతండ్రియగురాముఁడు మరల విష్ణుమూర్తిగా వైకుంఠమునకు వెళ్ళినట్లు నీవును శత్రువిజయ చిహ్నముగా వసతినిఁజేసికొన్న కుశావతీపట్టణమును వదలి కులరాజధానియైన అయోధ్యను జేరి నాదుఃఖమును దొలఁగింపు మని కోరెను.

శ్లో. తథేతి తస్యాఃప్రణయం ప్రతీతఃప్రత్యగ్రహీ త్పూర్వగవాంరఘూణామ్,
పూ రయ్యభివ్యక్తముఖప్రసాదా శరీరబంధేన తిరోబభూవ. 23

వ్యాఖ్య : రఘూణాం-రఘువంశీయులలో, ప్రాగ్రహరఃసు-మిక్కిలిశ్రేష్ఠుఁడైన కుశుఁడు, తస్యాఃసు-ఆయయోధ్యాధిదేవతయొక్క, ప్రణయం-ప్రార్థనమును, ప్రతీతఃసు (సన్)-సంతుష్టుఁడగుచు, తథేతి (తథా+ఇతి)-అట్లేయగుగాక యని, ప్రత్యగ్రహీత్-అంగీకరించెను. పూరపి (పూఃసు+అపి)-పురాధిదేవత సైతము, అభివ్యక్తముఖప్రసాదా-స్పష్టమైన ముఖనైర్మల్యము గలదియగుచు, శరీరబంధేన-శరీరముతో, తిరోబభూవ-అంతర్ధానమును పొందెను. అట్లు ఆహ్వానించిన ప్రార్థనను రఘువీరుఁడైన కుశుఁడంగీకరింపఁగా నయోధ్యా నగరాధిదేవత ధరించిన శరీరమును విడిచి అంతర్ధానమును పొందెను. అనఁగా నావనిత కుశుని యెదుటినుండి మాయమై పోయెనని భావము.

శ్లో. తదద్భుతం సంసది రాత్రివృత్తం ప్రాతర్ద్విజేభ్యో నృపతిఃశశంస,
శ్రుత్వా తదేనం కులరాజధాన్యాఃసాక్షా త్పతిత్వే వృతమభ్యనందన్. 24

వ్యాఖ్య : నృపతిఃసు-కుశుఁడు, తదద్భుతం(తత్+అద్భుతం) ఆయాశ్చర్యకరమైన, రాత్రివృత్తం-రాత్రియందలి వృత్తాంతమును, ప్రాతఃసు-మరుసటి యుదయమున, సంసది-సభయందు, ద్విజేభ్యఃసు-బ్రాహ్మణులకు, శశంస-చెప్పెను. తే-ఆ బ్రాహ్మణులు, శ్రుత్వా-విని, ఏనం-అతనిని, కులరాజధాన్యాఃసు-వంశరాజధానికి, సాక్షాత్-స్వయముగా, పతిత్వే-భర్తయగుటయందు, వృతం-వరింపఁబడినవానిని, అభ్యనందన్-ఆశీర్వచనములచేత అభినందించిరి. అట్లు పూర్వరాత్రియందు జరిగిన వృత్తాంతమును మరునాటి ప్రాతఃకాలమున కుశుఁడు బ్రాహ్మణులకు సభలో వివ

రింపఁగా వారు కులరాజధాని స్వయముగా భర్తగా వరించినందులకతని నాశీర్వదించి మెచ్చుకొనిరని భావము. స్వప్నతుల్యమైన యీ సంఘటన విషయమున గార్గ్యుఁడను స్వప్నశాస్త్రవేత్త యిట్లు చెప్పెను. శ్లో. "దృష్ట్వా స్వప్నం శోభనం నైవసుప్యాత్ పశ్చాత్ హృష్టోయః సపాకంవిధత్తే, శంసేదిష్టం తత్రసాధుర్విజేభ్యస్తే చాశీర్భిః ప్రీణయేయు ర్నరేంద్రమ్" అనఁగా మంచి స్వప్నము వచ్చినప్పుడు మేల్కొన్న రాజు ఆ స్వప్నఫలము ననుభవింపదలఁచుకొన్నచో మరల నిద్రింపరాదు. తరువాత బ్రాహ్మణులకుఁ జెప్పవలెను. వారును "తథాస్తు" అని ఆశీర్వదించి యతని నానందింపఁజేయవలయునని యర్థము.

శ్లో కుశావతీం శ్రోత్రియసా త్స కృత్వా యాత్రానుకూలే
ఽహని సావరోధః,
అనుద్రుతో వాయు రివాభ్రవృందై ఃసైన్యై రయోధ్యాభి
ముఖః ప్రతస్థే. 25

వ్యాఖ్య : సః-కుశుఁడు, కుశావతీం-కుశావతి నగరమును, శ్రోత్రియసాత్-వేదవేత్తల స్వాధీనమైనదానినిగా, కృత్వా-చేసి, యాత్రానుకూలే-ప్రయాణమునకుఁదగిన, అహని-దినమునందు, సావరోధః సన్-అంతఃపురాంగనలతోఁగూడిన వాఁడగుచు, వాయుః-వాయువు, అభ్రవృందైః, ఇవ-మేఘసమూహములతోవలె, సైన్యైఃసేనలతో, అనుద్రుతఃసన్-వెంబడింపఁబడినవాఁడగుచు, అయోధ్యాభిముఖః-అయోధ్యానగరమువైపు, ప్రతస్థే-ప్రయాణముచేసెను. కుశావతీ పట్టణమును వేదపండితులకు దానముచేసి, ప్రయాణమునకు యోగ్యమైన తిథివార నక్షత్రాదులుగల దినమునందు అంతఃపుర స్త్రీలతో అయోధ్యాభిముఖుఁడై కుశుఁడు ప్రయాణముచేయఁగా నతనివెంట సైన్యములు, వాయువువెంబడి మేఘబృందముల వలె, బయలుదేరెను. అలంకారము: ఉపమ.

శ్లో. సా కేతుమాలోపవనా బృహద్భి ర్విహారశైలానుగతేవ
నాగైఃఽ,
సేనా రథోదారగృహా ప్రయాణే తస్యాభవ
జ్జంగమరాజధానీ. 26

వ్యాఖ్య : కేతుమాలోపవనా-జెండాలవరుసలనెడి ఉపవనముగలదియు, బృహద్భిః-పెద్దవియగు, నాగైః-ఏన్గులచేత, విహారశైలానుగతా-క్రీడాపర్వతములతోఁ గూడినదివలెనున్నదియు రథోదారగృహా-రథములను మంచిగృహములుగలదియునగు, సా, సేనా-ఆసైన్యము, తస్య, ప్రయాణే-అకుభునిప్రయాణమునందు, జంగమరాజధానీ, ఇవ-నడచుచున్న నగరమువలె, అభవత్-ఉండెను. రంగురంగుల జెండాబట్టలు పువ్వులు, ఆకులు, కొమ్మలుగాఁ గనఁబడుటచేత ఉపవనముగానుఁ, ఎత్తైనయేనుఁగులు క్రీడాశైలములుగాను, రథములు అలంకరింపఁబడినయింట్లుగాను గోచరించుటచేత ఆసేనయంతయుఁ గుభునిప్రయాణమునందు నడచుచున్న రాజధానిగాఁ బ్రకాశించెనని భావము. కేతుమాలాదులయందు ఆకోపింపఁబడిన ఉపవనాదులు జంగమరాజధానిగాఁ బరిణమించుట కుపయోగపడినందున పరిణామాలంకారము. "ఆరోప్యమాణస్య ప్రకృతోపయోగిత్వే పరిణామః" అని లక్షణము.

శ్లో. తేనాతపత్రామలమండలేన ప్రస్థాపితః

పూర్వనివాసభూమిమ్,

బభౌ బలౌఘః శశినోదితేన వేలా ముదన్వానివ

నీయమానః, 27

వ్యాఖ్య : ఆతపత్రామలమండలేన-నిర్మలమండలాకారముగల ఛత్రముగల, తేన-అకుభునిచేత, పూర్వనివాసభూమిం-మొదటినివాసమగు నయోధ్యను గుఱించి, ప్రస్థాపితః-ప్రయాణముచేయింపఁబడిన, బలౌఘః-సైన్యసమూహము, ఆతపత్రామలమండలేన-ఛత్రమువలె నిర్మలపూర్ణబింబముగలవాఁడై, ఉదితేన-ఉదయించిన, శశినా-చంద్రునిచేత, వేలాం, నీయమానః-తీరమునుజేర్పఁబడుచున్న ఉదన్వాన్, ఇవ - సముద్రము వలె, బభౌ - ప్రకాశించెను. శ్వేతచ్ఛత్రముగల కుభునిచేత నయోధ్యకు ప్రయాణముఁ జేయింపఁబడిన, సైన్యసమూహము, పూర్ణిమాచంద్రునిచేతఁ జెలియలికట్టకుఁ దీసికొనిపోఁబడుచున్న జలనిధివలెఁ బ్రకాశించెనని భావము. రూపకానుప్రాణితమగు ఉపమాలంకారము. "ఉదకం అస్య అస్తీతి ఉదన్వాన్" అని విగ్రహము.

శ్లో. తస్య ప్రయాతస్య వరూథినీనాం పీడా మపర్యాప్తవతీవ సోఢుమ్,
వసుంధరా విష్ణుపదం ద్వితీయ మధ్యారురో హేవ రజశ్ఛలేన. 28

వ్యాఖ్య : ప్రయాతస్య-ప్రమాణమైవెళ్ళుచున్న, తస్య-కుశునియొక్క, వరూథినీనాం-సేనలయొక్క, (అవి కలిగించునట్టి) పీడాం-బాధను, సోఢుం-సహించుటకు, అపర్యాప్తవతీ, ఇవ-శక్తిలేనిదివలెనుండిన, వసుంధరా-భూదేవి, రజశ్ఛలేన-దుమ్ముమిషమున, ద్వితీయం-రెండవదియగు, విష్ణుపదం-ఆకాశమును, అధ్యారురోహ, ఇవ-ఎక్కినదా? యనునట్లుండెను. కుశుని ప్రయాణమునండలి సైన్యమువలని బరువును మోయలేక భూదేవి ధూళిగామారి యాకాశమునెక్కినా యేమి? అని తోచునట్లు ఆకాశము రజోమయమయ్యెనని భావము. "వరూథినీనాం" కర్తరి షష్ఠి. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. ఉద్యచ్ఛమానా గమనాయ పశ్చాత్ పురో నివేశే పథిచ వ్రజంతీ,
సా యత్ర సేనా దదృశే నృపస్య తత్రైవ సామగ్ర్యమతిం చకార. 29

వ్యాఖ్య ; గమనాయ-నడచుటకొఱకు, ఉద్యచ్ఛమానా-ముందుకు వెళ్ళుచున్నదియై, పశ్చాత్-వెనుకభాగమునందును, పురః-ముందుభాగమునందును, నివేశే-విడిదియందును, పథి-దారియందు, వ్రజంతీచ-వెళ్ళుచున్నదియగుచును, నృపస్య-కుశునియొక్క, సా, సేనా-ఆసైన్యము, యత్ర-ఎచ్చటెచ్చట, దదృశే-చూడబడుచుండెనో, తత్రైవ-అచ్చటచ్చటనే, సామగ్ర్యమతిం-సంపూర్ణముగానున్నదను బుద్ధిని, చకార-కలిగించెను. ఒక సైన్యము లేదా జవసమూహము దారిలో నడచునప్పుడు ముందర వెనుక జనము పలుచగానుండి మధ్యలోకొంచెక్కువగా నుండుట సామాన్యము. కాని కుశుని సైన్యము వెనుక, ముందు, విడిదులలోను, దారి నడచునప్పుడును, ఎచ్చట చూచినను మిక్కుటముగానుండి సమగ్రసైన్యమిచ్చటనే యున్నదా? అను బుద్ధిని గలిగించుచునేగెను. ఆసైన్యమంతయపరిమితముగా నుండెనని భావము. "ఉద్యచ్ఛమానా" యమ-ఉపరమే

అనుపరస్మైపదిధాతువు "సముదాజ్ భ్యోతామోఒగ్రంథె" అనుసూత్రమువలన ఆత్మనేపదికాగా "శానచ్" ప్రత్యయమువచ్చిన రూపము.

శ్లో. తస్య ద్విపానాం మదవారిసేకాత్ ఖురాభిఘూతాచ్చ
తురంగమాణామ్,
రేణుః ప్రపేదే పథి పంకభావం పంకోఒపి రేణుత్వ
మియాయ నేతుః. 30

వ్యాఖ్య : నేతుః-నాయకుడగు, తస్య-ఆకుశునియొక్క, ద్విపానాం-ఏనుగులయొక్క, మదవారిసేకాత్-మదోదకసేచనము వలనను, తురంగమాణాం-గుఱ్ఱములయొక్క, ఖురాభిఘాతాత్, చ-గిట్టల ప్రొక్కుడు వలనను, (యథాసంఖ్యముగా) పథి-మార్గమునందు, రేణుః-ధూళి, పంకభావం-బురదతనమును, ప్రపేదే-పొందెను. పంకః, అపి-బురదకూడ, రేణుత్వం-ధూళియగుటను, ఇయాయ-పొందెను. ఆట్లు సైన్యమును దీసికొని పోవుచున్న కుశుని మార్గమునం దతనియేనుగుల మదజలధారలచేత ధూళి బురదగాను, నేలపైనుండినబురద గుర్రాల ప్రొక్కిడి వలన ధూళిగాను మారెనని భావము. అనగా సైన్యమునందన్ని యేనుగులు, అన్ని గుఱ్ఱములు నుండెనన్నమాట. పంకము రేణువుగాను రేణువు పంకముగాను మారుట అతిశయోక్తి అలంకారము.

శ్లో. మార్గైషిణీ సా కటకాంతరేషు వైంధ్యేషు సేనా బహుధా
విభిన్నా,
చకార రేవేవ మహావిరావా బద్ధప్రతిశ్రుంతి
గుహాముఖాని. 31

వ్యాఖ్య : వైంధ్యేషు-వింధ్యకు సంబంధించిన, కటకాంతరేషు-పర్వతమధ్యప్రదేశములయందు, మార్గైషిణీ-దారులు వెదకుచున్నది యగుటచే, బహుధా-అనేక విధములుగా, విభిన్నా-చీలినదియై, మహావిరావా-పెద్దగా కేకలువేయునున్న, సా, సేనా-ఆకుశునిసేన, రేవా, ఇవ-నర్మదానదివలెనే, గుహాముఖాని-నోళ్ళవంటి వింధ్య గుహలను, బద్ధప్రతిశ్రుంతి-ఎడతెగని ప్రతిధ్వనులు గలవానినిగా, చకార-చేసెను. దారిలోవచ్చిన వింధ్యపర్వతముపై పెక్కుకొండదారు లుగడుటచేత నేఁభాగమెట్లు

నడచునో చూచుటలో నాసేన పెక్కురీతుల చీలిపోయెను. అట్లు చీలిన సేన తమ గుర్తింపునకై పెద్దగా నరచుచుండగా నాధ్వనులు, నర్మదాశాఖల చప్పుడుల వంటివై, వింధ్యపర్వత గుహాముఖములను ప్రతిధ్వనింపజేసెనని భావము. అలంకారము: ఉపమ.

శ్లో. స ధాతుభేదారుణయాననేమిః ప్రభుః ప్రయాణధ్వని
మిశ్రతూర్యః,
వ్యలంఘయ ద్వింధ్య ముపాయనాని పశ్యన్ పులిందై
రుపపాదితాని. 32

వ్యాఖ్య : ధాతుభేదారుణయాననేమిః-గైరికాదిధాతువులచేత నెఱ్ఱబడిన రథచక్రములయంచులు (కమ్ములు) గలవాడును, ప్రయాణధ్వని మిశ్రతూర్యః-ప్రయాణధ్వని-ప్రయాణమునందలి రథధ్వని, గజఘీంకార, అశ్వహేషాదులతో, మిశ్ర-కలిసిన, తూర్యః-మంగళవాద్యధ్వనులుగల, సః, ప్రభుః-ఆ కుశుడు, పులిందైః-ఆటవికులచేత, ఉపపాదితాని-సమర్పింపబడిన, ఉపాయనాని-కానుకలను, పశ్యన్-చూచుచు, వింధ్యం-వింధ్యపర్వతమును, వ్యలంఘయత్-దాటెను. వింధ్య పర్వతమునందలి రంగు రంగుల ధాతువులు రథచక్రధారల కంటుకొనుచుండగా, సైన్యధ్వనులు, మంగళఘోషలు ఏకీభవింపగా, నేగుచున్న కుశుడచ్చటి పులిందులు తెచ్చిన కానుకలు చూచుచు ససైన్యముగా వింధ్యను దాటెను. కానుకలు చూచుట రాజతీవి, వానిని వెంటనే పరిజనులు తీసికొనిలయుంచుట యాచారము.

శ్లో. తీర్థే తదీయే గజసేతుబంధాత్ ప్రతీపగా ముత్తరతో
ఽస్య గంగామ్,
అయత్నవాలవ్యజనీబభూవు ర్హంసా నభోలంఘనలోల
పక్షాః. 33

వ్యాఖ్య : తదీయే-ఆ వింధ్యకు సంబంధించిన, తీర్థే-గంగలోని దిగు మార్గమునందు, గజసేతుబంధాత్-ఏనుగుల వంతెనకట్టుటవలన, ప్రతీపగాం-పశ్చిమవాహినియగు, గంగాం-గంగానదిని, ఉత్తరతః-దాటుచున్న, అస్య-ఆ కుశునికి, నభోలంఘనలోలపక్షాః-ఆకాశమునకెగురుటచేత గదలుచున్న రెక్కలుగల,

హంసాః-హంసలు, అయత్నవాలవ్యజనీబభూవుః-ప్రయత్నములేక లభించిన వింజామరము లయ్యేను. వింధ్యనుండి గంగలోనికి దిగు మార్గమునుండి గంగ యవతలి యొడ్డువఱకు వంతెనగా నిల్పిన గజములపైనుండి పశ్చిమవాహినిగా ప్రవహించుచున్న గంగానదిని దాటుచున్న కుశ మహారాజునకు పైభాగమున తొక్కలాడించుచు దిరుగునట్టి హంసలు అయత్నలబ్ధములైన వింజామరములుగా ప్రకాశించుచుండెననియు నరణ్యమారమున సెలమతని రాచఱికమునకు లోపము లేకుండెనని యు భావము.

శ్లో. స పూర్వ్వజానాం కపిలేన రోషాత్ భస్మావశేషీకృత
విగ్రహాణామ్,
సురాలయప్రాప్తి నిమిత్త మంభ స్త్రైస్రోతసం
నౌలులితం వవందే. 34

వ్యాఖ్య : సః-కుశుడు కపిలేన-కపిలమహాముని చేత, రోషాత్-తన నవమానించిరను కోపమువలన, భస్మావశేషీకృతవిగ్రహాణాం-బూడిదగా మిగుల్చబడ్డ దేహములుగల, పూర్వ్వజానాం-తమ పెద్దలయిన సగరపుత్రులకు, సురాలయప్రాప్తి నిమిత్తం-స్వర్గమును జేరుటకు కారణమైనదియు, నౌలులితం-నావలచేతగదిలింపబడినదియు, త్రైస్రోతసం-గంగాసంబంధమైనదియు నగు, అంభః-జలమును, వవందే-నమస్కరించెను. కపిలకోపాగ్నిచేత దగ్ధులైన సగరచక్రవర్తిపుత్రులు స్వర్గమునుజేరుటకై భగీరథుడు గంగాజలముతో దర్పణ శ్రాద్ధములు చేసి వారికి ముక్తినిగలిగించెను వారు సూర్యవంశీయులగు, కుశుని పెద్దలు. అట్టి పెద్దలకు స్వర్గ హేతువై, నిరంతరనౌకాయానములచేత గదలు జలములుగల గంగకు భక్తితో కుశుడు నమస్కరించెనని భావము. "త్రిస్రోతాః" అనగా స్వర్గ మర్త్య పాతాళ లోకములందు మూడు ప్రవాహములగల గంగ, "త్రిస్రోతసః ఇదం త్రైస్రోతసం" గంగకు సంబంధించినది యని అర్థము.

శ్లో. ఇత్యధ్వనః క్లేశ దవాపభి రంతే కూలం సమాసాద్య
కుశః సరయ్వాః,
వేదిప్రతిష్ఠాన్ వితతాధ్వరాణాం యూపా నపశ్య చ్ఛతశో
రఘూణామ్. 35

వ్యాఖ్య : ఇతి-ఇట్లు, కైశ్చిత్, అహోభిఃకొన్నిరోజులతో (ముగిసిన) అధ్వనఃమార్గముయొక్క, అంతే-అవసానమునందు, కుశఃకుశమహారాజు, సరయ్వాఃసరయూనదియొక్క, కూలం-తీరమును, సమాసాద్య-చేరి, వితతాధ్వరాణాం-ఎన్నియో యజ్ఞములుచేసిన, రఘూణాం-రఘువంశపురాజులయొక్క, వేదిప్రతిష్ఠాఽ-యజ్ఞ వేదికలపై నిలుపఁబడిన, యూపాఽ-పశుబంధన స్తంభములను, శతశఃనూర్లకొలఁదిగా, అపశ్యత్-చూచెను. వెనుకఁజెప్పినరీతిగాఁ గొన్నిరోజుల నడకతో మార్గముచివరగల సరయూనదీతీరమును జేరినకుశుఁడు తనపూర్వులయిన రఘువంశపురాజులు ఎన్నోయజ్ఞములుచేసి నిలిపిన నూర్లకొలఁది యూప స్తంభములను సరయూతీరసమీపమున జూచెనని భావము.

శ్లో. ఆధూయ శాఖాఃకుసుమద్రుమాణాం స్ప్లష్ట్వాచ శీతాన్
సరయూతరంగాఽ,
తం క్లాంతసైన్యం కులరాజధాన్యాఃప్రత్యుజ్జిగా
మోపవనాంతవాయుఃఽ 36

వ్యాఖ్య : కులరాజధాన్యాఃఅయోధ్యయొక్క, ఉపవనాంతవాయుఃఉద్యానవనమారుతము, కుసుమద్రుమాణాం-పూలచెట్లయొక్క, శాఖాఃకొమ్మలను, ఆధూయ-కొంచముకదలించియు, శీతాన్-చల్లని, సరయూతరంగాన్, చ-సరయూనదియలలనుసైతము, స్ప్లష్ట్వా-తాకియు, క్లాంతసైన్యం-అలసినసేనగల, తం-ఆ కుశుని, ప్రత్యుజ్జిగామ-ఎదురుకొనెను. పూలచెట్లకొమ్మలు కొంచము కదలునట్లుగా సరయూతరంగములను దాకుచు,చల్లదనము పరిమళమునుగల అయోధ్యానగరోద్యానవాయువు అలసిన సైనముతో వచ్చిన కుశరాజునకు స్వాగతము చెప్పెను. అనఁగా వారికి హాయిని గలిగించెనని భావము. ప్రత్యుజ్జిగామ (ప్రతి + ఉత్ + జగామ).

శ్లో. అథోపశల్యే రిపుమగ్నశల్య స్తస్యాఃపురఃపౌరసఖఃస రాజా,
కులధ్వజ స్తాని చలధ్వజాని నివేశయామాస బలీ బలాని. 37

వ్యాఖ్య : అథ-అట్లు సేదదీరిన పిమ్మట, రిపుమగ్నశల్యఃశత్రువులయందు నాటుకొన్న శరములు గలవాఁడును (యుద్ధ విజేతయని యర్థము), పౌరసఖఃనగరవాసులకు మిత్రుఁడును, బలీ-బలవంతుఁడును, కులధ్వజఃకులమునకు ధ్వజమువంటివాఁడును, అయిన, సఃరాజా-ఆ కుశుఁడు, తస్యాఃపురఃఅయోధ్యకు, తాని చలధ్వజాని-ఆ ప్రసిద్ధములయిన, బలాని-సేనలను, నివేశయామాస-విడియునట్లు చేసెను.

ప్రజలకు మిత్రుఁడును, కులధ్వజఃవంశమునకు పతాకవంటివాఁడును, బలీ-బల వంతుఁడు నగు, సఃరాజా-ఆకుశుఁడు, చలధ్వజాని-గాలికి రెపరెపలాడుచున్న జెండాలుగల, బలాని-సైన్యములను, తస్యాఃపురఃఅయోధ్యానగరముయొక్క, ఉపశల్యే-గ్రామాంతమునందు, నివేశయామాస-విడిదిచేయించెను. మహాపరాక్రమ పంతుఁడు, కులదీపము, ప్రజాబంధువు నగు కుశుఁడు సేదదీరి రెపరెపలాడు జెండాలతో గంభీరముగానున్న తన సైన్యమును అయోధ్యానగరముయొక్క వెలుపల నివసింపజేసెను. "గ్రామాంత ముపశల్యం స్యాత్" అని యమరము. "శల్యం శంకౌ శరే వంశే" అనివిశ్వనిఘంటువు. పాతనగరము ప్రవేశయోగ్యముగా లేనందున నట్లు చేసెనని భావము.

శ్లో. తాం శిల్పిసంఘాఃప్రభుణా నియుక్తా స్తథాగతాం
సంభృత సాధనత్వాత్,
పురం నవీచక్రు రపాం విసర్గాత్ మేఘా నిదాఘుగ్లపితా
మివోర్వీమ్. 38

వ్యాఖ్య : ప్రభుణా-రాజైన కుశునిచేత, నియుక్తాఃనియోగింపఁబడిన, శిల్పి సంఘాఃశిల్పుల సమూహములు,సంభృతసాధనత్వాత్-సమృద్ధిగా జేర్చినపరికరములు గలవారగుటవలన, తథాగతాం-ఆట్లు శూన్యమైయుండిన,పురం-అయోధ్యను,మేఘాఃమేఘములు, అపాం, విసర్గాత్-జలములు కురియుటవలన, నిదాఘుగ్లపితాం-గ్రీష్మ తప్తయైన, ఉర్వీం,ఇవ-భూమినిపలె, నవీచక్రుఃక్రొత్తదానినిగాఁజేసిరి. సమృద్ధిగాఁ జేర్చిన పరికరములుండుటచేత శిల్పులు, వడ్రంగులు మొదలగువారు పాడువడి యున్న అయోధ్యానగరమును, ఎండకాలమున బీటలువారియున్న నేలను మేఘములు వర్షపాతముచేతవలె, శిథిలములు చక్కఁబరచి క్రొత్తపట్టణముగాఁ జేసిరి. అనగా నివాసయోగ్యముగాఁ జేసిరని భావము.

శ్లో. తతఃసపర్యాం సపశూపహారాం పురఃపరార్ధ్యప్రతిమా
గృహీతాఃయాఃస్తువిధానవిద్భి ర్నిర్వర్తయామాస
ఉపోషితై ర్వాస్తువిధానవిద్భి ర్నిర్వర్తయామాస
రఘుప్రవీరఃరఘుప్రవీరః. 39

వ్యాఖ్య : తతః-తరువాత, రఘుప్రవీరః-కుశుఁడు, పరార్థ్యప్రతిమా గృహాయాఃకు—పరార్థ్య-మిక్కిలివెలగలిగి ప్రశస్తములైన, ప్రతిమాగృహాయాః-దేవతామందిరములును, రామదశరథాది శిల్పములునుగల, పురః-నూతననగరమునకు, ఉషోషితైఃకు-ఉపవాసము చేసిన, వాస్తువిధాన విద్భిఃకు-వాస్తుశాస్త్ర విధానములెఱిఁగిన వారిచేత, సపశూపహారాం-పశుబలులతోఁగూడిన, సపర్యాం-పూజను, నిర్వర్తయామాస-జరిపించెను. దేవాలయములతోను, నూతన గృహములతోను నిర్మింపఁబడిన అయోధ్యానగరమునకు వాస్తువిధానము నెఱిఁగిన శిల్పులు పురోహితులు మొదలగువారిచేత పశుబలియుక్తమైన నగరప్రవేశ శాంతిపూజాదులను కుశుఁడు జరిపించెనని భావము. భాసుని ప్రతిమా నాటకమును గాఁదాసెఱిఁగి యుండెను గాన నిచ్చటిప్రతిమా శబ్దమునకు రఘుదిలీపాదుల, విగ్రహములును అర్థము కావచ్చునని ఊహింపఁబడినది.

శ్లో. తస్యాఃస రాజోపపదం నిశాంతం కామీవ కాంతా
హృదయం ప్రవిశ్య,
యథార్హ మన్యే రనుజీవిలోకం సంభావయామాస
యథాప్రధానమ్. 40

వ్యాఖ్య : సఃకు-కుశుఁడు, తస్యాఃకు-ఆనగరమునకు (సంబంధించిన) రాజోపపదం-"రాజ"అనుపదము మొదటగల, నిశాంతం-భవనమును (రాజభవనమునని యర్థము) కామీ-కాముకుఁడు, కాంతాహృదయం, ఇవ-ప్రియురాలి హృదయమును వలె, ప్రవిశ్య-ప్రవేశించి, అన్యైఃకు-ఇతరభవనములచేత, అనుజీవిలోకం-తన ననుసరించి జీవించు మంత్రులు మొదలగువారిని, యథాప్రధానం-మాన్యత్వానుసారముగా యథార్హం-వారికి తగినరీతిగా, సంభావయామాస-గౌరవించెను. ఆనగరముయొక్క రాజభవనమునందు తాను మక్కువతోఁబ్రవేశించి, అమాత్యులు మొదలగు అనుజీవివర్గమును వారియుద్యోగములకుఁదగిన గృహములచేత సత్కరించెను. "కామీవ కాంతాహృదయం ప్రవిశ్య" అనునది, అయోధ్యానగరాధి దేవతకును కుశునికిని గల పరస్పరానురాగమును దెలుపుచున్నది. "రాజోపపదం" రాజశబ్దము ముందున్న పద మని "రాజభవన"మని గ్రహింపవలెను.

శ్లో. సా మందురాసంక్రయిభి స్తురంగైఃకు శాలావిధి స్తంభగతైశ్చ
నాగైఃకు,

పూ రాబభాసే విపణిస్థపణ్యా సర్వాంగనద్ధా భరణేవ
నారీ. 41

వ్యాఖ్య : విపణిస్థపణ్యా-విపణి వీధియందుంచబడిన సమస్త క్రయ విక్రయార్హ వస్తువులుగలదియగు,సా,పూ:-ఆయయోధ్యానగరము,మందురాసంశ్రయిభి:-అశ్వశాలయం దుండుస్వభావముగల, తురంగై:-గుఱ్ఱములచేతను, శాలావిధి స్తంభగతై:-గజశాలలయందుంచిన స్తంభములకు గట్టుబడిన, నాగైశ్చ-ఏనుగులచేతను, సర్వాంగనద్ధాభరణా-సర్వావయవములందును అలంకరింపబడిన భూషణములుగల, నారీవ-స్త్రీవలె, ఆబభాసే-ప్రకాశించెను. అంగడిపీఠిలోనమర్చిన ధాన్యములు, రత్నములు మొదలగు క్రయవిక్రయార్హ వస్తువులచేతను, గుఱ్ఱపుశాలలలోనున్న గుఱ్ఱములచేతను, గజశాలలలో స్తంభములవద్ద నిలిచిన యేనుగులచేతను గూడియున్న అయోధ్యాపురి, సర్వాభరణ భూషితయగు స్త్రీవలె మిక్కిలి రాణించెనని భావము. "విపణిః పణ్యవీధికా" వాజిశాలాతు మందురా" అనియు నమరము.

శ్లో. వసన్ స తస్యాం వసతౌ రఘూణాం పురాణశోభా
మధిరోపితాయామ్,
న మైథిలేయః స్పృహయాంబభూవ భర్త్రేదివో
నాప్యలకేశ్వరాయ. 42

వ్యాఖ్య : సః,మైథిలేయ:-సీతాకుమారుడగు నాకుశుడు, పురాణశోభాం-పూర్వపుటందమును, అధిరోపితాయాం-పొందించబడినట్టి. తస్యాం, రఘూణాం, వసతౌ-రఘువంశపురాజుల నివాసమగు నా అయోధ్యానగరమునందు, వసన్-నివసించుచున్నవాడై, దివ:-స్వర్గమునకు, భర్త్రే-అధిపతియగు నింద్రునిగాని, అలకేశ్వరాయ, అపి-అలకానాథుడగు కుబేరునిగాని , నస్పృహయాంబభూవ-లెక్కింపలేదు. అట్లు పూర్వశోభను బొందిన అయోధ్యయందు నివాసమును జేయుచున్న కుశరాజు స్వర్గాధిపతియగు నింద్రుని, అలకాధిపతియగు కుబేరుని లెక్కచేయలేదు. అనగా స్వర్గముకంటెను, అలకానగరముకంటెను, అయోధ్య సుందరముగా తీర్చిదిద్దబడినదని భావము. ఇచ్చట "భర్త్రే, అలకేశ్వరాయ"అను చతుర్థివిభక్త్యంతములు స్పృహయాంబభూవ అను క్రియతో సంబంధించియున్నందున "స్పృహేరీప్సితః" అను సూత్రముచేత సంప్రదానత్వమును, చతుర్థిని

బొందినవి. అర్థబోధ సౌకర్యముకొఱకు "ఇంద్రునిఁగాని, కుబేరునిఁగాని" అని వ్రాయఁబడినవి.

కుశునికి కుముద్వతీలాభము

శ్లో. అథాస్య రత్నగ్రథితో త్తరీయ మేకాంతపాండు
స్తనలంబిహారమ్,
నిశ్వాసహార్యాంశుక మాజగామ ఘర్మ్మః ప్రియా వేష
మివోపదేష్టుమ్. 43

వ్యాఖ్య : అథ-ఆతరువాత, అస్య-కుశునికి, రత్నగ్రథితో త్తరీయం-ముత్యములచేత గూర్చబడిన యుపవస్త్రముగలదియు, ఏకాంతపాండు స్తన లంబిహారం-ఏకాంతపాండు-మిక్కిలితెల్లగానున్న, స్తన-స్తనములమీద, లంబిహారం-వ్రేలాడు ముత్యాలహారములు గలిగినట్టియు, నిశ్వాసహార్యాంశుకం—నిశ్వాసహార్య-నిశ్వాసవాయువులచేత దొలగించుటకువీలగు, అంశుకం-వస్త్రములుగలదియు నగు, ప్రియావేషం-ప్రియురాలివేషమును, ఉపదేష్టుం, ఇవ-ఉపదేశించుటకు వలె, ఘర్మ్మః-గ్రీష్మఋతువు, ఆజగామ-వచ్చెను. ఇక నీప్రియురాలిని ముత్యాల అంచులుకుట్టిన యుపవస్త్రమును ధరింపజేయుము; తెల్లని స్తనములపై వ్రేలాడు నట్లు ముత్తెపుసరులను ధరింపుమనుము, నీ నిట్టూర్పువాయువులకు దొలఁగిపోవు పలుచని వస్త్రములు కట్టుకొనునట్లుచేయుము, అట్లు ప్రియావేషమును మార్చినగాని నీకు చల్లదనము సుఖము లభింపవు అని ఉపదేశించుటకువలె గ్రీష్మఋతువు వచ్చెను. గ్రీష్మకాలమున నాయిక యిట్టివేషమును ధరించినగాని నాయకునికి సుఖముఁగూర్ఁజాలదని భావము.

శ్లో. అగస్త్యచిహ్నా దయనా త్సమీపం దిగు త్తరా భాస్వతి
సంనివృ త్తే,
ఆనందశీతా మివ బాష్పవృష్టిం హిమస్రుతిం
హైమవతీం ససర్జ. 44

వ్యాఖ్య : అగస్త్యచిహ్నాత్-అగస్త్యనక్షత్రోదయము గుర్తుగానున్న, అయనాత్-దక్షిణాయనమార్గమునుండి, భాస్వతి-సూర్యుఁడు, సమీపం-తనసమీప

మును, సంనివృత్తే (సతి)-చేరినవాఁడుకాగానే, ఉత్తరా, దిక్-ఉత్తరదిక్కు, ఆనందశీతాం-సంతోషమున చల్లబడిన, బాష్పవృష్టిం, ఇవ-కన్నీటిధారనువలె, హైమవతీం-హిమవత్పర్వత సంబంధమగు, హిమ్రసుతిం-మంచుప్రవాహమును, ససర్జ-సృజించెను. అగస్త్యనక్షత్ర సంబంధముగల దక్షిణాయనమును ముగించుకొని సూర్యుఁడు త్తరదిక్కున, ప్రయాణముసలుపువలకు ఇంచుమించుగా గ్రీష్మ మారంభమగును. అట్లు వియోగమును ముగించి తనవద్దికిఁజేరిన సూర్యుని జూచిన ఉత్తరదిక్కు, ప్రోషితభర్తృకయగునాయిక ప్రియసమాగమమువలనఁ బొందు నానందమును బొందుచు ఆనందబాష్పవృష్టినివలె, హిమవత్పర్వతసంబంధమగు మంచుటేఱులను సృజించె ననిభావము. గ్రీష్మమున మంచుకరగుట సహజముకదా! **అలంకారము: సమాసోక్తి.**

శ్లో. ప్రవృద్ధతాపో దివసోఽతిమాత్ర మత్యర్థ మేవ
ఋణదాచ తన్వీ,
ఉభౌ విరోధక్రియయా విభిన్నౌ జాయాపతీ
సానుశయా వివాస్తామ్. 45

వ్యాఖ్య : అతిమాత్రం–మిక్కిలి ఎక్కువగా, ప్రవృద్ధతాపః-వృద్ధిచెందిన యెండ వేడిమిగల, దివసః-పగలును, అత్యర్థమేవ-అంతయెక్కువగానే, తన్వీ-కృశించిన (కుఱచదియైన), క్షణదా, చ-రాత్రియును, ఉభౌ-ఇద్దఱును, విరోధ క్రియయా-(ఒకరికిష్టముగాని పనిని మరియొకరు చేయుటవంటి) ప్రణయకలహాది విరోధాచరణముచేత, విభిన్నౌ-వేరుపడినవారై, సానుశయౌ-పశ్చాత్తాపముగల, జాయాపతీ, ఇవ-దంపతులవలె, ఆస్తాం-ఉండినవి. గ్రీష్మమున దీర్ఘమై వేడి ఎక్కువగానుండిన పగటివేళయు, మిక్కిలి కుఱుచయైన రాత్రివేళయు నుండుట సహజము. దివస శబ్దము పుంలింగ మగుటయు, "క్షణదా" (రాత్రి) స్త్రీలింగ మగుటయుఁ గారణముగా వానిని భార్యాభర్తలుగాఁబోల్చి, ఆజాయాపతులు కల హించుకొని, వేరుపడి, ఒకరికైయొకరు తాపముఁజెందుటయు, కృశించుటయు జరుగుచున్నట్లు వర్ణించెను. దీర్ఘమైన దివసము తాపముతో రాత్రియెప్పుడువచ్చునా? యనియు, రాత్రి దివసాగమమునకై కృశించుటయు సమాన ధర్మములు. అలం కారము : ఉపమ.

శ్లో. దినేదినే శైవలవం త్యధస్తాత్ సోపానపర్వాణి విముంచ
దంభః,
ఉద్దండపద్మం గృహదీర్ఘికాణాం నారీనితంబద్వ్యయసం
బభూవ. 46

వ్యాఖ్య : దినేదినే-దినదినమునందును, శైవలవంతి-నాచుకలవియగుచు, అథస్తాత్-క్రిందక్రిందగానున్న, సోపానపర్వాణి-మెట్లవరుసలను, విముంచత్-విడుచుచున్నదియు, ఉద్దండపద్మం-పైకివచ్చినకాడలుగల కమలములు గలదియు నగు, గృహదీర్ఘికాణాం, అంభః-ఇండ్లయందలి దిగుడుబావులయొక్క నీరు, నారీ నితంబద్వ్యయసం-స్త్రీల నితంబములనుండకువచ్చు లోతుగల, బభూవ-ఆయినది. గృహదీర్ఘికలలోని నీరు, దినదినము క్రిందక్రింద నాచుతోగూడిన మెట్లను విడుచుచు, స్త్రీలు దిగినచో వారినితంబములంతవఱకు వచ్చు లోతుగలదియై వారికి జలవిహార యోగ్యముగా మారిన దసి భావము. "ఉపమానేద్వ్యయసచ్" ఇత్యాది సూత్రమువలన ఊరుద్వ్యయసం, వలెనే నితంబద్వ్యయసం" సిద్ధించినది. ఊరువుల లోతు, నితంబములోతు అని యర్థము.

శ్లో. వనేషు సాయంతన మల్లికానాం విజృంభణోద్గంధిషు
కుట్మలేషు,
ప్రత్యేకనిక్షిప్తపదః సశబ్దం సంఖ్యామివైషాం భ్రమర
శ్చకార. 47

వ్యాఖ్య : వనేషు-ఉద్యానవనములయందు, విజృంభణోద్గంధిషు-వికసించుచు సౌరభము నెగజల్లునవియగు, సాయంతనమల్లికానాం, కుట్మలేషు-సాయంకాలపు మల్లెలయొక్క మొగ్గలయందు, సశబ్దం-ఝుంకారముతోగూడునట్లు, ప్రత్యేకనిక్షిప్త పదః-ఒక్కొక్కదానియందు ఉంచబడిన పాదములుగల, భ్రమరః-తుమ్మెద, ఏషాం-ఆ మొగ్గలయొక్క, సంఖ్యాం-గణనమును, చకార, ఇవ-చేసియున్నట్లున్నది. పూదోటలయందు వికసించునప్పుడు పరిమళముల నెగజల్లుచున్న సాయంకాలపు మల్లెమొగ్గలయందు (బొండుమల్లెలు) ఒక్కొక్కదానియందుఝుంకార యుక్తముగా మకరందపానముకొఱకు గాఢోన్మత్తమైయున్న భ్రమరము ఆ మొగ్గ

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

లెన్నియున్నవో లెక్కించునట్లు తిరుగుచున్నదని భావము. గ్రీష్మఋతుసాయంకాల మంతమనోహరముగా నుండినదని తాత్పర్యము. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. స్వేదానువిద్ధార్ద్రనఖక్షతాంకే భూయిష్ఠసందష్టశిఖం కపోలే
చ్యుతం న కర్ణాదపి కామినీనాం శిరీషపుష్పం
సహసా పపాత. 48

వ్యాఖ్య: స్వేదానువిద్ధార్ద్రనఖక్షతాంకే—స్వేదానువిద్ధ-చెమటతో గలిసిన, ఆర్ద్రనఖక్షత- కొత్తగోరుగిచ్చులు, అంకే-గుర్తులుగానుండిన, కామినీనాం,కపోలే-స్త్రీలయొక్క చెంపలయందు (జాత్యేకవనచము), భూయిష్ఠసందష్టశిఖం-ఎక్కువగా విడిపోయిన కేసరములుగల, శిరీషపుష్పం-దిరిసెనపువ్వు, కర్ణాత్-చెవినుండి, చ్యుతం, అపి-జారినదైనను, సహసా-వెంటనే, నపపాత-క్రిందపడలేదు. కామినుల చెంపలపై అప్పుడే యేర్పడిన నఖక్షతములలో రతిశ్రమ, ఘర్మతాపాదులవలని చెమట కూడ కలియుటచేత, శయనసమ్మర్దమునందు విడిపోయిన కేసరములుగల శిరీషపుష్పము, చెంపలపై గొంచముగా నతుకుకొనియుండుటవలన చెవిసందునుండి జారినప్పటికిని త్వరగా క్రిందబడలేదు. గ్రీష్మమున శిరీషములుపూయుట, వాటిని స్త్రీలు కర్ణావతంసములుగా ధరించుట యాచారము.

శ్లో. యంత్రప్రవాహైః శిశిరైః పరీతాన్ రసేన ధౌతాన్
మలయోద్భవస్య,
శిలావిశేషా నధిశయ్య నిన్యుః ధారాగృహేషూతపమృద్ధిమంతః 49

వ్యాఖ్య:ఋద్ధిమంతః-ధనికులు, ధారాగృహేషు-యంత్రధారాగృహములయందు శిశిరైః-చల్లనివియగు, యంత్రప్రవాహైః-యంత్రములద్వారా వచ్చుజలధారలచేత, పరీతాన్-కూడినవియు, మలయోద్భవస్య, రసేన-చందనముయొక్క ఉదకముచేత, ధౌతాన్-కడుగబడినవియునగు, శిలావిశేషాన్-మణిమయములగు ఆతికట్టడము లను,అధిశయ్య-ఎక్కిపండుకొని, ఆతపం-ఎండవేడిమిని, నిన్యుః-తొలగించుకొనిరి. ధనికులు మణినిర్మితములైన యరుగులను శ్రీగంధోదకముతో గడిగించి, వాటిపై చల్లని యంత్రజలధారలు పడునట్లుచేసి, ఆచ్చట శయనించి యెండవలన గలిగిన తాపమును దొలగించుకొనుచుండిరట.

శ్లో. స్నానార్ద్రముక్తే ష్వనుధూపవాసం విన్యస్తసాయంతన
మల్లి కేషు,
కామో వసంతాత్యయమందవీర్యః కేశేషు లేభే బల
మంగనానామ్. 50

వ్యాఖ్య : వసంతాత్యయమందవీర్యః—వసంతాత్యయ-తనకు సహకారి యగు వసంతుఁడు వెళ్ళిపోవుటచేత, మందవీర్యః-తగ్గినశౌర్యముగల, కామః-మన్మథుఁడు, స్నానార్ద్రముక్తేషు-స్నానముచేత దడిసినవగుటవలన జాఱవిడువఁబడినవియు, అనుధూపవాసం-సుగంధపుఁబొగ వేసిన వెంటనే, విన్యస్తసాయంతన మల్లికేషు-ఉంచఁబడిన సాయంకాలపు మల్లెపూవులు గలవియునగు, అంగనానాం, కేశేషు-స్త్రీలయొక్క శిరోజలములయందు, బలం-బలమును, లేభే-పొందెను. మిత్రుఁడు, వసంతుడు వెళ్ళిపోవుటచేత బలహీనుఁడైయున్న మన్మథుఁడు, సాయంకాల స్నానముచేతఁదడిసి, ధూపముకొరకై జారవిడువఁబడినవియై, పొగవేసిన వెంటనే బొండుమల్లెల దండ లమర్చిన స్త్రీలకేశపాశములయందు మరల బలమును జేకూర్చుకొనెను. అనఁగా స్త్రీల యాకేశపాశములు మన్మథోద్దీపకములుగా నుండెనని యు, పురుషులకు శృంగార భావమును గలిగించెననియు భావము.

శ్లో. ఆపింజరా బద్ధరజఃకణత్వాత్ మంజర్యుదారా
ఋజుభేఽర్జునస్య,
దగ్ధ్వాపి దేహం గిరిశేన రోషాత్ ఖండీకృతా జ్యేవ
మనోభవస్య. 51

వ్యాఖ్య : బద్ధరజఃకణత్వాత్-వ్యాపించిన పుప్పొడితేనువులు గలదగుట చేత, ఆపింజరా-తెలుపుపసుపును గలిసిన రంగు గలదియు, ఉదారా-పొడవుగా నున్నదియు నగు, అర్జునస్య, మంజరీ-మద్దిపూలగుత్తి, దేహం - శరీరమును, దగ్ధ్వా, అపి-కాల్చియుఁగూడ, రోషాత్-శమించనికోపమువలన, గిరిశేన-శివునిచేత, ఖండీకృతా-త్రుంచఁబడిన, మనోభవస్య-మన్మథునియొక్క-జ్యేవ (జ్యా + ఇవ)-మౌర్వివలె, ఋజుభే-ప్రకాశించెను. పుప్పొడితేనువులురాలుచున్న మద్దిపూలగుత్తి,మన్మథునిదహించియును కోపముచల్లారక శివుఁడు అతని ధనుస్సున

కున్న అల్లెత్రాటినిఁ దెంపినట్లు గనఁబడుచుండె నని భావము. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. మనోజ్ఞగంధం సహకారభంగం పురాణశీధుం నవపాటలం చ,
సంబధ్నతా కామిజనేషు దోషాః సర్వే నిదాఘావధినా ప్రమృష్టాః. 52

వ్యాఖ్య : మనోజ్ఞగంధం-ఇంపైన వాసనలుగల, సహకారభంగం-మామిడి చిగురు ముక్కను (అంతట జాత్యేకవచనము), పురాణశీధుం-పులియబెట్టఁబడిన చెఱకుమద్యమును, నవపాటలం, చ-క్రొత్త కలిగొట్టుపువ్వును, సంబధ్నతా-సమకూర్చుచున్న, నిదాఘావధినా-గ్రీష్మకాలముచేత, కామిజనేషు-కామినీకాముకులయందలి, సర్వే, దోషాః-తాపాదులగు దోషములన్నియు, ప్రమృష్టాః-తుడిచివేయఁబడినవి. మనోహరములగు పరిమళములు గల తియ్యమామిడిచిగుళ్ళ ముక్కలు, చక్కగా భావనచేయఁబడిన చెఱకురసపుమద్యము, క్రొత్తగాపూచిన కలిగొట్టు పూవులు సంతరించిన గ్రీష్మవేళలచేత కాములకును కామినులకును గలుగుచుండిన నిదాఘతాప విరహవేదనాది బాధలన్నియుఁ దుడిచివేయఁబడి వారి కపరిమిత సౌఖ్యమును గలిగించుచుండినవని భావము. "శేరతే అనేన ఇతి శీధుః" అను వ్యుత్పత్తితో "శీఙ్-స్వప్నే" ధాతువునకు "ధుక్" ప్రత్యయముచేరఁగా నేర్పడిన శబ్దము "శీధుః" అని తెలియవలెను

శ్లో. జనస్య తస్మిన్ సమయే విగాఢే బభూవతు ర్ద్వౌ సవిశేష
కాంతౌ,
తాపాపనోదక్షమపాదసేవౌ స చోదయస్థౌ నృపతిః
శశీ చ. 53

వ్యాఖ్య : తస్మిన్, సమయే-ఆగ్రీష్మకాలము, విగాఢే (సతి)-కఠినమైనదిగానుండగా, జనస్య-జనమునకు, ద్వౌ-ఇద్దరే, సవిశేషకాంతౌ-మిక్కిలియిష్టమైనవారు, బభూవతుః-ఆయియుండిరి. తాపాపనోదక్షమపాదసేవౌ—తాపాపనోద-తాపమునుదొలఁగించుటయందు, క్షమ-సమర్థమైయున్న, పాదసేవౌ-పాదసేవనముగలవారై (కుశుని పక్షమున రాజసేవయు, చంద్రుని పక్షమున

కిరణకాంతి నను భవించుటయు నర్థము), ఉదయస్థౌ-అభ్యుదయము నందున్న, స, చ, నృపతిః–ఆ రాజున్ను, శశీ, చ-చంద్రుఁడు ను, అతికఠినమైయున్న ఆ గ్రీష్మకాలమున ప్రజలకు మిక్కిలి యిష్టులై యాశ్రయింపఁదగినవారు కుశుఁడు, చంద్రుఁడును మాత్రమే అయియుండిరి. అనఁగా నుదయించుచున్న చంద్రుని కిరణముల నాశ్రయించి చల్లఁదనమును, అభ్యుదయమును బొందిన కుశుని సేవించి జీవనమున కవసరమగు ధాన్యములను, చలిపందిరులు మొదలగు సౌకర్యములను బొందుచుండిరని భావము.

శ్లో. అథోర్మిలోలోన్మదరాజహంసే రోధోలతాపుష్పవహే
సరయ్వాః
విహర్తు మిచ్ఛా వనితాసఖస్య తస్యాంభసి గ్రీష్మసుఖే
బభూవ. 54

వ్యాఖ్య : అథ-తరువాత, ఊర్మిలోలోన్మదరాజహంసే—ఊర్మి-తరంగ ములయందు, లోల-అభిలాషగల, ఉన్మదరాజహంసే-మదించిన రాజహంసలు గలదియు, రోధోలతాపుష్పవహే—రోధః-ఒడ్డునందలి, లతాపుష్ప-తీగలపూలను, వహే-చేర్చునదియు, గ్రీష్మసుఖే-గ్రీష్మఋతువునందు సుఖమునిచ్చునదియునగు, సరయ్వాః, అంభసి-సరయూనదియొక్క జలమునందు, తస్య-ఆ కుశునికి, వనితా సఖస్య-స్త్రీలతోసహ, విహర్తుం-విహరించుటకు, ఇచ్ఛా-కోరిక, బభూవ-కలిగెను. ఆ తరువాత తరంగములందు చెలరేగి తిరుగు రాజహంసలతోను, ఒడ్డునరాలి లోపల ప్రవేశించిన పువ్వులతోను, వేసవిలో అనందమునుగూర్చు సరయూ జలమునందు సఖీసమేతుఁడై విహరించుటకు కుశునికిఁ గోరికకల్గెనని భావము. "లోల శ్చల సతృష్ణయోఃʼʼ అని అమరము.

శ్లో. స తీరభూమౌ విహితోపకార్యా మానాయిభి స్తా
మపకృష్టనక్రామ్,
విగాహితుం శ్రీమహిమానురూపం ప్రచక్రమే
చక్రధరప్రభావః. 55

వ్యాఖ్య : చక్రధరప్రభావఃవిష్ణుతేజస్సుగల, సఃఆ కుశుఁడు, తీర భూమౌ-ఒడ్డుననున్న భూమియందు, విహితోపకార్యాం-వేయించబడిన పటకుటీరము

(డేరా) గలదియు, ఆనాంబిః-జాలరులచేత, అపకృష్టనక్రాం-తొలగింపబడిన మొసళ్ళుగలదియునగు, తాం-ఆ సరయూనదిని, శ్రీమహిమానురూపం-తన సంపదకును, గొప్పదనమునకును దగినట్లు, విగాహితుం-ప్రవేశించుటకు, ప్రచక్రమే-మొదలిడెను శ్లో. "పరితాపిషు వాసరేషు పశ్యన్-తటలేఖాస్థిత మాప్తసైన్యచక్రమ్, సువిశోధితనక్రమీనజాలం వ్యవగాహేతజలం సుహృత్సమేతః"అను కామందకనీతిసార వచనమువలన ఆగ్రీష్మదినములలో సరయూనదియందలి మొసళ్ళను, చేపలను జాలరుల చేతఒడ్డునవేయించి తన సంపద్వైభవములకు దగినరీతిగా స్త్రీలతోను,మిత్రులతోను గలిసి సరయూజలమునందు విహరించుటకు ప్రారంభించెను.

శ్లో. సా తీరసోపానపథావతారా దన్యోన్యకేయూరవిఘట్టినీభిః,
సనూపురక్షోభపదాభి రాసీ దుద్విగ్నహంసా సరి
దంగనాభిః. 56

వ్యాఖ్య : సా, సరిత్-ఆసరయూనది, తీరసోపానపథావతారాత్-తీర సోపానపథ-ఒడ్డునుండిగల మెట్లప్రోవనుండి, అవతారాత్-దిగుటవలన, అన్యోన్య కేయూరవిఘట్టినీభిః-అన్యోన్య-ఒకరినొకరు, కేయూరవిఘట్టినీభిః-భుజభూషణముల చేత ఒరసికొనుచున్నట్టియు, సనూపురక్షోభపదాభిః-అందెల ఘలంఘలలతో గూడిన పాదములుగల, అంగనాభిః-స్త్రీలచేత. ఉద్విగ్నహంసా-భయపడినహంసలు గలది, ఆసీత్-అయ్యెను. మెట్లపైనుండి నదిలోనికి దిగునప్పుడు ఒకరిభుజములతో మరియొకరి భుజములు రాచుకొన్నందునగలుగుచున్న భూషణధ్వనులతోను, కాళ్ళయందెల ఘల్ఘలారావములతోను, పెక్కుమంది స్త్రీలు సరయూనదిలోనికి వచ్చుచుండుట కారణముగా నచ్చటనున్న హంసలు బెదరిపోయె ననిభావము. అట్లు సరయూనది చూడముచ్చటగా నుండెను.

శ్లో. పరస్పరాభ్యుక్షణతత్పరాణాం తాసాం నృపో
మజ్జనరాగదర్శీ,
నౌ సంశ్రయః పార్శ్వగతాం కిరాతీ ముపాత్తవాలవ్య
జనాం బభాషే. 57

వ్యాఖ్య : నౌ సంశ్రయః-పడవలోనుండియు, పరస్పరాభ్యుక్షణతత్పరాణాం—పరప్పరాభ్యుక్షణ-ఒకరిపైనొకరు నీళ్ళు చల్లుకొనుటయందు, తత్పరాణాం-

ఆసక్తిగల, తాసాం-ఆస్త్రీలయొక్క, మజ్జనరాగదర్శి-నీటమునుగుటయందలి యభి లాషను జూచుచున్న, నృపః-కుశుఁడు, పార్శ్వగతాం-తనప్రక్కననున్నదియు, ఉపాత్తవాలవ్యజనాం-చేతఁబట్టుకొన్న వింజామరముగలదియు, కిరాతీం-కిరాతజాతి స్త్రీయగు చామరగ్రాహిణినిగురించి, బభాషే-పలికెను. ఆజలక్రీడాసమయమున పడవలో నెక్కియుండి, స్త్రీలు నీటిలోమునుగుటను, నొకరిపైనొకరు నీళ్ళు చల్లుకొనుట మొదలగు వినోదమును జూచుచున్న కుశుఁడు తనప్రక్కననుండిన చామరగ్రాహిణితో ముందు చెప్పఁబోవురీతిగాఁ బలికెను. "కిరాతి" యనఁగా చామరగ్రాహిణి మాత్రమేయని కేశవనిఘంటు వర్థము చెప్పినది.

శ్లో. పర్యావరోధైః శతశో మదీయై ర్విగాహ్యమానో
గలితాంగరాగైః,
సంధ్యోదయః సాభ్ర ఇవైష వర్ణం పుష్ణ త్యనేకం
సరయూప్రవాహః. 58

వ్యాఖ్య : గలితాంగరాగైః-రాలిన మైపూతలుగలవారును, శతశః-నూర్లకొలదిగానున్న, మదీయైః-అవరోధైః-నాయంతఃపురస్త్రీలచేత, విగాహ్యమానః-మునకలచేఁ జెదరఁగొట్టబడుచున్న, ఏషః, సరయూప్రవాహః-ఈ సరయూప్రవాహము, సాభ్రః-మేఘముతోఁగూడిన, సంధ్యోదయః, ఇవ-సంధ్యాకాలోదయమువలె, అనేకం-పెక్కువిధములగు, వర్ణం-ఎరుపు, పసుపు మొదలయిన రంగును, పుష్యతి-పోషించుచున్నది, పశ్య-చూడుము. తమ దేహములకుఁ బూసికొన్న గంధము పసుపు మొదలగు మైపూఁతలు రాలునట్లు నూర్లకొలఁదిగానున్న నాయంతఃపురస్త్రీలు మునకలు వేయుటచేత ఈ సరయూప్రవాహము, రక్తపీతాదివర్ణములు గలిగి మేఘముతోఁగూడిన సాయంకాల పుటాకాశమువలె ప్రకాశించుచున్నది చూడు! అని కుశుఁడు చామరగ్రాహిణితో ననెను.

శ్లో. విలుప్త మంతఃపురసుందరీణాం యదంజనం నౌలులితాభి
రద్భిః,
తదబ్ధనీభి ర్మదరాగశోభాం విలోచనేషు ప్రతిముక్త
మాసామ్. 59

వ్యాఖ్య : నౌలులితాభిః-ఓడలచేత జలింపజేయబడిన, అద్భిః-జలముల చేత, అంతఃపురసుందరీణాం-రాణివాసపు స్త్రీలయొక్క, యత్, అంజనం-ఏకాటుక, విలుప్తం-పోగొట్టబడినదో, తత్-దానిని, విలోచనేషు-వారికన్నులయందు, మద రాగశోభాం-మదముచేత గలుగు నెఱ్ఱనికాంతివంటి కాంతిని బధ్నతీభిః-కూర్చుచున్న, అద్భిః-జలములచేత, ఆసాం-ఈస్త్రీలకు, ప్రతిముక్తం-తిరిగి యియ్యబడినది. ఓడల కదలికచేత జలించుచున్న సరయూజలము, రాణివాసపు స్త్రీల కన్నులయందలి కజ్జలమును దుడిచివేసినప్పటికిని, తన స్పర్శచేత నెఱ్ఱబారిన వారి కన్నులయందు మదమువల్లగలుగు నెఱ్ఱనికాంతివంటి కాంతిని గలిగించి, వారి వస్తువునకు మరియొక వస్తువును బదులుగానిచ్చి యప్పు తీర్చుకొన్నట్లున్నది చూడుము! అని కుఱుడు చామరగ్రాహిణితో ననెను. "ప్రతిముక్త" మనగా ప్రత్యర్పితం అని యర్థము.

శ్లో. ఏతా గురుశ్రోణిపయోధరత్వా దాత్మాన ముద్యోధు
మశక్నువత్యః,
గాఢాంగదై ర్బాహుభి రప్సు బాలాః క్లేశోత్తరం
రాగవశాత్ ప్లవంతే. 60

వ్యాఖ్య : గురుశ్రోణిపయోధరత్వాత్--గురు-బరువైన, శ్రోణిపయోధర త్వాత్-పిఱుదులును, స్తనములునుగలదియగుటవలన, ఆత్మానం-శరీరమును, ఉద్యోధుం-మోయుటకు, అశక్నువత్యః-శక్తిచాలని, ఏతాః,బాలాః-ఈ స్త్రీలు, గాఢాంగదైః-గట్టిగా కరచుకొన్న భుజాలంకారములుగల, బాహుభిః-బాహువులచేత, క్లేశోత్తరం-అతికష్టముగా, రాగవశాత్-జలక్రీడయందలి ప్రేమాధిక్యమువలన, ప్లవంతే-ఈదుచున్నారు. ఈ యంగనలు బరువైన పిఱుదులును, స్తనములును గల దేహములను నీటిపైకెత్తలేక భూషణభూషితములైవత్తిడిగల బాహువులనుమాత్రము నీటిపైకి వేయుచు, చాలకష్టపడుచు, జలక్రీడయందలి యౌత్సుక్యముచేత నెట్లో ఈదు చున్నారు చూడుము! అనెను.

శ్లో. అమీ శిరీషప్రసవావతంసాః ప్రభ్రంశినో వారివిహారిణీనామ్,
పారిప్లవాః స్రోతసి నిమ్నగాయాః శైవాలలోలాం
శ్చలయంతి మీనాన్. 61

వ్యాఖ్య : వారివిహారిణీనాం-జలవిహారముచేయుచున్న యీ స్త్రీలయొక్క, ప్రభ్రంశినః-జారిపడినవియు, నిమ్నగాయాః-నదియొక్క, స్రోతసి-ప్రవాహము నందు, పారిప్లవాః-తేలియాడుచున్నవియు నగు, అమీ-ఈ,శిరీష ప్రసవావతంసాః-దిరిసెనపూలనెడు కర్ణభూషలు, శైవాలలోలాన్-నాచుపైనాశగల, మీనాన్-చేపలను, ఛలయంతి-మోసగించుచున్నవి. జలక్రీడఁజాడుచున్న యీ స్త్రీల చెవులనుండి జారి, నదీప్రవాహమునందు తేలియాడుచున్న. యీ దిరిసెనపూలు, నాచుపై మక్కువగల చేపలను మోసగించి యవి నీటిపైకివచ్చి కనపడునట్లు చేయుచున్నవిసుమా! యని కుశుఁడు చామరగాహిణితోఁ బలికెనని భావము.

శ్లో. ఆసాం జలాస్ఫాలనతత్పరాణాం ముక్తాఫలస్పర్ధిషు
శీకరేషు,
పయోధరోత్సర్పిషు శీర్యమాణః సంలక్ష్యతే న
ఛిదురోఽపి హారః 62

వ్యాఖ్య : జలాస్ఫాలనతత్పరాణాం--జలాస్ఫాలన-నీటిని చేతులతోఁగొట్టుట యందు, తత్పరాణాం-ఆసక్తులైయున్న, ఆసాం-ఈ స్త్రీలయొక్క, ముక్తాఫల స్పర్ధిషు-ముత్యములను బోలియున్నట్టియు, పయోధరోత్సర్పిషు-స్తనములపై నెగిరి పడుచున్నవి నగు, శీకరేషు - తుంపురులయందు, శీర్యమాణః-జారుచున్న,హారః-ముత్యాలదండ, ఛిదురః,అపి-తెగియున్నదైనను, నసంలక్ష్యతే-స్త్రీలచేత చూచుకోఁబడుటలేదు.జలక్రీడలయందు అరచేతులతోనీటినిగొట్టుచు(తాళమువేయుచు) మైమరచియున్న యాస్త్రీల సనములమీద ముత్యములంతలావునఁ బడుచున్న నీటిబిందువుల మధ్యన, తమమెడలయందున్న ముత్యాలహారము నీటితాకిడికి జారి తెగిపడిన విషయమునుగూడ వీరు గుర్తింపఁజాలకున్నారు. శీకరములకును ముత్యములకును పోలికయున్నందున వారికి ముత్తెపుసరములు తెగినసంగతియే తెలియుటలేదని భావము.

శ్లో. ఆవర్తశోభా నతనాభికాంతే రభంగో భ్రువాం
ద్వంద్వచరాః స్తనానామ్,
జాతాని రూపావయవోపమానా న్యదూరవర్తిని
విలాసినీనామ్. 63

వ్యాఖ్య : విలాసినీనామ్-ఈవిలాసవతులకు, రూపావయవోపమానాని-తమ చక్కని యవయవములయొక్క ఉపమానము లన్నియు, అదూరవర్తిని-తమ వద్దికి వచ్చినవే. జాతాని-ఆయినవి. ఎట్లనగా, నతనాభికాంతేః-లోతైన బొడ్డుచక్కదనమునకు, ఆవర్తశోభా-సీటి సుడులకాంతియు, భ్రువాం-కనుబొమలకు, భంగాః-తరంగములును (జాత్యేకవచనము), స్తనానాం-చన్నులకు, ద్వంద్వచరాః-జంటలుగాదిరుగు చక్రవాకములును ఉపమానములై యున్నవి. కవివాక్కుల ద్వారా నెచ్చటనో లోకప్రసిద్ధములై యుండునట్టి ఉపమానము లన్నియు నీ విలాసవతుల యవయవములగు ఉపమేయములకు అతసమీపముననుండి, నాభికాంతికి ఆవర్తశోభయు, కనుబొమలకు సరయూతరంగములును, స్తనములకు చక్రవాకముల జంటలును ద్విగుణసౌందర్యమును నెలకొల్పుచున్నవి చూడుము! అనెను.

శ్లో. తీరస్థలీబర్హిభి రుత్కలాపైః ప్రస్నిగ్ధకేకైరభినంద్యమానమ్,
శ్రోత్రేషు సంమూర్ఛతి రక్త మాసాం గీతానుగం
వారిమృదంగవాద్యమ్. 64

వ్యాఖ్య : ఉత్కలాపైః-ఎత్తుకొన్న పించములుగలవియు, ప్రస్నిగ్ధకేకైః-మధురమగు కేకలుగలవియు, తీరస్థలీబర్హిభిః-సరయూతీరమునందుండినవియు నగు నెమళ్ళచేత, అభినంద్యమానాం-ఆనందింపబడుచున్నదియు, రక్తం-శ్రావ్యమైనదియు, గీతానుగం-పాటననుసరించునదియు నగు, ఆసాం-ఈస్త్రీలయొక్క, వారిమృదంగవాద్యం-నీరనెడు మృదంగము యొక్క, వాద్యధ్వని, శ్రోత్రేషు-చెవులయందు, సంమూర్ఛతి - వ్యాపించుచున్నది. ఈ స్త్రీలు గానము చేయుచు, దానికనుకూలముగా నీటినే మృదంగముగా భావించి కొట్టుచున్న వాద్యధ్వని, తీరమునందలి నెమళ్ళు సంతోషపడి, పించము లెత్తుకొని నృత్యము చేయునట్లును, మధురముగా నటించునట్లును జేయుచు, వీరువారి చెవులలో నిండి యానందమును గలిగించుచున్నదని భావము.

శ్లో. సందష్టవస్త్రై ష్వబలానితంబే ష్వింద్రు ప్రకాశాంతరి
తోదుతుల్యాః,
అమీ జలాపూరిత సూత్రమార్గా హారానం భజంతే
రశనాకలాపాః. 65

వ్యాఖ్య : సందష్టవస్త్రేషు-నీటిలోఁదడిసియున్నందున కఱచుకపోయిన వస్త్రములుగల, అబలానితంబేషు-స్త్రీలయొక్క పిఱుదుల పైభాగములందు, ఇందు ప్రకాశాంతరితోడుతుల్యాః—ఇందుప్రకాశ-వెన్నెలచేత, అంతరిత-మరుగుపడిన, ఉడు-నక్షత్రములతో, తుల్యాః-సమానములగు, అమీ-ఈ, జలాపూరిత సూత్ర మార్గాః-నీటితో నింపబడిన సూత్రమార్గములుగల, రశనాకలాపాః-మొలనూలు భూషలు, మౌనం-నిశ్శబ్దతను, భజంతే-పొందుచున్నవి. స్నానార్థి వస్త్రములు గరచుకపోయియున్న స్త్రీల నితంబములమీద వెన్నెలచే మరుగుపడి స్వల్పకాంతిగల నక్షత్రములతో సమానములగు ముత్తెములుగలిగియు, సూత్రమార్గము నీటితో నిండియునున్న యీ మొలనూలు గజ్జెల భూషణము చప్పుడులేక నిశ్శబ్దముగానున్నది సుమా! ఎప్పుడును గల్లుగల్లుమను నీభూషణము జలక్రీడాసమయమున నిట్లు నిశ్శబముగానుండి చూడముచ్చటగా నున్నదని భావము.

శ్లో. ఏతాఃకరోత్పీడితవారిధారా దర్పాత్సఖీభి
ర్వదనేషు సిక్తాః,
వక్త్రేతరాగ్రైరలకైస్తరుణ్య శ్చూర్ణారుణాన్
వారిలవాన్ వమంతి. 66

వ్యాఖ్య : దర్పాత్ - మదమువలన, కరోత్పీడితవారిధారాః-ఇతరస్త్రీలపై చేతులతోనెగజల్లఁబడిన వారిధారలుగలవారును, సఖీభిః-చెలులచేత, వదనేషు-తమ ముఖములపైన, సిక్తాః-ఆప్లే జలధారలు చల్లఁబడినవారును నగు, ఏతాః,తరుణ్యః-ఈయువతులు, వక్త్రేతరాగ్రైఃనీటిలోఁదడిసినందున వంకరలులేని అలకైఃముంగురులచేత, చూర్ణారుణాన్—కుంకుమాదులచేత నెఱ్ఱబడిన, వారిలవాన్-ఉదకబిందువులను, వమంతి—వర్షించుచున్నారు. మదించి యొకరిపైనొకరు చల్లుకొన్న జలధారలవల్ల వంకరుఱు పోయి చక్కగాసాగిన ముంగురులద్వారా యువతులు కుంకుమయుక్తములగు నీటిబొట్టులు గార్చు ముఖములతో నున్నారని భావము.

శ్లో. ఉద్బంధకేశ శ్చ్యుతపత్రలేఖో విశ్లేషిముక్తాఫలపత్రవేష్టః,
మనోజ్ఞ ఏవ ప్రమదాముఖానా మంభోవిహారాకులితోఁపి
వేషః. 67

వ్యాఖ్య : ఉద్బంధకేశః-విడిపోయిన శిరోజములుగలదియు, చ్యుతపత్ర లేఖః-జారిపోయిన మకరికాది పత్రరచనలు గలదియు, విశ్లేషిముక్తాఫలపత్రవేష్టః-పడిపోయిన ముత్యాలతాటంకములు గలదియునై. అంభోవిహారాకులితః, అపి-జల విహారముచేత చెదరిపోయిన దైనప్పటికిని, ప్రమదామఖానాం-ఈ స్త్రీలముఖముల యొక్క, వేషః-నేపథ్యము, మనోజ్ఞః, ఏవ-మనోహరముగానే యున్నదిసుమా! ఈ స్త్రీల ముఖములు, విడిపోయిన శిఖలతోను, చెదరిపోయిన చెంపలపైని పత్ర రచనలతోను, ఊడిపోయిన ముత్యాలకమ్మలతోను, జలవిహారమూలమున చెదరిన వేషములుగలవి యైనప్పటికిని మనోహరములుగానే యున్నవి. చక్కదనముగల వారికి వేషవికారముసైతము క్రొత్తకాంతిని జేకూర్చునుగదా!

శ్లో. స నౌ విమానా దవతీర్య రేమే విలోలహారఃసహతాభి రప్సు,
స్కంధావలగ్నోద్ధృతపద్మినీకః కరేణుభి ర్వన్య ఇవ
ద్విపేంద్రః. 68

వ్యాఖ్య : సః-అట్లు స్త్రీదర్శన చలితమనస్కుడైన కుశుడు, నౌవిమానాత్-విమానమువంటి యోడనుండి, అవతీర్య-దిగి, విలోలహారః(సన్)-చలించుచున్న ముత్యాలహారములు గలవాడగుచు, తాభిః, సహ-ఆస్త్రీలతోగూడ, కరేణుభిః-ఆడ యేనుగులతోగూడ, స్కంధావలగ్నోద్ధృత పద్మినీకః—స్కంధావలగ్న-భుజము లపైదగుచుకొన్న,ఉద్ధృత పద్మినీకః (సన్)-తనచే పెరుకబడిన తామరతీగలుగలది యగుచున్న, వన్యః, ద్విపేంద్రః, ఇవ-వన గజేంద్రమువలె, అప్సు-నీళ్ళయందు, రేమే-క్రీడించెను. వివిధ చేష్టలతో, మధురరూపములతో, జలవిహారము చేయుచున్న సుందరాంగులను జూచుటచే ముగ్ధుడైన కుశుడు విమానమువలె నెత్తుగానుండిన యోడనుండి నీటిలోనికి దిగి, వక్షస్థలమునందున్న ముత్యాలహారములు చెదరు నట్లుగా చెలరేగి యాయువతులతోసహ జలక్రీడ సలిపెను. అది యొకయడవి యేనుగు తామరతీగలతోగూడిన దేహముతో నాడయేనుగులనుగలసి చెలరేగి జల విహారము చేయుచున్నట్లుండెనని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. తతో నృపేణానుగతాః స్త్రియ స్తా బ్రాజిష్ణునా
సాతిశయం విరేజుః,
ప్రాగేవ ముక్తా నయనాభిరామాః ప్రాప్యేంద్రనీలం
కిము తోన్మయూఖమ్. 69

వ్యాఖ్య : తతః-తరువాత, ప్రభాజిష్ణునా-ప్రకాశించునట్టి, నృపేణ-కుశునితో, అనుగతాః-కలుసుకొన్న, తాస్త్రియః-ఆయువతులు, సాతిశయం-పూర్వముకంటెయెక్కువగా, విరేజుః-ప్రకాశించిరి. ప్రాక్,ఏవ-మొదటనే, ముక్తాః-ముత్యములు, నయనాభిరామాః-కన్నులకింపైనట్టివి. ఉన్మయూఖం-కాంతులువెదజల్లునట్టి, ఇంద్రనీలం-ఇంద్రనీలమణిని, ప్రాప్య-పొందినతరువాత, కిముత-ఏమిచెప్పవలెను? స్వయంప్రకాశశీలుడైన కుశునిఁ గలిసికొన్నవారై అయువతులు అత్యంతము విరాజిల్లిరి. ముత్యములు అసలే కన్నులకింపుగా నుండును. అవి కాంతులు విరజిమ్మునట్టి ఇంద్రనీలమణితో గలసియున్నప్పుడు మిక్కిలిమనోహరములుగా నుండునని చెప్పవలెనా? కనుక సుందరాంగులయిన యాస్త్రీలు చక్కనివాడైన కుశునితో గలసి యెంతయో ప్రకాశించిరని భావము.కుశుడు నీలవర్ణుడు.

శ్లో, వర్ణోదకైః కాంచనశృంగముక్తై స్తమాయతాక్ష్యః
ప్రణయా దసించన్,
తథాగతః సో ఽతితరాం బభాసే సధాతునిష్యంద
ఇవాద్రిరాజః. 70

వ్యాఖ్య : తం-కుశుని, ఆయతాక్ష్యః-విశాలనేత్రలగుస్త్రీలు, కాంచనశృంగముక్తైః-బంగరుకొమ్ములచేత చల్లబడిన, వర్ణోదకైః-రంగులనీళ్ళచేత, ప్రణయాత్-ప్రేమవలన, అసించన్-తడిపిరి. తథాగతః-అట్లుండిన, సః-అతడు, సధాతునిష్యందః-గైరికాది ద్రవములుగారుచున్న, అద్రిరాజః,ఇవ-పర్వతరాజమువలె, అతితరాం-మిక్కిలి, బభాసే-ప్రకాశించెను. ఆయువతులు బంగరుకొమ్ములనుండి కుంకుమాదివర్ణములుగల రంగులను ప్రేమాతిశయమువలన కుశునిపైఁజల్లిరి. అట్లు తడిసి శరీరమునుండి రంగులుగారుచున్న కుశుడు గైరికాది ధాతుద్రవములు స్రవించుచున్న యొకపర్వతరాజమువలె మిక్కిలిప్రకాశించెనని భావము. అలంకారము: ఉపమ.

శ్లో. తేనా వరోధప్రమదాసఖేన విగాహమానేన
సరిద్వరాం తామ్,
ఆకాశగంగారతి రప్సరోభి ర్వృతో మరుత్వా
ననుయాతలీలః. 71

వ్యాఖ్య : అవరోధప్రమదాసఖేన-అంతఃపురసుందరీ సహచరుఁడును, తాం, సరిద్వరాం-ఆసరయూనదిని, విగాహమానేన-ఈదుచున్న, తేన-ఆకుశునిచేత, ఆకాశగంగారతిః-ఆకాశగంగయందుఁ గ్రీడించుచున్నవాడును, అప్సరోభిః, వృతః-అప్సరః స్త్రీలచేత చుట్టుకొనఁబడినవాఁడును నగు, మరుత్వాఁ-ఇంద్రుఁడు, అనుయాతలీలః-అనుకరింపఁబడిన విలాసముగల వాఁడయ్యెను. అంతఃపురస్త్రీలతోఁ గలిసి సరయూనదిలో జలక్రీడలు సలుపుచున్న కుశుఁడు, ఆకాశగంగలో నప్సరఃస్త్రీలతోఁగలిసి జలకములాడు నింద్రునిఁ బోలియుండెనని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. యత్ కుంభయోనే రధిగమ్య రామః కుశాయ రాజ్యేన
సమం దిదేశ,
త దస్య జైత్రాభరణం విహర్తు రజ్ఞాతపాతం సలిలే
మమజ్జ. 72

వ్యాఖ్య : యత్-ఏయాభరణమును, రామః-రాముఁడు, కుంభయోనేః-అగస్త్యునినుండి, అధిగమ్య-పొందియుండి, కుశాయ-కుశునికొఱకు, రాజ్యేన, సమం-రాజ్యముతోపాటు, దిదేశ-ఇచ్చెనో, సలిలే-నీటియందు, విహర్తుః-విహరించుచున్న, అస్య-ఈకుశుని యొక్క, తత్-అట్టి, జైత్రాభరణం-జయశీలమైన యాభరణము, అజ్ఞాతపాతం-తెలియకయే పడినదై, మమజ్జ-నీటిలో మునిగెను. తనకు అనుగ్రహపూర్వకముగా అగస్త్యుఁ డిచ్చియుండిన రత్నాభరణమును రాముఁడు, కుశునికి రాజ్యముతోపాటు ఇచ్చియుండెను. అట్టి రాజ్యసమము, జయములనుజేకూర్చునదియు నగు ఆభరణము ఎట్లు పడినదో కుశుఁడు తెలిసికొనుటకు వీలులేకయే జలక్రీడా సమయమున నీటిలో మునిగిపోయెను.

శ్లో. స్నాత్వా యథాకామ మసౌ సదార స్తీరోపకార్యాం
గతమాత్ర ఏవ,
దివ్యేన శూన్యం వలయేన బాహు మపోధనేపథ్య విధి
ర్దదర్శ. 73

వ్యాఖ్య : అసౌ-కుశుఁడు, సదారః-భార్యాసహితుఁడగుచు, యథాకామం-యథేచ్ఛగా, స్నాత్వా-స్నానముచేసి, తీరోపకార్యాం-ఒడ్డునందలి పటకుటీరమును,

గతమాత్రః, ఏవ-చేరినవాఁడైనంతనే, అపోధనేపథ్య విధిః-చేసుకోఁబడని ప్రసాధనము గలవాఁడగుచునే, దివ్యేన, వలయేన-దైవశక్తిగల కంకణముచేత. శూన్యం-శూన్యమైయున్న, బాహుం-తన బాహువును, దదర్శ-చూచెను. భార్యతోను, అంతఃపుర యువతులతోను గలిసి యథేచ్ఛగా జలక్రీడ సలిపిన కుశుఁడు, తీరమున నున్న దేరాలోనికి వెళ్ళగానే, ధరికిఁ వస్త్రములు కట్టుకొనకముందే తన బాహువు నందు దివ్యకంకణము లేకుండుటను జూచెనని భావము.

శ్లో. జయశ్రియం సంవననం యత స్త్ర దాము క్తపూర్వం
గురుణాచ యస్మాత్,
సేహే ఽస్య న భ్రంశ మతో న లోభా త్స తుల్యపుష్పా
భరణో హి ధీరః. 74

వ్యాఖ్య : యతః-ఏకారణమువలన, తత్-ఆయాభరణము, జయశ్రియః-జయలక్ష్మికి, సంవననం-వశీకరణమో, యస్మాత్, చ-ఏకారణమువలననైతే, గురుణా-తండ్రిచేత, ఆము క్తపూర్వం-పూర్వము ధరింపఁబడియుండెనో, అతః-ఈ కారణమువలన, అస్య-దానియొక్క, భ్రంశం-నాశమును, నసేహే-సహింపలేక పోయెను. లోభాత్-పిసినిగొట్టుతనమువలన, న-కాదు, హి-ఎందువల్లననఁగా,ధీరః, సః-పరిస్థితులవలనఁ జిత్తవికారముపొందని యాకుశుఁడు, తుల్యపుష్పాభరణః-పువ్వులతో సమానమైన ఆభరణములు గలవాఁడై యుండెనో! ఆ దివ్యాభరణము శత్రువిజయమునకు వశీకరణక్రియగాను, పూర్వము తనతండ్రిరాముఁడు ధరించినదిగాను ఉన్నందున అది పోయెనే! యని కుశుఁడు బాధపడెనుగాని దాని యందలి లోభముచేతగాదు. ధీరుఁడైన యతనికి సాధారణ సువర్ణాభరణములు పువ్వులతో సమానములు. అనఁగా నిర్మాల్యములయిన పుష్పములనువలెనే బంగారు సొమ్ములనుగూడ లెక్కచేయక పారవేయునట్టివాఁడే యని భావము. "వశీక్రియా సంవననం" అని యమరము.

శ్లో. తతః సమాజ్ఞాపయ దాశు సర్వా నానాయిన స్తద్విచయే
నదీష్ణాన్,
వంధ్యక్రమా స్తే సరయూం విగాహ్య త మూచు
రమ్లానముఖప్రసాదాః. 75

వ్యాఖ్య : తతః-పిమ్మట, నదీష్ణాన్-నదులయందు దిగి వెదకునేర్పుగల. సర్వాన్, ఆనాయినః-జాలరులందఱిని, తద్వీచయే-ఆయాభరణమును వెదకుటయందు, ఆఱు-వెంటనే, సమాజ్ఞాపయత్-ఆజ్ఞాపించెను. తే-ఆజాలరులు,సరయూం-సరయూనదిని, విగాహ్య-విలోడనముచేసి (గాలించి), వంధ్యశ్రమాః-విఫలమైన ప్రయాసగలవారైనను (ఆది యెచ్చటికిఁబోయినదో యెఱిఁగినవారగుటవలన), ఆమ్లానముఖప్రసాదాః-వాడిపోని ముఖకాంతిగలవారగుచు, తం, ఊచుః-అతని నుద్దేశించి పలికిరి. అప్పుడు నదిలోనికి దిగి వెదుకగల పల్లెవాండ్రనందఱిని వెంటనే యాభరణమును వెదకుఁడని ఆజ్ఞాపించెను. ఆ జాలరులు నదిని గాలించి విఫల ప్రయత్నులై నప్పటికిని ఆభరణమున్నచోటు నెఱిఁగినవారు కావునవాడని ముఖములు గలవారై కుఱునితో నిట్లు విన్నవించిరి. "నద్యాం స్నాంతి కౌశలేన ఋతి నదీష్ణాః" అని విగ్రహము.

శ్లో. కృతః ప్రయత్నో నచ దేవ! లబ్ధం మగ్నం పయ
స్యాభరణోత్తమం తే,
నాగేన లౌల్యా త్కుముదేన నూన ముపాత్త
మంతర్హ్రదవాసినా తత్. 76

వ్యాఖ్య : హేదేవ!-ఓప్రభూ, ప్రయత్నః, కృతః-ప్రయత్నము చేయఁబడినది. పయసి-నీటియందు, మగ్నం-మునిగిపోయిన, తే, ఆభరణణోత్తమం-నీయుత్తమాభరణము, న చలబ్ధం-దొరకలేదు, తత్-ఆయాభరణము, అంతర్హ్రదవాసినా-లోపలి మడుగులోనున్న, కుముదేన,నాగేన-కుముదుఁడను పేరుగలసర్పము చేత, లౌల్యాత్-లోభమువలన, ఉపాత్తం, నూనం-తీసికొనఁబడియుండవచ్చును. ప్రభూ! ఎంతో వెదకితిమి, నీటిలోమునిగిన నీ యాభరణము దొరకలేదు, కాని ఆయాభరణమును నదిలోనిమడుగున నివాసముచేయుచున్న కుముదుఁడను సర్పరాజు లోభమువలనఁ దీసికొని యుండవచ్చునని యూహించుచున్నాము. అని జాలరులు చెప్పిరి

శ్లో. తతః స కృత్వా ధను రాతతజ్యం ధమర్థరః
కోపవిలోహితాక్షః,
గారుత్మతం తీరగత స్తరస్వీ భుజంగనాశాయ
సమాదదే ఽస్త్రమ్. 77

వ్యాఖ్య : తతః-ఆప్పుడు, ధనుర్ధరః-విల్లునుబట్టినవాఁడును, కోపవిలోహితాక్షః-కోపముచేత నెఱుపెక్కిన కన్నులుగలవాఁడును, తరస్వీ-బలవంతుఁడును నగు, సః-ఆకుశుఁడు, తీరగతః(సన్)-నదియొడ్డును జేరినవాఁడగుచు, ధనుః-విల్లును, ఆతతజ్యం-ఎక్కు-పెట్టఁబడిన యల్లెత్రాడు కలదానినిగా, కృత్వా-చేసి, భుజంగనాశాయ-సర్పవినాశముకొఱకు, గారుత్మతం, అస్త్రం-గరుత్మంతుడు దేవతగానున్న బాణమును, సమాదదే-తీసుకొనెను. అప్పుడు వీరుఁడును, కోపరక్తనేత్రములుగలవాఁడును, మహాబలవంతుఁడునగు కుశుఁడు నదియొడ్డునకువెళ్ళి, ధనుస్సునకు నారినిగూర్చి, కుముద సర్పవినాశమును జేయఁదలచి గారుడాస్త్రమును చేతికిఁదీసికొనె ననిభావము.

శ్లో. తస్మిన్ హ్రదః సంహతమాత్ర ఏవ క్షోభా
త్సమావిద్ధతరంగహస్తః,
రోధాంసి నిఘ్న న్నవపాతమగ్నః కరీవ వన్యః
పరుషం రరాస. 78

వ్యాఖ్య : తస్మిన్-ఆబాణము, సంహతమాత్రే, ఏవ-సంధానముచేయఁబడుచుండగానే, హ్రదః- మడుగు, క్షోభాత్-సంక్షోభమువలన, సమావిద్ధతరంగహస్తః — సమావిద్ధ-దగ్గఱికిఁజేర్చఁబడిన, తరంగహస్తః-అలలనెడు చేతులు గలదియై, రోధాంసి-నదియొడ్డులను, నిఘ్నన్-కూలఁద్రోయుచు, అవపాతే-ఏనుఁగులను బట్టుకొను గుంటయందు, మగ్నః-పడిన, వన్యః, కరీ, ఇవ-అడవియేనుఁగువలె, పరుషం-ఘోరముగా, రరాస-ధ్వనించెను. కుశుఁడు బాణము నెక్కుపెట్టినంతలోనే భయపడి కలఁతఁజెందిన యా హ్రదము తరంగములనెడు హస్తములను జోడించుకొని, జలవేగముచేత తీరమును గూలఁద్రోయుచు, గజగ్రహణగర్తమునందు పడిన యడవి యేనుఁగువలె పెద్దగా మొఱపెట్టెనని భావము. "అవపాత" మనఁగా నేనుఁగులను బట్టుకొనుటకు గడ్డిమొదలయినవానితో గప్పి యుంచబడిన పెద్దగుంట. "అవపాతస్తు హస్త్యర్థే గర్తశ్చన్న స్తృణాదినా" అని యాదవ నిఘంటువు.

శ్లో. తస్మా త్సముద్రా దివ మథ్యమానా దుద్వృ త్తనక్రా
త్సహ సోన్మమజ్జ,
లక్ష్మ్యా సార్ధం సురరాజవృక్షః కన్యాం పురస్కృత్య
భుజంగరాజః. 79

వ్యాఖ్య : మథ్యమానాత్-మథింపఁబడుచున్న, సముద్రాత్, ఇవ-సాగరము నుండివలె,ఉద్వృత్తనక్రాత్-బయటికిక్రోయఁబడిన మొసళ్ళగల,తస్మాత్-ఆమడుగు నుండి, లక్ష్మ్యా, సార్ధం-లక్ష్మీదేవితోఁగూడ, సురరాజవృక్షః, ఇవ-ఇంద్రునిదగు పారిజాతవృక్షమువలె, కన్యాం-ఒక కన్యను, పురస్కృత్య-ముందు పెట్టుకొని, భుజంగరాజః-సర్పరాజైన కుముదుఁడు, సహసా-హఠాత్తుగా, ఉన్మమజ్జ-పైకి లేచెను. ఆ ధ్వని వెంటనే, మథింపబడుచున్న క్షీరసముద్రమునుండి లక్ష్మినియెత్తు కొని వచ్చిన పారిజాత వృక్షమువలె, నక్రాదులను దొలఁగించిన ఆహ్రదమునుండి సర్పరాజైన కుముదుఁ డొక చక్కని కన్యను ముందు పెట్టుకుని హఠాత్తుగా, ఆశ్చర్యము కలుగునట్లు, నీటిపైకిఁ జేరెనని భావము.

శ్లో. విభూషణప్రత్యుపహారహస్త ముపస్థితం వీక్ష్య విశాం
పతి స్తమ్,
సౌపర్ణ మస్త్రం ప్రతిసంజహార ప్రహ్వా ష్వనిర్బంధరుషో
హి సంతః. 80

వ్యాఖ్య : విశాం, పతిః-మనుజపతియైన కుశుఁడు, విభూషణ ప్రత్యు పహార హస్తం-భూషణమును కానుకగానియ్యబోవు హస్తములుగలవాఁడును, ఉపస్థితం-సమీపమునకు వచ్చినవాఁడును నగు, తం-ఆకుముదుని, వీక్ష్య-చూచి, సౌపర్ణం-గరుత్మంతుఁ డధిదేవతగాఁగల, అస్త్రం-బాణమును, ప్రతిసంజహార-ఉపసంహరించెను, హి-అదియంతే, సంతః-సజ్జనులు, ప్రహ్వాన్వ-నమ్రుల విషయమున (లొంగిపోయినవారి విషయమున), అనిర్బంధరుషః-పట్టుదల లేని కోపము గలవారైయుందురుగదా! అట్లు పైకి కన్యతోవచ్చిన కుముదుఁడు ఉపాయనహస్తుఁడై వినయపూర్వకముగా సమీపించినందున కుశుఁడు ప్రయోగింపఁ దలపెట్టిన గారుడాస్త్రమును వెనుకకు ఉపసంహరించెను. సజ్జనులు లొంగిపోయిన

వారి విషయమున కోపమును విడుచుట సహజముగదా! "ద్యావిశౌ వైశ్యమనుజౌ" అని యమరము. అలంకారము: అర్థాంతరన్యాసము.

శ్లో. త్రైలోక్యనాథప్రభవం ప్రభావా త్కుశం ద్విషా మంకుశ
మస్త్రవిదాన్,
మానోన్నతే నాప్యభివంద్య మూర్ధ్నా మూర్ధాభిషిక్తం
కుమదో బభాషే. 81

వ్యాఖ్య : అస్త్రవిద్యాన్ - గారుడాస్త్రమునెఱిగిన, కుముదః-కుముదుడు, త్రైలోక్యనాథప్రభవం-విష్ణువు అవతారమగు రాముడు తండ్రిగాగలిగినవాడును, ప్రభావాత్-మహత్త్వమువలన, ద్విషం-శత్రువులకు, అంకుశం-అంకుశమువంటి వాడును, మూర్ధాభిషిక్తం-రాజైనవాడును నగు, కుశం-కుశుని, మానోన్నతేన, అపి-అభిమానముచేత ఉన్నతమైనదయినప్పటికిని, మూర్ధ్నా-శిరస్సుచేత, అభివంద్య-నమస్కరించి, బభాషే-పలికెను. గారుడాస్త్రము సర్పజాతికి వినాశకరమని యెఱిగి యున్న కుముదుడు, శ్రీరామునికుమారుడై, శత్రునివారకుడై, రాజై యున్న కుశునకు, ఎవ్వానికి తలవంచని అభిమానగర్వము గలవాడైనను, తలవంచి నమస్కరించి ముందు చెప్పబోవురీతిగా సంభాషించెనని భావము. "అస్త్రవిద్వాన్" అస్త్రం వేత్తి ఇతి అని విగ్రహము చెప్పవలెను. ద్వితీయాతత్పురుష సమాసము.

శ్లో. అవైమి కార్యాంతరమానుషస్య విష్ణోః సుతాఖ్యా
మపరాం తనుం త్వామ్,
సోఽహం కథంనామ తవాచరేయ మారాధనీయస్య
ధృతే ర్విఘాతమ్. 82

వ్యాఖ్య : త్వాం-నిన్ను, కార్యాంతరమానుషస్య-దేవకార్యార్థమై మానవావతారమునెత్తిన, విష్ణోః-విష్ణువుయొక్క-(రాముని యొక్క), సుతాఖ్యాం-కుమారుడను పేరుగల, అపరాం, తనుం-మరియొక శరీరమునుగా, అవైమి-ఎఱుగుదును. సోఽహం (సః+అహం) అట్టెఱిగిన నేను, ఆరాధనీయస్య-పూజింపదగినట్టి తవ-నీయొక్క, ధృతేః-ప్రీతికి, విఘాతం-విఘ్నమును, కథం,నామ-ఏవిధముగా,

ఆచరేయం-చేయుదును? నిన్ను దేవకార్యము కొఱకై రామావతారమునెత్తిన శ్రీమహా విష్ణువుయొక్క పుత్రరూపముగు మరియొకమూర్తినిగా నెఱిఁగిన నేను పూజనీయుఁడవగు నీసంతోషమునకు విఘ్నము నెట్లుకలిగించెదను? అది జరుగదు. అని కుముదుఁడు కుశునితో సవినయముగాఁబలికెను. "కార్యాంతర" ఈయంతరశబ్దమునకు "ఓదనాంతరఃతండులః" అన్న ప్రయోగమునందువలె తాదర్థ్యము అర్థము. కాఁగా కార్యార్థమని యర్థము. శాశ్వతనిఘంటువు "స్థానాత్మీయాన్యతాదర్థ్యరంధ్రాంతర్యేమ చాంతరమ్" అని అంతరశబ్దమున కర్థములు చెప్పినది. "ఆత్మావై పుత్రనామాసి" అనుశ్రుతివలన కుశుఁడు రాముని మరియొక శరీరమని చెప్పఁబడినది. "ధృతిః" "ధృ-ప్రీతౌ" అనుధాతువునకు "క్తిన్" ప్రత్యయాంతము.

శ్లో. కరాభిఘాతోత్థితకందు కేయ మాలోక్య
బాలాతికుతూహలేన,

హ్రదాత్ పత జ్యోతిరివాంతరిక్షా దాదిత్త జైత్రాభరణం
త్వదీయమ్. 83

వ్యాఖ్య : కరాభిఘాతోత్థితకందుకా-కరాభిఘాత–చేతివిసురుచేత, ఉత్థిత కందుకా-పైకెగిరినబంతిగల, ఇయం, బాలా–ఈకన్య, అతికుతూహలేన-అత్యంతమగు ఉత్సాహముచేత, అంతరిక్షాత్-ఆకాశమునుండి, జ్యోతిః, ఇవ–నక్షత్రమువలె, హ్రదాత్-మడుగునుండి, పతత్-పడుచున్న, త్వదీయం-నీదియగు, జైత్రాభరణం-జయశీలమైన ఆభరణమును, ఆలోక్య-చూచి, ఆదత్త-తీసికొన్నది. ఈ బాలిక బంతిని పైకి విసిరివేసి దానివైపు చూచుచు మిక్కిలియుల్లాసముతో నున్న సమయమున ఆకాశమునుండి తేజస్వంతమగు నక్షత్రమువలె మడుగుద్వారా ప్రకిందికిఁబడుచుండినదియు, నీకు సంబంధించినదియు నగు జైత్రాభరణమును జూచి తాను తీసికొన్నది. ఒక విచిత్రమైనవస్తువు దొరికినదికదా! యన్న ఆనందముచేత గ్రహింపఁబడినదే కాని నీదియని, నీపై తృణీకారభావముచేత తీసుకోఁబడినది కాదని కుముదుఁడు గౌరవాదరములతో విన్నవించెనని భావము. "జ్యోతి ర్భదోత్థ దృష్టిషు" అని యమరము.

శ్లో. తదేత దాజానువిలంచినా తే జ్యాఘాతరేఖాకిణ
లాంఛనేన,

భుజేన రక్షాపరిఘేణ భూమే రుపైతు యోగం పున
రంసలేన. 84

వ్యాఖ్య : తత్, ఏతత్–అందువలన ఈ యాభరణము, ఆజాను విలంబినా-మోకాటివరకు వ్రేలాడునదియు, జ్యాఘాతరేఖాకిణలాంఛనేన—జ్యాఘాత-అల్లెత్రాటిదెబ్బలచేతనయిన, రేఖాకిణ-రేఖగా నేర్పడిన గనుపులు, లాంఛనేన-చిహ్నముగాఁగలదియు, భూమేః-నీచే పాలింపఁబడుచున్న భూమికి, రక్షాపరిఘేణ-రక్షణముకొఱకైన గడియవంటిదియు, అంసలేన-బలిష్ఠమైనదియు నగు, తే, భుజేన-నీ భుజముతో, పునః-మరల, యోగం-సంబంధమును, ఉపైతు-పొందునుగాక. అట్లు బాలికచేత వినోదార్థమై గ్రహింపబడినదే కావున ఈ మీ జైత్రవిభూషణమును మరల స్వీకరించి దీర్ఘమై, జ్యాకిణాంకితమై, భూరక్షణ ధురీణమై, మాంసలమై యున్న మీభుజమున ధరింపుడని కుముదుఁడు పలికెను. ఈ భుజవిశేషణములచేత కుశుని మహాభాగ్యశౌర్యధురంధరత్వబలవత్త్వాది గుణములు సూచింపఁబడుచున్నవి.

శ్లో. ఇమాం స్వసారం చ యవీయసీం మే కుముద్వతీం నార్హసి
నానుమంతుమ్,
ఆత్మాపరాధం నుదతీం చిరాయ శుశ్రూషయా పార్థివ!
పాదయో స్తే. 85

వ్యాఖ్య : హేపార్థివ-ఓ రాజా! తే, పాదయోఃనీ పాదములయందు, చిరాయ-బహుకాలము, శుశ్రూషయా-పరిచర్యచేత, ఆత్మాపరాధం-ఆభరణగ్రహణ రూపమైన యపరాధమును నుదతీం-తొలగించుకొనుచున్న, ఇమాం-ఈ, మే, యవీసీం, స్వసారం-నా చెల్లెలిని, కుముద్వతీం-కుముద్వతి యను పేరుగల దానిని, అనుమంతుం-అనుమతించుటకు, నార్హసీతిన (న+అర్హసి+ఇతి-న)-తగవు అనునదిలేదు. తగియే యున్నావని యర్థము. ఓ రాజా! నీ పాదసేవను యావజ్జీవముచేసి ఆభరణగ్రహణరూపమగు అపరాధమును దొలఁగింపఁదలచుకొను చున్న యీ నా చెల్లెలిని అనుమతించి స్వీకరింప నర్హుఁడవై యున్నావు. అనఁగా భార్యనుగా ఈ కుముద్వతిని అంగీకరింపుమని కుముదుఁడు కుశునితో విన్నవించె

నని భావము. "ఋక్షూషా శ్రోతుమిచ్ఛాయాం- పరిచర్యాప్రదానయోః" అని విశ్వ నిఘంటువు. "న ఆర్హసి ఇతి న" అన్న నిషేధద్వయము "ఆర్హస్యేవ" అని దృఢ పరచుటకే యని గ్రహింపవలెను.

శ్లో. ఇత్యూచివా నుపహృతాభరణం క్షితీశం
శ్లాఘ్యో భవాన్ స్వజన ఇత్యనుభాషితారమ్,
సంయోజయాం విధివ దాస సమేతబంధుః
కన్యామయేన కుముదః కులభూషణేన. 86

వ్యాఖ్య : ఇతి-వెనుకటిరీతిగా, ఊచివాన్-పలికినవాఁడై, కుముదః-కుముదుఁడు, ఉపహృతాభరణః-సమర్పించిన ఆభరణము గలవాఁడగుచు, భవాన్-నీవు, శ్లాఘ్యః-మెచ్చుకోఁదగిన, స్వజనః-బంధువుఁడవు, ఇతి-ఇట్లని, అనుభాషితారం-బదులుపలికినట్టి, క్షితీశం-రాజైనకుశుని, సమేతబంధుః-బంధుసహితుఁడై, కన్యామయేన-కన్యారూపమగు, కులభూషణేన-ఉభయకులభూషణముతో, విధివత్-శాస్త్ర ప్రకారముగా, సంయోజయామాస-సమకూర్చెను. భూషణము తమకు చేరిన రీతిని వివరించి దానిని ప్రత్యర్పణము చేయఁగా ఓకుముదా! నీవు మెచ్చుకోఁదగిన బంధువుఁడవని బదులుపలికిన కుశునికి బంధుపరివార సహితుఁడై కుముదుఁడు ఉభయవంశములకును భూషణమయిన కన్యను, చెల్లెలి, నిచ్చి శాస్త్ర ప్రకారముగా వివాహమును జరిపించెనని భావము.

శ్లో. తస్యాః స్పష్టే మనుజపతినా సాహచర్యాయ హస్తే
మాంగల్యోర్ణావలయిని పురః పావక స్యోచ్ఛిఖస్య,
దివ్య స్తూర్యధ్వని రుదచర ద్వ్యశ్నవానో దిగంతాన్
గంధోద్గ్రం తదను వవృషుః పుష్ప మాశ్చర్యమేఘాః. 87

వ్యాఖ్య : మనుజపతినా-కుశునిచేత, సాహచర్యాయ-సహధర్మాచరణము కొఱకు, మాంగల్యోర్ణావలయిని-మంగళప్రదమైన, ఊర్ణా-మేకవెండ్రుకలతోఁజేసిన దారము, వలయిని-కంకణముగాఁగల, తస్యాః-అకుముద్వతియొక్క, హస్తే-హస్తము ఉచ్ఛిఖస్య-జ్వాలలతోఁగూడిన, పావకస్య-అగ్నియొక్క, పురః-ఎదుట, స్పష్టే

(సతి)-పట్టుకోఁబడినదికాఁగా, దిగంతాన్-దిగంతములను,వ్యశ్నువానః-వ్యాపించుచు, దివ్యః-ఆకాశమునందలి, తూర్యధ్వనిః-మంగళవాద్యములధ్వని: ఉదచరత్-బయలు దేరెను. తదను-దానివెంటనే,ఆశ్చర్యమేఘాః-అద్భుతములగుమేఘములు,గంధోదగ్రం-పరిమళమును వెదఁజల్లుచుట్టి, పుష్పం-పూలను, వవృషుఃవర్షించెను.రాజైనకుశునిచేత సహధర్మచారిణి యగుటకొఱకు, మంగళయుక్తమైన మేషలోమ సూత్ర కంకణము గల కుముద్వతి హస్తము అగ్నిసాక్షికముగాఁ బట్టుకోఁబడినది కాఁగానే దిక్కులు పిక్కటిల్లునట్లుదేవతల మంగళవాద్యధ్వనులు చెలరేగెననియు, ఆవెంటనే యద్భుతముగా మేఘములు పుష్పవృష్టిని గురిసెననియు భావము. "పుష్పం" అన్నది జాత్యేకవచనము. మేఘవిశేషణమగు"ఆశ్చర్య"శబ్ద మిచ్చటపుంలింగము. వైభవోపేతముగా కుశకుముద్వతులకు వివాహము జరిగెనని తాత్పర్యము.

శ్లో. ఇత్థం నాగ స్త్రిభువనగురో రౌరసం మైథిలేయం
లబ్ధ్వా బంధుం,త మపి చ కుశః పంచమం తక్షకస్య,
ఏకః శంకాం.పిత్రవధరిపో రత్యజ ద్వైనతేయాత్,
శాంతవ్యాలా మవని మపరః పౌరకాంతః శశాస. 88

వ్యాఖ్య : ఇత్థం-ఈవిధముగా, నాగః-సర్పమైనకుముదుఁడు, త్రిభువన గురోః-విష్ణ్వంశసంభూతుఁడగు రామునియొక్క, ఔరసం-ధర్మపత్నిపుత్రుఁడగు, మైథిలేయం-కుశుని, బంధుం-బంధువునుగా, లబ్ధ్వా-పొందియు, కుశః, అపి, చ-కుశుడును, తక్షకస్య-తక్షకుఁడను సర్పరాజుయొక్క. పంచమం-అయిదవపుత్రుఁడైన, తం-ఆకుముదుని, బంధుం, లబ్ధ్వా-బంధువునుగాఁబొందియు, ఏకః-వారిద్దఱిలో నొకఁడగుకుముదుఁడు, పిత్రవధరిపోః-తనతండ్రినిఁజంపుటచేత శత్రువైయున్న వైనతేయాత్-గరుత్మంతునివలన, శంకాం-భయమును. అత్యజత్-వదలిపెట్టెను. అపరః-ఇద్దరిలో రెండవవాఁడైనకుశుఁడు, శాంతవ్యాలాం-శమించిన క్రూర సర్పభయముగల, అవనిం-భూమిని, పౌరకాంతః-ప్రజలకు ప్రియమైనవాఁడగుచు, శశాస-ఏలెను. ఈ విధముగా విష్ణుమహిమగల రామునికి సీతాదేవియందు ఔరస పుత్రుఁడై జన్మించిన కుశుని ఆత్మబంధువునుగాఁ జేసుకొన్న కుముదుఁడును అక్లేసర్పరాజులలోఁ బ్రసిద్ధుఁడైన తక్షకునియొక్క అయిదవకుమారుఁడగు కుముదుని శ్యాలకునిఁగాఁబొందిన కుశుఁడును సంతుష్టులైయుండుటయేకాక, కుముదుఁడు తనతండ్రినిఁజంపుటచేత శత్రువైయున్న గరుత్మంతుని

వలని భయమును వైష్ణవాంశగల కుశుని యాజ్ఞవలన గరుఁడుడు హాని చేయఁడు గావున, విడిచిపెట్టెను. అట్లే కుముదుని యాజ్ఞవలన సర్పములేవియు కుశపరిపాలితమయిన భూమియం దెవ్వరినిఁగాటువేయనందునఁ బ్రజలు ప్రేమతో నారాధించుచున్న కుశుఁడు సుఖముగా రాజ్యమును పాలించెను ప్రకమాలంకారము. "త్రయాణాం భువనానాం సమాహారః త్రిభువనమ్" అని విగ్రహము. "ష్ఠారస్తో ధర్మపత్నీజః" అని యాజ్ఞవల్క్యమహర్షి చెప్పెను.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశకావ్యమున
కుముద్వతీపరిణయమను షోడశసర్గకు కేశవ
పంతుల నరసింహశాస్త్రి రచిత
తెలుఁగు లఘువ్యాఖ్య.

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

సప్తదశసర్గము

శ్లో. అతిథిం నామ కాకుత్థ్సా త్పుత్రం ప్రాప కుముద్వతీ,
పశ్చిమా ద్యామినీయామాత్ ప్రసాద మివ చేతనా. 1

వ్యాఖ్య : కుముద్వతీ-కుముద్వతి, కాకుత్థ్సాత్-ककుత్థ్సవంశీయుఁడగుకుశుని వలన, అతిథిం, నామ-అతిథియనుపేరుగల, పుత్రం-కుమారుని, చేతనా-బుద్ధి, పశ్చిమాత్-చివరిదియగు, యామినీయామాత్-రాత్రియొక్క జామువలన, ప్రసాదం ఇవ-నిర్మలత్వమునువలె, ప్రాప-పొందెను. బుద్ధి రాత్రియొక్క నాల్గవజాము వలన వైశద్యమును పొందినట్లు కుముద్వతి కుశునివలన "అతిథి" యను కుమారుని గనెనని భావము. బ్రాహ్మముహూర్త మనఁబడు రాత్రి చివరిజామున అందరికిని బుద్ధివైశద్యము కలుగునని ప్రసిద్ధి. అలంకారము : ఉపమ.

శ్లో. స పితుఃపిత్రమాన్ వంశం మాతుశ్చానుపమద్యుతిః
అపునాత్ సవితే వోభౌ మార్గా వుత్తరదక్షిణౌ. 2

వ్యాఖ్య : పిత్రమాన్-మంచితండ్రిగలిగినట్టియు, అనుపమద్యుతిః-సాటిలేని కాంతిగలవాఁడునగు (ఇది సవితకుఁగూడ విశేషణము), సః-ఆ యతిథి, పితుః-తండ్రి యొక్కయు, మాతుః, చ-తల్లియొక్కయు, వంశం-వంశమును, సవితా-సూర్యుఁడు, ఉత్తర దక్షిణౌ-ఉత్తర దక్షిణములైన, ఉభౌ, మార్గౌ, ఇవ-ఉభయ మార్గములనువలె, అపునాత్-పవిత్రము చేసెను. అసాధారణ తేజస్వియైన సూర్యుఁడు నడచునప్పు డుత్తరదక్షిణ మార్గములను ప్రకాశింపజేసినట్లు అతిథి తన సత్ప్రవర్తనముచేత తలిదండ్రుల వంశములు రెంటిని పవిత్రముచేసి నుతి

కెక్కెనని భావము. "పితృమాన్" చక్కని శిక్షతోఁ గుమారునిఁ దీర్చిదిద్దగలిగిన తండ్రి గలవాఁ డన్న యర్థమున నుపయోగింపఁబడిన శబ్దము. అలంకారము: ఉపమ.

శ్లో. త మాదౌ కులవిద్యానా మర్థ మర్థవిదాం వరః,
పశ్చాత్ పార్థివకన్యానాం పాణి మగ్రాహయత్ పితా. 3

వ్యాఖ్య : అర్థవిదాం-శబ్దార్థములను, అర్థశాస్త్రవిషయములను నెఱిఁగిన వారిలో, వరః-శ్రేష్ఠుఁడగు, పితా-తండ్రియైన కుశుఁడు, తం-ఆ యతిథిని, ఆదౌ-మొదట, కులవిద్యానాం-క్షత్రియకులోచితములైన ఆన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతి మొదలగు విద్యలయొక్క, అర్థం-అర్థవిశేషమును, అగ్రాహయత్-బోధించెను. పశ్చాత్-ఆ పిమ్మట, పార్థివకన్యానాం-రాజకన్యలయొక్క, పాణిం-హస్తమును, అగ్రాహయత్-పట్టుకొనునట్లు చేసెను. అనఁగా కుశుఁడు మొదట కుమారునికి క్షత్రియకులోచితములైన సకల విద్యలను నేర్పించి తరువాత వివాహముఁ జేసెనని భావము. ప్రతివ్యక్తికి నతని కులవిద్య యవసరమనియు నది సమాజశ్రేయస్సునకు మూలమనియు కవి యభిప్రాయము.

శ్లో. జాత్య స్తేనాభిజాతేన శూరః శౌర్యవతా కుశః.
అమన్య తైక మాత్మాన మనేకం వశ్యా వశీ. 4

వ్యాఖ్య : జాత్యః-కులీనుఁడును, శూరః-శూరుఁడును, వశీ-ఇంద్రియ నిగ్రహముగలవాఁడునగు, కుశః-కుశుఁడు, అభిజాతేన-కులీనుఁడును, శౌర్యవతా-శౌర్యముగలవాఁడును, వశినా-ఇంద్రియ నిగ్రహముగలవాఁడునగు, తేన-అతిథిచేత, ఏకం, ఆత్మానం-ఒకఁడుగానున్న తనను, అనేకం-ఎన్నోరూపములు గలవానినిఁగా, అమన్యత-తలచెను. "అభిజాతః కులీన స్యాత్" అను నమరముచేత ఉత్తమ వంశీయుఁడైన కుశుఁడు తన కన్నివిధములఁ దగినవాఁడగు అతిథి వలన తానొక్కఁడేయైనను తన రూపాంతరముగాఁ గుమారుని భావించెనని తాత్పర్యము.

శ్లో. స కులోచిత మింద్రస్య సాహాయక ముపేయివాన్,
జఘాన సమరే దైత్యం దుర్జయం తేన చావధి. 5

వ్యాఖ్య : సః-ఆ కుత్సుఁడు, కులోచితం-తమ వంశమువారి కభ్యస్తమైన, ఇంద్రస్య-ఇంద్రునికి, సాహాయకం-సహకారిత్వమును, ఉపేయివాన్-పొందిన వాఁడగుచు, సమరే-యుద్ధమునందు, దుర్జయం-జయింప సాధ్యముగాని దుర్జయుఁడను పేరుగల, దైత్యం-రాక్షసునిఁ జఘాన-చంపెను. తేన-ఆ దుర్జయునిచేత, అవధిచ-చంపఁబడెనుకూడ. తమ వంశీయులకు యుద్ధములలో నింద్రునికిఁ దోడ్పడుట యాచారమై యున్నందున కుత్సుఁడును అట్లే దేవరాక్షస యుద్ధమున ఇంద్రునికి సహాయముగావెళ్ళి, అచ్చట మహాపరాక్రమశాలియగు దుర్జయుఁడను రాక్షసునిఁ జంపి, వానిచేతనే తానును జంపఁబడెనని భావము. "హన-హింసా గత్యోః" అను ధాతువునకు లిట్ జఘాన, కర్మణిలుఙ్ అవధి అనునవి అగును.

శ్లో. తం స్వసా నాగరాజస్య కుముదస్య కుముద్వతీ,
అన్వగాత్ కుముదానందం శశాంక మివ కౌముదీ. 6

వ్యాఖ్య ; కుముదస్య-కుముదుఁడనఁబడు, నాగరాజస్య-సర్పరాజు యొక్క, స్వసా-చెల్లెలయిన, కుముద్వతీ-కుముద్వతి (కుత్సునిభార్య), కుముదానందం-కలువలకానందమును గలిగించు, శశాంకం-చంద్రుని, కౌముదీ, ఇవ-జ్యోత్స్నవలె, తం-మృతుఁడైన కుత్సుని, అన్వగాత్-అనుసరించి వెళ్ళెను. కుత్సుని పక్షమున "కుముదానందం" అనుపదమునకు కుః-పృథివీ, తస్యాః ముత్-ప్రీతిః, సైవ ఆనందః యస్యసః అని విగ్రహము భూప్రజల సంతోషమే తన సంతోషముగాఁగలవాఁడని యర్థము. చంద్రునివెంట వెన్నెల వెళ్ళినట్లు, కుత్సునివెంట కుముద్వతి సహగమనముచేసి మృతిచెందెనని భావము. సహగమనమున కింత చక్కని యుపమానమును జెప్పుట కాళిదాసుకే సాధ్యము. ఉపమాలంకారము.

శ్లో. తయో ర్దివస్పతే రాసీ దేకః సింహాసనార్ధభాక్,
ద్వితీయాపి సఖీ శచ్యాః పారిజాతాంశభాగినీ. 7

వ్యాఖ్య : తయోః-ఆ కుశకుముద్వతు లిద్దఱిలో, ఏకః-ఒకడైన కుశుఁడు దివస్పతేః-ఇంద్రునియొక్క, సింహాసనార్ధభాక్-సింహాసనమునందలి సగము ప్రదేశమును పొందినవాఁడు, ఆసీత్-అయ్యెను. ద్వితీయా, అపి-రెండవది యగు కుముద్వతియు, శచ్యాః-శచీదేవియొక్క, పారిజాతాంశ భాగినీ-పారిజాత పుష్పములయందు భాగమును పొందునట్టి, సఖీ-స్నేహితురాలు, ఆసీత్-అయ్యెను. మృతులై స్వర్గమును జేరిన కుశకుముద్వతులలోఁ గుశుఁడింద్ర మిత్రుడై స్వర్గసింహాస నార్ధభాగమును పొందెననియు, కుముద్వతి శచీదేవికి ప్రాణస్నేహితురాలయ్యెననియు భావము. "తయోః-" (సచ, సాచ) ఏకశేష స మా స ము. "దివఃపతిః-దివస్పతిః" కస్కాదిగణమాకృతిగణమగుటచే సాధువు.

శ్లో. తదాత్మసంభవం రాజ్యే మంత్రివృద్ధాః సమాదధుః,
స్మరంతః పశ్చిమా మాజ్ఞాం భర్తుః సంగ్రామయాయినః. 8

వ్యాఖ్య : సంగ్రామయాయినః-యుద్ధమునకు వెళ్ళఁబోవుచుండిన, భర్తుః-ప్రభువగు కుశునియొక్క, పశ్చిమాం-చివరిదియగు, ఆజ్ఞాం-ఆజ్ఞను, స్మరంతః-స్మరించుచున్న, మంత్రివృద్ధాః-మంత్రి శ్రేష్ఠులు, తదాత్మసంభవం-అతని కుమారుఁడగు అతిథిని, రాజ్యే-రాజ్యమునందు, సమాదధుః-నిలిపిరి. యుద్ధమునకు వెళ్ళుచు విపర్యయ మేదైన జరిగినయెడల నాకుమారునికి రాజ్యాభిషేకమును జేయుఁడని చెప్పిన కుశునియాజ్ఞను గుర్తుంచుకొన్న వృద్ధమంత్రులు, కుశునిమరణమును విన్న వెంటనే అతిథిని రాజుగా నిలిపిరని భావము.

శ్లో. తే తస్య కల్పయామాసు రభిషేకాయ శిల్పిభిః,
విమానం నవ ముద్వేది చతుస్తంభప్రతిష్ఠితమ్. 9

వ్యాఖ్య : తే-ఆమంత్రులు, తస్య-ఆయతిథియొక్క, అభిషేకాయ-పట్టాభిషేకముకొఱకు, శిల్పిభిః-శిల్పులచేత, ఉద్వేది-ఉన్నతమైన యరుగుగలదియు, చతుస్తంభప్రతిష్ఠితం-నాలుగు స్తంభములపై నిలుపఁబడినదియునగు, నవం, విమానం-క్రొత్తమండపమును, కల్పయామాసుః-కట్టించిరి. అతిథియొక్క పట్టాభిషేకముకొఱకై యెత్తైన వేదిక, దానిపై నాలుగు స్తంభముల క్రొత్తవిమాన

మును మంత్రులు శిల్పులచేత నిర్మింపఁజేసి రనిభావము. ఈ విమానము దేవాలయముల పైభాగముపలె నుండుననియు. దానిని నాలుగు స్తంభములపై నిలుపుట అన్ని దిక్కులనుండియుఁ బ్రజలు చూచుటకనియుఁ దెలియపలయును.

శ్లో. తత్రైనం హేమకుంభేషు సంభృతై స్తీర్థవారిభిః,
ఉపస్థుః ప్రకృతయో భద్రపీఠోపవేశితమ్. 10

వ్యాఖ్య : తత్ర-విమానమునందు, భద్రపీఠోపవేశితం—భద్రపీఠ-మంగళపీఠమునందు, ఉపవేశితం-కూర్చోఁబెట్టఁబడిన, ఏనం-అతిథిని, హేమకుంభేషు-బంగారుబిందెలయందు, సంభృతైః-నింపఁబడిన, తీర్థవారిభిః-గంగాదితీర్థజలములతో, ప్రకృతయః-మంత్రులు, ఉపతస్థుః-సమీపించిరి. విమానమునందు భద్రపీఠముపైఁ గూర్చోఁబెట్టఁబడిన అతిథిని అభిషేకించుటకు మంత్రులు సువర్ణకలశములలో నింపఁబడిన గంగాది పుణ్యతీర్థజలములతో సమీపించిరని భావము.

శ్లో. నదద్భిః స్నిగ్ధగంభీరం తూర్యై రాహతపుష్కరైః,
అన్వమీయత కల్యాణం తస్యావిచ్ఛిన్న సంతతి. 11

వ్యాఖ్య : ఆహతపుష్కరైః-కొట్టబడిన ముఖ్యభాగములుగలవియు, స్నిగ్ధగంభీరం-మధురముగాను గంభీరముగాను, నదద్భిః-ప్రమోగుచున్న, తూర్యైః-మృదంగాది వాద్యములచేత, తస్య-ఆయతిథియొక్క, అవిచ్ఛిన్న సంతతి-ఆగిపోని పరంపరగల, కల్యాణం-భవిష్యచ్ఛుభము, అన్వమీయత-ఊహింపఁబడెను. "పుష్కరం కరిహస్తాగ్రే వాద్యభాండముఖేఽపిచ" అనియమరము. ఆ సమయమున ప్రమోగింపఁబడిన మృదంగ ధక్కాది వాద్యముల మధుర గంభీరమైన ధ్వనుల యనురణనమువేత అతిథి రాజుయొక్క అవిచ్ఛిన్న శుభ పరంపర ఊహింపఁబడెనని భావము.

శ్లో. దూర్వా యవాంకుర ప్లక్ష త్వ గభిన్నపు టోత్తరాన్,
జ్ఞాతివృద్ధైః ప్రయుక్తాన్ స భేజే నీరాజనావిధీన్. 12

వ్యాఖ్య : సః-అతిథి, దూర్వా...రాన్—దూర్వా-గఱిక పరకలును, యవాంకుర-యవధ్రగాసపు మొలకలును, ప్లక్షత్వక్-రావిచెట్టు చర్మమును,

అభిన్నపుట-పంచ పల్లవములనఁబడు లేతచిగుళ్లను, ఉత్తరాన్-ప్రధానములుగాఁ గలవియు, జ్ఞాతివృద్ధైఃబంధువులయందు వృద్ధులైన వారిచేత, ప్రయుక్తాన్-చేయఁబడినవియునగు, నీరాజనావిధీన్-శాంతికర్మ విశేషములను, భేజే-పొందెను. "అభిన్నపుటము" లనఁగా ఱిప్పపువ్వులు అనికొందఱును, కమలములని మరికొందఱును జెప్పుదురు. సింహాసనముపైఁ గూర్చున్న అతిథికి కులవృద్ధులు వివిధ మూలికలతో నీరాజన విధిని నిర్వర్తించిరని భావము.

శ్లో. పురోహితపురోగాస్తం జిష్ణుం జైత్రైర్ రథర్వభిః,
ఉపచక్రమిరే పూర్వ మభిషేక్తుం ద్విజాతయః. 13

వ్యాఖ్య ; పురోహితపురోగాఃపురోహితుఁడు మొదలుగాఁగల, ద్విజాతయఃబ్రాహ్మణులు, జిష్ణుం-జయశీలుఁడైన, తం-ఆ యతిథిని; జైత్రైఃజయమునుగూర్చగల, అథర్వభిఃఅథర్వ వేదమంత్రములచేత, పూర్వం-మొదట, అభిషేక్తుం-అభిషేకముఁజేయుటకు, ఉపచక్రమిరే-ప్రారంభించిరి. పురోహితుఁడును అతనితోఁబాటు బ్రాహ్మణులును పట్టాభిషేక సమయ పఠనీయములగు నథర్వ వేదమంత్రములు జదువుచు మొదట నభిషేకించిరని భావము. "పురఃహితం వక్తి" ఇతి పురోహితఃరాఁబోవు మేలునకై వైదిక జ్యోతిషాది శాస్త్రవిహిత కర్మలను జెప్పి చేయించువాఁడని యర్థము.

శ్లో. తస్యాఘుమహతీ మూర్ధ్ని నిపతంతీ వ్యరోచత,
సశబ్ద మభిషేకశ్రీః గంగేవ త్రిపురద్విషః. 14

వ్యాఖ్య : తస్యఆయతిథియొక్క, మూర్ధ్ని-తలపైన, సశబ్దం-ధ్వనితో గూడునట్లు, నిపతంతీ-పడుచున్నదియు, ఓఘమహతీ-ప్రవాహముచేత గొప్పఁగానున్నదియునగు, అభిషేకశ్రీఃకాంతియుక్తమైన అభిషేకజలము, త్రిపురద్విషఃశివునియొక్క, మూర్ధ్ని-తలపైన, నిపతంతీ-పడుచున్న, గంగా, ఇవ-గంగవలె, వ్యరోచత-మిక్కిలి ప్రకాశించెను. ధారాపాతముగా ధ్వనించుచు, అతిథితలపైనఁబడుచుండిన యభిషేకజలము శివుని తలపైఁబడుచుండిన గంగవలె శోభిల్లెనని భావము. అలంకారము: ఉపమ 'అభిషిచ్యతే అనేన ఇతి అభిషేకఃఅనఁగా జలమని యర్థము.

శ్లో. స్తూయమానఃతుణే తస్మ న్నలక్ష్యత స వందిభిః,
ప్రవృద్ధ ఇవ పర్జన్యః సారంగై రభినందితః. 15

వ్యాఖ్య : తస్మిన్, క్షణే-ఆయభిషేకకాలమునందు, వందిభిః-స్తుతిపాఠకులచేత, స్తూయమానఃస్తోత్రముచేయఁబడుచున్న, సఃఅతిథి, ప్రవృద్ధఃవృద్ధినిఁజెందినవై, సారంగైఃచాతకపక్షులచేత, అభినందితఃమెచ్చుకొనఁబడిన, పర్జన్యఃఇవమేఘమువలె, అలక్ష్యత-కనఁబడెను. ధారావాహిజలముతోఁ దడియుచు, మాగధులచేత నుతింపఁబడుచుండిన యతిథి, వృద్ధినిఁజెంది వర్షధారలు గురియుచుఁ జుట్టునుమూగిన చాతకపక్షుల కిలకిలారావముల మెప్పులతోఁగూడిన మేఘమువలెఁ జూచువారికిఁ గనఁబడెనని భావము. అలంకారము: ఉపమ.

శ్లో. తస్య సన్మంత్ర పూతాభిః స్నాన మద్భిః ప్రతీచ్ఛతః,
వవృధే వైద్యుతస్యాగ్నే ర్వృష్టిసేకా దివ ద్యుతిః. 16

వ్యాఖ్య : సన్మంత్రపూతాభిఃచక్కగానుచ్చరింపఁబడిన వేదమంత్రముల చేత పవిత్రములైన, అద్భిఃఅభిషేకజలములచేత, స్నానం-స్నానమును, ప్రతీచ్ఛతఃచేయుచుండిన, తస్య-అతిథికి, వృష్టిసేకాత్-వర్షముపడుటవలన, వైద్యుతస్య-విద్యుత్తుకు సంబంధించిన, అగ్నేఃఇవ-అగ్నికివలె, ద్యుతిఃకాంతి, వవృధే-వృద్ధినిఁజెందెను. వర్షధారాసారమువలన విద్యుత్తుకు సంబంధించిన అగ్ని (బడబాగ్ని) దీప్తినిఁజెందినట్లు మంత్రపూతమైన జలాభిషేకముచేత అతిథియొక్క శరీరకాంతి అభివృద్ధినిఁజెందెనని భావము. ఉపమాలంకారము. ఇందులో కవి వేద మంత్ర ప్రభావమును, విజ్ఞానశాస్త్రిరహస్యమును వెల్లడించెనని గ్రహింపవలెకు.

శ్లో. స తావ దభిషేకాంతే స్నాతకేభ్యో దదౌ వసు,
యావ తైషాం సమాప్యేరన్ యజ్ఞాః పర్యాప్తదక్షిణాఃం.17

వ్యాఖ్య : సఃఆ విధముగా నభిషేకమును బొందిన యతిథి, అభిషేకాంతే-అభిషేకము ముగియఁగానే, స్నాతకేభ్యఃగృహస్థులైయున్న బ్రాహ్మణులకు, తావత్-అంతపరిమాణముగల, వసు-ధనమును, దదౌ-ఇచ్చెను. యావతా-ఎంత పరిమాణముగల ధనముచేత, ఏషాం-ఈ గృహస్థులయొక్క, పర్యాప్తదక్షిణాఃచాలినదక్షిణలుగల, యజ్ఞాఃయజ్ఞములు, సమాప్యేరన్-పూర్తిచేయఁబడునో.

పట్టాభిషేకము ముగియఁగానే అతిథి, సభాసదులైన గృహస్థులకు వారు చేయవల సిన యజ్ఞములు సమగ్ర దక్షిణలు గలవియై యెంత ధనముతో పరిసమాప్తము లగునో అంత ధనమును ఒక్కొక్కనికి దానము చేసెను. "యావత్తావచ్చ సాకల్యే" అను నిఘంటువు వలన "యావత్, తావత్, సంపూర్ణార్థకములు.

శ్లో. తే ప్రీతమనస స్తస్మై యా మాశిష ముదైరయన్,
సా తస్య కర్మనిర్వృత్తై ర్దూరం పశ్చాత్కృతా ఫలైః. 18

వ్యాఖ్య: ప్రీతమనసఃసంతోషించిన మనస్సుగల, తే-ఆస్నాతకులు, తస్మై-అతిథి కొఱకు, యాం, ఆశిషం-ఏయాశీర్వచనమును, ఉదైరయన్-పలికిరో, సా-ఆ యాశీర్వచనము, తస్య-అతనికి, కర్మనిర్వృత్తైఃపూర్వపుణ్యము చేతఁ గలిగిన, ఫలైఃసామ్రాజ్యాది ఫలములచేత, దూరం-ఎక్కువగా, పశ్చాత్కృతా-వెనుకఁబడఁగొట్టఁబడినదయ్యెను. అట్లు గౌరవింపఁబడిన స్నాతకులు తృప్తులై యతిథికిఁ జేసిన ఆశీర్వచనము అతని పూర్వపుణ్యఫలములచేత మిక్కిలి వెనుకవేయఁబడినదయ్యెను. అనగా పూర్వజన్మకృత సుకృతఫలముగా ముందు రాజ్యాధికారాదులు వచ్చెననియు, ఆ తరువాత బ్రాహ్మణాశీర్వాదములు ఫలించెననియు భావము.

శ్లో. బంధచ్ఛేదం స బద్ధానాం వధార్హాణా మవధ్యతామ్,
ధుర్యాణాంచ ధురో మోక్షు మదోహం చాదిశ ద్గవామ్. 19

వ్యాఖ్య: సఃఅతిథి, బద్ధానాం-బంధింపఁబడిన వారియొక్క, బంధచ్ఛేదం-బంధములు విడుచుటను, వధార్హాణాం-మరణశిక్ష వేయఁబడినవారియొక్క, అవధ్యతాం-చంపదగకుండుటను, ధుర్యాణాం - బరువులు మోయువారికి, ధురఃబరువునుండి, మోక్షం-విడుదలను, గవాం-గోవులకుఁ, అదోహంచ-పాలుపితుకకుండుటకున్ను, ఆదిశత్-ఆజ్ఞాపించెను. పట్టాభిషేక సమయమున నందఱును సంతోషమున నుండవలయుననన్న యభిప్రాయముచేత అతిథి కారాగారములందున్న వారిని విడిచిపెట్టుటకును, మరణదండన పడినవారినిఁ జంపకుండుటకును, బరువులుమోయుచున్న కూలీలు, వృషభములు ఆ పనిచేయుట విడువవలయుననియు, ఆ సమయమున దూడలు స్వేష్టపూర్తిగా క్షీరపానము చేయవలయునని గోవులను పాలుపిదుకరాదనియు రాజ్యమునందంతటను ఆజ్ఞలు పంపెను.

శ్లో. క్రీడాపతత్రిణో ఽప్యస్య పంజరస్థాః శుకాదయః,
లబ్ధమోక్షా స్తదాదేశా ధ్యధేష్టగతయో ఽభవన్. 20

వ్యాఖ్య : పంజరస్థాః-పంజరములందుండిన, శుకాదయః-చిలుకలు మొదలయిన, అస్య, క్రీడాపతత్రిణః, అపి-అతనియొక్క ఆటపక్షులు సైతము, తదాదేశాత్-అతని యాజ్ఞవలన, లబ్ధమోక్షాః-పొందిన విడుదలగలవియగుచు, యథేష్టగతయః-స్వేచ్ఛాసంచారముగలవి, అభవన్-అయినవి. అతిథి యాజ్ఞ వలన పంజరములందలి శుకాదిక్రీడాపక్షులుగూడ విడువఁబడి స్వేచ్ఛావిహారము గలవైనవనఁగా నితరుల విషయము చెప్పవలసినదేమున్నది? అని భావము.

శ్లో. తతః కక్ష్యాంతర న్యస్తం గజదంతాసనం శుచి,
సోత్తరచ్ఛద మధ్యాస్త నేపథ్యగ్రహణాయ సః. 21

వ్యాఖ్య : తతః-అభిషేకానంతరము, సః-అతఁడు, నేపథ్యగ్రహణాయ-రాజవేషమును స్వీకరించుటకు, కక్ష్యాంతర న్యస్తం-మరియొక భవనపు అంగణమునందు, న్యస్తం-ఉంచఁబడినదియు, శుచి-నిర్మలమైనదియు, సోత్తరచ్ఛదం-పైన వస్త్రము కప్పఁబడినదియు నగు, గజదంతాసనం-ఏనుగు దంతములతో నిర్మించిన పీఠమును, అధ్యాస్త-ఎక్కెను (అచ్చటఁగూర్చునెను). అభిషేక ప్రక్రియ ముగిసిన తరువాత తడి వస్త్రములు విడిచి రాజోచిత వస్త్రాలంకారములు ధరించుటకై మరియొక భవనాంగణమున నుంచఁబడిన నిర్మలమైన గజదంత పీఠముపై అతిథి కూర్చునెనని భావము. "సోత్తరచ్ఛదం" ఉత్తరచ్ఛదేన సహితం సోత్తరచ్ఛదం అని విగ్రహము. ఉత్తరచ్ఛదమనఁగా ఉత్తరీయము-పైఁగప్పుకొను వస్త్రము.

శ్లో. తం ధూపాశ్యానకేశాంతం తోయనిర్ణిక్తపాణయః,
ఆకల్పసాధనై స్తై స్తై రుపసేదుః ప్రసాధకాః. 22

వ్యాఖ్య : తోయనిర్ణిక్తపాణయః-జలముతో కడుగుకోఁబడిన చేతులుగల, ప్రసాధకాః-అలంకరించు సేవకులు, ధూపాశ్యానకేశాంతం-ధూప-గంధద్రవ్యములపొగచేత, ఆశ్యాన-తడిపోఁగొట్టఁబడిన, కేశాంతం-జుట్టుగల, తం-అతిథిని, తైః, తైః-ఆయావిధములైన, ఆకల్పసాధనైః-అలంకారసాధనములైన గంధ

మాల్యాదులచేత, ఉపసేదుఃచేరిరి (అలంకరింపమొదలిడిరి). రాజు నలంకరించు సుద్యోగులు చేతులు శుభ్రముగాఁ గడిగికొని, సుగంధధూపములచేత నతని జుట్టును తడిలేని దానినిఁగాజేసి, అలంకారసాధనములైన వివిధవస్తువులతో నతనినిఁజేరిరి.

శ్లో. తే ఽస్య ముక్తాగుణోన్నద్ధం మౌలి మంతర్గతస్రజమ్,
ప్రత్యూషుఃపద్మరాగేణ ప్రభామండలశోభినా. 23

వ్యాఖ్య : తే-ఆప్రసాధకులు, ముక్తాగుణోన్నద్ధం — ముక్తాగుణ-ముత్తపుసరులచేత, ఉన్నద్ధం-ఎత్తికట్టఁబడినదియు, అంతర్గతస్రజం-లోననుంచ బడిన పూదండ గలదియునగు, అస్య-అతనియొక్క, మౌలిం-జుట్టును, ప్రభా మండలశోభినా-కాంతిమండలముచేత ప్రకాశించుచున్న, పద్మరాగేణ-మాణిక్యము చేత, ప్రత్యూషుఃపొదిగిరి. అలంకారసేవకులు అతనికేశబంధమునందు పుష్ప మాలికనుంచి, ముత్యాలదండతో పైకిఁగట్టి, దానిపై మిక్కిలికాంతిగల మాణిక్య మును జెక్కి యలంకరించిరని భావము.

శ్లో. చందనేనాంగరాగం చ మృగనాభి సుగంధినా,
సమాపయ్య తతశ్చక్రుఃపత్రం విన్యస్తరోచనమ్. 24

వ్యాఖ్య : మృగనాభిసుగంధినా-కస్తూరినిగలుపుటచేతఁబరిమళించుచున్న, చందనేన-శ్రీగంధముచేత, అంగరాగం-శరీరలేపనమును, సమాపయ్య-పూర్తి చేసి, తతఃతరువాత, విన్యస్తరోచనం-కలుపఁబడిన గోరోచనముగల, పత్రం-మకరికాదిపత్రరచనను, చక్రుఃచేసిరి. మరియు నా ప్రసాధకులు కస్తూరి కలి పిన శ్రీగంధముచేత నతని మైపూఁతను ముగించి, దానిపై గోరోచనా మిశ్రిత రంజన ద్రవముచేత వివిధ చిత్రములుగల పత్రరచనను చేసిరని భావము.

శ్లో. ఆముక్తాభరణఃస్రగ్వీ హంసచిహ్నదుకూలవాన్,
ఆసీ దతిశయప్రేక్ష్యఃస రాజ్యశ్రీవధూవరఃః. 25

వ్యాఖ్య : ఆముక్తాభరణఃధరించినయాభరణములు గలవాఁడును, స్రగ్వీ-పుష్పమాలాధరుఁడును, హంసచిహ్నదుకూలవాన్-హంసల అంచులుగల పట్టు

వస్త్రమును ధరించినవాఁడును, రాజ్యశ్రీవధూవరః-రాజ్యలక్ష్మియనెఁడు పెండ్లి కూతురునకు వరుఁడును నగు, సః-అయతిథి, అతిశయాపేక్ష్యః-ఆ యలంక రణములచేత మిక్కిలి చూడఁదగినవాఁడు, ఆసీత్-అయ్యెను. రాజ్యలక్ష్మివరుఁ డుగా నలంకరింపఁబడిన నాయతిథి చూపఱకు మిక్కిలి యందగాఁడుగాఁ గనఁ బడెనని భావము. "హంసచిహ్నదుకూలవాన్" హంసచిహ్నం యద్దుకూలం తద్వాన్" అని విగ్రహముచెప్పి, నకర్మధారయాన్మత్వర్థీయః (కర్మధారయ సమాసముపై మత్వర్థీయ ప్రత్యయము రాదు) అను సిద్ధాంతమునకు అపవాద ముగా, "సర్వధనీ" వలెనే ఇచ్చటను మత్వర్థీయము వచ్చుట సాధువేయని మల్లినాథసూరి తెలిపెను.

శ్లో. నేపథ్యదర్శిన శ్ఛాయా తస్యాదర్శే హిరణ్మయే,
విరరా జోదితే సూర్యే మేరౌ కల్పతరో రివ. 26

వ్యాఖ్య : హరణ్మయే-బంగారముతోఁ జేసిన, ఆదర్శే-అద్దమునందు, నేపథ్యదర్శినః-తన వేషమును జూచుకొనుచున్న, తస్య-అతిథియొక్క, ఛాయా-ప్రతిబింబను, ఉదితే-ఉదయించిన, సూర్యే-సూర్యునియందలి, మేరౌ-మేరుపర్వతమునందు, కల్పతరోః-కల్పవృక్షముయొక్క, ఛాయా, ఇవ-ప్రతిబింబమువలె, విరరాజ-మిక్కిలి ప్రకాశించెను. బంగారుటద్దమునందు చూచు కొనుచున్న అతిథి ప్రతిబింబము సూర్యోదయ సమయమున మేరుపర్వతమునందు ప్రతిఫలించిన కల్పవృక్షచ్ఛాయవలె నుండెను. వివిధ శాఖాఫలపుష్ప సహితమైన కల్పవృక్షచ్ఛాయ అతిథి ప్రతిబింబమున కుపమానము. అలంకారము: ఉపమ.

శ్లో. స రాజ కకుద వ్యగ్రపాణిభిః పార్శ్వవర్తిభిః,
యయౌ వుదీరితాలోకః సుధర్మానవమాం సభామ్. 27

వ్యాఖ్య : సః-అతిథి, రాజకకుద వ్యగ్రపాణిభిః—రాజకకుద-రాజచిహ్న ములందు (ఛత్రచామరాదులయందు), వ్యగ్ర-ఆసక్తములైయున్న, పాణిభిః-చేతులుగల, పార్శ్వవర్తిభిః - ప్రక్కన నడచుచున్న పరిజనులచేత, ఉదీరితాలోకః-పెద్దగా నుచ్చరింపఁబడిన 'బయ' శబ్దములు గలవాఁడగుచు, సుధర్మానవమాం (సుధర్మా, అనవమాం) -దేవసభకంటే తక్కువగాని, సభాం-ఆస్థానమును, యయౌ-చేరెను. రాజచిహ్నములగు ఛత్రచామరాదులను బట్టి

కొన్న జనులచేత "జయ, జయ" అని సంబోధింపఁబడుచున్న అతిథి, దేవసభను బోలిన తమ యాస్థానమండపమును జేరెనని భావము. 'కుకుద' శబ్దమునకు ప్రధానమైనది, రాజచిహ్నము, ఎద్దుమూపురము, అని యర్థములుగలవు. 'ఆ లోకో జయశబ్దఃస్యాత్, అని యమరము.

శ్లో. వితాన సహితం తత్ర భేజే పైతృక మాసనమ్,
చూడామణిభి రుద్ఘృష్టపాదపీఠం మహీక్షితామ్. 28

వ్యాఖ్య : తత్ర-ఆ సభామండపమునందు, వితానసహితం-మేలుకట్టుచేతఁ గూడినదియు, మహీక్షితాం-రాజులయొక్క, చూడామణిభిఃశిరోరత్నములచేత, ఉద్ఘృష్టపాదపీఠం-చెక్కఁబడిన పాదపీఠముగలదియు, పైతృకం-తండ్రియగు కుశునికి సంబంధించినదియు నగు, ఆసనం-సింహాసనమును, భేజే-పొందెను (ఎక్కెను). పైభాగమున మంచివస్త్రముచేత మేలుకట్టుకట్టఁబడి, పరరాజుల శిరోరత్నములు పొదిగిన పాదపీఠముగలిగి, పూర్వము తండ్రియైన కుశునిచేత నధిరోహింపఁబడుచుండిన ఇక్ష్వాకు రాజవంశ సింహాసనమును అతిథి యెక్కి కూర్చునెనని భావము. వితానము, ఉల్లోచము, మేలుకట్టు సమానార్థకములు. 'పితుఃఇదంపైతృకమ్' అని విగ్రహము.

శ్లో. శుశుభే తేన చాక్రాంతం మంగలాయతనం మహత్,
శ్రీవత్సలక్షణం వక్షః కౌస్తుభేనేవ కైశవమ్. 29

వ్యాఖ్య : తేన-అతిథిచేత, ఆక్రాంతం-అడుగిడఁబడినదియు, శ్రీవత్స లక్షణం-'శ్రీవత్స' మను గృహలక్షణములు గలదియు, మహత్-విశాలముగా నుండినదియునగు, మంగళాయతనం-సభారూపముననున్న మంగళగృహము, కౌస్తు భేన, ఆక్రాంతం-కౌస్తుభమణిచేత నాక్రమింపఁబడినదియగు, శ్రీవత్సలక్షణం-శ్రీవత్సమను పుట్టుమచ్చగల, కైశవం, వక్షఃఇవ-విష్ణువక్షస్థలమువలె, శుశుభే-ప్రకాశించెను. "శ్రీవత్సము, నంద్యావర్తము" మొదలగునవి నిర్మాణభేదములున్న గృహవిశేషములు. శ్రీవత్సమని చెప్పఁదగిన యా సభాభవనమునందు శ్రీవత్స లాంఛనమైన విష్ణువక్షస్థలమునందు కౌస్తుభమణివలె అతిథి ప్రకాశించెననిభావము.
అలంకారము : శ్లేషానుప్రాణితమగు ఉపమ.

శ్లో. బభౌ భూయః కుమారత్వా దాధిరాజ్య మవాప్య సః,
రేఖాభావా దుపారూఢః సామగ్ర్య మివ చంద్రమాః. 30

వ్యాఖ్య : సః-ఆ యతిథి, కుమారత్వాత్-బాల్యమువలన, భూయః-యౌప రాజ్యమును పొందియే మరల, ఆధిరాజ్యం-మహారాజ్యమును, అవాప్య-పొంది, రేఖాభావాత్-ఆర్ధేందుత్వము నుండియే, సామగ్ర్యం-సంపూర్ణత్వమును, ఉపా రూఢః-పొందినట్టి, చంద్రమాః, ఇవ-చంద్రునివలె, బభౌ-ప్రకాశించెను. అతిథి మిక్కిలి బాలుడుగా నున్నందున నతనికి మొదట యువరాజ ధర్మములైన విద్యావినయ శౌర్యములు గలిగించి, తరువాత సమగ్రరాజ్యపాలన రూపమగు మహారాజ్యాధిపత్యమును మంత్రు లప్పగింపగా, నతడు, రేఖాభావము అనగా నర్ధచంద్రాకారమునుండి పూర్ణత్వమును బొందిన పూర్ణచంద్రునివలె క్రమాభి వృద్ధిని బొందుచు ప్రకాశించెనని భావము. అతనిలో గ్రమాభివృద్ధికి లోపము గలుగలేదని యభిప్రాయము. అధికో రాజా అధిరాజః అధిరాజస్య భావః "ఆధిరాజ్యం" అని విగ్రహము.

శ్లో. ప్రసన్నముఖరాగం తం స్మితపూర్వాభిభాషిణమ్,
మూర్తిమంత మమన్యంత విశ్వాస మనుజీవినః. 31

వ్యాఖ్య : ప్రసన్నముఖరాగం-నిర్మలమైన ముఖకాంతి గలవాడును, స్మితపూర్వాభిభాషిణం-చిఱునగవుముందు కనపడుచుండగా జక్కగా భాషించు వాడును నగు, తం-ఆయతిథిని, అనుజీవినః-ఆశ్రయించి జీవించు మంత్రిపురో హిత ప్రభృతులు, మూర్తిమంతం శరీరమును ధరించిన, విశ్వాసం-నమ్మకము నుగా, అమన్యంత-తలచిరి. ముఖములో నెట్టి దుర్భావములును లేక ప్రసన్న మైన కాంతియు, ఇతరులతో సంభాషించునప్పుడు చిఱునవ్వుతోబలుకుటయు గల అతిథిని మంత్రులు, పురోహితులు, సేవకులు మొదలగువారు మూర్తీభ వించిన విశ్వాసమునుగా భావించిరి. నమ్మిరని భావము.

శ్లో. స పుంసాం పురుహూతశ్రీః కల్పద్రుమనిభధ్వజామ్,
క్రమమాణ శ్చకార ద్యాం నాగే నై రావతౌజసా. 32

వ్యాఖ్య : పురుహూతశ్రీః-ఇంద్రవైభవముగల, సః-అతిథి, కల్పద్రుమ నిభధ్వజాం--కల్పద్రుమ-కల్పవృక్షములకు, నిభ-సమానమగు,

ధ్వజాం-కేతనములుగల, పురం-అయోధ్యానగరమును, ఐరావతౌజసా-ఐరావతముయొక్క బలమువంటి బలముగల, నాగేన-గజముతో, క్రమమాణః-తిరుగుచున్నవాఁడై (ఊరేగుచున్నవాఁడై), ద్యాం-స్వర్గమును, చకార-చేసెను. ఇంద్రవై భవముగల యతిథి కల్పవృక్షములవలె వివిధరూపములతో నలంకరింపఁబడిన జెండాలుగల అయోధ్యానగరమును, ఐరావతమువంటి యొక భద్రగజముపైనెక్కి యూరేగుచు స్వర్గపట్టణముగా మార్చెనని భావము. ఇంద్రుఁడు స్వర్గమునవలె నతథి అయోధ్యానగరమున పట్టాభిషేకానంతర మూరువెడలు నుత్సవమునఁ బాల్గొనెనని తాత్పర్యము.

శ్లో. తస్యైకస్యోచ్ఛ్రితం ఛత్రం మూర్ధ్ని తేనామలత్విషా
పూర్వరాజ వియోగౌష్ఠ్యం కృత్స్నస్య జగతో
హృతమ్. 33

వ్యాఖ్య : తస్య, ఏకస్య-ఆయొక్కనియొక్క, మూర్ధ్ని-శిరముపైన, ఛత్రం-ఛత్రము, ఉచ్ఛ్రితం-ఎత్తియుంచఁబడినది. అమలత్విషా-నిర్మలకాంతిగల, తేన-ఆఛత్రముచేత, కృత్స్నస్య-సంపూర్ణమైన, జగతః-లోకమునయొక్క, పూర్వరాజవియోగౌష్ఠ్యం——పూర్వరాజ-అంతకుముందు రాజుగానుండిన కుశుని యొక్క, వియోగ-ఎడబాటుచేతనైన, ఔష్ఠ్యం-సంతాపము, హృతం-హరింపబడినది. ఆయతిథియొక్కని శిరముపై మాత్రమే ఛత్రముంచఁబడినది. కాని దాని చేత సర్వలోకమునకు సంబంధించినట్టి కుశవియోగజనిత సంతాపమంతయుఁ దొలఁగింపఁబడెనని భావము. ఇచ్చట ఛత్రము క్రొత్తగారాజైన అతిథిపైనుండగా ప్రజలకు తాపముపోయినట్లు వర్ణించుట అసంగతము. కారణమొకచోటను కార్యమొకచోటను నుండుటయే అలంకారమైన అసంగతికి లక్షణము. "కార్యకారణయో ర్భిన్నదేశ్యత్వే సత్యసంగతిః" కనుక ఇది అతిథి రాజ్యసింహాసన ఛత్రమును ధరింపగానే ప్రజలకు అరాజకమువలన వచ్చు బాధలు తొలఁగి యానంద మును బొందిరను తాత్పర్యమున పర్యవసించుచున్నది. ఇది అసంగతి అలంకారము.

శ్లో. ధూమా దగ్నేః శిఖాః పశ్చా దుదయా దంశవో రవేః,
సోఽతీత్య తేజసాం వృత్తిం సమ మేవోత్థితో గుణైః. 34

వ్యాఖ్య : అగ్నేః-అగ్నికి, ధూమాత్, పశ్చాత్-పొగకంటేతరువాత, శిఖాఃజ్వాలలును, రవేః-సూర్యునికి, ఉదయాత్, పశ్చాత్-ఉదయముకంటే తరువాత, అంశవః - కిరణములును (ఉత్తిష్ఠంతే - లేచుచుండును). సఃఅతిథి, తేజసాం-తేజస్వంతులగు అగ్న్యాదులయొక్క, వృత్తిం-స్వభావమును, అతీత్య-అతిక్రమించి, గుణైఃసద్గుణములతో, సమమేవ-సమానముగానే ఉత్థితఃపెరిగెను. లోకమునందు అగ్నికి మొదట ధూమము, పిమ్మట మంటలును వచ్చుటయు, సూర్యుని యుదయము ముందు తరువాత కిరణప్రసారము జరుగుటయుఁజూతుము. కాని అతిథి వివిధ సద్గుణములతోపాటే పెరుగుట జరిగినది. ఇది యపూర్వ మని భావము. క్రమముగాఁగాక యేకకాలమునందే యతఁడును నతని గుణములును వృద్ధిచెందుట చిత్రము.

శ్లో. తం ప్రీతివిశదైర్నేత్రైర్వన్వయుఃపౌరయోషితః,
శరత్ప్రసన్నైర్జ్యోతిర్భిర్విభావర్య ఇవ ధ్రువమ్. 35

వ్యాఖ్య : పౌరయోషితఃపుర స్త్రీలు, ప్రీతివిశదైఃప్రేమచేత నిర్మలములైన నేత్రైఃచూపులతో, తం-ఆ యతిథిని, అన్వయుఃవెంబడించిరి. శరత్ప్రసన్నైఃశరదృతువునందు ప్రసన్నములైయున్న, జ్యోతిర్భిఃనక్షత్రములతో, విభావర్యఃరాత్రులు, ధ్రువం, ఇవ-ధ్రువునినివలె (ధ్రువమండలమునువలె) నని యర్థము. అయోధ్యానగరస్త్రీలు అతిథిని ప్రీతిపూర్వకమగు దృష్టి ప్రసారముచేత ననఁగా దూరమునుండియే వీక్షించిరి. అది శరదృతువు నందతిస్వచ్ఛముగానున్న నక్షత్రములతో రాత్రులు ధ్రువమండలమును జూచినట్లుండెనట. శరద్రాత్రులు దీర్ఘముగా నుండునుగావున నీ యుపమానముచేత వారు చాలసేపు అతనిని ప్రేమతోఁ జూచిరని భావము. నక్షత్రచక్రము ధ్రువపాశబద్ధమై యున్నదని జ్యోతిర్విదులు చెప్పుదురు.

శ్లో. అయోధ్యాదేవతా శ్చైనం ప్రశస్తాయతనార్చితాః,
అనుదధ్యు రనుధ్యేయం సాన్నిధ్యైఃప్రతిమాగతైః. 36

వ్యాఖ్య : ప్రశస్తాయతనార్చితాఃప్రశస్త-శ్రేష్ఠములగు, ఆయతన-దేవాలయములందు, అర్చితాఃపూజింపఁబడిన, అయోధ్యా దేవతాఃచ-అయోధ్యానగరమునందలి దేవతలుగూడ, అనుధ్యేయం-అనుగ్రహింపఁదగిన, ఏనం-

ఈ అతిథిని, ప్రతిమాగతైః-విగ్రహములందు సంక్రమించియున్న, సాన్నిధ్యైః-సన్నిధానములచేత, అనుదధ్యుః-అనుగ్రహించిరి. అయోధ్యానగరమునందలి దేవాలయస్థదేవతలు తమ తమ అర్చామూర్తులందు ఆవేశించి నమస్కరించుచున్న అతిథిని అనుగ్రహించిరని భావము. "అనుధ్యాన మనుగ్రహః" అని యుత్పలమాల.

శ్లో. యావన్నాఖ్యాయతే వేది రభిషేకజలాప్లుతా,
తావ దేవాస్య వేలాంతం ప్రతాపః ప్రాప దుస్సహః. 37

వ్యాఖ్య : అభిషేకజలాప్లుతా-పట్టాభిషేక జలముచేతదడుపబడిన, వేదిః-అరుగు, యావత్-ఎంతకాలమున, న, ఆఖ్యాయతే-ఎండలేదో, తావత్, ఏవ-అంతకాలముననే, అస్య-ఆ రాజుయొక్క, దుస్సహః-సహించుటకు సాధ్యపడని, ప్రతాపః-శౌర్యము, వేలాంతం-సముద్రతీర పర్యంతమును, ప్రాప-వ్యాపించెను. అతిథికి పట్టాభిషేకము జరిగిన యరుగుమీది తడియైనను ఆరకముందే యతని ప్రతాపము సముద్రతీరములవఱకు వ్యాపించెను. అనగా నతడు మహాప్రతాపవంతుడన్నవార్త సర్వత్ర వ్యాపించెనని భావము.

శ్లో. వసిష్ఠస్య గురో ర్మంత్రాః సాయకా స్తస్య ధన్వినః,
కి మతాన్సాధ్యం యదుభయే సాధయేయు ర్న సంగతాః, 38

వ్యాఖ్య : గురోః-కులగురువగు, వసిష్ఠస్య-వసిష్ఠునియొక్క, మంత్రాః-వేదమంత్రములు, ధన్వినః,తస్య-ధనుర్ధారియగు నాయతిథియొక్క, సాయకాః-బాణములు; ఉభయే-ఆ రెండును,సంగతాః-కలసికొన్నవగుచు, యత్,సాధ్యం-ఏసాధ్యమును, న సాధయేయుః-సాధింపలేకపోవునో, తత్-అట్టి, సాధ్యం-సాధింపదగినకార్యము, కిం-ఏమున్నది? ఏదియులేదని యర్థము. మంత్రములా? మహామహిమోపేతుడైన వసిష్ఠునిచే నుచ్చరింపబడుచున్నట్టివి. బాణములా? ఉత్తమ ధానుష్కుడైన అతిథిచేత ప్రయోగింపబడుచున్నట్టివి. ఇక ఆరెండును గలిసి సాధింపజాలనికార్య మేమున్నది? ఏదియు లదు, వానికసాధ్యమే లేకుండె నని భావము.

శ్లో. స ధర్మిష్ఠసఖుః శశ్వ దర్థి ప్రత్యర్థి నాం స్వయమ్,
దదర్శ సంశయచ్ఛేదాన్ వ్యవహారా నతంద్రితః. 39

వ్యాఖ్య : ధర్మస్థసఖుఃఁ-ధర్మమునందు నిలుచువారు మిత్రులుగాఁగల వాఁడును, అతంద్రితఃఁ-అలసత్వములేని వాఁడునగు, సఃఁ-ఆరాజు, శశ్వత్-ప్రతిదినమును, అర్థిప్రత్యర్థినాంఁ-ఒక ప్రయోజనమును గోరునట్టి యు దానిని వ్యతిరేకించునట్టియు జనులయొక్కఁ, సంశయచ్ఛేద్యాన్-సంశయములను నిర్ణయించునట్టి, వ్యవహారాన్-వివాదములను, స్వయం-తానే, దదర్శ-చూచెను (పరిష్కరించెను). తమకు శత్రువులయిన వారి విషయమునను మిత్రులైన వారి విషయమునను సమానముగా ప్రవర్తించునట్టి సభ్యులతోఁగూడినవాఁడై, అలసత్వములేక ప్రతిదినమును ధర్మాసనమున గూర్చుని, ఒక కార్యమునకై వాదప్రతివాదములు చేయునట్టి అర్థిప్రత్యర్థుల యొక్కఁ వివాదమునందలి న్యాయనిర్ణయమును తానే స్వయముగాఁజేయుచుండెననియు, ఒక న్యాయాధికారికే వ్యవహారములను వదిలిపెట్టక ప్రజాపాలనముఁ జేయుచుండెననియభావము. "రాజ్ఞా సభాసదఃఁ కార్యా రిపౌ మిత్రేచ యేసమాఃఁ" అనియు, "వ్యవహారాన్ నృపఃఁ పశ్యేత్ విద్వద్భిఃఁ బ్రాహ్మణైఃసహ" అనియుఁ జెప్పిన ధర్మశాస్త్రమును అతిథి తప్పక పాటించి పక్షపాతరహితముగా రాజ్యమునేలు చుండెనని తాత్పర్యము.

శ్లో. తతఃపర మభివ్యక్త సౌమనస్య నివేదితైఃఁ,
యు యోజ పాకాభిముఖైఃఁ భృత్యాన్ విజ్ఞాపనాఫలైఃఁ. 40

వ్యాఖ్య : తతఃఁ, పరం-ప్రజా వ్యవహారదర్శనానంతరము, భృత్యాన్-తన సేవకులను, అభివ్యక్త సౌమనస్య నివేదితైఃఁ—అభివ్యక్త-ముఖరాగాదుల వలన స్పష్టపడిన, సౌమనస్య-ప్రసన్నతచేత, నివేదితైఃఁ-సూచింపఁబడినవియు, పాకాభిముఖైఃఁ-ఫలోన్ముఖములైనవియు నగు, విజ్ఞాపనాఫలైఃఁ-విజ్ఞప్తులయొక్కఁ ఫలములతో, యుయోజ-సంబంధపరచుచుండెను. ప్రజావ్యవహారములు పరిష్కరించి వచ్చి, యాసనమున ప్రసన్నుఁడై కూర్చున్న తనవద్దికిఁజేరి తమ తమ కోరికలు మనవిచేసుకొను పరిజనులకు వారివారి యభీష్టములు దీర్చుచుండెను. శ్లో. నియుక్తఃఁ కర్మనిష్పత్తౌ విజ్ఞప్తౌచ యదృచ్ఛయా। భృత్యాన్ ధనైర్మాన యంస్తు నవోప్యక్షోభ్యతాం వ్రజేత్" ఒక పనియందు నియోగించిన రాజు 'ఆ పనిని పూర్తిచేసితిమ'ని వచ్చి చెప్పిన భృత్యుల విజ్ఞప్తికి ఫలముగా ధనముల నిచ్చినయెడల నట్టిరాజు క్రొత్తవాడైనను క్షోభలేక సుఖముగా నుండు నన్న బృహస్పతి నీతిసారవచనమును బాటించుచుండెనని భావము. ఇచ్చటి సౌమనస్య

(పుష్పములుగల), ఫలయోజన (పండ్లనిచ్చుట) ప్రభృతులచేత అతఁడొక ఫల వృక్షముగా నుండెనన్న భావము వ్యంగ్యము.

శ్లో. ప్రజా స్తద్గురుణా నద్యో నభసేవ నివర్ధితాః,
తస్మిన్నస్తు భూయసీం వృద్ధిం నభస్యో తా ఇవాయయుః. 41

వ్యాఖ్య : ప్రజాః-ప్రజలు, తద్గురుణా-అతని తండ్రియగు కుశునిచేత, నభసా - శ్రావణమాసముచేత, నద్యః, ఇవ - నదులవలె, వివర్ధితాః - వృద్ధినొందింపబడి యుండిరి. తస్మిన్, తు-అతఁడు రాజుకాఁగానే, నభస్యో-భాద్రపదమాసమునందు, తాః, ఇవ-ఆనదులవలెనే, భూయసీం-అత్యంతమైన, వృద్ధిం-అభ్యుదయమును, ఆయయుః-పొందిరి. ప్రజాపోషణమునందు అతిథి తండ్రిని మించెనని భావము.

శ్లో. యదువాచ న తన్మిథ్యా యద్దదౌ న జహార తత్,
సోఽథూదభగ్న వ్రతః శత్రూ నుద్ధృత్య ప్రతిరోపయన్. 42

వ్యాఖ్య : సః-అతిథి, యత్-దాన రక్షణాది విషయకమగు నేవాక్యమును, "ఉవాచ-చెప్పెనో", తత్-అది, మిథ్యా, న-అసత్యముకాకుండెను. యత్-ఏవస్తువును, దదౌ-ఇచ్చెనో, తత్-దానిని, న జహార-మరల వెనుకకు తీసికొనలేదు. (కింతు-కాని) శత్రూన్-శత్రువులను, ఉద్ధృత్య-ఉన్మూలించి, ప్రతిరోపయన్-మరలస్థాపించుచు, భగ్నవ్రతః-భగ్నమైన నియమము గలవాఁడు, అభూత్-అయ్యెను. ప్రజాక్షేమమునకై యాడిన మాట తప్పక, ఇచ్చినవస్తువును మరల వెనుకకు దీసికొనక నియమమును పాటించుచున్న యతఁడు, శత్రువులను మాత్రము మొదట స్థానభ్రష్టులను జేసి, వారు 'దాసోఽహ' మని లొంగినపిమ్మట మరల వారి స్థానములందుంచుచు నియమభంగమును జేయుచుండెను. అనఁగా నతని ప్రజాపాలన శత్రునిర్మూలనాదులు శాస్త్రసమ్మతములై యుండె నని భావము.

శ్లో. వయో రూప విభూతీనా మేకైకం మదకారణమ్,
తాని తస్మిన్ సమస్తాని న తస్యోత్సిషిచే మనః. 43

వ్యాఖ్య : వయోరూపవిభూతీనాం-యౌవనము, సౌందర్యము, ఐశ్వర్యము అను వానిలో, ఏకైకం-ఒక్క-టొక్క-టియే, మదకారణం-మదమునకు హేతువు, తాని-ఆ మదకారణములన్నియు, తస్మిన్-అతనియందు, సమస్తాని-చేరియున్నవి, (తథాపి-అట్లయినను, తస్య-ఆ యతిథియొక్క, మనః-మనస్సు, న, ఉత్సిషిచే-పైకి పొంగలేదు (గర్వపడలేదు). వయస్సు, రూపము, ఐశ్వర్యము అనునవి యొక్క-టొక్క-టియే గర్వకారణములైనను, అన్నియుఁజేరిన యతని మనస్సున మదమురేకెత్తలేదు. అన్నియునున్నను వినయము వివేకమును గలవాఁడై యుండెనని భావము. గర్వశబ్దమును, "ఐశ్వర్య రూప తారుణ్య కుల విద్యా బలైరపి, ఇష్టలాభాదినాహ్యేషా మవజ్ఞా గర్వ ఈరితః" అనియు, మద శబ్దమును, "మద స్త్వానందసందోహః సంభేదో మదిరాకృతః" అనియు పెద్దలు నిర్వచించిరి. "ఉత్సిషిచే" ఉత్ అను నుపసర్గతోఁజేరిన షిచ్లఖ్-క్షరణే అన అత్మనేపది ధాతువునకు లిట్ ప్రథమపురుష ఏకవచన రూపము.

శ్లో. ఇత్థం జనితరాగాసు ప్రకృతి ష్వనువాసరమ్,
అక్షోభ్యః స నవోప్యాసీ ద్ధృఢమూల ఇవ ద్రుమః. 44

వ్యాఖ్య : ఇత్థం-ఇట్లు, అనువాసరం-ప్రతిదినమును, ప్రకృతిషు-ప్రజలు, జనితరాగాసు (సత్సు)-కలిగింపఁబడిన ప్రేమగలవారగుచుండఁగా, సః-ఆరాజు, నవః, అపి-క్రొత్తవాఁడైనను, దృఢమూలః-గట్టిగా నున్న ప్రేళ్ళుగల, ద్రుమః, ఇవ-వృక్షమువలె, అక్షోభ్యః-కదలించుటకు సాధ్యముగానివాఁడు, ఆసీత్-అయ్యెను. తన సద్గుణములచేతను, గర్వములేని ప్రవర్తనముచేతను నిరంతరము ప్రజలకుఁ దనపై ప్రీతిని గలిగించుకొనుచునున్న యారాజు గట్టిగా ప్రేళ్ళుబారిన మహావృక్షమువలె గట్టిపడి క్రొత్తగా రాజ్యాధికారమును స్వీకరించినను శత్రువులు మొదలగువారికి అప్రధృష్యుఁడుగా నుండెను.

శ్లో. అనిత్యాః శత్రవో బాహ్యా విప్రకృష్టాశ్చ తే యతః,
అతః సోఽభ్యంతరా న్నిత్యాన్ షట్ పూర్వ మజయ
ద్రిపూన్. 45

వ్యాఖ్య : యతః-ఏకారణము వలన, బాహ్యాః-వెలుపలనున్న, శత్రవః-ప్రత్యర్థులైన రాజులు మొదలగువారు, అనిత్యాః-నిత్యముగా ద్వేషించువారు

కారో, తే-వారు, విప్రకృష్టాః, చ-దూరముగానుండువారో, అతః-ఈకారణము వలన, సః-అతడు, అభ్యంతరాన్-లోపల నుండువారును, నిత్యాన్-ఎప్పుడును గనఁబడువారును, షట్-ఆర్గురునునగు, రిపూన్-కామక్రోధాదులగు శత్రువులను, పూర్వం-మొదట, అజయత్-జయించెను. వెలుపటనున్న శత్రురాజులు ఒకప్పుడు ద్వేషించుటయు ఒకప్పుడు స్నేహమును జూపుటయు జరుగును. పైగా వారు దూరప్రదేశములందుందురు. కనుక వారు అనిత్య శత్రువులు. వారికంటే తనను విడువక లోపలఁజేరి చెడ్డమార్గమును బట్టించు అంతశ్శత్రువులు అపాయమును గలిగింతురు. కనుక కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము అనఁబడు నార్గురు శత్రువుల నతఁడు మొదట జయించెను. అంత శ్శత్రుజయము గలిగినప్పుడు బాహ్యశత్రుజయము దుర్లభము కాదని భావము.

శ్లో. ప్రసాదాభిముఖే తస్మిన్ చపలాపి స్వభావతః,
నికషే హేమరేఖేవ శ్రీ రాసీ దనపాయినీ. 46

వ్యాఖ్య : స్వభావతః-ప్రకృతిసిద్ధముగా, చపలా, అపి-చంచలురాలైనను, శ్రీఃరాజ్యలక్ష్మి. ప్రసాదాభిముఖే-నిర్మలమైన దర్శనముగల, తస్మిన్-ఆ రాజు నందు, నికషే-ఒరపాతియందలి, హేమరేఖా, ఇవ-బంగారపు గీతవలె, అనపాయినీ-తొలఁగిపోనిది (స్థిరమైనది), ఆసీత్-అయ్యెను. లక్ష్మి స్వభావముచేత చపలయే యైనను ప్రసన్నముఖుఁడైన యతిథియందు నికషోపలముపైని సువర్ణ రేఖవలె స్థిరముగా నుండెను. ప్రసన్నముఖుఁడగుటచేత నతనివద్దికి వచ్చిన వారెవ్వరును ద్వేషమును, అసంతృప్తినిఁ బొందఁకు కనుక వ్యవహారములుచెడక రాజ్యలక్ష్మి స్థిరపడియుండెనని భావము.

శ్లో. కాతర్యం కేవలా నీతిః శౌర్యం శ్వాపద చేష్టితమ్,
అతః సిద్ధిం సమేతాభ్యా ముభాభ్యా మన్వియేష సః. 47

వ్యాఖ్య : కేవలా-శౌర్యవర్జితమై ఒకటియేయైన, నీతిః-నీతిప్రయోగము, కాతర్యం-పిఱికితనము, కేవలం, శౌర్యం-నీతిపర్జితమైన శౌర్యప్రయోగము, శ్వాపదచేష్టిత-క్రూరమృగచేష్టితము. అతః-ఇందువలన, సః-అతఁడు, సమేతాభ్యాం-కలసికొన్నట్టి, ఉభాభ్యాం-నీతిశౌర్యములు రెండింటిచేతను, సిద్ధిం-జయప్రాప్తిని, అన్వియేష-వెదకుచుండెను. శౌర్యములేక కేవలము నీతికౌశలముచేత

ఎత్తులకు పైయెత్తులువేయుట పిటికితనమునకు లక్షణము. అట్లే నీతిశాస్త్రము నెఱుఁగక కేవలము శౌర్యముతో శత్రువుమీదికి దుముకుట వ్యాఘ్రాదుల క్రూర కృత్యము వంటిది. కనుక అతిథి తన విజయప్రాప్తి కెల్లప్పుడును నీతిశౌర్యము లను జోడించి ప్రవర్తించుచుండెనని భావము, "వ్యాఘ్రాదయో వనచరాః పశవః శ్వాపదా మతాః" అని హలాయుధ నిఘంటువు.

శ్లో. న తస్య మండలే రాజ్ఞో న్యస్తప్రణిధిదీధితేః,
అదృష్టమభవత్ కించిత్ వ్యభ్రస్యేవ వివస్వతః. 48

వ్యాఖ్య : న్యస్తప్రణిధిదీధితేః—న్యస్త అన్ని దిక్కులకుఁబంపఁబడిన, ప్రణిధి-చారులే, దీధితేః-కిరణములుగాఁగల, తస్య, రాజ్ఞః-ఆ రాజునకు, వ్యభ్రస్య-మేఘములులేని, వివస్వతః, ఇవ-సూర్యునికివలె, మండలే-తన దేశము నందు, కించిత్-కొంచముగూడ, అదృష్టం-చూడఁబడనిది (తెలిసికొనబడనిది), న అభవత్-లేకుండెను. మేఘరహితమగు నాకాశమున కిరణప్రసారముగల సూర్యునికివలె నంతటను చారులనుంచిన యతనికి తన రాష్ట్రమునందలి చిన్న వస్తువు సహితము తెలియనిదిలేకుండెను. చారచక్షువై సర్వమును దెలిసికొను చుండెనని భావము.

శ్లో. రాత్రిందివవిభాగేషు యదాదిష్టం మహీక్షితామ్,
తత్ సిషేవే నియోగేన స వికల్పపరాఙ్ముఖః. 49

వ్యాఖ్య : రాత్రిందివవిభాగేషు-రాత్రియొక్కయు పగటియొక్కయు జాములరూపములగు విభాగములయందు, మహీక్షితాం-రాజులకు, యత్-ఏది, ఆదిష్టం-ఈ సమయమున దీని నాచరింపవలెనని మనువు మొదలగు వారిచేత ఉపదేశింపఁబడియున్నదో, తత్-దానిని, సః-అతఁడు, వికల్పపరాఙ్ముఖః(సన్)-సంశయములేనివాఁడగుచు, నియోగేన-నిశ్చయముతో, సిషేవే-సేవించెను (అనుష్ఠించెనని యర్థము). మనువు, గౌతముఁడు మొదలగు ధర్మశాస్త్రజ్ఞులు రాజైనవాఁడు ఏయే సమయములం దెయేకార్యము లాచరింపవలెనో ఉపదేశించి యున్నారు. ఆ యుపదేశములను రాత్రింది వవిభాగములందు నిశ్చయముతో, అనుమానింపక, వికల్పములేమేని కలవేమోచూడక శ్రద్ధతో నతఁడాచరించు చుండెనని భావము. కౌటిల్యుఁడు అర్థశాస్త్రమునందు కార్యములకు నియోగ

వికల్పసముచ్చయము లుండుననిచెప్పి వాని నిట్లు వివరించెను. "అనేనైవోపా యేన నాన్యేనేతి నియోగః, అనేన వాక్యేన వేతి వికల్పః, అనేన చేతి సముచ్చయః".

శ్లో. మంత్రః ప్రతిదినం తస్య బభూవ సహ మంత్రిభిః,
స జాతు సేవ్యమానోఽపి గుప్తద్వారో న సూచ్యతే. 50

వ్యాఖ్య : తస్య-అతనికి, ప్రతిదినం-ప్రతిరోజును, మంత్రిభిః, సహ-మంత్రులతోఁగూడ, మంత్రః-రాజ్యతంత్ర విచారము, బభూవ-జరుగుచుండెను. సః-అది, సేవ్యమానః, అపి-నిరంతరము ఆవర్తింపబడుచున్నప్పటికిని, గుప్త ద్వారః-గోప్యముగా నుంచబడిన ప్రకటన మార్గములు గలదియగుచు, జాతు-ఒకప్పుడు సైతము, నసూచ్యతే-వెల్లడింపఁబడకుండెను. అతిథి మంత్రులతోఁగలిసి ప్రతిదినమును రాజ్యతంత్ర విచారమును జేయుచుండెను. కాని ఆ రహస్యమును అభిప్రాయముద్వారాగాని, ముఖలక్షణములచేతగాని, మాటలద్వారాగాని ఎవ్వ రును వెల్లడించుటకు వీలులేని పద్ధతులను గల్పించెనని భావము.

శ్లో. పరేషు స్వేషుచ క్షిప్తై రవిజ్ఞాతపరస్పరైః,
సోఽపసర్పైర్ప్రజాగార యథాకాలం స్వపన్నపి. 51

వ్యాఖ్య : యథాకాలం-కాలాతిక్రమణములేక, స్వపన్, అపి-నిద్రించు చున్నవాఁడైనను, సః-అతఁడు, పరేషు-శత్రువుల విషయమునను, స్వేషు, తనవారి విషయమునను, క్షిప్తైః-నియమింపఁబడినవారును, అవిజ్ఞాతపరస్పరైః-ఒకరినొకరు గుర్తింపలేనివారును నగు, అపసర్పైఃచారులచేత, జజాగార-మేల్కొనియుండెను. ప్రతిదినము కాలము నతిక్రమింపక నిద్రించువాఁడైనను ఆరాజు, శత్రువుల రహస్యములను, స్వీయజనుల రహస్యమును సైతము తెలిసి కొనుటకు నియమింపఁబడిన గూఢచారులు, తమలోఁదాముగూడ నొకరినొకరు గుర్తింపజాలనివారగుచు, వారివారి నియమితకాలములందు పచ్చి తెలుపు చుండఁగా సర్వమును రాత్రివేళలయందు మేల్కొనితెలిసికొనుచుండెననిభావము. ఈ విషయమున కామందకనీతిసారమిట్లుచెప్పినది, "చారా న్విచారయే త్తీర్థే ష్వాత్మనశ్చ పరస్యచ! పాషండ్యాదీ నవిజ్ఞాతా ననోన్య మితరైరపి" తీర్థేషు-సహాయులయందు అని యర్థము.

శ్లో. దుర్గాణి దుర్గ్రిహాణ్యాసన్ తస్య రోద్ధురపి ద్విషామ్,
నహి సింహో గజాస్కంది భయా ద్గిరిగుహాశయః. 52

వ్యాఖ్య : ద్విషాం, రోద్ధుః, అపి-శత్రువులను అడ్డగించునట్టివాఁడై యున్నప్పటికిని, తస్య-ఆరాజునకు, దుర్గ్రిహాణి-పరులు పట్టుకొనుటకు సాధ్యపడని, దుర్గాణి-కోటలు, ఆసన్-ఉండినవి. గజాస్కందీ-ఏనుఁగులను జంపునట్టి సింహః-సింహము, భయాత్-భయకారణమువలన, గిరిగుహాశయః-కొండగుహలయందు పండుకొనునది, నహి-కాదుగదా! ఏనుఁగులనే చంపఁగలిగిన సింహము భయమువలనకాదుగదా! కొండగుహలలో పండుకొనునది. అది దాని స్వభావము. అట్లే సర్వశత్రువులను నిర్జించువాఁడైనను అతనికి శత్రుదుర్భేద్యములైన మహీదుర్గాదులైన కోటలు ఉండెనని భావము. ఈ విషయమున మనువు "ధన్వదుర్గం మహీదుర్గ మబ్బుర్గం వార్క్ష్యమేవవా! నృదుర్గం గిరిదుర్గంవా సమాశిత్య వసేద్బుధః" అని చెప్పెను. అలంకారము: అర్థాంతరన్యాసము.

శ్లో. భవ్యముఖ్యాః సమారంభాః ప్రత్యవేక్ష్యా నిరత్యయాః,
గర్భశాలిసధర్మాణ స్తస్య గూఢం వి పేచిరే. 53

వ్యాఖ్య : భవ్యముఖ్యాః-శుభమే ప్రధానముగాఁగలవియు, పత్యవేక్ష్యాః-కార్యక్రమపర్యవేక్షణము గలవియు, నిరత్యయాః-నిర్బాధములును, గర్భశాలిసధర్మాణః - పైరుపొట్టలలోనే ఫలించు వరిధాన్యమునకు సమానములును నగు, తస్య - అతనియొక్క, సమారంభాః-కర్మప్రారంభములు, గూఢం-రహస్యముగా, విపేచిరే-ఫలించినవి. అతఁడు ప్రజలకు మేలునే కలిగించు పనులను ఆరంభించుననియు, ఆరంభించినవి చక్కని పర్యవేక్షణముగలిగి విఘ్నములు పొందక నిర్బాధముగా సాగుచు, పొట్టలోనే కంకులేర్పడి పండు వరిధాన్యమువలె నిగూఢముగా పూర్తియై వాంఛిత ఫలము లిచ్చుచుండెననియు భావము. ఒక కార్యము నారంభింపనున్నప్పుడే దీనివలన నీలాభముగలదు, ఆలాభముగలదు, అని ప్రగల్భములు పలికి తుదకా పనిని విఘ్నములపాలుచేయు వసమర్థపాలకునివలెఁగాక "ఫలానుమేయాః ప్రారంభాః" అను రాజనీతి నమసరించి ప్రజాహితకార్యములు చేయుచుండెనని తాత్పర్యము.

శ్లో. అపథేన ప్రవవృతే న జాతూపచితోఽపి సః,
వృద్ధౌ నదీముఖేనైవ ప్రస్థానం లవణాంభసః. 54

వ్యాఖ్య : సః-అతిథి, ఉపచితః, అపి-వృద్ధిని పొందియున్నవాఁడైనను, జాతు-ఒకప్పుడుగూడ, అపథేన-చెడ్డమార్గముద్వారా, న ప్రవవృతే-ప్రవర్తింప లేదు. లవణాంభసః-లవణ సముద్రమునకు, వృద్ధౌ-ఉప్పొంగుటయందును, నదీ ముఖేన, ఏవ-నదీప్రవేశమార్గముద్వారానే, ప్రస్థానం-ప్రయాణము (నిస్సరణము) గదా! అతఁడెంతగానో యభివృద్ధినిఁజెందియున్నను ధన రూప శౌర్య గర్వముల చేత చెడ్డమార్గమునఁ బ్రవర్తింపకుండెను. సముద్ర ముప్పొంగునప్పుడును నదీ ప్రవేశ మార్గములనుండియే బయలునకు వచ్చును. అట్లే అతిథి న్యాయమార్గ మున రాజ్యపాలనముఁజేయు చుండెనని భావము. అలంకారము:దృష్టాంతము.

శ్లో. కామం ప్రకృతివైరాగ్యం సద్యఃశమయితుం క్షమః,
యస్య కార్యఃప్రతీకారః స తన్నైవోదపాదయత్. 55

వ్యాఖ్య : ప్రకృతి వైరాగ్యం-దైవికముగా ప్రజలయందుఁగలుగు వైరా గ్యమును లేదా ఆపరాగమును, సద్యఃవెంటనే, కామం-చక్కగా లేక స్వేచ్ఛగా శమయితుం-శమింపఁజేయుటకు, క్షమఃశక్తుఁడై యున్న, సఃఆరాజు, యస్య-ఏవిరాగమునకు, ప్రతీకారఃప్రతీకారము, కార్యఃచేయవలసియుండునో, తత్-ఆవిరాగమును, నైవ, ఉదపాదయత్-కలిగింపకయే యుండెను. దైవికములగు వర్షాభావ దారిద్ర్యాదుల వలన బ్రతుకుపై నిరాశ, ప్రభువునందు ప్రేమరాహిత్య మును పొందిన ప్రజలయొక్క అపరాగమును ద్రవ్యదాన కారుణ్యాదులచేత వెంటనే తొలఁగించుటకు శక్తుఁడైనయతఁడు, అట్లు చేయుటకుఁబూనుకొనక, రాజనీతిరహస్యము నెఱిఁగినవాఁడై ఎట్టి యసం తృప్తికి ప్రతీకారముచేయవలసియుండెనో అట్టి యసంతృప్తి ప్రజలకు కలుగ నీయకుండెను. ఉత్పన్న ప్రతీకారముకంటే అనుత్పాదనము మేలుగదా! యన్న భావముతో నట్లు మెలఁగుచుండెను. ప్రజల అననురక్తి విషయమున కౌటిల్యుఁ డర్థశాస్త్రమునం దిట్లు వచించెను. "క్షీణాః ప్రకృతయో లోభం లుబ్ధా యాంతి విరాగతామ్। విరక్తా యాంత్యమిత్రంవా భర్తారం ఘ్నంతివా స్వయమ్" రాజ పోషణములేక క్షీణించిన ప్రజలు లోభ గుణమును పొందుదురు. లుబ్ధులైనవారు విరాగమును పొందుదురు, విరక్తులైన ప్రజలు తమ రాజుయొక్క శత్రువు

నైనను జేరుదురు. లేదా తమ రాజునే చంపుదురు అని శ్లోకార్థము. కావున నీ రహస్యమునెఱిగి యతిథి ప్రజానురాగమును గోలుపోక రాజ్యము నేలుచుండెనని భావము.

శ్లో. శక్యేష్వే వాభవత్ యాత్రా తస్య శక్తిమతః సతః,
సమీరణ సహాయోఽపి నాంభఃప్రార్థి దవానలః, 56

వ్యాఖ్య : శక్తిమతః, సతః-శక్తిసంపన్నుఁడై యుంటున్నను, తస్య-ఆ రాజుయొక్క, శక్యేషు, ఏవ-తన శక్తికి లొంగిపోవు శత్రువుల విషయముననే, యాత్రా-దండయాత్ర, అభవత్-జరుగుచుండెను. సమీరణసహాయః, అపి-వాయువు మిత్రుఁడుగానున్నవాఁడైనను, దవానలః-అరణ్యాగ్ని, అంభఃప్రార్థీ-కాల్చుటకు జలమును వెదకువాఁడు, న-కాఁడుగదా! దవానలము, తనకువాయువు సహాయుఁడైయున్నను కాల్చుటకు జలమును వెదుకక తృణకాష్ఠాదులనే చూచుకొనునట్లు, శక్తిమంతుఁడైయున్నను అతిథి, తనకంటే తక్కువ బలముగల శత్రువులపైననే దండయాత్రలు సాగించుచుండెననియు, సమానులు, అధికులు నగు రాజులతో సంధిచేసికొనుచుండెననియుభావము. ఇది, "సమజ్యాయోభ్యాం సంధీత హీనేన విగృహ్ణీయాత్"-సమానునితోను, గొప్పవానితోను, సంధిచేసికొనవలెను. తక్కువ బలముగలవానితో యుద్ధము చేయవలెను. అని చెప్పిన కౌటిల్య నీతియొక్క అనుసరణము.

శ్లో. న ధర్మ మర్థకామాభ్యాం బబాధే న చ తేన తౌ,
నార్థం కామేన కామం వా సోఽర్థేన సదృశ స్త్రిషు. 57

వ్యాఖ్య : సః-అతఁడు, అర్థకామాభ్యాం-అర్థకామములచేత, ధర్మం-ధర్మమును, నబబాధే-నశింపఁజేయలేదు. తేనచ-ఆ ధర్మముచేతను, తౌ-ఆయర్థకామములను,న-బాధింపలేదు.అర్థం-అర్థమును, కామేన-కామముచేతను, కామంవా-కామమునుగూడ, అర్థేన-అర్థముచేతను, నబబాధే-బాధింపలేదు. త్రిషు-ధర్మార్థకామములు మూడింటియందును, సదృశః-సమానప్రవృత్తి గలవాఁడయ్యెను. "ధర్మార్థకామాః సమమేవ సేవ్యాః యోహ్యేకసక్తః సన్యపో జఘన్యః" అను నీతివచనానుసారముగా ఒక్కపురుషార్థమునందే విశేషముగా ఆసక్తుఁడుకాక, ఒకదానినే మైమరచి సేవింపక, దర్మార్థకామపురుషార్థములు మూడింటిని శాస్త్ర సమ్మతముగా నారాధించెనని భావము.

శ్లో. హీనా న్యనుపకర్త్రాణి ప్రవృద్ధాని వికుర్వతే,
తేన మధ్యమశక్తీని మిత్రాణి స్థాపితాన్యతః. 58

వ్యాఖ్య : మిత్రాణి-మిత్రులు, హీనాని-మిక్కిలి తక్కువస్థితియందున్న వారైనచో, అనుపకర్త్రాణి-ఉపకారము చేయజాలరు. ప్రవృద్ధాని-మిక్కిలి యున్నతస్థితియందున్నవారైనచో, వికుర్వతే-విరుద్ధప్రవర్తనులై యపకారమును జేయుదురు. అతః-ఈకారణమువలన, తేన-అతిథిచేత, మధ్యమశక్తీని-అతిశక్తి ఐలు అతిప్రవృద్ధులును కాని మిత్రులు, స్థాపితాని-ఆయాకార్యము లందుంచబడిరి. అతిహీనులతోను అత్యున్నతులతోను మైత్రిచేయుట నిరుపయోగముకనుక తనకు సములగు మిత్రులతో మైత్రిచేసి వారినితగినస్థానములందుంచెననిభావము. మిత్ర శబ్దము నపుంసకలింగమైనచో స్నేహితుడనియు, పుంలింగమైనచో సూర్యుడనియు నర్థములు. "మిత్రంసుహృది మిత్రోఽర్కే" అని విశ్వనిఘంటువు.

శ్లో. పరాత్మనోః పరిచ్ఛిద్య శక్త్యాదీనాం బలాబలమ్,
యయా వేధి ర్బలిష్ఠశ్చే త్పరస్మా దాస్త సోఽన్యథా. 59

వ్యాఖ్య : సః-ఆయతిథి, పరాత్మనోః-శత్రువుయొక్కయు, తనయొక్కయు, శక్త్యాదీనాం-శక్తి దేశకాలములు మొదలయినవాటియొక్క, బలాబలం-బలదౌర్బల్యములను, పరిచ్ఛిద్య-నిర్ణయించి, ఏధిః-ఆశక్త్యాదులచేత, పరస్మాత్ - శత్రువుకంటెను, బలిష్ఠః,చేత్ - తానుఎక్కువబలముగలవాడైయున్నచో, యయౌ - దండయాత్రచేసెను. అన్యథా - అట్లుగాక శత్రువే మిన్నయైనచో, ఆస్త - నిలిచిపోయెను. "యదా మన్యేత భావేన హృష్టం పుష్టం బలం స్వకమ్, పరస్య విపరీతం చేత్తదా యాయా దరీన్ప్రతి యదాతు స్యాత్ పరిక్షీణో వాహనేన బలేనచ తదా సీత ప్రయత్నేన శనకైఃసాంత్వయన్నరీన్" అని మనువు చెప్పినమార్గమునుసరించి తనబలము సంతోషముతో దృఢముగానుండి శత్రువు తగ్గుదశలోనున్నప్పుడు యుద్ధము చేయుచును, తానే తక్కువదశలో నున్నట్లు తోచినప్పుడు బలిష్ఠుడైన శత్రువును మంచి మాటలతో ననుకూలపరచుచు స్వస్థానమునుండి కదలకయు రాజ్యమును నిర్వహించెనని భావము. ఈ శ్లోకము 58 వ శ్లోకమునకు భూషణ ప్రాయము.

శ్లో. కోశేనాశ్రయణీయత్వ మితి తస్యార్థసంగ్రహాః,
అంబుగర్భో హి జీమూత శ్చాతకై రభినంద్యతే. 60

వ్యాఖ్య : కోశేన-ధనమును గూర్చుటచేత, ఆశ్రయణీయత్వం-ఉపజీవి జనముచేత ఆశ్రయింపఁదగియుండుట, (భవతి-జరుగును) ఇతి-ఇట్లని, తస్య-అతనియొక్క, అర్థసంగ్రహాః-ధనమును జేర్చియుంచుట. అంబుగర్భః-జలము గర్భమునందుగల, జీమూతః-మేఘము,చాతకైః-చాతక పక్షులచేత, అభినంద్యతే, హి-మెచ్చుకొనఁబడుచున్నదిగదా (సేవింపఁబడుచున్నదిగదా). "ధర్మ హేతో స్తథార్థాయ భృత్యానాం రక్షణాయచ ఆపదర్థంచ సంరక్ష్యః కోశో ధర్మవతా సదా"-ధర్మాచరణము కొఱకును, అర్థసంపదను పెంచుటకొఱకును, భృత్యుల రక్షణముకొఱకును, ఆపదలు నివారించుట కొఱకును, ధర్మాత్ముఁడగురాజుచేత ధనాగారము రక్షింపఁదగియుండును. అను కామందక నీతి వచనానుసారముగను, లోకమున జలగర్భములైన మేఘములనే చాతకములు సేవించుచుండునను దృష్టాంతము నెఱిఁగియున్నందునను, బహుజనాశ్రయణీయత్వమును బొందుటకే యతఁడు కోశమును పెంచుచుండెనుగాని లోభముచేత మాత్రము కాదని భావము.

శ్లో. పరకర్మాపహాః సోఽభూ దుద్యతః స్వేషు కర్మసు,
ఆవృణో దాత్మనో రంధ్రం రంధ్రేషు రిపవోఽపహాన్ 61

వ్యాఖ్య: సః-అతడు, పరకర్మాపహాః—పర-శత్రువులయొక్క, కర్మ-సేతునిర్మాణ వార్తాప్రచారాది క ర్మ ల ను, అపహాః-నశింపఁజేయువాఁడగుచు స్వేషు-తనవియగు, కర్మసు-నిర్మాణకర్మలయందు, ఉద్యతః-ఉద్యుక్తుఁడు, అభూత్-అయ్యెను. రిపూన్-శత్రువులను, రంధ్రేషు-వారి కష్ట నమయముల యందు, అపహరన్-కొట్టుచు, ఆత్మనః-తనయొక్క, రంధ్రం-వ్యసనాదికమును ఆవృణోత్-దాచియుంచెను. "నాస్యచ్ఛిద్రం పరో విద్యా ద్విద్యాచ్ఛిద్రం పర స్యతు। గూహేత్కూర్మ ఇవాంగాని రక్షేద్ధ్వవర మాత్మనః" అని చెప్పిన మనువు వచనము ననుసరించి తన లోపముల నెఱుకపడనీయక, పరులను వారి కష్టసమయములందు జయించుచు, వారి యభివృద్ధికి నాటంకముల సృజించుచు తన దేశపు నిర్మాణకార్యక్రమములను సాగించుచుండెను.

శ్లో. పిత్రా సంవర్ధితో నిత్యం కృతాస్త్రః సాంపరాయికః,
తస్య దండవతో దండః స్వదేహాన్న వ్యశిష్యత. 62

వ్యాఖ్య : దండవతః-దమనము నెఱిఁగిన లేదా మంచిమూల బలముగల వాఁడైన, తస్య-ఆ రాజునకు, పిత్రా-తండ్రిచేత, నిత్యం-ప్రతిరోజును, సంవర్ధితః-పోషింపఁబడినదియు, కృతాస్త్రః-నేర్పఁబడిన యస్త్రప్రయోగములుగల దియు, సాంపరాయికః-యుద్ధమునం దుపయోగించునదియు నగు, దండః-సైన్యము,స్వదేహాత్-తన శరీరము కంటే, న, వ్యశిష్యత-భిన్నముగా లేకుండెను. తండ్రియైన కుఱునిచేత తానెట్లు నిత్యసంవర్ధితుఁడై, కృతాస్త్రుఁడై, సాంపరాయికుఁడై యుండునట్లు పెంచఁబడెనో, అట్లే నిత్యమును పోషించి, అస్త్ర ప్రయోగములునేర్పి, యుద్ధమున కర్హమగునట్లు చేయఁబడిన మూలబలమును అతిథి తనదేహమునువలె కాపాడుకొనుచుండెనని భావము. "యుద్ధాయత్యోఃసంపరాయః" అని యమరము. "దండో యమే మానభేదే లగుడే దమసైన్యయోఃః" అని విశ్వనిఘంటువు.

శ్లో. సర్పస్యేవ శిరోరత్నం నాస్య శక్తిత్రయం పరః,
స చకర్ష పరస్మాత్తద్దయస్కాంత ఇవాయసమ్. 63

వ్యాఖ్య : సర్పస్య-పామయొక్క, శిరోరత్నం, ఇవ-తలపైనున్న రత్నమునువలె, అస్య-ఈరాజుయొక్క, శక్తిత్రయం-శక్తిత్రయమును, పరః-శత్రువు, న చకర్ష-లాగలేకపోయెను. సః-అతఁడుమాత్రము, పరస్మాత్-శత్రువునుండి, తత్-ఆ శక్తి త్రయమును, అయస్కాంతః - సూదంటు రాయి, ఆయసం, ఇవ - ఇనుప ముక్కనువలె, చకర్ష - లాగి వేసెను. సర్పము తలపైనున్న మణిని దివ్యదృష్టిని లాగలేనట్లు, అతనికిఁగల శక్తిత్రయమును, అనఁగా ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి అనువానిలో దేనినిగూడ భగ్నపరుపలేకపోయెననియు నతఁడుమాత్రమా శక్తిత్రయమును శత్రువునుండి అయస్కాంతము ఇనుపముక్కనువలె లాగివేసెననియు భావము. అతనిముందు శత్రువులు శక్తిహీనులై రని యర్థము: ఉపమాలంకారము.

శ్లో. వాపీష్వివ స్రవంతీషు, వనేషూపవనేష్వివ,
సార్థాః స్వైరం స్వకీయేషు చేరు ర్వేశ్మస్వివాద్రిషు. 64

వ్యాఖ్య : స్రవంతీషు-నదులయందు, వాపీషు, ఇవ-బావులయందువలెను, వనేషు-అరణ్యములయందు, ఉపవనేషు, ఇవ-ఉద్యానవనములందువలెను, అద్రిషు-పర్వతములయందు, స్వకీయేషు, వేశ్మసు, ఇవ-స్వంతములైనయిండ్లయందువలెను, సార్థాః-వైశ్యులుమొదలగు వర్తకులు, స్వైరం-స్వేచ్ఛగా, చేరుః-తిరుగుచుండిరి. అతని రాజ్యమునందు వాణిజ్యమును జేయువారు నదీ వన పర్వత ప్రాంతములందు దొంగలభయముగాని క్రూరమృగముల భయముగాని లేక స్వేచ్ఛగా తమ గృహములందువలెఁ దిరుగుచు వాణిజ్యమును సాగించుచుండిరని భావము.

శ్లో. తపో రక్షన్ స విఘ్నేభ్య స్తస్కరేభ్యశ్చ సంపదః,
యథాస్వ మాశ్రమై శ్చక్రే వర్ణైరపి షడంశభాక్. 65

వ్యాఖ్య : విఘ్నేభ్యః-విఘ్నములనుండి, తపః-తపస్సును, రక్షన్-రక్షించుచున్నవాఁడును, తస్కరేభ్యః-దొంగలనుండి, సంపదః, చ-సంపదలను సైతము, రక్షన్-రక్షించుచున్నవాఁడును నగు, సః-అతిథి, ఆశ్రమైః-బ్రహ్మచర్యాద్యాశ్రమముల ద్వారాను, వర్ణైః, అపి-బ్రాహ్మణాదివర్ణముల ద్వారాను, యథాస్వం-వారివారి యాదాయము నతిక్రమింపక, షడంశభాక్-ఆఱవభాగమును పన్నుగాఁబొందువానినిగా, చక్రే-చేసికొనెను. బ్రాహ్మణాదివర్ణములాచరించు తపస్సులకు విఘ్నములు వాటిల్లనీయక, వైశ్యాదుల సంపదలకు దొంగలభయమును బాపి, వారు వారార్జించిన ధనతపోరాసుల ప్రమాణమునకు దగిన యాఱవభాగములను పన్నుగా గ్రహించుచుండెను. అట్లు రక్షణముచేయగల్గినప్పుడే రాజు పన్నులను దీసికొనుట కర్హుఁడగునని భావము.

శ్లో. ఖనిభిః సుషువే రత్నం క్షేత్రైః సస్యం వనైర్గజాన్,
దిదేశ వేతనం తస్మై రక్షాసదృశ మేవ భూః. 66

వ్యాఖ్య : భూః-భూదేవి, తస్మై-అతని కొఱకు, రక్షాసదృశం, ఏవ-రక్షణకు తగినట్లుగానే, వేతనం-భృతిని, దిదేశ-ఇచ్చెను. (కథం-ఎట్లనగా)

ఖనిభిః-గనుల ద్వారా, రత్నం-మాణిక్యాది రత్నములను (జాత్యేక వచనము), క్షేత్రైఃపొలములద్వారా, సస్యం-పైరును, వనైఃఅరణ్యములద్వారా, గజాన్-ఏనుఁగులను, సుషువే-కనెను. అతఁడు భూపరిపాలనమును చక్కగాఁ జేయుచుండుటచేత భూదేవి సంతసించి యతనికిఁ దగిన వేతనముగా గనులనుండి రత్నాలను క్షేత్రములనుండి పైరు పంటలను, వనములనుండి గజములను సమృద్ధిగా నిచ్చుచుండెను.

శ్లో. స గుణానాం బలానాంచ షణ్ణాం షణ్ముఖవిక్రమః,
బభూవ నియోగజ్ఞః సాధనీయేషు వస్తుషు. 67

వ్యాఖ్య : షణ్ముఖవిక్రమఃకుమారస్వామియొక్క పరాక్రమమువంటి పరాక్రమముగల, సఃఆరాజు, షణ్ణాం-ఆరైన, గుణానాం-సంధివిగ్రహాది గుణములయొక్కయు, బలానాం, చ-మూలభృత్యాది బలములయొక్కయు, సాధనీయేషు-తాను సాధింపఁదగినట్టి, వస్తుషు-అర్థములయందు, వినియోగజ్ఞఃఉపయోగింపవలసిన పద్ధతి నెఱిఁగినవాఁడు, బభూవ-అయియుండెను. 1. సంధి (పరరాజుతోనేకీభవించుట), 2. విగ్రహము (శత్రుమండలముతో యుద్ధము చేయుట), 3. యానము (తాను ఎక్కువ బలవంతుఁడుగానో లేక శత్రువునకు భిన్నము కలిగియున్నప్పుడో యుద్ధమునకుఁ గదలిపోవుట), 4. ఆసనము (దేశకాలముల ననుసరించి దుర్గములందుచేరి కదలకుండుట), 5. ద్వైధీభావము (తనపై కిడ్డలు శత్రువులు వచ్చినప్పుడు, ఒకనితో మైత్రిచేసికొని రెండవానితో విరోధించుట) 6. సమాశ్రయము (తాను శక్తిహీనుఁడైనప్పుడు బలవంతుఁడగువాని నాశ్రయించుట) అనుషడ్గుణములయొక్కయు, రథబల, గజబల, అశ్వబల, పదాతిబల, మూలబల, నౌబలములనఁబడు షడ్బలములయొక్కయు వినియోగమెట్లు చేయవలెనో యెఱిఁగి సాధింపదగిన ప్రయోజనముల నారాజు సాధించుచుండెనని భావము.

శ్లో. ఇతి క్రమాత్ ప్రయుంజానో రాజనీతిం చతుర్విధామ్,
ఆతీర్థా దప్రతీఘాతం స తస్యాః ఫల మానశే. 68

వ్యాఖ్య ; ఇతి-ఇట్లు, చతుర్విధాం-సామాద్యుపాయములచే నాల్గువిధము లైన, రాజనీతిం-దండనీతిని, క్రమాత్-సామ, దాన, భేద దండముల క్రమము వలననే, ప్రయుంజానఃప్రయోగించుచున్న, సఃఅతఁడు, ఆతీర్థాత్-మంత్రి

మొదలయిన అష్టాదశ సహాయపురుషులనుండి, తస్యాఃఆరాజనీతియొక్క, ఫలం-ఫలితమును, అప్రతిఘాతం-అప్రతిబంధముగా, ఆనశే-పొందెను. తన చతుర్విధరాజనీతిని మొదట సామము, తరువాత దానము, పిమ్మటభేదము, ఆ పిమ్మట దండము అనువరుసలోనే మంత్రి మొదలగు తీర్థములయందు (సహాయులపైన) ఎవరికిఁదగినయుపాయమును వారిపై ప్రయోగించుచు దానికిఁదగిన సత్ఫలితములను పొందెనని భావము. "యోనౌ జలావతారేచ మంత్రాద్యష్టాదశస్వపి పుణ్యక్షేత్రే తథాపాత్రే తీర్థం స్యాత్" అని హలాయుధ నిఘంటువు తీర్థశబ్దమున కర్థములు చెప్పినది. తీర్థశబ్దమునకు రాజులు సుస్థిరపరిపాలనమునకై యేర్పరచుకొన్న అధికారిపర్గమని యర్థము. వారు మంత్రాద్యష్టాదశ సంఖ్యాకులు : మంత్రులు, పురోహితులు, యువరాజు, సేనాపతి, దౌవారికులు, అంతర్వేశికులు, కారాగారాధికారులు, కోశాధ్యక్షులు, కార్యనియోజకులు, ప్రాడ్వివాకులు, సేనానాయకులు, నగరాధ్యక్షులు, కర్మాంతికులు, సభాధికృతులు, ధర్మాధికారులు, దండపాలురు (పోలీసులు), దుర్గపాలురు, రాష్ట్రాంత పాలకులు. అని పదునెనిమిది విధములు. వీరందఱును అతనికి లొంగియుండిరని తాత్పర్యము.

శ్లో. కూటయుద్ధవిధిజ్ఞేఽపి తస్మిన్ సన్మార్గయోధిని,
భేజే ఽభిసారికా వృత్తిం జయశ్రీ ర్వీరగామినీ. 69

వ్యాఖ్య : కూటయుద్ధ విధిజ్ఞే, అపి-కపట యుద్ధముయొక్క విధానమును ఎఱిగియున్నవాఁడైనను, సన్మార్గయోధిని-ధర్మపద్ధతియందు యుద్ధము చేయునట్టి, తస్మిన్-ఆయతిథి విషయమున, వీరగామినీ-వీరులనుజేరు స్వభావముగల, జయశ్రీఃజయలక్ష్మి, అభిసారికావృత్తిం-అభిసారికానాయికయొక్క పద్ధతిని, భేజే-అపలంబించెను. అనేకవిధములగు కపటోపాయములతో యుద్ధమునుజేయరీతుల నెఱిగినవాఁడైనను ధర్మమును విడువక చక్కనిమార్గమున యుద్ధముఁజేయుచుండిన యారాజును వీరులవద్దకే చేరునట్టి జయలక్ష్మి అభిసారికవలె వెదకికొని వచ్చి చేరెననియు, సర్వత్ర జయ మతనిదేయనియు భావము. "కాంతార్థినీతు యా యాతి సంకేతం సాభిసారికా" అని అభిసారికా లక్షణము.

శ్లో. ప్రాయఃప్రతాపభగ్నత్వా దరీణాం తస్య దుర్లభః,
రణో గంధద్విపస్యేవ గంధభిన్నాన్యదంతినః. 70

వ్యాఖ్య : అరీణాం-శత్రువులందఱును, ప్రతాపభిన్నత్వాత్ - ఆతని ప్రతాపముచేతనే చెదిరిపోయియుండుటవలన, తస్య-అతిథికి, గంధభిన్నాన్యదంతినః—గంధ-తన మదవాసనచేతనే, భిన్న-పాఱిపోయిన, అన్యదంతినః-ఇతర గజములుగల, గంధద్విపస్య, ఇవ-మదపుటేనుఁగునకువలె, ప్రాయః-సాధారణముగా, రణః-యుద్ధము, దుర్లభః-లభింపనిదై యుండెను. మదపుటేనుఁగుయొక్క మదవాసనచేతనే మారము పాఱిపోవు సామాన్య గజములుగల గంధగజమునకువలె, తన ప్రతాపముచేతనే భగ్నులగుచున్న శత్రుసమూహము గల అతిథికి యుద్ధమే దుర్లభముగా నుండెను. అనఁగా నతఁడంతప్రతాపవంతుఁడై యుండెననియు, ఎవ్వరును అతనితో యుద్ధమునకు దిగకుండిరనియు భావము.

శ్లో. ప్రవృద్ధౌ హీయతే చంద్ర సముద్రోఽపి తథావిధః,

స తు తత్సమవృద్ధిశ్చ న చాభూత్తావివ క్షయా. 71

వ్యాఖ్య : ప్రవృద్ధౌ (సత్యాం)-అభివృద్ధి పూర్తికాగానే, చంద్రః-చంద్రుఁడు, హీయతే-తగ్గిపోవును, సముద్రః, అపి-సముద్రుఁడుగూడ, తథావిధః-అట్టివాఁడే, సః, తు-ఆరాజన్నతో, తత్సమవృద్ధిశ్చ-ఆచంద్ర సముద్రుల వృద్ధివంటి యభివృద్ధిగలవాఁడయ్యెను, తావివ (తౌ + ఇవ) - వాఁటివలె, క్షయా-నశించువాఁడుమాత్రము నచాభూత్-కాలేదు. అత్యంతమైన అభివృద్ధి జరిగినపిమ్మట చంద్రుఁడును, సముద్రుఁడును తగ్గిపోవుదురు. అతిథి వారివలె పూర్ణవృద్ధిని మాత్రము పొందెనుగాని, వారివలె మఱల తగ్గిపోలేదు. వృద్ధితప్ప నతనికి క్షయము లేకుండెనని భావము. వ్యతిరేకాలంకారము గమ్యము.

శ్లో. సంత స్తస్యాభిగమనా దత్యర్థం మహతః కృశాన్,

ఉదధే రివ జీమూతాన్ ప్రాపుర్దాతృత్వ మర్థినః. 72

వ్యాఖ్య : అత్యర్థం-మిక్కిలి, కృశాన్-దరిద్రులై, అర్థినః-యాచకులైన, సంతః-విద్వాంసులు, మహతః-గొప్పవాఁడైన, తస్య- ఆ రాజుయొక్క, అభిగమనాత్ - సన్నిధినఁ జేరుటవలన, ఉదధేః - సముద్రముయొక్క, అభిగమనాత్ - సమీపమునకు వెళ్ళుటవలన, జీమూతాన్, ఇవ - మేఘములుపలె, దాతృత్వం - దానము చేయగల్గుటను, ప్రాపుర్-పొందిరి.

మిక్కిలి దరిద్రులైయుండుటచేత యాచకులుగా మారిన విద్వాంసులు ఆరాజు నాశ్రయించుటవలన, సముద్రము నాశ్రయించిన మేఘములు మొదట కృశించి యున్నను సముద్రోదకలబ్ధిచేత దాతృత్వమును పొందినట్లు, తామును ఇతరులకు దానముఁజేయఁగలవారుగా మారిరి. అనఁగా నారాజు విద్వాంసులకు దానమున కును, భోగమునకును, సరిపోవునంతటి ధనము నిచ్చుచుండెనని భావము.

శ్లో. స్తూయమానః స జిహ్రాయ స్తుత్య మేవ సమాచరన్,
తథాపి వవృధే తస్య తత్కారిద్వేషిణో యశః. 73

వ్యాఖ్య : సః-ఆరాజు, స్తుత్యం, ఏవ-స్తోత్రముచేయఁదగిన కార్యమునే, సమాచరన్-చేయుచున్నవాఁడగుచున్నందున, స్తూయమానః-స్తోత్రముచేయఁబడుచున్నవాఁడగుచు, జిహ్రాయ-సిగ్గుపడెను. తథాపి-అట్లుసిగ్గు పడువాఁడైనను, తత్కారిద్వేషిణః—తత్-ఆస్తోత్రములను, కారి-చేయుచున్న వారిని, ద్వేషిణః-అసహ్యించుకొనుచున్న, తస్య-ఆయతిథియొక్క, యశః-కీర్తి, వవృధే-వృద్ధినిఁజెందెను. అతిథి ప్రజలకు మేలుకలిగించు మంచిపనుల నెన్నిఁటినో చేయుచుండెను. కాని యాపనులను పురస్కరించుకొని తన నిత రులు స్తోత్రముచేయునప్పుడు సిగ్గుపడుచుండెను. అట్లు సిగ్గుపడుచు స్తోత్ర ములుచేయువారిని అసహ్యించుకొనుచున్నను అతనికీర్తి వృద్ధిచెంది దిక్కులకు వ్యాపించెను. గుణాఢ్యునికి తనస్తుతియందు లజ్జకలుగుటయే భూషణమనియు, మంచిపనులు చేయుటవలన కీర్తివచ్చునుగాని "మంచివాఁడు, గొప్పవాఁడు" అని పొగడించుకొనుటవలన రాదనియు భావము..

శ్లో. దురితం దర్శనేన ఘ్నన్ తత్త్వార్థేన నుదన్ తమః,
ప్రజాః స్వతంత్రయాంచక్రే శశ్వత్తూన్యా ఇవోదితః. 74

వ్యాఖ్య : సః-అతఁడు, ఉదితః-ఉదయించిన. సూర్యః, ఇవ-సూర్యుఁడు వలె, దర్శనేన-తనను జూచుటచేత, దురితం-పాపమును, ఘ్నన్-నశింపఁ జేయుచున్నవాఁడగుచు, తత్త్వార్థేన - వస్తుతత్వముయొక్క సమర్థనముచేత, తమః-అజ్ఞానమును (చీకటిని), నుదన్-తొలఁగించుచును, శశ్వత్-నిరంత రము, ప్రజాః-జనులను, స్వతంత్రయాంచక్రే - స్వాధీనులనుగాఁ జేసికొనెను. అభ్యుదయమును పొందినఅతిథి, ఉదయించిన

సూర్యునివలె, తన దర్శనముచేత పాపమును దొలగించుచు, యాథార్థవస్తు ప్రకటనముచేత అజ్ఞానాంధకారమును నివర్తించుచు, నిత్యము ప్రజలను స్వాతంత్ర్య విలసితులను జేయుచుండెను. సూర్యదర్శనమువలెనే రాజ దర్శనము పాపమును దొలఁగించునని మనువు చెప్పెను. "అగ్నిచి త్కపిలా సత్త్రీ రాజా భిక్షు ర్మహోదధిః। దృష్టమాత్రా పునంత్యేతే తస్మా త్పశ్యేత నిత్యశః" సూర్యుఁడంధకారమును దొలఁగించి సర్వవస్తువులు గోచరము చేయుచున్న ట్లరాజు సత్యములను ప్రకటించుచు ప్రజలయజ్ఞానమును దొలఁగించి వారిని స్వాధీనపరచుకొనుచుండె నని భావము.

శ్లో. ఇందో రగతయః పద్మే సూర్యస్య కుముదేఽంశవః,
గుణా స్తస్య విపక్షేఽపి గుణినో లేభిరేఽంతరమ్. 75

వ్యాఖ్య : ఇందోః-చంద్రునియొక్క, అంశవః-కిరణములు, పద్మే-కమల మునందు, అగతయః-ప్రవేశములేనివి. సూర్యస్య-సూర్యునియొక్క, అంశవః-కిరణములు, కుముదే-కలువయందు, అగతయః-ప్రవేశములేనివి. గుణినః-గుణవంతుఁడగు, తస్య-అతనియొక్క, గుణాః-సద్గుణములైతే, విపక్షే, అపి-శత్రువునందును, అంతరం-ప్రవేశావకాశమును లేభిరే-పొందినవి. చంద్రకిరణ ములు శత్రువైన పద్మమునందు ప్రవేశించవు, అట్లే సూర్యకిరణములు కలువ యందుఁ ప్రవేశింపవు. కాని యతని సద్గుణములు శత్రువునందును ప్రవేశించును అనఁగా నారాజు శత్రువులకును అపకారము చేయకుండెననియు, శత్రువులును అతనిని పొగడుచుండిరనియు భావము.

శ్లో. పరాభిసంధానపరం యద్యప్యస్య విచేష్టితమ్,
జిగీషో రశ్వమేధాయ ధర్మ్య మేవ బభూవ తత్. 76

వ్యాఖ్య : అశ్వమేధాయ-అశ్వమేధయాగము కొఱకు. జిగీషోః-శత్రువు లను జయింపఁదలచిన, అస్య-అతిథియొక్క, విచేష్టితం-దిగ్విజయరూపమగు కృత్యము, యద్యపి-విచారింపగా, పరాభిసంధానపరం—పర-శత్రువులయొక్క, అభిసంధానపరం-వంచనాప్రధానమే, తథాపి-అట్లయ్యును. తత్-అది, ధర్మ్యం, ఏవ-ధర్మయుక్తమే, బభూవ-అయియుండెను. అశ్వమేధయాగాంగముగా దిగ్వి

జయమును జేయఁదలచిన యతని ప్రవర్తనము ఆలోచింపగా శత్రువంచనమే. కాని అదియును ధర్మమునకు దూరముగాలేకుండెను. అనఁగాఁ దనసర్వాధిక్యమును పరరాజులచేత అంగీకరింపఁజేయు ప్రయత్నమేకాని వారి సంపదలు కొల్లగొట్టి వారికి కష్టములు గలిగించుట లేకుండెను. "మంత్రప్రభావోత్సాహశక్తిభిఃపరాన్ సందధ్యాత్" అను కౌటిల్యార్థశాస్త్ర వచనానుసరణమేకాని శత్రువినాశముఁ జేయదలంపలేదని భావము.

శ్లో. ఏవ ముద్యత ప్రభావేణ శాస్త్రనిర్దిష్టవర్త్మనా,
వృషేవ దేవో దేవానాం రాజ్ఞాం రాజా బభూవ సః. 77

వ్యాఖ్య : ఏవం-ఇట్లు, శాస్త్రనిర్దిష్టవర్త్మనా-శాస్త్రముచేత ఉపదేశింపఁబడిన పద్ధతిగల, ప్రభావేణ-కోశదండములవలనఁ గలిగిన తేజస్సుచేత, ఉద్యన్-అభివృద్ధినిఁజెందుచున్న, సః-ఆయతిథి, వృషా-ఇంద్రుఁడు, దేవానాం-దేవతలకు, దేవః, ఇవ-దేవుఁడువలె, రాజ్ఞాం-రాజులకు, రాజా-రాజు, బభూవ-అయ్యెను. పూర్వోక్తరీతిగా అతఁడు శాస్త్రముపదేశించిన మార్గమును తప్పని ప్రభావముచేత నభ్యున్నతిని,ఁ జెందుచు ఇంద్రుఁడు దేవదేవుఁడైనట్లు తాను రాజరాజు (సార్వభౌముఁడు) అయ్యెననిభావము. "సప్రతాపః ప్రభావశ్చ యత్తేజఃకోశదండజమ్" అనియమరము. కోశము, రాజ్యపాలనపద్ధతి, పెరుగుటయే తేజము, ప్రభావము, ప్రతాపము అనఁబడునని యర్థము.

శ్లో. పంచమం లోకపాలానా మూచుఃసాధర్మ్యయోగతః,
భూతానాం మహతాం షష్ఠ మష్టమం కులభూభృతామ్. 78

వ్యాఖ్య : తం-అతనిని, సాధర్మ్యయోగతఃసమానధర్మసంబంధమువలన (వరుసగా లోకసంరక్షణ, పరోపకార, భూభరణరూపములగు సమానగుణముల పోలికవలన అని యర్థము), లోకపాలానాం-లోకపాలురైన ఇంద్ర, యమ, వరుణ, కుబేరులకు, పంచమం-అయిదవవానినిగను, మహతాం-గొప్పవియగు, భూతానాం-పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, అనఁబడు పంచభూతములకు, షష్ఠం-ఆఱవవానినిగాను, కులభూభృతాం-మహేంద్రము, మలయము, సహ్యము, ఋక్షమంతము, ఋష్యపర్వతము, వింధ్యము, పారియాత్రము, అను సప్తకులపర్వతములకు, అష్టమం-ఎనిమిదవవానినిగను, ఊచుఃఁ-

పెద్దలు చెప్పిరి యనియర్థము. అతిథి, యింద్రాదులవలె లోకసంరక్షణము చేయుచు, పంచభూతములవలె పరోపకారమునుజేయుచు, కులపర్వతములవలె భూభారమును వహించుచు రాజ్యపాలనముఁజేయుచుండెనని భావము.

శ్లో. దూరాపవర్జితచ్ఛత్రై స్తస్యాజ్ఞాం శాసనార్పితామ్
దధుఃశిరోభి ర్భూపాలా దేవాఃపౌరందరీ మివ. 79

వ్యాఖ్య : భూపాలాఃరాజులందఱును, శాసనార్పితాం—శాసన-అధికారపత్రములందు, అర్పితాం-ఉంచఁబడిన(చెప్పఁబడిన), తస్య-అతనియొక్క, ఆజ్ఞాం-ఆజ్ఞను, దేవాఃదేవతలు, పౌరందరీం, ఇవ-ఇంద్రునియాజ్ఞనువలె, దూరాపవర్జితచ్ఛత్రైఃదూరమునఁబాఱవేయఁబడిన ఛత్రములుగల, శిరోభిఃశిరస్సుల చేత, దధుఃధరించిరి. దేవతలు ఇంద్రునియాజ్ఞను తలధరించినట్లు, అతఁడు శాసనపత్రములందు చేసిన యానతని రాజులందఱును శిరసావహించిరి. 'దూరాపవర్జితచ్ఛత్రైఃʼ అనుటవలన రాజులందఱును తమతమ ఆతపత్రములను దూరముపెట్టి అతిథియొక్క యేకచ్ఛత్రాధిపత్యము నంగీకరించి యతనిశాసనానువర్తులై యుండిరని భావము. "పురందరస్య ఇయం పౌరందరీ" అని విగ్రహము.

శ్లో. ఋత్విజఃస తథానర్చ దక్షిణాభి ర్మహాక్రతౌ
యథా సాధారణీభూతం నామాస్య ధనదస్య చ. 80

వ్యాఖ్యఃసఃఆరాజు, మహాక్రతౌ-అశ్వమేధయాగమునందు, ఋత్విజఃయజ్ఞముచేయించినవారిని, దక్షిణాభిఃదక్షిణలచేత, తథా-ఆవిధముగా, ఆనర్చ-పూజించెను. యథా-ఏవిధముగా, అస్య-ఈ రాజుయొక్కయు, ధనదస్య, చ-కుబేరునియొక్కయును, నామ-పేరు, సాధారణీభూతం-సమానమైనదో (ఏకీభవించినదో). అశ్వమేధ యాగమునందు పౌరోహిత్యమును నెఱపిన ఋత్విజులకు ఆ రాజు భూరిదక్షిణలిచ్చి సత్కరించెను. అట్లు బహుళధనము నిచ్చుట వలన నతనిని జనులు "ధనదుఁడు, ధనదుఁడు" అని పొగడుటచేత "ధనద" నామధేయ మతనికిని కుబేరునికిని ఒకటిగానే మారినదని భావము. కుబేరుని పేరైనప్పుడు "ధనద" శబ్దమునకు "ధనం దయతే-రక్షతి ఇతి ధనదఃʼʼ అనియు, అతిథి పేరైనప్పుడు "ధనం దదాతి ఇతి ధనదఃʼʼ అనియు వ్యుత్పత్తులు గమ

నింపవలెనని చారిత్రవర్ధనుఁడను రఘువంశ వ్యాఖ్యాత ప్రాసినది మిక్కిలి సమంజసముగా నున్నది.

శ్లో. ఇంద్రా ద్వృష్టి ర్నియమిత గదో ద్రేకవృత్తి ర్యమో ఽభూ
ద్యాదోనాథః శివజలపథః కర్మణే నౌచరాణామ్,
పూర్వా పేక్షీ తదను విదధే కోశవృద్ధిం కుబేర
స్తస్మిన్ దండోపనతచరితం భేజిరే లోకపాలాః. 81

వ్యాఖ్య : ఇంద్రాత్-ఇంద్రునివలన, వృష్టిః-వర్షము, అభూత్-కురిసెను. యమః-యమధర్మరాజు, నియమితగదోద్రేకవృత్తిః— నియమిత - ఆపివేయ బడిన, గద-రోగములయొక్క, ఉద్రేక-అతిశయమునందలి, వృత్తిః-వ్యాపారము గలవాఁడు అభూత్-అయ్యెను. యాదోనాథః- జలజంతువుల కధిపతియగు వరుణుఁడు, నౌచరాణాం-ఓడలయందు తిరుగువారియొక్క, కర్మణే-సంచారము కొఱకు, శివజలపథః-భద్రతగల జలమార్గము లేర్పరచినవాఁడు, అభూత్-అయ్యెను. తదను-వారిననుసరించి, పూర్వాపేక్షీ-పూర్వులగు రఘువు, రాముఁడు మొదలగువారియందు భక్తిగల, కుబేరః-కుబేరుఁడు, కోశవృద్ధిం-ధనసంచయాభి వృద్ధిని, విదధే-చేసెను. (ఇత్థం-ఇట్లు) లోకపాలాః-లోకపాలురైన యింద్రా దులు, తస్మిన్-ఆ రాజు విషయమున, దండోపనతచరితం—దండోపనత-శరణా గతునియొక్క, చరితం-నడవడిని, భేజిరే-పొందిరి. "దుర్బలో బలవత్సేవీ విరుద్ధా చ్చంకితాదిభిః, వర్తేత దండోపనతో భర్తర్యేవ మవస్థితః" అను కౌటిల్య నీతి ననుసరించి దుర్బలుఁడైనరాజు బలవంతుని సేవించునట్లు దండోపనతులైన దిక్పాలురలో ఇంద్రుఁడు వర్షములు గురిపించుచును, యముఁడు ప్రజలకు రోగ బాధను తగ్గించుచును, కుబేరుఁడు రాజునకు ధనరాసులు గూర్చుచును అతిథి యొక్క రాజ్యపాలనమున తమంతటతామే సహాయపడుచు వశవర్తులై యుండి రని భావము.

ఇది మహాకవి కాళిదాస కృత రఘువంశ
కావ్యమునందలి అతిథివర్ణనమను సప్తదశసర్గకు
కేశవపంతుల. సరసింహాశాస్త్రి
రచిత తెలుఁగు లఘు
వ్యాఖ్య.

373

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

అష్టాదశసర్గము

శ్లో. స నైషధస్యార్థపతేః సుతాయా
ముత్పాదయామాస నిషిద్ధశత్రుః,
అనూనసారం నిషధా న్నగేంద్రాత్
పుత్రం యమాహుర్నిషధాఖ్యమేవ. 1

వ్యాఖ్య : నిషిద్ధశత్రుః-నివారింపఁబడిన శత్రువులుగల, సః-ఆయతిథి రాజు, నైషధస్య-నిషధదేశమున కధిపతియగు, అర్థపతేః-అర్థపతి యనుపేరుగల రాజుయొక్క, సుతాయాం-కుమార్తెయందు, నిషధాత్, నగేంద్రాత్-నిషధమను పేరుగల పర్వతరాజముకంటె, అనూనసారం-తక్కువకాని బలముగల, పుత్రం-కుమారుని, ఉత్పాదయామాస-కనెను. యం-ఏ కుమారుని, నిషధాఖ్యం, ఏవ-నిషధుఁడు అనుపేరు గలవానినిగానే, ఆహుః-అందును పిలిచిరో. వీరుఁడైన యతిథి నిషధదేశాధిపతియగు అర్థపతి కూతురును వివాహమాడి యామెయందు నిషధుఁడను కుమారుని గనెనని భావము. "నిషధ" పర్వతము, మేరువునకు తూర్పుదక్షిణభాగములందున్న పర్వత శ్రేణియనియు, నిషధదేశ రాజధాని మొదట ఆ ప్రాంతమునందున్న "అలకాపట్టణ" మనియు, నలునికాలమున వారు భారతదేశపుమధ్య భాగమునకు పచ్చినయు పాశ్చాత్యవిమర్శకులయభిప్రాయము. "నైషధస్య" కురునాదిభ్యోణ్యఃు అనుపాణిని సూత్రముచేత నైషధ్యఃు" అని కావలసియున్నను, శేషవివక్షయందు "నైషధఃు" అను అణ్ ప్రత్యయాంత రూపము సాధువే యనివ్యాకర్తలు నిర్ణయించిరి.

శ్లో. తేనోరువీర్యేణ పితా ప్రజాయై
కల్పిష్యమాణేన ననంద యూనా,
సువృష్టియోగాదివ జీవలోకః
సస్యేన సంపత్తిఫలోన్ముఖేన. 2

వ్యాఖ్య : ఉరువీర్యేణ-గొప్పపరాక్రమముగల వాఁడగుటచేత, ప్రజాయై-ప్రజారక్షణము కొఱకు, కల్పిష్యమాణేన-సమర్థుఁడు కాఁగలవాడగు, తేన, యూనా-ఆ యువకుఁడగు నిషధునిచేత, పితా-తండ్రియైన **అతిథి**, సువృష్టి యోగాత్-మంచివర్షములు గురియుటవలన, సంపత్తిఫలోన్ముఖేన-పండుటకు సిద్ధముగానున్న, సస్యేన-పైరుచేత, జీవలోకః, ఇవ-ప్రాణిసమూహమువలె, ననంద-సంతోషించెను. పరాక్రమవంతుఁడై యువకుఁడైన కుమారుఁడు నిషధుఁడు ప్రజాపాలనముఁ జేయఁగలవాఁడగునని అతిథి, సువృష్టియోగమున ఫలోన్ముఖమైన పైరునుజూచిన జీవలోకమువలె హర్షమును జెందెనని భావము.
అలంకారము : ఉపమ.

శ్లో. శబ్దాది నిర్విశ్య సుఖం చిరాయ
తస్మిన్ ప్రతిష్ఠాపితరాజశబ్దః,
కౌముద్వతేయః కుముదావదాతైః
ద్యాం మార్జితాం కర్మభి రారురోహ, 3

వ్యాఖ్య : కౌముద్వతేయః-అతిథి, శబ్దాది-శబ్దస్పర్శాదికమగు, సుఖం-సుఖసాధనమైన భోగ్యవస్తువర్గమును, నిర్విశ్య-అనుభవించి, చిరాయ-బహు కాలముపిమ్మట, తస్మిన్-ఆనిషధుఁడను పుత్రునియందు, ప్రతిష్ఠాపితరాజశబ్దః-నిలుపఁబడిన రాజశబ్దముగలవాఁడగుచు, కుముదావదాతైః-నిర్మలములైన (తెల్ల కలువలవలె స్వచ్ఛమైన యని ప్రతిపదార్థము), కర్మభిః-అశ్వమేధాది పుణ్య కర్మలచేత, ఆర్జితాం-సంపాదింపఁబడిన, ద్యాం-స్వర్గమును, ఆరురోహ-ఎక్కెను.
అతిథిరాజు బహుకాలము రాజ్యసుఖముల ననుభవించి, కుమారుఁడగు నిషధుని రాజునుగాజేసి, తానొనర్చిన పుణ్యకర్మలఫలమగు స్వర్గమును జేరెను.

శ్లో. పౌత్రః కుశస్యాపి కుశేశయాక్షః
ససాగరాం సాగరధీరచేతాః,
ఏకాతపత్రాం భువ మేకవీరః
పురార్గలాదీర్ఘభుజో బుభోజ. 4

వ్యాఖ్య : కుశేశయాక్షః-కమలదళములవంటి కన్నులుగలవాఁడును, సాగరధీరచేతాః-సముద్రమువలె గంభీరమైన చిత్తముగలవాఁడును, ఏకవీరః-ఆసహాయశూరుఁడును, పురార్గళాదీర్ఘ భుజః—పురార్గళా-నగరముయొక్క గవని వాకిటిగడియవంటి, దీర్ఘ భుజః-పొడవైన చేతులుగలవాఁడును, కుశస్య, పౌత్రః అపి-కుశునియొక్క మనుమఁడగు నిషధుఁడు సైతము, ససాగరాం-సముద్రము లతోఁగూడినదియు, ఏకాతపత్రాం-తనయొక్కని ఛత్రమేకలదియు నగు, భువం-భూమిని, బుభోజ-పరిపాలించెను. అందమైన కన్నులుగలవాఁడు, లోతైన మనస్సుగలవాఁడు, అసహాయశూరుఁడు, ఆజానుబాహువు, కుశునిపౌత్రుఁడు నగు నిషధుఁడు సర్వభూమిని ఏకచ్ఛత్రాధిపత్యముగా పాలించెనని భావము. "శతపత్రం కుశేశయమ్, తద్వ్యక్ంభోఽర్గలంనా" అని యమరము. "వర్ణా వృత్తిఃపదేషుచ" అను కావ్యాదర్శవచనానుసారముగా నిచ్చటను, ఈ సర్గయం దంతటను 'అనుప్రాస' మనఁబడు శబ్దాలంకారము.

శ్లో. తస్యానలౌజా స్తనయ స్తదంతే
వంశశ్రియం ప్రాప నలాభిధానః,
యో నడ్వలానీవ గజః పరేషాం
బలాన్యమృద్నా న్నలినాభవక్త్రైః. 5

వ్యాఖ్య : అనలౌజాః-అగ్నివంటి తేజస్సుగలవాఁడును, నలాభి ధానః-నలుఁడ నుపేరుగలవాఁడును అగు, తస్య, తనయః-ఆనిషధునియొక్క కుమా రుఁడు తదంతే-ఆనిషధునియనంతరమున, వంశశ్రియం-వంశముయొక్క రాజ్య లక్ష్మిని, ప్రాప-పొందెను. నలినాభవక్త్రైః-కమలమువంటి ముఖముగల, యః-ఏనలుఁడు, గజః-ఏనుఁగు, నడ్వలాని, ఇవ-కిక్కసగడ్డి నేలలనువలె, పరేషాం-

శత్రువులయొక్క, బలాని-సైన్యములను, ఆమృద్నాత్-క్రొక్కనలిపివేసెనో (మృద-క్షోదే, పరస్మైపది 'శ్నా' వికరణిధాతువునకు 'లఙ్' ప్ర.పు.ఏ.). మదగజము జమ్ముగడ్డినేలలను క్రొక్కవైచినట్లు శత్రుసైన్యములను నలిపివేసిన వీరుఁడు, నలుఁడనురాజు, తండ్రియగు నిషధునియనంతరమున రఘువంశ రాజ్యలక్ష్మినిఁ జేపట్టెనని భావము. ఆలంకారము : ఉపమ, అనుప్రాసము.

శ్లో. నభశ్చరైర్గీతయశాఃస లేభే
నభస్తలశ్యామతనుం తనూజమ్,
ఖ్యాతం నభఃశబ్దమయేన నామ్నా
కాంతం నభోమాస మివ ప్రజానామ్. 6

వ్యాఖ్య : నభశ్చరైఃఆకాశమున సంచరించు గంధర్వాదులచేత, గీత యశాఃగానము చేయఁబడిన కీర్తిగల, సఃఆనలుఁడు, నభస్తలశ్యామతనుం-ఆకాశతలమువంటి శ్యామలదేహము గలవాఁడును, నభశ్శబ్దమయేన-నభఃఅనుశబ్దముతోఁగూడిన, నామ్నా-పేరుతో, ఖ్యాతం-ప్రసిద్ధుఁడును, నభోమాసం, ఇవ-శ్రావణ మాసమువలె, ప్రజానాం-ప్రజలకు, కాంతం-ప్రియుఁడైన, తనూజం-పుత్రుని, లేభే-పొందెను. గొప్పకీర్తిగల నలరాజు నీలమేఘశ్యాముఁడగు నభసుఁడను కుమారుని గనెననియు, ఆకుమారుఁడు ప్రజలకు శ్రావణ మాసమువలె ప్రియుఁడయ్యెననియు భావము. శ్యామలదేహము రామునికాలము నుండి యీ వంశమువారికి ప్రియము, శ్రావణము సస్యాదులతోను, పండుగల తోను ఉండునుగనుక ప్రజలకు ప్రియము. అలంకారము : ఉపమానుప్రాసములు.

శ్లో. తస్మై విసృజ్యోత్తరకోసలానాం
ధర్మోత్తరస్త్వత్ప్రభవే ప్రభుత్వమ్,
మృగైరజర్యం జరసోపదిష్ట
మదేహబంధాయ పున ర్భబంధ. 7

వ్యాఖ్య : ధర్మోత్తరఃధర్మ ప్రధానుఁడగు నా నలుఁడు, ప్రభవే-సమర్థుఁడైన, తస్మై-ఆ నభసునికొఱకు (నభసునికి), తత్-ఆ, ఉత్తరకోసలా

నాం, ప్రభుత్వం-ఉత్తరకోసలదేశాధిపత్యమును, విసృజ్య-వదలిపెట్టి (ఇచ్చి), జరసా-ముదుసలితనముచేత, ఉపదిష్టం-ఉపదేశింపఁబడిన, మృగైః, అజర్యం-మృగములతోఁగలసియుండు స్నేహమును, పునఃమరల, అదేహబంధాయ-దేహబంధము లేకుండుటకొఱకు (జన్మరాహిత్యముకొఱకు), బబంధ-కట్టెను. నభసుఁడు పెరిగి పెద్దవాఁడై సమర్థుఁడైన పిమ్మట రాజ్యాధికారమును అతని కిచ్చి, ధర్మపరాయణుఁడగు నలుఁడు వార్ధకమునందాచరింపవలసిన వానప్రస్థ జీవితమును ఆరణ్యకమృగములతో నేస్తముకట్టి గడుపుటకు, మోక్షసాధనము నకై వనమునకు వెళ్ళెనని భావము. 'అజర్యం' అనగా మైత్రి. "అజర్యం సంగతమ్" అని పాణిని నిపాతము చేసెను. అలం : అనుప్రాసము.

శ్లో. తేన ద్విపానా మివ పుండరీకో
రాజ్ఞా మజయ్యోఽజని పుండరీకః,
శాంతే పితర్యాహృతపుండరీకా
యం పుండరీకాక్ష మివ శ్రితా శ్రీః 8

వ్యాఖ్య : తేన-ఆ నభసునిచేత, ద్విపానాం-ఏనుఁగులకు, పుండరీకః ఇవ-పుండరీకమను పేరుగల దిగ్గజమువలె, రాజ్ఞాం-రాజులకు, అజయ్యఃఁ, జయించుటకు శక్యుఁడుగాని, పుండరీకఃపుండరీకుఁడను పుత్రుఁడు, అజని-జనితుఁడయ్యెను, పితరి-తండ్రియగు నభసుఁడు, శాంతే-స్వర్గముఁజేరగానే, ఆహృతపుండరీకా-తీసికొనఁబడిన శ్వేతపద్మముగల, శ్రీఃలక్ష్మి, యం-ఏ పుండరీకుని, పుండరీకాక్షం, ఇవ-విష్ణుమూర్తినివలె, శ్రితా-ఆశ్రయించినదయ్యెనో. నభసునికి పుండరీకుఁడను పుత్రుఁడు పుట్టెననియు, అతఁడు సామాన్య గజములకు దిగ్గజమగు పుండరీకమువలె రాజులకు అజయ్యుఁడైయుండెననియు! నభసుఁడు దివంగతుఁడుకాఁగానే రాజ్యలక్ష్మి పుండరీకాతపత్రయై పుండరీకునిఁజేరెననియు భావము. పుండరీకము శ్వేతచ్ఛత్రమును సూచించును. విష్ణుసామ్యము "నా విష్ణుః పృథవీపతిః" అను వాక్యమును సూచించును. అలంకారము : ఉపమ అనుప్రాసము.

శ్లో. స క్షేమధన్వాన మమోఘధన్వా
పుత్రం ప్రజా క్షేమ విధానదక్షమ్,
క్ష్మాం లంభయిత్వా క్షమయోపపన్నం
వనే తపః క్షాంతతర శ్చచార. 9

వ్యాఖ్య : అమోఘధన్వా-సఫలమైన ధనుస్సుగల, సః-ఆ పుండరీకుఁడు, ప్రజాక్షేమ విధానదక్షం-ప్రజాక్షేమమును జేయుటయందు సమర్థుఁడును, క్షమయా-శాంతగుణముచేత, ఉపపన్నం-కూడినవాడును నగు, క్షేమధన్వానం-క్షేమధన్వుఁడను పేరుగల, పుత్రం-కుమారుని, క్ష్మాం-భూరాజ్యమును, లంభయిత్వా-పొందునట్లుచేసి, క్షాంతతరః-మిక్కిలి శాంతగుణము కలవాఁడగుచు, వనే-అరణ్యమునందు, తపః-తపస్సును, చచార-ఆచరించెను. పేరెక్కిన విలుకాఁడై కొంతకాలము శత్రువులనణఁచి, ప్రజాపాలన సమర్థుఁడును, శాంతిపరుఁడును అగు క్షేమధన్వుఁడు అనుకుమారునికి రాజ్యమును అప్పగించి పుండరీకుఁడు శాంతచిత్తుఁడై వానప్రస్థాశ్రమమును నిర్వహించుటకు వనమునఁజేరెను. "సః పుత్రం క్ష్మాం లంభయిత్వా" లభధాతువు గత్యర్థకమగుటచేత ద్వికర్మకత్వము.
అలంకారము : అనుప్రాసము.

శ్లో. అనీకినీనాం సమరేఽగ్రయాయీ
తస్యాపి దేవప్రతిమః సుతోఽభూత్,
వ్యభ్రూయ తానీకపదావసానం
దేవాది నామ ప్రతిదివేఽపి యస్య. 10

వ్యాఖ్య : తస్య, అపి-ఆక్షేమధన్వునికిఁగూడ, సమరే-యుద్ధమునందు, అనీకినీనాం-సైన్యములయొక్క, అగ్రయాయీ-ముందరనడచువాఁడును, దేవప్రతిమః-ఇంద్రాది దేవతలతో సమానుఁడును అగు, సుతః-కుమారుఁడు, అభూత్-ఉండెను (పుట్టెను). అనీకపదావసానం-"అనీక" యనుపదము చివరగలదియు, దేవాది-"దేవ" శబ్దము మొదటఁగలదియునగు, యస్య, నామ-ఎవనియొక్కపేరు, ("దేవానీక" యనుపేరు) ప్రతిదివే, అపి-స్వర్గమున సైతము, వ్యభ్రూయత-విస్తృతమయ్యెనో. ఆ క్షేమధన్వునికి యుద్ధవీరుఁడు, దైవగుణములు

గలవాఁడు నగు "దేవానీకుఁడ"ను కుమారుఁడు పుట్టి, యతఁడు భూలోకస్వర్గ లోకములందు మిక్కిలి ప్రసిద్ధుఁడయ్యెనని భావము.

శ్లో. పితా సమారాధనతత్పరేణ
పుత్రేణ పుత్రీ స యథైవ తేన,
పుత్ర స్తథైవాత్మజవత్సలేన
స తేన పిత్రా పిత్యమాన్ బభూవ. 11

వ్యాఖ్య : సః, పితా-తండ్రియయిన క్షేమధన్వుఁడు, సమారాధన తత్పరేణ-పితృసేవయందు ప్రశద్ధగలవాఁడైన, తేన, పుత్రేణ-కుమారుఁడైన యాదేవానీకునిచేత, యథైవ-ఏప్రకారముగానైతే, పుత్రీ-పుత్రవంతుడు, బభూవ-ఐయుండెనో, తథైవ-ఆప్రకారముగానే సఃపుత్రః-ఆపుత్రుఁడు, ఆత్మజవత్సలేన-కుమారునిపై వాత్సల్యముగల, తేన, పిత్రా-ఆ తండ్రిచేత, పిత్యమాన్-మంచి తండ్రిగలవాఁడు, బభూవ-అయియుండెను. క్షేమధన్వుఁడు పితృసేవాపరాయణుఁడగు పుత్రునిచేత నేవిధముగానైతే తనకు సత్పుత్రుఁడుగలఁడని మురియుచుండెనో అట్లే దేవానీకుఁడు పుత్రవాత్సల్యపరుఁడైన తండ్రిచేత తనకు మంచి పితృదేవుఁడు గలఁడని గర్వపడుచుండెను. పితాపుత్ర భావము వారి కున్నట్లు మరియెవ్వరికిని లేకుండెనని ప్రజలు తలఁచుచుండిరని భావము.

శ్లో. పూర్వ స్తయో రాత్మసమే చిరోఢాం
ఆతోత్మద్భవే వర్ణచతుష్టయస్య,
ధురం నిధాయైకనిధి ర్గుణానాం
జగామ యజ్వా యజమాన లోకమ్. 12

వ్యాఖ్య : గుణానాం-సద్గుణములకు, ఏకనిధిః-ముఖ్యస్థానమై, యజ్వా-యాగక ర్తయైన, తయోః, పూర్వ్యః-ఆయిద్దఱిలో మొదటివాఁడగు తండ్రి (క్షేమధన్వుడు), ఆత్మసమే-తనకు సమానుఁడగు, ఆత్మోద్భవే-కుమారునియందు (దేవానీకునిపైన), చిరోఢాం-బహుకాలము తనచేత భరింపఁబడిన, వర్ణచతుష్టయస్య, ధురం-బ్రాహ్మణాది వర్ణములు నాలుగింటియొక్క రక్షాభారమును

నిధాయ-ఉంచి, యజమానలోకం-యజ్ఞములు చేయువారు చేరునట్టి స్వర్గలోకమును, జగామ-చేరెను. తండ్రి కొడుకులగు క్షేమధన్వ దేవానీకులలో మొదటివాడైన క్షేమధన్వుడు తనవలెనే గుణనిధియగు కుమారునిపైన రాజ్యపాలన వర్ణధర్మ రక్షణాదుల భారమునుంచి విధ విధానమున యజ్ఞములు చేయువారు పొందునట్టి స్వర్గలోకమును జేరెనని భావము. అలంకారము : అనుప్రాసము.

శ్లో. వశీ సుత స్తస్య వశంవదత్వాత్
స్వేషా మివాసీత్ ద్విషతా మపీష్టః,
సకృత్ వివిగ్నానపి హి ప్రయు క్తం
మాధుర్య మిష్టే హరిణాన్ గ్రహీతుమ్. 13

వ్యాఖ్య : తస్య-ఆ దేవానీకునియొక్క, వశీ-సమర్థుడగు, సుతః-కుమారుడు, (ముందు చెప్పబోవు 'అహీనగు'డనువాడు) వశంవదత్వాత్-ప్రియభాషియగుటవలన, స్వేషాం, ఇవ-తనవారికివలెనే, ద్విషతాం, అపి-శత్రువులకుగూడ, ఇష్టః-ప్రియమైనవాడు, ఆసీత్-అయ్యెను. హి-అదియట్లే, ప్రయు క్తం-ప్రయోగింపబడిన (పలుకబడిన), మాధుర్యం-వాఙ్మాధుర్యము, సకృత్-ఒకసారి, వివిగ్నాన్, అపి-భయపడినవైనను, హరిణాన్-లేళ్ళను, గ్రహీతుం-వశపరచుకొనుటకు, ఈష్టే-చాలినదై యుండును. దేవానీకుని కుమారుడగు అహీనగువు మధురభాషియగుటవలన ఆత్మీయులకువలెనే శత్రువులకును ప్రియుడై యుండెను. మధురమైన పలుకు ఒకసారి బెదరినవైనను లేళ్ళను పట్టుకొనుటకు ఉపయోగించును. అట్లే దేవానీకుని కాలమున భయపడియున్న శత్రువులందఱును అతని కొడుకునకు మాటనేర్పరితనముచేత ప్రియమిత్రులై పోయిరని భావము. అలంకారములు : అర్థాంతరన్యాసము, అనుప్రాసము.

శ్లో. అహీనగు ర్నామ స గాం సమగ్రా
మహీనబా హుప్రవిణః శశాస
యో హీ సంసర్గ పరాఙ్ముఖత్వాత్
యువాప్యనర్థై ర్వ్యసనై ర్విహీనః. 14

వ్యాఖ్య : అహీనబాహుప్రవిణః-తక్కువగాని భుజపరాక్రమము గలవాడును, హీనసంసర్గ పరాఙ్ముఖత్వాత్-నీచుల సహవాసమునకు విముఖుడగుట

వలన, యువా, అపి-యువకుఁడై యున్నను, అనర్థైః-అనర్థములను గలిగించు నట్టి, వ్యసనైఃపానద్యూతాదులచేత, విహీనఃరహితుడునగు, యఃఅహీనగుఃనామ-ఏ యహీనగుఁడు పూర్వము చెప్పఁబడెనో, సఃఆ దేవానీకసుకుఁడు, సమగ్రాం-సంపూర్ణమైన, గాం-భూమిని, శశాస-ఏలెను. గొప్ప భుజపరాక్రమము గలిగి, నీచుల స్నేహము లేనందున వ్యసనదూరుఁడై, అనర్థములకు లోనుగాక యుండిన దేవానీకసుతుఁడగు అహీనగుఁడు రాజ్యము నేలెను. "ద్రవిణం కాంచనం విత్తం ద్రవిణంచ పరాక్రమఃఃఅని విశ్వనిఘంటువు. కనుక ఇచ్చట ద్రవిణ శబ్దమునకు పరాక్రమ మని యర్థము.

శ్లో. గురోఃస చానంతర మంతరజ్ఞఃపుంసాం పుమానాద్య ఇవావతీర్ణఃఉపక్రమై రస్ఖలితై శ్చతుర్భిఃచతుర్దిగీశ శ్చతురో బభూవ. 15

వ్యాఖ్య : పుంసాం-పురుషులయొక్క, అంతరజ్ఞఃతారతమ్యము నెఱిఁగిన వాడును, చతురఃనిపుణుఁడునుగుఅ, సఃచఆ యహీనగుడును, గురోఃతండ్రియొక్క, అనంతరం-తరువాత, అవతీర్ణఃఅవతారమును పొందిన, ఆద్యఃపుమాన్, ఇవ-ఆదిపురుషుఁడగు విష్ణువువలె, అస్ఖలితైఃఅప్రతిహతములగు, చతుర్భిఃఉపక్రమైఃనాలుగు ఉపాయములచేత, చతుర్దిగీశఃనాలుగు దిక్కులకును అధిపతి, బభూవఅయ్యెను. పురుషులయంతరమునెఱిఁగి, నిపుణుఁడైయున్న ఆ యహీనగుఁడు తండ్రి పిమ్మట భూలోకమునందవతరించిన మహావిష్ణువువలె అప్రతిహతములగు సామాది చతురుపాయముల ప్రయోగముచేత సర్వశత్రువులను జయించి నేల నాలుగు చెరగులందును తన యాధిపత్యమును నెఱపెనని భావము. "సామాదిభి రుపక్రమైఃఅను మనువచనమువలన ఉపక్రమ మనఁగా ఉపాయము. అలంకారములు : ఉపమ, అనుప్రాసము.

శ్లో. తస్మిన్ ప్రయాతే పరలోకయాత్రాంజేతర్యరిణాం తనయం తదీయమ్,ఉచ్చైఃశిరస్త్వా జ్జితపారియాత్రంలక్ష్మీఃసిషేవేకిల పారియాత్రమ్. 16

వ్యాఖ్య : అరీణాం-శత్రువులకు, జేతరి-విజేతయగు, తస్మిన్-అహీన గుఁడు, పరలోకయాత్రాం-స్వర్గమును, ప్రయాతే (సతి) చేరినవాఁడుకాఁగా, ఉచ్చైఃశిరస్త్వాత్-ఉన్నత శిరస్కుఁడగుటవలన (గొప్పవాఁడయినందున), జిత పారియాత్రం-జయింపఁబడిన పారియాత్రమను కుల పర్వతముగల, పారి యాత్రం-పారియాత్రుఁడను పేరుగల, తదీయం, తనయం-ఆయహీనగునిపుత్రుని లక్ష్మీఃరాజ్యలక్ష్మి, సిషేవేకిల-సేవించినదిసుమా! వీరుఁడైన యహీనగుఁడు దివంగతుఁడుకాగా అంతకంటెను ఉన్నతుఁడైన యతనిపుత్రుఁడు పారియాత్రుని రాజ్యలక్ష్మి సేవించెను. అనఁగా నతఁడు రాజయ్యెనని భావము. హిమవంతము, గంధమాదనము, నిషధము, వింధ్య, మాల్యవంతము, పారియాత్రము, హేమ కూటము. ఇవి యేడు కులపర్వతములు. అలం : యమకము.

శ్లో తస్యాభవ త్సూను రుదారశీలః
శిలఃశిలాపట్టవిశాలవక్షాఃట
జితారిపక్షోఽపి శిలీముఖై ర్యఃశా
లీనతా మవ్రజ దీడ్యమానః. 17

వ్యాఖ్య : తస్య-ఆపారియాత్రునికి, ఉదారశీలఃమంచిస్వభావముగలవాఁడును, శిలాపట్టవిశాలవక్షాఃపాతిపలకవలె విశాలమైన వక్షస్థలముగలవాఁడునగు, శిలఃశిలాఖ్యుఁడను, సూనుఃకుమారుఁడు, అభవత్-ఉండెను. (పుట్టెను). యఃఎవఁడు, శిలీముఖైఃబాణములచేత, జితారిపక్షఃఅపి-జయింపఁబడిన శత్రు పక్షము గలవాఁడైనను, ఈడ్యమానఃఆవిషయమున పొగడఁబడుచు, శాలీనతాం-లజ్జను, అవ్రజత్-పొందెనో. పారియాత్రునికి ఉదారశీలుఁడు, విశాలవక్షస్కుఁడు నగు శిలాఖ్యుఁడను కుమారుఁడు పుట్టెననియు, ఆ కుమారుఁడు శత్రుజయమును జేసినను తనవిజయమును పొగడునప్పుడు సిగ్గుపడుచు వినయవంతుఁడైయుండె ననియు భావము. శాలీనుఁడనఁగా గర్వములేనివాఁడనియు నర్థము. "స్యాద ధృష్టేతు శాలీనఃఅని యమరము. అలంకారము : అనుప్రాసము.

శ్లో. త మాత్మసంపన్న మనిందితాత్మా
కృత్వా యువానం యువరాజమేవ,
సుఖాని సోఽభుంక్త సుఖోపరోధి
వృత్తం హి రాజ్ఞా నుపరుద్ధవృత్తమ్. 18

వ్యాఖ్య : అనింది తాత్మా-గర్హింపఁబడని స్వభావముగల, సః-ఆపారియాత్రుఁడు, ఆత్మసంపన్నం-బుద్ధిసంపదగల, యువానం, తం-యువకుఁడగు శిలాఖ్యుని, యువరాజం, కృత్వా, ఏవ-యువరాజునుగా నభిషేకించియే, సుఖాని-ఇష్టసుఖములను, అభుంక్త-అనుభవించెను. హి-ఎందువలన ననఁగా, రాజ్ఞాం-రాజులయొక్క, వృత్తం-ప్రజాపాలనాదిరూపమైన నడవడి, సుఖోపరోధి-కార్యబాహుళ్యమువలన సుఖము నడ్డగించునది కనుక, ఉపరుద్ధవృత్తం-అడ్డంకులుగల జీవనపథము గలదియే. పారియాత్ర మహారాజు బుద్ధిమంతుఁడగు కుమారునికి యౌవరాజ్య పట్టాభిషేకమును జేసియే తాను ఇష్టసుఖముల ననుభవించెను. రాజుల నిత్యవర్తనము సుఖానుభవమునకుచోటీయని కారావాసమువంటిదికనుక కుమారుఁడగు శిలాఖ్యునికి ప్రజాపాలనభారమును వదలి తాను స్వేచ్ఛగానుండెనని భావము. ఇచ్చట 'ఆత్మన్' శబ్దము, స్వభావము, బుద్ధి అను రెండర్థములు గలదిగా నుపయోగింపఁబడిననది. ఆత్మా యత్నో ధృతి ర్బుద్ధిః స్వభావో బ్రహ్మ వర్ష్మచ" అనియమరము. అలంకారములు: అర్థాంతరన్యాసము, అనుప్రాసము.

శ్లో. తం రాగబంధి ష్వవితృప్తమేవ
భోగేషు సౌభాగ్యవిశేషభోగ్యమ్,
విలాసినీనా మరతిర్బభూవ
జరా వృథా మత్సరిణీ జహార. 19

వ్యాఖ్య : రాగబంధిషు-అనురక్తికిఁగారణములగు, భోగేషు-ప్రసక్తచందన వనితాదులగు విషయములయందు, అవితృప్తం, ఏవ-తృప్తిపడనివాడై యుండగనే, విలాసినీనాం-విలాసవతులకు, సౌభాగ్యవిశేషభోగ్యం-సౌందర్యాతిశయము గలవాఁడగుటచేత భోగించుటకర్హుఁడై యున్న, తం-ఆపారియాత్రుని, అరతి

గల, తత్సంభవం-అతనికుమారుని, అర్ణవాంతా-సముద్రము లంచులుగాఁ గల వసుధ, ఖనిభ్యః-గనులనుండి, ఉదితైః-ఉత్పన్నములైన, రత్నోపహారైః-ఉత్కృష్టవస్తువుల కానుకలచేత, ఉపతస్థే-సేవించెను. వజ్రజాభుఁడు సుకృత ఫలమగు స్వర్గమును జేరఁగా నతని కుమారుఁడు శంఖణుఁడనురాజు శత్రు నిర్మూలనముచేసి రత్నగర్భయగు భూమిని పాలించెనని భావము. అలంకారము : రూపకభేదము.

శ్లో. తస్యావసానే హరిదశ్వధామా
పిత్ర్యం ప్రపేదే పద మశ్విరూపః,
వేలాతటే షూషిత సైనికాశ్వం
పురావిదో యం వ్యుషితాశ్వ మాహుః. 23

వ్యాఖ్య : తస్య-ఆశంఖణునియొక్క, అవసానే-అంతమునందు, హరి దశ్వధామా—హరిదశ్వ-సూర్యునియొక్క, ధామా-తేజస్సుతో సమానమగు తేజముగలవాఁడును. అశ్విరూపః-అశ్వినీదేవతలవంటి చక్కఁదనముగలవాఁడును నగు అతని పుత్రుఁడు, పిత్ర్యం, పదం-తండ్రిది యగు స్థానమును, ప్రపేదే-పొందెను. వేలాతటేషు-సముద్రతీరములందు, షూషితసైనికాశ్వం-ఉంచఁబడిన సైనికులును, అశ్వములునుగల, యం-ఏకుమారుని, పురావిదః- పెద్దలు, వ్యుషితాశ్వం-వ్యుషితాశ్వుఁడని, ఆహుః-పిలిచెదరో. శంఖణరాజు మరణానంతరము సూర్యతేజస్సు, అశ్వినీదేవతల చక్కఁదనము గల యతనికుమారుఁడు వ్యుషితాశ్వుఁడను రాజు రఘువంశ రాజయ్యెను. సముద్రతీరమువఱకు నతనిసైన్యములు గుఱ్ఱములు వెళ్ళినిలుచుటచేత నతనికి వ్యుషితాశ్వుఁడు (వి+ఉషితాశ్వుఁడు) అను నామము సార్థకనామధేయమయ్యెనని యందఱును గొనియాడిరని భావము. అలంకారము : అనుప్రాసము, వ్యంగ్యోపమ.

శ్లో. ఆరాధ్య విశ్వేశ్వర మిశ్వరేణ
తేన ఋతే ర్విశ్వసహో విజజ్ఞే,
పాతుం సహో విశ్వసఖః సమగ్రాం
విశ్వంభరా మాత్మజమూ ర్తి రాత్మ. 24

వ్యాఖ్య : తేన, క్షితేః, ఈశ్వరేణ-క్షితీశ్వరుఁడైన ఆవ్యుషితాశ్వనిచేత విశ్వేశ్వరం-కాశీవాసుఁడయిన శివుని, ఆరాధ్య-ఉపాసించి, విశ్వసహః-విశ్వసహుఁడను పేరుగలవాఁడును, విశ్వసఖః-అందఱికిని మిత్రుఁడైనవాఁడును, సమగ్రాం, విశ్వంభరాం-సమస్తమైనభూమిని, పాతుం-రక్షించుటకు, సహః-సమర్థుఁడగువాఁడును, ఆత్మజమూర్తిః-కుమారరూపము గలవాఁడునగు, ఆత్మా-తానే (పుత్రుఁడని యర్థము), విజజ్ఞే-ఉదయించుట జగిగెను. వ్యుషితాశ్వుఁడు కాశీనాథుఁడగు శివుని నారాధించి "ఆత్మావై పుత్రనామాసి" అను శ్రుతివచన ప్రకారము తానే "విశ్వసహుఁడ"ను పేరుగలిగి, సర్వమిత్రుఁడై సర్వంసహను పాలింపఁగల పుత్రుఁడై జన్మించెను. వ్యుషితాశ్వునికి విశ్వసహుఁడను కుమారుఁడు పుట్టెనని భావము. 'వి' పూర్వకమగు 'జనీ-ప్రాణిగర్భవిమోచనే' ధాతువునకును సహజార్థము మారకుండుటకు "సమాం సమాం విజాయతే"యను పాణిని సూత్రము ప్రమాణమని మల్లినాథుఁడు రచించెను. 'విజజ్ఞే' యనునది భావేప్రయోగము.

శ్లో, అంశే హిరణ్యాక్షరిపోః స జాతే

హిరణ్యనాభే తనయే నయజ్ఞః

ద్విషా మసహ్యాః సుతరాం తరూణాం

హిరణ్యరేతా ఇవ సానిలోఽభూత్. 25

వ్యాఖ్య: నయజ్ఞః-నీతిజ్ఞుఁడగు, సః-ఆవిశ్వసహుఁడు, హిరణ్యాక్షరిపోః-విష్ణువుయొక్క, అంశే-అంశయందు, హిరణ్యనాభే-హిరణ్యనాభుఁడను పేరుగల, తనయే-కుమారుఁడు, జాతే(సతి) పుట్టినవాఁడుకాఁగా, తరూణాం-వృక్షములకు, సానిలః-వాయువుతోఁగూడిన, హిరణ్యరేతాః, ఇవ-అగ్నివలె, ద్విషాం-శత్రువులకు, సుతరాం-మిక్కిలి, అసహ్యాః-సహించుటకు శక్యముగానివాఁడు, అభూత్-అయ్యెను. విశ్వసహునికి విష్ణ్వంశతో హిరణ్యనాభుఁడను పుత్రుఁడు పుట్టెనని యు, అతఁడు పెద్దవాఁడై తండ్రికి తోడ్పడఁగా, వాయుదేవునితోఁగూడిన అగ్నికి వృక్షములు తట్టుకొనలేనియట్లు, తండ్రి కొడుకుల ప్రతాపమునకు శత్రువులు తట్టుకొనలేకపోయిరనియు భావము. అలంకారము : అనుప్రాసము, ఉపమ.

శ్లో. పితా పిత్ర్యాణా మనృణ స్త మంతే
వయస్యనంతాని సుఖాని లిప్సుః,
రాజాన మాజానువిలంబి బాహుం
కృత్వా కృతీ వల్కలవాన్ బభూవ. 26

వ్యాఖ్య : పిత్ర్యాణాం-పిత్రదేవతలకు, అనృణః-ఋణములేనివాఁడై, కృతీ-కృతకృత్యుఁడైన, పితా-తండ్రియగు విశ్వసహుఁడు, అంతే, వయసి-చివరివయస్సునందు, అనంతాని-వినాశములేని, సుఖాని-సుఖములను, లిప్సుః-పొందఁదలఁచినవాఁడై, ఆజానువిలంచిబాహుం-దీర్ఘబాహువులుగల యదృష్టవంతుఁడగు, తం-ఆ హిరణ్యనాభుని, రాజానం, కృత్వా-రాజునుజేసి, వల్కలవాన్-నార చీరలను ధరించినవాఁడు, బభూవ-అయ్యెను. "ప్రజయాపిత్రభ్యః" అను శ్రుతివాక్యముననుసరించి యుత్తమ పుత్రుఁడుగలుగుటవలన పిత్రఋణవిముక్తుఁడై వార్థకమునందు మోక్షము నొందఁదలఁచినవాఁడగుచు, భాగ్యవంతుఁడు పరాక్రమవంతుఁడునగు హిరణ్యనాభుఁడను కుమారునికి రాజ్యపట్టాభిషేకముఁజేసి తాను వల్కలధారియై వానప్రస్థాశ్రమమును స్వీకరించి యరణ్యమును జేరెనని భావము.

శ్లో. కౌసల్య ఇత్యుత్తర కోసలానాం
పత్యుః పతంగాన్వయ భూషణస్య,
తస్యౌరసః సోమసుతః సుతోఽభూత్
నేత్రోత్సవః సోమ ఇవ ద్వితీయః. 27

వ్యాఖ్య : ఉత్తరకోసలానాం-ఉత్తరకోసలదేశమునకు, పత్యుః-ప్రభువైనవాఁడును, పతంగాన్వయభూషణస్య - సూర్యవంశమున కలంకారప్రాయుఁడును, సోమసుతః-యజ్ఞములుచేసినవాఁడునునగు, తస్య-ఆ హిరణ్యనాభునికి, ద్వితీయః, సోమః, ఇవ-రెండవ చంద్రునివలె, నేత్రోత్సవః-నయనానందకరుఁడగు, కౌసల్యాః, ఇతి-కౌసల్యుడను పేరున ప్రసిద్ధుఁడైన, ఔరసః, సుతః-ధర్మపత్నికిఁబుట్టిన కుమారుఁడు, అభూత్-ఉండెను. ఉత్తరకోసలదేశాధిపతియై సూర్యవంశభూషణమై యజ్ఞయాగములు నిర్వర్తించిన ఆ హిరణ్యనాభునికి ధర్మ

పత్నియందు ప్రజలకుఁదనకును చంద్రునివలె కన్నులపండువు గావించు కుమారుఁడుపుట్టి యతఁడు కౌసల్యుఁడను పేరునఁ బ్రసిద్ధుఁడయ్యెనని భావము. "కోసలానాం రాజా కౌసల్యః" అనియు, "సోమం సునోతి ఇతి సోమసుత్ తస్య సోమసుతః" అనియు విగ్రహవాక్యములు.

శ్లో. యశోభి రాబ్రహ్మసభం ప్రకాశః
స బ్రహ్మభూయం గతి మాజగామ,
బ్రహ్మిష్ఠ మాధాయ నిజే ఽధికారే
బ్రహ్మిష్ఠమేవ స్వతనుప్రసూతమ్. 28

వ్యాఖ్య : ఆబ్రహ్మసభం-బ్రహ్మనివాసమగు సత్యలోక పర్యంతము, యశోభిః-మంచి కీర్తులచేత, ప్రకాశః-ప్రసిద్ధుఁడగు, సః-ఆ కౌసల్యుఁడు, బ్రహ్మిష్ఠం-బ్రహ్మవేత్తయగు, బ్రహ్మిష్ఠం-బ్రహ్మిష్ఠుఁడను పేరుగల, స్వతసు ప్రసూతం, ఏవ-తనకుమారునే, నిజే-తనదియగు, అధికారే-ప్రజాపాలనాధి కారమునందు, ఆధాయ-ఉంచి, బ్రహ్మభూయం-బ్రహ్మత్వమనెడి, గతిం-గమన మును, ఆజగామ-పొందెను (ముక్తుఁడయ్యెనని యర్థము). భూలోక స్వర్గలోక సత్యలోకములం దంతటను వ్యాపించినకీర్తిగల యాకౌసల్యుఁడు ఆత్మతత్త్వ వేత్తయు, బ్రహ్మిష్ఠుఁడను పేరుగలవాఁడునునగు తన కుమారుని రాజ్యాధికారము నందుంచి తాను మోక్షమును పొందెనని భావము. రఘువంశక్రమమునందు కౌసల్యుని పిమ్మట బ్రహ్మిష్ఠుఁడు రాజయ్యెనని తాత్పర్యము. అలంకారము : యమకము. హేమాద్రి యను రఘువంశ వ్యాఖ్యాత "బ్రహ్మిష్ఠ" శబ్దమునకు బ్రాహ్మణభక్తుఁడన్నయర్థమును బ్రాసెను.

శ్లో. తస్మిన్ కులాపీడనిభే విపీడం
సమ్యఙ్మహీం శాసతి శాసనాంకామ్,
ప్రజా శ్చిరం సుప్రజసి ప్రజేశే
ననందు రానందజలావిలాక్ష్యః. 29

వ్యాఖ్య : కులాపీడనిభే-వంశమునకు శిరోభూషణము వంటివాఁడును, సుప్రజసి-సత్సంతానవంతుఁడునగు, తస్మిన్, ప్రజేశే-ప్రజానాథుడయిన

ఆ బ్రహ్మిష్ఠరాజు, శాసనాంకాం-రాజశాసన చిహ్నములుగల, మహీం-భూమిని, విపీడం-బాధారహితముగా, నమ్యక్-చక్కగా, శాసతి (సతి)-పాలించుచుండగా, ఆనందజలావిలాక్ష్యః-ఆనందాశ్రువులతో చెదరిన కన్నులుగల, ప్రజాః-ప్రజలు, చిరం-బహుకాలము, ననందుః-సంతోషించిరి. రఘువంశమునకే తలమానికమై సత్సంతానవంతుడై దేశమున రాజశాసనములను విరివిగా నిలుపుచు రాజ్యము నేలుచుండిన ఆ బ్రహ్మిష్ఠుని రాజ్యమునందలి ప్రజలు ఆనందాశ్రుపూరితనేత్రులై బహుకాలము సంతోషపడిరని భావము. కుల + ఆపీడ-కులాపీడ. ఆపీడమనగా శిరోభూషణ మని యర్థము.

శ్లో. పాత్రీకృతాత్మా గురుసేవనేన
స్పష్టాకృతిః పత్రరథేంద్రకేతోః,
తం పుత్రిణాం పుష్కరపత్రనేత్రః
పుత్రః సమారోపయ దగ్రసంఖ్యామ్. 30

వ్యాఖ్య : గురుసేవనేన-పెద్దలసేవచేత, పాత్రీకృతాత్మా-యోగ్యముగాఁ జేయఁబడిన ఆత్మగలవాఁడును, పత్రరథేంద్రకేతోః—పత్రరథేంద్ర-గరుత్మంతుఁడు, కేతోః-ధ్వజముగాఁగల విష్ణువుయొక్క, స్పష్టాకృతిః-స్పష్టమైనదేహము గలవాఁడును, పుష్కరపత్రనేత్రః-కమలదళములవంటి కన్నులుగలవాఁడు నగు పుత్రః-పుత్రుఁడను పేరుగల కుమారుఁడు, తం-ఆబ్రహ్మిష్ఠరాజును, పుత్రిణాం-పుత్రవంతులయొక్క, అగ్రసంఖ్యాం-మొదటిసంఖ్యను, సమారోపయత్-ఎక్కించెను. (అగ్రగణ్యునిగాఁ జేసెనని యర్థము). తండ్రి మొదలగువారి శుశ్రూషచేత మంచియోగ్యుఁడన్న పేరుమ పొంది, ఆకారమునందు కేవలము విష్ణువుగాఁ గనఁబడుచు, విశాలనేత్రములు గల పుత్రుఁడను రాజు బ్రహ్మిష్ఠునికిఁగలిగి, తండ్రిని పుత్రవంతులలో అగ్రగణ్యునిగాఁ జేసెనని భావము. "యోగ్యభాజనయోఃపాత్రమ్" అని యమరము. ఆకృతిః కథితా రూపే సామాన్యవపుషోరపి" అని విశ్వనిఘంటువు. "పుత్రః" అన్న పేరును లేకలేక కలిగి "పుత్" అను నరకమునుండి రక్షించువాఁడు కనుక ఆ విధముగా నామ కరణము చేసియుందురని యూహింపవలెను.

శ్లో. వంశస్థితిం వంశకరేణ తేన
సంభావ్య భావీ స సభా మఘోనః,

ఉపస్పృశ స్పర్శనివృత్తలౌల్య
స్త్రిపుష్కరేషు త్రిదశత్వ మాప. 31

వ్యాఖ్య : స్పర్శనివృత్తలౌల్యః — స్పర్శ - భోగ్య వస్తువులనుండి, నివృత్త-మరలిన, లౌల్యః-లోలత్వముగలవాడు (గనుక), మఘోనః-ఇంద్రునికి, సఖా-మిత్రుడు, భావీ-కాదలచినవాడై, సః-ఆ బ్రహ్మిష్ఠుడు, వంశకరేణ-వంశమును సాగించువాడగు, తేన-ఆపుత్రునిచేత, వంశస్థితిం-కులప్రతిష్ఠను, సంభావ్య-సంపాదించి, త్రిపుష్కరేషు-మూడు పుణ్యతీర్థములందు, ఉపస్పృశన్-స్నానముచేయుచు, త్రిదశత్వం-దేవత్వమును, ఆప-పొందెను. ఆ బ్రహ్మిష్ఠుడు వైరాగ్యముకలిగి, స్వర్గమును జేరదలచి తనకుమారునివలన వంశము ఉద్ధరింపబడు నన్న నమ్మకము గలవాడై త్రిపుష్కరములందు (మూడు గంగా పుష్కరములందు)స్నాతుడై దేవత్వమును బొందెనని భావము.

శ్లో. తస్య ప్రభానిర్జితపుష్పరాగం
పౌష్యాం తిథౌ పుష్య మసూత పత్నీ,
తస్మి న్నపుష్య న్నుదితే సమగ్రాం
పుష్టిం జనాః పుష్య ఇవ ద్వితీయే. 32

వ్యాఖ్య : తస్య-ఆపుత్రాఖ్యునియొక్క, పత్నీ-భార్య, పౌష్యాం-పుష్యమీనఋక్షయుక్తమగు, తిథౌ-పూర్ణిమాతిథియందు, ప్రభానిర్జితపుష్పరాగం-కాంతిచేత జయింపబడిన పుష్యరాగమణిగల, పుష్యం-పుష్యాఖ్యుడను కుమారుని అసూత-కనెను. ద్వితీయే-రెండవదియగు, పుష్యే, ఇవ-పుష్యమీనఋక్షమునందువలె, తస్మిన్-ఆ శిశువు, ఉదితే (సతి)-పుట్టినవాడు కాగానే, జనాః-ప్రజలు, సమగ్రాం-సంపూర్ణమగు, పుష్టిం-సమృద్ధిని, అపుష్యన్-పోషించుకొనిరి. పుత్రాఖ్యరాజు ధర్మపత్ని పుష్యమాస పూర్ణిమనాడు పుష్యరాగమణి కాంతులుగల పుష్యుడను శిశువును ప్రసవించెననియు, అతడు పుట్టగానే ప్రజలు పుష్యనక్షత్ర కృతకార్యములు సిద్ధించినట్లు సర్వసమృద్ధినిం బొందిరనియు భావము. "పుష్యః పరకృతం హంతి నతు పుష్యకృతం పరః ఆపిద్వాదశగే చంద్రే పుష్యః సర్వార్థసాధకః" అని జ్యోతిః శాస్త్రము.

శ్లో. మహీం మహేచ్ఛః పరికీర్య సూనౌ
మనీషిణే జైమినయే ఽర్పితాత్మా,
తస్మా త్సయోగా దధిగమ్య యోగ
మజన్మనే ఽకల్పత జన్మభీరుః. 33

వ్యాఖ్య : మహేచ్ఛః-గొప్పఆశయముగలవాఁడును, జన్మభీరుః-సంసార భయముగలవాఁడునుఅగు, సః-ఆ పుత్రాఖ్యుడు, సూనౌ-కుమారునియందు, మహీం-భూమిని, పరికీర్య-వదిలిపెట్టి, మనీషిణే-బ్రహ్మవిద్యావేత్తయగు, జైమినయే-జైమిని మహర్షికి, అర్పితాత్మా-అర్పింపఁబడిన దేహేంద్రియాత్మలు గలవాడై (శిష్యుఁడై), సయోగాత్-యోగనిష్ఠుఁడైన, తస్మాత్-ఆజైమినినుండి, యోగం-యోగవిద్యను, అధిగమ్య--నేర్చుకొని, అజన్మనే-జన్మరాహిత్యము కొఱకు, అకల్పత-పూనుకొనెను. పుత్రాఖ్యుఁడు సంసారభీరువై కుమారునిపై రాజ్యభారమునుంచి జైమినిమహర్షికి శిష్యుఁడై యోగవిద్య నభ్యసించి జన్మరాహిత్యమునుబొంది ముక్తుఁడయ్యెనని భావము. హేమాద్రి యనువ్యాఖ్యాత జైమినయే మనీషిణే" అనగా యాజ్ఞవల్క్యుఁడని అర్థముబ్రాసి వాయుపురాణమును ప్రమాణముగాఁజూపెను. జైమిని పూర్వమీ మాంసాప్రవర్తకుఁడేకాని బ్రహ్మవిద్యాప్రవర్తకుడుగాడన్న ప్రసిద్ధియే యీ యనుమానమునకుఁ గారణము.

శ్లో. తతః పరం తత్ప్రభవ ప్రపేదే
ధ్రువోపమేయో ధ్రువసంధి రుర్వీమ్,
యస్మి న్నభూ జ్జ్యాయసి సత్యసంధే
సంధి ర్ధృవః సంనమతా మరీణామ్. 34

వ్యాఖ్య : తతః, పరం-ఆ తరువాత, తత్ప్రభవః-ఆ పుష్యాఖ్యుని కుమారుఁడును, ధ్రువోపమేయః-ఔత్తానపాదియగు ధ్రువునితో సమానుఁడును నగు, ధ్రువసంధిః-ధ్రువసంధి యనురాజు, ఉర్వీం-భూపరిపాలనమును, ప్రపేదే-పొందెను. జ్యాయసి-గొప్పవాఁడును, సత్యసంధే-సత్యమైన ప్రతిజ్ఞలు గలవాఁడును నగు, యస్మిన్-ఎవనియందు, సంనమతాం-లొంగిపోయిన,

అరీణాం-శత్రురాజులయొక్క, సంధిః-సంధి, ధ్రువః-స్థిరమైనది, అభూత్-అయ్యెనో. పుష్యాఖ్యుని పిమ్మట అతని కుమారుఁడును ధ్రువునివంటి సద్గుణములు గలవాఁడును అగు "ధ్రువసంధి" యనురాజు రఘువంశమున వెలసెను. గొప్పవాఁడును సత్యసంధుఁడునగు ఆధ్రువసంధి శత్రురాజులు లొంగిపోయి శాశ్వతముగా మిత్రత్వసంధినిఁ జేసికొనుటచేత సార్థకనామధేయుఁడయ్యెనని భావము.

శ్లో. సుతే శిశావేవ సుదర్శనాఖ్యే
ధర్మాత్యయేందుప్రియదర్శనే సః,
మృగాయతాక్షో మృగయావిహారీ
సింహో దవాప ద్విపదం నృసింహాః. 35

వ్యాఖ్య: మృగాయతాక్షః-లేడి కన్నులవంటి విశాల నేత్రములు గలవాఁడును, నృసింహాః-పురుషశ్రేష్ఠుఁడును నగు, సః-ఆధ్రువసంధి, దర్శాత్యయేందుప్రియదర్శనే—దర్శాత్యయ-అమావాస్యముగింపునందలి, ఇందు-చంద్రునివలె, ప్రియదర్శనే-చూడముచ్చటయైనవాఁడగు,సుదర్శనాఖ్యే-సుదర్శనుఁడను పేరుగల సుతే-కుమారుఁడు, శిశౌ, ఏవ-పసివాఁడై యుండగానే, మృగయావిహారీ (సన్)-వేటకై వెళ్ళుచున్నవాఁడగుచు, సింహాత్-సింహమువలన, విపదం-మరణమును, ఆవాపత్-పొందెను. చక్రనివాఁడు వీరుఁడు నగు ధ్రువసంధి, ప్రతిపచ్చంద్రునివలె దర్శనీయుఁడైయున్న సుదర్శనుఁడను తన కునూరుఁడు మిక్కిలి పసివాడై యుండగానే, మృగయావ్యసనమునందుఁ దగిలి యరణ్యములలోఁ దిరుగుచు సింహముచేతఁ జంపఁబడెనని భావము. వ్యసనాసక్తి యెన్నఁడును అనర్థావహమేకదా!

శ్లో. స్వర్గామినస్తస్య తమైకమాత్యా
దమాత్యవర్గః కులతంతు మేకమ్,
అనాథదీనాః ప్రకృతీ రవేక్ష్య
సాకేతనాథం విధివచ్చకార. 36

వ్యాఖ్య : స్వర్గామినః-స్వర్గమునుజేరిన, తస్య-ఆధ్రువసంధియొక్క, అమాత్యవర్గః-మంత్రిమండలి, అనాథదీనాః-ప్రభురహితులై నందునశోచనీయులై

యున్న, ప్రకృతీ:-ప్రజలను, అవేక్ష్య-చూచి, కులతంతుం-వంశావలంబనమై, ఏకం-ఒక్కడుగానే యున్న, తం-ఆసుదర్శనుఁడను బాలుని, ఐకమత్యాత్-ఏకాభిప్రాయమువలన, విధివత్-శాస్త్రప్రకారముగా, సాకేతనాథం-అయోధ్యాధిపతిని, చకార-చేసెను. ప్రభవసంధి మరణింపగానే అతని మంత్రులు, అరాజకమైన దేశమునందలి ప్రజల దీనావస్థనుజూచి, ఏకైకవంశాంకురమైయున్న సుదర్శనుఁడనుబాలుని శాస్త్రప్రకారము సాకేతనాథునిగా నభిషేకించి, యైకమత్యముతో తాము రాజ్యపాలనమును సాగించిరని భావము.

శ్లో. నవేందునా తన్నభసోపమేయం
శాబ్దైకసింహేన చ కాననేన,
రఘోఃకులం కుట్మలపుష్కరేణ
తోయేన చాపీధనరేంద్ర మాసీత్. 37

వ్యాఖ్య : అప్రౌఢనరేంద్రం-వయసువచ్చినరాజులేని, తత్, రఘోఃకులం-ఆరఘువంశము, నవేందునా-బాలచంద్రుఁడుగల, నభసా-ఆకాశముతోను, శాబ్దైకసింహేన-ఒకేపిల్లసింహముగల, కాననేనచ-అరణ్యముతోను, కుట్మల పుష్కరేణ-మొగ్గగానున్న యొక్కకమలముగల, తోయేనచ-జలముతోను, ఉపమేయం-పోల్చుటకుఁదగినదిగా, ఆసీత్-ఉండెను. పెద్దలులేక ఒకేయొక బాలునితో నున్న యారఘురాజులవంశమప్పుడు బాలచంద్రునితోనున్న యాకాశముతోను, ఒకేసింహపుపిల్లగల యరణ్యముతోను, ఒక్క తామరమొగ్గతోనున్న సరోవరముతోను బోల్పఁదగియుండెనట. బాలచంద్ర సింహశాబక కుట్మలపుష్కరోపమానములచేత సుదర్శనబాలుఁడు వర్ధిష్ణువు, శౌర్యవంతుఁడు, శ్రీమంతుఁడును గాఁబోవుచున్నాడను భావము వ్యంగ్యము. అలంకారము: ఉపమాభేదము.

శ్లో. లోకేన భావీ పితురేవ తుల్యః
సంభావితో మౌలిపరిగ్రహాత్సః,
దృష్టో హి వృణ్వన్ కలభపరిమాణో
ఽప్యాశాః పురోవాత మవాప్య మేఘః. 38

వ్యాఖ్య : సః-ఆ బాలుఁడు, మౌలిపరిగ్రహాత్-కిరీటస్వీకారమువలన, పితుఃతండ్రికి, తుల్యః, ఏవ-సమానుఁడే, భావీ-కాఁగలడని, లోకేన-జనముచేత,

సంభావితః-ఊహింపఁబడెను, (అది యుక్తమే), కలభప్రమాణః, అపి-ఏనుఁగు పిల్లంతదిగానున్నను, మేఘుః-మేఘము, పురోవాతం-ముందుకునడపుగాలిని, అవాప్య-పొంది, ఆశాః-దిక్కులను, వృణ్వన్-ఆవరించుచు, దృష్టః, హి-చూడఁబడుచున్నది గదా! కిరీటము ధరించి రాజ్యసింహాసనము నెక్కిన యాబాలుఁడు తండ్రికి సమానుఁడు కాఁగలఁడనియే లోకము భావించెను. మొదట నేనుఁగుపిల్లవలె చిన్నగానున్నను ముందుకునడుపు వాయువుతో సంబంధమును బొందిన మేఘము అన్ని దిక్కులకును వ్యాపించుట చూచుచున్నాముగదా! అట్లే రాజ్యాధికార మంత్రి సహాయములతో నీతఁడును వృద్ధిఁజెందుననుటలో సంశయములేదని భావము. అలంకారము : దృష్టాంతము.

శ్లో. తం రాజవీథ్యా మధిహస్తి యాంత
మాధోరణాలంబిత మగ్రివేషమ్,
షడ్వర్ష దేశీయ మపి ప్రభుత్వాత్
ప్రైక్షంత పౌరాః పితృగౌరవేణ. 39

వ్యాఖ్య : రాజవీథ్యాం-రాజమార్గమునందు, అధిహస్తి-ఏనుఁగుమీద, యాంతం-ఎక్కివెళ్ళుచున్నవాఁడును, ఆధోరణాలంబితం-మావటివానిచేతఁబట్టుకొనఁబడినవాఁడును, అగ్ర్యవేషం-ఉదారమైన రాజవేషముగలవాఁడును, షడ్వర్ష దేశీయం, అపి-ఇంచుమించుగా నాఱుసంవత్సరముల బాలుఁడైయున్నను, తం-ఆ సుదర్శనుని, పౌరాః-పురజనులు, ప్రభుత్వాత్-ప్రభువైయున్నందువలన, పితృగౌరవేణ-తండ్రియందెట్టిగౌరవము గలిగియుండిరో అట్టి గౌరవముతోనే, ప్రైక్షంత-చూచిరి. రాజవీథిలో నేనుఁగుమీద మావటివానిచేఁ బట్టుకొనఁబడి, మనోహరమైన వేషముగలిగి వెళ్ళుచున్న సుదర్శనుఁడను ఆరేండ్లబాలుని పౌరులు ప్రభుగౌరవముతోఁ జూచిరని భావము. 'అధిహస్తి' విభక్త్యర్థమున అవ్యయీభావము. "షడ్వర్షదేశీయం" ఈ షదసమాప్తియందు వచ్చిన 'దేశీయర్' ప్రత్యయాంతము.

శ్లో. కామం న సోఽకల్పత పైతృకస్య
సింహాసనస్య పరిపూరణాయ,
తేజోమహిమ్నా పున రావృతాత్మా
తదాప్యప చామీకరపింజరేణ. 40

వ్యాఖ్య : సః-ఆసుదర్శనబాలుఁడు, పైతృకస్య-తండ్రిదియగు, సింహాస నస్య-సింహాసనమునకు, కామం-సరిగా, ప్రతిపూరణాయ-నింపుటకొఱకు, న, అకల్పత-చాలినవాఁడు కాలేదు. చామీకర పింజరేణ-బంగారపుకాంతిగల, తేజో మహిమ్నా, పునః-తేజస్సంపదచేతనై తే, ఆవృతాత్మా-ఆవరించిన దేహముగల వాఁడగుచు, తత్-ఆసింహాసనమును, వ్యాప-వ్యాపించెను. ఆసుదర్శనుఁడు పసివాఁడగుట వలన తనతండ్రీ గూర్చొను సింహాసనమునందు శరీరముచేత నిండుగాఁ గూర్చొనలేకపోయెను గాని అతని చుట్టును వ్యాపించిన బంగారు ఛాయగల తేజస్సంపదచేత మాత్రము పితృసింహాసనమును పూర్తిగా వ్యాపించె నని భావము. రాజునకు శరీరముకంటే తేజస్సు ముఖ్యమను విషయము సూచితము.

శ్లో. తస్మా దధః కించి దివావతీర్ణా
వసంస్పృశంతౌ తపనీయపీఠమ్,
సాలక్తకౌ భూపతయః ప్రసిద్ధై
ర్వవందిరే మౌలిభి రస్య పాదౌ. 41

వ్యాఖ్య : తస్మాత్-ఆసింహాసనమునుండి. అధః-క్రిందికి, కించిదివ-కొంచముగా, అవతీర్ణౌ-వ్రేలాడుచున్నవియు, తపనీయపీఠం-బంగారపు పాద పీఠమును, అసంస్పృశంతౌ-చిన్నగానున్నందున తాకనివియు, సాలక్తకౌ-పారాణి పూయఁబడినవియునగు, అస్య-సుదర్శనునియొక్క, పాదౌ-అడుగులను, భూప తయః-సామంతరాజులు, ప్రసిద్ధైః-ఔన్నత్యముగల, మౌలిభిః-కిరీటములచేత, వవందిరే-నమస్కరించిరి. అట్లు సింహాసనమునందు కూర్చున్న సుదర్శనుని పాదములు క్రిందికి వ్రేలాడుచు, పాదపీఠమును స్పృశింపలేనివై యున్నను లాక్షా రసపు పారాణితో నలంకరింపబడియున్న యీచిన్నియడుగులను సామంతరాజులు తాము రఘువంశ చక్రవర్తులకు విధేయులై యున్నందున పాదపీఠముపైవంగి యెత్తుగానున్న తమ కిరీటములచేత నాపాదములను దాకుచు నమస్కరించిరని భావము.

శ్లో. మణౌ 'మహానీల' ఇతి ప్రభావాత్
అల్పప్రమాణేఽపి యథా న మిథ్యా,

శబ్దో 'మహారాజ' ఇతి ప్రతీతః
తథైవ తస్మిన్ యుయుజే ఽర్భకేఽపి. 42

వ్యాఖ్య : అల్పప్రమాణే, అపి-మిక్కిలి చిన్నదిగా నున్నప్పటికిని, మణౌ-ఇంద్రనీలమణి విషయమున, ప్రభావాత్-కాంతిమంతమై యుండుటవలన, మహానీలః, ఇతి- "మహానీల" మను శబ్దము, యథా-ఏవిధముగా, మిథ్యా-అసత్యము (అర్థరహితము), న-కాదో, తథైవ (తథా+ఏవ)-అట్లే, అర్భకే, అపి-బాలుడైయున్నను, తస్మిన్-ఆసుదర్శనునియందు, ప్రతీతః-ప్రసిద్ధమైన, మహారాజః, ఇతి- "మహారాజ" అను శబ్దము, నమిథ్యా-అసత్యముకానిదై, యుయుజే-సంబంధముకలదియై యుండెను. ఎంతచిన్న ప్రమాణముగలదైనను ఇంద్రనీలమణిని "మహానీల" మని లోకము వ్యవహరించుచున్నట్లు అర్భకుడైయున్నను సుదర్శనుని "మహారాజు" అని జనులు, సామంతరాజులు పిలుచుచుండిరనియు, అతని తేజస్సు, వంశప్రతిష్ఠ దానికిదగియుండెననియు భావము. మహత్వము గుణాధీనముగాని శరీరాధీనము కాదుగదా.

శ్లో. పర్యంత సంచారిత చామరస్య
కపోలలోలోభయ కాకపక్షాత్,
తస్యాననా దుచ్చరితో వివాదః
చస్ఖాల వేలాస్వపి నార్ణవానామ్. 43

వ్యాఖ్య : పర్యంత సంచారిత చామరస్య—పర్యంత-ఇరుప్రక్కలయందును, సంచారిత-వీవబడుచుండిన, చామరస్య-చామరములుగల, తస్య-ఆ బాలునియొక్క, కపోల లోలోభయ కాకపక్షాత్—కపోల-చెంపలయందు, లోల-కదలుచున్న, ఉభయకాకపక్షాత్-రెండు చిన్నజుట్లుగల, ఆననాత్-ముఖమునుండి, ఉచ్చరితః-పలుకబడిన, వివాదః-ఆజ్ఞారూపమైన వచనము, అర్ణవానాం-సముద్రములయొక్క, వేలాసు, అపి-తీరములందు సైతము, నచస్ఖాల-చలింపలేదు. ఉభయ పార్శ్వములందలి చామరముల గాలికి గదలుచున్న పిల్లజుట్లుగల చెంపలు గలయతని నోటినుండి వెలువడిన యాజ్ఞారూపమైన వచనము చతుస్సముద్రతీరములందుగూడ తొట్రుపడక యందఱిచేతను శిరసావహింపబడుచుండెను. చపల సంసర్గమున్నను మహాత్ములమాటకు స్ఖలన ముండదనిభావము.

ఇందలి చామర, లోలకాకపక్ష, వేలాడులు చాపల్యసూచకములేకదా. "విశేషో వాదః వివాదః" అని విగ్రహము. ముఖ్యవచనము ఆని యర్థము.

శ్లో. నిర్వృత్త జాంబూనద పట్టశోభే
న్యస్తం లలాటే తిలకం దధానః,
తేనైవ శూన్యాన్యరిసుందరీణాం
ముఖాని స స్మేరముఖ శ్చకార. 44

వ్యాఖ్య : నిర్వృత్తజాంబూనదపట్టశోభే — నిర్వృత్త - కట్టఁబడిన, జాంబూనదపట్ట-బంగారురేకుయొక్క, శోభే-కాంతిగల, లలాటే-నొసటిమీద, న్యస్తం-ఉంచఁబడిన, తిలకం-బొట్టును, దధానః-ధరించినవాఁడును, స్మేర ముఖః-చిరునగవుతోఁగూడిన ముఖముగల, సః-ఆరాజు, అరిసుందరీణాం-శత్రు స్త్రీలయొక్క, ముఖాని-మొగములను, తేనైవ-ఆ తిలకముతోనే, శూన్యాని-శూన్యములైనవానిని, చకార-చేసెను. కనకపట్టముచేత నలంకరింపఁబడిన లలాటమునం దుంచఁబడిన తిలకముతోను, చిరునగవుగల ముఖముతోను శోభిల్లు నారాజు అక్లేశముగా శత్రువధచేసి వారిభార్యలముఖములను తిలకశూన్యములుగా గావించెనని భావము. ముఖముమీది తిలకము చెడకుండుటయు, చిరునగవుతరుగ కుండుటయు నతని పరాక్రమ విశేషమును సూచించును.

శ్లో. శిరీషపుష్పాధిక సౌకుమార్యః
ఖేదం స యాయాదపి భూషణేన,
నితాంతగుర్వీ మపి సోఽనుభావా
ద్ధురం ధరిత్ర్యా బిభరాంబభూవ. 45

వ్యాఖ్య : శిరీషపుష్పాధికసౌకుమార్యః-చిరిసెనపువ్వునుమించిన సుకు మారత్వముగలవాఁడు (కనుక), సః-అతఁడు, భూషణేన, అపి-అలంకారము చేత సైతము, ఖేదం-శ్రమను, యాయాత్-పొందువాఁడగునేమో! సః-అట్టివాఁ డైన యతఁడు, నితాంతగుర్వీం, అపి-మిక్కిలిబరువుగలదైనను ధరిత్ర్యాః, ధురం-భూమియొక్కభారమును, అనుభావాత్-ప్రభావమువలన, బిభరాంబభూవ-

భరించెను. శిరీషపుష్పముకంటెను సుకుమారమైన మేనుగలయారాజు భూషణములచేతనే యలసటజెందును. అట్టివాఁడయినను శౌర్యసామర్థ్యములచేత ఎంతో బరువైన భూభారమును వహించెననఁగా నది యాశ్చర్యమని భావము.

శ్లో, న్యస్తాక్షరా మక్షరభూమికాయాం
కార్త్స్న్యేన గృహ్ణాతి లిపిం న యావత్,
సర్వాణి తావత్ శ్రుతవృద్ధయోగాత్
ఫలాన్యుపాయుంక్త స దండనీతేః. 46

వ్యాఖ్య : అక్షరభూమికాయాం-అక్షరలేఖనఫలకమునందు, న్యస్తాక్షరాం-ఉంచఁబడిన అక్షరరేఖలుగల, లిపిం-పంచాశద్వర్ణములుగల మాతృకను, కార్త్స్న్యేన-సంపూర్ణముగా, యావత్-ఎంతకాలమున, న గృహ్ణాతి-గ్రహింపలేదో, సః-ఆ సుదర్శనుఁడు, తావత్-అంతకాలములోనే, శ్రుతవృద్ధయోగాత్-విద్వాంసులగు పెద్దల సంబంధమువలన, సర్వాణి-సమస్తములైన, దండనీతేః-దండనీతి శాస్త్రముయొక్క, ఫలాని-ఉదాహరణరూపములైన ఫలితములను, ఉపాయుంక్త-అనుభవమువలన నుపయోగించెను. సుదర్శనుఁడు పంచాశద్వర్ణరూపమైన లిపి జ్ఞానమును బొందకపూర్వమే విద్వాంసులగు పెద్దల సంసర్గమువలన, వారు చెప్పు బోధలవలన సకల దండనీతి రహస్యములను ఎఱిఁగి యుపయోగింపగలిగెననియు, లిపిని నేర్చుకొని గ్రంథములను జదువునప్పుడు ఓహో! ఇవి నాకుఁ దెలిసిన విషయములేనే! యని భావించుచుఁ బోల్చుకొనుటకుమాత్రము గ్రంథములుపయోగపడుచుండెననియు భావము.

శ్లో. ఉరస్యపర్యాప్త నివేశభాగా
ప్రౌఢీభవిష్యంత ముదీక్షమాణా,
సంజాతలజ్జేవ తమాతపత్రీ
చ్ఛాయాచ్ఛలే నోపజుగూహ లక్ష్మీః. 47

వ్యాఖ్య : ఉరసి-సుదర్శనుని వక్షస్థలమునందు, అపర్యాప్తనివేశభాగా-చాలని నివాసావకాశముగలది గావున, ప్రౌఢీభవిష్యంతం-వర్ధిష్యమాణుఁడగు

చున్న యతనిని, ఉదీక్షమాణా-ఎదురుచూచుచున్న, లక్ష్మీ-రాజ్యలక్ష్మి, సంజాత లజ్జా, ఇవ-ఆలింగనముచేసికొనుటకు సిగ్గుపడుచున్నదివలె! తం-ఆ సుదర్శనుని, ఆతపత్రచ్ఛాయాచ్ఛలేన-శ్వేతచ్ఛత్రముయొక్క నీడ యను మిషచేత, ఉపజుగూహ-ఆలింగనము చేసికొనెను. చిన్నవాఁడైన యతని వక్షస్థలము నాలింగనము చేసికొనుట సిగ్గుచేటు గనుక సుదర్శనుఁడెప్పుడు పెద్దవాఁడగునా? యని యెదురు చూచుచున్న రాజ్యలక్ష్మి శ్వేతచ్ఛత్రచ్ఛాయామిషచేత నప్పటికతని నాలింగనము జేసికొనెను. ఛత్రచ్ఛాయ లక్ష్మీరూపమని ప్రసిద్ధి. ప్రౌఢాంగన బాలుని నాలింగనము చేసుకొన్నచోఁ జూచినవారు నవ్విపోదురని లక్ష్మి సిగ్గుపడి యట్లు చేసినదని భావము.

శ్లో. అనశ్నువానేన యుగోపమాన
మబద్ధమౌర్వీకిణలాంఛనేన,
అస్పష్టఖడ్గత్సరుణాపి చాసీత్
రక్షావతీ తస్య భుజేన భూమిః. 48

వ్యాఖ్య : యుగోపమానం-బండికాడిపోలికను, అనశ్నువానేన-పొందని దైనప్పటికిని, అబద్ధమౌర్వీకిణలాంఛనేన—అబద్ధ-ఏర్పడని, మౌర్వీకిణ-అల్లెత్రాటిదెబ్బలవలన నేర్పడు గ్రంథులనెడు, లాంఛనేన-చిహ్నములుగలదైనను, అస్పష్టఖడ్గత్సరుణా, అపి—అస్పష్ట-తాకఁబడని, ఖడ్గత్సరుణా, అపి-ఖడ్గముయొక్క పిడికలది యైనప్పటికిని, తస్య-సుదర్శనునియొక్క, భుజేన-భుజముచేత, భూమిః-భూమి, రక్షావతీ-రక్షణముగలది, ఆసీత్-అయ్యెను. సుదర్శనుని భుజము,కాడివలె పెటిగి దృఢముగాలేకపోయినను, అల్లెత్రాటిదెబ్బలవలన కనుపులేర్పడినది కాకపోయినను, ఖడ్గముష్టిని పట్టుకొన్నదిగాకున్నను, అతని తేజస్సువలననే భూమిని రక్షింపఁగలిగెను. శిశువుగానున్నను మహాతేజస్వియైన యతని ప్రభావము వలన శత్రుచోర దుష్టుల బాధలేక ప్రజలు సుఖముగా నుండిరని భావము.

శ్లో. న కేవలం గచ్ఛతి తస్యకాలే
యుగుః శరీరావయవా వివృద్ధిమ్,

వంశ్యా గుణాః ఖల్వపి లోకకాంతాః
ప్రారంభసూక్ష్మాః పరిధిమాన మాపుఃః 49

వ్యాఖ్యా : కాలే, గచ్ఛతి (సతి)-కాలము గడచుచుండఁగా, తస్య-ఆసుదర్శనునియొక్క, కేవలం, శరీరావయవాఃఒక శరీరభాగములు మాత్రమే, వివృద్ధిం-అభివృద్ధిని, న, యయుఃపొందలేదు (కింతు-మరియేమనగా), వంశ్యాఃవంశమునందున్నవియు, లోకకాంతాఃజనప్రియములైనవియు, ప్రారంభసూక్ష్మాఃఆదిలోఁ గొంచముగాఁ గనపడినవియు నగు, తస్య-అతనియొక్క, గుణాఃఅపి-ఔదార్య శౌర్య ధైర్యాదిసద్గుణములు సైతము, ప్రథిమానం-విస్తృతిని, ఆపుఃఖలు-పొందినవిసుమా! కాలము గడచినకొలఁది యతని వక్షోబాహు ప్రభృతులైన యవయవములు పెరిగినట్లే వంశక్రమాగతములై ఆరంభమున సూక్ష్మముగా నుండిన శౌర్యము, ఔదార్యము మొదలయిన సద్గుణములుగూడ చాలా విస్తారముగాఁ బెఱిగినవని భావము.

శ్లో. స పూర్వజన్మాంతరదృష్టపారాఃస్మర న్నివాక్లేశకరో గురూణామ్,
తిసృ ణ్త్రివర్గాధిగమస్య మూలం
జగాహ విద్యాఃపరికల్పితీశ్చ పితుర్వ్యఃః. 50

వ్యాఖ్యా : సుదర్శనుఁడు, పూర్వజన్మాంతరదృష్టపారాఃపూర్వ-పూర్వపుడైన, జన్మాంతర-మరియొక జన్మములందు, దృష్టపారాఃచూడఁబడిన యంతములుగలవానినే, స్మరన్, ఇవ-స్మరించుచున్న వాఁడువలె, గురూణాం-గురువులకు, అక్లేశకరఃశమనుగలిగింపనివాఁడగుచు, త్రివర్గాధిగమస్య-ధర్మార్థకామములనెడు త్రివర్గము యొక్క ప్రాప్తికి, మూలం-కారణమగు, తిసృఃమూడైన, విద్యాఃత్రయీ, వార్తా, దండనీతి యనువిద్యలను, పిత్ర్యాఃతండ్రికి సంబంధించిన, ప్రకృతీఃచ-ప్రజలనుగూడ, జగాహస్వాధీనము చేసికొనెను. సుదర్శనుఁడు పూర్వజన్మములందుఁ జదివిన విద్యలను స్మరించుచున్నట్లు గురువులకు శ్రమను గలిగింపక ధర్మార్థకామపురుషార్థములకు మూలమైన త్రయి, వార్త, దండనీతి యను మూడు విద్యలను, తండ్రి

యందు భక్తిగల ప్రజల యుక్తముగా స్వాధీనము చేసికొనెను. చాణక్యార్థ శాస్త్రము "ధర్మాధర్మౌ త్రయ్యాం అర్థానర్థౌ వార్తాయాం నయానయౌ దండ నీత్యాం" అని త్రయ్యాది విద్యలకు త్రివర్గమూలత్వమును జెప్పినది.

శ్లో. వ్యూహ్య స్థితః కించిదివోత్తరార్ధ
మున్నద్ధచూడో ఽంచితసవ్యజానుః,
ఆకర్ణ మాకృష్టసబాణధన్వా
వ్యరోచతాస్త్రేషు వినీయమానః. 51

వ్యాఖ్య : అస్త్రేషు-ధనుర్విద్యయందు, వినీయమానః-శిక్షను పొందింపఁబడుచున్నవాఁడగుచు, ఉత్తరార్ధం-పూర్వదేహమును, కించిదివ-కొంచముగా, వ్యూహ్య-విస్తరింపఁజేసి, స్థితః-నిలిచినవాఁడై, అంచిత సవ్యజానుః-వంచఁబడిన యెడమ మోకాలుగలవాఁడై, ఆకర్ణం-చెవివఱకు, ఆకృష్ట సబాణధన్వా-లాగఁబడిన బాణయుక్తమగు ధనుస్సుగల వాఁడగుచు, వ్యరోచత-ప్రకాశించెను. ధనుర్విద్యాభ్యాస సమయమునందలి యతని వేషము, శరీరమునుండిన స్థితి, బాణమును విడుచురీతి మొదలయిన యాకార విశేషము చూడముచ్చటగా నుండెనని భావము.

శ్లో. అథ మధు వనితానాం నేత్రనిర్వేశనీయం
మనసిజతరుపుష్పం రాగబంధప్రవాలమ్,
అకృతకవిధి సర్వాంగీణ మాకల్పజాతం
విలసితపద మాద్యం యౌవనం స ప్రపేదే. 52

వ్యాఖ్య : అథ-అటు తరువాత, సః-ఆ సుదర్శనుఁడు, వనితానాం-స్త్రీలకు, నేత్ర నిర్వేశనీయం-నేత్రములచేత భోగింపఁదగినదియగు (నేత్రపేయమని యర్థము), మధు-తేనెవంటిదియు, రాగబంధప్రవాలం-అనురాగధారయనెడు చిగుళ్ళుగల, మనసిజతరుపుష్పం-మన్మథుఁడను వృక్షముయొక్క పుష్పమైనదియు, అకృతకవిధి-అకృత్రిమసంపాదనమై, సర్వాంగీణం-సర్వావయవములందును వ్యాపించిన, ఆకల్పజాతం-ఆభరణసమూహమైనదియు, ఆద్యం-

మొట్టమొదటిదగు, విలసితపదం-విలాసస్థానమైన, యౌవనం-యౌవనమును, ప్రపేదే-పొందెను. అటుతరువాత యువతులకు నేత్రపేయమైన మధువుగాను, అనురాగపరంపరా ప్రవాళములతో గూడిన మన్మథతరుపుష్పముగాను, ప్రకృతి సిద్ధమై సర్వావయవములందును నెలకొన్న భూషణజాతముగాను, ప్రప్రథమ విలాసస్థానముగాను బేర్కొనఁదగిన యౌవనము నా సుదర్శనుఁడు పొందెనని భావము. ఆయావిశేషణములతోఁగూడిన మధు, పుష్ప, ఆకల్పజాత, విలాసపదములతో నభేదరూపమున యౌవనము నాల్గువిధములుగాఁ జెప్పఁబడుటచేత నిది మాలారూపకమను అలంకారము. ఈ శ్లోకము అభిజ్ఞానశాకుంతలమునందలి "అనాఘ్రాతంపుష్పమ్" అను శ్లోకమును బోలియున్నది.

శ్లో. ప్రతికృతి రచనాభ్యో దూతి సందర్శితాభ్యః
సమధికతర రూపాః శుద్ధసంతానకామైః,
అధివివిదు రమాత్యై రాహృతా స్తస్య యూనః
ప్రథమపరిగృహీతే శ్రీభువౌ రాజకన్యాః. 53

వ్యాఖ్య : దూతిసందర్శితాభ్యః——కన్యాపరీక్షణముకొఱకై ఆయాదేశములకుఁ బంపఁబడిన దూతికలచేత చూపఁబడినట్టి, ప్రతికృతిరచనాభ్యః-చిత్తరువులయందు రచింపఁబడిన కన్యాప్రతిమలనుండి, సమధికతరరూపాః-ఎక్కువసౌందర్యము గలవారును, శుద్ధసంతానకామైః - రాజునకు మంచి సంతానము గలుగవలెనను కోరికగల, అమాత్యైఃమంత్రులచేత, ఆహృతాఃతీసుకరాబడిన, రాజకన్యాఃరాజకన్యలను, యూనఃతస్య-యువకుఁడైన ఆ సుదర్శనునియొక్క ప్రథమపరిగృహీతే-మొదట పరిగ్రహింపఁబడిన, శ్రీభువౌ-రాజ్యలక్ష్మిభూదేవులు, అధివివిదుఃసతులనుఁగా జేసికొనిరి. యువకదశ వచ్చుటకు ముందే సుదర్శనునికి రాజ్యలక్ష్మితోను, భూదేవితోను పాణిగ్రహణము జరిగియుండుటచేత అనఁగా రాజ్యాధికారము సంక్రమించియుండుటచేత వారిద్దఱును ఆతనికి పత్నులుగా వర్ణింపఁబడిరి. యౌవనదశ వచ్చినపిమ్మట దేశ విదేశములకు దూతికలను బంపి చక్కని రాజకన్యలను వెదకి వారి చిత్రములు తెండని నియోగించిరి. అట్లు వారు తెచ్చిన రాజకన్యా చిత్రములలో మిక్కిలిరూపవతులై, జాతకచక్ర సాముద్రిక లక్షణములు రఘువంశప్రతిష్ఠకును, సత్సంతానముగలుగుటకును యోగ్యతగలవై యున్న రాజకన్యలను మంత్రులుతీసికొనిరాగా అట్టిరాజ

కన్యలను శ్రీభూదేవులు తమ సవతులనుగా జేసికొనిరి. అనఁగా నా రాజకన్య లతో సుదర్శన రాజునకు వివాహమంగళము నిర్వర్తింపఁబడెనని భావము. అధివేదనమనగా భార్యయుండఁగా మరియొక భార్యను జేసికొనుట. 'అధివిన్నా' యనఁగా సవతిగల భార్య. "కృతసాపత్నికా అధ్యూఢా అధివిన్నా" అని యమరము.

ఇది మహాకవి కాళిదాస కృత రఘువంశ
కావ్యమున వంశానుక్రమమను అష్టాదశ
సర్గకు కేశవపంతుల
నరసింహశాస్త్రి రచిత
తెలుఁగు లఘువాఖ్య

మహాకవి కాళిదాస కృత

రఘువంశము

ఏకోనవింశ సర్గము

శ్లో. అగ్నివర్ణ మభిషిచ్య రాఘవః
స్వే పదే తనయ మగ్ని తేజసమ్,
శిశ్రియే శ్రుతవతా మపశ్చిమః
పశ్చిమే వయసి నైమిశం వశీ. 1

వ్యాఖ్య : శ్రుతవతాం-శాస్త్ర సంపన్నులలో, అపశ్చిమః-ప్రథముఁడును, వశీ-జితేంద్రియుఁడునగు, రాఘవః-రఘువంశీయుఁడైన సుదర్శనుఁడు, పశ్చిమే, వయసి-వార్ధకమునందు, స్వే-తనదియగు, పదే-స్థానమునందు, అగ్ని తేజసం-అగ్నియొక్క తేజస్సువంటి తేజముగల, తనయం, అగ్నివర్ణం-కుమారుఁడైన అగ్నివర్ణుని, అభిషిచ్య-పట్టాభిషేకముఁజేసి యుంచి, నైమిశం-నైమిశారణ్యమును, శిశ్రియే-ఆశ్రయించెను. పాండిత్యము, శమదమములునుగల సుదర్శనుఁడు తన ముదుసలితనమునందు అగ్నివర్ణుఁడను పేరుగల కుమారుని తన సింహాసనమునందభిషేకించి తాను నైమిశారణ్యమునకు వానప్రస్థమును నిర్వర్తించుటకు వెళ్ళెనని భావము. అలంకారము : యమకము.

శ్లో. తత్ర తీర్థసలిలేన దీర్ఘికాః
తల్ప మంతరిత భూమిభిః కుశైః,
సౌధవాస ముటజేన విస్మృతః
సంచికాయ ఫలనిస్పృహ స్తపః. 2

వ్యాఖ్య : తత్ర-ఆ నైమిశమునందు, తీర్థసలిలేన - నదీజలముచేత, దీర్ఘికాః-విహారయోగ్యములైన దిగుడుబావులను, అంతరితభూమిభిః-కప్పఁబడిన నేలగల, కుశైః-దర్భలచేత, తల్పం-హంసతూలికాతల్పమును, ఉటజేన-పర్ణశాల

చేత, సౌధవాసం-మేడలలోనుండుటను, విస్మృతః-మరచిన సుదర్శనుఁడు, ఫల నిస్పృహః-స్వర్గాదిఫలమునందు కోరికలేనివాఁడగుచు, తపః-తపస్సును, సంచి కాయ-చేకూర్చుకొనెను. నదీస్నానములచేత ధీర్ఘికావిహారములను, నేలపైఁబరచు కొన్న దర్భలచేత శయ్యాసౌఖ్యమును, పర్ణశాలలోనుండుటచేత సౌధనివాసమును మరచిన సుదర్శనుఁడు నిష్కామతపస్సును జేయుచుండెనని భావము. "సంచి కాయ" సమ్ అను ఉపసర్గతోఁగూడిన చిఞ్-చయనే, అను శబ్దికరణిధాతువు నకు లిట్‌లో "విభాషాచేఃక్ఙి" అనుసూత్రమువలన అభ్యాసకుపరమైన చ కారము నకు కుత్వమువచ్చినరూపము.

శ్లో. లబ్ధపాలనవిధౌ న తత్సుతః
ఖేద మాప గురుణాం హి మేదినీ,
భోక్తు మేప భుజనిర్జితద్విషా
న ప్రసాధయితు మస్య కల్పితా. 3

వ్యాఖ్య : తత్సుతః-ఆసుదర్శనపుత్రుఁడైన యగ్నివర్ణుఁడు, లబ్ధపాలన విధౌ-లభించినరాజ్యమును పాలించుటయందు, ఖేదం-క్లేశమును. న, ఆప-పొంద లేదు. హి-ఎందువలననైతే, భుజనిర్జితద్విషా-పరాక్రమముచేత నోడింపఁబడిన శత్రువులుగల, గురుణా-తండ్రిచేత, మేదినీ-భూమి, అస్య-ఈయగ్నివర్ణునికి, భోక్తుం, ఏవ-అనుభవించుటకుమాత్రమే, కల్పితా-ఏర్పాటుచేయఁబడినదో. ప్రసాధయితుం-కంటకశోధనము చేయుటకు, న-కాదో. తండ్రియగు సుదర్శనుఁడు శత్రువిజయముచేసి, యన్ని సౌకర్యములును జేకూర్చి యిచ్చిన రాజ్యమును పాలించుటలో అగ్నివర్ణునికి లేశముగూడ క్లేశముగలుగలేదు. కారణము అతఁడు సరిదిద్దవలసినదేదియు లేకుండుటయే. కనుక రాజ్యమును సుఖముగా నేలెను. ఇచ్చటి "ప్రసాధయితుం" అనుపదము అలంకరణమును ధ్వనించు చున్నది. కాఁగా, సర్వాలంకారశోభితయైన యువతిని అనుభవించుటయేకాని ఆమె ప్రసాధనచింత యువకునికుండనట్లు అగ్నివర్ణునకు రాజ్యసుఖానుభవమేకాని కంటకశోధన మక్కఱలేకపోయెనని భావము.

శ్లో. సోఽధికార మభికః కులోచితం
కాశ్చన స్వయ మవర్తయత్ సమాఃక్ఙ,

సంనివేశ్య సచివే ష్వతః పరం
స్త్రీవిధేయనవయౌవనో ఽభవత్. 4

వ్యాఖ్య : అభికః-కాముకుఁడగు, సః-అగ్నివర్ణుఁడు, కులోచితం-వంశమునకుఁదగిన, అధికారం-ప్రజాపాలనమును, కాశ్చన, సమాః-కొన్నిసంవత్సరములు, స్వయం-తానే, అవ ర్తయత్-నడిపెను. అతఃపరం-ఆతరువాత, సచివేషు-మంత్రులయందు, సంనివేశ్య-ఉంచి, స్త్రీవిధేయనవయౌవనః—స్త్రీవిధేయ-స్త్రీలకు అధీనమైన, నవయౌవనః-నూతనయౌవనముగలవాఁడు, అభవత్-అయ్యెను. కాముకుఁడైన యగ్నివర్ణుఁడు వంశక్రమాగతము కులోచితమునైన ప్రజాపాలనాధికారమును కొన్ని సంవత్సరములు మాత్రము స్వయముగా చేపట్టి యాతరువాత మంత్రులకు పాలనాధికారము నప్పగించి తాను స్త్రీలోలుఁడై స్త్రీలకధీనుఁడై యుండెనని భావము. "క్రమః కమయితా ఽభికః కమనః కామనో ఽభికః" అని యమరము.

శ్లో. కామినీసహచరస్య కామినః
తస్య వేశ్మసు మృదంగనాదిషు,
బుద్ధిమంత మధికర్ధి రుత్తరః
పూర్వ ముత్సవ మపోహ దుత్సవః. 5

వ్యాఖ్య : కామినీ సహచరస్య-స్త్రీమిత్రసహచరుఁడగు, కామినః, తస్య-కాముకుఁడగు నాయగ్నివర్ణునియొక్క, మృదంగనాదిషు-మృదంగనాదములుగల, వేశ్మసు-భవనములయందు, అధికర్ధిః-పూర్వపు దానికంటే యెక్కువ సంభారముగల, ఉత్తరః-తరువాతిదియగు నుత్సవము, బుద్ధిమంతం-గీతవాద్యాది సాధనసంపన్నమై, పూర్వం-మొదట జరిగిన, ఉత్సవం-వేడుకను, అపోహత్-ప్రోసివేసెను. (దానిని మించిన వైభవముతోనుండె ననియర్థము.) కామినులైన యువతులతోనుండు కాముకుఁడగు నగ్నివర్ణునియొక్క నిరంతరగీత నృత్త వాద్య మృదంగ ధ్వనులుగల రాజప్రాసాదములయందు పూర్వపూర్వములగు వేడుకలకంటె నుత్తరోత్తరములగు వేడుకలు అధికతరగాన నృత్య మృదంగ యువతీయుక్తములై మొదట జరిగిన వానిని మరపించుచుండెననియు, అట్లుత్సవ పరంపర సాగుచుండెననియు రాజకార్యములు విడిచి స్త్రీలోలుఁడయ్యె ననియుభావము.

శ్లో. ఇంద్రియార్థ పరిశూన్య మపుమః
సోఢు మేక మపి స క్షణాంతరమ్,
అంత రేవ విహరన్ దివానిశం
నవ్యపైక్షత సముత్సుకాః ప్రజాః. 6

వ్యాఖ్య : ఇంద్రియార్థ పరిశూన్యం —ఇంద్రియార్థ - శ్రవణాదీంద్రియ భోగ్యములైన మధుర శబ్దాది విషయములచేత, పరిశూన్యం-శూన్యమైన (అవి లేనట్టి) ఏకం, అపి, క్షణాంతరం-ఒకక్షణకాలమునుగూడ, సోఢుం-సహించుటకు అక్షమః-అశక్తుడైన, సః-అగ్నివర్ణుడు, దివానిశం-పగళ్ళురాత్రులును, అంతః, ఏవ-అంతఃపురమునందే, విహరన్-విహరించుచు, సముత్సుకాః-తనదర్శనము నందు కోరికగల, ప్రజాః-జనులను, నవ్యపైక్షత-చూడదలపనేలేదు. ప్రతిక్షణము నందును ఇంద్రియార్థములైన ప్రక్కందనవనితాగీత నృత్యాదులు లేకున్నచో శూన్యమైన ఆక్షణమును సహింపజాలక అంతఃపురమునందే దివారాత్రులు భోగలాలసుడై కాలముగడపుచున్న యగ్నివర్ణుని దర్శనార్థమై ప్రజలెంత కుతూహలముతో వచ్చినను వారి నతడు కంటితోగూడ చూచుటలేదని భావము.

శ్లో. గౌరవాద్యదపి జాతు మంత్రిణాం
దర్శనం ప్రకృతికాంక్షితం దదౌ,
తద్గవాక్ష వివరావలంబినా
కేవలేన చరణేన కల్పితమ్. 7

వ్యాఖ్య : జాతు-ఎప్పుడో ఒకసారి, మంత్రిణాం-మంత్రులయొక్క, గౌరవాత్-గురుభావమువలన (వారు చెప్పినందువలన), ప్రకృతికాంక్షితం-ప్రజలచేతగోరబడిన, యదపిదర్శనం-ఏదోయొకదర్శనమును, దదౌ-ఇచ్చెనా! తత్-అదికూడ, గవాక్షవివరావలంబినా-గవాక్షరంధ్రమునుండి ప్రవేలాడుచున్న, కేవలేన, చరణేన-ఒకపాదముచేతమాత్రము, కల్పితమ్-ఇయ్యబడినది. ప్రజలు నిరీక్షించుచుండగా మంత్రులువచ్చి ప్రతిమాలుటవలన నామంత్రులమాటను దీసి వేయలేక యెప్పుడో ఒకసారి తన దర్శనము ప్రజలకు లభించునట్లుచేసెనా! అప్పుడుగూడ గవాక్షరంధ్రమునుండి యొకపాదమును వారు చూచునట్లు బైటికి

బెట్టి, ముఖదర్శనముగూడ లేక పాదమును జూచితిరిగదా! ఇక వెళ్ళవచ్చు ననుచుండెనని భావము.

శ్లో. తం కృతప్రణతయో ఽనుజీవినః
కోమలాత్మనఖరాగ రూషితమ్,
భేజిరే నవదివాకరాతప
స్పృష్టపంకజ తులాధిరోహణమ్. 8

వ్యాఖ్య : కోమలాత్మనఖరాగరూషితం—కోమల-మృదులమైన, ఆత్మ నఖరాగ-తనగోళ్ళయెఱ్ఱదనముచేత, రూషితం-వ్యాపించినదియు, నవ దివాకరాతప స్పృష్టపంకజ తులాధిరోహణం—నవదివాకరాతప-తొలిసూర్యరశ్మిచేత, స్పృష్ట-తాకబడిన, పంకజ-కమలముయొక్క, తులా-పోలికను, అధిరోహణం-పొందినట్టి, తం-అట్లు గవాక్షముసుండి వెలుపటికుంచఁబడిన యతని చరణమును, అనుజీవినః-ఆశ్రితులగుప్రజలు, కృతప్రణతయః-చేసిననమస్కారములు గల వారగుచు, భేజిరే-సేవించిరి. కోమలమైన గోళ్ళకాంతులచేతఁ గప్పఁబడియున్నందున ప్రాతఃకాలమునందు బాలసూర్యుని కిరణములఁచేగప్పబడిన పంకజమువలె నుండినదియు, గవాక్షరంధ్రమునుండి వెలుపలికుంచఁబడినదియు నగు ఆయగ్నివర్ణుని చరణమును నమస్కరించి ప్రజలు సేవించిరని భావము. "కోమలాత్మనఖరాగరూషితమ్" అనుదానిని "కోమలాంఙనఖరాగభూషితం" అని ఇతర వ్యాఖ్యాతలు పఠించిరి. పైశ్లోకమునందలిది మల్లినాథునిపాఠము. ఇతరులపాఠమే సరసముగా నున్నట్లు తోచును.

శ్లో. యౌవనోన్నత విలాసినీ స్తన
క్షోభలోల కమలాశ్చ దీర్ఘికాః,
గూఢమోహనగృహా స్తదంబుభిః
స వ్యగాహత విగాఢమన్మథః. 9

వ్యాఖ్య : విగాఢమన్మథః-ప్రౌఢమన్మథుఁడుగల, లేక హృదయమునందు స్థిరముగానిల్చిన మన్మథుఁడుగల, సః-ఆయగ్నివర్ణుఁడు, యౌవనోన్నత.... కమలాః—యౌవన-తొలివయసుచేత, ఉన్నత-పెఱిగి నిక్కపొడచిన, విలాసి

నిస్తన-విలాసవతుల స్తనములయొక్క-, క్షోభ-సంచలనముచేత, లోల-కదలుచున్న, కమలాః- పద్మములుగలవియు, తదంబుభిః-ఆబావుల నీటిచేత, గూఢమోహనగృహాః, చ-కప్పఁబడిన సురతభవనములు గలవియునగు, దీర్ఘికాఃదిగుడు బావులను (కోనేరులను), వ్యగాహత-ప్రవేశించి కలియఁబెట్టెను. ప్రగాఢమైన మన్మథోద్రేకముగల అగ్నివర్ణుఁడు కఠినోన్నతములైన మదవతుల స్తనములయొక్క ఆఘాతములచేతఁ జెదరి కదలుచున్న పద్మములతోను, జలాంతర్గత సురతగృహములతోను విరాజిల్లుచున్న దీర్ఘికలయందు విలాసవతులను గలిసి విహరించెనని భావము. "మోహనగృహ" మనఁగా జలాంతర్గతముగా సురతమునుభవించుటకుఁ గట్టిన చిన్నగది. కొందరు వ్యాఖ్యాతలు స్త్రీ మర్మావయవములనియు సభిప్రాయపడిరి.

శ్లో. తత్ర సేకహృత లోచనాంజనైః
ధౌతరాగ పరిపాటలాధరైః,
అంగనా స్త మధికం వ్యలోభయ
న్నర్పిత ప్రకృతికాంతిభి ర్ముఖైః. 10

వ్యాఖ్య : తత్ర-ఆదిగుడుబావులయందలి, అంగనాః-స్త్రీలు, సేకహృత లోచనాంజనైఃసేక-జలసేచనముచేత, హృత-తొలగింపఁబడిన, లోచనాంజనైఃకన్నులకాటుకగలవియు, ధౌతరాగపరిపాటలాధరైఃధౌత-జలముచేత తుడుచుకపోయిన, రాగ-లాక్షాది రంజనద్రవ్యముయొక్క, పరిపాటల-యెఱ్ఱదనముతోడి, అధరైఃపెదవులుగలవియు, (కనుకనే) అర్పిత ప్రకృతి కాంతిభిఃవ్యక్తముచేయఁబడిన సహజకాంతులుగల, ముఖైఃముఖములచేత, తం-ఆయగ్నివర్ణుని, అధకం-పూర్వముకంటె నెక్కువగా, వ్యలోభయన్-ప్రలోభపరచిరి. అట్లుజలక్రీడలు సలుపుచున్న అగ్నివర్ణుని నచ్చట నుండిన స్త్రీలు జలావసేచనముచేతతొలఁగిన కండ్లకాటుకలును, తుడుచుకపోయిన పెదవుల రంజన ద్రవ్యములునుగలగినవగుటచేత సహజసౌందర్యమును వెదజల్లుచున్న ముఖములచేత పూర్వముకంటె నెక్కువగా మోహపరచిరనియు, కృత్రిమశోభకంటే సహజశోభ మిన్నయనియు భావము. అవసేచనమనగా నొకరిపైనొకరు నీరు చల్లుట.

శ్లో. ఘ్రాణకాంత మధుగంధ కర్షిణీః
పానభూమిరచనాః ప్రియాసఖః,

అభ్యపద్యత స వాసితాసఖః
పుష్పితాః కమలినీరివ ద్విపః. 11

వ్యాఖ్య : ప్రియాసఖః-ప్రియాజనమిత్రుఁడైన, సః-అగ్నివర్ణుడు, ఘ్రాణ...కర్షిణీః—ఘ్రాణకాంత-నాసికామనోహరమగు, మధుగంధ-మద్యపు వాసనచేత, కర్షిణీః-ఆకర్షించుచున్న, పానభూమిరచనాః-మద్యపానగృహములను, వాసితాసఖః-ఆడయేనుఁగులతోఁగూడిన, ద్విపః-గజము, పుష్పితాః-పువ్వులు పూచిన, కమలినీః-ఇవ-పద్మలతలనువలె, అభ్యపద్యత-చేరెను. ప్రియాసహితుఁడైన యగ్నివర్ణుఁడు మధుర పరిమళముచేత ఆకర్షించుచున్న మద్యపానశాలలను ఆడ యేనుగులతోఁగలిసిన మదగజము కమల యుక్తములగు తామర తీగలను ఆసక్తితోఁజేరునట్లు, ఉల్లాసమునఁ జేరెనని భావము. అలంకారము : ఉపమ. "వాసితా స్త్రీ కరిణ్యోశ్చ" అను నమరమువలన "వాసితా" శబ్దమునకు స్త్రీ యనియు, ఆడయేనుఁగనియు నర్థములు.

శ్లో. సాతిరేక మద కారణం రహః
తేన దత్త మభిలేషు రంగనాః,
తాభి రప్యుపహృతం ముఖాసవం
సోఽపిబ ద్వకులతుల్య దోహదః. 12

వ్యాఖ్య : అంగనాః-స్త్రీలు, రహః-ఏకాంతమున, సాతి...రణం—సాతిరేక-అత్యంతమైన, మద-మైమరపునకు, కారణం-హేతువైనదియై, తేన-అగ్నివర్ణునిచేత, దత్తం-ఇయ్యబడు ముఖాసవమును, అభిలేషుః-అభిలషించిరి. వకులతుల్యదోహదః-పొగడ చెట్టుతో సమానమగు దోహదముగల, సోఽపి (సః+ఆపి)-అతఁడుసైతము, తాభిః-ఆ యంగనలచేత, ఉపహృతం-ఇయ్యఁబడిన, ముఖాసవం-కొంచము త్రాగి, లేక ఒక ప్రక్కన త్రాగుచు నిచ్చిన మద్యమును అపిబత్-పానము చేసెను. కొందరు విలాసవతులు రహస్యప్రదేశమున యగ్నివర్ణునిచే నీయబడిన ముఖాసవమును గోరిరనియు, పొగడచెట్టు స్త్రీ ముఖాసవమును దోహదముగాఁ గొనునట్లు వారు త్రాగిన లేక పానపాత్రయం దొకప్రక్కనఁ ద్రాగుచున్న స్త్రీముఖాసవమునం దభిలాషగలవాఁడై అతఁడు పానముచేసెననియు భావము. అట్లు స్త్రీ సహితముగా నతని మద్యపానకేళి జరిగెను.

శ్లో. అంక మంకపరివర్తనోచితే
తస్య నిన్యతు రశూన్యతా ముభే,
వల్లకీ చ హృదయంగమ స్వనా
వల్గువాగపి చ వామలోచనా. 13

వ్యాఖ్య : అంకపరివర్తనోచితే — అంక-తొడలపైన, పరవర్తన-పొర్లుటకు (విహరించుటకు), ఉచితే-తగిన, ఉభే-ఇద్దఱును, తస్య-ఆయగ్ని వర్ణునియొక్క, అంకం-ఒడిని, అశూన్యతాం-పూర్ణత్వమును, నిన్యతుః-పొందిం చిరి. (ఆయిద్దఱు ఎవరనగా) హృదయంగమస్వనా-మనోహరనాదముగల, వల్లకీ, చ-వీణయును, వల్గువాక్-మధురభాషణియగు, వామలోచనాపి, చ-కామి నియును, అగ్నివర్ణుఁడు తొడలపై మనోహరనాదముగలవీణను, మధుకరకంఠము గల ప్రియురాలిని అధివసింపఁజేసికొని, వారి వాద్యధ్వని మధురగానములతోఁ ప్రగీడించుచు నానందపరవశుఁడయ్యెను. 'పరివర్తన' శబ్దము వీణమార్పులను, ప్రియురాలిశయనమును సూచించును. వామలోచన యనఁగా చక్కని కన్నులు గల స్త్రీ.

శ్లో. స స్వయం ప్రహత పుష్కరః కృతీ
లోల మాల్య వలయో హరన్ మనః,
నర్తకీ రభినయాతిలంఘినీః
పార్శ్వవర్తిషు గురు ష్వలజ్జయత్. 14

వ్యాఖ్య : కృతీ-నేర్పరియై, ప్రహతపుష్కరః-స్వయముగా వాయిం చిన మద్దెల మొదలగువాని ముఖములుగలవాఁడును, లోలమాల్యవలయః-కదలు చున్న పూలహారములు కడియములును గలవాడునై, మనః-నర్తకీజనమనస్సును, హరన్-ఆకర్షించుచున్న, సః-ఆయగ్నివర్ణుఁడు, అభినయాతిలంఘినీః-అభినయ ములందుఁ దొట్రుపడుచున్న, నర్తకీః-విలాసినులగు నట్టువకత్తెలను, గురుష-నాట్యాచార్యులు, పార్శ్వవర్తిషు (సత్సు)-ప్రక్కలనున్నవారగుచుండగానే, అలజ్జయత్-సిగ్గుపడునట్లుచేసెను. వాద్యవాదన శృంగారలీలల యందునేర్పరి యైన అగ్నివర్ణుఁడు మెడలోని పూలదండలు, చేతులకడియములును జలించునట్లు మృదంగాదులను వాయించుచు నర్తకీజనుల మనస్సును హరించుచుండగా

నతినిపైఁగల ధ్యానముచేత నర్తనగతులు తప్పుచున్న యా నట్టువక త్తెలు తమ నాట్యాచార్యులు ప్రక్కలనేయున్నందున వారినిజూచి తమ మనశ్చాంచల్యభిన్న నర్తనగతులకు సిగ్గుపడుచుండిరని భావము.

శ్లో. చారు నృత్యావిగమే చ తన్ముఖం
స్వేదభిన్నతిలకం పరిశ్రమాత్,
ప్రేమదత్తవదనానిలః పిబన్
అత్యజీవ దమరాలకేశ్వరౌ. 15

వ్యాఖ్య : చారు-అందమైనదియు, నృత్యావిగమే-నాట్యావసానమునందు, పరిశ్రమాత్-నర్తన ప్రయాసమువలన, స్వేదభిన్నతిలకం-చెమటచేత చెడిపోయిన తిలకముగలదియునగు, తన్ముఖం-ఆనర్తకి ముఖమును, ప్రేమదత్త వదనానిలః—ప్రేమ-అనురాగముచేత, దత్త-ప్రసరింపఁజేయఁబడిన, వదనానిలః-ముఖమారుతముగలవాఁడై, పిబన్-త్రాగుచు (ముద్దు పెట్టుకొనుచు) అమరాలకేశ్వరౌ-దేవతల కధిపతియగు నింద్రుని, అలకాధిపతియగు కుబేరుని, అత్యజీవత్-మించి జీవించెను. నృత్యము ముగిసిన పిమ్మట నర్తనశ్రమచేతఁ గలిగిన చెమటచే తుడుచుకపోయిన తిలకముగలిగి, ముద్దులొలుకుచున్న యా నట్టువక త్తె ముఖమును ప్రేమ ప్రసారితమైన తన ముఖమారుత యుక్తముగా ముద్దుగొనుచున్న యగ్నివర్ణుఁడు దేవాంగనాభోగము లనుభవించునింద్రునికిని, యక్షకాంతాసుఖము ననుభవించు కుబేరునికిని లభింపని సౌఖ్యము ననుభవించెను. దేవజాతికిలేని స్వేద మీ నర్తకికిఁ గలుగుటవలన నిట్టిసుఖము ఇంద్ర కుబేరులకు లేదనియు నందువలన నగ్నివర్ణుఁడు వారి నతిక్రమించి జీవించెననియు భావము.

శ్లో. తస్య సావరణ దృష్ట సంధయః
కామ్యవస్తుషు నవేషు సంగినః,
వల్లభాభి రుపసృత్య చక్రిరే
సామిభుక్త విషయాః సమాగమాః. 16

వ్యాఖ్య : నవేషు-నూతనములైన, కామ్యవస్తుషు-భోగ్యవస్తువులయందు, సంగినః-ఆసక్తుఁడైన, తస్య-అగ్ని వర్ణునియొక్క, సావరణదృష్ట సంధయః—

సావరణ-ప్రచ్ఛన్నములును, దృష్ట-ప్రకాశములునగు, సంధయః-సాధనములుగల, సమాగమాః-నూతన స్త్రీ సంగమములు, వల్లభాభిః-రాణులచేత, లేక పూర్వభుక్త విలాసినులచేత, ఉపస్పృశ్య-అతని నూతన సంకేత స్థలములకువెళ్ళి, సామిభుక్త విషయాః— సామిభుక్త-సగమేయనుభవించిన, విషయాః-వనితాసంభోగ ప్రసక్తులు గలవిగా, చక్రిరే-చేయఁబడినవి. నిత్యనూతన కామ్య వస్తువులందు ఆసక్తుఁడైన యగ్నివర్ణుఁడు భిక్షుక్యాదులద్వారా ప్రచ్ఛన్నముగాను, ఒకప్పుడు తానే స్వయముగాను సంధానములు కుదిరించుకొని క్రొత్తజవరాండ్రతో సలుపుచున్న సంభోగాదులను అతని రాణులు, లేదా పూర్వపరిచతలైన విలాసినులు ఆనూతన సంకేతములకు వెళ్ళి విఘ్నపరచి అతని భోగములను అర్ధోపభుక్తములుగా మార్చుచుండిరని భావము. కారణమేమనఁగా వారివద్ద సంపూర్ణసౌఖ్యమునుభవించినచో పూర్వప్రియలైన తమను కన్నెత్తి చూడడేమో యన్నభయమే. ఇచ్చట గోనర్దీయుఁడను కామశాస్త్రవేత్తవచన మనుసంధానము చేయఁదగియున్నది. "సంధిర్ద్వివిధః, సావరణః ప్రకాశశ్చ, సావరణోభిక్షుక్యాదినా, ప్రకాశః స్వయముపేత్యకేనాపి" అని.

శ్లో. అంగులీ కిసలయాగ్ర తర్జనం
భ్రూవిభంగ కుటిలం చ వీక్షితమ్,
మేఖలాభి రసకృచ్చ బంధనం
వంచయన్ ప్రణయినీ రవాప సః. 17

వ్యాఖ్య : సః-అగ్నివర్ణుఁడు, ప్రణయినీః-ప్రేయసులను, వంచయన్-మోసగించుచుండుటచేత, అంగులీకిసలయాగ్రతర్జనం-చిగురాకులవంటి చూపుడువ్రేళ్ళ బెదిరింపును, భ్రూవిభంగకుటిలం-కనుబొమలు చిట్లించుటచేత కుటిలమైన, వీక్షితం, చ-ప్రియురాండ్రచూపును, మేఖలాభిః-వారిమొలనూళ్ళచేత, అసకృత్-అనేక పర్యాయములు, బంధనం, చ-కట్టివేయుటను, అవాప-పొందెను. ఇతర నూతన నాయికల వద్దికి వెళ్ళుచు మోసగించుచున్న యగ్నివర్ణున్ని ప్రేయసీజనము వ్రేళ్ళుచూపి బెదిరించుచును, బొమలు చిట్లించి కోపముతోఁ జూచుచును, తమ మొలనూళ్ళతో బంధించుచును దండించిరని భావము. అపరాధము దండనము రెండును సరసములే.

శ్లో. తేన దూతివిదితం నిషేదుషా
పృష్ఠతః సురతవార రాత్రిషు,
శుశ్రువే ప్రియజనస్య కాతరం
విప్రలంభ పరిశంకినో వచః. 18

వ్యాఖ్య : సురతవారరాత్రిషు-సంభోగదినములయొక్క రాత్రులయందు, దూతివిదితం-దూతికలకు మాత్రము తెలియనట్లుగా, పృష్ఠతః-ప్రియురాండ్ర యొక్క వెనుక భాగమునందు, నిషేదుషా-కూర్చొనియున్న, తేన-అగ్నివర్ణుని చేత, విప్రలంభపరిశంకినః-తమ వియోగమును అనుమానించుచున్న, ప్రియ జనస్య-ప్రేయసీజనముయొక్క, కాతరం-భయముతోఁగూడిన, వచః-పచనము, శుశ్రువే-వినఁబడుచుండినది. ఒక్కొక్క ప్రియురాలివద్ది కొక్కొక్క-రాత్రి వెళ్ళి యచ్చటి దూతికకుమాత్రము తనరాక తెలియునట్లుగా ప్రియురాలివెనుక చాటునఁ గూర్చొనుచున్న యగ్నివర్ణుఁడు ఆ ప్రియురాలికిఁ దనయందుఁగల ప్రేమాతిశయమును ఆమె తన దూతికతో సంభాషించు వచనములవలనఁ దెలిసి కొనుచుండెననియు, ఆప్రియురాలు తనరాక ఆలస్యమైనది, తాను వచ్చునా లేదా? తనను విడుచునా! యేమి యని భయపడుచు, ఎట్లైనను ప్రియుని రప్పింపవే! యని దూతికతోఁబలుకు భయవచములను విని యానందించుచుండెననియు భావము. 'సురతవారరాత్రిషు' అన్నపదము ఒక్కొక్క నాయికకు ఒక్కవారము సోమ, మంగళ ఇత్యాదులు, ఏర్పరచి విహరించుచుండెనన్న భావమును సూచించును. 'దూతివిదితం' అన్న పదము, లంచములు పొందుచున్న దూతికలు అగ్నివర్ణుని వ్యవహారము తెలిసియుఁ దమయజమానురాండ్రగు నాయికలవద్ద తెలియనట్లు నటించుచుండిరని సూచించును.

శ్లో. లౌల్య మేత్య గృహిణీపరిగ్రహాత్
నర్తకీ ష్వసులభాసు తద్వపుః,
వర్తతే స్మ స కథంచి దాలిభి
ర్నంగులీకురణ సన్నవర్తికః. 19

వ్యాఖ్య : గృహిణీపరిగ్రహాత్-భార్యల నిర్బంధ సమాగమమువలన, నర్తకీషు-వేశ్యలు, అసులభాసు (సతీషు) -లభింపనివారలగుచుండఁగా, లౌల్యం-

వారినిఁ గలిసికొనవలయునను తొందరపాటును, ఏత్య-పొంది, అంగులీక్షరణ సన్నవర్తికఃఁ—అంగులీ-ప్రవేళ్ళయొక్క, క్షరణ-చెమటచేత, సన్న-జారిన, వర్తికఃఁ-కుంచెగలవాఁడైన, సఃఁ-అగ్నివర్ణుఁడు, తద్వపుఃఁ-ఆవేశ్యలయొక్క శరీరమును, ఆలిఖన్-చిత్రించుచు, కథంచిత్-ఎట్లో, వర్తతే, స్మ-ఉండెను. గృహిణీజనము బలవంతముగాఁ దమవద్దనుంచుకొన్నందున విలాసినులను గలిసికొనుట దుర్లభముకాఁగా మనస్సు స్తిమితపడక, ఆ వేశ్యలనే మనస్సునఁదలచుకొనుచు, వారి రూపములను చిత్రించి యా ప్రతికృతుల దర్శనముచేత వినోదమును బొందఁదలఁచెను. కాని చిత్రరచన చెయ్యఁబోగా సాత్త్వికభావోద్రేకమున చేతిప్రవేళ్ళు చెమర్చి కుంచె జారిపోవుచుండ నెట్లో ప్రాయుచు నతికష్టముగాఁ గాలముఁగడపుచుండెనని భావము.

శ్లో. ప్రేమగర్విత విపక్ష మత్సరా
దాయతాచ్చ మదనా న్మహీక్షితమ్,
నిన్య రుత్సవవిధిచ్ఛలేన తం
దేవ్య ఉజ్ఝితరుషః కృతార్థతామ్. 20

వ్యాఖ్య : ప్రేమగ....రాత్ — ప్రేమ - తమపై ప్రియునికిఁబ్రేమ గలదను కారణముచేత, గర్విత-గర్వమెక్కిన, విపక్ష-ప్రతిపక్షమైన సపత్ని జనమునందలి, మత్సరాత్-వైరమువల్లను, ఆయతాత్-తమలో ప్రవృద్ధమైన, మదనాచ్చ (మదనాత్ + చ)-మన్మథబాధవల్లను, దేవ్యఃఁ-రాణులు, ఉజ్ఝిత రుషఃఁ-విడిచిపెట్టిన కోపముగలవారలగుచు, తం, మహీక్షితం - ఆయగ్నివర్ణ రాజును, ఉత్సవవిధిచ్ఛలేన-మదనమహోత్సవమును నడుపు నెపముచేత, కృతార్థతాం-కృతార్థత్వమును, నిన్యుఃఁ-పొందించిరి. అగ్నివర్ణుఁడు తమను ప్రేమించుటలేదన్నకోపము గలవారేయైనను, మాయందే ప్రేమగలిగియున్నాఁడని గర్వపడుచున్న సవతులమీది వైరమువల్లను, పతియొక్క చిరవియోగము సహింపఁజాలని తమ మన్మథోద్రేకముపల్లను రాణులు కోపమును విడిచి, మదన మహోత్సవవిధానమును నిర్వర్తించుట కన్ననెపమున నతనిని బిలుచుకవెళ్ళి తమ కోర్కెలను దీర్చుకొని కృతార్థలై యతనినిఁగృతార్థునిఁజేసిరని భావము.

శ్లో. ప్రాత రేత్య పరిభోగశోభినా
దర్శనేన కృతఖండనవ్యథాఃఁ,

ప్రాంజలిః ప్రణయినీః ప్రసాదయన్
సోఽదునోత్ ప్రణయమంథరః పునః 21

వ్యాఖ్య : సః - ఆయగ్నివర్ణుఁడు, ప్రాతః - మరుసటియుదయమున, ఏత్య-వచ్చి, పరిభోగశోభినా-సంభోగానుభవముచే ప్ర కా శిం చు చు న్న, దర్శనేన - తననుజూపుటచేత, కృతఖండనవ్యథాఃకృత - కలిగింపఁబడిన, ఖండన-ఇతరస్త్రీసంభోగమువలని, వ్యథాఃమనోవేదనగల, ప్రణయినీఃప్రియురాండ్రను, ప్రాంజలిఃదోసిలొగ్గినవాఁడై, ప్రసాదయన్ఊరడించువాఁడగుచున్నను, ప్రణయమంథరఃనర్తకీప్రణయలబ్ధి లేనివాడగుచు, పునఃమరల, అదునోత్-పరితాపమునుజెందెను. రాణుల బలవంతపు సంభోగము ననుభవించినయగ్నివర్ణుఁ డాచిహ్నములతో మరునాటి ప్రాతఃకాలమున వచ్చిదర్శనమునీయఁగా విలాసినులకు మనోవ్యథయే కలిగెననియు, దానినిఁ దొలఁగించుట కతఁడు ప్రాంజలియై ప్రతిమాలినను వారికతనిపైఁ ప్రణయము గలుగనందుల కతనికి మరల మనోవ్యథయే కలిగెననియు భావము. ఇచ్చట విలాసినులు ఖండితానాయికలుగా సూచింపఁబడుచున్నారు "జ్ఞాతేఽన్యాసంగవిక్లవే ఖండితేర్ష్యాకషాయితా" అని లక్షణము.

శ్లో. స్వప్నకీర్తితవిపక్ష మంగనాః
ప్రత్యభైత్సు రవదంత్య ఏవ తమ్.
ప్రచ్ఛదాంత గలితాశ్రు బిందుభిః
క్రోధభిన్నవలయై ర్వివర్తనైః. 22

వ్యాఖ్య : స్వప్నకీర్తితవిపక్షం—స్వప్న-స్వప్నములందు, కీర్తిత-పేరొక్కనఁబడిన, విపక్షం-పరస్త్రీలుగల, తం-అగ్నివర్ణుని అంగనాః-విలాసినులు, అవదంత్యఃఏవ-ఏమియు ననకయే, ప్రచ్ఛ...భిఃప్రచ్ఛదాంత-పరుపునడుమ, గలిత-జారిన, అశ్రుబిందుభిఃకన్నీటిచుక్కలు గలవియు, క్రోధభిన్నవలయైఃకోపముచేత పగిలిన గాజులు గలవియునగు, వివర్తనైఃపక్కపై దొరలుటలచేత, ప్రత్యభైత్సుఃప్రతిక్రియ చేసిరి (బెదిరించిరనియర్థము). తమప్రక్కన శయనించి స్వప్నమున గోత్రస్ఖలనము అనఁగా

మరియొక నాయికపేరు నుచ్చరించిన యగ్నివర్ణునిపై గోపగించుకొన్న విలాసినులు అతనిని గుఱించి యేమియుననకయే పడకపైగన్నీటి చుక్కలు రాల్చుచు, కోపవశమున గాజులు చిట్లించుకొనుచు, పరుపున దొర్లుచు ప్రతీకారము చేయుచు, దిరస్కరించిరని భావము.

శ్లో. క్లృప్తపుష్పశయనాన్ లతాగృహా
నేత్య దూతికృతమార్గదర్శనః,
అన్వభూ త్పరిజనాంగనారతం
సో ఽవరోధభయవేపథూ త్తరమ్. 23

వ్యాఖ్య : సః-అగ్నివర్ణుడు, దూతికృత మార్గదర్శనః (సన్)-దూతికల చేత దెలుపబడిన దారిగలవాడగుచు, క్లృప్తపుష్పశయనాన్-పరువబడిన పూసెజ్జలుగల, లతాగృహాన్-లతామండపమును, ఏత్య-చేరి, అవరోధభయవేప ధూ త్తరం—అవరోధ-అంతఃపురాంగనలవలని, భయ-భయముచేతనైన, వేపథు-కంపము, ఉ త్తరం-ప్రధానముగా గనబడుచుండగా, పరిజనాంగ నారతం-దాసీసంభోగమును, అన్వభూత్-అనుభవించెను. దూతికలు మార్గమును జూపు చుండ పూలపాన్పులతో సిద్ధపరచిన పొదరింటినిజేరి రాణులకు దెలిసినజిక్కు వచ్చునను భయముచేతనే ఆ దాసీల పొందును వణకుచు ననుభవించెనని భావము. "దూతికృత" అనుచోట "దూతీకృత" అనియుండవలసియుండగా హ్రస్వప్రయోగము ఛందోభంగభయముచేత కవి చేసినట్లు మల్లినాథుడభిప్రాయపడెను. "అపి మాషం మషం కుర్యాత్ ఛందోభంగం త్యజేత్ గిరామ్" అన్నలోకోక్తిని సైత ముదాహరించెను. కాని ఈసర్గ 18, 33 శ్లోకాలలోను అట్లే యున్నది. ఇకారాంత దూతి శబ్దముకూడ గలదు. కాళిదాసుకు ఛందోభంగ భయమా? "గృహ" శబ్దము పుంలింగ బహువచనము.

శ్లో. నామ వల్ల భజనస్య తే మయా
ప్రాప్య భాగ్య మపి తస్య కాంక్ష్యతే,
లోలుపం నను మనో మమేతి తం
గోత్రవిస్ఖలిత మూచు రంగనాః. 24

వ్యాఖ్య : మయా-నాచేత, తే, వల్లభజనస్య-నీప్రియురాలియొక్క నామ-పేరును, ప్రాప్య-పెట్టుకొని, తస్య-ఆవల్లభజనముయొక్క, భాగ్యం, అపి-అదృష్టముకూడ, కాంక్ష్యతే-కోరబడుచున్నది. ననుఓహో! మమ, మనః-నాయొక్కమనస్సు, లోలుపం-ఎంతయాశకలది! ఇతి-ఇట్లనుచు, అంగనాః-అతని ప్రియరాండ్రు, గోత్రవిస్ఖలితం-నిద్రలోగలువరించిన క్రొత్తనాయిక పేరుగల, తం-అగ్నివర్ణనుద్దేశించి, ఊచుః-పలికిరి. అగ్నివర్ణుడు స్వప్నము నందుగ్రొత్తనాయిక పేరు నుచ్చరించిన పిమ్మట నతని ప్రియురాండ్రు ఒక్కొక్కరుగా, నేను నీస్వప్నసుందరి పేరు పెట్టుకొని ఆమె భాగ్యము పొంద వలెనని నామనస్సు కోరుచున్నది. ఈమనస్సున కెంతయాశ ఉన్నది! అని యెత్తిపొడుపు మాటలతో నగ్నివర్ణునిదిరస్కరించిరని భావము. "ఆమెభాగ్య" మనగా నగుబాటు పాలగు నపకీర్తియని సూచన.

శ్లో. చూర్ణబభ్రు లులిత స్రగాకులం
ఛిన్న మేఖల మలక్తకాంకితమ్,
ఉత్థితస్య శయనం విలాసినః
తస్య విభ్రమరతా న్యపావృణోత్. 25

వ్యాఖ్య : చూర్ణబభ్రు-రాలిన కుంకుమాది చూర్ణములచేత పింగళవర్ణము గలదియు, లులిత స్రగాకులం-నలిగిన పూలదండలచేత చెదిరినదియు, ఛిన్న మేఖలం-తెగి జారిపడిన మొలనూలు గలదియు, అలక్తాంకితం-పాదలాక్షార సముద్రలు గలదియునగు, శయనం-పరుపు, ఉత్థిత స్య-పడకపైనుండి లేచినట్టి, విలాసినః-భోగపరాయణుడగు, తస్య-అగ్నివర్ణునియొక్క, విభ్రమరతాని-బంధయుక్తములైన లీలాసురత విశేషములను, అపావృణోత్-స్పష్టముగా వెల్లడించెను. భోగలాలసుడై నిద్రనుండి లేచిన యగ్నివర్ణుని శయనము, "వ్యాన "తబంధ" రతిలో అధోముఖగానుండిన నాయికముంగురులనుండి రాలిన కుంకు మాదులచేత పింగళవర్ణముగలదియై, "కరిపద" బంధరతియందు నాయిక భూమిపైనుంచిన తలగలదియగుటచేత క్రిందపడి నలిగిన పూలదండలు గలదియై, "హరివిక్రమబంధ" రతి సమయముననాయిక ఒకకాలునుపైకినెత్తుటచేత జారిపడి తెగినమేఖలగలదియు,'ధైనుకబంధ'రతివేళనాయిక తనపాదములనుపడకపైనుంచి నిలువబడి వంగుటచేత పాడలాక్షారసముద్రలు గలదియునగుచు, నతని విభ్ర రతములను అనగా వివిధ రతిబంధయుక్త సురతవిశేషములను స్పష్టముగా వెల్ల

డించెనని భావము. "రతిరహస్య" మనుకామశాస్త్రగ్రంథము ఈ బంధముల నిట్లు వివరించినది: శ్లో. "వ్యానతం" రతమిదం ప్రియాయది స్యాదధోముఖ చతుష్ప దాకృతిః, తత్కటిం సమధిరుహ్యావల్లభః స్యాత్ వృషాదిపశు సంస్థితస్థితిః॥ భూగత స్తన భుజాస్యమస్తకా మున్నతస్చ మధోముఖీం స్త్రియమ్। క్రామతి స్వకరకృష్టమేహనే వల్లభే "కరిపదం" తదుచ్యతే. "యోషిదేకచరణే సముత్థితే జాయతే హి "హరివిక్రమా"హ్వాయః॥ న్యస్తహస్తయుగలా నిజేపదే యోషి దేతి కటిరూఢవల్లభా। అగ్రతోయది శనై రధోముఖీ "ధైనుకం" వృషవదు న్నతే ప్రియే॥

శ్లో. స స్వయం చరణరాగ మాదధే
యోషితాం న చ తథా సమాహితః,
లోభ్యమాననయనః శ్లథాంశుకై
ర్మేఖలాగుణపదై ర్నితంబిభిః. 26

వ్యాఖ్య : సః-అగ్నివర్ణుడు, స్వయం-తానే, యోషితాం-యువతులకు, చరణరాగం-పాదములయందు లాక్షారసమును, ఆదదే-పూయమొదలిడెను. కాని శ్లథాంశుకైః-జారిన చీరలుగలవియు, నితంబిభిః-నితంబములతో గూడినవియు నగు, మేఖలాగుణపదైః-మొలనూలిదారములకు నివాసములగు జఘనముల చేత, లోభ్యమాననయనః-లోభపెట్టబడుచున్న కన్నులుగలవాడగుచు, తథా-ఆవిధ ముగానే, సమాహితః-నిశ్చలమనస్కుడై, న చ ఆదధే-పూయలేదు. అగ్ని వర్ణుడు యువతులపాదములకు లాక్షారసమును తానే పూయుటకు సిద్ధపడెను. కాని తనస్పర్శవలన వస్త్రములు జారి నితంబసహితముగా బయటపడిన జఘన ములచేత ఆకర్షింపబడిన దృష్టిగలవాడగుటచేత ఎట్లు శ్రద్ధతో పూయవలెనో అట్లు అవహితుడై వారికి జరణరాగమును చక్కగా సమర్పింపలేకపోయెనని భావము. స్త్రీయొక్క కటిపశ్చాత్భాగమునకు 'నితంబ' మనియు, పూర్వభాగము నకు "జఘన" మనియుబేర్లు, "పశ్చాన్నితంబః స్త్రీకట్యాః క్లీబేతు జఘనం పురః" అని యమరము.

శ్లో. చుంబనే విపరివర్తి తాధరం
హస్తరోధి రశనావిఘట్టనే,

విఘ్న తేచ్ఛ మపి తస్య సర్వతో
మన్మథేంధన మభూ ద్వధూగతమ్. 27

వ్యాఖ్య : చుంబనే-ముద్దుగొనుట నారంభింపఁగానే, విపరివ ర్తితాధరం-ప్రక్కకు ప్రతిప్పిన పెదవిగలదియు, రశనావిఘట్టనే-చీరముడితో మొలనూలిని తొలఁగించుటకుఁ బూనఁగనే, హ స్తరోధి-చేతినడ్డగించునదియు, సర్వతః-అంతట, విఘ్నితేచ్ఛం, అపి-ఆటంకపరుపఁబడిన ఇచ్ఛగలదియైనను, వధూగతం-యువతీ సంభోగము, తస్య-అగ్నివర్ణునికి, మన్మథేంధనం-కామోద్రేకముఁగలిగించునదే, అభూత్-అయ్యెను. చుంబనమున మొగ్రతిప్పినను, పోకముడి విడువఁబోగా చేతినఁడ్డోసివేసినను, ప్రతిప్రయత్నమును ఆట్లు విఘ్నపరచుచున్నను అగ్ని వర్ణునికి అవియన్నియుఁ గామోద్దీపనములేయై ఆ యువతి సంభోగమును బల వంతముగా లోబరచుకొని యనుభవించెనని భావము.

శ్లో. దర్పణేషు పరిభోగదర్శినీః
నర్మపూర్వ మనుపృష్ఠసంస్థితః,
ఛాయయా స్మితమనోజ్ఞ యా వధూః
ప్రీహినిమీలితముఖీ శ్చకార సః. 28

వ్యాఖ్య : సః-అతఁడు, దర్పణేషు-అద్దములయందు, పరిభోగదర్శినీః-సంభోగ చిహ్నములను జూచుకొనుచున్న, వధూః-స్త్రీలను, నర్మపూర్వం-పరిహాసపూర్వకముగా, అనుపృష్ఠ సంస్థితః (సన్)-వారివెనుకభాగమున నిలువఁబడినవాఁడగుచు, స్మిత మనోజ్ఞయా-చిరునగవుచేనందమైయున్న, ఛాయయా-దర్పణమునఁగనపడు తన ప్రతిబింబముచేత, ప్రీహినిమీలితముఖీః-సిగ్గుచేత మూసుకొన్న ముఖములుగలవారినిగా, చకార-చేసెను. తనచే రాత్రులయందు ఉపభోగింపఁబడిన యువతులు పగటివేళలలో అద్దములందు తమ ముఖస్తనాదులపై నేర్పడిన నఖక్షతాది చిహ్నములను జూచుకొనుచుండగా వారివెనుక నిలిచి చిరునవ్వుతో మనోహరమై అద్దమునందుఁగనఁబడు తన ప్రతిబింబముచేత నా యువతులను సిగ్గుపడునట్లును, సిగ్గుచేత ముఖములను చేతులతో మూసుకొను నట్లును జేయుచు తనవిలాస జీవనమును గడపుచుండెననియు భావము.

శ్లో. కంఠసక్త మృదు బాహుబంధనం
న్యస్తపాదతల మగ్రపాదయోః,
ప్రార్థయంత శయనోత్థితం ప్రియాః
తం నిశాత్యయ విసర్గ చుంబనమ్. 29

వ్యాఖ్య : ప్రియాః-అతని ప్రియురాండ్రు, శయనోత్థితం-పడకనుండి లేచినట్టి, తం-ఆయగ్నివర్ణుని, కంఠసక్త మృదు బాహబంధనం-తమ కంఠము లందుంచబడిన సుకుమారమైన యాలింగనము గలదియు, అగ్రపాదయోః-తమ పాదముల పైభాగములయందు, న్యస్తపాదతలం-ఉంచఁబడిన యతని యడుగులు గలదియునగు, నిశాత్యయ విసర్గచుంబనమ్——నిశాత్యయ-రాత్రియొక్క అవ సానమునందు, విసర్గ-విడిచివెళ్ళు సమయమునందలి, చుంబనం-ముద్దును, ప్రార్థయంత-యాచించిరి. శయనమునుండి లేచిన అగ్నివర్ణుని నతని ప్రియు రాండ్రు బాహుబంధనయుక్తమై తమపాదములపై నతని పాదములుంచి చేయు నట్టి నిశావసానగమనమునందలి చుంబనముఁ జేసి వెళ్ళుమని కోరిరి. అట్లు చేయుట మన్మథ నివాసమునకు హేతువని గోనర్దీయుఁడు చెప్పెను. "రతావ సానే యది చుంబనాది ప్రయజ్య యాయాన్మదనోఽస్య వాసః"

శ్లో. ప్రేక్ష్య దర్పణతలస్థ మాత్మనో
రాజవేష మతిశ్రకశోభినమ్,
పిప్రియే న స తథా యథా యువా
వ్యక్తలక్ష్మ పరిభోగమండనమ్. 30

వ్యాఖ్య : యువా, సః-యువకుఁడైన ఆయగ్నివర్ణుడు, అతిశ్రకశోభినం-ఇంద్రుని మించిన యందము కలదియై, దర్పణతలస్థం-అద్దమునందుఁగనబడు చున్నది యగు, ఆత్మనః-తనయొక్క, రాజవేషం-రాజోచిత వస్త్రాలంకార వేషమును, ప్రేక్ష్య-చూచి, తథా-ఆవిధముగ, నపిప్రియే-సంతోషపడలేదు. యథా-యేవిధముగానైతే, వ్యక్తలక్ష్మ-స్పష్టముగాఁ గనపడుచున్న చిహ్నములు గల, పరిభోగమండనం-యువతీ సంభోగముల వలన గలిగిన సొగసును, ప్రేక్ష్య-చూచి, పిప్రియే-సంతోషపడెనో! యువకుఁడైన అగ్నివర్ణుఁడు కవచ

కుండల కంకణ కిరీట ధారణముచేత ఇంద్రునిమించిన శోభగల తన రాజవేషమును అద్దమునఁ జూచుకొన్నప్పటికంటెను యువతీ సంభోగజనితములైన నఖక్షత దంతక్షతములు, అలసినముఖము, జారినవస్త్రములు మొదలగు చిహ్నములను దర్పణమునఁ జూచుకొన్నప్పడే యెక్కువ సంతోషపడెను. రాజ్యసుఖముకంటె నతనికి రమణీసుఖమే అధికమైన యానందమును గూర్చుచుండెనని భావము.

శ్లో. మిత్రకృత్య మపదిశ్య పార్శ్వతః
ప్రస్థితం త మనవస్థితం ప్రియాఃl
విద్మ హేశఠ! పలాయనచ్ఛలా
న్వ్యంజసేతి రురుధుఃకచగ్రహైఃl 31

వ్యాఖ్య : మిత్రకృత్యం-సుహృత్కార్యమును, అపదిశ్య-నెపముగాఁ జెప్పి, పార్శ్వతః-మరియొకచోటికి, ప్రస్థితం-వెళ్ళుటకు బయలుదేరిన వాఁడై, అనవస్థితం-నిలుకడలేకయున్న, తం-అగ్నివర్ణుని, ప్రియాఃవిలాసినులు, హేశఠ-ఓమోసగాడా!, పలాయనచ్ఛలాని-నీవు పారిపోవుటకుఁ జెప్పు మోసములను, అంజసా-యథార్థముగా, విద్మ-ఎఱుఁగుదుము, ఇతి-ఇట్లనుచు, కచగ్రహైఃకేశాకర్షణములచేత, రురుధుఃఅడ్డగించిరిఃవిలాసినులవద్దనుండిన యగ్నివర్ణుడు "నాకొకమిత్రకార్యమున్నది" అని చెప్పి ప్రక్కకు వెళ్ళఁబోవుచు కాలు నిలుపలేని స్థితిలోనుండగా ఆ విలాసినులు "ఓ శఠుఁడా! నీవు పారిపోవుటకుఁ జెప్పిన అపదేశవాక్యములత త్త్వము మాకుఁదెలియునులే" యనుచు నతనిజుట్టు వెంట్రుకలను పట్టి లాగి వెళ్ళకుండునట్లుచేసిరని భావము. వారాంగనలు విటులను మిత్రకార్యమున్నప్పుడు విడుచుట కామశాస్త్ర ధర్మము, కనుక అగ్నివర్ణుఁడు మిత్రకార్యమిషచే వెళ్ళదలఁచుట, అది యబద్ధమని తెలిసిన ప్రియురాండ్రు అతనిని వెళ్ళనీయకపోవుట ఇచ్చట వర్ణింపఁబడినది. ఈ సందర్భమున గోనర్దీయుఁడు "ఋతుస్నాతాభిగమనే, మిత్రకార్యే, తథాపది। ప్రతిష్వేతేషు ప్రియతమఃక్షంతవ్యో వారగమ్యయా" అనిపలికెను. వారగమ్యా-వారస్త్రీ.

శ్లో. తస్య నిర్దయరతిశ్రమాలసాఃl
కంఠసూత్ర మపదిశ్య యోషితఃl

అధ్యశేరత బృహా దుభుజాంతరం
పీవర స్తనవిలు ప్తచందనమ్. 32

వ్యాఖ్య : నిర్దయరతిశ్రమాలసాః — నిర్దయరతి - అతఁడు సలిపిన ఉత్కటసంభోగమువలని, శ్రమ-ఆయాసముచేత, అలసాః-సడలిన యవయవములుగల, యోషితః-యువతులు, కంఠసూత్రం-"కంఠసూత్ర"మనుపేరుగల ఆలింగనవిశేషమును, అపదిశ్య-వ్యాజముగాఁజెప్పి పీవర స్తనవిలు ప్తచందనం-పెద్దవియగు స్తనములచేత తుడిచివేయఁబడిన గంధపుపూతగలది యగు, తస్య-అగ్నివర్ణునియొక్క, బృహత్, భుజాంతరం-విశాలమైన వక్షస్థలమును (వక్షస్థలమునందు), అధ్యశేరత-శయనించిరి. బలిష్ఠుఁడు, యువకుఁడునగు, అగ్నివర్ణుఁడు నిర్దయముగాఁజేసిన సంభోగమువలన అలసి, అవయవములు సడలి, పునారతికి సిద్ధపడజాలని కొందరు యువతులు, అతనిని తృప్తిపరచుటకై ఇప్పుడు "కంఠసూత్ర" మనునాలింగనమును జేయుడు మన్నసెపముతో తమ పీవర స్తనముల రాపిడిచేత మైపూతగానున్న గంధము తుడుచుకపోవునట్లు అతని విశాల వక్షస్థలమునందు శయనించి రని భావము. "యత్ కుర్వతే వక్షసి వల్ల భస్య స్తనాభిఘాతం నిబిడోపగూహాత్, పరిశ్రమార్థం శనకై ర్విదగ్ధా స్తత్ "కంఠసూత్రం" ప్రవదంతి సంతః" అని కంఠసూత్ర లక్షణము. ఇదియే రతి రహస్యమునందు "స్తనాలింగన" మని చెప్పఁబడినది. "ఉరసి కమితు రుచ్చై రాదిశంతీ వరాంగీ స్తన యుగ ముపధత్తే యత్ స్తనాలింగనం తత్" అని దాని లక్షణము.

శ్లో. సంగమాయ నిశి గూఢచారిణం
చారదూతికథితం పురోగతాః,
వంచయిష్యసి కుత స్త మోవృతః
కాముకేతి చకృషు స్తమంగనాః. 33

వ్యాఖ్య : సంగమాయ-అన్యస్త్రీ సురతముకొఱకు, నిశి-రాత్రివేళ, గూఢచారిణం-రహస్యముగా వెళ్ళుచున్నవాఁడును, చారదూతికథితం-గూఢచారిణులగు దూతికలచేత రాణులకు తెలుపఁబడిన వాఁడునునగు, తం-ఆ యగ్నివర్ణుని, అంగనాః-అతని ప్రియురాండ్రు, పురోగతాః (సత్యః)-ముందుగానే వెళ్ళి దారి

నర్ధగించినవాడై, హేకాముక!-ఓకాముకుఁడా! తమోవృతః-చీకటిచేత దాచఁబడిన వాడవగుచు, కుతః-ఎందువలన, వంచయిష్యసి-మోసగించుచున్నావు? అని ఉపాలంభనము చేసిరి. రాత్రివేళలో పరస్త్రీ సంగమము కోసము చీకటిలో వెళ్ళుచున్న అగ్నివర్ణుని చర్యను ముందే గూఢచారిణులగు దూతికలద్వారా తెలుసు కున్నరాణులు అతనిదారికి అడ్డముగా వెళ్ళి కాముకుఁడా! చీకటిలోదాగి ఎందుకు మోసగించుచున్నావు? అని తృణీకరించి పలికిరనియు, వెనుకకు తీసుకవెళ్ళి రనియు భావము.

శ్లో. యోషితా ముడుపతే రివార్చిషాం
స్పర్శనిర్వృతి మసా వవాప్నువన్,
ఆరురోహ కుముదాకరోపమాం
రాత్రిజాగరపరో దివాశయః. 34

వ్యాఖ్య : ఉడుపతేః-చంద్రునియొక్క, అర్చిషాం, ఇవ-కాంతులయొక్క వలె,యోషితాం-స్త్రీలయొక్క, స్పర్శనిర్వృతిం-స్పర్శసుఖమును, అవాప్నువన్-పొందుచును, రాత్రిజాగరపరః-రాత్రులయందు నిద్రమేల్కొనుటయం దాసక్తి కలవాఁడై, దివాశయః-పగళ్ళు నిద్రించుచున్నవాఁడై, అసౌ-ఈ అగ్నివర్ణుఁడు, కుముదాకరోపమాం-కలువలకొలనుయొక్క పోలికను, ఆరురోహ-పొందెను. స్త్రీలస్పర్శసుఖము ననుభవించుచు రాత్రిళ్ళు మేల్కొని పగళ్ళునిద్రపోవునట్టి అగ్నివర్ణుఁడు, చంద్రకిరణస్పర్శచేత వికసించి పగలు ముడుచుకొనిపోవు కలువలుగల కాసారమువలె నుండెనని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. వేణునా దశనపీడితాధరా
వీణయా నఖపదాంకితోరవః,
శిల్పకార్య ఉభయేన వేజితా
స్తం విజిహ్మనయనా వ్యలోభయత్. 35

వ్యాఖ్య : దశనపీడితాధరాః-దంతములచేతఁ గొఱుకబడిన క్రీఁబెదవులు గలవారును, నఖపదాంకితోరవః-నఖక్షతముల గాయములతోడి తొడలుగలవారును,

అయినప్పటికిని, వేణునా-మురళియు, వీణయా-వీణయునను, ఉభయేన-రెండిటి చేతను, వేజితాః-పీడితలైన, శిల్పకార్యాః-గాయికలు, తం-అతనిని, విజిహ్మాన యనాః-కుటిలవీక్షణములు గలవారగుచు, వ్యలోభయన్-లోభముగలవానినిఁగాఁ జేసిరి. కళాప్రవీణలయిన గాయనీమణులను సురతములందు అధరోష్టములను దంతములచే వ్రణములుగాను, తొడలను నఖక్షతములచేత వ్రణములుగాను మార్చుటయేకాక, మరుసటి దినమున వేణువాదనముచేయువారిని వేణుగానము వినిపించుఁడని, వీణావాదనముచేయువారిని వీణ వాయింపుడనియు నిర్బంధ పరచిన యతని యెదుట నట్లేచేయుచు వేణువీణలచేత బాధింపఁబడుచున్నట్టివారు, తానుచేసిన పని నెఱిఁగియు తమ నిట్లుబాధించుచున్నాడని సాభిప్రాయముగా చూచుచుండగా నా కుటిలదృష్టులను జూచి యగ్నివర్ణుఁడు సంతోషపడుచు వారిపై నింకను ఎక్కువగా ప్రలోభపడుచుండెను. వారికిఁగలుగుచున్న వీణా వేణు స్పర్శలవలని పీడ చిలిపితనముగల అగ్నివర్ణునికి ఆనందహేతువయ్యెనని భావము.

శ్లో. అంగసత్త్వవచనాశ్రయం మిథః

స్త్రీషు నృత్య ముపధాయ దర్శయన్,
స ప్రయోగనిపుణైః ప్రయోక్తృభిః
సంజఘర్ష సహ మిత్రసన్నిధౌ. 36

వ్యాఖ్య : అంగహస్తవచనాశ్రయం—అంగ-పతాకాది హస్తవిశేషములు సత్త్వ-అంతఃకరణవృత్తులైన అశ్రుపాతాదులు, వచన-గేయములు, ఆశ్రయం-కారణములుగానున్న, నృత్యం-ఆంగిక సాత్త్విక వాచిక రూపమైన అభినయమును, మిథః-రహస్యస్థలమునందు, స్త్రీషు-నట్టువకత్తెలయందు, ఉపధాయ-ఉంచి, దర్శయన్-ప్రదర్శనము సలుపుచున్న, సః-ఆయగ్నివర్ణుఁడు, మిత్ర సన్నిధౌ-మిత్రులయెడుట, ప్రయోగనిపుణైః-అభినయశాస్త్రమునందు నేర్పరులైన, ప్రయోక్తృభిః సహ-అభినయార్థప్రకాశకులైన నాట్యాచార్యులతోగూడ, సంజఘర్ష-ఘర్షణపడెను. ఏకాంతస్థలమున అందగత్తెలగు నర్తకీజనమును, నాట్యాచార్యులను బిలిపించి, మిత్రసహితుఁడై చూచుచు, ఆనట్టువకత్తెలను అభినయింపఁజేయుచు వారి ప్రయోగములందు గల దోషములనుజూపు నెపమున స్త్రీలహస్త పాద స్తనాదులను దాకుచు నాట్యాచార్యులతో గలహించెను. అనగా

నతఁడభినయశాస్త్రవేత్తయైన స్త్రీలోలుఁడుగా నచ్చటఁ గనఁబడెనని భావము. "సామాన్యాభినయో నామ జ్ఞేయో వాగంగసత్త్వజః" అని భరత నాట్యశాస్త్రము.

శ్లో. అంసలంబి కుటజార్జున ప్రసజః
తస్య నీపరజసాంగరాగిణః,
ప్రావృషి ప్రమదబర్హిణే ష్వభూత్
కృత్రిమాద్రిషు విహారవిభ్రమః. 37

వ్యాఖ్య : ప్రావృషి - వర్షాకాలమునందు, అంసలంబికుటజార్జునప్రసజః— అంస-భుజములయందు, లంబి-ప్రవేలాడుచున్న, కుటజ-కొండమల్లెపూలయొక్కయు, అర్జున-మద్దిపూలయొక్కయు, ప్రసజః-మాలికలుగలవాఁడును, నీపరజసాం-కడిపూల పుప్పొడులయొక్క, అంగరాగిణః-మైపూతగలవాఁడునగు తస్య-ఆయగ్నివర్ణునికి, ప్రమదబర్హిణేషు-మదించిననెమళ్ళుగల, కృత్రిమాద్రిషు-కల్పితములైన గిరి నదీ సరస్సులయందు, విహారవిభ్రమః-విహరించుటయను విలాసము, అభూత్-జరిగెను. కల్పితములైన వర్షాచిహ్నములతో నతఁడు వర్షకాల విహారములను సలిపెనని భావము.

శ్లో. విగ్రహోచ్ఛయనే పరాఙ్ముఖీః
నానునేతు మబలాః స తత్వరే,
ఆచకాంక్ష ఘనశబ్దవిక్లబాః
తా వివృత్య విశతీ ర్భుజాంతరమ్. 38

వ్యాఖ్య : (ఆ వర్షాకాలమునందు) సః-అగ్నివర్ణుఁడు, విగ్రహాత్-ప్రణయకలహమువలన, శయనే-పరుపుమీద, పరాఙ్ముఖీః-ప్రక్కకుమళ్ళిపండుకున్న, అబలాః-స్త్రీలను, అనునేతుం-బతిమాలుటకు, నతత్వరే-త్వరపడలేదు. ఘనశబ్దవిక్లబాః-మేఘగర్జనములచేత భయపడినవారై, వివృత్య-తవవై పునకుఁదిరిగి, భుజాంతరం-వక్షస్థలమును, విశతీః-ప్రవేశించుచున్న, తాః-వారిని, ఆచకాంక్ష-అభిలషించెను. తన ప్రక్కన శయనించిన యువతులు ప్రణయకలహము

వలన కుపితలై, పెడమొగముపెట్టి పండుకొనఁగా అగ్నివర్ణుఁడు త్వరపడి వారిని బ్రతిమాలుకొనుటకు పూనుకొనలేదు. కారణమేమనఁగా కృత్రిమమేఘ గర్జనములవలన భయపడిన ఆయువతులు తమంతటతామే తనవైపు తిరిగి వక్ష స్థలమునందు దూరిగాఢాలింగనముఁ జేసికొందురులెమ్మని యుపేక్షించెనని భావము.

శ్లో. కార్తికీషు సవితానహర్మ్యభాక్
యామినీషు లలితాంగనాసఖః,
అన్వభుంక్త సురతశ్రమాపహాం
మేఘముక్తవిశదాం స చంద్రికామ్. 39

వ్యాఖ్య : కార్తికీషు-కార్తికమాసమునకు సంబంధించిన, యామినీషు-రాత్రులయందు (శరద్రాత్రులయందని అర్థము), సవితానహర్మ్యభాక్—సవితాన-మేలుకట్టువస్త్రములతోఁగూడిన, హర్మ్య-మేడలను, భాక్-చేరినవాఁడై, లలితాంగనాసఖః-సుందరాంగులతోఁగూడిన, సః-ఆగ్నివర్ణుఁడు, సురతశ్రమాపహాం-సంభోగమువలనియలసటను దొలఁగించునట్టిదియగు, మేఘముక్తవిశదాం-మేఘములచే విడువఁబడి స్వచ్ఛమైన, చంద్రికాం-వెన్నెలను, అన్వభుంక్త-అనుభవించెను. శరత్కాలమున మంచు పడకుండుటకై వస్త్రములను పైభాగమునఁగట్టించి వానికింద నిద్రించుట పూర్వులయలవాటు. అట్లుచేయించిన మేడలపై సుకుమారాంగులతో సురతము ననుభవించిన యగ్నివర్ణుఁడు శరత్కాలమున మేఘములుతొలఁగి తెల్లగా చల్లగానుండిన వెన్నెలలలో సంభోగశ్రమను దొలఁగించుకొనుచుండె నని భావము.

శ్లో. సైకతం చ సరయూం వివృణ్వతీం
శ్రోణిబింబ మివ హంసమేఖలమ్,
స్వప్రియా విలసితానుకారిణీం
సౌధజాలవివరై ర్వ్యలోకయత్. 40

వ్యాఖ్య : హంసమేఖలం-హంసలబారనెడు మొలనూలితోనున్న, సైకతం-ఇసుక తిన్నెను, శ్రోణిబింబం, ఇవ-కటిపశ్చాద్భాగమునువలె, వివృణ్వతీం-

కనఁబరచుచున్నట్టిది కనుక, స్వప్రియా విలసితానుకారిణీం-తన ప్రియురాలి విలాసమును అనుకరించుచున్న, సరయూం, చ-సరయూనదినిగూఁడ, సౌధజాల వివరైః-మేడయొక్క గవాక్షరంధ్రములద్వారా, వ్యలోకయత్-ఆసక్తితోఁ జూచెను. సౌధమునందు ప్రియా సమాగమ సుఖము ననుభవించుచున్న అగ్నివర్ణుఁడు, హంసల బారుతోఁజుట్టఁబడిన యిసుకదిబ్బను మొలనూలుతో నుండిన నితంబమునువలెఁ గనఁబరచుచున్న సరయూనది తనప్రక్కన నగ్నయై యున్న ప్రియురాలిని బోలియుండుటచేత గవాక్షరంధ్రములద్వారా ఆసక్తితోఁజూచెను. కాముకునికి పరకామిని వివస్త్రగానుండినప్పుడు చూచుటయు, అదియుఁదన ప్రియురాలిని బోలియుండుటయు, మిక్కిలి ప్రలోభమునకుఁగారణమని భావము.

శ్లో. మర్మరై రగురుధూపగంధిభి
ర్వ్యక్తహేమరశనై స్త మేకతః,
జగ్రహు రాగ్రథన మోహలోలుపం
హైమనై ర్నివసనై ఃసుమధ్యమాఃం. 41

వ్యాఖ్య : మర్మరైఃసంస్కార విశేషమువల్ల ధ్వనించుచున్నవియు, అగురుధూప గంధిభిఃఅగురుధూపములవాసన గలవియు, వ్యక్తహేమరశనైఃవెలుపటికివచ్చిన బంగారుమొలనూలు గలవియు, హైమనైఃహేమంతఋతువున ధరించినవియునగు, నివసనైఃవస్త్రములచేత, సుమధ్యమాఃస్త్రీలు, ఏకతఃనితంబముయొక్క ఒకప్రక్కన, ఆగ్రథనమోహ లోలుపంఆగ్రథనసోక ముడియొక్క, మోహఊడఁదీయుటయందు, లోలుపంఆసక్తుఁడైన, తంఅగ్నివర్ణుని, జగ్రహుఃఆకర్షించిరి. చలికాలమునందు తాముధరించిన వస్త్రములు గంజిపెట్టినవగుటచేత చప్పుడు చేయుచు, అగురుధూపవాసనలుగలవై, వదలిబయటికి జారిన బంగారుమొలనూళ్ళుగలవియై, నితంబముల నొక్కప్రక్కనఁ గనఁబరచుచుండుడచేత చీరముడిని ఊడదీయుటకుఁ ద్వరపడుచున్న అగ్నివర్ణుని నిద్రించుచున్న స్త్రీలు ఆకర్షించిరని భావము. అట్టి స్థితిలో నిద్రించు సుమధ్యల నతఁడు రమించుటకుప్రక్రమించెను. మర్మరమనగా వస్త్రములయొక్కయు భూషణముల యొక్కయు చిఱుచప్పుడు.

శ్లో. అర్పిత స్తిమిత దీప దృష్టయో
గర్భవేశ్మసు నివాతకుక్షిషు,

తస్య సర్వ సురతాంతర క్షమాః
సాక్షితాం శిశిరరాత్రయో యయుః. 42

వ్యాఖ్య : నివాతకుక్షిషు-గాలిలేని లోనిభాగములుగల, గర్భవేశ్మసు-సౌధముయొక్క గదులయందు, అర్పిత స్తిమితదీపదృష్టయః—అర్పిత-ఉంచఁబడి, స్తిమిత-కదలికలేని, దీప-దీపములనెడు, దృష్టయః-చూపులుగలవియు, సర్వసురతాంతరక్షమాః—సర్వ-అన్నివిధములైన, సురతాంతర-రతిబంధములకు, క్షమాః-తగినవియునగు, శిశిరరాత్రయః-శిశిరర్తురాత్రులు, తస్య-ఆ యగ్నివర్ణునియొక్క, సాక్షితాం-సాక్షిత్వమును, యయుః-పొందినవి. సౌధాంతరములందలి గర్భగృహములు గాలిలేనివగుటచేత అచ్చటనుంచిన నిశ్చలదీపములే చూపులుగాఁగలిగి, చెమటపట్టుటలేక దీర్ఘములై యున్నందున అన్నివిధములైన శృంగారచేష్టాసురతబంధముల కనుకూలమైన శిశిరరాత్రులు అగ్నివర్ణుని సంభోగ విలాసములను తెప్పలార్పక చూచి యాశ్చర్యపడు సాక్ష్యులవలె నుండెనని భావము.

శ్లో. దక్షిణేన పవనేన సంభృతం
ప్రేక్ష్య చూతకుసుమం సపల్లవమ్,
అన్వనైషు రవధూత విగ్రహో
త్సం దురుత్సహవియోగ మంగనాః. 43

వ్యాఖ్య : అంగనాః-యువతులు, దక్షిణేన, పవనేన-మయమారుతము చేత, సంభృతం-కూర్చఁబడిన, సపల్లవం-చిగురాకులతోడి, చూతకుసుమం-మామిడిపూఁతను, ప్రేక్ష్య-చూచి, అవధూతవిగ్రహాః-ప్రోసివేసిన ప్రణయకలహములుగలవారగుచు, దురుత్సహవియోగం-దుస్సహమైన వియోగముగల, తం-అతనిని, అన్వనైషుః-అనునయించిరి. మలయానిలమువీచుట, మామిళ్ళచిగుళ్ళతో పూతలతో ప్రత్యక్షమగుట మొదలయిన చిహ్నములుగల వసంతఋతువును దర్శించిన యువతులు, అంతకుముందు తమకు అగ్నివర్ణునికి జరిగిన ప్రణయకలహములవలని వియోగ మనుభవించుచుండినను ఋతుప్రభావముచేత కామోద్దీపితలై విరహమును సహింపఁజాలక తామే యగ్నివర్ణుని ప్రతిమాలు కొనుచుఁ ప్రణయకలహములు మానిరని భావము.

శ్లో. తాఃస్వ మంక మధిరోప్య దోలయా
ప్రేంఖయ పరిజనాపవిద్ధయా,
ముక్తరజ్జు నిబిడం భయచ్చలాత్
కంఠబంధన మవాప బాహుభిః. 44

వ్యాఖ్య : తాఃఆస్త్రీలను, స్వం, అంకం-తన తొడను (తొడలమీద) అధిరోప్య-ఎక్కించుకొని, పరిజనాపవిద్ధయా-సేవకజనముచేత ఊపబడిన, దోలయా-ఉయ్యాలచేత, ముక్తరజ్జు-విడువబడిన ఊయెలత్రాళ్ళు గలగునట్లు, ప్రేంఖయన్-ఎగిరిపడజేయుచు, భయచ్చలాత్-భయమనుమిషవలన,బాహుభిఃఅంగనాభుజములచేత, నిబిడం-గాఢమైన, కంఠబంధనం-కంఠాలింగనమును, అవాప-పొందెను. అట్లు ప్రతిమాలుకొనవచ్చిన యువతులను అగ్నివర్ణుడు తన యొడిలో నెక్కించుకొని, ఊయెలలో గూర్చుని, దాసీజనముచేత ఉయ్యాల నూపించుచు, త్రాళ్ళు విడువమని పరిజనముతో జెప్పగా వారు విడిచిరి. అప్పుడింకను వేగము, చలనము గలుగుటచేత నాపడుచులు భయపడి గట్టిగా నతని కంఠమును బాహువులచేత ఆలింగనముజేసికొనిరి. అట్లు వసంతర్తువున అగ్నివర్ణుడు స్త్రీల స్వయంగ్రాహాలింగన సౌఖ్యము ననుభవించెనని భావము.

శ్లో. తం పయోధర నిషిక్తచందనైఃముక్తికగ్రథిత చారుభూషణైఃగ్రీష్మవేషవిధిభిఃసిషేవిరే
శ్రోణిలంబి మణిమేఖలైఃప్రియాఃం. 45

వ్యాఖ్య : ప్రియాఃఅతని ప్రేయసులు, పయోధర నిషిక్తచందనైఃపయోధర-తమస్తనములయందు, నిషిక్త-తడియుండునట్లు చల్లుకోబడిన, చందనైఃశ్రీగంధజలములు గలవియు, ముక్తికగ్రథిత చారుభూషణైఃముత్యాలతో గూర్చిన అందమగు భూషణములు గలవియు, శ్రోణిలంబి మణిమేఖలైఃశ్రోణి-పిఱుదులమీద, లంబి-వ్రేలాడుచున్న, మణి-పచ్చలు మొదలగు రత్నములతో గూర్చిన, మేఖలైఃకటిసూత్రములుగలవియునగు, గ్రీష్మవేషవిధిభిఃఉష్ణకాలమునకు తగిన వేషవిధానములచేత, తం-అగ్నివర్ణుని, సిషేవిరే-సేవిం

చిరి. ఎండ వేడిమి గల గ్రీష్మఋతువు రాగానే శీతలోపచారములు చేయఁదలఁచిన ప్రియురాండ్రు తమ స్తనములను గంధజలముతోఁ దడుపుకొనియు, తమ భూషణములన్నిఁటిని ముత్యాలమయములుగాఁ జేసికొనియు, పచ్చలు మొదలగు రత్నములతోఁ గూర్చిన కటిసూత్రములు నితంబములపై ప్రవేలాడునట్లు జేసికొనియు అగ్నివర్ణుని సేవలోనుండిరి. చందన, మౌక్తిక, గారుత్మతములు శీతలములై యతనికి సౌఖ్యము గలిగించెనని భావము.

శ్లో. యత్స లగ్నసహకార మాసవం
రక్త పాటలసమాగమం పపౌ,
తేన తస్య మధునిర్గమాత్ కృశః
చిత్త యోని రభవత్ పునర్నవః. 46

వ్యాఖ్య : సః-అగ్నివర్ణుఁడు, లగ్నసహకారం-మామిడి చిగురంటుకొన్నదియు, రక్తపాటల సమాగమం-ఎఱ్ఱని కలిగొట్టు పువ్వు కలిసినదియునగు, ఆసవం-మద్యమును, పపౌ ఇతియత్-ప్రాగెననునది యేదికలదో, తేన-ఆయాసవ పానముచేత, మధునిర్గమాత్-వసంతము వెళ్ళిపోవుటవలన, కృశః-బలహీనుఁడైన తస్య, చిత్తయోనిః-అగ్నివర్ణునికి సంబంధించిన మన్మథుఁడు, పునర్నవః-మరల క్రొత్తవాఁడు (ప్రబలుఁడు) అభవత్-అయ్యెను. వగరుకై మామిడి చిగురు, పరిమళమునకై కలిగొట్టు పువ్వు కలిపిన మద్యమును ప్రాగుటచేత, వసంతము వెళ్ళిపోవుటవలన నీరసపడియున్న అగ్నివర్ణునిలో మరల కామోద్దీపనము గలిగెనని భావము. మన్మథుఁడు తన మిత్రుఁడగు వసంతుఁడు వెళ్ళిపోగా మిత్ర వియోగమున నీరసపడియున్నను అగ్నివర్ణుని యాసవ పానమువలనఁ బుంజు కొనెనని తాత్పర్యము. "శోకాన్ముక్తః పునర్నవః" అని నిఘంటువు.

శ్లో. ఏవ మింద్రియసుఖాని నిర్విశ
న్నన్యకార్యవిముఖః స పార్థివః,

ఆత్మలక్షణనివేదితా నృతూ
నత్యవాహయ దనంగవాహితః. 47

వ్యాఖ్య : ఏవం-ఇట్లు, అనంగవాహితః-కామప్రేరితుఁడై, అన్యకార్య విముఖః-ఇతర కార్యములం దిష్టములేనివాడైన, సః, పార్థివః-ఆ రాజు, ఇంద్రియ సుఖాని-ఇంద్రియములకు సుఖకరములైన శబ్దాది విషయములను, నిర్విశన్-అనుభవించుచు, ఆత్మలక్షణ నివేదితాన్-తమ చిహ్నములగు గిరిమల్లికాదులచేత తెల్పుకొనుచున్న, ఋతూన్-వర్షాది ఋతువులను, అత్యవాహయత్-గడపెను. వెనుక వర్ణించినట్లు కామప్రేరితుఁడై, పరిపాలనాది కృతములందు విముఖుఁడై యున్న ఆ యగ్నివర్ణుఁడు ఆయా చిహ్నములను జూచి ఆయా ఋతువు వచ్చినట్లు గుర్తించి తదనుకూలమైన సౌకర్యములు గలిగించుకొనుచు ప్రియురాండ్రను సైతమట్లే మార్చుచు ఇంద్రియ సుఖములతో కాలముఁగడపెనని భావము.

శ్లో. తం ప్రమత్త మపి న ప్రభావతః
శేకు రాక్రమితు మన్యపార్థివాః,
ఆమయస్తు రతిరాగసంభవో
దక్షశాప ఇవ చంద్ర మక్షిణోత్. 48

వ్యాఖ్య : ప్రమత్తం, అపి-వ్యసనములచేత మత్తుఁడైనను, తం-ఆయగ్ని వర్ణుని, ప్రభావతః-కోశదండాదుల ప్రభావము వలన, అన్యపార్థివాః-ఇతర రాజులు, ఆక్రమితుం-లోఁబరచుకొనుటకు, నశేకుః-సమర్థులు గాలేకపోయిరి. రతిరాగసంభవః-సంభోగాసక్తి వలనఁ గలిగిన, ఆమయః, తు-వ్యాధిమాత్రము (క్షయరోగము), దక్షశాపః-దక్షప్రజాపతియొక్క శాపము, చంద్రం, ఇవ-చంద్రునినివలె, అక్షిణోత్-క్షీణింపఁజేసెను. అగ్నివర్ణ డట్లు స్త్రీమద్యపానాది వ్యసనములకులోనై ప్రమత్తుఁడై యున్నప్పటికిని, ఆనువంశికము, కోశదండ

ప్రభావజము నగు రఘువంశ ప్రభావము వలన పరరాజులుమాత్ర మతని రాజ్యము నాక్రమింపఁజాలకపోయిరి. కాని నిరంతర రతిరాగముచేతఁ గలిగిన క్షయవ్యాధి, దక్షుని శాపము చంద్రునిని వలె, దినదినము నతనిని క్షీణింపజేసెను. ఇతర పుత్రికలను ఉపేక్షించి ఒక్కరోహిణియందే ప్రేమాధిక్యమునుఁజూపు చుండిన చంద్రుని దక్షుఁడు శపించెననియు, అందువల్లనే చంద్రునికి నేటికిని కృష్ణపక్షమున క్షీణత్వము గలుగుచున్నదనియు ఉపాఖ్యానము గలదు.

శ్లో. దృష్టదోష మపి తన్న సోఽత్యజత్
సంగవస్తు భిషజా మనాశ్రవః,
స్వాదుభిస్తు విషయై ర్హృత స్తతో
దుఃఖ మింద్రియగణో నివార్యతే. 49

వ్యాఖ్య: భిషజాం-వైద్యులయొక్క, అనాశ్రవః-మాటలను విననట్టి, సః-అగ్నివర్ణుఁడు, దృష్టదోషం, అపి-దోషము గలదియని తెలిసినదైనను, తత్, సంగవస్తు-స్త్రీ మద్యరూపమై సంగజనకమగునా వస్తుజాతమును, న అత్యజత్-విడువకపోయెను. ఇంద్రియగణః-ఇంద్రియ సమూహము, స్వాదుభిః-రుచికరములగు, విషయైఃభోగ్యవస్తువులచేత, హృతః, తు-ఆకర్షింపబడినచో, తతః-ఆవస్తువులనుండి, దుఃఖం-అతికష్టముగా, నివార్యతే-మరలింపఁబడును. వైద్యులమాటను పెడచెవినిబెట్టిన యగ్నివర్ణుఁడు తనకు మిత్రస్త్రీ సమావేశము లతో ఆనందమును గలిగించు స్త్రీ మద్యరూపమైన సంగవస్తువులను విడువక పోయెను. అది యట్లే జరుగును, కారణ మేమనగా ఇంద్రియగణము రుచికరము లైన భోగ్యవస్తువులకు అలవాటు పడెనా? ఆ వస్తువులనుండి ఇంద్రియములు మరలవు. అనఁగా వానిని విడువవు. ఒకవేళ విడిపించినా అతికష్టముచేత మాత్రమే విడిపించుటకు వీలగునని భావము. "ఆశ్రవః" అనఁగా చెప్పినమాట వినువాడు, "అనాశ్రవః" వినినివాఁడు. "వచనే స్థిత ఆశ్రవః" అని యమరము.

శ్లో. తస్య పాండువదనాల్పభూషణా
సావలంబగమనా మృదుస్వనా,

రాజయక్ష్మపరిహాని రాయయా
కామయానసమవస్థయా తులామ్. 50

వ్యాఖ్య : తస్య-ఆ యగ్నివర్ణుని యొక్క, పాండువదనా-తెల్లబారిన ముఖముగలదియు, అల్పభూషణా-స్వల్పముగా ధరించిన అలంకారములుగలదియు, సావలంబగమనా-ఇతరుల సహాయముతో గూడిన నడకగలదియు, మృదుస్వనా-హీనమైన కంఠస్వరము గలదియునగు, రాజయక్ష్మ పరిహానిః-క్షయవ్యాధిచేత గలిగిన క్షీణదశ, కామయాన సమవస్థయా-కాముకునియొక్క స్థితితో, తులాం-పోలికను, ఆయయౌ-ఎక్కువగాబొందెను. అగ్నివర్ణుడు మొగము తెల్లబడి, బరువు మోయలేక ఆభరణములు తగ్గించుకొని, సేవకుల భుజములపై చేతులు వేసికొని నడచుచు, హీనమైనకంఠస్వరముతో ననుభవించుచున్న క్షయరోగము, ఒక కాముకుని విరహావస్థతో సమానముగా నుండెనని భావము. "కామయాన" శబ్దము "కము" ధాతువునకు ణింజతముపై శానచ్ ప్రత్యయాంత రూపము "కామయమానః" అని కావలసియుండగా "అనిత్యమాగమ శాసనమ్" అను పరిభాషచే "ముమాగమము" అనిత్యమై "కామయాన" అనియే నిల్చినది. దీనిని వామనుడు కావ్యాలంకార సూత్రములందు "కామయాన శబ్దః సిద్ధోఽనాదిశ్చ" అని సమర్థించెను. మొగమున కళలేకుండుట, అల్పభూషణాదులు, కాముకలక్షణములు గదా !

శ్లో. వ్యోమ పశ్చిమకలాస్థితేందు వా
పంక శేష మివ ఘర్మపల్వలమ్,
రాజ్ఞి తత్కుల మభూత్ క్షయాతురే
వామనార్చి రివ దీపభాజనమ్. 51

వ్యాఖ్య : రాజ్ఞి-రాజైన అగ్నివర్ణుడు, క్షయాతురే (సతి)-క్షయవ్యాధి పీడితుడై యుండగా, తత్కులం-ఆరఘువంశము, పశ్చిమ కళా స్థితేందు-చివరికళయందున్న చంద్రుడు గలదియగు, వ్యోమ, వా-ఆకాశమువలెను, పంక శేషం-బురదతో మిగిలిన, ఘర్మపల్వలం, ఇవ-వేసవియందలి చిన్నచెఱువు

వలెను, వామనార్చిఃచిన్న వెలుఁగుగల, దీపభాజనం, ఇవ-దీపపు ప్రమిదవలెను, అభూత్-అయ్యెను. రాజైన యగ్నివర్ణుఁడు క్షయవ్యాధి పీడితుఁడై కృశించిపో గానే రఘువంశము, తన్నివాసమైన రాజమందిరమున్ను చిట్టచివరికళతో మిగిలిన చంద్రబింబముగల ఆకాశమువలెను, బురదమాత్రము మిగిలిన చిన్నసరస్సువలెను, మినుకు మినుకు మనుచు చల్లారుటకు సిద్ధముగానున్న దీపశిఖతోడి ప్రమిద వలెను కళాహీనమై కన్పట్టెనని భావము. "వా" అను నవ్యయము ఇవార్థకము. "ఇవ వత్ వా యథా శబ్దౌ" అని దండి వచించెను.

శ్లో. బాఢ మేష దివసేషు పార్థివః
కర్మ సాధయతి పుత్రజన్మనే,
ఇత్యదర్శితరుజో ఽస్యమంత్రిణః
శశ్వ దూచు రఘుశంకినీః ప్రజాః. 52

వ్యాఖ్య: బాఢం-సత్యముగా, ఏషః పార్థివః-ఈయగ్నివర్ణుఁడు, దివసేషు-పగటివేళలయందు, పుత్రజన్మనే-పుత్రుఁడు పుట్టుట కొఱకు, కర్మ-జపాది వైదిక కర్మను, సాధయతి-ఆచరించుచున్నాఁడు ఇతి-ఇట్లని, అదర్శితరుజః-దాచిన క్షయరోగము గలవారగుచు, అస్య, మంత్రిణః-అగ్నివర్ణుని మంత్రులు, అఘుశంకినీః-రాజు మరణమును అనుమానించుచున్న, ప్రజాః-ప్రజలనుద్దేశించి, శశ్వత్-ఎప్పుడును, ఊచుః-చెప్పుచుండిరి. రోగగ్రస్తుఁడై పగటివేళలలో దర్శనమీయకుండిన యగ్నివర్ణుని గుఱించి ప్రజలు, ఏదియో యనర్థము దాపరించునేమో! యని సంశయపడుచు ప్రశ్నింపఁగా నతని మంత్రులు "రాజు పుత్రోత్పత్తికై యంతఃపురమున జపహోమాద్యనుష్ఠానములు చేయుచున్నందున వెలుపటికి వచ్చుటలేదు." అని యతనిరోగము సంగతినిఁ జెప్పక దాచి, అడిగినప్పుడెల్లను జెప్పుచుండిరని భావము. రాజవ్యసనము ముందుగా వెల్లడియగుట రాజ్యస్థైర్యమునకు భంగమనియు, శత్రువులకు రంధ్రప్రాయమనియు, భావించి మంత్రులట్లు చెప్పుచుండిరని తాత్పర్యము.

NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

ఏకోనవింశ సర్గము

శ్లో. స త్వనేకవనితాసఖో ఽపి సన్
పావనీ మనవలోక్య సంతతిమ్,
వైద్యయత్నపరిభావినం గదం
న ప్రదీప ఇవ వాయు మత్యగాత్.

వ్యాఖ్య : సః, తు-ఆయగ్నివర్ణుఁడేమో, అనేకవనితాసఖః - పెక్కు-భార్యలు గలవాఁడు, సన్, అపి-అగుచుండియు, పావనీం-పవిత్రమైన అనఁగా పితృఋణవిమోచనముఁజేయునట్టి, సంతతిం-సంతానమును, అనవలోక్య-చూడక, వైద్యయత్నపరిభావినం-వైద్యుల ప్రయత్నమును తిరస్కరించునట్టి, గదం-రోగమును, ప్రదీపః-దీపము, వాయుం, ఇవ-గాడ్పునువలె, న అత్యగాత్-అతిక్రమింపలేకపోయెను (మరణించెనని యర్థము). అగ్నివర్ణుఁడు పెక్కండ్రు భార్యలు గలవాఁడయినను పితృఋణవిమోచనముఁజేయఁగల పుత్ర సంతానమును జూడకయే వైద్యులెంతప్రయత్నించినను తగ్గక, దీపము తనను బాధించువాయువునువలె క్షయరోగమును ఎదుర్కొనఁజాలకపోయెను, మరణించెనని భావము. పుత్రసంతానమువల్ల పితృఋణము తీరునని ధర్మశాస్త్రము.

శ్లో. తం గృహోపవన ఏవ సంగతాః
పశ్చిమక్రతువిదా పురోధసా,
రోగశాంతి మపదిశ్య మంత్రిణః
సంభృతే శిఖిని గూఢ మాదధుః. 54

వ్యాఖ్య : పశ్చిమక్రతువిదా-అంత్యేష్టివిధానమునెఱిఁగిన, పురోధసా-పురోహితునితో, సంగతాః-కూడిన, మంత్రిణః-మంత్రులు, గృహోపవనే, ఏవ-ఇంటియుద్యానమునందే, రోగశాంతిం-క్షయరోగశాంతిని, అపదిశ్య-నెపముగాఁజెప్పి, తం-అగ్నివర్ణుని, సంభృతే-మండుచున్న. శిఖిని-అగ్నియందు, గూఢం-రహస్యముగా, ఆదధుః-ఉంచిరి. రాజమరణమును వెల్లడిచేయరాదను

తలంపుగలమంత్రులు అంత్యేష్టిని జరుపుపద్ధతి నెఱిఁగిన పురోహితునిఁగలిసి రాజ భవనముయొక్క ఉద్యానమునందే చితినిఁబేర్చి, రోగశాంతికై యేదోవైదికకర్మను జరుపుచున్నట్లు ఇతరులకుఁ జెప్పి, మండుచున్న అగ్నిహోత్రమునందు అగ్ని వర్ణునిదేహము నుంచిదహింపఁ జేసిరని భావము. అట్లు చేయుటకుఁ గారణము సంతానహీనుఁడగు నగ్నివర్ణుని రాజ్యమును దాయాదులు, శత్రురాజులు, ఆక్ర మింపకుండుటకే యని తెలియవలయును.

శ్లో. త్వైఃకృతప్రకృతి ముఖ్యసంగ్రహైః
రాశు తస్య సహధర్మచారిణీ,
సాధు దృష్టశుభగర్భలక్షణా
ప్రత్యపద్యత నరాధిపశ్రియమ్. 55

వ్యాఖ్య : ఆశు-శీఘ్రముగా, కృత ప్రకృతి ముఖ్య సంగ్రహైఃకృత-చేయఁబడిన, ప్రకృతి ముఖ్య-పౌరులలో ముఖ్యులగు వారియొక్క, సంగ్రహైఃసమూహము గలవారైన ఆ మంత్రులచేత, సాధు-నిపుణముగా, దృష్ట శుభ గర్భలక్షణా-పరీక్షింపఁబడిన గర్భచిహ్నములుగల, తస్య-ఆయగ్నివర్ణునియొక్క సహధర్మచారిణీ-పట్టపురాణి, నరాధిపశ్రియం-రాజలక్ష్మిని, ప్రత్యపద్యత-పొందెను. వెంటనే మంత్రులు పౌరులలో పెద్దలగువారిని రప్పించి సభచేసి, చక్కగాఁబరీక్షింపఁబడిన గర్భలక్షణములుగల అగ్నివర్ణుని పట్టపురాణినిఁజూపి, గర్భస్థశిశు యుక్తురాలైన ఆమె రాజ్యాధికారిణియైనట్లు ప్రకటించిరని భావము.

శ్లో. తస్యాస్తథావిధ నరేంద్ర విపత్తిశోకాత్
ఉష్ణైర్విలోచనజలైఃప్రథమాభితప్తః,
నిర్వాపితఃకనకకుంభముఖోజ్ఝితేన
వంశాభిషేకవిధినాశిశిరేణ గర్భఃః. 56

వ్యాఖ్య : తథావిధ నరేంద్ర విపత్తిశోకాత్——తథావిధ-అట్లు జరిగిన, నరేంద్ర విపత్తి-అగ్నివర్ణుని మరణము చేతఁగలిగిన, శోకాత్-దుఃఖమువలన, ఉష్ణైఃవేడియైన, విలోచనజలైఃకన్నీళ్ళచేత, ప్రథమాభితప్తఃమొదట తడుపఁ బడిన, తస్యాఃగర్భఃఆ పట్టపురాణి యొక్క గర్భము, కనకకుంభ ముఖోజ్ఝితేన-బంగారు కలశములద్వారా పోయఁబడినదియు, శిశిరేణ-చల్లనిదియ నగు, వంశాభిషేక విధినా-రఘువంశ పట్టాభిషేక విధానముతోఁగూడిన జలధారలచేత, నిర్వాపితఃచల్లపరుపఁబడెను. సింహాసనముపై నాసీనురాలైన ఆ రాణి తనకు సంభవించిన భర్తృమరణ దుఃఖముచేత వేడి కన్నీటితో గర్భమును మొదటఁ దడుపఁగా నుష్ణమైన ఆ గర్భము మంత్రి పురోహితాదులచే జరుపబడిన పట్టాభిషేక ప్రక్రియయందు సువర్ణకలశములతో నభిషేకించిన చల్లని జలధారలచేతఁ జల్లబడి రఘువంశ ప్రతిష్ఠాపకమైన రాజ్యాధికార మంగళమును పొందెనని భావము.

శ్లో. తం భావార్థం ప్రసవసమయాకాంక్షిణీనాం ప్రజానా
మంతర్గూఢం క్షితిరివ నభోబీజముష్టిం దధానా,
మౌలైఃసార్థం స్థవిరసచివైఃహేమసింహాసనస్థా
రాజ్ఞీ రాజ్యం విధివ దశిషత్ భర్తు రవ్యాహతాజ్ఞా. 57

వ్యాఖ్య : ప్రసవసమయాకాంక్షిణీనాం—— ప్రసవసమయ - గర్భమోచన సమయమును (ఫలించుకాలమును), ఆకాంక్షిణీనాం-కోరుచున్నట్టి, ప్రజానాం-ప్రజలయొక్క, భావార్థం-భావముకొఱకు (సంపదకొఱకు), క్షితిఃభూమి, అంతర్గూఢం-లోపలదాగియున్న, నభోబీజముష్టిం, ఇవ——నభఃశ్రావణమాసమునందు నాటఁబడిన, బీజముష్టిం, ఇవ-విత్తనములనువలె, తం-అంతర్గతమైన ఆగర్భమును, దధానా-ధరించుచున్నదియు, హేమసింహాసనస్థా-బంగారు రాచగద్దెపైనున్నదియు, అవ్యాహతాజ్ఞా-ఎదురులేని శాసనము గలదియునగు, రాజ్ఞీ-రాణి, మౌలైఃఆప్తముఖ్యులైన, స్థవిరసచివైఃసార్థం-వృద్ధామాత్యులతోఁగూడ, భర్తుఃభర్తయగు నగ్నివర్ణునియొక్క, రాజ్యం-రాజ్యమును, విధివత్-శాస్త్రప్రకారముగ, అశిషత్-పాలించెను. శ్రావణమాసమున విత్తిన బీజముల ఫలితమును వలె అంతర్గూఢమైన రాజ్ఞీగర్భముయొక్క ప్రసవమును గోరుచున్న ప్రజల మేలుకొఱకు బీజముష్టిని భూమివలె గర్భమును ధరించిన

అగ్నివర్ణుని ధర్మపత్ని సింహాసనస్థురాలై ముఖ్యులైన వృద్ధమంత్రులద్వారా అప్రతిహతమైన యాజ్ఞకలదగుచు అయోధ్యానగరమున రఘువంశీయుల రాజ్యమును పరిపాలించెనని భావము. "ప్రసవశబ్దము" నకు గర్భమోచనము, ఫలము అర్థములు. "భావ" శబ్దమునకు అభిప్రాయము, సంపద మొదలయిన అర్థములను యాదవ నిఘంటువు చెప్పెను.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశ కావ్యమునందలి అగ్నివర్ణుని శృంగారమను
పందొమ్మిదవ సర్గమునకు మహామహోపాధ్యాయ కోలచల మల్లినాథసూరి
సంజీవినీ వ్యాఖ్యాను సారముగా రామలక్ష్మ్యంబా తిప్పాజోస్యుల
తనూజుఁడు కేశవపంతుల నరసింహశాస్త్రి రచిత
తెలుఁగు లఘువ్యాఖ్య సర్వము
గుంపూర్ణము.

BCZ

AOUA102B132

BC

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B132
పుస్తకం పేరు	రఘువంశము02
తారీఖు	31 December 2025
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	443
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	

anusha